# అమరజీవి భగత్‌సింగ్ సహచరులు, విప్లవకారులైన కీ॥శే॥ విజయ్ కుమార్ సిన్హా

శ్రీ విజయ్ కుమార్ సిన్హా ఉత్తర భారత దేశానికి చెందిన వారైనప్పటికి హైద్రాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని చివరి శ్వాస ఇక్కడనే వదలడం ఒక చరిత్రాత్మక ఘట్టం. భారతదేశ స్వాతంత్రోద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాద అధికార ప్రతినిధులని హతమార్చడానికి సాహసోపేత చర్యలకు తెగించిన అగ్రశ్రేణి విప్లవకారులైన అమరజీవులు భగత్‌సింగ్, రాజగురు లాంటి వాళ్ళతో కలసి పనిచేసిన విజయ్ కుమార్ సిన్హాగారి జీవితం సంపూర్ణంగా త్యాగమయం. అఖిల హైద్రాబాద్ విద్యార్థి సంఘ నాయకుడుగా, నైజాం నిరంకుశ పైశాచిక పాలనను కూలద్రోసే వుద్యమ నిర్మాణంలో నిమగ్నమైన మా యువతరానికి విజయ్ కుమార్ సిన్హాగారు గొప్ప ఆదర్శంగా కనబడ్డారు. 1946లో తొలి పరిచయం కలిగింది. 1947 ఆగస్టు 15 తర్వాత విజృంభించిన సంస్థాన విమోచన వుద్యమంలో వారి అమూల్యమైన అనుభవ సంపదను



"చెన్నమనేని" షష్ఠి పూర్తి సందర్భంగా వారి ఇంటిలో కలిసి అభినందిస్తున్న విజయ్‌కుమార్ సిన్హా - రాజ్యం సిన్హా దంపతులు

సంపూర్ణంగా వినియోగించే సదవకాశం లభించింది. అప్పటికే అనేక సం॥ల పాటు దేశంలోని వివిధ జైళ్ళలో శిక్షలు అనుభవించి అలసిపోయిన విప్లవకారులు ఏమాత్రం సమయం చిక్కినా తెలంగాణా సాయుధపోరాట యోధులకు సముచితమైన రాజకీయ, సమరశీల సలహాలను అందించడానికి ఉత్సాహంగా నుండేవారు. భారతమాతను బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తి చేయడానికి అలాగే హైద్రాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి అవసరమైన సమరశీల వుద్యమాల నిర్మాణం గురించి గంటల తరబడి, వుద్వేగ భరిత ప్రసంగాలు చేసేవారు. యువకులలో నిద్రాణమైయున్న దేశభక్తి భావాన్ని పెకిలించిన పాత్ర అద్వితీయం. ఆవిధంగా సంస్థాన ప్రజలు వారికి రుణపడియుండడమే కాక వారి దివ్యస్మృతికి ఎల్లవేళలా భక్తి పూర్వక జోహార్లు అర్పిస్తారు. సిన్హాగారు విద్యార్థి దశలోనే జాతీయ విప్లవోద్యమంలో దూకారు. 1925లో కళాశాల విద్యార్థిగా అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో స్వచ్ఛంధ సేవకుడిగా పాల్గొన్నారు. చరిత్రాత్మక కకోరి కుట్ర కేసులో వారి సోదరుడిని ఇరికించి అరెస్టు చేయడం జరిగింది. వారి కుటుంబంతో పాటు వారు కూడా క్రియాశీల విప్లవ పోరాటాలలో భాగస్వాములు కావల్సివచ్చింది. స్వాతంత్ర సమర యోధులు గణేష్ శంకర్ విద్యార్థితో పరిచయం కలిగి కాన్పూర్ కార్మిక సంఘ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. పోలీస్ నిఘా పెరిగిపోవడంతో 1928లోనే రహస్య జీవితం ప్రారంభించవలసి వచ్చింది. ఒక సం॥ పాటు విప్లవకారులతో సంబంధాలు ఏర్పరుచుకునే ప్రయత్నంలో దేశమంతా తిరిగినారు. అదే సందర్భంలో మొదటిసారిగా 1929లో పండిట్ జవహార్‌లాల్ గారిని కలుసుకున్నారు. అప్పటికే చరిత్రాత్మక లాహోర్ కుట్ర కేసు విచారణ ప్రారంభమైంది. బ్రిటీష్ ప్రభుత్వం సిన్హాగారిని అరెస్ట్ చేసి భగత్‌సింగ్, సుఖదేవ్ మరియు రాజగురులతో పాటు నిందితుడిగా విచారణ జరుపపూనుకున్నది. పై ముగ్గురికి ఉరిశిక్షలు విధించగా సిన్హాగారికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడం జరిగింది. శిక్ష విధించిన న్యాయమూర్తి సిన్హాగారి గురించి వ్రాస్తూ ఇతడే ముఖ్యుడని, నిర్మాణ దక్షుడని రాష్ట్రంలోనున్న వివిధ రాజకీయ సంస్థలను సంఘటితం చేసినాడని పేర్కొన్నారు. విచారణ కాలంలోనే విప్లవకారుడొకరు రాజకీయ ఖైదీలకు సముచిత సౌకర్యాలు కావాలని పోరాడుతూ అసువులు బాసినారు. ఆ తర్వాత రాజకీయ ఖైదీల స్థితిగతుల బాగు కొరకు పోరాటంలో సిన్హాగారు నిరాహార దీక్షలకు పూనుకోవలసి వచ్చింది. సిన్హాగారి ఎడతెగని జైలు పోరాటాలతో విసిగిపోయిన బ్రిటీష్ ప్రభుత్వం వారిని అండమాన్ దీవులలో నున్న జైలులో నిర్బందించింది. సిన్హాగారి దేశభక్తి, వుద్యమ తపన వారికి విశ్రాంతి కలింగించ లేదు. అండమాన్‌లో నిర్బంధంలోనున్న 400 మంది రాజకీయ ఖైదీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆ తర్వాత సిన్హాగారిని భారత దేశం పంపించడం జరిగింది. మహాత్మగాంధీ గారి వ్యక్తిగత జోక్యం ఫలితంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న సిన్హాగారు విడుదల చేయబడినారు. 1939లో అఖిల

భారత కాంగ్రెస్‌లో చేరి 1940లో AICC సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో గ్రామీణ ప్రజా వుద్యమ నిర్మాణంపై కేంద్రీకరించారు. 1941లో తిరిగి అరెస్ట్ చేయబడి ఒక సం॥ కఠిన కారాగార శిక్షా కాలం ముగిసిన తర్వాత విడుదల కాకుండా మరో 4 సం॥లు డిటెన్యూగా నిర్బంధించబడ్డారు. చివరకు 1945లో విడుదల కాబడ్డారు. ఈ విధంగా 15 సం॥ల జైలు జీవితం అనుభవించారు. స్వాతంత్రానంతరం 3 సం॥లు ఒక రాజకీయ పత్రికకు సంపాదకులుగా పనిచేస్తూ క్రియాశీల పార్టీ రాజకీయాలకు దూరంగా నుండి పోయారు. ఉత్తర భారతంలో జైళ్ల మార్పిడి సందర్భంగా నడుస్తున్న రైలు నుండి క్రిందకి దూకి తప్పించుకునే ప్రయత్నం చేసిన సిన్హాగారిని మరింత కఠిన శిక్షగా రాజమండ్రి జైలులో నిర్బంధించడం జరిగింది. అక్కడే విప్లవకారుడు, అసహాయ సూరుడైన సిన్హాగారిని తెలుగు ప్రాంత దేశభక్తులు, వారి అభిమానులు వారితో పరిచయం చేసుకోవడం జరిగింది. రాజకీయ అనుబంధం ప్రేమబంధంగా పుష్పించింది. ఒక అభిమాని సిన్హాగారిని తమ కూతురు రాజ్యంతో పరిణయ ప్రతిపాదన చేసారు. సిన్హాగారు సంతోషంగా ఈ ప్రతిపాదనను స్వీకరించారు. విడుదల కాగానే తెలుగింటి ఆడపడుచు రాజ్యం ఉత్తరప్రదేశ్ విప్లవకారుడైన విజయ్ కుమార్ సిన్హాలకు వివాహం జరిగింది. రాజ్యం సిన్హా విద్యావంతురాలు. అతివాద రాజకీయ అభిమాని తమ భర్త భావాలను సంపూర్ణంగా గౌరవిస్తూ త్యాగమూర్తి అయిన భర్త సిన్హా గారికి తోడు, నీడగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిణిగా చివరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సమాచార శాఖ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత రిటైరయ్యారు.

సిన్హాగారి విప్లవ జీవిత గాథ తరతరాలకు దేశభక్తి భావాన్ని, త్యాగనిరతిని వేన్నోళ్ళ చాటిచెప్పుచున్నది. ఈ మహానుభావుడు తమ చివరి కాలం భార్య రాజ్యంతో కలిసి సికింద్రాబాద్‌లోని మారేడుపల్లిలో గడపడం ఈ రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులకే చేరువుగా నుండడం ఒక విచిత్ర అనుభూతి. వారు ఒకరోజు నాతో మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ కొరకు గుర్తింపుగా నాపేరును ప్రతిపాదించే ప్రస్తావన తెచ్చారు. అమితానందంతో గురుతుల్యులు రావి నారాయణ రెడ్డిగారి సమక్షంలో పత్రాలపై శ్రీ సిన్హాగారి సంతకం చేయించుకోవడం జరిగింది. ఇది ఒక మధురస్మృతి. సిన్హాగారి మరణం తర్వాత శ్రీమతి రాజ్యం సిన్హాగారు తమ భర్త విజయ్ కుమార్ సిన్హా గారి సంస్మరణగా పదివేల రూ॥ల పారితోషికాన్ని తెలంగాణా అమరవీరుల స్మారకట్రస్టుకు అందచేసారు. భక్తిప్రపత్తులతో, కృతజ్ఞతా భావంతో ట్రస్టు నిధిగా స్వీకరించాము.

# ఆణిముత్యం

మానవేతిహాసములో మత ప్రవక్తలు, రాజకీయ నాయకులు, సంఘ సంస్కర్తలు, విప్లవకారులు అత్యంత ప్రధానమైన పాత్ర నిర్వహించారు. మానవ జీవిత విలువలను సృష్టిస్తూ, పోషిస్తూ, నవార్ణవ సాంస్కృతిక ప్రమాణాలను నెలకొల్పినారు. ఇటువంటి ధృవతారలెన్నో భారత ఆకాశంలో వెలుగొందియున్నవి. ఈ శతాబ్ధంలో ఆంధ్ర దేశములో జన్మించి కీర్తికిరీటాలను ధరించిన పుణ్యపురుషులలో శ్రీ రావి నారాయణరెడ్డి అగ్రగణ్యులు. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ", భారత ప్రభుత్వం "పద్మవిభూషణ్" బిరుదులనిచ్చి సత్కరించినది. తెలుగుజాతి ఒక గొప్ప రాజకీయ నాయకుడుగా గుర్తించింది.

రావి నారాయణరెడ్డిగారి (ఆర్.యన్) సుదీర్ఘ రాజకీయ జీవితం అన్ని తరాల వారికి అత్యంత ఆసక్తికరం. బ్రిటీష్ సామ్రాజ్యవాద బానిసత్వం, నైజాం నిరంకుశత్వం, జాగీర్ధారుల అమానుషత్వం అన్ని మిళితమై విశృంఖలంగా రాజ్యమేలుతున్న వాతావరణంలో జన్మించిన ఆర్.యన్. బాల్యంలోనే బహు బాధ్యతలను స్వీకరించారు. సంఘసేవను తన కర్తవ్యంగా ఎన్నుకున్నారు. జాతీయ స్వాతంత్ర్య ఉద్యమం క్రమంగా శైశవావస్థలు అధిగమించి నిండు యవ్వనంతో అంగలు వేస్తున్న సమయం అది. సహజంగానే తాను రాజకీయాలకు అంకితం కావాలని నిర్ణయించుకున్నారు. రాజకీయ భావ పరంపరలో అత్యంత ఆరోగ్యకర ఆలోచనాధారలను ఆస్వాదించారు. గాంధీగారి అకుంఠిత దేశభక్తి, నెహ్రూగారి చారిత్రక పరిణామ దృష్టి, విప్లవకారుల త్యాగపూరిత నిష్కామకర్మ వారి హృదయంపై చెరగని ముద్రవేసింది. నిజాం కళాశాలలో మంచి విద్యార్థి, ఉన్నతశ్రేణికి చెందిన క్రీడాకారుడైన తాను అనతికాలంలోనే వాటిని త్యజించి సంఘసేవ బాధ్యతలను చేపట్టారు. హరిజన సేవా సంఘం స్థాపన, ఆంధ్ర మహాసభ స్థాపన, స్టేట్ కాంగ్రెస్ స్థాపన ఆ తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ స్టేట్ కమిటీ స్థాపన కార్యభారాలు నిర్వహించారు. వీటన్నిటిలో ఆర్.యన్. తన సహచరులందరిలో కేంద్ర బిందువుగా నుండడం గమనార్హం. హైదరాబాద్ సంస్థానంలో ప్రథమంగా హరిజన సేవా సంఘాన్ని నిర్మించి చాలా కాలం ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ సంస్థాన కాంగ్రెస్ తరపున ప్రథమ సత్యాగ్రహదళ సభ్యులుగా అరెస్టు అయ్యారు. తెలంగాణా ప్రజా పోరాట వేదిక యగు ఆంధ్ర మహాసభకు మూడు

పర్యాయాలు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. తెలంగాణా పోరాట విరమణ తర్వాత రెండు పర్యాయాలు పార్లమెంటుకు, ఒకసారి శాసనసభకు అత్యధిక మెజారిటీ ఓట్లు సంపాదించారు. భారత రాజకీయ చిత్రపటములో చోటు చేసుకున్నారు.

చరిత్రాత్మక తెలంగాణా సాయుధ పోరాటం, రావి నారాయణ రెడ్డిగారిని విడదీయ రాకుండా ముడిబడియున్న విషయం. యువకుడుగా, నిరాడంబర కార్యకర్తగా, అందరికీ మిత్రుడుగా, ధైర్య సాహసాలను అందజేసే ఘటికుడుగా సహచరులు, ప్రజల తలలో నాలుకగా మెలిగిన సౌమ్యుడు ఆర్.యన్. తనలోనున్న కృతనిశ్చయం, దృఢసంకల్పం వలన అడుగడుగునా ఎదురయ్యే ప్రశ్నలకు తడబడకుండా సమాధానాలను అందించే రాజకీయ చతురుడు. 1947 ఆగస్టు తర్వాత భారతదేశంలో కలువకుండా స్వతంత్ర హైదరాబాద్ రాజ్యాన్ని ప్రకటించుకున్న నైజాం నవాబును గద్దె దించాలని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని మహోద్యమం నిర్వహించబడ్డది. 1947 సెప్టెంబరు మాసంలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు నైజాం ప్రభుత్వాన్ని కూలద్రోయాడానికి పిలుపునిచ్చాయి. ఆ పిలుపునిచ్చిన నలుగురు నాయకులలో ఆర్.యన్. ప్రథముడు. బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్, దేవులపల్లి వెంకటేశ్వర రావు వారి సహచరులు. 1948 సెప్టెంబరు 14 వరకు సుమారు ఒక సంవత్సరం ఉధృతంగా కొనసాగిన సాయుధ పోరాటం విజయ పరంపరలు సాధించింది. నైజాం పోలీసులు, సైనికులు, రజాకార్లు అడుగడుగున మట్టికరుస్తూ, వీర తెలంగాణా గెరిల్లా యోధుల ఎదురుదాడులను తట్టుకోలేక గుక్కతిప్పుకోలేక హతులయ్యారు. పలాయనం



"చెన్నమనేని" షష్ఠి పూర్తి సందర్భంగా వారి ఇంటిలో కలిసి అభినందిస్తున్న రావి నారాయణరెడ్డి - సీతాదేవి దంపతులు

చిత్తగించారు. శతృ వర్గాలతో కలసిన కొందరు భూస్వాములు, ద్రోహులు గ్రామాలను వదిలి పారిపోయారు. వేలాది గ్రామలలో భూసంస్కరణలు, సాంఘిక సంస్కరణలు, ఆత్మరక్షణ దళాల ద్వారా నిర్వహించబడి ప్రజలు నూతన జీవితాన్ని సమసమాజాన్ని చవిచూచారు. తీవ్రమైన సంఘర్షణ నుండి ఉద్భవించిన ఆ విముక్తజన జీవితాన్ని యావత్ప్రపంచం వేనోళ్ళ పొగిడింది. భారతదేశానికే ఒక ధృవతారగా, సామ్రాజ్యవాద దోపిడివాద కీకారణ్యాన్ని దహింపచేయగల శక్తివంతమైన నిప్పురవ్వగా ఆనాటి తెలంగాణాను కీర్తిశేషులు మఖ్దుం ప్రస్తుతించారు. ఇంతటి మహత్తర పోరాటంలో వేలాది సైనికులు, రథ సారథుల మధ్య విప్లవ సేనానిగా ఆర్. యన్. తన సముచిత స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

గతి తర్కం ప్రకృతి సిద్ధంగా తనదారి తాను ఎన్నుకుంటుంది. మార్పుని గమనించి మార్గాన్ని మార్చుకోవలసిన తరుణం వచ్చింది. పోలీసు చర్య తర్వాత హైదరాబాద్ సంస్థానంలోని రాజకీయ శక్తుల పొందిక తీవ్రంగా మారింది. ఆలస్యంగానైనా స్వతంత్రం సాధించబడినట్లు అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలంతా భావించారు. సాధించుకున్న విజయాలన్నిటిని సంరక్షించుకుంటు, విముక్త ప్రాంతంలో తిరిగి భూస్వాముల ప్రమేయం లేకుండా ఉండే రాజకీయ విధానము గురించి చైతన్య వంతమైన ప్రజలంతా ఆలోచించారు. దీనిని పసికట్టిన ఆర్.యన్. పరిస్థితులకు ప్రతిస్పందించారు. విజయాలను రక్షించుకుంటు, విలువైన ప్రాణాలతో కూడిన దళ సభ్యులందరిని సాధారణ జీవన స్రవంతిలోకి తేవడానికి, కేసుల ఉపసంహరణకి, నూతన పరిస్థితులకనుగుణంగా నూతన ప్రజా ఉద్యమ నిర్మాణానికి ఆనాటి సాయుధ పోరాట విరమణ ఏకైక మార్గమని ఆర్. యన్. పార్టీ లోపల వాదించారు. చాలామంది ఉద్యమ నాయకులు ఆర్. యన్. వాదనను బలపర్చారు. కాని ఆనాటి వాతావరణంలో పార్టీ నాయకత్వంలోని మెజారిటీ దీన్ని వ్యతిరేకించింది. రాష్ట్ర నాయకత్వం ఆర్. యన్.ని ద్రోహిగా చిత్రించి కరపత్రం వేసింది. దీనితో ఆర్. యన్. జీవిత పోరాటంలో రెండవ కఠిన దశ ఆరంభమైంది.

రెండవ కమ్యూనిస్టు అంతర్జాతీయ మహాసభలో లెనిన్‌గారితో వాదించలేక ఓడిపోయిన యం.యన్.రాయ్ గారి వాదన మౌలికమైంది. జాతీయ స్వాతంత్ర్య పొరాటంలో బూర్జువా వర్గాలతో ఎట్టి పరిస్థితులలో కూడా కలువకుండా కమ్యూనిస్టులే స్వతంత్రంగా, ఒంటరిగా వర్గ ప్రాతిపదికపై ఈ పోరాటాన్ని నిర్వహించాలి. తిరిగి ఆరవ అంతర్జాతీయ మహాసభ ఈ సిద్ధాంతానికి ప్రాణం పోసింది. డికాలొనైజేషన్ సిద్ధాంతానికి ప్రాణం పోసింది. 1948 ఫిబ్రవరిలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ కాంగ్రెసు ఈ సిద్ధాంతం వెలుతురులో తన రాజకీయ తీర్మానాన్ని ఆమోదించింది. వ్యూహం ఎత్తుగడలను రూపొందించింది. ఆ గీటు దాటిన ప్రతి వారికి ద్రోహి అనే నామకరణం

చేసింది. కా॥ ఆర్.యన్. పెద్ద మనిషిగా బాధ్యుడుగా, హుందాతనంతో తమపై చెలరేగిన దుమారాన్ని తట్టుకున్నారు. కాలం మాత్రమే సత్యాన్ని చాటిచెప్పుతుందని నమ్ముకున్నారు. అదే జరిగింది. కాని చాలా కష్టనష్టాల తర్వాత, విలువైన త్యాగాల తర్వాత కండ్లు తెరవడం జరిగింది. దేశ స్వాతంత్ర్యం, స్వతంత్ర ఆర్థికాభివృద్ధి, ప్రజల చైతన్య స్థాయి, పార్టీ శక్తి సామర్థ్యాలు వీటన్నిటి గురించి రెండవ పార్టీ కాంగ్రెసు యిచ్చిన అవగాహన పూర్తిగా తప్పు అని తేలిపోయింది. పార్టీ క్రమక్రమంగా వాస్తవాలను గుర్తించడం ఆరంభించింది. ఈ పరిణామాలు ఆర్. యన్. లో సంతృప్తి కలిగించినవి. ఆత్మ విమర్శ లేనందుకు, లోపించినందుకు బాధపడేవారు. ఏమైనా మార్పు కలిగినందుకు సంతోషించేవారు. జాతీయ ఉద్యమ పురోగమనములో, ప్రతి మూల మలుపు సందర్భంలో ముఖ్యంగా 1930లో, 1942లో, 1948లో పార్టీ ప్రధాన జాతీయ స్రవంతి నుండి విడిపోవడం ఫలితంగా పార్టీ ఒంటరిగా నిలిచి బలహీనమైపోవడం పట్ల ఎంతగానో బాధపడి, ఆందోళన చెంది సరిదిద్దుచర్యలకై తపన చెందిన ప్రజల మనిషి.

జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను సునిశిత దృష్టితో విశ్లేషణ చేస్తూ నిరంతరం తన ఆలోచనలకు పదును పెట్టుతూవచ్చిన మేధావి. సుమారు 15 సంవత్సరాలనుండి క్రియాశీల రాజకీయాలతో, పార్టీ సభ్యుడిగా తమ జీవితాన్ని గడిపారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పథకం ప్రకటించబడిన తరువాత వేలాది తెలంగాణా స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్లు మంజూరు చేయించే కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణా పోరాటం స్వాతంత్ర్య పోరాటంలో భాగంకాదని కేంద్రంలో జనతా ప్రభుత్వం చేసిన నిర్ణయానికి వ్యతిరేకంగా పట్టుదలతో పోరాడినారు. అనేక వందలమందికి పెన్షన్లు మంజూరు చేయించడంలో కృతకృత్యులయ్యారు.

భారతదేశంలో అతివాద శక్తుల ఐక్యత ఆధారంగా సువిశాల అతివాద ప్రజాతంత్ర ఆవిర్భావమే దేశంలో ప్రజాస్వామ్యము, సాంఘిక న్యాయము సాధనకు మార్గమని నమ్మిన విప్లవకారుడు ఆర్.యన్. అయితే సామ్రాజ్య వ్యతిరేక, మతవాద వ్యతిరేక పోరాటాలన్నిటిలో కాంగ్రెసు పార్టీతో సహా దేశభక్త శక్తులన్నింటిని కూడగట్టవలసిన ప్రధాన బాధ్యత కమ్యూనిస్టులపై వుంటుందని ఘంటాపథంగా వాదించేవారు. గ్రుడ్డి కాంగ్రెస్ వ్యతిరేకత కారణంగా ఈ దిశలో పార్టీ ధైర్యంగా ముందంజవేయడం లేదని తీవ్రంగా మనస్తాపం చెందేవారు. మితవాద, మతవాద శక్తులతోకూడా చెట్టాపట్టాలు వేసుకుని కాంగ్రెసు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేయబడిని ఎత్తుగడలను నిర్మొహమాటంగా ఖండించారు. అంతర్జాతీయ పరిస్థితుల గురించి బాధ్యతగా విశ్లేషణ చేసి అవగాహనకు వచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలోని సంపదను ఏవిధంగా కొల్లగొడుతున్నాయో వాస్తవాలను అంకెలతో వివరిస్తూ అర్థం చేయించేవారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు, అలీన దేశాలు ఐక్యంగా నూతన ప్రపంచ ఆర్థిక విధానం కొరకు పోరాడడం ఎంత

అవసరమో నొక్కి చెప్పేవారు. వనరులు ఉత్తరాది నుండి దక్షిణాదికి తరలించబడాలని అందుకై అభివృద్ధి చెందుతున్న దేశాలు వివిధ వేదికల ద్వారా పోరాడాలని వారి అభిప్రాయం. ఈనాటి పరిస్థితులలో పరిస్థితులకు అనుగుణ్యంగా ఐక్యరాజ్య సమితి దాని భద్రతా సమితి నియమ నిబంధనలు పూర్తిగా మారాలని ఆలోచించేవారు. అమెరికా, పెత్తందారీ నయావలస విధానాలు అడుగడుచునా ఎదిరించి ఓడించాలని వారి ఆకాంక్ష. సోవియట్, తూర్పు యూరప్ సోషలిస్టు వ్యవస్థల పతనం వారిలో తాత్కాలికంగా దిగ్భ్రాంతిని కల్పించింది. తీవ్ర అనారోగ్యంతో పడియుండి కూడా పత్రికలు చదివి, వినిపించుకుని ఈ పరిణామాలను పరిశీలించగలిగినారు. ఈ పరిణామాలు కూడా అకస్మికం కావని సోవియట్ పార్టీ మరియు ప్రభుత్వం గుడ్డిగా అనుసరించిన పిడివాద విధానాలే కారణమని, మారుతున్న శాస్త్ర, సాంకేతిక పురోగమనం నుండి విడిపోవడం వలననే పూర్తిగా వెనుకబడిపోవడం జరిగిందని వారి నమ్మకం. ఇప్పుడు అమెరికా ఏకైక ప్రపంచ శక్తిగా అవతరించి ప్రపంచ పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నందుకు అందోళన చెందారు. ఇది ఏమాత్రము సాగకూడదని ప్రపంచ దేశాలు సోవియట్ మరియు తూర్పు దేశాలతో సహా ఐక్యంగా ఈ పరిణామాన్ని ఎదిరించాలని ఐక్యరాజ్యసమితి ప్రపంచ దేశాలన్నిటికి ఏకైక వేదికగా, బలోపేతంగా తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించాలని వారి నమ్మకం.

సుమారు 5 దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో కామ్రేడ్ రావి నారాయణ రెడ్డిగారితో నాకు ఏర్పడిన సాన్నిహిత్యం, స్నేహం, పరస్పర అవగాహన మరువరానివి. నాలుగు సంవత్సరాల రహస్య మరియు జైలు జీవితం కూడా మా సాన్నిహిత్యాన్ని విడదీయలేదు. తుది శ్వాస విడిచే వరకు నా కంటిలో కన్ను పెట్టి చూస్తూ చేతిలో చేయిని గట్టిగా పట్టిన ప్రియతమ ఆర్. యన్. కి నా హార్ధిక జోహార్లు.

# తెలంగాణ విముక్తి ఉద్యమ మహానేత - ఆర్.ఎన్.

శ్రీ రావి నారాయణరెడ్డి గారి గురించి, వారి జీవిత విశేషాలు, రాజకీయరంగ దీక్షాదక్షతలు, ఉత్తమ పార్లమెంటరియన్‌గా నిర్వహించిన ఆదర్శప్రాయ ప్రసంగాల గురించి అనేక రచనలు వెలువడినవి. తిరిగి వాటిని పునశ్చరణ చేయకుండా అమరజీవి అంతరాత్మ ప్రబోధాల గురించి, వారితో నాకున్న ఆత్మీయత ఆధారంగా కొన్ని వాక్యాలు రాయడం సముచితమని భావిస్తున్నాను. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ ప్రవచనం పవిత్ర హృదయంగల దేశభక్తుల ఆలోచనలో సుస్పష్టమైన మానవతావాదాన్ని సమకూర్చింది. దేశభక్తులు, రాజకీయ నాయకులుగా చలామణి అవుతూ అధికార పీఠాలను అలంకరించినవారు దేశమంటే ఒక భౌగోళిక భూప్రాంతం అని మాత్రమే అర్థం చేసుకున్నారు. ఇలా అర్థం చేసుకోవడం యాదృచ్ఛికం కాదు. చరిత్రలో రాజులు, మహారాజులు, చక్రవర్తులు దేశాల ఆక్రమణలు,దురాక్రమణల ద్వారా సృష్టించిన సంస్కృతి సారాంశాన్ని ఈనాటి ప్రపంచానికి కండ్లకు కట్టినట్లు సరళంగా తెలియచేశారు. ఇదే భావాన్ని ఈనాటి పెట్టుబడిదారీ గందరగోళ పరస్థితులలో, అభివృద్ధి అంటే ''మానవాభివృద్ధి'' అని నోబెల్ బహుమాన గ్రహీత అమర్త్యసేన్ నిర్ధారించారు. మహాత్మాగాంధీ గారు దక్షిణాఫ్రికాలో మానవులకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి సంపాదించిన అనుభవ సంపదను మనదేశ స్వాతంత్ర్యోద్యమ నిర్మాణానికి ఉపయోగించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద దుష్టపరిపాలనకు వ్యతిరేకంగా కోట్లాది భారతీయులను సుసంఘటితం చేయడానికి సత్యాగ్రహాన్ని ప్రబల సాధనంగా వినియోగించారు. అయితే దాన్ని పట్టువిడుపులు లేని మతాచారంలాగా ఆచరించటంవల్ల కొన్ని సందర్భాలలో ప్రజలు రాజ్య హింసను ఎదిరించలేని నిశ్చేష్ట పరిస్థితికి హేతువుగా మారింది.

రావి నారాయణరెడ్డి గారు గాంధీగారిని కలిసి ''గాంధీయిజం''లో స్ఫూర్తిని పొంది రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాకినాడకు వెళ్లి ఉప్పుసత్యాగ్రహం చేస్తూ అరెస్టు అయినారు. గాంధీగారి ఆదేశాల మేరకు హైదరాబాద్ సంస్థానంలో హరిజన సేవాసంఘాన్ని స్థాపించి దానికి కార్యదర్శిగా, అధ్యక్షులుగా, దళిత జనోద్ధరణ కొరకు

ఉద్యమించారు. హైదరాబాద్ సంస్థాన స్టేట్ కాంగ్రెస్ స్థాపకులలో ఒకరుగా, ప్రథమ సత్యాగ్రహ దళంలో ఒకరుగా జైలు జీవితాన్ని అనుభవించారు. కాశ్మీరు సింహంగా, కీర్తి కిరీటాన్ని ధరించిన షేక్ అబ్దుల్లా గారి అధ్యక్షతలో నిర్మించబడిన భారత సంస్థాన ప్రజల మహాసభకు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడి రాచరిక పాలనను రద్దుచేసే మహోద్యమానికి పునాదులు వేశారు.

1930 నుండి 1946 వరకు నిరంతరాయంగా ఆర్థిక-సామాజిక రాజకీయ తీర్మానాలను చేసిన చరిత్రాత్మక తెలంగాణా ఆంధ్ర మహాసభకు మూడు పర్యాయాలు ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు. ఆంధ్ర మహాసభ నాయకుడుగా తెలంగాణా జిల్లాలన్నింటిని పర్యటిస్తూ రైతులు, చేనేత పారిశ్రామికుల కష్టాలను, కడగండ్లను కండ్లారా చూస్తూ వాటి నివారణ కొరకు ఉద్యమాలను నిర్వహించారు. ఆంధ్ర మహాసభ నాయకులందరిలో నిరాడంబర, నీతి నిజాయితీగల సమరశీల నాయకుడిగా, కర్తవ్య ప్రబోధనలు చేస్తూ వైరి వర్గాల దురాగతాలను ఎండగడుతూ ప్రజాసామాన్యాన్ని పోరాటాలలోకి ఆకర్షించిన నాయకుడిగా గుర్తింపు సాధించారు. ఆనాటి స్టేట్ కాంగ్రెస్ నాయకులు విధించుకున్న పరిమితులు, మితవాద రాజకీయ కార్యక్రమాలు ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో ప్రజా ఉద్యమాల ఉధృతికి ఏమాత్రం సరిపడవనే అనుభవజ్ఞానంతో భారత కమ్యూనిస్టుపార్టీలో చేరారు.

భారత కమ్యూనిస్టుపార్టీ సామాజిక విప్లవం కొరకు రచించిన మడమ తిప్పని పోరాటాల పంథా వారిని సంపూర్ణంగా ఆకర్షించింది. వారి జీవితంలో అలుపెరగని పోరాట అధ్యాయం ప్రారంభమైంది. ఆనతి కాలంలోనే అగ్రనాయకుడిగా ఎదిగి తమ సన్నిహిత సహచరులైన బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్ గారలతో కలసి నిజాం నిరంకుశ పాలనను కూలద్రోయడానికి సాయుధ పోరాటమే శరణ్యమని పిలుపు నిచ్చారు. ఈ పిలుపు రాచరిక పాలనకు, వారి తాబేదారుగా నున్న భూస్వామ్య వ్యవస్థ, ఆ వ్యవస్థలు సృష్టించిన రజాకారు మూకల దౌష్ట్యాలను ఎదిరించి, ఓడించడానికి తెలంగాణా ప్రజా బాహుళ్యానికి ఒక వజ్రాయుధంగా లభించింది.

17 ఆగస్టు 1947 నాటి నుండి 17 సెప్టెంబరు 1948 నాటి వరకు ఈ సాయుధ పోరాటం ఒక అంతర్ యుద్ధంగా, సంస్థాన విమోచన పోరాటంగా, భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుగా విజయ పరంపరలతో విజయబావుటా ఎగురవేసింది. ఈ మహోద్యమంలో ఎందరో రైతు కూలీలు, విద్యార్థి, యువకులు ఆత్మ బలిదానం చేశారు. భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాపిత ప్రజోద్యమాల చరిత్రలో ఈ 13 మాసాల తిరుగుబాటు ప్రజోద్యమం సువర్ణాక్షరాలతో లికించబడ్డది.

1948 సెప్టెంబరు 13-17 మధ్య భారత ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ యాక్షన్ ఫలితంగా నైజాం ప్రభుత్వం కుప్పకూలిపోయింది. సంస్థాన ప్రజలు విముక్తిని సాధించారు.

పోరాట యోధులు నిట్టూర్పు విడిచారు. వేల మంది సమర యోధులు జైళ్ళ నుండి విడుదలయ్యారు. అనేక వేలమందిపై ప్రకటించిన నేరారోపణలు రద్దు చేయబడ్డాయి. ప్రతిదినం ఒక గండంగా భయంకర వాతావరణంలో బ్రతికే గ్రామీణ స్త్రీ, పురుషులు స్వతంత్ర వాయువు పీల్చనారంభించారు.

హైదరాబాద్ సంస్థాన ప్రజా జీవితంలో వివిధ రాజకీయ పార్టీల నాయకుల అవగాహనలో మౌలికమైన మార్పు చోటు చేసుకున్నది. మారిన పరిస్థితుల కనుగుణంగా నూతన రాజకీయ వ్యూహంతో ప్రజలు ప్రజాతంత్ర వుద్యమాలను పునర్నిర్మాణం చేయాలన్న కోరిక అందరినీ ఆకట్టుకున్నది. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితులలో 1948 మే మాసంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్ తీర్మానం తెలంగాణా సాయుధ పోరాటాన్ని కొనసాగించ వలసిందేనని, దీనిని భారత దేశవ్యాపితంగా విస్తరించాలని నిర్ణయించింది. భారత ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ నిర్ణయాన్ని ఎదిరించడానికి, తెలంగాణాలోని సాయుధ దళాలను, పార్టీ నాయకులను తుదముట్టించడానికి పూనుకున్నది. సైనిక దళాలు రంగప్రవేశం చేసి పార్టీని నామరూపాలు లేకుండా చేయడానికి హింసాకాండకు తెగించింది. 1951 చివరి వరకు సుమారు 3 సంవత్సరాలు కొనసాగిన అసమాన అంతర్యుద్ధం ప్రజలు, ప్రజాసేవకుల ఆత్మరక్షణ యుద్ధం అత్యంత దారుణంగా కొనసాగింది. తిరిగా వేలాది ప్రజలు అశువులు బాశారు. ఈ ఘట్టం రావి నారాయణ రెడ్డి, వారి సన్నిహిత సహచరులైన మాలాంటి వారి రాజకీయ జీవితాలలో ఒక చీకటి కోణంగా మిగిలింది.

సెప్టెంబరు 17, 1948 తర్వాత సాయుధ పోరాటాన్ని పూర్తిగా విరమించుకుని శాంతియుత మార్గాలనుచేపట్టి ప్రజా ఉద్యమాలకు పార్టీ మార్గదర్శకత్వం వహించాలని వారు, వారి సహచర బృందం తీవ్రంగా భావించింది. అంతే తీవ్రంగా పార్టీ నాయకత్వం వ్యతిరేకించిన వారిని సంస్కరణవాదులుగా ముద్రవేసింది. ఈ ఆలోచనా విధానానికి ప్రథములుగా ఉన్న రావి నారాయణరెడ్డి గారిని గురిపెట్టి వారి పలుకుబడిని నిర్మూలించడానికి తెగించడం కూడా జరిగింది. అయినా ప్రజాస్వామ్యం యొక్క మనస్తత్వంపై, ప్రజాతంత్ర రాజకీయాల ఆవశ్యకతపై అకుంఠిత విశ్వాసం కలిగిన నారాయణరెడ్డి గారు అచంచలంగా, నిర్భయంగా, రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించారు. తీవ్రవాదం అపజయం పొందుతుందని, పార్టీలో అంతరంగిక ప్రజాస్వామ్యం ఆవిష్కరించబడుతుందనే విశ్వాసంతో కాలం గడిపారు. 1951 చివరిలో హైదరాబాద్‌లో అరెస్ట్ చేయబడిన మేమిద్దరం చంచల్‌గూడ, ఔరంగాబాద్, గుల్బర్గాల్లో జైలు జీవితకాలంలో ప్రపంచ ప్రజా ఉద్యమాలు, మార్క్సిజం, లెనినిజం పేరిట నిర్వహించబడుతున్న తీవ్రవాద ఉద్యమాల గురించి చర్చించుకోవడానికి, ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక విధానాల గురించి ఆలోచించడానికి చక్కని అవకాశం దొరికింది.

1952 ఫిబ్రవరి మాసంలో సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చినవి. రావి నారాయణ రెడ్డి గారితో పాటు మరెందరినో శాసనసభ, పార్లమెంటు అభ్యర్థులుగా పార్టీ ప్రతిపాదించింది. అంతకు చాలా ముందే జైళ్ళ నుండి విడుదలైన తెలంగాణా ప్రాంత నాయకులు ఆరుట్ల లక్ష్మి నరసింహారెడ్డి, ఎడ్ల గురువారెడ్డి, వి.డి. దేశ్‌పాండే తదితర యువనాయకులు ఈ ఎన్నికల వ్యూహరచనలో విశేషమైన కృషి చేశారు. రావి నారాయణ రెడ్డి భారతదేశంలోనే అత్యధిక ఓట్లు సంపాదించుకున్న పార్లమెంటు సభ్యులుగా కీర్తి కిరీటాన్ని ధరించారు. రావి నారాయణ రెడ్డి గారు 1957లో శాసనసభకు గెలిచి శాసనసభా పార్టీ ఉపనాయకుడిగా బాధ్యతలు నిర్వహించారు. తిరిగి 1962లో నల్గొండ పార్లమెంటు సభ్యుడిగా గెలిచి ఆ తర్వాత ఎన్నికల రాజకీయ బాధ్యతకు స్వస్తి చెప్పారు.

1964లో భారతదేశంపై మిత్ర దేశము, కమ్యూనిస్టు దేశమైన చైనా జరిపిన దురాక్రమణ పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని, అసంతృప్తిని వెలిబుచ్చారు. తమ షష్టిపూర్తి తర్వాత పార్టీ బాధ్యతలనుండి విరమించుకున్నారు. చివరి వరకు పార్టీతో ప్రజానాయకులతో సత్‌సంబంధాలు కలిగి యున్నా, ప్రంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన ఊహించని పరిణామాల పట్ల ఆవేదన పూరితంగా అలోచించేవారు.

1939లో 16 సం॥ల వయస్సులో ఉన్న నేను ప్రప్రథమంగా వారిని దర్శించుకున్నాను. కరీంనగర్ జిల్లా ఆంధ్రమహాసభ కార్యాలయంలో వారున్నారని తెలిసిన వందలాది రైతులు, చేనేత పారిశ్రామికులు ద్వారం వెలుపల తమ ప్రియతమ నాయకుడి దర్శనం కొరకు క్రిక్కిరిసి నిలిచున్నారు.

నేను చొరవ చేసి లోపలికి వెళ్ళడానికి సాహసించాను. స్వయాన నాకు బావగారైన కీ.శే. పోల్కంపల్లి వెంకట రామారావు గారు జిల్లా ఆంధ్ర మహాసభకు అధ్యక్షులుగా ఉండడం, వారు రావి నారాయణరెడ్డి గారికి విద్యార్థి దశనుండి సన్నిహిత మిత్రులుగా ఉండడం నాకు తెలుసు. అదే నా చొరవకు కారణం. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆత్మార్పణ చేసిన అన్నెభేరి ప్రభాకరారావు జిల్లా ఆంధ్రమహాసభకు కార్యదర్శి. ఆయన నన్ను చూచి ఎదురుగా వచ్చి చేయిపట్టుకుని లోపలికి తీసుకువెళ్ళడం జరిగింది. 'అదిగో చూడు రావి నారాయణ రెడ్డి గారిని అన్నాడు. ఎటు చూచినా నాకు నా ఊహ చిత్రం కనబడలేదు. చేదబావి నుండి నీరు తోడి ఒక బండపై సబ్బుతో తమ ధోతిని ఉతుక్కుంటున్న బక్కపల్చని మనిషిని చూచాను. అప్పుడే స్నానం చేసి తమ గుడ్డలను ఉతికి ఆరవేసుకునే నిరాడంబర జీవి రావి నారాయణ రెడ్డి అన్న వాస్తవం నాలో సంభ్రమాశ్చర్యాలను కల్పించింది. అదే భావం అర్ధ శతాబ్ధికి మించిన మా ఇద్దరి మధ్య స్నేహం, సహచర్యం, ఆత్మీయతలో పెనవేసుకుపోయింది. నా వ్యక్తిగత, రాజకీయ జీవితంలో సింహభాగం రావి నారాయణ రెడ్డి గారితో గడిపినదే. వారి దివ్య స్మృతికి నా జోహార్లు. నాశేష జీవితం వారు నిర్దేశించిన దిశలోనే కానసాగుతుంది.

రావి నారాయణ రెడ్డిగారి శత జయంతి ఉత్సవాలు (1908-2008) సముచితంగా నిర్వహించాలని శతజయంతి ఉత్సవ కమిటీ తీర్మానించింది. వారి స్వంత జిల్లా నల్లగొండలో ది. 13.06.2008న అత్యంత వైభవంగా అన్ని రాజకీయ పక్షాల నాయకులు అర్పించిన జోహార్ల వాతావరణంలో సభ జరిగింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో 'రావి'గారి కాంశ్య విగ్రహాన్ని ప్రతిష్టించాలని, మరెన్నో సంస్మరణ చర్యలను చేపట్టాలని వేలాది అభిమానుల కరతాళధ్వనుల మధ్య స్థానిక ఎం.పి. సురవరం సుధాకర రెడ్డి, రాష్ట్ర హోం శాఖామాత్యులు కుందూరి జానారెడ్డి గారలు ప్రకటించారు. తెలంగాణా రైతాంగ సాయుధ విప్లవ పోరాటాలకు పోతుగడ్డగా నిలచిన నల్లగొండలో ఉన్నత స్థాయికి చెందిన దేశభక్తునికి సమోన్నత సంస్మరణ, నీరాజనం జరగడం కూడా చరిత్రాత్మకం. ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఆరంభించడానికి, జ్యోతి ప్రజ్వలన గౌరవాన్ని నాకు అందించిన అక్కడి శతజయంతి ఉత్సవ కార్యవర్గానికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

# చండ్ర రాజేశ్వరరావు

అతనొక సామాన్యుడు, మాన్యుడు. లక్ష్యశుద్ధి సంకల్ప బలం గల దీక్షాదక్షతల మేలు కలయిక. దరహాసం, మందహాసం కల్గిన ముఖకవళిక. మహాబలుడుగా అగుపించే మృదుమధుర పలుకుల మంచి మనిషి, ఉత్తమ స్నేహితుడు, ఉన్నతమైన నాయకుడు. ఇరువదవ శతాబ్ది ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రధానమైనది మార్క్సిజం, పుట్టుక పందొమ్మిదవ శతాబ్దపు ఉత్తరార్ధ భాగంలో నైనప్పటికి ఇరువదవ శతాబ్దంలో అది ప్రపంచ వ్యాపితమైపోయింది. మానవ హక్కుల సాధన, రాచరిక శక్తుల కబంధ హస్తాల నుండి విమోచనా సామ్రాజ్య వాద ఉక్కు పాదాల క్రింద నలిగి నశించిపోయిన ప్రజలు నిర్మించిన మహోజ్వల స్వాతంత్రోద్యమాలకు మార్గదర్శకమైనది. మానవ చరిత్రలోనే ప్రప్రథమంగా మానవులందరు సమానులేనను మానవతావాదానికి బీజం వేసింది. విశ్వవ్యాపిత మానవాళి హృదయంలో మానవహక్కుల ప్రాధాన్యతకు సమున్నత స్థానాన్ని సృష్టించింది. ఈ శతాబ్దం 1914-17 రష్యా విప్లవం; 1939-44 రెండవ ప్రపంచ యుద్ధం; 1947 - భారత స్వతంత్రం; 1948 చైనా విప్లవ విజయం, వియత్నాం విమోచన లాంటి మహోద్యమాల విజయ పరంపరలను చూచింది. వీటన్నిటి విజయాలలో మార్క్సిస్టు సిద్ధాంతం ప్రబల చోదక శక్తిగా ఆవిష్కరించబడినది. ఆయా దేశాల సమకాలీన చరిత్రకారుల ఈ సత్యాన్ని సువర్ణాక్షరాలతో లిఖించారు.

భారతదేశంలో 1925లో అంకురార్పణ జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశ ప్రజలను సామ్రాజ్యవాద, ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ, దళారీ పెట్టుబడి దారీ దోపిడీ నుండి శాశ్వతంగా విముక్తి చేయడానికి కంకణ బద్ధమైనది. తన నిర్మాణ బలాన్ని పారిశ్రామిక కేంద్రాల నుండి ఆరంభిస్తూ సంస్థానాధీశులు, భూస్వాముల నిలువుదోపిడీకి నిలయాలైన గ్రామాలలోకి విస్తరింపచేసింది. అనతి కాలంలోనే దక్షిణ భారతం ముఖ్యంగా ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాలలోకి ప్రవేశించింది. అంతవరకే జమిందారీ మొఖాసాదారీ వ్యవస్థలు నైజాం నిరంకుశ జమిందారీ, జాగీర్ధారీ దేశముఖ్‌ల పాలనలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభల నాయకత్వంలో వుద్యమిస్తున్న రైతులను సమరశీల పోరాటాల నిర్మాణానికి ప్రోత్సహించింది. 1930వ దశకంలో రూపొందిన ఈ ప్రజా వెల్లువ కెరటాలే మనం ఈనాడు జోహర్లర్పిస్తున్న అసహాయశూరులు చండ్ర రాజేశ్వర

రావు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొహియుద్దీన్ తదితరులు.

చంద్ర రాజేశ్వర రావు గారిని మరింత సన్నిహితంగా దర్శించుకోవడం ఈనాటి నా ముఖ్య వుద్దేశం. శాస్త్రీయ సమసమాజం వైపు ఆకర్షితుడైన కామ్రేడ్ 'చంద్ర' సహజంగానే ప్రజల సమీకరణ, సంఘటనల ఆవశ్యకతను గుర్తించారు. వుద్యమ విజయానికి సువిశాల ప్రాతిపదికన నిర్మించబడే బలోపేతమైన ప్రజా సంఘటన అనివార్యమని గుర్తించారు. తమ శక్తియుక్తులన్నింటిని పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణంపై కేంద్రీకరించారు. నిర్మాణంలో ఘటికుడని పేరు పొందారు. ఇందులోని రహస్యం ఒకే ఒకటి. ఆయా రంగ సంస్థలలో మెరికలుగా అగుపించే వారిపై తన దృష్టిని సారించేవారు. వ్యక్తిగతంగా ఆ కార్యకర్తలకి సన్నిహితులయ్యేవారు. వ్యక్తిగత సమస్యలతో పాటు కార్యకర్తల శక్తి సామర్థ్యాలను అర్థం చేసికొనేవారు. వారు సాధించిన ప్రతి చిన్న, పెద్ద పురోగతిని హృదయపూర్వకంగా ప్రోత్సహించేవారు. ఆవిధంగా కార్యకర్తలకు ఒక సోదరుడుగా, సహచరుడుగా, ఆ తర్వాతనే నాయకుడుగా తమ స్థానాన్ని సంపాదించుకునేవారు. 1947 సెప్టెంబరు - అక్టోబరు మాసాలలో విజయవాడలో ప్రజాశక్తి నగరంలో నాతో కూర్చుని హైదరాబాద్ సంస్థానంలో అంతవరకు విద్యార్థి వుద్యమం సాధించిన విజయాలపై ఒక రిపోర్టు వ్రాయాలని కోరినారు. వెంటనే ప్రజాశక్తి పత్రికలో ముద్రించి పార్టీ శ్రేణులలో ఉత్సాహాన్ని కల్పించాలని కోరినారు. వారి కోరికను ఆదేశంగా గౌరవిస్తూ ఒక పూట సమయంలో సుదీర్ఘమైన నివేదికను రూపొందించాను. మరోక రాష్ట్ర నాయకుడికి చూపించగా వారు సుమారు 3 వంతుల భాగాన్ని ఏదో ఒక నెపంతో అడ్డం, పొడుగు గీతలతో ఆక్షేపించి తిరిగి రాయమన్నారు. కొంత నిరుత్సాహానికి గురి అయిన నేను మరొక రోజు కష్టపడి నివేదికను రూపొందిచాను. తిరిగి అదేనాయకుడికి చూపెట్టాను. ఈసారి అందులో సగ భాగాన్ని అనవసరమని, అసందర్భమని అడ్డంగా ఆక్షేపించి మళ్లీ వ్రాయమన్నారు. అప్పటికే 3 రోజులు గడిచిపోయినవి. కమ్యూన్‌లో భోజనం పూర్తి చేసుకుని బయటికి వస్తున్న చంద్ర దరహాసంతో నన్ను పలకరించి "ఇంకా మీ రిపోర్టు ప్రచురించబడినట్లు లేదు. ఏమిటి కారణం?" అన్నారు. నాలుగు రోజులుగా నడిచిన కథ వినిపించాను. "ఎవరయ్యా నీ వ్రాతలో తప్పులు వెతికినది"అంటూ నేను వ్రాసిన మొదటి నివేదిక తమకిమ్మన్నారు. అప్పుడే, అక్కడే నిలబడి యున్న పత్రికా సంపాదకులు మద్దుకూరి చంద్రశేఖర్ రావు గారి చేతిలో పెట్టి రేపటి పత్రికలో ఈ వ్యాసం ప్రముఖంగా ముద్రించబడాలని ఆదేశించారు. అలానే జరిగింది. తెల్లవారి ఉదయమే అదే కమ్యూన్ ఆవరణలో నాయకులంతా అగుపించారు. అత్యంత ఆనందంతో నా వ్యాసం గురించి నన్ను అభినందించారు చంద్ర. "చాలా బాగుంది. నేను కూడా చూచాను" అన్నారు నాలుగు రోజులు నా వ్యాసానికి అడ్డుతగిలిన మా నాయకుడు. చంద్ర గారి చొరవ కార్యకర్తల

కిచ్చే ప్రోత్సాహం అంతటిది. మరో చిన్న ఘటన. కామ్రేడ్ చంద్ర ఒక సైకిల్ రిక్షాలో వచ్చి ప్రజాశక్తి నగరం ముఖద్వారం ముందు దిగినారు. ఆ రిక్షా కార్మికుడితో అతని గ్రామం, దినసరి ఆదాయం, ఎదుర్కొంటున్న సమస్యల గురించి 10 ని॥ల వరకు మాట్లాడుతూ నిలబడియుండడాన్ని ఆ పక్కనే నిలుచున్న నేను అత్యంత ఆసక్తితో గమనించాను. ఆశ్చర్యపోయాను. ఆ కార్మికుడి పేరు, చిరునామా వ్రాసుకుని ప్రజాశక్తి నగరంలో నివసించే ఒక కార్మిక నాయకుడికి అంద చేయడాన్ని గమనించాను. రిక్షా కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడానికి ఒక రాష్ట్ర స్థాయి, కేంద్ర స్థాయి నాయకుడు పడుతున్న పాట్లు నాలో వారి పట్ల అమోఘమైన భక్తి విశ్వాస భావాన్ని కల్పించింది. తదాది చంద్ర పట్ల నా భక్తి భావం, పితృ సమాన భావం చివరి వరకు కొనసాగింది.

1947 నుండి ప్రారంభమై 1951 చివరి వరకు కొనసాగిన హైద్రాబాద్ సంస్థాన విమోచన వుద్యమం, తెలంగాణా రైతాంగ సాయుధ తిరుగుబాటు వుద్యమాలలో చంద్ర రాజేశ్వర రావు గారి పాత్ర అత్యంత కీలకమైనది. పార్టీ నిర్మాణంతో పాటు సాయుధ దళ సభ్యుల ఎన్నిక, శిక్షణ, రాజకీయ అవగాహన కల్పన అంశాలలో వారి పాత్ర అద్వితీయం. 1948 సెప్టెంబరు 17 తర్వాత సాయుధ పోరాటాన్ని కొనసాగించే అంశంపై పార్టీలో బలమైన భిన్నాభిప్రాయాలు చోటుచేసుకున్నవి. అనేక సందర్భాలలో పార్టీ ఐక్యతను అసలు ఉనికినే సవాలు చేసే సంఘటనలు సంభవించినవి. అంతటి క్లిష్ట పరిస్థితులలో విభిన్న అభిప్రాయాలు కల నాయకులు, కార్యకర్తలతో వారు అనుసరించిన ప్రవర్తన, సహనశీలత పార్టీని కాపాడుకోవడంలో ఎంతగానో తోడ్పడింది. అనతి కాలంలోనే వాస్తవాన్ని గ్రహించిన చంద్ర సాయుధ పోరాటం నుండి వెనకడుగు వేయవలసిన ఎత్తుగడలను చేపట్టారు. వేలాది కార్యకర్తల ప్రాణ రక్షణ ప్రధమ కర్తవ్యంగా భావించి క్రమానుగతంగా పోరాట విరమణ ప్రక్రియకు కూడా నాయకత్వం వహించారు. అతి తక్కువ నష్టంతో పార్టీని, ప్రజా సంఘాలను పరిరక్షించుకోవడానికి అహర్నిశలు కృషి చేసారు. ఒక పరిస్థితిలో మడమ తిప్పకుండా పోరాడమని ఉద్బోధించిన నేత మరో పరిస్థితిలో అదే సైనికులకు వెనకడుగు వేసే విద్యను అంతే పట్టుదలతో నేర్పడం ఆయన స్వంతం. కొన్ని సందర్భాలలో మూర్ఖత్వం, మొండితనంతో అడ్డుకున్న వారిని మందలిస్తూ, ఓర్పుతో వారిని దారికి తెచ్చిన తీరుతెన్నులు విప్లవోద్యమాలకు అరుదైన గుణపాఠాలుగా గుర్తించబడినవి. 1952లో ఆ తర్వాత ఆంధ్రప్రాంతంలో 1955లో, తిరిగి తెలంగాణాలో 1957 ఎన్నికలలో పార్టీ ఘన విజయాలు సాధించింది. తెలుగు ప్రజలు కమ్యూనిస్టులకు వారి సాహసోపేత చర్యలు, త్యాగాల పట్ల తమ సంతృప్తిని ప్రకటించారు. ఈ విజయాలను సోపానంగా మలుచుకుని తిరిగి కార్మిక, రైతు వుద్యమాలకు పార్టీని అంకితం చేయడంలో చంద్ర రాజేశ్వర రావుగారు చేసిన అవిరళ కృషి అందరినీ ఆకట్టుకున్నది. తమ నిర్మాణ దక్షతను మారిన పరిస్థితులకు అనుగుణంగా మలుచుకుంటూ గ్రామస్థాయి నుండి పార్లమెంటు వరకు అనుసరించదగిన నూతన

వ్యూహం, ఎత్తుగడల గురించి అత్యంత సూక్ష్మంగా అధ్యయనం చేస్తూ సంబంధిత నాయకులు, కార్యకర్తలకు పాఠాలు నేర్పినట్లుగా ప్రభోదం చేసేవారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శిగా, ఆంధ్ర తెలంగాణా ప్రాంత కార్మిక రైతు వుద్యమాలను పట్టాలపైకెక్కించారు. 1967లో నేను రెండవసారి అంధ్రప్రదేశ్ శాసన సభకు గెలిచి సి.పి.ఐ. శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నుకోబడినాను.

1956లోనే ప్రత్యేక తెలంగాణా నినాదంతో ఆంధ్రప్రదేశ్ అవతరణను వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు 1969లో తిరిగి ప్రత్యేక తెలంగాణా వుద్యమాన్ని లేవనెత్తారు. కీ॥శే॥ మర్రి చెన్నారెడ్డి గారు దీనికి నాయకులు. వేలాది తెలంగాణా యువతీ యువకులు, మేధావులు ఈ మహోద్యమములో పాల్గొన్నారు. గడచిన 12 సం॥లలో సమైక్యాంధ్రలో తమకు తీరని అన్యాయం జరిగిందని ప్రతి సం॥ తెలంగాణా మిగుల ఆదాయం ఆంధ్ర ప్రాంతంలో వెచ్చించబడిందని, ఉద్యోగాల నియామకం, ప్రమోషన్లలో పెద్ద మనుషుల ఒప్పందానికి భిన్నంగా పక్షపాతం చోటు చేసుకున్నదని వివిధ రంగాలలో తెలంగాణా అభివృద్ధి కుంటుపడిపోయిందని వీరి వాదన. ఈ వుద్యమం మితిమీరుతున్న సమయంలో ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీగారు పరష్కార మార్గాన్ని కనుగొనడానికి ప్రయత్నించారు. ఇతర శాసన సభాపక్ష నాయకులతో పాటు సి.పి.ఐ. శాసనసభా పక్ష నాయకుడుగా నన్నుకూడా ఢిల్లీకి ఆహ్వానించారు. ఢిల్లీ వెళ్లక ముందు రాష్ట్ర పార్టీ కార్యదర్శి గారైన చంద్ర గారితో సుదీర్ఘంగా చర్చించాను. ప్రత్యేక తెలంగాణా వాదుల వాదనలలో ఉన్న సత్యాన్ని అంకెల ఆధారంగా విడమరచి చెప్పాను. సమైక్యతను నమ్మిన పార్టీ తరపున ప్రధాని ముందు ఎలా వాదించాలో సలహా చెప్పవలసిందిగా కోరినాను. అప్పటికే అవగాహన కలిగిన చంద్ర నేనందించిన వివరాలను చూచి కాంగ్రెస్ పరిపాలన నిర్వాకం వలన ఏర్పడిన పరిస్థితులను రాజకీయంగా ఎలా పరిష్కరించాలో సూచించారు. ఈ సత్యాలను దాపరికం లేకుండా ప్రధాని ముందు పెట్టమన్నారు. 10 సం॥ల సుదీర్ఘ కాలంలో తెలంగాణలోని వెనకబడిన తనాన్ని సరిచేసే ప్రయత్నం కూడా చేయలేని బాధ్యత కాంగ్రెస్ పార్టీదేనని నిర్మోహమాటంగా చెప్పమన్నారు. రాజకీయ లబ్ధి కొరకు తెలంగాణా ప్రజల భావోద్రేకాన్ని రెచ్చగొట్టుచున్న కాంగ్రెస్ నాయకులను నియంత్రించే బాధ్యతలను తక్షణమే ప్రధాని చేపట్టాలని కోరమని సలహాలిచ్చారు. అలాగే తెల్లవారి అరగంట పాటు ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఏకాంతంగా చర్చించి పార్టీ తరుపున ప్రాతినిద్యం వహించడం జరిగింది. ఆ మరునాడే ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో వచ్చిన ప్రధాని విమానాశ్రయంలోనే  పార్టీ సమావేశాన్ని నిర్వహించి ముఖ్యమంత్రిగా నున్న కీ॥శే॥ కాసు బ్రహ్మానంద రెడ్డి గారి స్థానంలో తెలంగాణా నివాసి అయిన కీ॥శే॥ పి.వి. నరసింహరావు గారిని ముఖ్యమంత్రిగా నియమించారు. డా॥ చెన్నారెడ్డి గారిని ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా నియామకం చేశారు. వుద్యమ కారులను అణచివేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. తెలంగాణాకు జరిగిన అన్యాయాలను సరిచేసే

పని యధాపూర్వం కొనసాగింది. జై ఆంధ్ర ఉద్యమం ఫలితంగా అంతవరకు నామమాత్రంగానైనా పనిచేసిన ముల్కీ నిబంధనలు, తెలంగాణ ప్రాంతీయ కమిటీలు రద్దు చేయబడినవి. ఫలితంగా ప్రాంతాల వారి లెక్కలను విడివిడిగా చూపించవలసిన బాధ్యత కాని, ఉద్యోగాల నియామకంలో ప్రాంతాల వారీ లెక్కలు చూపవలసిన అగత్యం కాని రాష్ట్ర ప్రభుత్వానికి లేకుండా పోయింది. దీనిని పలు సందర్భాలలో భారత కమ్యూనిస్టు పార్టీ శాసన సభా వేదికతో పాటు అనేక సందర్భాలలో ఖండించడం జరిగింది. తెలంగాణా అభివృద్ధి పట్ల ఏలాంటి సాచివేత ధోరణి పనికిరాదని, అది రాష్ట్ర సమైక్యత పరిరక్షణకి ప్రమాదమని హెచ్చరించడం కూడా జరిగింది. ఈ విషయంలో చంద్ర రాజేశ్వర రావుగారు అడుగడుగునా ఆందోళన చెందుతూ పార్టీని జాగ్రత్త పరుస్తూ వుండడం మా అందరికీ మధుర స్మృతులు.

రైతు సమస్యలపై వారికున్న అవగాహన మా అందరికీ గొప్ప ప్రోత్సహం. రైతు నాయకుడు వై.వి. కృష్ణారావు గారితో కలిసి కొన్ని దశాబ్దాలు జిల్లా, రాష్ట్ర రైతు సంఘాల కార్యదర్శి, అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే అదృష్టం నాకు కలిగింది. మాతో మాట్లాడే ప్రతి సందర్భంలో ఈ దేశంలోనే రైతు వుద్యమాల ప్రాధాన్యతను నొక్కి చెప్పేవారు. అదే సందర్భంలో రాష్ట్ర, కేంద్ర పార్టీ నాయకత్వంలో రైతు వుద్యమం పట్ల, ప్రత్యేకంగా రైతులకు గిట్టుబాటు ధరల పట్ల చిన్నచూపు వున్నట్లు కూడా చెప్పేవారు. ఈ బలహీనతకు మూలం మనది పారిశ్రామిక కార్మిక వర్గ పార్టీ మాత్రమేననే దురభిప్రాయమని చెప్పేవారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో వారి పరోక్ష ప్రోత్సాహంతో ప్రవేశపెట్టబడిన "రైతులకు గిట్టుబాటు ధరల" తీర్మానాలు నెగ్గక పోవడం లేక చర్చలోకే రాకపోవడం యాధృచ్ఛికం కాదు. ఆ తర్వాత చాలా కాలం తర్వాత పార్టీకి రైతు సమస్యలపై వాస్తవమైన అవగాహన కలుగుతున్నట్లు తెలిసికుంటూ సంతోషించేవారు. ఈ పరిణామంలో చంద్ర గారి పాత్ర ప్రశంసనీయం. నేను 1957 రెండవ శాసన సభ మొదలుకొని చాలా సం॥లు పార్టీ శాసనసభా పక్ష నాయకునిగా పనిచేయడం జరిగింది. శాసనసభలో పార్టీ ప్రతినిధిగా నేను అధికార పక్షాన్ని విమర్శిస్తూ చేసిన ప్రసంగాలు పార్టీకి నాకు వ్యక్తిగతంగా మంచి పేరు సంపాదించినవి. పాత్రికేయులు నా ప్రసంగాలను ఎత్తిచూపే సందర్భంలో నాపేరు చంద్ర రాజేశ్వర రావుగా ఉటంకించేవారు. ఇది ఒకనాడు ఏదో ఒక పత్రికలో దొరలిన పొరపాటు కాదు. దాదాపు ప్రతి సందర్భంలో నా పేరుకు ముందు "చంద్ర"అను ఇంటి పేరు చూస్తూ సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యేవాడిని. ఢిల్లీలో అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నున్న చంద్ర రాజేశ్వర రావుగారు ఒకరోజు టెలిగ్రాం ద్వారా శాసనసభలో నేను చేసిన ఒకానొక ఉపన్యాసాన్ని మెచ్చుకుంటూ నాకు ధన్యవాదాలు తెలియచేసారు. వారు హైదరాబాద్ వచ్చిన ఒక సందర్భంలో వారికి కృతజ్ఞతలు తెలియచేయడానికి వారిని కలిసాను. నన్ను చూడగానే "ఈ పత్రికల వారు మీ పేరుకు ముందు "చెన్నమనేని"కి బదులు "చంద్ర"అని వ్రాస్తూ వుండడం మీకు ఇబ్బందికరంగా

లేదా వారెందుకు సవరించుకోవడం లేదు'' అని నవ్వుతూ అన్నారు. ''నాకైతే సంతోషంగా వుంది అన్నాను'' నేను. నవ్వుకున్నాం. భావ సమైక్యత కార్యదక్షత మా సాన్నిహిత్యానికి తోడ్పడుతున్నందకు సంతోషించాను.

భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా చాలా కాలం పని చేసిన నాకు కామ్రేడ్ చంద్ర స్వాతంత్ర సమరయోధుల అఖిల భారత విభాగంలో సభ్యునిగా నామకరణం చేసారు. చాలా సందర్భాలలో దేశంలోని వివిధ రాష్ట్రాలలో స్వాతంత్ర సమరయోధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేసే ప్రత్యేక సౌకర్యాల గురించి అవగాహన కలిగించుకునే అవకాశం కలిగింది. ఆంధ్రరాష్ట్రంలో స్వాతంత్ర సమరయోధుల సమస్య గురించి పెద్దలు రావి నారాయణ రెడ్డి గారితో కలిసి చర్చిస్తూ పనిచేసే సదవకాశం కలిగింది. వందలాది స్వాతంత్ర సమరయోధులైన వివిధ శ్రేణులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రోత్సహించి వారికి రాష్ట్రం మరియు కేంద్రం పెన్షన్లు మంజూరు చేయించే చక్కని ఉపకారాన్ని అందించే అదృష్టం కలిగింది. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి స్వాతంత్ర సమరయోధులకు వారి వృద్ధాప్యంలో తగిన తోడ్పటు సమకూర్చే సదవకాశం నాకు కల్పించినందుకు సంబంధిత నాయకగణానికి సదా నా కృతజ్ఞతలు. రావి నారాయణ రెడ్డి గారు అధ్యక్షులుగా, నేను ప్రధాన కార్యదర్శిగా తెలంగాణా అమర వీరుల స్మారక ట్రస్టును ఏర్పాటుచేసి 4 వేల మంది అమరవీరుల శాశ్వత సంస్మరణ కేంద్రాన్ని నెలకొల్పడం నా జీవితంలోనే గొప్ప అవకాశంగా సంతృప్తి పొందుచున్నాను. ఈ సందర్భంగా చంద్ర రాజేశ్వర రావు గార్కి కూడా చిన్న సహాయాన్ని అందించిన సంతృప్తిని చదువరులతో పంచుకోవడం నాకు సంతోషదాయకం.స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ పథకం ప్రారంభదశలోనే పార్టీ ప్రధాన కార్యదర్శిగా నున్న చంద్ర రాజేశ్వర రావు గార్కి స్వయంగా ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీగారు పెన్షన్ పత్రాలపై సంతకాలు పెట్టమని కోరినారు. చంద్రతో పాటు కీ॥శే॥ మార్క్సిస్టు పార్టీ నాయకులు నంబూద్రిపాద్ స్థాయి నాయకులకు ప్రభుత్వం స్వయంగా ఇటువంటి ప్రతిపాదనలు అందచేసింది. చంద్ర ప్రధానికి తమ కృతజ్ఞతలు తెలియచేస్తూ ఆ పత్రాలపై ''ప్రస్తుతానికి నాకు అవసరం లేదు'' అని వ్రాస్తూ సంతకం చేసారు. దీనితో వారికి పెన్షన్‌తో ప్రమేయం లేనట్లుగా కేంద్ర హోంశాఖ ఆ పత్రాన్ని ప్రక్కన పెట్టింది. కొన్ని సం॥ల తర్వాత ఢిల్లీ పదవీ బాధ్యతలను వదులుకుని హైద్రాబాద్‌లోని పార్టీ కార్యాలయం మఖ్దూం భవన్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అదువరకే వారి ధర్మపత్ని శ్రీమతి సావిత్రమ్మగారు అస్వస్థతతో అదే భవనంలో బహుబాధలు అనుభవిస్తూ వుండడం మాకందరికీ బాధాకర దృశ్యం. చంద్ర గారికి కూడా ఆరోగ్యం ఎక్కువ కాలం సహకరించలేదు. తమ సహధర్మచారిణికి సేవలనందిస్తూ పార్టీ మిత్రులతో కాలక్షేపం చేసేవారు. వైద్యం కొరకు వారికి ఆర్థిక సహాయం అవసరమైంది. కేంద్రంనుండి అనాడు వదిలిపెట్టిన పెన్షన్‌ను తిరిగి

సాధించుకోవడం సాధ్యమేనా? అని నాతో సూచన ప్రాయంగా అడిగారు. నేను ఢిల్లీ వెళ్ళినప్పుడు అక్కడి అధికారులతో సంప్రదించగా వారి కాగితాలు వెదికి చూచి తిరిగి వారు కోరినట్లయితే పెన్షన్ వెంటనే మంజూరీ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా వుంటుందని చెప్పారు. ఆ విధంగా వారితో కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరం వ్రాయించి పెన్షన్ సాధించడంలో కృతకృత్యులం కావడం సంతోషకరం. తమ జీవిత కాలంలో సిద్ధాంతపరంగా ఆచరణలో కూడా చేసిన మంచి పనులతో పాటు దొరలిన పొరపాట్ల గురించి నిస్సంకోచంగా అభిప్రాయాలను పంచుకునేవారు. వాటి గుణపాఠాల గురించి ఆత్మ విమర్శనా పూర్వకంగా సహచరులకు చెప్పేవారు. ఒక రోజు కీ॥శే॥ రావి నారాయణ రెడ్డి గారి జీవిత చరిత్ర గురించి నాతో చర్చిస్తూ మనం మన ఆత్మ కథలను ఎలా వ్రాయాలో ఆసక్తిదాయకంగా వివరించారు. మన ఆత్మకథ మన జీవితంలోని అనేకానేక అనుభవాలను, అనుభూతులను ఎత్తి చూపెడుతూ ముందు తరాల వారికి ప్రోత్సహకరంగా, మార్గదర్శకంగా వుండే విధంగా రచించాలని తమ అభిప్రాయాన్ని వినమ్రతతో వెలిబుచ్చారు. అభిప్రాయ బేధాలను అనేకానేక వైరుధ్యాలను పై నుదహరించిన లక్ష్య సాధనకు ఉపకరించే విధంగా విడమరచి చెప్పాలని, అవసరమైతే కొన్నింటిని చెప్పకుండా వదిలిపెట్టాలని కూడా అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా మన జీవితం సందేశాత్మకంగా నుండాలని అనవసర, అప్రయోజనకర వివాదాంశాలను అతి జాగ్రత్తగా గుణపాటాలుగా తీర్చిదిద్దాలని మరీమరీ చెప్పారు. సమాజం, ప్రజాస్వామ్యం వాటి పరిణామ క్రమం గురించి సునిశిత జ్ఞానం కలిగిన రాజర్షి, కర్మయోగి ప్రవచనం నన్నెంతో ఆకర్షించింది. యువకుడుగా నున్న నన్ను ఆకర్షించారు. తమ వృద్ధాప్యంలో నాకు గురుతుల్యులయ్యారు.

20వ శతాబ్దం మార్క్సిస్టు సిద్ధాంతంచే పూర్తిగా ప్రభావితమైనది. మార్క్సిజం కరదీపికగా మానవాళి విముక్తికి ప్రబలంగా ఉపయోగపడ్డది. కాలమాన పరిస్థితులతో పాటు మార్క్సిజాన్ని పునరుజ్జీవింప చేసే ప్రయత్న లోపం కారణంగా ఇటీవల సోషలిస్టు వ్యవస్థ అనూహ్యంగా అంతర్గత వైరుధ్యాలలో చిక్కుకుని చతికిలపడిపోతున్నది. ''పెట్టుబడిదారీ వర్గాలు సోషలిజం, కమ్యూనిజం'' సిద్ధాంతాలు ఓడిపోతున్నట్లు చిత్రిస్తున్నాయి. సమ సమాజ స్థాపన ప్రపంచ మానవతా సిద్ధాంత కర్తల దార్శనికత మార్క్సిజం ఈ పరిణామాన్ని వేగవంతం చేయడానికి చేయబడిన బృహత్తర ప్రయత్నం. ప్రపంచ మానవాళి చైతన్యాన్ని పెంచడంలో, మానవ హక్కుల సాధన దిశలో, వుద్యమాలను నిర్మించడంలో కొన్ని అపజయాలు సంభవించినా అనేకానేక విజయాలను సాధించిన మహోన్నత సిద్దాంతం. చంద్ర రాజేశ్వర రావు గారు ఇంతటి సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా ఆచరిస్తూ అంతర్జాతీయ ''ఆర్డర్ ఆఫ్ లెనిన్'' బహుమానాన్ని స్వీకరించిన విప్లవ నాయకుడు. వారి దివ్యస్మృతికి జోహార్లు.

# నూతన పథికుడు - పి.వి.

అగ్రజుడు, సమకాలికులు, స్వాతంత్ర సమరయోధులు అయిన కీ॥శే. పి.వి. గురించి వ్రాయడం ఒక విధంగా బాధాకరం, అయినా అవసరం. అర్ధ శతాబ్దికి మించిన అనుబంధం, హైద్రాబాద్ సంస్థానం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భారతదేశ సమస్యల ముఖ్య సందర్భాలలో పి.వి. అత్యంత కీలక పాత్రను పోషించడం సహచరులందరికీ గర్వకారణం.

వందేమాతర గేయం జాతీయతకి చిహ్నం. నిరంకుశ రాచరిక పరిపాలనలో పౌరహక్కులపై పోరాడే యువతరానికి వందేమాతర గేయం ప్రబల సాధనంగా ఉపకరించింది. ఈ గేయాన్ని కళాశాలలో సమిష్టిగా ఆలపించిన నేరానికి వందలాది ఉస్మానియా విశ్వవిద్యాలయం, వరంగల్ తదితర కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ తమ కళాశాలలనుండి బహిష్కరించబడ్డారు. ఈ బహిష్కరణకు గురి చేయబడిన అత్యధిక విద్యార్థి నాయకులు అనతికాలంలోనే హైద్రాబాద్ సంస్థాన రాజకీయ




*సహచరులు, సన్నిహితులు, మాజీ ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావు గారిని పూలమాలతో సత్కరిస్తున్న చెన్నమనేని*

నాయకులుగా వెలుగులోకి వచ్చారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీ, స్టేట్ కాంగ్రెస్ నాయకులుగా ఎదిగినారు. పివి కాంగ్రెస్ శిబిరంలో ప్రముఖులు. నాగపూర్‌లో తమ విద్య పూర్తిచేసుకుని కీ.శే॥ బూర్గుల రామకృష్ణారావు, అడ్వకేట్‌గారి కార్యాలయంలో జూనియర్ అడ్వకేట్‌గా చేరినారు. సుప్రసిద్ధ రాజకీయవేత్త అయిన బూర్గుల వారి సాన్నిహిత్యం, పి.వి.కి ఉద్యోగ అనుభవంతో పాటు రాజకీయ విజ్ఞానాన్ని అందించింది. నలుబదవ దశాబ్దం హైద్రాబాద్ సంస్థాన విమోచన వుద్యమానికి కీలకం. ఆనాటి యువతరం తమ తమ రాజకీయ రంగాలలో సమరశీల పాత్ర పోషించడం శాంతియుత పౌరహక్కుల పోరాటాల నుండి సంస్థాన విమోచన సాయుధ పోరాటం వరకు నిర్వహించడం జరిగింది. సంస్థాన సరిహద్దులలో స్వతంత్ర భారత భూభాగాలలో సుశిక్షత సాయుధ దళాలను నిర్మిస్తూ సంస్థానములోకి పంపడం శత్రువర్గాలతో విజయవతంగా తలపడడం జరిగింది. మహారాష్ట్ర సరిహద్దునున్న చాందా క్యాంపు కీ.శే॥ కే.వి. నర్సింగరావు గారి ఆధ్వర్యలో నిర్వహించబడ్డది. అందులో ఇతర ప్రముఖులతో పాటు పి.వి. నర్సింహారావు గారి పాత్ర అత్యంత గణనీయమైనది. స్వతంత్రం, ప్రజాతంత్రం గురించి ఆయన చేసిన ప్రసంగాలు వందలాది కార్యకర్తల హృదయాలలో నిష్కల్మష త్యాగపూరిత దేశభక్తిని గూడుకట్టుకునే విధంగా చేసినవి. అదేదిశలో మధ్యప్రదేశ్ సరిహద్దున కాళేశ్వరానికి అటువైపు గోదావరి ఒడ్డునున్న సిరివంచ క్యాంపు బాధ్యతలను నిర్వహించిన నాకు, నా సహచరులకు చాందా క్యాంపుతో అవినాభావ సంబంధం కూడా ఏర్పడింది. ఒకటి కాంగ్రెస్ క్యాంపు కాగా, రెండవది కమ్యూనిస్టు క్యాంపుగా వాడుకలోకి వచ్చింది. కొందరైతే సైనిక శిక్షణ కొరకు రెండవ క్యాంపును ఉపయోగించుకునేవారు. ఇలా హైద్రాబాద్ సంస్థాన సరిహద్దులలో నూటికి మించిన క్యాంపులు వెలిసినవి. పోలీస్ యాక్షన్ 15 ఆగస్టు 1947 నుండి 17 సెప్టెంబర్ 1948 వరకు 13 మాసాలలో తెలంగాణ, మరట్వాడ, కర్ణాటక ప్రాంతాలలో ఒక అంతర్యుద్ధాన్ని నిర్వహించడం జరిగింది. తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వంలో మితవాద, అతివాద విభాగాలు ఏర్పడినవి. మితవాద వర్గం రాజీబేరాలతో సమస్యలను పరిష్కరించడం తీవ్రమైన భూసంస్కరణలను వ్యతిరేకించడంలాంటి విధానాలు అనుసరించగా... అతివాద వర్గం ప్రజా ఉద్యమాలకు ప్రాముఖ్యతనిచ్చింది. ఆర్థిక, రాజకీయ సంస్కరణలకు సంసిద్ధతను ప్రకటించింది.

తెలంగాణాలో విస్తృతమైన భూభాగం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిర్మించబడిన రైతాంగ విప్లవోద్యమం ఆనాటి రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలోని అతివాద కాంగ్రెస్ తమ బలాన్ని పుంజుకున్నది. అనర్గళ ఉపన్యాసాలు, సుస్పష్ట తీర్మానాల రచనలలో పి.వి.గారి పాత్ర అనన్యసామాన్యము. అవగాహన లోపాలను, ఆలోచనల అస్పష్టతని తొలగిస్తూ స్పష్టత, సుస్పష్టతను అందించగలిచే సమర్థుడుగా పి.వి. పరిగణించడేవారు.

1957లో ప్రథమంగా కరీంనగరం జిల్లా మంథని నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా పి.వి. ఎన్నుకోబడినారు. నేను చొప్పదండి నియోజకవర్గం నుండి ఎన్నుకోబడ్డాను. తదాధి శాసనసభ వేదికపై విభిన్న పార్టీల నాయకులమైనప్పటికి సుహృద్భావంతో అనుభవాలను పంచుకునే అదృష్టం కలిగింది. వివిధ అఖిల పక్ష కమిటీలలో ఉమ్మడి కృషితో నివేదికలను రూపొందించిన సందర్భాల జ్ఞాపకం సంతోషదాయకం. కీ.శే॥ బ్రహ్మానందరెడ్డి గారు అనేక పర్యాయాలు ఉపసంఘంలో మా పార్టీ తరపున మా బృహస్పతి వుంటాడు అని నవ్వుతూ నాతో అనేవారు. నిజంగా ఆయన బుద్ధికి బృహస్పతి. ఆయనతో కలిసి పనిచేయడం ఒక సృజనాత్మక సన్నివేశం. ఆయన రాష్ట్ర సమైక్యతావాది. రెండు భయానక వేర్పాటు వాద దుమారాలను ఎదిరించిన వజ్ర సంకల్పం కలిగిన స్రష్ట. సామాజికంగా, ఆర్థికంగా మౌళిక మార్పులకు దోహదం చేసిన భూసంస్కరణల చట్టాన్ని రూపొందించి దాని ఆచరణలో ఏర్పడే ఆటంకాలను ఊహించి అరికట్టే నిబంధనలను తయారుచేయించిన సమర్థుడు. అయితే అసలు సంస్కరణలు, భూసంస్కరణలు పట్టని, గిట్టని నాయకులు మంత్రుల మధ్య ఆయన అనుభవించిన ఆటుపోట్లు అనేకం. పి.వి. అత్యంత సంయమనం, సహనం ప్రదర్శిస్తూ తన ఉనికిని పదిలం చేసుకోకతప్పలేదు. ఆయన సాత్వికత కాలక్రమంగా తనలోని శక్తి, సామర్థ్యాలను ప్రజాపయోగంలోకి తేవడానికి మంచి అవకాశలను అందించింది. ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరుస్తూ తనదైన ప్రత్యేక ముద్రను వేయగలిగినాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆ తర్వాత వివిధ కేంద్ర మంత్రిత్వశాఖాలను నిర్వహించిన పి.వి. ఒక విజ్ఞుడిగా, ప్రతిభాశాలిగా దేశంలోనే రాణించారు. కీ.శే॥ త్యాగధనులు, భారత ప్రధానులు తల్లి తనయులైన శ్రీమతి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల జీవితచరిత్రలలో పి.వి. పాత్ర కీలకం.

1980వ దశకం ఉత్తరార్ధ భాగం, ముఖ్యంగా చివరి సంవత్సరాలు ఆయన జీవితంలో ఒక ప్రత్యేక మలుపును చూపెట్టినవి. దీర్ఘకాల పరిశ్రమ, శారీరక అలసట, కొంత అనారోగ్యం, విశ్రాంతి పొందాలనే అభిప్రాయానికి దారితీసినవి. కీ.శే॥ కె.వి. బంధువుల పెళ్లి సందర్భంగా చాలా సమయం పక్కపక్కన కూర్చొని, గడిచిన దశాబ్దపు రాజకీయ పరిణామాల గురించి నేను, ఆయన మాట్లాడుకునే అవకాశం కలిగింది. సోవియట్ యూనియన్ అస్తమయం ఏకధృవ ప్రపంచ అవతరణ, చైనాలో దినదిన ప్రవర్ధమానం పొందుతున్న సంస్కరణల పర్వం మా చర్చనీయాంశాలు. ఈ పరిణామాలన్నింటి గురించి ఆయన వెలుబుచ్చిన, అభిప్రాయాలు నాకు ఆమోదయోగ్యం కావడం సంతృప్తికరం. అనతికాలంలోనే ఈ అనుభవాలు ప్రపంచవ్యాపిత అనుభవాలుగా వెలుగులోకి రావడం రాజకీయ విజ్ఞాన నిధికే నూతన విలువలను సంతరింపచేసింది. ఆనాడు పి.వి. ఇక ముందు క్రియాశీల రాజకీయాల నుండి దూరంగా వుంటూ విశ్రాంతితో నుండాలనే తన నిర్ణయాన్ని స్పష్టంచేశారు. కొలది రోజులలోనే యువప్రధానిగా వెలుగొందిన ప్రధాని రాజీవ్‌గాంధీ యల్.టి.టి.ఈ. తీవ్రవాదులచే దుర్మరణం పొందడం

దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. యావత్ భారతం దుఃఖసముద్రంలో మునిగిపోయింది. ప్రత్యామ్నాయ నాయకత్వం కొరకు రాజనీతిజ్ఞులు తమ మేధాశక్తిని ఉపయోగించారు. అనూహ్యంగా ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని పూరించ సంకల్పించారు. అందరికళ్ళు పి.వి. వైపు మళ్లినవి. విశ్రాంతి ఆలోచనలో నున్న పి.వి.కి అవిశ్రాంత కార్యభార బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది. అటు దేశ ఆర్థిక పరిస్థితి నికృష్టముగా పరిణమించింది. ప్రభుత్వ నిత్యకర్తవ్య నిర్వహణకు, టన్నుల కొలది బంగారు నిల్వలను తాకట్టు పెట్టుకోవలసి వచ్చింది. అంతటి రాజకీయ, ఆర్థిక సంక్లిష్ట పరిస్థితులలో ప్రధాని పీఠాన్ని అలంకరించిన పి.వి. కేవలం తన మనోబలం, సంకల్పబలంపై ఆధారపడడం జరిగింది. సుప్రసిద్ధ అర్థశాస్త్రవేత్త, ప్రస్తుత ప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్ గారిని తన ఆర్థికమంత్రిగా నియమించి సమస్యలను ఎదుర్కొనే మార్గాంతరాన్ని అన్వేషించడం జరిగింది. రాజీవ్‌గాంధీ యువ ప్రధానిగా ఆర్థిక రాజకీయ సంస్కరణల ద్వారా దేశ చరిత్రలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాలని తహతహలాడేవారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ ప్రజల ప్రయోజనాలకు భంగం కలగకుండా అవసరమైన మేరకు సరళీకరణ, ప్రయివేటీకరణ ప్రక్రియలను చేపట్టడం అనివార్యముగా భావించడం జరిగింది. రష్యా, చైనాలో వచ్చిన మౌళికమైన మార్పుల నుండి గుణపాఠాలను రాబట్టుకుంటున్న పి.వి., మన్మోహన్ సింగ్‌లకి ఈ క్లిష్ట పరిస్థితి ఒక మంచి అవకాశంగా దొరికింది. అపూర్వ ధైర్యసాహసాలతో ఆర్థిక సంస్కరణల చర్యలను చేపట్టారు. ఫలితంగా ఇంతకాలం 3-4 శాతంగా నుండిన సగటు జాతీయోత్పత్తి ఇతోధికంగా పెరగడం జరిగింది. ఉత్పత్తి సాధనాల సముపార్జన, ఎగుమతి ప్రధాన వాణిజ్య వ్యాపార సరళీకరణ చోటుచేసుకున్నవి. పి.వి. ప్రధానిగా నిరాటంకంగా 5 సం॥ల కాలం పూర్తి చేసుకోవడంతో పాటు దేశ ఆర్థిక పరిస్థితిని చెప్పుకోదగిన విధంగా సుస్థిరం చేసుకోవడం జరిగింది. విదేశీ నిల్వలను గణనీయంగా పెంచుకోవడం కూడా జరుగుచున్నది. చిరకాల ఆర్థిక దౌర్భల్యానికి గల కారణాలను తెలుసుకోవడం వాటి నివారణోపాయాలను సక్రమంగా చేపట్టడం జరిగింది. ఈ తర్వాతనే దేశానికి ఒక దిశ నిర్దేశించుకోవడం జరిగింది. ఈ మధ్య ఎన్ని రాజకీయ ఒడిదుడుకులు ఏర్పడినా కేవలం 3-4 శాతం కంటే ఏనాడు మించని జాతీయ సగటు ఉత్పత్తి ఈనాడు సగటున 7 శాతానికి మించిపోడం యాదృశ్చికం కాదు. ఆర్థిక, పరిజ్ఞాన ఆచరణల ఫలం దీనిని ఇంకా వేగవంతం చేయడం మానవీయ ధృక్కోణంలో అభివృద్ధిని మానవ అభ్యుదయంగా మలుచుకోవడం జాతి కర్తవ్యం. ఇంతటి ఘనకీర్తిని సాధించిన ప్రియతమ పి.వి. మరికొంత కాలం తమ కృషి ఫలితాలను చూచి ఆనందించలేకపోవడం దురదృష్టకరం. వారి మిత్ర గణానికి అత్యంత విచారకరం. ఆయన దివ్యస్మృతి స్ఫూర్తిదాయకం.

# పరిణత ప్రతిభ - పి.వి.

సాత్వికతగుణ సంపన్నులు, సహనశీలి, విజ్ఞాననిధి, అభిమాన మిత్రులు శ్రీ పి.వి. నరసింహారావు గారి గౌరవ పురస్కార ప్రధాన ఉత్సవ జ్ఞాపికలో ఈ చిరువ్యాసం రాస్తూ ఎంతో ఆనందిస్తున్నాను. వారు నాకంటే రెండు సంవత్సరాలు పెద్ద. అగ్రజుడు. మా మధ్య అర్ధ శతాబ్ద అనుబంధం. గమ్యం ఒకటే అయినా గమనం విభిన్నం. అయినా చెక్కుచెదరని అభిమానం, స్నేహం, పరస్పర సద్భావం, సదవగాహనలు దీనికి మూలం. రాజకీయ సంస్కృతీ సంప్రదాయాలకు, ప్రజాస్వామ్యానికి ఇటువంటి ఆత్మానుసంధానం ప్రాణప్రదం. జ్ఞానం ఏకత్వాన్ని సృష్టిస్తే అజ్ఞానం అనేకత్వాన్ని సృష్టిస్తుంది. ఇది మా అనుభవం.

వందేమాతర గేయం బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమై భారతదేశ స్వాతంత్ర్య దేశభక్తి గేయంగా ఆవిర్భవించింది. నైజాం పాలనకు వ్యతిరేకంగా అంకురార్పణ జరిగి రాజకీయ చైతన్యాన్ని సృష్టించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హిందూ ముస్లిం విద్యార్థులు వేరువేరుగా నీతి నియమ పాఠాలు నేర్చుకోవలసివచ్చింది. ముస్లిం విద్యార్థులు దీన్యాత్ తరగతిలో తమ మత ప్రబోధం నేర్చుకోగా హిందూ విద్యార్థులు తమ తరగతులలో నీతి నియమాలతో పాటు వందేమాతర గేయాన్ని ఆలపించేవారు. భారతదేశ రాజకీయ చైతన్య స్రవంతిలో ఈ గేయానికున్న ప్రాధాన్యతను గమనించిన నైజాం ప్రభుత్వం ఈ గేయ పఠనాన్ని నిషేధించింది. దానికితోడు కళాశాల విద్యార్థులు నిర్బంధంగా నల్లని షేర్వానీలు ధరించాలని ఆజ్ఞాపించింది. హిందూ విద్యార్థులు ఈ నిబంధనలు ధిక్కరించారు. సామూహికంగా వందేమాతర గేయాన్ని ఆలపించారు. అధికార్లు మొదలు నోటీసులు జారీ చేసి ఆ తర్వాత మూడు నాలుగు వందలమంది విద్యార్థులను కళాశాలల నుండి బహిష్కరించారు. హైదరాబాద్, వరంగల్, ఔరంగాబాద్, గుల్బర్గా విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ విధంగా బహిష్కరణకు గురయిన విద్యార్థులు నాగపూర్ విశ్వ విద్యాలయం, తదితర కళాశాలలో తమ విద్యలను పూర్తిచేసుకున్నారు. ఈ విద్యార్థులలో అత్యధికులు రాజకీయ చైతన్యం, సామాజిక స్పృహతో తర్వాత జీవితంలో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. అటువంటి ప్రముఖులలో పి.వి. నరసింహారావుగారు ఒకరు. కాంగ్రెస్, కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీల నాయకులలో ఈ చరిత్ర గలవారు ప్రముఖ స్థానాలనలంకరించారు. గాంధీ, నెహ్రూగార్లతో ప్రభావితమైన

పి.వి. సంపూర్ణ గాంధేయవాది, నిష్కళంక దేశభక్తులు, సర్వసంగ పరిత్యాగి స్వామి రామానంద తీర్థగారికి అనుంగు శిష్యులుగా మారినారు. ఫలితంగా రాజకీయం స్వాతంత్ర్య సమరానికే పరిమితంకాక, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారం, సమ సమాజ నిర్మాణ అవగాహనను సంతరించుకున్నది. కాంగ్రెస్ పార్టీ రాజకీయ పొందికలో స్వామీజీ అభ్యుదయ వర్గానికి నాయకులుగా గుర్తింపు సాధించారు. పి.వి. వారికి నమ్మకమైన దక్షత గల సహచరులుగా పనిచేశారు.

9 ఆగస్టు 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి చివరి నోటీసుగా పరిణమించింది. రెండవ ప్రపంచయుద్ధంలో బలహీనపడిన బ్రిటీష్ ప్రభుత్వం వెనుకటిలాగా ప్రజా ఉద్యమాలని అణచగలిగే శక్తిని కోల్పోయింది. దేశ ప్రజలు అత్యంత విశాల ప్రాతిపదికపై సమరశీల ఉద్యమాలను నిర్వహించారు. 1946 - 47 నాటికి విద్యార్థి, యువతీ యువకులు, మేధావి వర్గం, చివరకు సైనికులు - పోలీసులు స్వాతంత్ర్యం కొరకు నిర్భయంగా రంగప్రవేశం చేశారు. బ్రిటీష్ సామాజిక పునాదులు పూర్తిగా కదలిపోయినాయి. గత్యంతరం లేక తమ కుటిల రాజకీయాల ఆధారంగా భారతదేశాన్ని విభజించగలిగారు. 15 ఆగస్టు 1947 నాటికి భారత్, పాకిస్తాన్ దేశాలు స్వతంత్ర్యాన్ని సాధించినవి. హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఈ స్వతంత్రం అసంపూర్ణ స్వంతంత్రంగా మిగిలింది. సంస్థానాధిపతి నైజాం తన సంస్థానం భారతదేశంలో విలీనం కాదని, స్వతంత్ర దేశంగా వుంటుందని ప్రకటించాడు. ముస్లిం మతతత్వశక్తుల బలంతో సంస్థాన ప్రజల ఉద్యమాన్ని అణచివేయాలని నిశ్చయించుకున్నాడు. తన పోలీసులు బలగాలతో పాటు వేలది ముస్లిం యువకులను సాయుధులు చేసి 'రజాకారు' సైన్యాన్ని సిద్ధపరిచాడు. 'ఆంధ్రమహాసభ' సంస్థాన కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో విస్తృతంగా, ఉధృతంగా ప్రజా పోరాటం అంగలు వేసింది. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలనే ఏకైక నినాదంతో ఈ ఐక్య ఉద్యమం నిత్యనూతన విజయాలతో ముందుకుసాగింది. శాంతి యుత పోరాటాలను నిర్దాక్షిణ్యంగా అణచివేసే కిరాతక ప్రభుత్వంతో పోరాడడానికి సంస్థాన సరిహద్దులలో క్యాంపుల నిర్మాణం చేసి, వేలాది యువతీ యువకులను సాయుధపోరాట శిక్షణ ఇవ్వడం జరిగింది. దాదాపు ఒక సంవత్సరం పాటు, ముఖ్యంగా తెలంగాణా జిల్లాల్లో అంతర్యుద్ధం జరిగింది. అనేక క్యాంపులతోపాటు ఉత్తర తెలంగాణాకు చెందిన యువతరం చాందా, బలహర్షా, సిర్వంచ క్యాంపుల ఆధారంగా పోరాడడం జరిగింది. కీ.శే. కె.వి. నరసింగరావుగారు చాందా క్యాంపు అధినేతగా ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆక్యాంపులో శ్రీ. పి.వి.ది అత్యంత కీలకపాత్ర. ఆయుధాల సముపార్జన సరఫరాలాంటి పాత్ర నిర్వహించడం జరిగింది. నేను స్వయంగా వివిధ క్యాంపుల మధ్య సమన్వయ బాధ్యత నిర్వహణతోపాటు సిర్వంచ క్యాంపు నిర్వహణ పని చూచాను. సంస్థాన ప్రజా ఉద్యమాలల్లో, అత్యంత ప్రధానమైన హైదరాబాద్ సంస్థాన

విమోచన ఉద్యమములో సుమారు 4000 మంది ప్రజలు ఆత్మబలిదానం చేశారు. 10 - 15 వేలమంది వివిధ జైళ్ళలో మ్రగ్గిపోగా, 40 - 50 వేలమంది స్త్రీ, పురుషులు నిరంకుశ నైజాం పోలీసులు, సైన్యం, రజాకార్ల దౌర్జన్యాలు, హత్యలు, లూటీలు, గృహదహనాలు, మానభంగాలకు బలి అయ్యారు. చివరకు సెప్టెంబరు 13-17, 1948 నాటి, భారత ప్రభుత్వంచే నిర్వహించబడిన పోలీసు చర్య ఫలితంగా సంస్థానం విముక్తి చెందింది. దేశ స్వతంత్రం సంపూర్ణమైంది. తిరిగి విద్యార్థులు, మేధావులు తమ తమ రంగాలలో ప్రవేశించారు. పి.వి. గారు న్యాయవాదిగా సంస్థాన కాంగ్రెస్ ప్రముఖ నాయకులు కీ.శే. బూర్గుల రామకృష్ణారావుగారి వద్ద జూనియర్ అడ్వకేటుగా చేరినారు. అయితే వారిలో చోటుచేసుకున్న రాజకీయ అనుభవం, ప్రజల పట్ల వారి కర్తవ్యభావం, తిరిగి కాంగ్రెస్ రాజకీయాలలోకి ఆకర్షించినవి.

15 ఆగస్టు 1947 నాటి నుండి లా కాలేజి విద్యార్థిగా కళాశాల వదలి రహస్యజీవితం, జైలు జీవితం గడిపిన నేను 1952 ఫిబ్రవరి నాటికి జైలు నుండి విడుదలగావడం జరిగింది. మొదటి సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముమ్మరంగా జరుగుతున్న సమయం. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థులుగా పిడియఫ్ (కమ్యూనిస్టు) తరుపున కీ.శే బద్దం ఎల్లారెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ తరపున శ్రీ పి.వి. గారు, సోషలిస్టు పార్టీ తరపున జె. గౌతమరావు గారు పోటీ చేశారు.

బద్దం ఎల్లారెడ్డి గారు గెలుపొందారు. నేను కరీంనగర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా రైతు ఉద్యమాలలో నిమగ్నమైపోయాను. తరచుగా వివిధ కార్యక్రమాలలో పి.వి.గారితో కలిసి చర్చించడం, పని పంచుకోవడం కూడా జరిగింది. ఫలితంగా వారిపట్ల నాకు ప్రగాఢ అభిమానం, సహచర్యం ఏర్పడినవి. కరీంనగర్‌లో డిగ్రీ కళాశాల స్థాపన ప్రక్రియ ప్రధాన జ్ఞాపిక. ప్రజల నుండి విరాళాలు సేకరించి ప్రారంభించవలసి వచ్చింది. తర్వాత ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. కీ.శే. కె.వి. నరసింగరావుగారు, శ్రీ పి.వి. నరసింహారావుగారు, కీ.శే. వై. హనుమంతరావుగారు, నేను ఈ బాధ్యత నిర్వహించాం. ఆనాటి డిగ్రీ కళాశాలలో మేము సెలక్షన్ కమిటీగా ఎన్నుకున్న సైన్సు లెక్చరర్ శ్రీ విజయరామారావు గారు తర్వాత ఐ.పి.యస్‌లో చేరి పోలీసు అధికారిగా పూర్తికాలం పనిచేసి ఇప్పుడు తెలుగుదేశం పార్టీ మంత్రివర్యులుగా నుండడం మంచి జ్ఞాపకం. రాజకీయ అభిప్రాయ భేదాలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రజాహిత కార్యక్రమాలలో అందరూ కలసి పనిచేసే సత్సాంప్రదాయం కరీంనగర్ జిల్లాయొక్క ప్రత్యేకత. ఈ చక్కని సాంప్రదాయాన్ని ఏర్పాటు చేయడం, పోషించడంలో మాకు పి.వి.గారి తోడ్పాటు ఆదర్శవంతమైనది.

1957లో ప్రప్రథమంగా పి.వి.గారు మంథని నియోజకవర్గం నుండి, నేను చొప్పదండి నుండి గెలిచి శాసనసభ్యులమయ్యాం. 1955లో ఆంధ్రప్రాంతంలో గెలచిన

శాసనసభ్యులతో కలిసి 1962 వరకు పనిచేశాం. వారు వరుసగా మూడు పర్యాయాలు మంథని నియోజకవర్గం నుండి గెలిచారు. నేను 1967, 78, 85, 94లలో సిరిసిల్ల నియోజకవర్గం నుండి గెలిచాను. పి.వి. గారితో కలిసి పది సంవత్సరాలు శాసనసభ్యుడుగా పనిచేసే అవకాశం కలిగింది. అయ్యదేవర కాళేశ్వరరావుగారు స్పీకర్‌గా, నీలం సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఆంధ్రపప్రదేశ్ ప్రథమ శాసనసభ అత్యంత ఆసక్తిదాయకంగా నుండింది. రాయలసీయలో బస్ రూట్ల జాతీయకరణ కేసులో ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి పాత్ర అభ్యంతరకరంగా నవంబర్ 1960లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భావించింది. సంజీవరెడ్డిగారు వెంటనే తమ పదవికి రాజీనామా సమర్పించారు. 1962లో పి.వి.గారు మంత్రిగా నియమించబడినారు. ఆ తర్వాత వరుసగా వివిధ శాఖలు నిర్వహించారు. కీ.శే. బ్రహ్మానందరెడ్డిగారి నాయకత్వంలోని మంత్రవర్గంలో పి.వి.గారి పాత్ర విశిష్టమైనది. రాష్ట్రంలో ఎదురైన అనేక సంక్లిష్ట సమస్యలపై సదవగాహన, పరిష్కార మార్గాల అన్వేషణ, పరిష్కరణల వ్రాతపత్రాల రూపకల్పనలలో పి.వి.గారి విజ్ఞత, ప్రతిభ ప్రశంసనీయమైనవి. ప్రతిపక్షపార్టీ నాయకునిగా అనేక సందర్భాలలో వారితో కలిసి చర్చించి సదవగాహనలు సాధించిన స్ఫూర్తిదాయక జ్ఞాపకాలు అనేకం. చట్టాలను రూపొందించడం, నిబంధనలను తయారుచేయడం ఒక ప్రత్యేక కళ. నివేదికల రూపకల్పనల ప్రక్రియలలో ''మీతోపాటు మా తరపున మా బృహస్పతి ఉంటాడు, చక్కగా పని పూర్తిచేయండి'' అని ఆనాటి ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి గారు శ్రీ పి.వి.ని దృష్టి యందుంచుకొని మాట్లాడితే నేను సంతోషించేవాడ్ని, గర్వ కారణంగా భావించేవాడిని. పి.వి, బ్రహ్మానందరెడ్డి మరియు నాతో ముడిబడియున్న ఒక విచిత్ర సంఘటన గురించి వ్రాయడం సందర్భోచితంగా నుంటుంది.

కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్ష పదవికి, ఇతర పదవులకు ఆ జిల్లా కాంగ్రెస్ గ్రూపులలో విపరీతమైన పోటీ ఏర్పడ్డది. ఎన్నికల నామినేషన్ తేది సమీపిస్తోంది. ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి అభ్యర్థిత్వాల గురించి తమ నిర్ణయాన్ని తేల్చిచెప్పడం లేదు. అభ్యర్థులు, కార్యకర్తలు శాసనసభ ప్రాంగణంలో రోజులపాటు కాలక్షేపం చేస్తున్నారు. తెల్లవారితే నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. పి.వి. గారు జిల్లా ప్రముఖులు, మంత్రివర్యులైనా వారికి ఈ గ్రూపులతో ఏమాత్రం సంబంధంలేదు. ముఖ్యమంత్రి గారు ఉభయ గ్రూపు నాయకులను తమ గదిలోకి పిలిపించి, తాము తన నిర్ణయాన్ని నామినేషన్ చివరి ఘడియవరకు తెలియచేయనని, సమయానికి సీల్డు కవర్‌లో అభ్యర్థుల పేరు వ్రాసి పంపుతానని, అదే ప్రకారం నామినేషన్ వేయవలసిందిగా చెప్పి పంపించివేశారు. ఆ మధ్యాహ్నం శాసనసభలో ముఖ్యమంత్రి గారు ప్రతిపక్ష నాయక స్థానంలో నన్ను చుచి తమ గదికి రమ్మని కబురుచేశారు.

అలాగే వెంటనే వారి గదిలోకి చేరుకున్నాను. వారు వచ్చి మొదలు కాఫీ ఇప్పించారు. ఆ తర్వాత అటెండరును కూడా బయటికి వెళ్ళమని, తలుపులు వేశారు. ఒక కాగితం, కలం నా చేతికి ఇచ్చి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులలో జిల్లా పరిషత్ వివిధ పదవులకు అర్హులైన వారి పేర్లను వ్రాసి తమకిమ్మన్నారు. ఆశ్చర్యపడ్డాను. 'మీ పార్టీవారి పేర్లను నేను వ్రాసి ఇవ్వడం ఏమి విచిత్రం' అన్నాను. 'ఇదిగో రాజేశ్వరరావు! నీ నిష్పక్షపాత గుణంపై నాకు సంపూర్ణ విశ్వాసముంది. త్వరగా వ్రాసి ఇవ్వు' అన్నారు. ముఖ్యమంత్రి గారికి నాపై గల విశ్వాసంపై సంభ్రమాశ్చర్యాలు కలిగినవి. 10 నిముషాలలో వ్రాసి ఇచ్చాను. మూడు పర్యాయాలు పి.వి.నరసింహారావుగారిని మంథని నియోజకవర్గం నుండి గెలిపించి మంచి మనిషిగా పేరుగల్గిన శ్రీ శ్రీనివాసరావుగారిని ఆ జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా, తదనుకూల కార్యకర్తలను వివిధ పదవులకు ప్రతిపాదించి ఇచ్చినాను. ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు యథాతథంగా ఆ పేర్లన్నింటినీ సీల్డుకవర్‌లో పెట్టి ప్రత్యేక దూత ద్వారా సకాలానికి కరీంనగర్ పంపించారు. అందరూ నామినేషన్లు వేసి ఏకగ్రీవంగా గెలిచారు. ఎవరూ ఊహించనటువంటి, ఉభయ గ్రూపులకు సమతూకంగా వుంటూ కేవలం పి.వి. గారికి సన్నిహితంగా నుండే శ్రీనివాసరావు పేరు ఎలా వచ్చిందో ఎవరికీ అంతుబట్టలేదు.

కొన్ని రోజుల తర్వాత శాసనసభలో పి.వి. గారే నా వద్దకు వచ్చి 'ఈ శ్రీనివాసరావు గారి పేరును ముఖ్యమంత్రిగారికి ఎవరు తెలియజేసి యుంటారు' అన్నారు. 'ఇంకెవరు ఆయన మీ మనిషి మిమ్ములను గెలిపించడానికి ప్రతిసారి శక్తివంచన లేకుండా కృషి చేసిన మంచి మనిషి. కాబట్టి మీరే వారి పేరు చెప్పియుంటారు' అన్నాను. 'అది నిజమే కాని నేను చెప్పలేదే? ఆయనగారికి ఎలా తెలుసు?' అన్నారు. ఆరుమాసాల తరువాత జిల్లా పరిషత్ అధ్యక్షుల సమావేశంలో భోజన సందర్భంగా ముఖ్యమంత్రిగారు వెతుక్కుంటూ కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షుల వద్దకు వచ్చి చూచి కుశలప్రశ్నలు వేశారు. తర్వాత నీ పేరు నాకెలా తెలిసియుంటుందన్నారు. నాకు విశ్వాసపాత్రుడు సి.హెచ్. రాజేశ్వరరావును నేను అడిగి తెలసికొని కాగితాన్ని రహస్యంగా పంపించానన్నారు. భోజనానంతరం కీ.శే. శ్రీనివాసరావు పరుగెత్తికొని వచ్చి నా క్వార్టరులో నన్ను కలిసి ఈ ఉదంతాన్ని వివరించారు. నాకు కృతజ్ఞతలు తెలియజేశారు. పి.వి. నరసింహారావు గారు, గ్రూపురాజకీయాలకు ఎంతగా దూరముంటారో ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది.

1969 నాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తుంది. తెలంగాణా ప్రాంత రాజకీయ నాయకులు, ప్రజలు రెండుగా చీలిపోయారు. ఇందిరాగాంధీగారి నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం తెలంగాణా ప్రాంత అభివృద్ధికి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడానికి సిద్ధపడింది కానీ రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించింది.

కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు, పదవీ వ్యామోహం ఈ ఉద్యమం వెనక ప్రబల పాత్ర నిర్వహిస్తున్న వాస్తవం కొట్టవచ్చినట్టుగా అగుపడింది. వేర్పాటువాదులు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారి నాయకత్వాన్ని సవాలుచేశారు. శ్రీమతి ఇందిరాగాంధీగారు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో విడివిడిగా చర్చించి పరిష్కార ప్రయత్నం చేశారు. సి.పి.ఐ. శాసనసభా పక్ష నాయకుడిగా నేను గూడా ఢిల్లీ వెళ్ళి ప్రధానమంత్రిని కలవడం, పార్టీ అభిప్రాయాన్ని తెలియజేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఐక్యతను కాపాడుకోవడానికి అవసరమైతే శ్రీ బ్రహ్మానందరెడ్డిగారి నాయకత్వాన్ని మార్చుకోండి గాని వేర్పాటు ఉద్యమాన్ని కొనసాగనీయకూడదని చెప్పడం జరిగింది. అన్నీ ఆలోచించి చివరకు ముఖ్యమంత్రిని మార్చే నిర్ణయానికి వచ్చారు. 1971లో బ్రహ్మానందరెడ్డిగారు దిగిపోవడం, వెంటనే 30 సెప్టెంబర్‌నాడు శ్రీ పి.వి. నరసింహారావు గారు ముఖ్యమంత్రి కావడం జరిగింది. డా. మర్రి చెన్నారెడ్డి గారు గవర్నర్‌గా నియమించబడ్డారు. రాజకీయ సంక్షోభంలో పి.వి.గారు అప్రయత్నంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించవలసి వచ్చింది. 1972 ఎన్నికల తర్వాత తిరిగి పి.వి. ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడినారు.

ఐతే ఒక సంక్షోభం సమసిపోకముందే మరో సంక్షోభం ప్రత్యేకాంధ్ర ఉద్యమ రూపంలో విజృంభించింది. 1972 అక్టోబర్ నెలలో సుప్రీంకోర్టు ముల్కి రూల్సుపై ఒక సంచలనాత్మకమైన తీర్పునిచ్చింది. చిరకాలంగా అమలులోనున్న ఈ ముల్కి రూల్సు రాజ్యాంగసవరణ ద్వారా తప్ప ఎవరూ అడ్డుకోవడానికి వీలు లేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. ఈ తీర్పు గురించి ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ పి.వి. గారి ప్రభుత్వం కోర్టు తీర్పును శిరసావహించడం తప్ప గత్యంతరం లేదన్నారు. దీన్ని అపార్థం చేసుకోవడం, ప్రత్యేకాంధ్ర ఉద్యమంవినా మరో మార్గం లేదని ఆంధ్ర జిల్లాల్లో పెద్ద ఆందోళన జరిగింది. తొమ్మిదిమంది ఆంధ్రప్రాంత మంత్రులు రాజీనామా చేయడం చివరకు 1973 జనవరిలో ముఖ్యమంత్రిగా పి.వి. గూడా రాజీనామా చేయవలసివచ్చింది. సుమారు 16 మాసాల పి.వి. ప్రభుత్వం రాజీనామా చేయడం, అధ్యక్ష పాలన విధించడం జరిగిపోయింది. 11 మాసాల తర్వాత 1973 నవంబర్‌లో కీ.శే. జలగం వెంగళరావుగారి నాయకత్వంలో తిరిగి ప్రభుత్వ నిర్మాణం జరిగింది.

పి.విగారి కార్యరంగం ఢిల్లీ మారింది. శ్రీమతి ఇందిరాగాంధీ పార్టీలో ప్రధాన బాధ్యతలను అప్పగించడం, పార్టీ విధాన నిర్ణయాల్లో కూడా కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. 1975 జూన్ 12వ తేదీన అలహాబాద్ హైకోర్టు సంచలనాత్మక తీర్పు నివ్వడం, 1971లో రాయబరేలి నుండి శ్రీమతి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లనేరదనడం దేశ రాజకీయాలను కుదిపివేసింది. ఇందిరాగాంధీ వెంటనే సుప్రీంకోర్టులో అప్పీలు చేయడం, 1975 జూన్ 25వ తేదీన దేశ వ్యాపితంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించడం, ఎన్నికల చట్టాన్ని సవరించడం, ఆ సవరణల వెలుతులో 7 నవంబర్ 1975 నాడు

సుప్రీంకోర్టు ధర్మాసనం శ్రీమతి ఇందిరాగాంధీ గారి ఎన్నిక చట్ట సమ్మతమని తీర్పు ఇవ్వడం మరపురాని ఘట్టాలు. ఈ రాజకీయ చర్యల వెనుక ప్రధానమంత్రిగారి విశ్వాసపాత్రుల పాత్ర కీలకమైనది. పి.వి. నరసింహారావు గారు తనదైన శైలిలో ప్రచార మాధ్యమాలకు దూరంగానుంటూ ప్రధాన పాత్ర పోషించారు.

1977 ఎన్నికల్లో పి.వి. గారు హన్మకొండ నుండి పార్లమెంటుకు గెలిచారు. శ్రీమతి ఇందిరాగాంధీ ఓడిపోవడం, కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా దెబ్బతిని ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడడం, జనతాపార్టీ ఆవిర్భావం, జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడడం, భారత రాజకీయాలలో ఒక మూల మలుపుగా జరిగింది. జనతాపార్టీ అనతికాలంలో చీలిపోయింది. 1980లో మధ్యంతర ఎన్నికలు జరిగినవి. కాంగ్రెస్ పార్టీ అఖండ విజయాన్ని సాధించి, జనవరి 14 తేదీన శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో నూతన ప్రభుత్వం పదవీ స్వీకార ప్రమాణం చేసింది. విదేశాంగ విధానాన్ని తీవ్రంగా సంస్కరించే అవసరాన్ని గమనించిన ప్రధాని చక్కని నిర్ణయం చేశారు. పి.వి. గారి సునిశిత అవగాహన, దక్షతను పూర్తిగా వినియోగించారు.

పి.వి.గారు, 8-9వ లోక్ సభల ఎన్నికల్లో రాంటెక్ నుండి పార్లమెంటుకు ఎన్నుకోబడినారు. సంజయ్‌గాంధీ అకాలమరణం, ఇందిరాగాంధీ హత్యతో కాంగ్రెస్ పార్టీకి గొప్ప లోటు ఏర్పడింది. రాజీవ్‌గాంధీ ప్రధాని కావడంతో పార్టీ తిరిగి పుంజుకున్నది. పి.వి. లాంటి అనుభవజ్ఞుల సలహా సంప్రదింపులతో రాజీవ్‌గాంధీ చాలా వరకు పార్టీ, పరిపాలనలో నూతన జవసత్వాలను నింపగలిగారు. 1991 ఎన్నికలు సమీపించినవి. పి.వి.గారు తమ పార్లమెంటరీ రాజకీయాలకు స్వస్తి చెప్పి విశ్రాంతితో జీవితం గడపాలనుకున్నారు. కీ.శే. కె.వి. నరసింగరావు గారి బంధువుల వివాహంలో చాలాకాలం తర్వాత తీరికగా మాట్లాడుకునే అవకాశం నాకు కలిగింది. తమ రష్యా పర్యటన, అక్కడి సంస్కర్త గోర్బచేవ్‌గారితో తమ సంభాషణల సారాంశాన్ని వివరంగా తెలియజేశారు. విపరీతమైన కేంద్రీకృత విధానాలు, ప్రజాతంత్ర ప్రక్రియలకు ఏలాటి అవకాశాలు లేకుండాపోవడం, సోవియట్ పతనానికి దారి తీసిన వివరాలెన్నో తెలియజేశారు. తాము మాత్రం ఈసారి పార్లమెంటుకు వెళ్లదలచుకోలేదని స్పష్టంగా చెప్పారు.

మళ్ళీ ఒక అత్యవసరపరిస్థితి ఏర్పడ్డది. ప్రధాని రాజీవ్‌గాంధీని తమిళనాడులో తీవ్రవాదులు హత్యజేశారు. దేశమంతా అట్టుడికినట్టు అయింది. సానుభూతి వెల్లువగా కాంగ్రెస్ పార్టీ స్వల్ప ఆధిక్యతతో 1991 ఎన్నికలలో గెలుపు సాధించింది. ఢిల్లీలో రాజకీయ కదలికలు చురుకుగా సాగినవి. అందరూ కలిసి అనుభవజ్ఞుడైన పి.వి.ని ప్రధానిగా, పార్టీకి అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అనూహ్యంగా సంక్షుభిత పరిస్థితుల్లో విధి నిర్ణయం జరిగింది. పి.వి. జీవితంలో సరిక్రొత్త అధ్యాయం ఆరంభమైంది. చెప్పుకోదగిన సంఖ్యాబలంలేని ప్రభుత్వం సుస్థిరంగా ఉండలేదనే భయాందోళన

చివరివరకు వెన్నంటి యుండింది. రాజకీయ యుక్తులు, చతురోక్తుల ద్వారా, ప్రతిపక్షాల అనైక్యతను ఆధారంచేసుకుంటూ పూర్తిగా అయిదు సంవత్సరాలు తమ పరిపాలనను కొనసాగించడం మొదటి విజయం. విశ్వహిందూ పరిషత్తు, భజరంగదళ్, అర్.ఎస్.ఎస్. సంస్థలు వాటి రాజకీయ వేదిక బి.జె.పి.తో కలిసి ఒక పెద్ద కుట్ర చేసి 1994 డిసెంబర్ 6వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో వందల సంవత్సరాల కాలంనాటి పురాతన బాబ్రీమసీదును కూల్చడం, అది రామజన్మభూమి కాబట్టి కూల్చడం జరిగిందని బహిరంగంగా చెప్పడం భారత రాజకీయ చరిత్రలోనే గొప్ప దుస్సాహసం. ప్రధాన మంత్రిగా పి.వి., నిర్విరామంగా పై సంస్థల నాయకులు, సాధువులతో చర్చలు జరపడం, ఏలాటి దుందుడుకు చర్యలకు పోకుండా ప్రయత్నించడం అందరికీ తెలిసిందే. చివరకు పై సంస్థలు ఆ ముహూర్తాన లాంఛనప్రాయమైన పూజలు మాత్రమే చేస్తామని అటు సుప్రీంకోర్టుకు, ఇటు కేంద్ర ప్రభుత్వానికి గట్టిహామీలు కూడా ఇవ్వడం జరిగింది. ప్రధానమంత్రిగా, ఒక బాధ్యతగల రాష్ట్ర ప్రభుత్వం గూడా ఇచ్చిన హామీలను నమ్మక తప్పలేదు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్, సంఘ్ పరివార్ పూర్తిగా నమ్మకద్రోహానికి పాల్పడి బాబ్రి మసీదును నిలువునా కూల్చి భూమట్టం చేశారు. పి.వి.గారి సహనాన్ని పరీక్షించారు. వేల సంవత్సరాలు భారతీయ మిశ్రమ సంస్కృతి సాంప్రదాయాలకు తీవ్ర విఘాతం కల్పించారు. దేశ సమైక్యత, సమగ్రతకు గొడ్డలి పెట్టులాంటి హేయమైన దుశ్చర్యకు తెగించారు. ప్రధానిగా పి.వి. తలదించుకున్నారు. జరిగిన విశ్వాస ఘాతకాన్ని పదే పదే దేశప్రజల ముందుంచారు. అయినా దేశం ప్రధానిని తప్పుపట్టింది. కేంద్రం నిస్సహాయతను ఖండించింది. పి.వి. నాయకత్వంలోని ప్రభుత్వ హయాంలో ఈ దురంతం జరగడం వలన పి.వి. అభిమానులు, మిత్రులు బాధపడక తప్పలేదు.

తర్వాత బి.జె.పి. భాగస్వామ్యంతో ఏర్పడిన ప్రభుత్వాలు, స్వయంగా బి.జె.పి నాయకత్వంలో నడుస్తున్న ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం ఏమాత్రం చేయడంలేదు సరికదా దాన్ని తమ సంకుచిత రాజకీయ ప్రయోజనాలకై పూర్తిగా వినియోగించుకుంటున్నది.

పి.వి. ప్రభుత్వం దేశ ఆర్థిక పరిస్థితిని బాగుపరచడానికై అవలంబించిన తాత్కాలిక, దీర్ఘకాలిక చర్యలు దేశ విదేశాల్లో మంచి ఫలితాలనందించాయి. పి.వి. ప్రధాన మంత్రిగా, మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా చేపట్టిన సంస్కరణల చర్యలు దేశ ఆర్థిక చరిత్రలో నూతనాధ్యాయానికి అంకురార్పణచేశాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో అవసరమైన సరళీకృత విధానాలను చేపట్టింది. ఇంత వరకు నిర్లక్ష్యం చేయబడిన ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం జరుగుతున్నది. చైనాలో 1978లోనే చేపట్టబడిన సంస్కరణలు సత్ఫలితాల నివ్వడం, అర్థశాస్త్ర, సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ

వేత్తలలో తమ పాత విధానాల గురించి పునరాలోచనలు చేయడానికి తోడ్పడినవి. ఆర్థిక, సామాజిక రంగాలలో తీవ్రమైన సంస్కరణలు తప్ప దేశ సమస్యలకు మరో పరిష్కారం లేదను సత్యం గుర్తింపు పొందింది. సోవియట్ రష్యాలోని సోషలిజం, తమ అంతర్గత వైరుధ్యాల కారణంగా కుప్పకూలిపోవడం అందరికండ్లను తెరిపించింది. అర్ధశతాబ్ది కాలంలో ఆర్థిక ప్రగతి కుంటుపడిపోవడానికి కారణమైన కేంద్రీకృత విధానాలను ఒకటి తర్వాత ఒకటి సంస్కరించే పర్వం ప్రారంభమైంది. పది సంవత్సరాలలో అనుకున్నంత ఫలితం సాధించబడుతున్నది. ఈ సంస్కరణల స్థూల, సూక్ష్మ స్థాయిలలో మరింత వేగంగా కొనసాగించవలసిన అవసరాన్ని అన్ని రాష్ట్రాలు, కేంద్రం గుర్తించడం జరుగుతున్నది. చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశలో ముందుకు పోవడం గమనార్హం. అర్థశాస్త్రవేత్తలు, విజ్ఞులు ఈ పరిణామాన్ని కొనియాడడం యాదృచ్ఛికం కాదు. ఈ సంస్కరణల పర్వానికి వైతాళికులు పి.వి. నరసింహారావు గారేననేది వాస్తవం.

పి.వి.గారి సహనం వెనక సమస్యల పరిష్కారానికి అవసరమైన సదవగాహన, ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నం ప్రధానమైనది. నిర్ణయం తీసుకోవడం ముఖ్యంకాదు. తీసుకోబడే నిర్ణయం సరైన నిర్ణయం, ఆచరణాత్మక నిర్ణయం కావడం అవసరం. ఇటువంటి ప్రక్రియ కొందరిలో అసహనాన్ని, అనుమానాన్ని కూడా కలిగించక తప్పదు. అయినా ఏకాభిప్రాయ సాధన రాజకీయాలలో దేశాభివృద్ధికి మూలకందం. పి.వి.గారు ఈ సూత్రాన్ని ఆచరించారు. అది వారి ప్రకృతిలో భాగం. పి.వి. ఇపుడు క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉన్నా, స్వామి రామానంద తీర్థ స్మారక ట్రస్టు అధ్యక్షులుగా గొప్ప సేవా బాధ్యతలు నిర్వహించడం అభినందనీయం. తన గ్రామము నుండి ప్రారంభమైన ప్రజాసేవ జిల్లా, రాష్ట్రం, దేశంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుని, ఆత్మ విశ్వాసంతో నిలబడి, దేశానికి ఒక దిశను నిర్దేశించడం ముదావహం. వారి అభిమానులు, మిత్రులందరికీ గర్వకారణం.

# ప్రజాబంధు - బద్దం

బద్దం ఎల్లారెడ్డి గారి శతజయంత్యోత్సవం వర్తమాన ప్రజాసేవకులందరీకి పర్వదినం. ఇరువదవ శతాబ్ధికి చెందిన జాతీయ నాయకత్వంలో హైద్రాబాద్ సంస్థానం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకత్వంలో అగ్రశ్రేణికి చెందిన అనన్యసామాన్యుడు బద్దం ఎల్లారెడ్డి. హైద్రాబాద్‌లోని వివేకవర్ధని పాఠశాలలో హైస్కూలు విద్యను పూర్తిచేసుకొని ఉన్నత విద్యనభ్యసిస్తుండగానే మహాత్మాగాంధీగారి పిలుపునందుకొని శాసనోల్లంఘన వుద్యమంలో పాల్గొన్నారు. నైజాం సంస్థానములో అటువంటి వుద్యమానికి ఆస్కారము లేని కారణంగా కాకినాడకు వెళ్ళి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జైలు శిక్షను అనుభవించారు. ఆనాటి నుండి జాతీయ స్వాతంత్రోద్యమంతో పాటు హైద్రాబాద్ సంస్థాన విమోచన వుద్యమ ఆలోచనలకు బలమైన బీజాలు ఆ యువకునిలో నాటుకు పోయినవి. ఆనాటి నుండి జీవితాంతం అర్ధశతాబ్ది కాలం అలుపెరుగని సమరయోధుడుగా, అచెంచల కార్యదక్షకుడుగా, ఆంధ్రమహాసభ, భారత కమ్యూనిస్టు పార్టీలో అగ్రశ్రేణి నాయకుడుగా తన ప్రత్యేకతను ప్రదర్శించారు. ఇంతటి త్యాగమూర్తి, అనుభవశాలి జీవిత పాఠాలను క్రోఢీకరించడం సమర్ధవంతమైన రాజకీయ విశ్లేషకులు, పరిశోధకుల పవిత్ర కర్తవ్యం. ఒక సహచరుడిగా సుమారు అర్ధశతాబ్ది సుదీర్ఘకాలంలో అటువంటి మహనీయునికి మొదలు శిష్యుడిగా, అభిమానిగా తర్వాత సన్నిహిత సహచరుడిగా వుండిన నేను ఈ శతజయంతి శుభసందర్భముగా నా శ్రద్దాంజలిని ఘటిస్తూ వారితో కలిగిన అనేకానేక అనుభవాల నుండి ఆణిముత్యాల్లాంటి సందర్భాలను మాత్రమే చదువరులకు అందించగలుగుతాను.

1936లో సిరిసిల్ల పట్టణంలో చతుర్ధాంధ్ర మహాసభ జరిగింది. నాకు 13 సం॥ల వయస్సు 7వ తరగతి విద్యార్దిని. కరీంనగర్ పట్టణంలో చతుర్ధాంధ్ర మహాసభలు జయప్రదం చేయడానికి ఆహ్వానసంఘ ప్రధానకార్యదర్శిగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్న బద్దం ఎల్లారెడ్డి గారిని ప్రప్రథమంగా దర్శించుకున్నాను. ఆనాటికే కరీంనగర్ పట్టణంలో విద్యార్థి, యువకులను దేశభక్తియుత, తాత్విక చింతనలను విస్తృతంగా ప్రచారం చేస్తుండిన ఆర్యసమాజానికి నేనొక స్వచ్ఛంధ సేవకుడిని. కీ॥శే॥ రాంపాల్ లాహోటి మాకు నాయకుడు. ఖాదీ బాండార్‌లో తరుచుగా కనబడే క్రియాశీల వ్యక్తి బద్దం ఎల్లారెడ్డి ఆర్యసమాజ్ కార్యాలయానికి వచ్చి ఒక విద్యార్ది బృందాన్ని ప్రచారదళంగా

రూపొందించాలని, కరీంనగర్ నుండి సిరిసిల్ల వరకు పాదయాత్ర నిర్వహించి చతుర్థాంధ్ర మహాసభ ఉద్దేశ్యాలను, లక్ష్యాలను ప్రచారంలోకి తేవాలని కోరినారు. దానికి రాంపాల్ లాహోటి వెంటనే అంగీకరించారు. దళ సభ్యులను ఎన్నుకున్నారు. చిన్న వయస్సు కలిగిన నాకు కరపత్రాలు పంచే బాధ్యతను అప్పగించారు. ఈ బాధ్యత సక్రమంగా నిర్వహించబడ్డది. కీ॥శే॥ కొడిమేల భూమయ్యగారు ఆహ్వానసంఘ అద్యక్షులుగా, బద్దం ఎల్లారెడ్డిగారు ఆహ్వానసంఘ ప్రధానకార్యదర్శిగా సిరిసిల్లలోని మానేరు నదీ తీర మామిడితోటలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఈసభ జరిగింది. ఆంధ్రోద్యమ వైతాళికుడు మాడపాటి హనుమంతరావు పంతులుగారు ఈ మహాసభకు అధ్యక్షుడు. వారి ధర్మపత్ని శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మ మహాసభ మహిళా విభాగానికి అధ్యక్షురాలు. నిరంకుశ నైజాం పరిపాలనలో ఏ మాత్రం పౌరహక్కులు లేని అంధకారంలో సిరిసిల్లలో జరిగిన చతుర్థాంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లాలోనే స్వాతంత్రం, ప్రజాతంత్రం లాంటి సిద్ధాంతాలకు ప్రప్రథమంగా ప్రచార వేదికగా నిలిచింది. వందలాది యువకులలో దేశభక్తి, సామాజిక స్పృహలకు ప్రేరణగా ఉపకరించింది. ఇందులో బద్దం ఎల్లారెడ్డిగారి పాత్ర అద్వితీయం.

హైద్రాబాద్ సంస్థానంలో ఆంధ్రమహాసభలు తెలంగాణా ప్రాంతాలలో దాదాపు ప్రతి సంవత్సరం సువిశాల దేశభక్తుల వేదికలుగా విజయవంతంగా నిర్వహించబడినవి. భారత జాతీయ కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీలు నిషేదించబడిన నేపద్యంలో సాంస్కృతిక లక్ష్యాలు తప్ప రాజకీయాలు వుండవని, ప్రభుత్వ అనుమతితో నిర్వహించబడిన ఆంధ్రమహాసభ సమావేశాలు ఆచరణలో మంచి సమరశీల రాజకీయ వేదికలుగా ఉపయోగంలోకి వచ్చిన పరిస్థితి అత్యంత ఆసక్తికర పరిణామం. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నాయకులు తమ తమ సైద్ధాంతిక పునాదులను పదిలం చేసుకుంటూ నాయకత్వాలను సృష్టించి నిర్మించుకోగలిగిన వేదిక ఈ ఆంధ్రమహాసభ. రావి నారాయణ రెడ్డి గారి కుడి భుజంగా గుర్తించబడి వర్ణించబడిన అదృష్టవంతుడు బద్దం ఎల్లారెడ్డి.

సామాన్యుడిగా అగుపడే మనిషి అసహాయశూరుడుగా, త్యాగధనుడుగా, పట్టువదలని భట్టి విక్రమార్కుడుగా, మడమ త్రిప్పని శక్తివంతుడిగా నాదృష్టిని ఆకర్షించిన బద్దం ఎల్లారెడ్డి నా జీవితంపైన చెరగని ముద్ర వేశారు. శరవేగంగా కొనసాగిన ఆనాటి రాజకీయ సంఘటనలలో అడుగడుగునా బద్దం ఎల్లారెడ్డి పాత్ర కరీంనగర్ జిల్లా ప్రజల దృష్టిని ప్రబలంగా ఆకర్షించింది. ఆ జిల్లా రాజకీయాల పరిణతిలో అవిభాజ్యమైపోయింది. పరిపూర్ణ దేశభక్తుడిగా, ప్రజాబంధుగా పరిగణలోకి రావడం జరిగింది. రెండుచేతులకు బేడీలు వేసి పొడుగాటి పగ్గాలను ఇద్దరు లేక నలుగురు పోలీసులు పట్టుకొని కరీంనగర్ పురవీధులలో నడిబజారులో నడిపించిన సందర్భాలు ఒకటి కాదు అనేకం.

పలు సందర్భాలలో ఇందుకు కారణం తెలుసుకునే కుతుహలం నాలో కలిగింది. నైజాం సంస్థానంలో భూమిశిస్తు, నీటి తీరువా బ్రిటీష్ ఆంధ్ర ప్రాంతానికంటే ఎక్కువగా నున్నది కాబట్టి దానిని తీవ్రంగా తగ్గించాలని కోరుతూ కరపత్రాలు పంచడం ఒకనాటి కారణం. పౌరహక్కులను కాలరాస్తూ వాక్ స్వతంత్ర్యాన్ని నిరాకరిస్తున్న ప్రభుత్వ విధానాన్ని విమర్శించే కరపత్రాలు పంచడం ఒకనాటి గాథ. అక్రమంగా భూములపై అక్రమంగా భూమి శిస్తును విధించి వసూళ్ళకు పూనుకొంటున్న ప్రభుత్వ విధానాలను ఖండించమని రైతులను కోరుతూ పత్రికా ప్రకటన చేయడం ఒక వుదంతం. ఇలా ఆయన చేయని 'నేర'మంటూ లేదు. శిక్షాస్మృతిలోని వివిధ విభాగాల క్రింద నేరారోపణలు చేస్తూ కోర్టుల చుట్టూ, జైలు చుట్టూ తిప్పిన ఘటనలు కోకొల్లలు. అందుకే ఆయన ధైర్యసాహసాలు ప్రజలను ఆకట్టుకున్నవి. యువతకు ఆకర్షనీయమైనవి. శత్రువులకు కంటకంగా మారినవి. మేధోశక్తితో, ఉపన్యాస పటిమతో, ప్రబోధ ప్రజ్ఞతో రాజకీయ నాయకులుగా ప్రతిభను పొందిన వారున్నారు. మంచిదే. కాని ఒంటరిగా, అన్యాయంగా, అక్రమం పట్ల అసహనంతో పరిణామాన్ని కూడా లెక్కించక కార్యరంగంలోకి దూసుకుపోయే అరుదైన పోరాట పటిమ గలిగిన ఈ నాయకుని తీరేవేరు. ఒక రోజు పోలీసులు చేతులకు, కాళ్ళకి బేడిలు వేసి కరీంనగర్ నడిబజారులో ఊరేగించి ఈనాడు పాత పోలీసు ఠాణా అని పిలువబడే పోలీసుస్టేషన్ చీకటిగదిలో వేయడం, అందులోనే అలాంటి బేడీలే వేయబడిన పిచ్చివాడిని కూడా ఉంచడం అలా ఒక రాత్రి పగలు గడపడం ఈనాటి నాగరికతా ప్రపంచంలో ఊహించగలమా? భరించగలమా? ఇవి ఆయనకు పుట్టుకతో వచ్చిన సద్గుణాలు. మానవతా విలువలు. ఆనాటి ప్రజలు అనుభవించిన అష్టకష్టాలను ఎదిరించడానికి ప్రకృతి సృష్టించిన మానవావతారం. భూమి పుత్రుడు, మట్టినుండి పుట్టిన మాణిక్యం.

1942, 9వ ఆగస్టు భారత జాతీయ విముక్తి వుద్యమంలో మహోన్నత సమరశీల ఘట్టం. క్విట్ ఇండియా పిలుపునిచ్చినదినం. జాతీయ కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకత్వం, గాంధీజీతో సహా అరెస్టు చేయబడినారు. కాని యువతరం శ్రీమతి అరుణా ఆశఫ్ అలీ లాంటి నాయకగణం రహస్యంగా నుండి బ్రిటీష్ ప్రభుత్వ పాలనను స్థంభింపచేయడానికి వీరోచిత పోరాట కార్యక్రమాలను చేపట్టిన సందర్భం. మహత్మాగాంధీ గారి మాటలలో "చావో బ్రతుకో తేల్చుకోవలసిన సంగ్రామం" జాతి మొత్తం అట్టుడికినట్టుంది. విద్యార్థి, యువకులు రంగప్రవేశం చేసారు. కరీంనగర్ పట్టణంలో 9వ తరగతి విద్యార్థిగా నున్న నాలో దేశ వ్యాపిత రాజకీయ పరిణామాలకు ప్రతిస్పందన కోరినవి. వెంటనే సహచర విద్యార్థి, యువకులందరిని సమావేశపర్చి అదే రోజు కరీంనగర్ సమీపంలోనున్న గిద్దె పెరమాండ్ల దేవాలయంలో సామూహిక నిరాహారదీక్ష చేపట్టడం జరిగింది. సాయంకాలానికి ఆర్యసమాజ్ నాయకులు రాంపాల్ లాహోటితో సహా ఆంధ్రమహాసభ నాయకులు బద్దం ఎల్లారెడ్డి గారి నాయకత్వంలో మా శిభిరానికి రావడం మమ్ముల్ని ప్రోత్సహిస్తూ

ఆశ్వీరదించడం మరుపురాని మహోజ్వల ఘట్టం. ఇల్లు చేరేవరకు నా పేరిట నాగపూర్ నుండి వచ్చిన ఒక వుత్తరం దానిని విప్పి చూడగా స్వధస్తూరితో నన్ను వుద్దేశించి అరుణా ఆసఫ్ అలీ గారు వ్రాసిన వాక్యాలు నా జీవితానికే మరుపురాని సందర్భం. విద్యార్థి, యువకులు బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని పారద్రోలే పర్యంతం. చదువు, సంధ్యలు వదిలి విప్లవోద్యమంలో సమిధలుగా మారాలని ఆమెగారిచ్చిన సందేశం. ఆ ఉత్తరాన్ని వెంటనే బద్దం ఎల్లారెడ్డి గార్కి చూపడం దానిపై ఆయన తమ ఉద్రేకపూరిత భాష్యాన్ని ఇవ్వడం నిజంగా నన్ను ఒక రాజకీయ వాదిగా మలుపు తిప్పడానికి కలిగిన ఏర్పడిన సన్నివేశం, సందర్భం.

తెలుగుభాషా పండితుడొకరు చెప్పినట్లు ''గు''అనగా చీకటి అని బీజార్థం. ''రు'' అనగా తొలగించువాడు అన్నది బీజార్థం. అంటే చీకట్లను ఛేదించి, తొలగించి వెలుగును ప్రసరించేవాడే ''గురువు''. నిజంగా బద్దం ఎల్లారెడ్డి నాకు గురువని చెప్పుకుంటూ గర్విస్తాను. ఆనాటి నుండి ఆయన జీవితాంతం నాకు గురువుగా, సహచర్యుడిగా నా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించగలిగాను. ఆయనంటే భక్తితోపాటు భయం కూడా నాలో వుండింది. మా కుటుంబంలో మా బావగారైన కరీంనగర్‌లోని సుప్రసిద్ధ అడ్వకేట్ కూడా అయిన ఆంధ్రమహాసభకు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసిన కీ॥శే॥ పోల్కంపల్లి వెంకట రామారావు గారు ఎల్లారెడ్డిగార్కి అత్యంత సన్నిహిత మిత్రులు. మాతండ్రిగారైన చెన్నమనేని శ్రీనివాసరావు గారిని వీరు ఉభయలు గౌరవించేవారు. ఆ విధంగా బద్దం ఎల్లారెడ్డి గారు మా కుటుంబానికి సన్నిహితులు, హితులు, అదనంగా రాజకీయ సహచరులు కూడా. అందుకే నేను వారిని పితృసమానులుగా భావించడం భక్తితోపాటు భయంగా మెలగడం సహజంగా జరిగింది. సుమారు 5 సం॥ల కాలం అంటే 1943లో నేను నా హైస్కూలు విద్యను ముగించుకొని వున్నత విద్యకొరకు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్ళేవరకు పోల్కంపల్లి వారి గృహం రాజకీయ చర్చలకి, ఆంధ్రమహాసభ కార్యక్రమాలకి నిలయంగా నుండినది. ముఖ్యంగా పొల్కంపల్లి వెంకట రామారావు మరియు బద్దం ఎల్లారెడ్డి గార్ల మధ్య జరిగే నిరంతర రాజకీయ చర్చలు, వాగ్వివాదాలు అత్యంత ఆసక్తికరం. రెండవ ప్రపంచయుద్ధం ముమ్మరంగా కొనసాగుతూ సోవియట్ రష్యా ప్రజలు జర్మన్ నాజీ సైనికులను తరిమికొడుతున్న సమయం. ఇటు తూర్పున ఫాసిస్టు జపాన్ దురాక్రమాణలను ఆసియా దేశాల ప్రజల అత్యంత త్యాగనిరతితో తరిమికొడుతున్న సమయం. భారతదేశంలో జాతీయ నాయుకులు బ్రిటీష్ సామ్రాజ్య వ్యతిరేక విముక్తి వుద్యమ వ్యూహం గురించి భిన్నాభిప్రాయాలతో సతమతమవుతున్న సందర్భం. భారత కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు జన్మభూమి అయిన రష్యా దేశంపై విరుచుకుపడుతున్న ఫాసిస్టు శక్తులను ఓడించే మహా యుద్ధంలో మిత్రపక్షంగా నున్న బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక వుద్యమాన్ని తాత్కాలికంగానైనా సడలించాలని కృతనిశ్చయంతో తమ వైఖరిని తదనుగుణంగా మార్చుకున్నది. ఈ దశలో రెండవ

ప్రపంచయుద్ధం "పీపుల్స్‌వార్"అనగా ప్రజా యుద్ధంగా మారిందని, బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలు నిలిపివేయాలని, చివరకు కార్మిక సమ్మెలకు కూడా విరామమివ్వాలని ప్రకటించింది. అటు ప్రధాన జాతీయోధ్యమ నాయకత్వ పాత్రను పోషిస్తున్న కాంగ్రెస్ పార్టీ, గాంధీ - నెహ్రూ తదితరులు ఇదే సమయంలో బ్రిటీష్ వ్యతిరేక విముక్తి వుద్యమానికి మరింత పదునుపెట్టి విస్తృతం, ఉధృతం చేయాలని సంకల్పించారు. అంతవరకు కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వంతో నుండిన కమ్యూనిస్టులు కాంగ్రెస్‌పార్టీ నుండి బహిష్కరించబడ్డారు. కమ్యూనిస్టులను దేశద్రోహులుగా ప్రకటించారు. ఇటువంటి సునిశిత రాజకీయ వాతావరణంలో కరీంనగర్‌లో రాజకీయ రంగ అగ్రగణ్యులు జిల్లా ఆంధ్రమహాసభ అధ్యక్ష, కార్యదర్శులైన పోల్కంపల్లి మరియు బద్దం గార్ల మధ్య జరిగిన రాజకీయ చర్చోప చర్చలు నిత్య నూతన పాఠాలను నేర్పే విద్యాలయంగా పరిణమించింది. పై నాయకులకి, వారి అనుచరగణాణికి మంచినీళ్లు, టీలు, టిఫెన్లు అందచేసే బాధ్యతలను నిర్వహించే నాకు వెలలేని రాజకీయ విద్యాకేంద్రంగా మారింది. బద్దం ఎల్లారెడ్డి గారు అదివరకే భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు, నాయకులు. ఆయన అనుచరుడిగా నేను భారత కమ్యూనిస్టు పార్టీ క్యాండిడేట్ సభ్యుడిని. పోల్కంపల్లి వారు వారి అనుచరులు స్థూలంగా కాంగ్రెస్ వాదులు. కమ్యూనిస్టు వ్యతిరేకులు కాకుండా భారత రాజకీయాలలో కమ్యూనిస్టు లనుసరించుచున్న బ్రిటీష్ అనుకూలతను తీవ్రంగా వ్యతిరేకించేవారు. అటు సోషలిస్టు రష్యా అప్రతిహతంగా అజేయంగా జర్మన్ ఫాసిస్టులను తరిమికొట్టగలుగుతుందని పరిపూర్ణంగా నమ్మేవారు. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితులలో భారత కమ్యూనిస్టు పార్టీ అనుసరించిన ఒంటెత్తు పోకడ మింగుడు పడకపోయినా పార్టీ నిర్ణయాన్ని పట్టుదలతో వాదించి ఎదుటి వాదనను ఓడించడానికి ఎల్లారెడ్డి గారు చేసిన కృషి సంతృప్తికరంగా కనబడినా గాంధీ - నెహ్రూలతో పాటు వీర విప్లవ నారి అరుణా అసఫ్ అలీ లాంటి వారి నాయకత్వంలో విజృంభించుచున్న జాతీయ విముక్తి వుద్యమ స్రవంతి నుండి సామాజిక విప్లవ కారులైన కమ్యూనిస్టులు విడువడి పోవడం దానిని సమర్ధించుకోవడం ఒక కొరకరాని కొయ్యగా నేను భావించేవాడిని. అయినా ఎల్లారెడ్డి గారిని చూచి భయపడేవాడిని, ఎదిరించే వాడిని కాదు. ఎల్లారెడ్డిగారిలో రెండవ ప్రపంచయుద్ధం జయాపజయాలకంటే, శ్రమజీవుల శాశ్వత విముక్తి మహోద్యమాన్ని నిర్వహించే కమ్యూనిస్టుపార్టీ పిలుపుపై అకుంఠిత విశ్వాసం ప్రస్ఫుటంగా కనబడేది. అటు బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం, జాతీయ స్వాతంత్రం ప్రాధాన్యతను ఏమాత్రం తగ్గించనవసరం లేదనే వాస్తవాన్ని నొక్కి వక్కాణించేవారు.

నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో చేరిన 1943 నుండి 1947, 15 ఆగస్టు వరకు బద్దం ఎల్లారెడ్డి గారితో నిత్యసంబంధాలు తగ్గి పరోక్ష సంబంధాల వరకు, పార్టీ మీటింగ్‌ల వరకు పరిమితమైపోయినవి. అయినా మా కుటుంబంలోని ప్రతి ముఖ్యసందర్భంలో వారు రావడం, అభిప్రాయాలు పంచుకోవడం

జరుగుతూ వచ్చింది. నేను విద్యార్థి వుద్యమ నాయకుడిగా ఎదగడం చూస్తూ వారు తమ సంతృప్తిని వ్యక్తం చేసేవారు. సహేతుక విమర్శలతో పాటు సముచిత సలహాలు అందించేవారు. 15 ఆగస్టు 1947తో రాజకీయాలు వేడెక్కినవి. భారతదేశం స్వాతంత్ర పోరాట విజయోత్సవాలను నిర్వహించుకొనగా హైద్రాబాద్ సంస్థాన ప్రజలు నైజాం నిరంకుశ పాలనలో నికృష్ట జీవితాన్ని అనుభవించవలసి వచ్చింది. నైజాం భారత యూనియన్‌లో విలీనం కావడాన్ని తిరస్కరిస్తూ తమ సంస్థానాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. విలీనాన్ని కోరుతున్న ప్రముఖ రాజకీయ పార్టీలైన స్టేట్ కాంగ్రెస్ మరియు కమ్యూనిస్టు పార్టీలపై నిషేదాన్ని విధించారు. ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలపై నిర్బంధ విధానాన్ని ద్విగుణీకృతించారు. తెలంగాణా ప్రాంతంలో సుమారు 2 దశాబ్ధాల నుండి క్రమక్రమంగా ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో బలోపేతమైన ప్రజావుద్యమం దీన్ని ఒక సవాల్‌గా స్వీకరించింది. హైద్రాబాద్ సంస్థానం బేషరతుగా భారతదేశంలో విలీనం కావాలని పిలుపిచ్చింది. రాజకీయ విభేదాలకు తావులేకుండా పై ఉమ్మడి ఆశయాన్ని సాధించడానికి రాజీలేని పోరాటాలు నడిపించాలని అందుకు అవసరమైన త్యాగాలకు సిద్దపడాలని పిలుపునిచ్చింది. అప్పటికే రాష్ట్రస్థాయి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల అగ్రశ్రేణి నాయకులలో ప్రముఖులైన బద్దం ఎల్లారెడ్డి గారు తమ శక్తి యుక్తులను దారబోస్తూ ఈ మహోద్యమంలోకి దూకారు. నైజాం ప్రభువు ఒక ప్రత్యేక ఆర్డర్ ద్వారా కొందరు నాయకులతో పాటు బద్దం ఎల్లారెడ్డి గారిని గ్రామ నిర్భంధానికి గురి చేశారు. కొలది కాలంలోనే పార్టీ నిర్ణయానుసారం నిర్బందాన్ని దిక్కరించి రహస్య జీవితం ప్రారంభించారు. ఎల్లారెడ్డిగారు తమ గ్రామ నిర్బందాజ్ఞలను ఉల్లంఘించి గాలిపల్లి గ్రామము నుండి రహస్య జీవితంలోకి పోయిన వార్త కరీంనగర్ జిల్లాలో దావానలంలా వ్యాపించింది. అండర్‌గ్రౌండ్ అంటే గ్రామీణ ప్రజలు ఆయనపై ప్రేమాభిమానాలతో ఇలా వర్ణించేవారు. "ఒక రోజు భూమాత తనముద్దు బిడ్డడైన బద్దం ఎల్లారెడ్డి ఇంటికి వచ్చి ఆయన అనుభవించిన నిర్భంధకాండను చూడలేక, రెండుముక్కలుగా తానేపగిలి ఆయనను తన ఒడిలోకి తీసుకొని అంతర్ధానమై పోయింది." ఈ సత్యాన్ని నేనంటే నేను చూచానని పామర జనులనుకుంటుండే వారు. అమితమైన అజ్ఞానం, అపారమైన అభిమానం, మేలవించబడి అమాయక ప్రజలు అల్లుకున్న ఆసక్తిదాయకమైన కథ ఇది. ఎల్లారెడ్డి గారు తెలంగాణా గ్రామసీమలపై నైజాం పోలీసు సైన్యం, రజకార్లుగా పిలువబడే ముస్లిం మతసంస్థ వాలంటీర్లు ఉమ్మడిగా నిర్వహించే విధ్వంసకాండ, గృహదహనాలు, గ్రామ దహనాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రజల సమీకరణ కార్యక్రమాలను చేపట్టారు. శత్రు వర్గాలపై ఆత్మరక్షణ కొరకు ఎదురుదాడి చేయడానికి కార్యకర్తలను ప్రజలను సమాయత్తం చేసారు. కేవలం లాఠీలతో ఆత్మరక్షణ వుద్యమం సాధ్యపడదనే వాస్తవ పరిస్థితిని తెలంగాణా జిల్లాల ప్రజలు గుర్తించారు.

సాయుధ తిరుగుబాటు వినా గత్యంతరం లేని పరిస్థితులు ఏర్పడుచున్నవని నాయకత్వంపై ఒత్తడి తెచ్చారు. ఫలితంగా పార్టీ నాయకత్వం ఆత్మరక్షణకై సాయుధ గెరిల్లా పోరాటాన్ని చేపట్టాలని సెప్టెంబరు 11, 1947 నాడు ప్రకటించింది. ఆ చారిత్రక ప్రకటనపై సంతకం చేసిన త్రిమూర్తులు రావి నారాయణరెడి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొహీయుద్దీన్ గారలు. అదే కాలంలో అమరజీవులు అనభేరి ప్రభాకరరావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి గార్ల నాయకత్వంలో జైత్రయాత్రలు నిర్వహించిన కరీంనగర్ జిల్లా దళం మాంధాపురం గట్లలో నైజాం సైన్యం రజాకార్లతో తలపడ్డది. తమ అజాగ్రత్త, శత్రువర్గాల బలాధిక్యత, మోహరింపు కారణంగా దళం దెబ్బతినటం జరిగింది. అనభేరి ప్రభాకరరావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి గార్లతో సహా మరో ఎనిమిదిమంది వీరమరణం చెందినారు. ఇది కరీంనగర్ జిల్లా పార్టీ నాయకత్వానికి శరాఘాతంగా పరిణమించింది. మా అందరిని తీవ్రంగా కదిలించింది. అటు రాష్ట్ర పార్టీ తమ ఎత్తుగడలలో మార్పును సూచించింది. దళాలు పెద్దగా కాక చిన్నచిన్న గెరిల్లా దళాలుగా పనిచేయాలని ప్రకటించింది. మావో గెరిల్లా పోరాట ఎత్తుగడల రూపకల్పన చేసింది. దీనిలో బద్దం ఎల్లారెడ్డి గారి అనుభవం ఉపయోగించబడింది. అటు వారి స్వగ్రామం గాలిపల్లిపై రజాకార్లు సైనికులు దాడి చేసారు. వారి ఇల్లును కాల్చివేయడమేకాక గ్రామ ప్రజలపై విరుచుకుపడ్డారు. కొందరి ప్రాణాలను బలిగొన్నారు. తర్వాత ఎల్లారెడ్డిగారు రహస్య జీవితంలో తమ బాధ్యతలను నిర్వహిస్తూ కొద్ది కాలానికే అరెస్టు కావడం జరిగింది. వివిధ జైళ్ళలో తిప్పుతూ కఠినమైన శిక్షలకు గురిచేయడం జరిగింది. 2 సంవత్సరాలకు పై బడిన జైలు జీవితం తర్వాత 1952 ఫిబ్రవరి మాసంలో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విడుదలయ్యారు. అంతకు ముందే 1948 సెప్టెంబరు 17 నాడు పోలీస్ యాక్షన్ ఫలితంగా నైజాం ప్రభుత్వం తమ ఓటమిని అంగీకరించి భారత యూనియన్‌లో విలీనం కావడాన్ని ప్రకటించిన విషయం అత్యంత ప్రధానమైన ఘట్టం. ఈ సందర్భంలో భారత కమ్యూనిస్టుపార్టీ 1948 ఏఫ్రిల్ - మే మాసంలో నిర్వహించిన 2వ పార్టీ కాంగ్రెస్‌లో చేసిన రాజకీయ తీర్మానం భారత కమ్యూనిస్టు పార్టీ వుద్యమ చరిత్రలో కీలకాంశం. ఆగస్టు 1947న వచ్చిన స్వతంత్రం బూటకమని కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చేతులో కీలుబోమ్మ అని, బూర్జువా భూస్వామ్య ప్రభుత్వమని దీన్ని సాయుధ పోరాటం ద్వారా కూడా కూలద్రోయడానికి ప్రజానీకం సంసిద్ధంగా నున్నారని విశ్లేషించింది. తెలంగాణా సాయుధ పోరాట మార్గమే యావత్ భారత ప్రజల విముక్తి మార్గమని ఘంటాపథంగా చెప్పింది. అందుకొరకే ఈ ప్రకటన వెలువడిన నాలుగు మాసాల తరువాత పోలీస్ యాక్షన్ ఫలితంగా కలిగిన హైద్రాబాద్ సంస్థాన విమోచనం నిజమైన విమోచన కాదని ఇక్కడి కమ్యూనిస్టు పార్టీ కూడా ప్రకటించింది. బూర్జువా భూస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోస్తూ విప్లవోద్యమం ద్వారా కష్టజీవుల రాజ్యాన్ని సాధించేవరకు తెలంగాణా సాయుధ పోరాటాన్ని ఉపసంహరించడం కాదు కదా

మరింత విస్తరించడం అవసరమని పార్టీ తేల్చి చెప్పింది. ఈ పరిణామాలు పార్టీలో విపరీతమైన అంతర్గత చర్చలకు దారి తీసినవి. పార్టీ అధికార నిర్ణయాన్ని సమర్ధించే వారు ఒకవైపు, విభేధించే వారు మరొక వైపు చీలిపోయారు. రెండవ వైపు యూనియన్ ప్రభుత్వం తమ సైన్యాలతో దేశవ్యాపితంగా కమ్యూనిస్టు వుద్యమాన్ని పూర్తిగా అణచివేయడానికి పూనుకొన్నది. బలోపేతంగానున్న బలమైన పునాదులపై నిర్మించబడిన తెలంగాణా సాయుధ పోరాటాన్ని అణచివేయడం కేంద్ర ప్రభుత్వానికి కష్టసాధ్యమైంది. ఈ వాదోపవాదాలను సాకల్యంగా చర్చించి నిర్ణయించడానికై ప్రముఖ తెలంగాణా నాయకులందరిని బొంబాయిలోని ఒక రహస్య కేంద్రానికి రప్పించడం జరిగింది. ఇందులో భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకులంతా పాల్గొన్నారు. బద్దం ఎల్లారెడ్డి గారితో సహా నేను ఆ సమావేశంలో పాల్గొనడం జరిగింది. వాదోపవాదాలలో పక్షపాతం లేకుండా, సమతౌల్యతతో అనుభవాలను విడమరిచి నిర్ణయాన్ని పార్టీకి వదిలిన మహానుభావులు బద్దం. మీ వాదనంతా సాయుధపోరాట విరమణకే అనుకూలంగా వున్నదిగదా, తీర్పును మాత్రం మాకు వదలటం దేనికి? అని నాయకత్వం ప్రశ్నించడం అందరూ వారి క్రమశిక్షణా నిరతిని గౌరవించడం మరుపురాని ఘట్టం. ఏది ఏమైనా 3 సం॥ల అసమాన పోరాటం అంతర్యుద్ధం లాంటి సంకుల సమరం తర్వాత 1951 చివరిలో ఆత్మరక్షణ పేరిట తాత్కాలిక యుద్ధ విరమణ విధంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఈ పోరాటాన్ని విరమించుకున్నది. ఈ మహోద్యమంలో సంస్థానంలో ముఖ్యంగా తెలంగాణాలో నాలుగున్నర వేల మంది ఆత్మార్పణ చేసారు. ఇందులో అత్యధికులు పోలీసుచర్య తర్వాత అసువులు బాసిన వాస్తవం గమనార్హం. పోలీసు చర్య తర్వాత సాయుధ పోరాట పిలుపును ఉపసంహరించుకోవాలని పార్టీలో అగ్రగణ్యులు రావి నారాయణరెడ్డి గారు తదితర ప్రముఖులతో బద్దం ఎల్లారెడ్డి గారు కూడా తమ సృతి కలిపినారు. ఈ వాదన బలాన్ని పుంజుకున్నది. మారిన నిజజీవితం సాయుధ పోరాట కొనసాగింపుకు ప్రతికూలంగా రుజువైంది. చివరకు అధికార పూర్వకంగా ఉపసంహరించుకోవడం అన్ని శ్రేణులు, అంతర్గత వాద వివాదాలు ఎలా వున్నా ఉమ్మడిగా మొదటి సార్వత్రిక ఎన్నికల రంగ ప్రవేశం జరిగింది. నిషేదం వుండిన కారణంగా సి.పి.ఐ. పేరుకు బదులు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పి.డి.ఎఫ్) పేరిట కమ్యూనిస్టు యోధులు తమ తమ ప్రాంతాలలో ప్రజల అపారమైన ఆదరాభిమానాలను చూరగొన్నారు. పి.డి.ఎఫ్. యొక్క "హస్తం" గుర్తు గాలి వీచింది. హైద్రాబాద్ సంస్థానంలోని మరట్వాడ, కర్ణాటక ప్రాంతాలతో సహా తెలంగాణాలోనైతే అధిక సంఖ్యలో పి.డి.ఎఫ్. గెలిచింది. నల్గొండ పార్లమెంటుకు రావి నారాయణ రెడ్డి భారతదేశంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు. ఈవిధంగా ఎల్లారెడ్డిగారి జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. నాలుగున్నర సం॥ల రహస్య జీవితం 6 మాసాల జైలు జీవితం గడిపిన తరువాత నేను కూడా నైజాం ప్రభుత్వం విధించిన షరతులకు లోబడి కరీంనగర్ జిల్లా

వరకు దిగ్బంధంలో వుంచబడ్డాను. అంత వరకు విద్యార్థి నాయకుడిగా నుండిన నేను విధిగా కరీంనగర్ జిల్లా రైతు వుద్యమ కార్యకర్తగా, నాయకుడిగా కొత్త అద్యయాన్ని ప్రారంభించక తప్పలేదు. మళ్లీ బద్దం ఎల్లా రెడ్డి గారితో సహాచరుడిగా, సన్నిహితంగా కరీంనగర్ జిల్లా రైతు వుద్యమ నిర్మాణం, పార్టీ నిర్మాణం చేపట్టడం జరిగింది.

దేశ రాజకీయాలలో తెలంగాణా ప్రాంతానికి 1952కు పూర్వపు కాలం యుద్ద కాండగా నుంటే తర్వాత కాలాన్ని శాంతి పర్వంగా అర్ధం చేసుకోవచ్చు. తెలంగాణాలో కొనసాగిన సాయుధ పోరాటం నైజాం నిరంకుశ పరిపాలనను కూల్చడానికి ఎంతగా గురిపెట్టబడిందో అంతకు తక్కువ కాకుండా తెలంగాణా ప్రాంత ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థను కూడా కూల్చివేయడానికి గురిపెట్టబడ్డది. వెట్టిచాకిరీ వ్యతిరేక పోరాటం, దళితులు, వెనకబడిన తరగతులు, మహిళలపై కొమ్ములు తిరిగిన భూకామందులు వారి గుండా తండాలు జరిపిన దౌష్ట్యాలకు వ్యతిరేకంగా తెలంగాణలోని గ్రామీణ ప్రజలు ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో అత్యంత వీరోచితంగా పోరాడినారు. ఆనాటి నాయకులు రచించిన జీవిత చరిత్రలు, అనుభవాలు, జ్ఞాపకాలలో పోరాట గాధలు కండ్లకు కట్టినట్లుగా వర్ణించబడినది. ఈ వుద్యమ ప్రభావం 1948 తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలపై పూర్తిగా పడ్డది. 1949లో ఆమోదించబడిన జాగీర్‌దారీ, మకైదారి, జమీందారీల రద్దుచట్టం ఆ తర్వాత 1950లో ఆమోందించబడిన హైద్రాబాద్ కౌలుదారీ మరియు వ్యవసాయ భూముల చట్టం ఇందుకు ప్రబల నిదర్శనాలు. ఈ చట్టాలను అమలు జరిపించుకోవడంలో రైతు సంఘాలు నిబద్దత, నిరంతర ఐక్య రైతు వుద్యమాల ద్వారా అనేకానేక విజయాలు సాధించినవి. రాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, అన్నివేళలా రైతు నాయకుడిగా గుర్తింపు పొందిన బద్దం ఎల్లారెడ్డి గారి పాత్ర అమోఘం, అద్వీతీయం. రాష్ట్రంలో ఎక్కడా ఏమూలన చట్టవ్యతిరేకతకు ఎవరు పాల్పడినా అక్కడ రెక్కలు కట్టుకొని వాలి రైతుల పక్షం నిలబడి విజయాలు సాధించిన అనేక ఘట్టాలలో బద్దం ఎల్లారెడ్డి గారి పాత్ర మరువరానిది. కరీంనగర్‌లో జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా, రైతుసంఘ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా రెండున్నర దశాబ్దాలు పనిచేసిన నాకు మార్గదర్శిగా నిలిచిన మహానుభావుడు ఆయనే. ఒకటి రెండు కాదు జిల్లాలో కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటాలు అందులో ఎదుర్కోవలసివచ్చిన అనేకానేక సమస్యలు, కష్టాలు అనేకం. ఈ పోరాటం ద్వారా సుమారు 3 దశాబ్దాల సుదీర్ఘకాలంలో కరీంనగర్ జిల్లా రైతుసంఘం ఆధ్వర్యంలో 3 లక్షల ఎకరాలకు మించిన భూములపై కౌలు రైతులు రక్షిత కౌలు సాధించుకొన్నారు. ఆ తర్వాత శాశ్వత పట్టాదారుడిగా మారినారు. వేలాది ఎకారాల పోరంబోకు ఖారజ్‌ఖాతా, వంచరాయి భూములపై భూములు లేని దళితులు, వెనకబడిన తరగతుల వారు పట్టా హక్కులు సాధించుకున్నారు. నీటి తీరువా, రైతుల అప్పుల రద్దు, అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా ముఖ్యంగా గ్రామాలలో

పటేల్, పత్వారీల దోపిడీలకు వ్యతిరేకంగా రైతు సంఘం సమరశీల పోరాటాలను నిర్వహించి అద్భుతమైన విజయాలను సాధించిన సందర్భాలు అనేకం. జిల్లా రైతు నాయకత్వానికి బద్దం ఎల్లారెడ్డి గారి అనుభవం, ప్రోత్సాహం పూర్తిగా లభించింది.

1952 పార్లమెంటుకు గెలిచిన ఎల్లారెడ్డిగారు తిరిగి 57లో ఓడిపోయారు. నేను 1957లో ప్రప్రథమంగా చొప్పదండి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాను ఎల్లారెడ్డి గారి ఓటమిని నేను భరించజాలలేదు. కొలది మాసాలలోనే బుగ్గారం నియోజకవర్గం నుండి గెలిచిన కాంగ్రెస్ శాసనసభ్యులు కోర్టు తీర్పు కారణంగా వదులుకోవలసివచ్చింది. ఆ ఖాళీని భర్తీ చేయడానికి ఎన్నికల కమీషన్ ఉప ఎన్నికల ప్రకటన చేసింది. బుగ్గారం ఉప ఎన్నికలకు ఎల్లారెడ్డి గారిని అభ్యర్థిగా నిర్ణయించి గెలిపించాలనే బలమైన కోరిక నాకు కలిగింది. అయితే ఎల్లారెడ్డి గారు ససేమిరా పోటీచేయనన్నారు. అందుకు వారిని ఒప్పించడానికి బహు ప్రయత్నం చేయవలసి వచ్చింది. చివరకు రావి నారాయణ రెడ్డి గారు నిధి సేకరణ బాధ్యత వహించి నేను ఎన్నికల ఏజెంటుగా నియోజకవర్గాన్ని కలియతిరిగే హామీ తర్వాత వారు తల ఊపారు. మేము మా హామీని నిర్వహించాం. తెలంగాణా వ్యాపితంగా పార్టీ కార్యకర్తలు ఈ ఎన్నికల పోరాటంలో భాగస్వాములయ్యారు. పెద్ద మెజారిటీతో ఎల్లారెడ్డి గారు గెలుపొందారు. ఆ తర్వాత ఒకసారి రాజ్యసభ సభ్యుడిగా, మరొకసారి ఇందుర్తి శాసనసభ్యులుగా గెలిచి తమ సేవలు దేశానికి అందించిన అమరజీవి. శతాబ్దాల సమైక్యతా చరిత్ర కలిగిన తెలుగుజాతిగా పునరుజ్జీవనం పొందాలని బద్దం ఎల్లారెడ్డిగారు ప్రగాఢంగా వాంఛించేవారు. తెలుగు జాతీయతకు వైతాళికులుగా నిలిచిన కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు గారు, గిడుగు రామ్మూర్తిగారు మొదలగు వారు రచించిన గ్రంధాలను ఆసక్తితో చదివి ఇతరులతో చదివించేవారు. 50వ దశకం ప్రధమంలో హైద్రాబాద్ పట్టణంలో విజయవంతంగా నిర్వహించబడిన విశాలాంధ్ర మహాసభకు ఆహ్వానసంఘ అధ్యక్షుడిగా చక్కని ఉపన్యాసం చేసారు. ఆ మహాసభకు శ్రీశ్రీగారు అధ్యక్షత వహించారు. ప్రపంచదేశాల కమ్యూనిస్టు పార్టీల రాజకీయ వ్యూహాలను ఎత్తుగడలను అంతర్జాతీయత పేరట మొదలు కోమిన్ టర్న్, ఆ తర్వాత కోమిన్ ఫార్మ్ కేంద్రాలు నిర్ణయాత్మక పాత్రను పోషించినవి. ఈ విధానాలు భారత కమ్యూనిస్టు పార్టీ పరిణామాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేసినట్లు చరిత్రనే సాక్ష్యం. 1963 - 64లలో కమ్యూనిస్టు చైనా భారతదేశంపై ఒకటికి రెండు పర్యాయాలు దాడి చేసింది. ఈ ఘటన భారత రాజకీయవేత్తలలో అత్యంత తీవ్రమైన దిబ్బాంతిని కలిగించింది. హిందీ చీనీ భాయి భాయి అంటూ అనేక సందర్భాలలో భారత చైనా మైత్రీ బంధాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన భారత ప్రధాని నెహ్రూ అవాక్కయి నిశ్చేష్టుడుగావడం దేశ భక్తులందరిని కలవర పెట్టింది. బాండుంగ్ మహాసభలలో పంచశీలాల పేరిట ప్రపంచదేశాల మద్య సత్సంబంధాల గురించి చేసిన ప్రకటనల తడి అరకముందే

చైనాలాంటి అగ్రదేశం భారతదేశంపై పనికిరాని సరిహద్దు నిర్ధారణ నెపంతో దాడి చేయడం నమ్మశక్యం కాని పరిస్థితి. ఇది అంతర్జాతీయ కమ్యూనిస్టు వ్యూహంలో ఒక భాగం. యుద్ధాల ద్వారా విప్లవాలను విస్తరణ చేయకలుగుతామనే కరుడుకట్టిన మూఢ నమ్మకమే దీని వెనుక దాగివున్న సూత్రం.

ఈ సంఘటన భారత కమ్యూనిస్టు పార్టీ ఉనికినే తీవ్రంగా ప్రభావితం చేసింది. చైనా దేశం చేసిన దాడి మనదేశంపై దురాక్రమణ అని దాన్ని ఖండించిన వారొకవైపు వుండగా అది సదాక్రమణనేనంటూ వాదించినవారు మరొకవైపు చీలిపోయారు. భారత ప్రభుత్వం తన గూఢచార సమాచారం ఆధారంగా వందలాది కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేసి నిర్బందించింది. అందులో ఈ రాష్ట్రంలో బద్దం ఎల్లారెడ్డి గారొకరు. అరెస్టుకు ఒక రోజు ముందుగా, నేను కరీంనగర్‌లో చైనా దురాక్రమణపై ఒక పౌర సమావేశంలో చేసిన ప్రకటనను విమర్శించాను. ఇటువంటి సున్నితమైన రాజకీయ అంశంపై తొందరపాటు ప్రకటనలు చేయడం పార్టీకి హానికరమని హితవుపలికారు. హైద్రాబాద్‌కు వెళ్ళినవారిని అక్కడే నిర్భంధంలోకి తీసుకోవడం జరిగింది. సుమారు ఒక సంవత్సరకాలం జైలు జీవితం గడిపారు. జైలులో ఈ ఘట్టంపై నాయకుల మధ్య తీవ్రమైన వివాదాలు జరిగినవి. బద్దం ఎల్లారెడ్డి గారు పిడివాదాన్ని విప్లవాల విస్తరణ వితండవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇటు కలకత్తాలో జరిగిన భారత కమ్యూనిస్టు జాతీయ కౌన్సిల్ సమావేశంలో చైనా చేసిన దాడి రాజకీయంపై తీవ్రంగా చర్చ జరిగింది. శ్రీయుతులు డాంగే, చంద్ర రాజేశ్వర రావు గారల నాయకత్వంలో ఒక వర్గం, శ్రీయుతులు పుచ్చలపల్లి సుందరయ్య, బి.టి.రణదీవే నాయకత్వంలో మరోవర్గంగా వాదించారు. మొదటివర్గం వారికి మెజారిటీ బలం చేకూరడంతో రెండవవర్గం మైనారిటీ వర్గం సమావేశం నుండి విడిపోయి పోటీ పార్టీని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు పార్టీ)ని స్థాపించడం జరిగింది. ఆ తర్వాత సాయుధపోరాటాల ఆవశ్యకతా అంశంపై తిరిగి ఆ పార్టీలో చీలికలు రావడం ఒకటికి మించిగా భారత కమ్యూనిస్టు పార్టీలు (మార్క్సిస్టు - లెనినిస్టు) పేరుతో అవతరించడం చారిత్రక అనుభవం.

భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి చక్కని కర్తవ్యం, భవిష్యత్తును దర్శించిన బద్దం ఎల్లారెడ్డి గారు ఈ చీలికలపై తమ తీవ్ర ఆందోళనను, మనస్థాపాన్ని తెలియచేయని దినమంటూ వుండేదికాదు.

1969లో తెలంగాణాలో, 1972లో ఆంధ్రప్రాంతంలో నిర్వహించబడిన వేర్పాటువాద వుద్యమాలను పూర్తిగా వ్యతిరేకించిన వారు. అలాగే నైజాం రాజరికాన్ని, నిరంకుశ భూస్వామ్య విధానాన్ని, సాయుధ పోరాటంతో సహా అన్ని పోరాట ఆయుధాలను విజయవంతంగా ఉపయోగిస్తూ ప్రజాసామాన్యాన్ని సుసంఘటితం, చైతన్యవంతం చేసిన అపార అనుభవ సంపద రాజకీయ పార్టీలకు, ప్రజాసేవకులకు పూర్తిగా

ఉపయోగపడాలని కోరుకునేవారు. రాజకీయమంటే ప్రజలను సాధికారులు చేయడమని వారి ప్రతినిధులుగా గెలిచిన వారు సంపూర్ణంగా ప్రజల మనోవాంఛలను రాజ్యాంగ, చట్ట నియమ నిబంధనల ఆధారంగా సాధించాలని, నిర్మోహమాటంగా ప్రకటించేవారు. అధికార సాధన, పదవుల అలంకరణ, స్వార్థ ప్రయోజనాల సాధనకు రాజకీయం సోపానం కాకూడదని ఇటువంటి ఆలోచనా సరళి హీనసంస్కృతి, నీతి బాహ్యమని ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టులాంటిదని తీవ్రంగా ఖండించేవారు. ఇటువంటి రాజకీయ, సామాజిక విలువలను సృష్టించి రాబోయే తరాలకు పదిలంగా అందచేసిన అమరజీవి బద్దం. నేను రాష్ట్రస్థాయి భాద్యతలను చేపట్టిన తరువాత కూడా వారి ఆదరాభిమానాలు నాకు ప్రోత్సహకాలుగా ఉపయోగపడినవి. నేను తరుచుగా సిరిసిల్ల శాసనసభ్యుడిగా గెలిచి శాసనసభలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా పోషించిన పాత్రను ఇతర నాయకులతో పాటు బద్దం ఎల్లారెడ్డి గారు ఆప్యాయంగా ప్రశంసించేవారు. వారు గతించడం కరీంనగర్, తెలంగాణా ప్రజావుద్యమానికి తీరనిలోటు. వ్యక్తిగతంగా నాకు పితృవియోగం లాంటిది. ఆనాటి పార్టీ కార్యదర్శి కీ॥శే॥ గిరి ప్రసాద్ గారి సమేతంగా గాలిపల్లి గ్రామానికి వెళ్ళి చివరి వీడ్కోలు కార్యక్రమాలలో పాల్గొన్నాను. గురుతుల్యుడు, సహచరుడు, విప్లవోద్యమ నిర్మాత, చరిత్ర పుటలలో సువర్ణక్షరాలతో లిఖించదగిన మానవతావాదికి వీడ్కోలు చెప్పి కృతార్థుడినైనాను.

# మఖ్దూమ్

మఖ్దూమ్ మొహియుద్దీన్ ఆయన పేరు. బక్క పలచ మనిషి. చామనఛాయ సాత్విక ప్రవృత్తి, పుట్టిన జిల్లా మెదక్, స్థిర నివాసం హైద్రాబాద్ పట్టణం. ఉర్దూభాషలో ఎం.ఏ. పూర్తి చేసుకొని సిటీ కాలేజిలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూ నిరంకుశ నైజాం పరిపాలనను అంతం చేసే కమ్యూనిస్టు విప్లవోద్యమంలో చేరి తన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసిన త్యాగధనుడు. భావస్వారూప్యం కల మార్క్సిస్టు మేధావులు నిర్మించుకున్న "కామ్రేడ్స్ అసోసియేషన్" యొక్క అగ్రనాయకులు. వారి సహచరులైన డా॥ రాజబహదూర్ గౌర్, ఆలం ఖూంద్‌మెరి, హైదర్ అలి, జవ్వాద్ రజ్వీ, ఓంకార్ ప్రసాద్ పేర్కొనదగిన ప్రజావుద్యమాల నాయకులు. భారత స్వాతంత్రోద్యమ నాయకగణంలో మకుటాయమానంగా నిలిచిన మహిళామణి సరోజనీనాయుడుగారి సంపూర్ణ ఆశీస్సులతో ఈ సంస్థ రూపుదిద్దుకోవడం ఆ తర్వాత వీరంతా భారత కమ్యూనిస్టుపార్టీలో చేరి వివిధ విద్యార్థి, కార్మిక వుద్యమాలకు నాయకత్వం వహించడం, హైద్రాబాద్ సంస్థాన విమోచన ఉద్యమంలో, ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో మరువలేని ఘట్టం.

విద్యార్థిగా, అధ్యాపకునిగా తన మాతృభాష ఉర్దూభాషలో కవిత్వం ప్రారంభించిన మఖ్దూం అనతికాలంలోనే అప్పటి సమైఖ్య భారతవనిలో అగ్రశ్రేణికి చెందిన గొప్ప ఉర్దూ కవిగా గుర్తింపు సాధించుకున్నారు. అభ్యుదయ రచయితల సంఘంలో, కీ॥శే॥ సజ్జాద్ జహీర్, సర్దార్ జాఫరీ, కైఫీ-ఆజ్మీల సరసన దేశంలోనే విప్లవ కవులుగా, అభ్యుదయ కవులుగా సాహితీ చరిత్రకు నూతన అధ్యాయాన్ని సమకూర్చారు. మానవుడు మానవుని దోచుకొనే దుష్ట సంస్కృతిని చీల్చి చెండాడుతూ దళితులు, పదితులు, అన్నార్థులు సుసంఘటితంగా దోపిడీ వర్గాలపై జీవన్మరణ దండయాత్రను ప్రేరేపించడంతో పాటు ఈ వర్గపోరాటం మానవీయ విలువలను పునరుజ్జీవింప చేయడానికి, మానవతను పరిరక్షించడానికి ప్రపంచవ్యాపిత సంస్కృతి, సాంప్రదాయాల కొనసాగింపుగా రూపొందించడం ఈ అభ్యుదయ కవిత్వం యొక్క విశిష్టత. ముఖ్దూం వ్రాసిన ఒక గేయం చాలు ఈ విశిష్టతను ఋజువు చేయడానికి "ముందడుగు వేయడంలో ఒంటరితనం కూడదు. జీవితాన్ని ప్రాణకోటిని అసలు కాలాన్నే వెంబడించుకునే విశాల, సువిశాల విశ్వవ్యాపిత దృష్టి, ధృక్పథం నీ గమనానికి చోదకశక్తిగా నుండి తీరాలి" "ఏ

జంగ్ హై, జంగే ఆజాదీ'' అను గేయం ఆనాటి విప్లవ యువతరం నాలుకలపై నటించింది. లక్షలాది యువతీ యువకులను స్వాతంత్ర కథన రంగంలోని ఆకర్షించింది. ప్రేయసీ ప్రియుల ప్రేమబంధ, విరహం, శృంగార రసం గురించి మఖ్దూం రచించిన కవితలు తన భాషా పాండిత్యంతో పాటు భావోద్రేకతను, ప్రేమ, అందుకొరకు త్యాగంలాంటి విలువలతో కూడిన రసమయ రచనలు ఈనాటికి సాహితీవేత్తల సంపూర్ణ సమర్ధతను సంతరించుకుంటున్నది. కవిగా, ఎంతటి ఉన్నత శిఖరాలు అధిరోహించినా అంతే ఔన్నత్యంతో కమ్యూనిస్టు కార్మిక నాయకుడిగా వారి ఉద్యమాల నాయకుడిగా రాణించినారు. వాస్తవాలను అత్యంత ఓపికతో అర్థం చేసుకొని తనదైన శైలితో సమస్యలను పరిష్కరిస్తూ విభిన్న హృదయాలు సమైక్య పరచడం, ఇలా ఉద్యమ శ్రేణులను ఐక్యపరచడం, ప్రోత్సహించడం ఆయన కళ.

మఖ్దూం గారితో నాకు 1945లో ప్రత్యక్ష సన్నిహిత పరిచయం కలగడం నాజీవితంలో ఒక మైలురాయిలాంటిది. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంటర్ విద్యార్థిగా వుంటూ కమ్యూనిస్టు కార్యకర్తగా, అఖిల హైద్రాబాద్ విద్యార్థి సంఘ పట్టణ నాయకునిగా విద్యార్థి రాజకీయాలలో శక్తివంచన లేకుండా పనిచేస్తున్న కాలం. యూనివర్శిటీ విద్యార్థులలో ''వందేమాతరం'' వుద్యమం తర్వాత ప్రతి సం॥ కృష్ణ జయంతి పండగరోజున భగవద్గీతపై వ్యాసరచన పోటీలు నిర్వహించే సాంప్రదాయం నెలకొన్నది. ఆ సం॥ కృష్ణ జయంతి రోజున పై వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ రచనలు ఎన్నుకొని ఆ రచయితలకి బహుమానాలను అందజేసే బాధ్యతను కవికోకిల శ్రీమతి సరోజనీనాయుడుగారు స్వీకరించారు. మఖ్దూం ఆమెగారి ప్రియశిష్యుడుగా విద్యార్థులకు ప్రత్యేక అతిథిగా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. సమావేశం ప్రారంభం అయ్యింది. మఖ్దూం తన కంచుకంఠంతో ''ఏ జంగ్‌హై, జంగే ఆజాదీ'' అనే గేయాన్ని ఆలపించి సభాసదుల హృదయాలను అలరింపజేశారు. అంతకుముందు భగవద్గీతపై వ్యాసరచన ఫలితాలను గోప్యంగా నుంచిన సరోజనీ దేవిగారి ప్రకటన కొరకు ఉత్కంఠభరిత వాతావరణం చోటు చేసుకున్నది. ఇంగ్లీషుభాషలో భగవద్గీతను ఆధ్యాత్మిక, తాత్విక ప్రబోధముగా చిత్రించిన నా సహాధ్యాయి, సన్నిహిత మిత్రుడు కీ॥శే॥ కె.వి. నర్సింగరావుగార్కి లభించింది. సభికుల హర్షధ్వానాల మధ్య భగవద్గీత గ్రంథరాజాన్ని బహుమానంగా మిత్రులు కె.వి.సరోజినిదేవి గారి కరకమలములచే పొందడం జరిగింది. నా ఆనందానికి అవధులు లేవు. భగవద్గీతపై ఉర్దూభాషలో రచించబడిన వ్యాసాలలో ప్రథమ బహుమానం నేను రచించిన వ్యాసానికి ప్రకటించ బడడం మహాఆనందంగా సభికుల కరతాళధ్వనుల మధ్య నన్ను తన్మయున్ని చేసింది. ఆ వ్యాసరచన కొరకు నా కళాశాల పాఠ్యాంశాలను ప్రక్కన పెట్టి ఒక నెలరోజులు రాత్రింపగళ్ళు చేసిన కృషి బహుశా నా జీవితంలో మరువలేని మంచి పరిశ్రమ. భగవద్గీతపై తాత్పర్యంతో సహా చేయబడిన రచనలు ముఖ్యంగా మహాత్మాగాంధీ, బాలగంగాధర తిలక్‌గారలు

రచనలను సూక్ష్మదృష్టితో పటించే మహాభాగ్యం లభించింది. అప్పటికే మార్క్సిస్టు తత్వశాస్త్రాలను రేఖామాత్రంగా చదివి జీర్ణించుకొన్న నేను భగవద్గీతను మానవ సామాజిక విలువల ప్రామాణికంగా గుర్తించి సామాజిక మార్గదర్శిగా వర్ణించడం జరిగింది. అందులోని "తాత్విక" భాష్యానికి బదులు "భౌతిక" భాష్యానికి పూనుకోవడం జరిగింది. నిండు సభలో సరోజనీదేవి నాయుడు తన దగ్గరకి పిలిచి భుజంతట్టి "కుమారా నీ ప్రయాసాన్ని గమనించినాను. నీవు ఒకనాటికి కమ్యూనిస్టుగా మారతావు" అంటూ బహుమానంగా "Socialist Sixth of the World"అను రష్యన్ రచయిత గ్రంథాన్ని బహుకరించడం జరిగింది. ప్రక్కనే నిలబడియున్న మఖ్ధూం పక పక నవ్వుతూ ఆయన ఇప్పటికే మా పార్టీ కార్యకర్త అనడం ఆ వాతావరణంలో సరికొత్త ఆశ్చర్యం, ఆసక్తి చోటుచేసుకున్నది. యువ కమ్యూనిస్టుగా సరోజనీనాయుడుగారిని సాక్షాత్తు భరతమాతగా ఆదరణీయ మఖ్ధుంగారిని అగ్రజుడుగా ఆరాధించిన నాలో పొంగి పొరలిన ఆనందం, ఆత్మాభిమానం, ఈనాటికి నా శక్తి సామర్థ్యాలకి ఒక సజీవ వనరులాంటిది. ఆనాటి నుండి మఖ్ధూంగారు, నేను గురువు, శిష్యుల సంబంధాన్ని అధిగమించి స్నేహితుని సహచరుల బాంధవ్యాన్ని అనుసరించడం జరిగింది.

1947 నాటికి హైద్రాబాద్ సంస్థానంలో భారత కమ్యూనిస్టుపార్టీ దినదినాభివృద్ధి చెందడం కార్మిక, రైతు, విద్యార్థి సంఘాలు విస్తరించడం చివరకు దేశ స్వతంత్రం, సంస్థాన విమోచనం వుద్యమాలలో శక్తివంతమైన పాత్రను నిర్వహించడం చారిత్రకం. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టుపార్టీ కార్యాలయాలు నాయకులు, కార్యకర్తలతో కళకళలాడడం, పోరాటాల అనుభవాలు, గాథలతో ఉప్పొంగిపోవడం నిత్య నూతన పరిణామ కేంద్రాలుగా నిర్వహించబడినవి. ఒక రాజకీయ పాఠశాల, ప్రయోగశాల అనుభూతి కలిగించినవి. 15 ఆగస్టు 1947 నాడు భారతావని స్వతంత్రాన్ని సాధించగా, దాని నడిబొడ్డులో నైజాం రాజరికంలోవున్న హైద్రాబాద్ సంస్థానం దేశ స్వతంత్ర వేడుకలకు సుదూరంగా నుండిపోయింది. సంస్థానాధీశులు తన సంస్థానం భారతదేశంలో విలీనం కాబోదని "స్వతంత్రంగా" కొనసాగుతుందని ప్రకటించారు. పైగా ఇది ఒక ముస్లిం రాజ్యంగా వుంటుందని చెప్పుకొన్నారు. ఇక్కడి ప్రతి ముస్లిం ఒక రాజు అని మతమౌఢ్యాన్ని, దురహంకారాన్ని రెచ్చగొట్టారు. వేలాది ముస్లిం యువకులకు ఈ దురహంకారాన్ని నూరిపోస్తూ సంస్థాన పరిరక్షణకు రజాకర్లు (స్వచ్ఛంద సేవకులు) పేరుతో సాయుధులను చేసి ప్రజోద్యమాలను అణచివేయడానికి పూనుకొన్నారు. అంతవరకు ఒక పరిమితిలో చట్టబద్ధ హద్దులతో వున్న మతవిద్వేషం, అరాచకత్వం కట్టలు తెంచుకొన్నది. ఇటు భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభ స్టేట్ కాంగ్రెస్ శ్రేణులు తమ ఆత్మరక్షణ, సంస్థానం భారతదేశంలో విలీనం కావాలనే లక్ష్యంతో తమ పోరాట పద్ధతులను మార్చుకొని సాయుధ ఆత్మరక్షణ పోరాటానికి బలోపేతం చేసినవి. ఇటువంటి భీషణ సంగ్రామం సమయంలో తమ సహచర నాయకగణంతో పాటు

మఖ్దూం నిర్వహించిన సాహసోపేత పాత్ర అత్యంత ప్రశంసనీయం. మతతత్వాన్ని ఎదిరిస్తూ, మతకలహాలు నిరోధిస్తూ శ్రమజీవుల వర్గపోరాటాన్ని కొనసాగించడం ఒక ఎదురీతగా కొనసాగింది. ఆత్మరక్షణ, వ్యూహరక్షణ, కార్యకర్తల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారుతున్న సమయంలో మఖ్దూం ప్రదర్శించిన అంకితభావం అనన్యసామాన్యం. ఆయన ప్రదర్శించిన వజ్రసంకల్పం, క్రమశిక్షణ తోటి నాయకుల, కార్యకర్తలకు గొప్ప అండగా ఉపకరించింది. రహస్యంగా నున్న సుమారు 3 సం॥లలో ఆయనతో కలిసి యుండే మహాభాగ్యం నాకు కలగడం అత్యంత సంక్లిష్టమైన రాజకీయ పరిస్థితులలో రహస్య జీవిత సమస్యల ఆటుపోటుల మధ్య కర్తవ్య నిర్వహణను కొనసాగించడంలో మామధ్య విడదీయరాని అనుబంధ బాంధవ్యం ఏర్పడింది. అందులో రాజకీయ సిద్ధాంతపరమైనవి, ఉద్యమానికి సంబంధించినవి దినచర్యలు వ్యక్తిగతమైనవి. చాలా సంఘటనలు మరపురానివి. ఈ సందర్భంగా కొన్నిరాజకీయ సంఘటనలను మరికొన్ని సాధారణ, ఆసక్తికర సంఘటనలను పేర్కొనడం సముచితం. హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాకపోవడం ఫలితంగా విలీనోద్యమం అత్యంత విశాల ప్రాతిపదికపై నిర్వహించబడడం చివరకు 1948 సెప్టెంబరు 13 నుండి 17 వరకు భారత ప్రభుత్వం పోలీసు చర్య ద్వారా సంస్థానాన్ని విమోచనం చేయడం ఒక చారిత్రక సంఘటన. అంతకు నాలుగుమాసాల ముందే కలకత్తాలో జరిగిన భారత కమ్యూనిస్టుపార్టీ రెండవ పార్టీ కాంగ్రెస్ ఆనాటి అంతర్జాతీయ, జాతీయ అవగాహన ప్రకారం రాజకీయంగా అసంబద్ధ తీర్మానాన్ని చేసింది. దేశం సాధించింది అసలు స్వతంత్రమేకాదని తెల్లదొరల స్థానే నల్లదొరల రాజ్యమేర్పడిందని భారతదేశంలో ప్రధాని నెహ్రూ చైనా దేశంలోని చాంగ్కై షేక్ లాంటి ద్రోహి అని తెలంగాణా మాదిరిగానే యావత్ భారతదేశంలో నెహ్రూ ప్రభుత్వాన్ని కూల్చి వేయడానికి ప్రజలు సంసిద్ధంగా వున్నారని ఆ తీర్మాన సారాంశం. అంతేకాదు రష్యాలో 1917 అక్టోబర్ విప్లవం తరహా భారతదేశంలో కూడా పట్టణ కార్మికుల తిరుగుబాటు సాధ్యం చేయాలని, గ్రామీణ రైతాంగం యొక్క తోడ్పాటు సహజంగా వుంటుందని కూడా ఈ తీర్మానం కర్తవ్య ప్రబోధం చేయడం జరిగింది. తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడినప్పటికి అనతికాలంలోనే ఆంధ్ర రాష్ట్ర కమిటీ ఈ మార్గాన్ని పూర్తిగా వ్యతిరేకించింది. పట్టణాలలో కార్మికుల తిరుగుబాటు మార్గానికి బదులు చైనా బాటలో గ్రామీణ ప్రజలు సుదీర్ఘ గెరిల్లా పోరాటాలద్వారా పట్టణాలను విముక్తిచేస్తారని వారి సిద్ధాంతం. పై రెండు వాదనల మధ్య పార్టీలో గొప్ప అంతర్యుద్ధం జరిగింది. ఒక సం॥లోనే కేంద్ర కమిటీ సమావేశం జరిగి రష్యా మార్గాన్ని ఓడిస్తూ చైనా మార్గం విజయకేతనాన్ని ఎగురవేసింది. అంతకుముందు ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన ప్రధానకార్యదర్శి బి.టి. రణదివే పోలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ రద్దుచేయబడి చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా కొత్త పోలిట్‌బ్యూరో, కొత్త కేంద్ర కమిటీ అధికారాన్ని హస్తగతం చేసుకొని దేశవ్యాప్తంగా గెరిల్లా పోరాటానికి పిలుపునిచ్చింది.

తెలంగాణాలో కొనసాగిన సాయుధపోరాటం పోలీస్‌యాక్షన్ ఫలితంగా నిలిపివేయనవసరం లేదని అది కొనసాగాలని, భారతదేశానికే తలమానికంగా వుండాలని, చైనాలో యనాన్‌లాగా తెలంగాణా ఒక విముక్తి ప్రాంతంగా అవతరించాలని పిలుపునివ్వడం జరిగింది. ఏదిఏమైనా దేశవ్యాప్తంగా ముఖ్యంగా హైద్రాబాద్ సంస్థానం అసమాన యుద్ధం వలన వేలాది కమ్యూనిస్టు కార్యకర్తలు ఆత్మబలిదానం చేశారు. పార్టీకి తీవ్రమైన నష్టం జరిగింది. తిరిగి కోలుకోలేని దెబ్బ తగిలింది. గత్యంతరం లేని పరిస్థితులలో పార్టీని నమ్ముకొన్న లక్షలాది శ్రమజీవులు, కార్యకర్తల మనోభావాల కనుగుణ్యంగా భారత కమ్యూనిస్టుపార్టీ తమ వ్యూహాన్ని ఎత్తుగడలను 1951 చివరి మాసాలలో ఉపసంహరించుకున్నది. మొదట ఆత్మరక్షణ కొరకు వెనకడుగు వేయాలంటూ క్రమంగా ఆచరణలో సాయుధపోరాట ఉపసంహరణ చేయడం జరిగింది. 1952 ప్రథమ సార్వత్రిక ఎన్నికలలో భాగస్వామ్యం కావడం జరిగింది. కమ్యూనిస్టుల సామ్రాజ్య వ్యతిరేక, సంస్థాన రాచరిక వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక సాహసోపేతమైన త్యాగపూరిత పోరాటాలను చూసిన ప్రజలు 1952 ఎన్నికలలో వారికి దిగ్విజయాన్ని సమకూర్చుతూ తమ కృతజ్ఞతలను చాటి చెప్పినారు. 48 నుండి 52 వరకు కమ్యూనిస్టులు తమ తీవ్రవాదం ఫలితంగా పొందిన నష్ట కష్టాల పట్ల తమ సంపూర్ణ సానుభూతిని వ్యక్తం చేశారు. సంక్షిప్తంగా పైనుదహరించిన రాజకీయ బడిదుడుకుల కాలంలో మఖ్దూంతో పాటు నేను నా కుటుంబం, రావి నారాయణ రెడ్డి వారి కుటుంబం దాదాపు కలిసి పనిచేయడం మా రాజకీయ జీవితంలో అత్యున్నత అనుభూతిగల అనుభవం. 1948 రెండవ పార్టీ కాంగ్రెస్ ఆమోదించిన పట్టణ విప్లవ పంధాను తాత్కాలికంగా ఆమోదించినా దాని ఆచరణ అసాధ్యమని గుర్తించడంలో ఎంతో కాలం పట్టలేదు. ఆంధ్ర నాయకుల ఆధ్వర్యంలో ఆవిర్భవించిన చైనా మార్గం అసలే మాకు వంట పట్టలేదు. అటు మమ్మల్ని ఒప్పించడానికి, మెప్పించడానికి నాయకత్వం చేయని ప్రయత్నం లేదు. సామ, దాన, బేధ, దండోపాయాల వరకు ఆయుధాలను తమ అమ్ములపొది నుండి వదులుతూ వచ్చింది. వాటిని సిద్ధాంతపరంగా తట్టుకోవడానికి రష్యా, చైనా సిద్ధాంత గ్రంథాలను ఏకరవు పెట్టడం మాకు తోచిన విధంగా భారతదేశ వాస్తవిక ప్రత్యేకతలను వివరించడం పార్టీని నమ్ముకున్న కార్యకర్తల, ప్రజల మనోభావాలు విశ్లేషించడం ప్రతివాదులుగా వందల పేజీలతో కూడిన పత్రాలు వ్రాయడం ఒక మహా ప్రయత్నంగా కొనసాగింది. సాయుధ పోరాటం లాంఛనంగా ఉపసంహరించబడినప్పటికి భారత కమ్యూనిస్టుపార్టీ రెండుగా చీలిపోయిన 1964 వరకు ఈ అంతరంగిక పోరాటం కొనసాగింది. మఖ్దూంలోనున్న సాత్విక సంపద ఆయనలోనున్న అకుంఠిత మానవతా భావం అలాగే రావి నారాయణరెడ్డిగారి అచంచల ప్రజాస్వామ్యభావం వీరి సహచరునిగా నున్న నాపై చెరగని ముద్ర వేసింది. నా పరిమిత జ్ఞాన, విజ్ఞానానికి మెరుగులు దిద్దింది. వారి భావాలను అక్షరబద్ధం చేస్తూ సిద్ధాంత పోరాటంలో భాగస్వామి కావడానికి

ఎంతగానో ఉపకరించింది. రెండవ సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో చోటు చేసుక్ను అంతర్గత పోరాటం సన్నగిల్లింది. అప్రధానమైన ముంచుకువస్తున్న ప్రజా సమస్యలు, వర్గ పోరాట సమస్యలు, నాయకుల సమయాన్ని సంపూర్ణంగా మ్రింగి వేసినవి. పార్టీ, ప్రజాసంఘాల విభాగాల, ప్రజల సమస్యలలో మునిగిపోవడం పార్టీకి నూతన యుగం స్వాగతం పలికింది. మఖ్దూం కవిగా, రాజకీయ నాయకునిగా సువిశాల భారతదేశ నలుమూలలలో, ప్రపంచదేశాలలో ఇనుమడించిన తన వ్యక్తిత్వం, అనుభవంతో తమ పదునైన భావాలను ప్రపంచశాంతి, ప్రజాస్వామ్యం, ప్రగతిశీల మానవత్వం కొరకు పూనుకొన్నారు. ట్రేడ్ యూనియన్ నాయకునిగా కార్మికుల సమస్యలను కూలంకషంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ యజమానుల వాదనలను కాదనిపించే కార్మిక పక్షపాతిగా కార్మికలోకాన్ని ఆకట్టుకున్నారు. శాసనసభ్యుడిగా మృధుమధురమైన సరళమైన ఉర్దూభాషలో మాట్లాడుతూ అధికార పక్షాన్ని మంత్ర ముగ్ధులను చేయగలిగారు. ముఖ్యమంత్రితో సహా ప్రతి సభ్యుడు మఖ్దూం దివ్యత్వాన్ని కొనియాడకుండా వుండలేకపోయేవారు. ఆనాటి శాసనసభలో ఒక మంత్రి ఆయన పేరు పూల్‌చంద్ గాంధీ. మఖ్దూంగారు ఆ మంత్రిశాఖ నిర్వాకాన్ని విమర్శిస్తూ "మీలో పూల్‌చంద్ - కాంటే బహుత్" వున్నాయని అనగానే సభ్యులందరు ఆయన చేసిన సునిశిత హాస్యభరిత విమర్శను కొనియాడారు. తెలుగులో చెప్పాలంటే మీలో పుష్పాలు తక్కువగాను ముళ్ళు ఎక్కువగా వున్నాయి.

మఖ్దూంగారితో రహస్య జీవితంలో సుదీర్ఘ కాలం కలిసియుండిన నాకు, నా శ్రీమతి లలితాదేవికి మరవలేని కొన్ని ఉదంతాలను చదువరులతో పంచుకోకుండా వుండలేము. శత్రు వలయంలో క్షణక్షణం భయం భయం వాతావరణంలో నెలలు, సం॥లు గడిపినప్పటికి మా మధ్య రక్త సంబంధానికి మించిన భావ బంధం. ప్రేమానుబంధం లెక్కకు మిక్కిలిగా చోటు చేసుకున్నవి. ఒక వుదంతం: మేము నివసించిన డెన్‌లో ఎక్కువకాలం వివిధ రంగాల ప్రముఖ నాయకులుండేవారు. ఆర్టీసి యూనియన్ వ్యవస్థాపకులు మహ్మద్ ఖాసిం (ఆయన ఒక మౌన ముని) రైల్వే కార్మిక సంఘ నాయకులు టి.వి విఠల్‌రావు (తర్వాత ఖమ్మం ఎం.పి.) రావి నారాయణ రెడ్డి వారి కుటుంబం, బలరాం వారి కుటుంబం, శిక్షపడి జైలులోవున్న కామ్రేడ్ సేనారెడ్డి వారి భార్య సుశీల, సిహెచ్. హనుమంతరావు (తర్వాత ప్లానింగ్ కమీషన్, ఫైనాన్స్ కమీషన్ సభ్యులు) మొదలగువారు వుండేవారు. ఈ డెన్ నిర్వహణ, బరువు బాధ్యతలు నాపైవుండేవి. ఒక వారం, పదిరోజులు రేషన్‌షాపు నుండి బియ్యం తెచ్చుకోవడం అసాధ్యమయింది. శనగలు, మక్కలు వుడకబెట్టుకొని కాలక్షేపం చేయక గత్యంతరంలేని పరిస్థితి ఏర్పడ్డది. మహిళలు అనారోగ్యంతో నున్నవారు ఈ పరిస్థితిని ఎలా తట్టుకుంటారో అనే ఆందోళన కలిగింది. అయినా విధిలేదు. అందరి మధ్య ఒకే ఒక పాప. అది నా పెద్ద కుమార్తె అరుణ. మఖ్దూం ప్రతి రాత్రి తన పని ముగించుకొని చేతి రుమాలులో

అన్నం తెచ్చేవాడు. అరుణ రాత్రి ప్రొద్దు పోయినప్పటికి వేచియుండి తన పెదనాన్న మంచి అన్నం పెట్టగానే కడుపునిండా ఆరగించి నిదురపోయేది. అమ్మాయి హాయిగా భోజనం చేసి పడుకునే వరకు పెదనాన్న అయిన మఖ్దూం శ్రద్ధా శక్తులతో కనిపెట్టేవారు. తల్లిదండ్రులముగా మేమిద్దరం అనిర్వచనీయమైన ప్రేమానుభూతితో తన్మయులయ్యే వారము. దేశం కొరకు, శ్రమజీవుల రాజ్యస్థాపన కొరకు తెగించి పోరాడే నాయకశ్రేణిలో నుండిన వ్యక్తిగత ప్రేమానుబంధం నిజంగా అశేష ప్రజానీకంపై నుండిన ప్రేమ అంకితభావం నుండి ఉత్పన్నమయినది; పవిత్రమైనది. అమ్మాయికి 3, 4 సం॥ల వయస్సులోనే చీర కట్టుకునే కోరిక దాని పెద్దనాన్న, మఖ్దూంగారిని చలింపచేసింది. వెంటనే చీరను పోలిన గుడ్డను తెచ్చి తన చేతులతో అమ్మాయికి చీరకట్టుతూ అమితంగా ఆనందించేవాడు. నిజంగా ఆయన ప్రేమ పిపాసి. తాను నవ్వుతూ అందరినీ నవ్వించడం, ఆ నవ్వుల ద్వారా మానవీయ విలువలను తెరపైకి తేవడం ఆ కళాకరుని స్వంతం.

మరొక ఉదంతం:

పార్టీలో ఒకనాడు అంతర్గత విబేధాలు తీవ్రస్థాయికి చేరుకున్న విషయం తెలుసుకున్నాం. పార్టీ నాయకత్వం మాపై క్రమశిక్షణ చర్య గురించి తీవ్రంగానే ఆలోచించింది. ఒకరోజు సాయంకాలం మఖ్దూం గారు, నేను అలవాటు ప్రకారం మా డెన్ నుండి సైకిళ్ళపై బయలుదేరి వెళ్ళాం. తిరిగి సినిమా 2వ షో పూర్తి అయ్యే సమయానికి జనం మధ్య నుండి మా డెన్‌కు చేరుకున్నాం. ఇంటిలోకి రాగానే ఆప్యాయంగా పలకరించవలసిన మా శ్రీమతి లలిత, శ్రీమతి సుశీల నిండుగా దుప్పటి కప్పుకుని వేరేగదిలో పడుకుని యుండడం చూశాం; ఆశ్చర్యపడ్డాం. నేను లలిత వద్దకు వెళ్ళి ఆమెను లేపడానికి ప్రయత్నించాను. స్పందన లేదు. పెద్ద కోపంతో, ద్వేషంతో పలుకు లేకుండా పడియున్నట్లు గమనించాను. పక్కనే ఆందోళనగా నిలుచున్న మఖ్దూంగారికి ఈ అనుహ్య పరిస్థితిని తెలియచేశాను. ‘‘ఎవరైనా పార్టీ నాయకులు ఇంతవరకు వచ్చి మాట్లాడి వెళ్ళిపోయినారా’’అని అడగమన్నారు. అలాగే అడిగాను. ఆలస్యంగానైనా కోపంతో లలిత నోరువిప్పి అసలు విషయాన్ని చెప్పింది. పార్టీ జిల్లా కార్యదర్శిగారు వచ్చి సుమారు 2 గం॥ల వరకు మా మధ్య కూర్చొని ‘‘మీరు పార్టీకి ద్రోహం తలపెట్టినారని త్వరలో శత్రువుతో కలిసిపోతారని అలాంటి పరిస్థితులలో మహిళలమైన మేము పార్టీ సభ్యులుగా పార్టీలో వుంటామా లేక విద్రోహం తలపెట్టిన వారితో వుంటామా తేల్చుకొమ్మని చెప్పారు’’ మేము ఎట్టి పరిస్థితులలో కూడా పార్టీని వదలమని సమాధానం ఇచ్చినాము. ఇది వినగానే పకపకా నవ్వుతూ మఖ్దూం తనదైన శైలిలో రాజకీయాలు, కుటుంబ సంబంధాల అంశంపై సుదీర్ఘ వివరణ ఇచ్చారు. పార్టీ అంతరంగిక విబేధాలు కేవలం మిత్ర వైరుధ్యాలు మాత్రమేనని శత్రు వైరుధ్యాలు కానే

కావని వివరించారు. మహిళలతో మాట్లాడి వెళ్ళిన జిల్లా కార్యదర్శిగారి అవగాహన రాహిత్యాన్ని, తొందరపాటు తనాన్ని పట్టించుకోవడం పనికిరాదని మహిళలకు నచ్చచెప్పారు. రెండవరోజే ఆ నాయకమణ్యుడిని పిలిపించి అతనిచే తన పొరపాటును ఒప్పించి ఆత్మ విమర్శన విప్లవ పార్టీకి ఎంత అవసరమో ఋజువు చేశారు. ప్రియతమ నేస్తం మఖ్దూం ప్రవచనాలు, ప్రబోధాలు ఆయన సహచరులను, అనుచరులను ఆత్మవిశ్వాసంతో శ్రమజీవుల సేవలో తమ జీవితాలను అర్పితం చేయడానికి తరగని నిధిగా నిలుస్తాయి.

# అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య

అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య భారత రాజకీయ చరిత్ర, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన వ్యక్తిత్వంగల మహామనిషి, అధికారం, అడంబరాలతో నిమిత్తంలేని నిరంతర ప్రజాసేవకు ఆయన జీవితం నిలువుటద్దం. మహాత్మాగాంధీగారు సెలవిచ్చినట్లు 'నా నడకనే నా సందేశం'అను అమూల్య సూత్రాన్ని ఆచరించిన ఆదర్శజీవి.

23 సంవత్సరాల యువకుడిగా ఆనాటి హైద్రాబాద్ సంస్థాన విద్యార్థి నాయకుడిగా నన్నాకర్షించిన త్రిమూర్తులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్యగారులు. నా దృష్టిలో బద్దం ఎల్లారెడ్డి ప్రజా సామాన్యం యొక్క అంతరంగాన్ని అట్టే పసిగట్టే శక్తిమంతుడు. రావి నారాయణ రెడ్డి సువిశాల దృక్పథంతో ప్రజలను సమీకరించగలిగే దక్షత గలవాడు. పుచ్చలపల్లి సుందరయ్య తాను నమ్మిన సిద్ధాంతాన్ని వజ్ర సంకల్పంతో ఆచరించే త్యాగధనుడు. ఆణిముత్యాలలాంటి వీరు, వీరి సహచరులు మరెందరో నిర్మించిన హైద్రాబాద్ సంస్థాన విమోచనోద్యమం, తెలంగాణా రైతాంగ విప్లవోద్యమం ప్రపంచ ప్రజావుద్యమాల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టాలుగా వెలుగొందినవి.

స్వాతంత్ర్యానంతరం సుందరయ్య గారు పార్లమెంటులో ప్రతిపక్ష నాయకులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకులుగా అత్యంత ఆసక్తిదాయకం, ఆదర్శప్రాయమైన పాత్రను పోషించారు. పార్లమెంటరీ విద్య అందరికి సరికొత్తదే అయినా, వారు మాత్రం ఒక నిష్ణాతుడిగా అగుపించేవారు. దాని రహస్యం ఒకేఒకటి. నియమ నిబంధనలను అనుసరించడం వాటిని అన్వయించడం, చర్చనీయాంశాలను కూలంకుషంగా అధ్యయనం చేయడం తిరుగులేని సాక్ష్యాధారాలతో వాదించడం, అధికార పార్టీ నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా సుందరయ్యగారి పరిశ్రమను వాదించే పటిమను కొనియాడేవారు. విషయాజ్ఞానం, వాదించే వైదుష్యం, నిరాడంబరత వారి స్వంతం. సూత్రం ఎంతగొప్పదైనా విషయం ఎంత సత్యంతో కూడినదైనా ఆచరించే చాలా సందర్భాలలో వాటిని అన్వయింపు కొరకు పరిస్థితులతో కొంత రాజీపడే అవసరాలేర్పడతాయి. ఇది సుందరయ్య గారికి తెలియనిది కాదు. తాను మాత్రం రాజీలేని పోరాటం చేసేవాడు. రాజీపడేవాడు కాదు. అయినా నవ్వుతూ, రాజీపడిపోవడాన్ని

తిలకించేవారు. ఆయన నాయకత్వ పాత్రకు వన్నె తెచ్చిన అంశాలలో ఇది ముఖ్యం. ఇలాంటి సూత్రబద్ధ, నియమ నిబద్ధత వారికి నిత్యకృత్యం. ఈ తత్వంలో కొంత కాఠిన్యం కనబడినా, సిద్ధాంత ప్రాధాన్యతపట్ల సదవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపకరించింది.

ఒక చిన్న ఉదంతం వారిని చలింపచేసింది. 1982లో నటసార్వభౌముడు ఎన్.టి.ఆర్. రాజకీయరంగ ప్రవేశం చేశాడు. ఆనాటి రాజకీయ రంగంలో శూన్యం ఏర్పడియున్నది. అయిదు సం॥ల కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు పరిపాలించి ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యామ్నాయం లేదు. ఎన్.టి.ఆర్. తన సహజసిద్ధమైన భావోద్వేగం అద్వితీయ జనాకర్షణ బలంతో ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని సంపూర్ణంగా పూరించడానికి జనంలోకి దూసుకువచ్చారు. అవతార పురుషుడుగా అలరించిన ఎన్.టి.ఆర్. తమ సమస్యలు ఆమూలాగ్రంగా పరిష్కరించగలిగే సమర్థుడని నమ్మిన ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఒకరోజు వేలాది జన ప్రవాహంతో రథయాత్రలో తెలుగుదేశం పార్టీ ఊరేగింపు శాసనసభ భవనం ముందు నుండి కొనసాగిపోయింది. శాసనసభ సిబ్బంది అత్యంత ఆసక్తితో సభా భవనం పై నుండి కొనసాగుతున్న జైత్రయాత్రను తిలకిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులుగా తమ తమ గదుల నుండి బయటకు వచ్చిన గౌ॥ గౌతు లచ్చన్న, పుచ్చలపల్లి సుందరయ్య, నేను సైతం కిటికీల వద్దకు చేరి ఎన్.టి.ఆర్. ఊరేగింపును కండ్లారా చూచాము. సుందరయ్యగారు లచ్చన్నగారిని చూస్తూ ఇలా అన్నారు. "లచ్చన్నా మనం కూడా సుమారు 50 సం॥ల నుండి రాజకీయాలలోనున్నాం కదా! నిన్న కాదు మొన్న రాజకీయరంగ ప్రవేశం చేసిన ఒక సినీ నటుడుకి రాజకీయాలలో ఇంతటి బ్రహ్మరథం పట్టడమేమిటి?" లచ్చన్నగారు ఈ విధంగా సమాధానం చెప్పారు. "అది ఆయన నొసటి వ్రాత. ఎవరికి ఎప్పుడు ఏది జరగాలో అదే జరుగుతుంది." గతితార్కిక భౌతికవాది సుందరయ్యగార్కి చిరునవ్వు తప్ప ఏమి పాలుపోలేదు. నేనొకడుగు ముందుకు వేసి సుందరయ్యగారిని ఉద్దేశించి ఇలా అన్నాను. "సుమారు 40 సం॥ల సుదీర్ఘ చరిత్ర గలిగిన కమ్యూనిస్టు వుద్యమం చీలిపోవడం వలననే కదా ఈ రాష్ట్రంలో రాజకీయ శూన్యం ఏర్పడిపోయింది. అందుకే ఒకే ఒక వ్యక్తి తన నటనా చాతుర్యంతో, జనాకర్షణ బలంతో రాజకీయరంగ శూన్యాన్ని పూరించగలుగుతున్నాడు." "అంతేనంటావా" అంటూ శ్రీ సుందరయ్యగారు తమ గదిలోకి నన్ను తీసుకు వెళ్లారు. కనీసం ఒక గంటసేపు కమ్యూనిస్టు సిద్ధాంతం దాని వ్యూహం, ఎత్తుగడల గురించి వివరించారు. కమ్యూనిస్టు పార్టీ కార్మిక, శ్రమజీవుల పక్షపాతిగా ఏకశిల సాదృశ్యంగా నుండక తప్పదన్నారు. బూర్జువా పార్టీల సహజసిద్ధమైన అధికార, ధనార్జన, పదవీ వ్యామోహపూరితమైన ఆలోచనలకు ఈ పార్టీలో ఏలాటి స్థానం వుండరాదన్నారు. కార్మికవర్గ సాధికారతను సాధించేవరకు చిన్నగా నున్న, ఒంటరిగా నున్న, బలహీనంగా

నున్నామని భయపడనక్కరలేదన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మన గమ్యం కారాదన్నారు. ఒక గమనం మాత్రమేనన్నారు. అయినా వామపక్షాల సంఖ్యాబలం రాజకీయాల పరిణామంలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుందన్నారు. ఒక 'క్యాటలిటిక్' ఏజెంటుగా తాను పెద్దగా మారకున్నా పరిస్థితులలో మాత్రం గొప్పగా మార్పును సంతరింప చేస్తుందని అత్యంత విశ్వాసంతో చెప్పారు. వారు ప్రదర్శించిన ప్రగాఢ ఆత్మవిశ్వాసం, అకుంఠిత నమ్మకం నన్ను మంత్రముగ్ధున్ని చేసింది. అయినా వజ్రంలాంటి సుందరయ్యగారి ఆలోచనా సరళిలో ఒకింత మృదుత్వం, పట్టువిడుపులు, హృదయ వైశాల్యం వుంటే మరెంత బాగుండును అనుకుంటూ బయటకు వచ్చాను.

ఆంధ్రప్రదేశ్ ప్రధమ శాసనసభ (1957-62)వారు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీకి నాయకులు, రావి నారాయణ రెడ్డి, ఆరుట్ల కమలాదేవిలు ఉప నాయకులు. నేను ఛీఫ్ విప్‌గా ఉండి నాయకునికి సన్నిహితంగా పనిచేసే భాగ్యం లభించింది. ఆ తర్వాత మూడవ శాసనసభ (1967 -72), తిరిగి ఆయిదవ శాసనసభ (1978-82)లో వారు సిపిఐ (యం) నాయకులుగా, నేను సిపిఐకి నాయకునిగా ప్రక్కప్రక్కనే కూర్చుని పనిచేసే మధురస్మృతులు నా విలువైనా జ్ఞాపకాలు. కాచివడబోసిన వారి సేవాతత్పరత, రాజనీతిజ్ఞత నన్ను నేనుగా తీర్చిదిద్దుకునే ప్రక్రియలో ఎంతగానో తోడ్పడింది.

ఈనాటి రాజకీయాలు, రాజకీయ నాయకుల ప్రవర్తనల గురించి రాయడం ఇక్కడ అసందర్భం. అయినా రాజర్షిలాంటి సుందరయ్యగారి జీవిత విశేషాలను స్మరించుకోవడం వారు నెలకొల్పిన ఆదర్శాలను మననం చేసుకోవడం అత్యంతావశ్యకం.

# అభినవ సంస్కర్త - ఎన్.టి.ఆర్

అభినవ సంస్కర్త, రాజనీతిజ్ఞుడు, అన్నింటికి మించి నటసార్వభౌముడు, అభిమాన మిత్రులు, కీ॥శే॥ నందమూరి తారక రామారావు గారి 83వ జన్మదినోత్సవ సందర్భంగా సంస్మరణ వాక్యాలు వ్రాయడం గర్వకారణంగా భావిస్తున్నాను. ఎన్.టి.ఆర్. వ్యక్తిత్వం విశిష్టమైనది. సుమారు 4 దశాబ్దాలు నటనా వైదుష్యం ఆయన సాంస్కృతిక జీవిత ఔన్నత్యాన్ని నిర్ణయించగా, కేవలం 10-12 సం॥ల రాజకీయ జీవితం కీర్తి కిరీటాన్ని పెట్టి ఆయన జీవితానికి పరిపూర్ణతను సమకూర్చింది. ఆయన శిఖరాయమాన సినీరంగ కళాజీవితం గురించి ఎందరో మహానుభావులు ప్రామాణిక రచనలు చేసారు. రాజకీయ రంగంలో ఆయన పోషించిన అద్వితీయ, ప్రతిభాపాటవాల గుర్తులను స్పృశించడం అవసరం.

సంస్కృతి సామాజిక పరిణామానికి ప్రధాన ఇంధనం. తరతరాలుగా సమాజం సమకూర్చుకున్న భౌతిక వస్తువాహనాలు, భావాలు, ప్రతిమలు, విశ్వాసాలు ఇష్టా అయిష్టాలు, విలువలు, నమ్మకాలు మరియు సామాజిక రూపకాలు వీటన్నింటి సముపార్జన, తరతరాలుగా వీటి పోషణ, ఆదాన ప్రధానం, సంస్కృతికి మూల పదార్థం, రాజకీయం, సంస్కారపూరిత, సుస్థిర సామాజిక పరిణామానికి ఒక చోదకశక్తి. ఆధునిక పరిభాషలో ప్రజాస్వామ్యం ఒక రాజకీయ ప్రక్రియ. ఇది ప్రజా బాహుళ్యం నుండి జన్మించి వారి బహుముఖ అభ్యుదయాన్ని లక్షించి వారు నిర్మించిన సంస్థలు, వ్యవస్థల ద్వారా నిర్వహించబడుతుంది. దీనినే ప్రజాస్వామ్య వైతాళికులు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలుగా వర్ణించారు. పై మూడు ఆణిముత్యాలను స్వతంత్రం, హేతువాదం, స్వయం పోషక నీతి నియమాలుగా వివరించవచ్చును. ఈ మూడు విలువలను జీర్ణించుకుని తమ రక్తమాంసాలుగా ప్రసరించుకోగలిగిన సమాజం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థను కేవలం భౌతికాభివృద్ధి సాధనంగానే కాక నిజమైన మానవాభివృద్ధి ప్రదాతగా ఉపయోగించుకోగలుగుతుంది. కాబట్టి అన్ని రాజకీయ వ్యవస్థల కంటే ఉత్తమ రాజకీయ వ్యవస్థగా పరిగణించబడుతున్న ప్రజాస్వామ్యం బలమైన పునాదులపై సుస్థిరంగా నిలదొక్కుకొని తన కర్తవ్య నిర్వహణ చేయాలంటే పై విలువలతో కూడిన సామాజిక పరిణామం అవసరం.

35 సంవత్సరాల స్వాతంత్రానంతర సుదీర్ఘ ప్రయాణంలో భారతదేశం ఆశించిన అభివృద్ధిని మానవ అభ్యుదయాన్ని సాధించటంలో చాలా వెనుకబడిపోవటం జరిగింది. ఆంధ్రరాష్ట్రం బలమైన ప్రత్యామ్నాయం లేక దిక్కుతోచని పరిస్థితులలో సాంస్కృతిక కృషీవలుడైన యన్.టి.ఆర్. రాజకీయ రంగప్రవేశం చేయడం నూతన శఖారంభానికి తెరలేపినట్లయింది. తెలుగు ప్రజావాహిని, అనన్య సామాన్యమైన విశ్వాసం, నమ్మకంతో యన్.టి.ఆర్. కు బ్రహ్మారథం పట్టింది. ఆయన రాజకీయ రధసారధిగానే గాక సామాజిక,సాంస్కృతిక విప్లవోద్యమానికి స్ఫూర్తి ప్రధాతగా నిలుస్తారని నమ్ముకున్నది. రాజకీయ ప్రజాస్వామ్యానికి అవసరమైన సాంస్కృతిక ఇంధనాన్ని సృష్టించి, సమకూర్చి సద్వినియోగం చేయగలుగుతాడనే పరిపూర్ణ విశ్వాసం ఏర్పడింది. అందుకే తొమ్మిది మాసాల అనతికాలంలోనే ఆంధ్రప్రదేశ్ నలుమూలలను ఆవరించిన బలమైన తెలుగుదేశంపార్టీ ఆవిర్భవించింది. యన్.టి.ఆర్. ని ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నది.

ఐతే కరుడుకట్టిన అభివృద్ధి నిరోధకవర్గాలు, స్వంతపార్టీ ఇంటా, బయటనున్న అవకాశవాద స్వార్ధపరులు నూతన ప్రభుత్వ పురోగమనాన్ని అత్యంత హేయమైన రాజ్యాంగ వ్యతిరేకమైన యుక్తులు, కుయుక్తులతో అడ్డుకున్నవి. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ ద్వారా రాజ్యాంగబద్ధంగా పెద్ద మెజారిటితో ఎన్నుకోబడిన పార్టీ బలాన్ని వక్రీకరించింది. కూల్చి వేయడానికి నిర్ణయించింది. రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టించింది. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితులలో అప్పుడప్పుడే రాజకీయరంగ ప్రవేశం చేసిన యన్.టి.ఆర్. తెలుగు ప్రజల ఆత్మాభిమాన బావుటాను ఎగురవేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదాన్ని లేవనెత్తారు. ద్రోహపూరిత ఎదురుదాడిని త్రిప్పికొట్టే శంఖారావం చేసారు. తెలుగు ప్రజలు పరిపూర్ణ సహకారాన్ని అందచేసారు. భారతదేశ ప్రజలంతా జరుగుతున్న ప్రజాస్వామ్య విద్రోహాన్ని వేనోళ్ళ ఖండించారు. నూతన ఆదర్శాలు, వినూత్న కార్యక్రమాలతో సుపరిపాలన దిశలో సాగిపోతున్న యన్.టి.ఆర్. పరిపాలనను పరిరక్షించడానికి కంకణబద్ధులైనారు. పరిస్థితి భిన్నించింది. కేంద్రప్రభుత్వం దిగి వచ్చింది. తిరిగి యన్.టి.ఆర్.కి పట్టాభిషేకం చేసింది. యన్.టి.ఆర్. యొక్క ఆత్మాభిమానం తనలో ఎక్కడోదాగియున్న అసహనాన్ని వెలికితీసింది. విద్రోహుల సరసన తిరిగి శాసనసభలో కూర్చోవడానికి నిరాకరించారు. విద్రోహులను శిక్షిస్తూ తిరిగి కొత్త శాసనసభను ఎన్నుకోవలసిందిగా పిలుపినిచ్చారు. పెద్ద సంఖ్యాబలం కలిగి యుండి కూడా శాసనసభ రద్దును ప్రతిపాదించిన ఘనత భారత రాజకీయ చరిత్రలో యన్.టి.ఆర్.కే దక్కింది. తిరిగి ప్రజలు యన్.టి.ఆర్. కోర్కెను ఆహ్వానించారు. పెద్ద మెజారిటీతో గెలిపించారు.

85 నుండి 89 వరకు యన్.టి.ఆర్. ముఖ్యమంత్రిగా సాగిన పరిపాలన మౌళికమైన మార్పులను చేసింది. రెండు రూపాయలకు కిలో బియ్యం విధానాన్ని ప్రకటించి ఖచ్చితంగా అమలు పరచి పేద ప్రజల జీవితంలో నూతన ఉత్సాహాన్ని, సంతృప్తిని

సమకూర్చింది. పెరుగుతున్న ధరల విషవలయంలో బ్రతుకు భారాన్ని ఈడ్వలేని దళితులు, బలహీన వర్గాల స్త్రీ, పురుషులు నిట్టూర్పు విడిచారు. మధ్యపాన నిషేదాన్ని ప్రకటించి మహిళా లోకాన్ని ఆకట్టుకున్నారు. స్త్రీలకు తండ్రి ఆస్తిలో కొడుకులతో సమవాటా లభించే చట్టాన్ని ఆమోదించి స్త్రీ స్వాతంత్రానికి పునాదులు వేశారు. పౌరాణిక, చారిత్రక, సామాజిక చిత్రాలలో సంస్కర్త పాత్రను పోషించిన యన్.టి.ఆర్. దైవసమానులుగా ప్రజలు ముఖ్యంగా మాహిళలచే కొనియాడబడినారు. స్వాతంత్రానికి పూర్వం నుండి బ్రిటీష్ పాలకుల రాచరికాలకు మూలస్థంబాలుగా వుండి గ్రామీణ సామాజిక, ఆర్థిక వ్యవస్థను బానిస బంధనాలలో బిగించి పెట్టిన గ్రామాధికార పటేల్, పర్వారి, కరణం వ్యవస్థను ఒక్క కలంపోటుతో రద్దుచేసి యన్.టి.ఆర్. నిజంగా విప్లవం తెచ్చారు. ఈ నాటికి గ్రామీణ ప్రజలు వెనుకటి దుర్ వ్యవస్థ పీడ విరగడైనందుకు సంతృప్తిగా ఉన్నారు. అంతేకాదు నూతన మాండళిక వ్యవస్థను ఏర్పరచి ప్రజల వద్దకు పాలన సుసాధ్యం చేసారు. వికేంద్రీకృత స్వపరిపాలన యంత్రానికి రూపకల్పన చేశారు. అనేక పరిపాలనా కార్యక్రమాలకు ఈనాటి వరకు మాండలిక వ్యవస్థ ఎంతగానో దోహదం చేస్తున్నది. దుర్భేధ్యం అనుకున్న ప్రభుత్వ పరిపాలనపై వుండిన అపనమ్మకాలు తొలగిపోయినవి. సుపరిపాలన ప్రయాత్నాలకు ఎంతో సానుకూల పరిస్థితులు ఏర్పడినవి. గ్రామ పంచాయితీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు మరియు రిజర్వేషన్లను అమలు పరుస్తూ దళిత, వెనుకబడిన వర్గాలు, స్త్రీలలో విన్నూత్న చైతన్యాన్ని కలిగించారు. అధికారం ఒక గగన కుసుమంగా భావించే ఈ వర్గాలు సాధికారతను అనుభవిస్తూ తమ ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోగలుగుతున్నారు. భానిసత్వ భావాలను పారద్రోలుతూ తమ వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని పదిలపరుచుకుంటున్నారు. ఇలా వికేంద్రీకృత ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వాతంత్ర్యం, పరిపాలనలో ప్రజల ప్రత్యక్ష పాత్రల రూపకల్పన సాధించబడుతుంది. ఐతే అభివృద్ధికి అడ్డుగోడలు తొలగించబడిన సంతోషం సార్ధకం కావాలంటే వికేంద్రీకృత వ్యవస్థలకు రాజ్యాంగం నిర్దేశించిన విధులను, నిధులను మళ్ళించే కర్తవ్యం ఇంకా మిగిలియున్నది. సహకార పరపతి సంఘాలలో దశాబ్ధాలుగా కూరుకుపోయిన బూజును తొలగిస్తూ ఏక గవాక్ష విధానాన్ని ప్రవేశపెట్టి రైతాంగ సమస్యల పరిష్కారానికి గొప్ప ప్రయత్నం చేయడం జరిగింది. పైన నుదహరించిన కొన్ని సంస్కరణలు మౌలికమే అయినప్పటికి వాటిని శాశ్వతం చేయటానికి ఇతర రంగాలలో మరెన్నో సంస్కరణలను చేపట్టడం ఇంకా మిగిలియున్న కర్తవ్యం. ప్రజలపై ప్రజాస్వామ్యంపై ఏమాత్రం విశ్వాసంలేని అధికార యంత్రాంగాన్ని నమ్ముకొని, ప్రజాసేవ లేషమాత్రమైనా ఎరగని కేవలం దండనాస్త్రంగా మిగిలిన పోలీస్ యంత్రాంగాన్ని పట్టుకొని ఎంతటి మంచి పరిపాలకులైనా ఆశించిన ఫలితాలను సాధించడం అసాధ్యం. అలాగే సంస్కరణలపై విశ్వాసంకలిగి దృఢసంకల్పం కలిగిన వ్యక్తులతో కూడిన రాజకీయపార్టీ బలం అత్యవసరం. బలోపేతమైన, విస్తృతమైన, చైతన్యవంతమైన నాయకత్వపాత్ర

పోషించే పార్టీ యంత్రాంగం కూడా ప్రధాన అవసరం. ఏది ఏమైనా 89 సాధారణ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి ఓటమితప్పలేదు. యన్.టి.ఆర్. ప్రతిపక్ష నాయకుడిగా సరికొత్త పాత్రను పోషించక తప్పలేదు.

తదుపరి 5 సంవత్సరాలకాలం అధికారాన్ని వెలగబెట్టిన కాంగ్రెస్‌పార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, పరిపాలనకు విచిత్రమైన, విడ్డూరమైన, అనుభవాలను సమకూర్చింది. మర్రి చెన్నారెడ్డి తరువాత నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కర రెడ్డి గారలు ముఖ్యమంత్రులుగా వెలిసారు. కాంగ్రెస్ పార్టీ తమ అనైక్యతను, అధికార దాహాన్ని విశృంఖలంగా ప్రదర్శించింది. ప్రజలు మెజారిటీ స్థానాలను అప్పగించిన 5 సంవత్సరాలలో ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చి రాజకీయ అస్థిరతను చూపించింది. 5 సంవత్సరములు జరిగిన మార్పులను, చేర్పులను ప్రజలు, కథలు, కథలుగా చెప్పుకుంటూ కాంగ్రెస్‌పార్టీ పట్ల తమ విముఖతను వెల్లడించారు. 1994 సాధారణ ఎన్నికలలో ఆ పార్టీని గద్దెదించారు. యన్.టి.ఆర్. నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీని నమ్మదగిన ప్రత్యామ్నాయంగా బలమైన మెజారిటీతో ఎన్నుకున్నారు. యన్.టి.ఆర్. తిరిగి ముఖ్యమంత్రి కావటంతో తెలుగుప్రజల పట్టుదల ఫలించింది.

ఊహాతీతమైన, దురదృష్టకరమైన పార్టీ అంతర్గత పరిణామాలు యన్.టి.ఆర్. 3వ జైత్రయాత్రకు అవరోధాలు కల్పించినవి. నిజంగా ఆయన గుండె పగిలింది. ప్రజాతీర్పును దిగ్విజయంగా నిర్వహించలేని పరిస్థితిని జీర్ణించుకోలేకపోయారు. చలించిపోయిన ఆయన మనసు వంది మాగాధుల సలహాలకు తలొగ్గింది. గవర్నర్ గారి ఇంటికి వెళ్ళి నూతనంగా ఎన్నుకోబడిన శాసనసభను కూడా రద్దు పరచడానికి ముఖ్యమంత్రిగా అభ్యర్ధించారు. తిరిగి రాజకీయ సంక్షోభం ఏర్పడే పరిస్థితులు ఏర్పడినవి. పార్టీలో పెద్ద చీలిక సంభవించింది. గవర్నర్ యన్.టి.ఆర్. అభ్యర్ధనను పట్టించుకోలేదు. యన్.టి.ఆర్. మాత్రం తలొగ్గలేదు. తాను తమ అనుయాయులతో కలిసి శక్తివంచన లేనివిధంగా రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహిస్తూపోయారు. చివరకు ది. 18-01-1996నాడు పేద ప్రజల ఆశాజ్యోతి, ఏడున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మాభిమాన కరదీపిక ఆరిపోయింది. లక్షలాది అభిమానులు, ఆరాధకులకు తమ ప్రియతమ నాయకుడు బోధించిన కర్తవ్య నిర్వాహణ మిగిలింది. ప్రతి సంవత్సరం ఆయన జన్మదినోత్సవం ఆయన కలలను సాధించే కర్తవ్య ప్రభోద సందర్భముగా నిర్వహించటం జరుగుతున్నది. యిదే ఆయనకు అర్పించవలసిన నివాళి.

# కరుణామయి కమలాదేవి

భారతదేశ స్వాతంత్ర్యసమరంలో మహిళామణుల పాత్ర అత్యంత ఆసక్తికరమైనది. అనిబిసెంటు, సరోజనీనాయుడు, విజయలక్ష్మీపండిట్, కమలాదేవి ఛటోపాధ్యాయ, దుర్గాబాయిదేశముఖ్, అరుణా ఆసఫ్ అలీ గారలు మనకు బాగా తెలిసినవారు. వివిధ రాష్ట్రాలలో సహాయనిరాకరణ ఉద్యమం (1920), శాసనోల్లంఘన మహోద్యమం (1930-32), క్విట్ ఇండియా (1942), విప్లవోద్యమం ఆ తర్వాత జరిగిన అంతిమ తిరుగుబాటు ఉద్యమాలలో మహిళలు నిర్వహించిన వీరోచిత పాత్ర స్వాతంత్ర్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడియున్నది. చైతన్య యాత్రలు, జైత్రయాత్రలు, ప్రదర్శనలు, సమరశీల ఉద్యమాలు చివరకు సాయుధపోరాటాలలో కూడా పురుషులకు తీసిపోకుండా వీరనారీమణులు జాతీయ ఉద్యమాలన్నిటిపై స్త్రీ శక్తి యొక్క చెరగని ముద్ర వేశారు. ఆంధ్రదేశ వీరమహిళా సమరయోధుల శ్రేణిలో అగ్రభాగాన్ని అలంకరించిన ఆరుట్ల కమలాదేవి జీవితం ఆదర్శప్రాయం, భావితరాలకు మార్గదర్శకం.

కమలాదేవి అదృష్టవంతురాలు. సహాయనిరాకరణ ఉద్యమ ఆరంభకాలం (1920)లో జన్మించారు. శాసనోల్లంఘన ఉద్యమకాలంలో 1930-32 స్వాతంత్ర్య సమరయోధుడుగా రంగ ప్రవేశం చేస్తున్న సమరశీల యువకులు శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డిని వివాహం చేసుకున్నారు. బాల్యవివాహమే అయినా బహుప్రయోజనకరంగా పరిణమించింది. పెళ్ళిలోనే అంత వరకు రుక్మిణిగా పిలవబడే తన వధువుకు దేశభక్త కమలాదేవి (ఛటోపాధ్యాయ) పేరు పెట్టుకున్నారు. తన భార్య విద్యావంతురాలు కావాలని, ప్రత్యేకంగా కృషిచేసారు రామచంద్రారెడ్డి గారు. ఆంధ్రపితామహులు మాడపాటి హన్మంతరావు పంతులుగారి సహాయం, రాజాబహదూర్ వెంకట రామారెడ్డి గారి ప్రత్యక్ష తోడ్పాటుతో హైద్రాబాద్ నగరం నడిబొడ్డులో ఆంధ్రబాలికల పాఠశాల, వసతి గృహాల స్థాపన చేయగలిగారు. అందులో ప్రథమ విద్యార్థినిగా శ్రీమతి ఆరుట్ల కమలాదేవి గారు చేరడం, ఉన్నత విద్యనభ్యసించడం ఆమె జీవితానికే వన్నె తెచ్చింది. విద్యాభ్యాసంలోనే కాదు సంస్కరణ కార్యక్రమాలన్నిటిలో తనతోపాటు తన భార్యామణిని ప్రోత్సహించి, నడిపించిన ఘనత విప్లవవీరుడు ఆరుట్ల రామచంద్రారెడ్డి (ఎ.ఆర్) గారికి దక్కింది. ప్రతి ప్రఖ్యాత పురుషుని వెనక ఒక స్త్రీ పాత్ర ఉంటుందనే నానుడికి ఇదొక మినహాయింపని నా అభిప్రాయం. కమలాదేవి వీరనారీమణిగా

రూపొందడం వెనక దీక్షాదక్షతలు మూర్తీభవించిన ఎ.ఆర్. అదృశ్య హస్తం వుండింది. పురుష పక్షపాతంతో అన్న మాటకాదిది. ఒక పురుషార్ది సంఘసంస్కర్త, తన కుటుంబం నుండే సంస్కరణల జ్యోతిని వెలిగించిన సత్యాన్ని గుర్తించడానికి మాత్రమే. ఒక రోజు ఆరుట్ల భార్యా భర్తలు, నేను పాత ఎం.ఎల్.ఎ. క్వార్టరులోని మా ఇంట్లో కూర్చొని శాసనసభా కార్యక్రమాలగురించి చర్చిస్తున్నాం. అది రెండవ శాసనసభ కాలం 1960 కాబోలు. సరదాగా మాట్లాడుకుంటూ వారిద్దరిలో ఎవరు ఎవరికి ప్రోత్సాహకులు అనే మీమాంస జరిగింది. నేనన్నట్టు తన ప్రధాన పాత్ర తనకు గర్వకారణమనే విధంగా ఎ.ఆర్. నొక్కివక్కాణించారు. స్త్రీ శక్తి సహకారంలేనిదే పురుషార్థం నిష్ప్రయోజనమని కమలాదేవి గట్టిగా నవ్వింది మీరుభయులూ ధన్యులు మాకందరికి ఆదర్శదంపతు లంటూ మా శ్రీమతి లలిత తేనీటి కప్పులందిస్తూ చర్చలను సమాప్తం చేసింది.

దేశ సాతంత్ర్యోద్యమంలో సంస్థాన ప్రజలపోరాటాలు, ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానంలో జరిగిన నైజాం వ్యతిరేక ఉద్యమం అత్యధిక కష్టనష్టాలు త్యాగాలతో నిండియుండింది. రాజకీయ కార్యకర్తలనుభవించిన ఘోరనిర్బంధాలటుంచి, సామాన్య గ్రామీణ స్త్రీ పురుషులు అనుభవించిన హింసలు, చిత్రహింసలు వర్ణనాతీతం. దళితులు, బలహీనవర్గాలు, ప్రత్యేకించి మహిళలు గురిచేయబడిన పైశాచిక దమనకాండ నాగరికతకే మాయనిమచ్చగా చరిత్రలో మిగిలిపోతుంది. మానవహక్కులు కావాలని అడిగిన పాపానికి స్త్రీలు తిట్లు, దెబ్బలకు గురిచేయబడడమే కాక వివస్త్రలు చేయబడ్డారు. మానభంగాలు, నగ్నప్రదర్శనలు, శిరోముండనలులాంటి రాక్షస చర్యలకు బలిచేయబడ్డారు. నైజాం ముష్కరులు, రజాకార్లతో పాటు గ్రామీణ భూస్వాములు, వారి గూండా తండాలతో ఇటువంటి నీచానికి తలబడ్డారు. రాజకీయ స్వాతంత్ర్యం, ఆర్థిక అవకాశాల మాట దేవుడెరుగు, కనీస పౌరసత్వాలు కరువై మనిషిగా బ్రతకడం అసంభవమైన అంధకారంలో ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుకొందరు అత్యంత ధైర్యసాహసాలతో, తెగింపుతో, మానవ హక్కుల పరిరక్షణకై ఉపక్రమించారు. దేశ వ్యాపితంగా స్వాతంత్ర్యోద్యమ ఉధృతం, విస్తృతం అవుతున్న నాల్గవ దశాబ్దం. అందులో రెండవ ప్రపంచ యుద్ధంలో ఫాసిజం, నాజీయిజం సంపూర్ణంగా మట్టికరిచిపోయి సామ్రాజ్యవాద శక్తులు రాజకీయంగా బలహీనపడిన సందర్భం. ప్రపంచ మానవాళి సాధించిన ఈ మహత్తర విజయం స్వతంత్రం, మానవహక్కులకై పోరాడే ప్రజా ఉద్యమాలకు ప్రబల ఇంధనంగా ఉపకరించింది. వారి ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసింది. ఈ నేపథ్యంలో 1945-46 నుండి హైదరాబాద్ సంస్థాన ప్రజల విమోచనోద్యమం ద్విగుణీకృత ఉత్సాహం, ఉద్వేగంతో ముందుకు సాగింది. దేశభక్త సమరశీల యువతీ యువకులలో వినూత్న ఉత్సాహం వెల్లివిరిసింది.

విద్య ముగించుకొని, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలలో శిక్షణ, సాయుధ

పోరాట శిక్షణ కూడా పొంది 1944లో విప్లవ కుమార్ అను పుత్ర రత్నాన్ని కన్న కమలాదేవి దంపతులు అంతిమ స్వాతంత్ర్యపోరాటంలోకి దూకారు. నైజాం నిరంకుశ పరిపాలనతో పాటు, భూస్వామ్యవ్యవస్థ కూడా కూకటివ్రేళ్లతో పీకిపారేసే తెలంగాణా రైతాంగ తిరుగుబాటు, సాయుధ పోరాటరంగప్రవేశం చేశారు. తమతోపాటు వందలాది యువతీయువలకులను ఈ సాయుధ తిరుగుబాటులోకి ఆకర్షించారు. మార్గదర్శకులయ్యారు. సాయుధ భార్యాభర్తలు, అరణ్యవాసం, అజ్ఞాతవాసంలోనుంటూ అటు శత్రు వర్గాలగుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ ఇటు తోటి సమరయోధులకు స్ఫూర్తి ప్రదాతలుగా వెలుగొందారు.

నల్లగొండ జిల్లాలో ఆరంభమైన ప్రతిఘటనోద్యమం అనతికాలంలోనే తెలంగాణా జిల్లాలంతటికి వ్యాపించింది. వేలాది యువతీయువకుల్ని రణరంగంలోకి ఆకర్షించింది. లాఠీ సంఘం ప్రారంభమై తుపాకి, తూటాల సంఘంగా, ఆధునిక మరఫిరంగుల గెరిల్లా దళాలుగా విస్తరించింది. అటు నైజాం సైన్యం, రజకార్లు తమ ఓటమితథ్యమనే పిరికి తనంతో మతిభ్రమించి గ్రామాలపై విరుచుకుపడ్డారు. గృహ దహనాలు, చిత్రహింసలు, హత్యలు, లూటీలకు తెగించారు. ఈ సంకులసమరంలో వేలమంది ఆత్మబలిదానం చేయగా అనేక వేల మంది జైళ్ళపాలయ్యారు. వందలాది స్త్రీ పురుషులు గ్రామాలల్లో నిర్బంధకాండకు గురి అవుతూ అష్ట కష్టాలనుభవించారు. ఈ తరుణంలో భారత ప్రభుత్వం ఆలస్యంగానైనా, అత్యంత బలోపేతంగా సంస్థానం నలువైపులనుండి పోలీసు చర్య జరిపింది. అయిదురోజుల అనతికాంలోనే 17 సెప్టెంబరు 1948 నాడు నైజాం లొంగిపోకతప్పలేదు. 15 ఆగష్టు 1947 నాడు దేశం స్వాతంత్ర్యాన్ని సాధిస్తే నైజాం తన సంస్థానాన్ని స్వతంత్రభారతంలో భాగం కాజాలదని స్వతంత్ర హైదరాబాద్‌గానే పిలుస్తామని ప్రకటించాడు. దీనితో సంస్థాన ప్రజల సాధారణ, ఆర్థిక, రాజకీయ ఉద్యమం అసాధారణ, అత్యవసర విశాల రాజకీయ ఉద్యమంగా మారింది. దాని ఫలితంగా జరిగిన పోలీసు చర్య రాజకీయంగా నైజాం ప్రభుత్వానికి చావుదెబ్బగా పరిణమించింది. సంస్థాన ప్రజా బాహుళ్యం తాము సాధించిన గొప్ప విజయంగా భావించింది.

ఫిబ్రవరి 1948లో కలకత్తాలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ రెండవ మహాసభ అసలు 1947లో దేశం సాధించిన స్వతంత్రాన్నే గుర్తించలేదు. ఇది భారత బడా బూర్జువా భూస్వామ్యవర్గం బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో చేసుకున్న దుష్ట దుర్మార్గపు ఒడంబడికగా విశ్లేషించింది. పార్టీ శ్రేణులు దీన్ని బూటకపు స్వతంత్రంగా గుర్తించి దేశవ్యాప్తంగా, అనేక తెలంగాణ పోరాటాలను ఆరంభించాలని పిలుపునిచ్చింది. ప్రజాసామాన్యం విప్లవ తిరుగుబాటుకు సిద్ధంగా నున్నారని పార్టీ పిలుపు నివ్వడమే తరువాయి అని ఉద్బోధించింది.

ఈ నేపథ్యంలో తెలంగాణలో కొనసాగుతున్న సాయుధ పోరాటం ఆపే సమస్య ఉదయించలేదు. ఎలా విస్తృతం చేయడమనే ఆలోచనలే చోటుచేసుకున్నాయి. ప్రజల నాడిని గమనిస్తూ, పోరాటానికి రాజకీయ ఆదరణ కరువవుతున్న పరిస్థితులను గుర్తించి వాదించే నాయకులు, కార్యకర్తలు విప్లవ విద్రోహులుగా ముద్రలువేయబడినారు. ఈ అంతరంగిక పోరాటం అనేక నష్టకష్టాల తర్వాత 1951 చివరి నాటికి ఒక కొలిక్కి వచ్చింది. సాయుధ పోరాటం మాత్రం లాంఛనంగా ఉపసంహరించడం జరిగింది. అయినా సైద్ధాంతిక విభేదాలు ఇంకా బలమై చివరకు 1964లో పార్టీ రెండుగా చీలిపోవడం, ఆ తర్వాత మరిన్ని చీలికలు సంభవించడం ఇటీవలి చరిత్ర.

భువనగిరి ప్రాంతంలో చల్లూరి కొండలమీద అజ్ఞాత వాసంలోనున్న ఆరుట్ల దంపతులు తమ దళాన్ని రక్షించుకోవడానికి యూనియన్ సైన్యంతో, ఆధునిక ఆయుధాలతో హోరాహోరీగా పోరాడి తమ దళాన్ని రక్షించుకున్నారు. సురక్షితంగా బయటపడ్డారు. అనారోగ్యంగా నున్న కమలాదేవిని వారి తల్లిగారింట్లో దింపడానికి ప్రయాణిస్తున్న ఈ దంపతులను పోలీసులు ఆలేరు వద్ద అరెస్టు చేశారు. ఏ.అర్. గారిని ఖమ్మం క్యాంపుకు పంపగా కమలాదేవి గారిని వరంగల్ జైలుకు పంపించారు. వరంగల్, ఔరంగాబాద్, సికింద్రాబాద్ జైల్లల్లో సుమారు మూడు సంవత్సరాలున్న కమలాదేవి 1951లో విడుదలయ్యారు.

1952లో జరిగిన ప్రథమ సాధారణ ఎన్నికల్లో ఆలేరు నియోజకవర్గం నుండి కమలాదేవి గారు వీరవనితగా అత్యధిక మెజారిటి ఓట్లతో గెలుపొందారు. అదే నియోజకవర్గం నుండి వరుసగా మూడు పర్యాయాలు గెలుపొందడం ఆనాటి పార్టీకి ప్రత్యేకంగా ఆమెకు ప్రజాబాహుళ్యంలో గల అభిమానానికి ప్రబల నిదర్శనం. ఆరుట్ల దంపతులు, ఆరుట్ల లక్ష్మినరసింహారెడ్డిగారు వారి సహచరులతో సహా పోలీసు చర్య తర్వాత సాయుధ పోరాటాన్ని విరమించకపోవడం గొప్ప పొరపాటని వాదించేవారిలో ప్రముఖులు.

కమలాదేవి గారి శాసనసభా జీవితంలో సహచరుడిగా ఆమెను నేను బాగా అర్థం చేసుకోగలిగినాను. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులపై జరిగే దౌర్జన్యాలను, పోలీసులు అనుసరించే భూస్వామ్య పక్షపాతాన్ని శాసనసభలో ఏకరువుపెడుతూ ఎండగట్టడంలో ఆమెగారు అనుసరించే మార్గం, ఉపయోగించే భాష ఆకర్షణీయం. ప్రజల కష్టాలను వర్ణిస్తూ పదిమందిని ఆకట్టుకోవడం ఆమె ఉగ్గుతో నేర్చిన విద్య. మహిళలపై, దళితులపై జరిగిన అత్యాచారాల ప్రశ్నలు వచ్చినప్పుడు ప్రభుత్వంపై విరుచుకుపడే విధానం, క్షమించ నిరాకరించే పట్టుదల ఆమె స్వంతం. ఇతరత్రా అత్యంత సౌమ్యంగా సహృదయంగా నుండే కమలాదేవి గారు శాసనసభలో ఇంత కఠినంగా వ్యవహరిస్తారెందుకని చీఫ్ విప్‌గానున్న నన్ను మంత్రులు ప్రశ్నించేవారు.

అదే కమ్యూనిస్టుల నైజం, వర్గ పక్షపాతం, విద్యుక్తధర్మ నిర్వహణ అని సమాధానం చెప్పేవాడిని.మూడవ సారి ఎన్నిక తర్వాత, పార్టీ చీలిక ఫలితంగా 1965-67వరకు సిపిఐ ప్రతిపక్షనాయకురాలుగా తమ పాత్ర పోషించారు. 1967 ఎన్నికల తర్వాత ఆమెగారి నుండి శాసనసభపార్టీ నాయకత్వం బాధ్యతలు స్వీకరించే అదృష్టం నాకు కలిగింది.

తర్వాత 32 సం॥ల సుదీర్ఘకాల రాజకీయ సహచరత్వంలో కమలాదేవి గారితో మాట్లాడిన ప్రతి సందర్భంలో ఆమెగారికి నాపై నున్న సోదర భావం రాజకీయ పరిణామాలు, పరివర్తనలపై నాతో భావాలను పంచుకోవాలనే తపన, ప్రయత్నం నన్నెంతో ముగ్ధున్నిచేసేది. వినమ్రతతో నా అభిప్రాయాలను బలంగా తెలియజేసేవాడిని. ఒకనాడు ఎ.ఆర్ బ్రతికి ఉండగానే మేము ముగ్గురం మార్క్సిజం, లెనినిజం,మావోయిజం, కమ్యూనిస్టు పార్టీల విధానాలపై లోతైన చర్చలు జరిపాం. చివరకు ఎ.ఆర్. గారు మన పార్టీ ముసలిపార్టీ అయిపోయింది. ఇక దీనికి భవిష్యత్తులేదని నిస్పృహతో అన్నారు. దేశానికి, దేశ ప్రజల రాజకీయ పార్టీకి ముసలితనముంటూందా? తప్పులుంటే మనం సరిచేసికోవాలి తప్ప కాలక్రమేణ పార్టీ అనుభవం యోగ్యతలు మెరుగుపడాలని కమలాదేవి విశ్లేషించారు. గురువుకే పాఠం నేర్పడం బాగుందని బహు ఆనందించాను.

కమలాదేవిది సహృదయం. సత్యాన్వేషిహృదయం. కష్టజీవులకడగండ్లు చూస్తూ వర్ణిస్తూ కన్నీరు పెట్టే కరుణామయ హృదయం. కష్టాలను తొలగించడమే కాదు వారికి ఆ కష్టాలనుండి శాశ్వత విముక్తిని సాధించే వజ్ర సంకల్పం ఆమెది. ఆమె ధన్యజీవి, తెలుగు మహిళలకు వెలుగు బాట చూపి నిష్క్రమించిన పుణ్యజీవి. వారి దివ్య స్మృతికి సోదరుని జోహార్లు.

# మడమ తిప్పని మరో స్వాతంత్ర్య సమర సేనాని

నవ్వు ముఖం, చామనఛాయ, విద్యాధికుని ముఖవైఖరి, అధిక ప్రసంగం - ఇది ఆయన ఆకృతి. ఆయన పేరు పెండ్యాల రాఘవరావు. హైదరాబాద్ సంస్థాన విలీనోద్యమం, తెలంగాణ రైతాంగ తిరుగుబాటు మహోద్యమంలో ఆణిముత్యంలా అలరించిన అసామాన్యుడు.

1946 జూలై మాసంలో కాబోలు నాకు వారితో వ్యక్తిగత పరిచయం. ఆరుట్ల లక్ష్మీనరసింహా రెడ్డి గారు, పెండ్యాల రాఘవరావుగార్లు ఆంధ్రమహాసభ కార్యాలయంలో మాట్లాడుకుంటుండగా నేను ఉస్మానియా యూనివర్సిటీ నుండి అక్కడికి చేరుకున్నాను. ఆరుట్ల గారు తన సహజ ప్రేమాభిమాన పరిభాషలో నన్ను పరిచయం చేశారు. విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడంటూ వారితో కరచాలం చేయించారు. మరుక్షణమే విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనకూడదనే అభివృద్ధి నిరోధకుల వాదనలను మన విద్యార్థి నాయకులు బలంగా తిప్పికొట్టాలంటూ ఒక చిన్న ఉపన్యాసమే చేశారు. అప్పుడే ఆయన ఎంతటి హేతుబద్ధ సామర్థ్యం గలవాడో అర్థమైంది.

సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత పూర్తిగా విభిన్న పరిస్థితులలో వరంగల్ జిల్లాలోని ఒక అడవిలో 'రాఘవరావు దళ' కమాండర్‌గా వారిని దర్శించుకునే భాగ్యం కలిగింది. మూడు సంవత్సరాల అనతికాలంలో ప్రధానమైన రాజకీయ మార్పులు చోటుచేసుకున్నవి. 15 ఆగస్టు, 1947 నాడు భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం, నైజాం నవాబు తన హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనీకరించడానికి తృణీకరించడం, భారత కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీ తదితర దేశభక్తి సంస్థలు, వ్యక్తులంతా వెంటనే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనీకరణ చెందాలని పిలుపునివ్వడం, 13 మాసాలు సాయుధ విమోచన ఉద్యమం జరగడం, చివరకు 17 సెప్టెంబర్ 1948 నాటికి పోలీసు చర్య ద్వారా భారత సైన్యాలు హైదరాబాద్ సంస్థానాన్ని ఆక్రమించడం చకచకా జరిగిపోయినవి. తెలంగాణ ప్రాంతంలోని ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలు తమ వీరోచిత పాత్రను అద్వితీయంగా పోషించి నిర్వహించినవి. వరంగల్ జిల్లా వేలాది కార్యకర్తలు వందల కొద్ది స్థానిక నాయకత్వం కలిగి ఈ విప్లవోద్యమంలో నల్లగొండ జిల్లా తర్వాత స్థానాన్ని అలంకరించింది. సర్వదేవభట్ల రామనాథం, పెండ్యాల రాఘవరావు, నల్లమల గిరి ప్రసాద్, నల్లా నర్సింహులు లాంటి

మరెందరో ఈ ఉద్యమ రథసారథులుగా వెలుగొందినారు. అందరూ త్యాగధనులే. ఐనా ఎవరి ప్రత్యేకత వారిదే. పెండ్యాల రాఘవరావుగారి ప్రత్యేకత ఆయన గాంభీర్యం, శత్రువుల పట్ల అసహనం, కంచుకంఠంతో ఖండితంగా ప్రకటించడం.

పెండ్యాల రాఘవరావు గారిని ప్రత్యక్షంగా వారి దళంలో వారం రోజులు తిరిగి వారిని అర్థం చేసికున్న తర్వాత ఆనాడు నాలో చోటుచేసుకున్న అనుభూతి, గడించిన అనుభవాన్ని ఈ సందర్భంగా అందరితో పంచుకోగల్గడం మహానందం.

17 సెప్టెంబర్ 1948 నాడు హైదరాబాద్ సంస్థాన విమోచనం జరిగింది. సంస్థాన ప్రజలు తరతరాల బానిస బంధనాల నుండి విముక్తిని సాధించినట్లు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. భరతమాత నడిబొడ్డులో గూడుకట్టుకుని యున్న 'సంస్థానం' పీడ విరగడైనందుకు నిట్టూర్పు విడిచారు. ఆనాటి భారత కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం, జాతీయ పార్టీ మహాసభ ఆమోదించిన తీర్మానాల ఫలితంగా సాగుతున్న రైతాంగ సాయుధ పోరాటాన్ని కొనసాగించాలని నిశ్చయించింది. భూస్వామ్య బడా పెట్టుబడి దారుల రాజ్యాధికారాన్ని బ్రద్దలు కొట్టి కష్ట జీవుల రాజ్యాన్ని స్థాపించే వరకు విశ్రమించకూడదనే నిర్ణయం చేసింది. ఈ నేపథ్యంలో సుసంఘటితమైన పార్టీ తన కార్యకలాపాలను కొనసాగించింది. భారత ప్రభుత్వ సైనికదళాలను కూడా ఢీకొన్నది. సమసమాజం, పేదరిక నిర్మూలన లక్ష్యంతో, భూస్వామ్య పెట్టుబడిదారీ ప్రభుత్వాల దమనకాండకు వ్యతిరేకంగా, అసమాన బలంతో, అననుకూల రాజకీయ వాతావరణంలో అనన్య సామాన్య సాహసాలను ప్రదర్శిస్తూ పోరాడింది. వేల మంది సమరయోధులు తమ రక్తతర్పణ, ఆత్మార్పణతో ఈ మహోద్యమానికి వన్నె తెచ్చారు. తర్వాత 1951 చివరలో, అనుభవాలను బేరీజు వేసుకొని సాయుధ సమరాన్ని ఉపసంహరించింది. పై లక్ష్యాల సాధనకై బహిరంగంగా, ప్రజాస్వామ్య పద్ధతులతో ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించింది.

1947 ఆగస్ట్ 15 తర్వాత హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలనే మహోద్యమంలో విద్యార్థుల పాత్ర అనన్య సామాన్యమైనది. విద్యార్థులంతా తమతమ విశ్వవిద్యాలయాలను వదిలి ప్రత్యక్షంగా ఈ ఉద్యమంలో పాల్గొనాలని అన్ని పార్టీలు పిలుపునిచ్చినవి. హైదరాబాద్ సంస్థానంలో బలంగానున్న అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘం తన శక్తి వంచన లేకుండా పోరాటంలోకి దూకింది. విద్యార్థులకు సాయుధ పోరాట శిక్షణకేంద్రాలలో శిక్షణ ఇచ్చి వివిధ జిల్లాలోని గెరిల్లా దళాలలో పనిచేసే ఏర్పాటు చేసింది. అప్పటికి అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శిగా నున్న రఫీ అహ్మద్‌గారి స్థానంలో నన్ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. వివిధ జిల్లాల్లో వివిధ దళాలలో, దళ సభ్యులకు రాజకీయాలు నేర్పడానికి పంపబడిన విద్యార్థి కార్యకర్తల పనిని సమీక్షించడానికి నాకు ఒక బాధ్యత నివ్వడం జరిగింది.

అదే సందర్భంగా వరంగల్ జిల్లాలో రాఘవరావుగారి దళంతో వారం రోజులు తిరగడం జరిగింది. వారి దళాన్ని కలిసిన తీరు, వారితో గడిపిన కొద్దికాలం నా జీవితంలో మరువరాని మధురస్మృతిగా మిగిలిపోయింది. కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన కామ్రేడ్ ఎల్. ముత్తయ్య గారు, నేను కలిసి సరిహద్దులో నున్న చాందా క్యాంపు నుండి రాత్రి రైలులో బయలుదేరాలనుకున్నాం. సామాన్లు సర్దుకున్నాం. ఆకలి వేస్తే భోజనం చేయడానికి రొట్టెలు తీసికెళ్లాలనుకున్నాం. మా శ్రీమతి లలితాదేవి మాకు సహకరించి ఒక పత్రికలో కొన్ని గోధుమ రొట్టెలు, కూరలు మూటకట్టి మాకందించింది. రాత్రంతా ప్రయాణం చేసి కాజీపేటలో పాసెంజరు రైలెక్కి రఘునాథపల్లి స్టేషన్‌లో దిగాలని మా సంకల్పం. అలాగే రైలు దిగినాం.

వెంటనే మలబార్ పోలీసుల మా వద్దకే వచ్చి మందలించారు. అనుభవం గలిగి వయస్సుకు పెద్దగా మంచి రైతుగా నున్న ముత్తయ్యగారు మేము ఎడ్ల బేరగాళ్లమని తన బ్యాగ్‌లో నుండి పగ్గాల జతను తీసి వారికి చూపించారు. ఆయన వాలకం, భాష విన్న పోలీసులు వెళ్లిపొమ్మన్నారు. అక్కడి నుండి నడుస్తూ వెళ్లినాం. కొన్ని గంటల నడక తర్వాత ఒక ప్రవహించే నది ఒడ్డున కూర్చొని వెంటతెచ్చుకున్న రొట్టెలు తిన్నాం. నదిలో మంచినీరు తాగి మళ్లీ నడక ప్రారంభించాం.

ఆనాడే అదే సమయానికంటే కొన్ని గంటల ముందు రాఘవరావు దళం అటునుంచి వెళ్ళిందట. ఆ దళాన్ని పట్టుకోవడానికి పోలీసు బలగాలు గాలింపు చర్యలు చేపట్టినాయి. చూస్తుండగానే పోలీసు వాహనాల హడావిడి పెరిగిపోయింది. ప్రాంతమంతా నిర్మానుష్యమైపోయింది. కొద్ది దూరంలో నున్న ఒక భావి గడ్డ పై గుడిసెలో నున్న ఒక రైతు మమ్ములను చూచి ఆందోళన చెందినాడు. కేకవేసి మమ్ముల్ని పిలిచాడు. ''మీరు పార్టీవారైతే వెంటనే పరుగెత్తి తప్పుకోండి'' అంటూ ఇలా అన్నారు: ''మీరు ఆ వాగు ఒడ్డున భోజనం చేసి వదిలి వేసిన పత్రిక గాలికి కొట్టుకొచ్చి పోలీసులు వెళ్లుచున్న దారిలో వారికి అడ్డుపడింది. ఆ పత్రిక నిన్నటిదేనని వారు గుర్తించారు. పార్టీ వారు సరిహద్దు వెలుపలి నుండి చేరుకున్నట్టు గమనించారు. వారి వాహనాలు దారిని విడిచి ఈ చుట్టూ ప్రాంతాలను గాలిస్తున్నాయి''.

ఈ సాక్ష్యాన్ని నమ్మిన మేము పరుగో పరుగు అంటూ ఒక దిశన వెళ్లాం. ఒక గంట తర్వాత విశ్రాంతికై ఒక చెట్ల పొదలో కూర్చున్నాం. దగ్గర నుండే ఏదో ఒక పిలుపు వినబడింది. ఆందోళనతో నలు దిశలు చూచాం. ఒక చెట్టు పై కూర్చున్న సాయుధుడైన గెరిల్లా (సెంట్రీ) అగుపడినాడు. ముత్తయ్యగారు అతనివైపు నాలుగడుగులు వేశాడు. ఆ సెంట్రీ ఆయనను నిలువరించారు. చేతులెత్తుమని కేకవేశారు. అలాగే ముత్తయ్యగారు చేతులెత్తి మా ఇరువురి పేర్లు చెప్పారు. ఆయన యక్ష ప్రశ్నలన్నింటికి సమాధానం

చెప్పారు. అప్పుడు ఆ సెంట్రీ గారి ఆజ్ఞానుసారం ఒక దిశలో వెళ్లి ఒక లోయలో కూర్చున్నాం.

ఇంతలో మరోక హోయని శబ్దం వినిపించింది. "ఎవరు మీరు? ఎందుకొచ్చారు?" అన్న ప్రశ్న అది. తిరిగి ముత్తయ్యగారు మా పేర్లు, కార్యక్రమం గురించి వివరించారు. చిరునవ్వుతో "ఏమిటి కామ్రేడ్ ఈ రోజు వచ్చారేమిటి? మేమంతా శత్రు వలయంలోనున్నాం. త్వరగా వేరే చోటికి వెళ్లుదాం రండి" అంటూ పక్కనే లోయలో తుపాకులు ఎక్కుబెట్టి యాక్షన్ పోజులో నున్న సుమారు 14-15 మంది దళ సభ్యులకు మమ్మల్ని పరిచయం చేశారు. ఆయనే రాఘవరావు.

ఆ రాత్రి ఒక గ్రామంలో భోజనం చేశాం. గ్రామం పేరు కోమాళ్ల అన్నట్టు జ్ఞాపకం. రెండు పూటలకు సరిపడే భోజనాన్ని కూడ మూటలు కట్టి ఇవ్వమని ఆ భూస్వామిని ఆజ్ఞాపించిన రాఘవరావు గారి మాటలు అప్పుడు నన్ను ఆశ్చర్య చకితున్ని చేసినవి. భోజనం తర్వాత అదే రాత్రి బయలు దేరి తెల్లవారే సరికి దట్టమైన అడవిలో సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాం. 303 రైఫిల్ భుజాన వేసుకొని, స్వంత బ్యాగ్‌ను తగిలించుకొని అన్ని గంటలు అంతదూరం ప్రయాణం చేయడం నాకు అదే మొదలు, చివర కూడా. ఇతర సందర్భాలన్నిట్లో రహస్య స్థావరానికి చేరుకోవడం, సమావేశాలు నిర్వహించు కోవడం, తిరిగి మరో స్థావరానికి వెళ్లడం జరిగేది.

రాఘవరావుగారి దళంతో వారం రోజులు గడిపి తిరిగి చాందా, సిర్వంచ క్యాంపులోకి చేరుకోవడం మరువరాని ఘట్టం.

మరొక జ్ఞాపకం - రాఘవరావుగారు క్రమశిక్షణను ఉల్లంఘించే దళ సభ్యులను తీవ్రంగా మందలించేవారు. అది సరే, ఒకరోజు శంకర్ అనే దళ సభ్యుడి పై విచారణ జరిగింది. అతడు ఒక చోట బంగారం దొంగిలించినట్టు, మరోకచోట అత్యాచారానికి పాలుపడినట్లు రుజువైంది. రాఘవరావుగారి ఆగ్రహానికి అవదులు లేవు. దేశ సేవలో పాటించవలసిన నీతి, నియమాలు క్రమశిక్షణ గురించి ఏకధాటిగా మాట్లాడి దళ సభ్యులందరిని హెచ్చరించారు. అయితే తెల్లవారి చూస్తే శంకర్ కనబడలేదు. అతడు పార్టీ నిర్ణయాన్నెదిరించి దళం నుండి పారిపోయి ఉంటాడని సభ్యులనుకున్నారు. రాఘవరావు గారు మాత్రం వాడికి తగిన శిక్ష విధించామన్నారు. మళ్లీ ఈ దళంలోకి రాకుండా వేరే దళంలోకి పంపించామన్నారు. అందరు మౌనంగా అంగీకరించారు.

1951లో సాయుధ పోరాటాన్ని విరమింపచేశాం. ఫిబ్రవరి 1952లో జరిగిన ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పాల్గొన్నది. పార్టీపై నిషేదం ఉండడం వలన పి.డి.ఎఫ్. పేరుతో చేయి గుర్తుతో తెలంగాణ మొత్తం జిల్లాలలో పోటీచేసింది. అత్యధిక మెజారిటీతో

అధిక సీట్లు కైవసం చేసుకున్నది. రాఘవరావు గారు అత్యధిక మెజారిటీతో వరంగల్ పార్లమెంట్ స్థానానికి గెలిచారు. పార్లమెంటు సీటుతోపాటు రెండు అసెంబ్లీ సీట్లను గూడా గెలిచి, తర్వాత వాటికి రాజీనామా పెట్టినట్లు గుర్తు. పార్టీ నాయకుడుగా, పార్లమెంటు సభ్యుడుగా సమర్థవంతమైన పాత్ర పోషించారు. అనేక పర్యాయాలు పార్టీలో చోటుచేసుకున్న రాజకీయ అభిప్రాయ భేదాలు గురించి చర్చించుకునే అవకాశం కలిగింది. బహుశా, రాజకీయ విభేదాలు, పార్టీలో అనైక్యత వారి హృదయాన్ని కలచివేసింది. క్రమంగా క్రియాశీల పాత్ర తగ్గింది. తెలంగాణ సాయుధ సమరయోధుడిగా, రైతుకూలీ బాంధవుడుగా కలకాలం ఆయన పేరు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

# సరిలేని దాసరి

చంద్ర రాజేశ్వరరావు స్మారక వృద్ధాశ్రమములోని నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధనా కేంద్రం హాలులో దాసరి నాగభూషణ రావు సంస్మరణ సభలో పాల్గొని వారికి నా నివాళి సమర్పిస్తూ అమరజీవులైన ఆత్మీయులందరిని స్మరించుకొనే అదృష్టం కలిగింది. వర్తమాన సమస్యలను ప్రక్కనబెట్టి వేలాది స్వాతంత్ర సమరయోధుల అనన్య సామాన్య త్యాగనిరితి, నిష్కలంక సేవా తత్పరతపై మనస్సు మళ్లింది. సహచరుడు, సౌమ్యుడు అయిన దాసరి నాగభూషణ రావుతో గల అనుబంధాన్ని నెమరువేసుకోవడం మధురస్మృతి.

దాసరి సామాన్యమైన రైతుకుటుంబంలో జన్మించి కృష్ణాజిల్లాలో కొనసాగిన విద్యార్ధి, రైతు ఉద్యమాలలో పాల్గొని కాకలు తీరిన కమ్యూనిస్టుగా ఎదిగిన చరిత్ర అందరికి తెలిసిందే. మతం మానవున్ని మానవుడుగా తీర్చిదిద్దె విద్య అంటారు. మార్క్సిస్టు సిద్ధాంతం, మానవ సమాజాన్ని సమత మమతలతో కూడిన విలువల నిలయంగా తీర్చిదిద్దే సంచనాత్మక విద్య. సోషలిజం, కమ్యూనిజం వీటికి మారు పేర్లు. భారతదేశంలో రెండు వందల సంవత్సరాల బ్రిటీష్ సామ్రాజ్యవాదుల కర్కశ పాలన, వారిని పోషించి రక్షించే జమీందారీ, జాగీర్ధారి, భూస్వామ్య రాక్షస పాలన ప్రజాజీవితాన్ని దుర్భరంచేసింది. దశాబ్ధాలుగా కొనసాగిన తిరుగుబాటు ఉద్యమాలనుండి 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ అవతరించింది. మహాత్మగాంధి గారి నాయకత్వంలో దేశవ్యాపితంగా సత్యాగ్రహ సిద్ధాంతంతో నిర్మించబడిన భారత జాతీయ కాంగ్రెస్‌లో విప్లవ సిద్దాంతంగల కమ్యూనిస్టులు ఇమిడియుండడం అసాధ్యమైంది. ఆ తర్వాత సోషలిస్టులూ అందులో ఇమడలేకపోయారు. ఫలితంగా దేశవ్యాపితంగా కమ్యూనిస్టులు, సోషలిస్టులు అతివాద పార్టీలుగా ఏర్పడి ప్రజాజీవిత రంగాలలో సమరశీల ఉద్యమాలను నిర్మించడం వాటిని విస్తరించడం జాతీయ స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో వెలుగురేఖ లాంటి పరిణామము. ఈ నేపథ్యంలో పుట్టి పెరిగి అతివాద ఉద్యమ కార్యకర్తలుగా మారిన యువతరం తీరు తెన్నులే వేరు. మార్క్సిజం, లెనినిజం, ఆ తర్వాత మావోయిజం సిద్ధాంతాలు నేర్పిన సామాజిక పరిణామ సిద్ధాతాలు, వాటి రాజకీయ విధి విధానాలు ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులను వినూత్న మానవులుగా, ఆదర్శవంతమైన దేశభక్తులుగా మార్చడానికి ఎంతగానో తోడ్పడినవి. కొందరు ఈ విప్లవబాటలో కొనసాగలేక పోయినా చాలా మంది ఈ విప్లవ ధృక్పధంతో ప్రజాసేవ చేసి చరిత్ర సృష్టించారు. ఆ కోవకు

చెందినవాడే మన 'దాసరి'. అతనితో 55 సంవత్సరాల సుదీర్ఘ పరిచయం, సహచర్యం నాకు గర్వకారణం.

విప్లవ సిద్ధాంతం అజరామరం. విప్లవమంటే శాశ్వత తీవ్రవాదం, హింసావాదం కాదు. వర్తమాన సామాజిక స్థితిగతులను కాలజ్ఞానంతో ముందుకు, మున్ముందుకు నడిపిస్తూ సువిశాల ప్రజా ఉద్యమ చైతన్యంతో సమ సమాజ గమ్యాన్ని చేరుకోవడం, అడ్డువచ్చు అన్య వర్గాలు సృష్టించిన అవరోధాలు అధిగమిస్తూ ప్రతీప శక్తులను ఓడిస్తూ త్వరత్వరగా లక్ష్యాన్ని చేరుకోవడమే. ఈ ప్రక్రియలో దాసరి చూపిన చొరవ, మెళుకవ, అయన సహచరులకు మార్గదర్శకము. 1948-51 మధ్య పార్టీ అనుసరించిన సాయుధ పోరాట పంథా, వ్యక్తిగత హింసావాద ఆచరణ, పార్టీకి ప్రజా ఉద్యమాలకి గొప్ప నష్టాన్ని తెచ్చిన విషయం అందరూ గుర్తించిందే. ఆ తీర్మానాలు చేసిన నాయకులూ ఆత్మవిమర్శ చేసుకున్నారు. మత మౌఢ్యంతో పోల్చదగిన పిడివాదులు ఐనా, త్యాగధనులైన సహచరులతో తర్జన భర్జనలు పడుతూ వారిని ఒప్పించలేక, మెప్పించలేక విసిగి వేసారిన ఉదంతాలను జ్ఞాపకం చేసుకొని దాసరి బాధపడేవారు. పట్టుబడి చిత్రహింసలపాలవుతూ ఆత్మార్పణ చేసిన సహచరులను స్మరిస్తూ దుఃఖించిన సందర్భాలు అనేకం. పార్టీ ఐక్యతను కాపాడుకుంటూ కొత్త కార్యక్రమాలపై కార్యకర్తలను నడిపించే ఆయన నేర్పరితనం కొనియాడదగినది.

పార్టీ నిర్ణయాలను అమలు జరిపించడంలో ఆయన చూపిన శ్రద్ధాసక్తులు కొన్ని సందర్భాలలో తీవ్ర విమర్శలకు గురికాక తప్పలేదు. నిర్ణయాల ఔచిత్యాన్ని అర్థం చేయిస్తూ అమలు పరిచి వారి హృదయ పరివర్తన ద్వారా కార్యసాధన కంటే వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తూ అమలు జరిపించడానికి పూనుకుంటాడనే విమర్శల నెదుర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య గారి కార్య దక్షత, పట్టుదల దాసరిపై ప్రభావం వేసిందనుకునేవారు లేకపోలేదు. సందర్భం మారగానే దాసరి తన ప్రత్యర్థులతో నవ్వుతూ, నవ్విస్తూ, ఛలోక్తులు ద్వారా సన్నిహితం కావడం ఆయన స్వంతం. దాసరి కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా, నల్లమల గిరిప్రసాద్ గారు రాష్ట్ర కార్యదర్శిగానున్న రోజుల్లో మరువలేని ఒక అనుభవాన్ని చదువరులతో పంచుకోవాలని వుంది. కీ॥శే॥ రాజీవ్ గాంధి ప్రధాన మంత్రి. రాష్ట్రంలో నేదురుమల్లి జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ అధినేత, నేను పార్టీ శాసనసభాపక్ష నాయకుడిని, సాధారణ ఎన్నికలలో పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని కార్యదర్శి వర్గం మెజారిటీ అభిప్రాయం. అందుకు రాయభారాన్ని నడిపించే బాధ్యత కార్యదర్శి గిరి ప్రసాద్ గారు నాకిచ్చారు. నేను ఆ ప్రయత్నం చేశాను. ఫలితం పొందే సమయం దగ్గరబడింది. ఢిల్లీ నుండి నేదురుమల్లి ఫోన్ ద్వారా తాను రాజీవ్ గాంధితో మాట్లాడి పార్టీకి 25 స్థానాలు కేటాయించే సానుకూల నిర్ణయం జరిగిందని నాకు తెలియచేశారు. అదే రోజు ఎన్నికల ఎత్తుగడలకు తుదిరూపమివ్వడానికి

రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ప్రారంభం కానున్నది. కార్యదర్శివర్గంలో ఈ విషయంలో తిరిగి చర్చోప చర్చలు కొనసాగినవి. రాత్రి అవుతున్నదని కౌన్సిల్ సభ్యులు తొందర పెడుతున్నారు. గిరి ప్రసాద్ ఢిల్లీలో నున్న పార్టీ కార్యదర్శి చంద్ర రాజేశ్వర రావు గారితో మాట్లాడారు. విధానపరమైన ఈ ప్రధాన నిర్ణయం చేసే అధికారం రాష్ట్ర కమిటీకి లేదని చేసింది పొరపాటని వారు తేల్చి చెప్పారు. గిరిగారు ఇదే విషయం కార్యవర్గానికి తెలియచేశారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభమయ్యింది. కేంద్ర నాయకులుగా దాసరి ప్రసంగించారు. కేంద్ర నిర్ణయాన్ని ప్రకటించారు. అంతవరకు జరిగిన పరిణామాలు తెలియని కౌన్సిల్ సభ్యులు కొందరు కోపంతో కాంగ్రెస్ పార్టీతో ఇంతదూరం కథ ఎవరు నడిపినారు, ఎందుకు నడిపినారని ప్రశ్నించారు. వేదికపై నుండి దాసరి మొదటి వరసలో కూర్చున్న నన్ను వేలుతో చూపెట్టారు. నాతో పాటు అందరూ ఆశ్చర్యపోయారు. వెంటనే గిరి ప్రసాద్ జోక్యం చేసుకొని కార్యదర్శివర్గ మెజారిటితో జరిపిన రాయబారం ఉదంతాన్ని వివరించి వాతావరణంలో మార్పుచేశారు. దిగ్భ్రాంతి పొందిన నేను దాసరిని ప్రశ్నిస్తే తాను అన్నది రాయబార విషయం మాత్రమేనని అసలు సర్దుబాటు నిర్ణయం కార్యదర్శి వర్గానిది కాకుండా రాయబారం ఎలా జరుగుతుందని ఒకింత పశ్చాత్తాపంతో బదులిచ్చి నన్ను తృప్తి పరిచారు. ఆ తర్వాత మా మధ్య సాన్నిహిత్యం, అభిమానం మరింత పెరిగింది. దాసరికి హైదరాబాదు విమోచన ఉద్యమం, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో అత్యంత సన్నిహిత సంబంధం ఉండింది. విజయవాడ కేంద్రంగా, సాయుధ ట్రైనింగ్ నిర్వహించిన రోజుల నుండి యువకుడిగా దాసరి పాత్ర ప్రశంసనీయం. అందుకే కీ॥శే॥ రావి నారాయణ రెడ్డి గారు క్యాంపు ఇంచార్జిగా దాసరి సాయుధ శిక్షణ పొందిన యోధుడుగా గుర్తింపు ఇస్తూ స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ మంజూరి చేయడం జరిగింది. తెలంగాణా అమరవీరుల ట్రస్టు ప్రారంభం నుండే దాసరి ట్రస్టు సభ్యుడుగా తన వంతు కర్తవ్యాన్ని విజయవంతంగా నిర్వహించారు. ట్రస్టుకి, రావి నారాయణ రెడ్డి స్మారక ఆడిటోరియం నిర్మాణానికి, ప్రభుత్వం ద్వారా ఉచితంగా స్థల సేకరణ నుండి భవన నిర్మాణం వరకు నాకు చేదోడు వాదోడుగానుంటూ అనేక పర్యాయాలు అత్యంత ఆప్యాయతతో నన్ను అభినందించిన సందర్భాలు మరపురానివి. ఆయనలో అమరవీరుల పట్ల, వారి ఆశయాల సాధనపట్ల ఉన్న పట్టుదల, అంకితభావం ఆదర్శప్రాయం. సుదీర్ఘకాలం చక్కెర వ్యాధితో బాధపడిన దాసరి బాధలను పంచుకున్న ఆయన భార్య లక్ష్మి గురించి వ్రాయకుండా ముగింపు ఉండదు. నేను స్వయంగా వారిని పలకరించడానికి ఆసుపత్రికి, ఎం.ఎల్.ఎ క్వార్టర్‌కి వెళ్ళిరావడం జరిగింది. దాసరి లక్ష్మి ప్రదర్శించిన సహనం, సౌమ్యం, నిర్విరామ సేవాతత్పరత నన్ను ముగ్ధున్ని చేసింది. వైద్యంలో, ఆహార నియమాలలో అశ్రద్ధగా నుండే దాసరిలోని లోటును పూర్తిగా తీర్చుతూ ఆయనకు అపారమైన సేవలందించిన ఆ అర్ధాంగి ఆదర్శం వేనోళ్ల కొనియాడదగినది.

# జువ్వాడి గౌతమరావు

కలువగానే కవ్వింపును బోలిన కరచాలనం, దరహాసం, దీర్ఘకాల, ఎడబాటును మరిపించే పరిహాసం మా అలవాటు. ఈ అనుబంధం ఏనాటిదో. కరీంనగర్‌లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్నేహంగా కలిసి చదువుకున్న నాటి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1943 - 47 మధ్య రాజకీయాలకు కేంద్రంగా పరిగణించబడిన 'సి' హాస్టల్‌లో 5 సంవత్సరాలుగా నిర్వహించిన రాజకీయ కార్యక్రమాలు చర్చోపచర్యల పరిణామం. ఒకరినొకరు పూర్తిగా అర్ధంచేసుకున్న ఫలితం. స్వతంత్ర ప్రజాస్వామ్య ఉద్యమాల అనుభవాలు పోషకపదార్ధంగా ఎదిగిన వ్యక్తుల మధ్య స్థిరపడిన పరిణత పరస్పర అభిమానం.

నా దృష్టిలో ''గౌతమ్'' జీవితానికి రెండు పార్శ్వాలున్నవి. ఒకటి రాజకీయ జీవితం రెండవది సాహితీవేత్త జీవితం. రాజకీయవేత్తగా కాలం కొద్దిదే అయినా అది సమరశీలం. విప్లవాత్మకం. నిరంకుశ నైజాం రాచరికం, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రాజీలేని సమరం. సాహితీవేత్తగా సుదీర్ఘకాలం, ఈ నాటివరకు కూడా నిరంతర విమర్శకుడు తెలుగు భాషామతల్లి ఆరాధకుడు. పండితులకే పండితుడు. బాల్యావస్థనుండే తల్లితండ్రులు వెన్నతోపెట్టిన విద్య. ఆయన రాజకీయరంగం గురించి మాత్రమే ఆణిముత్యాల్లాంటి నాలుగు అనుభవాలను పంచుకోవడం నా మహాభాగ్యం.

ఇరువదవ శతాబ్దం భారతదేశ రాజకీయ పరిణామక్రమంలో అత్యంత కీలకమైనది. ఈ శతాబ్ది పూర్వార్ధభాగంలో పుట్టి పెరిగిన యువతరానికి జాతీయ స్వాతంత్రోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనే అపూర్వ అవకాశాలు అందివచ్చినవి. మహాత్మగాంధి గారి నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ ఉద్యమాల మార్గాన్ని అనుసరించింది. ఇరువదవ దశకంలో జరిగిన సహాయనిరాకరణోద్యమం, ముప్పదవ దశకంలో విస్తృత జనసమీకరణలతో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమం, 1935లో ఆనాటి నామమాత్రపు రాజ్యాంగం ఆధారంగా అన్ని రాష్ట్రాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నెలకొనడం. తర్వాత రాజీనామాలు పెట్టడం, అసమ్మతి జ్వాలలు వ్యాపించడం, నాల్గవ దశాబ్ధంలో జాతి విమోచన కొరకు సమరశీల పోరాటాలు చోటుచేసుకోవడం, క్విట్‌ఇండియా ఉద్యమం యావత్ భారత యువతరాన్ని మేల్కొల్పడం, ఇవన్నీ చరిత్రాత్మక ఘట్టాలు. దేశవ్యాపితంగా మరింత సంచలనం సృష్టించిన నావికుల తిరుగుబాటు, పోలీసుల సమ్మె, సుభాష్‌చంద్రబోస్ గారి నాయకత్వంలో నిర్మించబడిన ఇండియన్ నేషనల్ ఆర్మి

(ఐ.ఎస్.వి) సైన్యాధిపతులను బ్రిటీష్‌ముష్కరులు లాల్‌ఖిలాలో విచారణ తతంగం జరపడం, విద్యార్థి ఉద్యమాలు, ఇవన్ని స్వాతంత్రోద్యమానికి మరింతవేడిని, వాడిని సమకూర్చినవి. వీటికితోడు అయిదు వందలకు మించిన సంస్థానాలలో స్థానిక రాచరికాలను రద్దుపరచి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనే సంస్థాన ప్రజల తిరుగుబాటు, కాశ్మీర్ ప్రజల విప్లవాత్మక ఉద్యమం, ట్రావెన్‌కూర్ కొచ్చిన్ మహారాజులకు వ్యతిరేకంగా నిర్వహించబడిన త్యాగపూరిత పోరాటాలు ఈ సందర్భంగా పేర్కొనదగినవి. ఇంతేకాదు, విద్యార్థి యువకులను మరింత సంఘటితంచేసిన వందేమాతరం ఉద్యమం, లక్షలాది ప్రజలు కరువుకు బలి అవుతూ ఆత్మార్పణచేసిన బెంగాల్ కఠోర కరువు దేశభక్తుల హృదయాలను కలిచివేసినవి. ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తూ ప్రజా ఉద్యమాలకు ఊతం, చేయూతనిచ్చిన రెండొవ ప్రపంచ యుద్ధం మొదటి ప్రపంచ యుద్ధంలో జరిగిన రష్యన్ విప్లవ కాలాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాలను బహుళంగా ప్రచారంలోకి తేవడం జరిగింది. సోషలిజం ఒక వినూత్న రాజకీయ వ్యవస్థగా, ఆదర్శ ప్రత్నామ్యాయంగా కార్మికవర్గాన్ని, మేధావివర్గాన్ని ఆకట్టుకున్నది. ఆకర్షించింది.

ఈ నేపథ్యంలో విద్యా విజ్ఞానం కలిగిన యువతీ, యువకులు స్వాతంత్రోద్యమ ప్రవాహం నుండి దూరంగా ఉండిపోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. హైద్రాబాద్ సంస్థానం నాలుగవ దశకంలో, బ్రిటీష్ సామ్రాజ్యవాదం, స్థానిక నిజాం నిరంకుశ పాలనలకు వ్యతిరేకంగా క్రమక్రమంగా నైనా ఉద్యమాలతో ఉడికిపోయింది. 15 ఆగస్టు 1947 తర్వాత, సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలనే ఉద్యమం తారాస్థాయికి చేరుకున్నది. వేలాది సమరయోధుల ఆత్మార్పణ, ఫలితంగా 1948 సెప్టెంబరు 17 నాటికి విమోచనం సాధించింది. ఈ మహోద్యమంలో అనేకులతోపాటు మేము సైతం రెండు చిరుదివ్వెలను వెలిగించాం. హైస్కూలు విద్యార్థులుగానే బానిస బంధనాల బిగింపును అనుభవించాం. పాఠశాల ప్రారంభంలో మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రాజ్యం అజరామరంగా వర్ధిల్లాలనే ప్రార్ధన చేయవలసివచ్చేది. ప్రాధమిక పాఠశాల నుండే ఉర్దూ మాధ్యమంగా విద్యనభ్యసించటం, మాతృభాష తెలుగు భాష అందుబాటులోలేకపోవడమే కాదు చీత్కరించబడటం భరించరాని బానిస బంధంగా భావించాం. బ్రిటీష్ చక్రవర్తులు, నైజాం రాజుల జీవిత విశేషాలు పాఠ్యాంశాలుగా చదవటం భావస్వాతంత్రానికి బిగించబడిన ఉక్కు సంకెళ్ళుగా విధిలేని పరిస్థితులను తీవ్ర అసంతృప్తితో అనుభవించాం. రాజ్యం ముస్లింలందరిదని, హిందువులు కేవలం రెండొవశ్రేణి పౌరులనే, పాలకుల ప్రవర్తన విద్యార్ధి యువకులలో స్వతంత్ర ఉద్యమ అవశ్యకతను తట్టిమేల్కొలిపింది. ఈ పరిస్థితులలో మత సామరస్యం, మాతృభాషాభి మానం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను మర్చిపోకుండా వాటిని పోషించే కర్తవ్యాలను తోటి విద్యార్థి సోదరులకు తెలియచేయటం, వారిలో దేశభక్తి భావాలను రేకెత్తించడంలో గౌతమరావు నిర్వహించిన పాత్ర ఆయనకు ప్రత్యేకతను సమకూర్చింది.

తెలుగులో పద్యాలు చదవటం, అర్థాలు చెప్పటం, కథలు వినిపించటం వలన ఆయన విశిష్టత అప్పుడే అర్థమయ్యింది. పరిస్థితులను సూక్ష్మంగా గమనిస్తూ, అక్రమాలకు తలవంచకుండా, ధైర్యసాహసాలతో స్వతంత్ర భావ వ్యక్తీకరణ ఆయన పుట్టుకతో వచ్చిన సుగుణం.

కళాశాల విద్యార్థి దశ, (1943 - 1947) అత్యంత ప్రధానమైనది. కాలేజీలో పాఠ్యాంశాలు శ్రద్ధగా చదివి పరీక్షలలో ఉత్తీర్ణులు కావడం మాములు విషయం. ఆనాటి క్రియాశీల రాజకీయాలలో అనుసరించవలసిన విధివిధానాలపై తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఏర్పడినవి. ఆనాటి సామాజిక అర్థిక పరిస్థితులు, రాజకీయాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోషించిన పాత్రలు సిద్ధాంత విభేదాలకు మూలకారణాలు. హైస్కూలు విద్యార్థిగానే నేను భారత కమ్యూనిస్టు పార్టీ క్రీయాశీల సభ్యుడిగా మారిపోయాను. గౌతమరావుగారు సోషలిస్టుపార్టీ సానుభూతిపరుడుగా, తర్వాత క్రియాశీల నాయకుడుగా గుర్తింపు సాధించారు. దేశానికి స్వతంత్ర్యం రాకముందే స్వతంత్ర పోరాటాన్ని నడిపించగలిగే సుశిక్షత సేనానుల మధ్య అభేద్యమైన అభిప్రాయ బేధాలు చోటుచేసికోవడం, ఫలితంగా స్వాతంత్రోద్యమం బలహీనపడిపోవడం కేవలం దురదృష్టకరం, స్వీయ మానసిక మనస్తత్వాలు, వ్యక్తుల అహంభావాలు, పట్టుదలలు భావసమైక్యత, నిర్మాణానికి విశాల ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి అనేక ఆటంకాలను కల్పించినవి. ఇందులో సోషలిస్టుపార్టీ భారత కమ్యూనిస్టు పార్టీల మధ్య చీలిక ముఖ్యం. కాంగ్రెస్ పార్టీలో, దశాబ్దాలుగా సాగిన ఉద్యమాలలో రాటుదేలి ప్రపంచజ్ఞానంతో మేధావులుగా అవతరించిన యువతరం మొదలు ఒకటి తర్వాత ఒకటి జాతీయ కాంగ్రెస్ నుండి చీలిపోవడం, లేక వెలివేయబడడం ఆ తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ, భారత సోషలిస్టు పార్టీలుగా చీలిపోవడం, వారి క్రిందనున్న ప్రజా సంఘాలను కూడా చీల్చడం చరిత్రలో జరిగిన క్షంతవ్యంగాని అపరాధం. గౌతమ్‌రావుతో ఆయన నాయకత్వంలోని సోషలిస్టు బృందంతో ఉస్మానియా యూనివర్శిటి ప్రాంగణంలో జరిగిన అనేకానేక వాగ్యుద్ధాలు ఆవేశకావేశాలకు కారణభూతమైన సైద్ధాంతిక రాజకీయ అంశాలు గమనార్హం. రెండవ ప్రపంచ యుద్ధంలో, జర్మన్ నాజీలు కమ్యూనిస్టు దేశమైన రష్యాపై దండెత్తడంతో యుద్ధస్వభావం మారి అది ప్రజాయుద్ధంగా మారిపోయిందనే కమ్యూనిస్టువాదన పూర్తిగా తప్పు. అది అంతర్జాతీయ కమ్యూనిస్టు అనుసరించిన విధానం పూర్తిగా పొరపాటేనని చరిత్ర రుజువుచేసింది. ఈ దురవగాహన కారణంగానే భారత కమ్యూనిస్టులు 1942 ఆగస్టు 9న జాతీయ కాంగ్రెస్ (సోషలిస్టు పార్టీతో సహా) ఇచ్చిన క్విట్ఇండియా పిలుపును వ్యతిరేకించారు. బ్రిటీష్ మిత్రపక్షంగా గుర్తించారు. చరిత్ర ఇది పెద్దపొరపాటుగా రుజువుచేసింది. కమ్యూనిస్టులు ఆత్మవిమర్శ చేసుకున్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు విభజించి పాలించే తమ దుర్నీతికి పరాకాష్టగా అఖండ భారతాన్ని 1947లో రెండుదేశాలుగా చీల్చడానికి పూనుకున్నారు. దీన్ని గూడా భారత కమ్యూనిస్టు పార్టీ బలపర్చింది. దీనికి జాతుల స్వతంత్రంగా వక్రీకరించింది. ఈ

నిర్ణయం కూడా పొరపాటుగా గుర్తించారు. 15 ఆగస్టు 1947నాడు భారతదేశం స్వతంత్రాన్ని సాధిస్తే ఇది స్వతంత్రంకాదని పరోక్ష బానిసత్వమని భారత కమ్యూనిస్టు పార్టీ నాలుగుసంవత్సరాల సుదీర్ఘకాలం అనేక నష్టకష్టాలు అనుభవించిన తర్వాత అత్యంత హానికరమని ఆత్మవిమర్శచేసుకున్నది. సైద్ధాంతికంగా రాజకీయంగా ఇన్ని పొరపాట్లు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ కార్మిక, కర్షక వర్గాలలో తమ పట్టును ప్రాబల్యాన్ని పెద్దగా కోల్పోలేదు. శ్రమ జీవులు, కష్టజీవుల పట్ల మొక్కవోని విశ్వాసం, సేవాతత్పరత, త్యాగనిరతి ఆ పార్టీని రక్షించింది. సుదీర్ఘచరిత్రకు అనుగుణ్యంగా ఎదగలేకపోయినా కార్మిక కర్షకలోకంలో తమ విశిష్ట పాత్రను పదిలపరుచుకోగలిగింది. సోషలిస్టుపార్టీ తన పరిమిత చరిత్రలో రాజకీయ సాత్వికతను, సైద్ధాంతిక పవిత్రతను పరిరక్షించుకున్నా కేవలం మేధావుల పార్టీగా ఆ తర్వాత వ్యక్తులకే పరిమితమయిపోవడం యాదృచ్ఛికంకాదు. ప్రజా ఉద్యమాలను, పార్టీ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడమే దీనికి మూలకారణం. పైనుదహరించిన రాజకీయ హంశాలన్నిటిలో గౌతమరావుగారు వారి మిత్రబృందం అనుసరించిన విధానాలు సరియైనవేనని చరిత్ర రుజువుచేయడం వారి సాత్వికచింతన, నిర్భీతి, పటుతర దేశభక్తికి తార్కాణం.

15వ ఆగస్టు 1947 స్వతంత్రం తర్వాత హైదరాబాదు సంస్థాన పరిస్థితులలో తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకున్నవి. నిజాం నవాబు భారతయూనియన్‌లో విలీనం కావడాన్ని తిరస్కరించారు. హైదరాబాద్ సంస్థానం ఒక ముస్లిం రాజ్యాంగ స్వతంత్రంగానుంటుందని ప్రకటించాడు. ఐక్యరాజ్యసమితి సభ్యత్వం కొరకు కూడా ప్రయత్నించాడు. తన పోలీస్ సైనిక బలగాలపై ఆధారపడడం సరిపోదని వేలాదిమంది ముస్లిం యువకులతో కూడిన రజాకార్ దళాలను ఏర్పాటు చేసాడు. ఖాసిం రజ్వీ దీనికి సేనాని. తమ రాజ్యాధికారాన్ని సవాల్ చేసిన కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలపై కత్తికట్టాడు. రోజురోజుకు నిరంకుశ నైజాం వ్యతిరేక శక్తులు విజృంభించాయి. సంస్థానం భారతదేశంలో తక్షణం విలీనం కావాలనే నినాదం మిన్నుముట్టింది. వకీళ్లు, డాక్టర్లు తదితర మేధావులు తమ వృత్తులను ప్రక్కన పెట్టి ఈ పవిత్ర ఉద్యమంలోకి దూకారు. ఉస్మానియా కళాశాల విద్యార్థులతో సహ అన్ని కళాశాలలు, పాఠశాలల విద్యార్థి నాయకులు ఈ ఉద్యమానికి పెద్దగా దోహదం చేశారు. నాయకత్వం వహించారు. సంస్థానం ఒక అంతర్యుద్ధంలో కూరుకుపోయింది. ప్రభుత్వం మరియు రజాకార్ల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా వందలాది గ్రామాలలో వేలాది రైతుకూలీల, యువతీ యువకులు ఆత్మరక్షణ కొరకు మొదలు లాఠీలు, ఆ తర్వాత ఆధునిక ఆయుధాలు కూడా చేపట్టారు. యూనియన్ సరిహద్దు ప్రాంతాలలో అనేక క్యాంపుల నిర్వహణ జరిపి పోరాటయోధులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. రక్షణ కల్పించడం జరిగింది. 13 మాసాలుగా నిర్వహించబడిన ఈ మహోధ్యమంలో కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీల పాత్ర అత్యంత ప్రశంసనీయం. కమ్యూనిస్టుల పాత్ర అద్వితీయమైతే సోషలిస్టుల పాత్ర అమోఘం. కాంగ్రెస్ సరేసరి. 1947 సెప్టెంబరు, అక్టోబరు మాసంలోనే

యువనాయకులు అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. అజ్ఞాతవాసం, అరణ్యావాసం, కారాగార శిక్షలలో నాపార్టీ పాత్ర ఇక్కడ అప్రస్తుతం. సోషలిస్టుపార్టీ నాయకులలో అగ్రగణ్యుడిగా మడమతిప్పని వీరుడిగా గౌతంరావు వారి సహచరుల పాత్ర అత్యంత వీరోచితం. మొదలే శత్రువలయంలో చిక్కిపోయి అరెస్టుకావడం మరట్వాడాలో నున్న ఔరంగాబాద్ జైలులో బంధించబడడం అందరిని ఆశ్చర్యచకితులని చేసింది ఆ తర్వాత ఒకటి రెండు మాసాలలోనే గౌతంరావుగారు  జైలునుండి సాహసోపేతంగా తప్పించుకున్నారు అను వార్త దావానలంగా వ్యాపించింది. సహచరులు, స్నేహితులు, ప్రజాబాహుళ్యంలో ఉత్సాహాన్ని నెలకొల్పింది. 20 - 25 మంది సహచరులతో కలిసి సరిహద్దు ప్రాంతమైన చాందా క్యాంపులో కీ॥శే॥ కె.వి. నరసింగరావుగారి ఆధ్వర్యంలో సైనికశిక్షణ పొందారు. దళ నాయకుడుగా ఆధునిక ఆయుధమైన స్టెన్‌గన్‌ను భుజాన వేసుకుని కరీంనగర్ జిల్లా గ్రామాల ప్రజలలో ఆత్మవిశ్వాసం కలిగించడానికి జైత్రయాత్ర నిర్వహించారు. రహస్య జీవితానికి అవసరమైన క్రమశిక్షణను పాటిస్తూ శత్రుమూకలను దండిస్తూ గ్రామ గ్రామాన మువ్వన్నెల జెండాలను ఎగరవేస్తూ సాగిపోయారు. 1948 సెప్టెంబరు 17 నాటి పోలీసు చర్య ఫలితంగా విజయపతాకాన్ని ఎగురవేస్తూ బహిరంగ జీవితంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 3 సం॥లు సోషలిస్టు పార్టీ రాష్ట్రనేతగా తమపార్టీ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రముఖవక్తగా, స్పష్టత కలిగిన మేధావిగా, రాజీలేని రాజకీయ వాదిగా కరీంనగర్ జిల్లాలో తమకంటూ ఒక ప్రత్యేకతను సాధించుకున్నారు. 1952 ఫిబ్రవరిలో ప్రధమ సార్వత్రిక ఎన్నికలు రానే వచ్చాయి. సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా వారు నిలబడ్డారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా కీ॥శే॥ పి.వి. నరసింహరావుగారు నామినేషన్ వేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా కీ॥శే॥ బద్దం ఎల్లారెడ్డిగారు పోటీపడ్డారు. బద్దం ఎల్లారెడ్డిగారు అఖండ ఆధిక్యతతో గెలుపొందారు. ఓటమి చవిచూసిన గౌతంరావు, ఎన్నికల రాజకీయాల పట్ల విముఖత కనబర్చారు. రాజకీయ సామాజిక కార్యక్రమాలలో తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. కరీంనగర్ పట్టణంలో డిగ్రీ కళాశాల స్థాపనంలో కీ॥శే॥ కె.వి., పి.వి., వై. హనుమంతరావు, డి. హనుమంతరావు తదితర ప్రముఖులతో కలిసి కృషి చేశారు. వీరందరిని కలుపుకుని ఒక డిగ్రీ కళాశాల స్థాపనలో, నిర్వహణలో కర్తవ్యాన్ని నిర్వహించిన నాకు ఇదొక మధుర స్మృతి. క్రమంగా గౌతంరావు అసలు ముఖం అయిన సాహితీవేత్త దశ రూపుదిద్దుకున్నది. అనతికాలంలోనే ప్రముఖ విశ్లేషకుడిగా, విమర్శకుడిగా గుర్తింపులోకి వచ్చారు. కీ॥శే॥ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత విశ్వనాధ సత్యనారాయణ గార్కి అనుంగు శిష్యులుగా గుర్తింపు సాధించారు. తెలుగు పాండిత్యం రాజకీయ పరిపక్వత వారి స్వంతం.

# ప్రపంచీకరణ - పేదరిక నిర్మూలన

ప్రపంచీకరణ, గత 15 సం॥లుగా ఒక వివాదస్పద సమస్యగా నలుగుచున్నది. ఇది ఒక అనివార్య ఆర్థిక పరిణామమని అందరూ అంగీకరిస్తున్నారు. ఆయా దేశాలు తమ స్వతంత్ర సమగ్ర ఆర్థికాభివృద్ధికి ఏమాత్రము ఆటంకము ఏర్పడకుండా, పైగా అటువంటి అభివృద్ధి వేగాన్ని పెంచే విధంగా ప్రపంచీకరణ పరిణామాలను మలుచుకోవాలని అభిప్రాయపడుతున్నాయి.

ప్రపంచీకరణ వలన ప్రపంచం మరింత కుదించుకొని ఒక కుగ్రామంగా మారుచున్నది. మారుమూల, సుదూర ప్రాంతాలు పరస్పరం సన్నిహితం కావడమే కాకుండా పరస్పర ఆధారితమైపోతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పు కారణంగా పెద్దమొత్తాలలో ద్రవ్యం సులభంగా అన్ని మూలలకు ప్రవహిస్తున్నది. సమాచార విప్లవం, వాణిజ్య, శాస్త్ర, సాంకేతిక పురోగమనం ఫలితంగా ప్రపంచీకరణ వలన దినదినం అనూహ్య పరిమాణాలు సంభవిస్తున్నాయి. దేశాల మధ్య మానవ సంచారం ద్రవ్య ప్రవాహం, శాస్త్రసాంకేతిక విజ్ఞాన మార్పు శరవేగంగా కొనసాగుచున్నది. సామాజిక వ్యవస్థలో ఇటువంటి ప్రపంచీకరణను ఒక అపూర్వ అవకాశంగా మలచుకొని తమ అభివృద్ధిని వేగవంతం చేసుకోగలుగుతాయి. లేదా తమ అస్వతంత్ర, అశక్తత కారణంగా ఇటువంటి అద్భుత అవకాశాన్ని జారవిడుచుకుంటాయి. తమ ఆర్థిక, సామాజిక సమస్యలను తీవ్రతరం చేసుకుంటూ బలవంతులకు బానిసలుగా మిగిలిపోతాయి.

ప్రపంచీకరణ ఫలితంగా రాజ్యవ్యవస్థల ప్రాధాన్యతలలో కూడా గణనీయమైన తగ్గుముఖం ప్రస్ఫుటంగా కనబడుతుంది. రాజ్యాలు, దేశాలు పరస్పర ఆధీనత కారణంగా పూర్వపు స్వతంత్రత తగ్గడం సహజం. ప్రపంచీకరణ గత దశాబ్దం నుండి ప్రపంచ మానవ చరిత్రలో నూతన అధ్యాయానికి తెర లేపింది. విడివిడిగానున్న మార్కెట్ వ్యవస్థలు ఏకీకృతం కావటం జరిగిపోతున్నది. ఫలితంగా దేశాలలో ఇంతకు ముందుండే వేర్పాటు ఆర్థిక, వాణిజ్య వ్యాపార వ్యవస్థలు సరళీకృతం కాకుండా ఉండలేవు. వస్తు మార్పిడి, ధరవరలను ప్రపంచ మార్కెట్ శాసిస్తున్నది. ఆర్థిక ప్రగతి స్థాయిలో పురోగమనంలో అత్యంత ఒడిదుడుకులతో నున్న దేశాలు ప్రపంచమార్కెట్ ప్రభావాన్ని, శాసనాలను తట్టుకోలేక తటపటాయించడమో లేక చతికలపడటమో గమనించదగిన వాస్తవం. ఆర్థిక దార్శనికత రాజకీయ పటుత్వం కలిగిన సమాజాలు, ప్రభుత్వాలు

మాత్రమే ప్రపంచీకరణ సృష్టించే అవాంతరాలను అధిగమించగలుగుతాయి. అనుకూలంగా మలుచుకోగలుగుతాయి. నడుస్తున్న ప్రపంచీకరణ ప్రధానంగా ఆర్థిక, సాంకేతిక, వాణిజ్యవ్యాపార రంగాలలో వివిధ దేశాల మధ్య పరస్పరాధీనతకు సుస్పష్టం చేస్తున్నది. ఇటువంటి పరస్పరాధీనత ఫలితాలు ఆయా దేశాల సమాజాలకు లాభదాయకం లేదా నష్టదాయం కూడా కావచ్చు. ఎవరకీ ఏ విధంగానూ నష్టదాయకం కాకుండా నియంత్రించగలిగే ప్రపంచ రాజకీయ వ్యవస్థ ఇంకా బాల్యావస్థలోనే ఉండటం గమనార్హం. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి, ప్రపంచ వాణిజ్య వ్యవస్థలు వాటి ప్రాతినిధ్యం, పనివిధానం, అధికారం, ఆర్థిక ప్రపంచీకరణను అది సృష్టిస్తున్న జఠిలమైన సమస్యలను పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి తగినంతగా లేకపోవటం ప్రశ్నార్థకం. ఈ లోటును గమనించి, గుర్తించి పూరించడానికి అన్ని దేశాలు ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న పేద దేశాలు సమైక్యంగా సాధికారికంగా కృషి చేయవల్సిన కర్తవ్యం కొట్టవచ్చినట్లు కనబడుచున్నది.

ప్రపంచీకరణ దాని బహుముఖ ప్రభావం, విశ్వరూప సాక్ష్యాత్కారం యాదృచ్ఛికం కాదు. ఇరవయ్యవ శతాబ్ధం ఉత్తరార్థ భాగంలో అభివృద్ధి చెందిన దేశాలలో పెద్ద పరిణామం చోటుచేసుకున్నది. అక్కడి బహుళజాతి సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు వారి ప్రభుత్వాల ఆదాయ, వ్యయాలలో అపూర్వమైన, గుణాత్మకమైన మార్పు చోటుచేసుకున్నది. వారి అంతరంగిక అసమానతలు, అభద్రతలు ఎలా వున్నా అవి మాత్రం సంపన్న దేశాలుగా తమ పెట్టుబడులను, ధనాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని ఎగుమతి చేయడానికి ఒకరితో మరొకరు పోటీపడుతూ అభివృద్ధి చెందుతున్న పేద దేశాల వ్యవస్థలలో బలంగా జోక్యం చేసుకుంటున్నాయి. ‘‘పెట్టుబడి’’, అభివృద్ధికి అమూల్యం అయితే పెట్టుబడిదారులు దీనిని అభివృద్ధి సాధనకు ఉపయోగించవచ్చు. లేక పేద దేశాలలో కోకొల్లలుగా లభ్యమవుతున్న మానవశ్రమను చౌకగా కొనుగోలు చేసి ‘‘అభివృద్ధి’’ పేరిట తమ పెట్టుబడిపై అత్యధిక లాభాలు దండుకోవచ్చు. పై ప్రక్రియలను పర్యవేక్షిస్తూ, నియంత్రిస్తూ అభివృద్ధి చెందుతున్న లేక పేదదేశాలు తమ అభివృద్ధి వేగాన్ని పెంచుకోవచ్చును లేదా తమ పేదరికాన్ని, పరాధీనతను కూడా పెంచుకోవచ్చు. తాము శతాబ్దాలుగా పోరాడి సాధించుకున్న స్వతంత్రం, స్వతంత్ర ఆర్థికాభివృద్ధిని గౌరవిస్తూ స్వావలంబన దిశా నిర్దేశన చేసుకోగలిగితే అది రాజకీయ నాయకత్వం యొక్క విజ్ఞానం, విషయ జ్ఞానం, దార్శనీయతలపై ఆధారపడి ఉంటుంది.

ధనాఢ్య దేశాల దనదాహం నేపథ్యంలో కొనసాగుతున్న ప్రపంచీకరణ సహజంగానే బలహీన దేశాలకు కొరకరాని కొయ్యగా కనపడవచ్చు. వారు ఇచ్చే పెట్టుబడులు షరతులతో కూడినట్లుగా కనపడవచ్చు. విశ్లేషకులు వివరిస్తున్నట్లుగా షరతులుగా కనబడే నిబంధనలు ఆయా సందర్భాలకు సంబంధించిన నియమాలు ఆయా పరిశ్రమలు

అభివృద్ధి కార్యక్రమాలు నిజంగా ఉపయోగంలోకి రావాలంటే, నిరంతరాయంగా కొనసాగాలంటే ఆ నియమాలను యధాతథంగా కాకుండా పరిస్థితికి అనుగుణంగా అనువర్తింపచేస్తూ అమలుపరచటం అవసరం. రాజకీయ వ్యవస్థ పటుత్వం అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల సమిష్టి ఒత్తిడి ఫలితంగా షరతులుగా భావించబడే నిబంధనలను ఆచరించడం, సంస్కరించడం కష్టసాధ్యం కాదు.

ప్రపంచ ఆర్థిక చరిత్రకారులు శ్రీ డేవిడ్ రాండెస్ సెలవిచ్చినట్లు "The Greatest single problem and danger facing the world of the third milleinium is the gap in wealth and health that seperates rich and poor" అనగా ఈ శతాబ్దిలో ప్రపంచం ఎదుర్కొనే ఏకైక ప్రమాదం ధనిక, పేద ప్రజలను చీల్చే ఆస్తి, ఆరోగ్యాల మధ్య ఏర్పడుచున్న అంతరం మాత్రమే. 1999లో UNDP ప్రకటించిన మానవ అభివృద్ధి నివేదిక ఇలా చెబుతుంది. ''ప్రపంచంలో 20%గా నున్న ధనికులు మరియు 20%గా నున్న నిరుపేదలు మధ్యనున్న ఆదాయాల నిష్పత్తి 1820లో 3:1 ఉండగా అది 1913లో 11:1, 1970లో 30:1, 1990లో 60:1, 2000 నాటికి 86:1గా తేలింది. 1997లో ప్రపంచ జనాభాలో ధనిక దేశాలలో నివసించే 20% జనాభా ప్రపంచ ఆదాయంలో 86% పొందగలిగింది. అట్టడుగునున్న 20% జనాభా కేవలం 1 శాతం ఆదాయాన్ని మాత్రమే పొందగలిగింది. అయితే పేదరికం కూడా, కూడు, గుడ్డకు, నోచుకోలేని వారిని మాత్రమే అనుకోవద్దు. ఆదాయాల మధ్య పెరుగుతున్న తీవ్రమైన వ్యత్యాసాన్ని గుర్తించడం అవసరం.అమెరికాలో 1999లో ఒక కార్పోరేషన్ ముఖ్యాధికారి సామాన్య కార్మికుడు కంటే 475 రెట్లు ఆదాయాన్ని సంపాదించుకోగలుగుతున్నాడు. అంతమాత్రాన ఆ కార్మికుడు కటిక దరిద్రుడని చెప్పలేం. అయినా వ్యత్యాసాన్ని విస్మరించలేం. ప్రపంచంలోని 195 దేశాలలో 80 నిరుపేద దేశాలు 1990లో అంతకుముందటి దశాబ్దపు తలసరి ఆదాయాని కంటే తక్కువ ఆదాయాన్ని సంపాదించుకున్నాయి. తగ్గిపోతున్న ప్రజారోగ్యం, వ్యాపిస్తున్న ఎయిడ్స్ వ్యాధి, పెరిగిపోతున్న కాలుష్యం 100 కోట్లుగానున్న నిరుద్యోగం, వీటన్నిటికి ఆ దేశాల దారిద్ర్యమే మూలకారణం. ప్రపంచీకరణను, పై సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొనే విధంగా ఉపయోగించగలగడం ఈ తరం యొక్క గొప్ప బాధ్యత. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సాంఘిక న్యాయాన్ని సాధించినదే ఈ తరమూ, మరో తరము, భవిష్యత్తు అంధకారం కాకుండా ఆపలేం. పైనుదహరించిన ధనిక దేశాలలో పొంగిపొరలుచున్న ధనాన్ని, రాజకీయ చతురత దీక్షా దక్షతలతో వినియోగించగలిగే దేశానికి, సమాజానికి ప్రస్తుత దారిద్ర్యాన్ని నిర్మూలించటం అసాధ్యం కాదు కదా సుసాధ్యం కూడా. పేదరికాన్ని క్రమంగా తగ్గిస్తూ అనతికాలంలోనే నామరూపాలు లేకుండా చెయ్యాలంటే ఆయా దేశాల, సమాజాల రాజకీయ విధాన రూపకల్పనలే అత్యంత ప్రధానం.

పూర్వం అభివృద్ధి అనేది దేశం యొక్క సగటు అంతరంగిక ఉత్పత్తి పెరుగుదల రేటు కొలమానంగా గుర్తించబడేది. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి తదితర ప్రపంచ ఆర్థిక ద్రవ్య వ్యవస్థలన్నీ పై కొలమానాన్ని ఒక ప్రమాణంగా స్వీకరించినవి. సగటు జాతీయ ఉత్పత్తి పెరుగుదల మూలంగా పేదరికం తొలగిపోతుందనే ధృడవిశ్వాసం కలిగించబడింది. సంపన్న వర్గాలు సంపద సృష్టించే పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, వారి చుట్టూ తిరగాడే సామాన్యుల ఆదాయాల పెరుగుదల ఫలితంగా పేదలంతా ప్రయోజనం పొందుతారని మోసపూరిత సిద్ధాంతాన్ని ధనాఢ్య వర్గాలు ఆదే పనిగా ప్రచారంలోకి తెచ్చినవి. అయితే శతాబ్దాలు గడిచినా ఇటువంటి సిద్ధాంతం సత్ఫలితాలను ఇవ్వలేదు సరికాదా ప్రపంచ దేశాల మధ్య దేశంలోని వివిధ ప్రాంతాలు వర్గాల మధ్య ఆదాయాలలో అంతరాలు పెరిగిపోయినవి. కాబట్టి పేదరికానికి చికిత్స, జాతీయ ఆదాయాన్ని లేక జాతీయ తలసరిఆదాయాన్ని పెంచడం మాత్రమే కాదని రుజువయింది. సుమారు గత రెండు మూడు దశాబ్దాలు నుండి జాతీయ ఆదాయాన్ని పెంచడంతో పాటు ఆ ఆదాయాన్ని సమాజంలో సమతుల్యతతో పంపకం చేయడం ఫలితంగా పేదరికాన్ని నిర్మూలించవచ్చున్న ఆలోచన అంతర్జాతీయంగా అంగీకరించబడ్డది. అయినా అనుభవాలు ఆశించిన ఫలితాలను అందుబాటులోనికి రావటంలేదని స్థూలంగా చెప్పినవి. ఇదే సందర్భంలో పాకిస్థాన్ దేశానికి చెందిన కీ॥శే॥ మక్బూన్ ఉల్‌హక్ అను అర్ధశాస్త్రవేత్త మరియు మన దేశంలోని నోబెల్ బహుమతి గ్రహీత శ్రీ అమర్త్యసేన్ వారి సహచరులు ఇంకా వినూత్నంగా ఆలోచించారు. అంతర్జాతీయ మేధావులతో సైతం ఆమోదింపచేశారు. దారిద్ర్యాన్ని సూటిగా ఎదుర్కోవటానికి ఆర్థిక, సామాజిక సంస్కరణలు మాధ్యమంగా ఇటువంటి వర్గాలను సాధికారులను చేయడం ఈ సిద్ధాంత రహస్యం. శ్రమ, పరిశ్రమ, మానవుల సహజ కర్తవ్యం. అయితే ఈనాటి శాస్త్ర, సాంకేతిక విప్లవ యుగంలో మానవ శ్రమ ఉత్పాదకత పెరగాలంటే నైపుణ్యతతో కూడిన పరిశ్రమ అవసరం. దీనికి అవసరమైన విధంగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యావిధానాలలో ఆమూలాగ్ర సంస్కరణలు అత్యవసరం. మానవాభివృద్ధి మాత్రమే దేశాభివృద్ధికి ఏకైక ప్రమాణమని ఆధునిక, ఆర్థిక, సామాజిక శాస్త్రవేత్తలు ఘంటాపథంగా చెబుతున్నప్పుడు నూతన విద్యావిధానంతో పాటు నూతన ఆరోగ్యవిధానం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ఆరోగ్యంలో రోగ నివారణ, పర్యావరణ పరిరక్షణ, వైద్యం, పిల్లలు, తల్లుల పౌష్ఠిక ఆహారం, వృద్ధుల సంక్షేమం ప్రధానాంశాలుగా గుర్తించబడినవి. ఈ దశలోనే పేదలు ప్రధానంగా తమ బ్రతుకు భారాన్ని ఈడ్చే వ్యవసాయ రంగాన్ని సంస్కరించవలసియున్నది. భూ సంస్కరణలు, భూసార సంరక్షణ, నీటి పారుదల, ఆధునిక వ్యవసాయ యాజమాన్యం, విస్తరణ, మౌలిక సదుపాయాల రూపకల్పన ముఖ్యంగా పంటలకు గిట్టుబాటు ధరల చెల్లింపు ప్రభుత్వాల బాధ్యతలుగా గుర్తించవలసినవి. పారిశ్రామికులలో 98%గా నున్న అసంఘటిత కార్మికులు, చేతివృత్తుల

సంస్కృతిపై ఆధారపడిన అత్యధిక పేదల ఆదాయాలను గణనీయంగా పెంచవలసిన గురుతర బాధ్యత రాజకీయ, సామాజిక వ్యవస్థలపైన ఉన్నది. కులాలు, వర్గాలు దాదాపు సారూప్యంగా నున్న భారతీయ బహుజనలందరూ పేదరిక శాపం నుండి విముక్తి చెంది ఆధునిక భారత పౌరులుగా విద్యాబుద్ధులతో తలఎత్తుకు తిరగాలంటే తమ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టాలంటే ఈనాటి ప్రపంచీకరణ అందిస్తున్న అపురూప అవకాశాలను రాజకీయ శక్తులన్నీ సదావగాహనతో సంకల్పబలంతో పూర్తిగా వినియోగించుకోవాలి. మన దేశానికి అదృష్టాన ఒక జనాభాపర ప్రయోజనం సంక్రమిస్తుంది. రానున్న అనేక దశాబ్దాల వరకు ఈ దేశంలో అత్యధికులుగా నుండే యువతీ యువకుల మానవశక్తులతో ప్రపంచంలోనే ప్రథమ యువశక్తిగా వెలుగులోకి రానున్నది. ఇటువంటి యువశక్తి తారతమ్య తేడాలున్నప్పటికీ సృజనాత్మకత, నైపుణ్యత కలిగిన విద్యాబుద్ధులతో వివిధ రంగాలలో కృషీవలులుగా మందడుగు వేస్తే దేశ సంపదకు కొదవఉండదు. విదేశీ సహాయం, రుణ సహాయం సంపూర్ణంగా ఉత్పత్తిదాయకంగా వినియోగంలోకి వస్తుంది. ఉత్పాదకత పెరుగుతుంది. ఉపాధి కల్పన త్వరత్వరగా జరుగుతుంది . నిరుద్యోగం నశిస్తుంది. దేశం సుఖసంపదలతో వెలుగొందుతుంది. సమానత్వం సాకారమవుతుంది. మానవాభివృద్ధి, కుటుంబ సంక్షేమం ప్రమాణంగా నవభారతావని అవతరిస్తుంది.

# మానవాభివృద్ధి

అత్యంత ఆసక్తికరమైన శుభవార్త. మొన్నటికి భారతదేశ సగటు జాతీయ వార్షిక ఉత్పత్తి ఒక ట్రిలియన్ డాలర్లకు మించిపోయింది. అంటే మిలియన్ X మిలియన్ డాలర్ల (1,000,000,000,000) అంకెను చేరుకున్నది. 100 కోట్లకు మించిన జనాభా కలిగి, అందులో 50% యువశక్తి, శ్రమ శక్తి కలిగి, ఆసియాలోను అత్యధికులుగా కోటీశ్వరుల సంఖ్య కలిగియున్న భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశాల కోవ నుండి అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుబోతున్నదని అనడంలో సందేహం లేదు. ట్రిలియన్ ఆదాయానికి మించిన దేశాలలో 12వ స్థానాన్ని సంపాదించుకోవడం ముదావహం. ఆశించినట్లుగా కాకుండా 2050 నాటికి ముందే చైనా, అమెరికా తరువాత 3వ ఆర్థికశక్తిగా అవతరించబోవడం గర్వకారణం కూడా.

అయితే జాతీయ ఆదాయాలను ఒక ట్రిలియన్‌కు మించినట్లు ఎదిగిన 10 దేశాలలో కనీసం 8 దేశాలు ఒక సంవత్సరంలోపే కృంగి చతికిలబడిన ఉదంతాలు కూడా ఈనాటి ప్రపంచంలో అగుపడుచున్నది. అభివృద్ధి స్థిరంగా, నిరంతరాయంగా కొనసాగాలంటే అది సుస్థిరమైన, ఆర్థిక, సామాజిక సంస్కరణల పునాదులపై నిలబడి వుండడం అవసరం. కోటీశ్వరులు పట్టణాలలోని ఆకాశ హర్మ్యాలు, స్టార్ హోటళ్ల సంఖ్య, విమాన ప్రయాణీకుల సంఖ్యలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుండడం నిజమైన సామాజిక అభివృద్ధికి తార్కాణం కాదు. 60 సం॥ల స్వాతంత్ర్యానంతరం రోజుకు కనీసం తలసరి రూ.20ల ఆదాయం పొందేవారు 83% మంది ఉన్నారు. 12% శాతానికి మించిన ద్రవ్యోల్బణం పుణ్యమా అంటూ పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలతో బాధపడుతున్నారు. ఇటువంటి సామాజిక వ్యవస్థను అభివృద్ధి పరచాలంటే ఈనాటి ఆర్థిక వ్యవస్థకు మౌళిక సంస్కరణల ద్వారా కాయకల్ప చికిత్స అవశ్యం.

ప్రపంచ వ్యాపిత ప్రజా ఉద్యమాలు, ఉద్యమ అనుభవాలు వాటిని సునిశితంగా విశ్లేషించిన ఆర్థిక సామాజిక శాస్త్రవేత్తలు సంపద పెరుగుదల అర్థాలను మార్చివేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం ప్రపంచ బ్యాంకును నిర్వహించే అక్కడి ఆస్థాన పండితుల నిర్వచనం ప్రకారం ఆదాయ పెరుగుదల కొరకు భారీ పరిశ్రమల నిర్మాణం, దిగుమతుల ప్రధానం అయ్యే వాణిజ్యం అభివృద్ధి చెందుచున్న దేశాలకు తక్షణ అవసరం. దీనినే 'వాషింగ్టన్ కాన్సెన్‌సస్' అన్నారు. అనతికాలంలోనే ఈ అవగాహన అశాస్త్రీయం అని

తేలిపోయింది. అప్పులు పుచ్చుకున్న వారు స్థానిక ప్రభుత్వాల అనుమతులతో పరిశ్రమలు నిర్మించలేదు సరికదా మిద్దెలు, మేడలు కట్టడానికి వస్తు, వాహనాల కొనుగోలుకు, విలాసవంతమైన జీవితాలకు వెచ్చించారు. స్వావలంబన దిశలో స్వదేశీ వనరులను సృష్టించుకోవడంలో స్వంత ఆదాయాలను పెంచుకోవడంలో విఫలత చెందారు. ఆ తర్వాత 'అభివృద్ధి'కి అర్థం కొంతవరకు మారింది. దేశంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలలో ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవాలని దేశ, విదేశీ పెట్టుబడులను అటు మళ్ళించాలని ఈ విధంగా సంపాందించిన పెట్టుబడులను అభివృద్ధితో పాటు సామాజిక న్యాయాన్ని సాధించే దిశలో బడుగు, బలహీన వర్గాలుకు తోడ్పడాలని అలోచించడం జరిగింది. కొన్ని దశాబ్ధాలు గడిచినా ప్రణాళికా సంఘం వారి ఆలోచనలు కాగితాలకు పరిమితం కావడమే తప్ప 70-80% జనాభా కలిగిన దళిత, వెనుకబడిన తరగతుల తదితర బలహీన వర్గాల జీవితాలను మార్చడానికి ఉపయోగపడలేదు. ఎన్ని విశ్లేషణలు చేసినప్పటికీ దేశంలో ప్రాంతాల మధ్య, వర్గాల మధ్య ఆర్థిక, సామాజిక తారతమ్యాలు తగ్గలేదు. ఈ అగాధం పెరిగింది. 1991 తర్వాత వచ్చిన సరళీకరణ దశలో దేశ విదేశీ పెట్టుబడుల వినియోగం గణనీయంగా పెరిగిన మాట నిజమే. అంతకుముందు దశాబ్ధాల తరబడి సగటు జాతీయ అభివృద్ధి రేటు 3-4% మించనే లేదు. సంస్కరణల దశలో వివిధ రంగాలలో సంపద పెరగడం, ఈనాడు 8-9 శాతానికి చేరుకోవడం సంతృప్తికరమైన పరిణామం. అయితే పెరిగిపోతున్న సంపదకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక ధృక్పథంతో, పేదరిక నిర్మూలన లక్ష్యంతో వెచ్చించడం జరగడం లేదు. అభివృద్ధి పేరిట మధ్య దళారులు, కాంట్రాక్టర్లు, కొందరు రాజకీయ నాయకులు కోట్లకు పడగనెత్తడం కంటికి కట్టినట్లు కనబడుతున్న సత్యం. ఈ పరిణామాలు, అనుభవాలు 'అభివృద్ధి'కి వినూత్నమైన అర్థాన్ని సమకూర్చే విధంగా ఆలోచనాపరులను ప్రోత్సహించింది. కీ॥శే॥ మక్బూల్ ఉల్ హక్ మరియు నోబెల్ బహుమాన గ్రహీత అమర్త్యసేన్ ఈ దిశలో అమోఘమైన కృషిచేసారు. అభివృద్ధికి, సామాజిక న్యాయానికి మధ్య అగాధాన్ని తొలగించే ఆలోచన చేశారు. జాతిసంపద ప్రతి సం॥ 9% పెరుగుతుంటే జాతిలో గూడు కట్టుకునియున్న పేదరికం 1/2 శాతం కూడా తగ్గకపోవడాన్ని ప్రశ్నించారు. అభివృద్ధి అనగా జాతిసంపద పెరగడం మాత్రమే కాదని, సంక్షేమమంటే బీదలకు సబ్సిడీల రూపంలో వివిధ సహాయాలు అందజేయడం మాత్రమే కాదని, అభివృద్ధిని మానవాభివృద్ధిగా గుర్తించాలని ప్రపంచానికి గుర్తింపచేశారు. విద్యా, వైద్య రంగాలపై అత్యధిక నిధులను కేటాయించి చైతన్య వంతమైన శాస్త్ర సాంకేతిక నైపుణ్యతతో క్రియాశీల పాత్ర పోషించగలిగే యువతరాన్ని తీర్చిదిద్దడం ప్రథమ కర్తవ్యంగా చెప్పారు. అందుకు అవసరమైన సంస్కరణలను తక్షణం చేపట్టాలని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళలను సాధికారులుగా చేస్తూ ఉత్పత్తి సాధనాలపై సర్వాధికారాలు వారికి అందచేయాలని చెప్పారు. నిత్య నూతనంగా సృష్టించబడే ఉపాధి అవకాశాలను

ఈ నవతరం ఉపయోగించుకునే విధంగా అన్ని రంగాల విధానాల రూపకల్పన వెంటనే జరగాలన్నారు. అప్పుడే ఉత్పాదకత పెరిగి, ఉత్పత్తి కూడా పెరిగి ఈ ప్రక్రియలో పరిశ్రమలో ప్రత్యక్ష పాత్రను పోషించిన కర్మవీరులైన స్త్రీ, పురుషులు నిజమైన సంతృప్తిని సాధిస్తారని నొక్కివక్కాణించారు. అభివృద్ధి లక్షల కోట్ల రూపాయలలో కాకుండా లక్షల కోట్ల ప్రజల నిత్యజీవితంలో, భుజించే పౌష్ఠికాహారంలో, కుటుంబ, నాగరిక జీవిత ప్రమాణంలో విద్య, వైద్య సౌకర్యాలలో ప్రతిబింబించాలని ఘంటాపథంగా చెప్పారు. దీనినే 'మానవాభివృద్ధి' అన్నారు.

ఇంతటి మహోన్నతమైన సామాజిక స్పృహ, మానవీయ దృక్పథం మన దేశంతో సహా వెనుకబడిన దేశాలలో ఇంకా ఆచరణలోకి రాలేదు. తోటి చైనా, వియాత్నాం దేశాలు సాధించిన అద్భుతాలు మన నాయకుల కళ్ళు తెరిపిస్తున్నాయి. సమ సమాజం దిశలో మన దేశం పురోగమించాలంటే మానవ ముఖంతో మానవీయతతో ముడిపడియుండే మానవాభివృద్ధి ఒక్కటే శరణ్యం. అతివాద, మానవతావాద పార్టీలు, శక్తులు ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్ప బలాన్ని, ప్రజాబలాన్ని సమకూర్చుకోవడం, సమైక్యంగా ముందడుగు వేయడం ఈనాటి యుగధర్మం.

# దేశాభివృద్ధికి వ్యవసాయం, చిన్నతరహా, మధ్యతరహా, కుటీర పరిశ్రమలు మరియు హస్తకళల పునరుజ్జీవన అవశ్యకత-1

స్వాతంత్ర్యానంతరం అర్థ శతాబ్ది అనుభవాలు, ఆధునిక అర్థశాస్త్ర, రాజకీయ వేత్తలలో దేశ అభ్యుదయానికి వినూత్న ఆర్థిక, రాజకీయ విధానాల ఆవశ్యకతను ప్రేరేపింపజేస్తున్నాయి. ఇంతకాలం సాధించిన అభివృద్ధి, లేక ఆర్థికాభివృద్ధి, సంపదను గణనీయంగా పెంచినప్పటికి దానివలన పేదరికం తొలగిపోవడం వర్గ విబేధాలు సమసిపోవడం, వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి చెందడం ఆశించిన మేరకు సాధ్యపడలేదని స్పష్టంగా గుర్తించడం జరుగుచున్నది. మతతత్వం, కులతత్వం, ప్రాంతీయ తత్వాలు సామాజిక జీవితాన్ని ఎప్పటిలాగే పీడించడం, ఫలితంగా రాజకీయ ప్రజాతంత్ర వ్యవస్థలు బలహీన పడిపోవడం కూడా కొట్టవచ్చినట్లు కనబడుచున్నవి. దేశ సమగ్రత సమైక్యత కేవలం మానవాభివృద్ధి సిద్ధాంతం ఆధారంగా అసమానతలను తొలగించడం బహుముఖాభివృద్ధి ద్వారా మాత్రమే సుసాధ్యం అవుతుంది.

"అభివృద్ధి" అంతర్జాతీయంగా ఒక ప్రత్యేక అర్థాన్ని సంతరించుకున్నది. సగటు జాతీయ ఉత్పత్తి రేటు పెరుగుదల, సాధించిన మొత్తాన్ని జనాభాతో విభజించి తలసరి ఆదాయంగా లెక్కపెట్టడం పర్యాయ ప్రమాణాలుగా చెలామణిలోకి వచ్చినవి. ఇటువంటి అవగాహన ఫలితంగా సమాజంలో పెరిగిపోతున్న అసమానతలు పేదల బ్రతుకులలో ఆవరించిన చీకట్ల గురించి, వారి బాధల గురించి అర్థం చేసుకోవడం దుస్సాధ్యం. సామాన్యుని జీవితంలో వాని విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, నివాసం, పర్యావరణం, నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు అందుబాటులోకి రావడంలాంటి ప్రమాణమే నిజమైన అభ్యుదయానికి కొలమానంగా ఉద్ఘాటించడం జరుగుచున్నవి. భారతదేశంలో నున్న కులవ్యవస్థ, వర్గ వ్యవస్థ కంటే అనేక రెట్ల అసమానతలను యుగ యుగాలుగా సృష్టించి కొనసాగించడం, ఆర్థిక విభజనతో పాటు సామాజిక అసమానతలను అత్యంత అమానుష స్థాయిలోకి దిగజార్చిన సత్యాన్ని ప్రతి సంఘ సంస్కర్త ఏ మాత్రం విస్మరించడానికి వీలులేని పరిస్థితి. మన రాష్ట్రంలోనే కనీసం 63 కులాలు తరతమ సాంప్రదాయ సిద్ధమైన చేతివృత్తులు, వ్యవసాయం ఇతర పనులు చేస్తూ బ్రతుకుతున్నారు. పశుపోషణ, గొర్రెల పెంపకం చేసే గొల్లలు, కల్లు గీసి అమ్ముకునే గీత పారిశ్రామికులు,

మట్టి పని చేసే వడ్డెరలు, చేపలు పట్టే గంగపుత్రులు, చేనేత పారిశ్రామికులు, ఫలవృక్షాలు పెంచి పండ్లు అమ్ముకునే ముత్తరాసి లేక తెనుగువారు, బంగారంతో పనిచేసే విశ్వ బ్రాహ్మణులు, కమ్మరి, వడ్రంగి, రాళ్ళు పగులగొట్టే వృత్తి కలవారు, కుమ్మరి, చాకలి, మంగలి, గానుగ తిప్పేవారు, బుట్టలు అల్లేవారు, మేర తదితర వృత్తులు పేర్కొనదగినవి. జనాభాలో వీరి సంఖ్య 40-45 శాతంకు తగ్గకుండా ఉంది. దళితులుగా మాదిగ, మాల తదితర కులాలకు సంబంధించిన వారు 18-20 శాతం వుంటూ చర్మకార వ్యవసాయ కార్మిక వృత్తులను నిర్వహిస్తున్నారు. దేశ జనాభాలో 60 శాతానికి తగ్గకుండా పై కులాలకు చెందిన శ్రమజీవులు ఉంటారు. ఇందులో అత్యధికులు 80 శాతం వరకు దారిద్ర్య రేఖకు దిగువుగానో కొద్దిగా ఎగువగానో ఉంటారు. ఆర్థిక విశ్లేషణ వెలుతురులో అగ్రవర్ణాలతో కలసి మొత్తం జనాభాలో 30 శాతం సగటు తలసరి ఆదాయం ప్రతి రోజు రూ.45 గల వారు, ప్రతి రోజు రూ.100 ఆదాయం కలవారు మరో 30 శాతం కంటే తగ్గరు. ఆపైన నున్నటువంటి మరొక 30-40 శాతం ప్రజలు మధ్య తరగతిగాను అందులోను తరతమ తేడాలు ఉన్నవి. ఈ మధ్యతరగతి ప్రజలే మన దేశంలో ఒక పెద్ద కొనుగోలుదారులుగా నున్నారు. దేశ విదేశీ ఖరీదైన వస్తువుల కొనుగోలుదారులు వీరే.

పైన ఉదహరించినట్లు పెరిగిపోతున్న ఆర్థిక వ్యత్యాసాలు పేదరికాన్ని తగ్గించలేకపోతున్నాయి. 8 శాతం ఆర్థికాభివృద్ధిని సాధించినప్పుడు దాని ఫలితంగా అర శాతం కూడా పేదరికం తగ్గడం లేదు. 8-9 శాతం వార్షిక అభివృద్ధి రేటు ఫలితంగా భారతావని "వెలిగిపోతున్నదని" అభివృద్ధి చెందిన దేశంగా ముందడుగు వేస్తున్నదని చెప్పడం కేవలం ధనాఢ్య వర్గాల రాజకీయ ప్రచారం మాత్రమే. 60 శాతానికి తగ్గకుండా దేశ ప్రజలు దారిద్ర్యంలో నుండగా పై ప్రచారానికి ఆస్కారమే లేదు. జరుగుతున్న అభివృద్ధి, సంపద పెరుగుదల, కేవలం పాక్షికం. సమగ్రం, పరిపూర్ణం కాదు. అందుకే పేదరికం తగ్గడం లేదు. పౌరుల ఆదాయాల మధ్య తేడా దిన దినం పెరిగిపోతున్నది. ఆర్థిక వ్యత్యాసాలను రాజకీయ నిర్ణయాలు వాటి ఆచరణ ద్వారా మాత్రమే తొలగించగలుగుతాం. అందుకు ప్రభుత్వాలు రాజకీయ సంకల్ప బలంతో పూనుకోవడం తక్షణ అవసరం. ఇంతేకాదు మనదేశ సామాజిక ప్రత్యేకతగా నున్న కుల విభజన, హెచ్చు తగ్గులు తీవ్రమైన అసమానతలకు, అనైక్యతకు కారణభూతంగా నున్నవి. కులవ్యవస్థ నిర్మించిన ఉక్కు పంజరం సమాజాన్ని ఆర్థికంగానే కాక సామాజికంగా, మానసికంగా కృంగదీస్తున్న సత్యం ఒక సవాల్‌గా మిగిలియున్నది. ఈ వ్యవస్థను గురిపెట్టి ఆర్థిక, సామాజిక సంస్కరణలను చేపట్టి నిరంతరాయంగా దీక్షా దక్షతలతో అమలు పరిచిన తర్వాతనే ఆర్థిక అసమానతలను, తొలగించగలుగుతాం. కులవ్యవస్థ సృష్టించిన సామాజిక బలహీనతలను నిర్మూలించ గలుగుతాం. ఆర్థిక అసమానత ఒకటి, రెండు దశాబ్దాల పరిమిత కాలంలో తొలగించగల విశ్వాసం అవసరం. కాని

సామాజిక అసమానతలు కులవ్యవస్థను తొలగించడానికి సుదీర్ఘ కాలం పోరాడితే తప్ప సాధ్యపడదు. అందుకొరకు అనుసరించదగిన ఈ క్రింది సూత్రాలను అధ్యయనం చేయడం వినూత్న ఆర్థిక సామాజిక విధానాలుగా ప్రభుత్వాలు, ప్రజాసంస్థలు అనుసరించడం అవసరం.

1. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో పేద, బలహీనవర్గాల ప్రత్యక్ష ప్రమేయం అత్యవసరం. ఆర్థిక సంస్కరణల్లో మానవీయత సాధించబడాలంటే అభివృద్ధి కేవలం బౌతిక అభివృద్ధి మాత్రమే కాకుండా మానవ జీవిత సుఖశాంతుల రూపంలో ప్రస్ఫుటంగా కనబడాలి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అనుదినం చోటు చేసుకుంటున్న వినూత్న మార్పుల ఆధారంగా దేశ ప్రజల విద్య, వైద్య సదుపాయాలు సౌకర్యాలలో ఆమూలాగ్రమైన మార్పు వెంటనే చేపట్టాలి. దారిద్ర్య రేఖకు దిగువగా నున్న ప్రతి బాల బాలిక ఉన్నత విద్య సాధించే బరువు, బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యతగా అమలు పర్చబడాలి. విద్యా విధానాన్ని ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్యా స్థాయి వరకు ప్రక్షాళన చేసి శాస్త్ర సాంకేతిక విజ్ఞానానికి పెద్ద పీట వేయాలి. భావి పౌరులంతా మానవ శ్రమ ప్రధానమైన శ్రామికులే కాకుండా విజ్ఞానవంతమైన పారిశ్రామికులుగా తీర్చి దిద్దబడాలి. అప్పుడే వారి శ్రమ శక్తి యొక్క ఉత్పాదకత ఇనుమడిస్తుంది. విజ్ఞానపర పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే శక్తిని సంతరింపజేస్తుంది. ఇప్పటికే జనాభా పరంగా మన దేశానికి ఒక్క అదృష్టకరమైన అవకాశం కలగబోతున్నదని విశ్లేషకులు వివరిస్తున్నారు. రానున్న కొన్ని దశాబ్దాల వరకు మన దేశ జనాభాలో సగానికి తగ్గకుండా యుక్తవయస్సు కలిగిన యువతీ యువకులు శ్రమైక జీవులుగా వివిధ రంగాలలో పనిచేస్తారు. వారే విద్యాబుద్ధులు, విజ్ఞానం కలిగియున్నట్లయితే చెప్పేదేముంది. అనతి కాలంలో దేశాన్ని సుసంపన్నం చేయగలిగే మానవశక్తి మనలోనుండే అవతరిస్తుంది. కాబట్టి విద్య, వైద్య రంగాలపై ఈనాడు చేస్తున్న బడ్జెట్ కేటాయింపులు 3 నుండి 4 రెట్లకు పెంచక తప్పదు. విధానాల సంస్కరణ చేపట్టక తప్పదు. ప్రజలు, ప్రజాసంస్థల ప్రత్యక్ష భాగస్వామ్యం మాత్రమే, పారదర్శకత, ఫలితాల సాధనకు మూలం.

2. ఈనాటికి 70 శాతానికి తగ్గకుండా మన జనం ప్రత్యక్షంగానో, పరోక్షం గానో వ్యవసాయంపై ఆధారపడి యున్నారు. ఒకనాడు జాతి సంపదలో ప్రథమశ్రేణికి చెందిన వ్యవసాయం ఈనాడు దేశం మరియు ఆంధ్రరాష్ట్రంలో ద్వితీయ శ్రేణి నుండి తృతీయ శ్రేణికి దిగజారుతున్నట్లు అంకెలు చెబుతున్నాయి. వ్యవసాయం పరిశ్రమలాగా యాంత్రికంగా అభివృద్ధిని సాధిస్తూ పురోగమనం చెందడం ప్రకృతి సిద్ధంగానే కష్టసాధ్యం, లేక అసాధ్యం. వ్యవసాయ ఆదాయం జాతి సంపదలో తగ్గు ముఖం పట్టినా వ్యవసాయంపై ఆధారపడే జనాభా మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. అక్కడక్కడ చాలా పరిమితంగా ఈ తగ్గుదల కనబడుతున్నప్పటికి పెరుగుతున్న జనాభాలో అత్యధిక

భాగం వ్యవసాయ వృత్తిపైననే ఆధారపడక తప్పడం లేదు. వ్యవసాయం ఒక ప్రధాన ఉపాధి కల్పనా రంగంగా ఉండక తప్పదు. ఆధునిక జీవ శాస్త్ర పరిజ్ఞానంతో, పర్యావరణ పరిరక్షణ ధ్యాసతో అలాగే వ్యవసాయ వృత్తిలో వెలుగులోకి వస్తున్న అనేకానేక మెళకువల ఆధారంగా వ్యవసాయ పరిశ్రమను నూతన హరిత విప్లవం ద్వారా ప్రజలకు ఉపాధికల్పనతో పాటు ఆరోగ్య ప్రదాయినిగా మలుచుకోగలిగే మహత్తర అవకాశం అందివస్తున్నది. భూసార సంరక్షణ, భూగర్భజల పరిరక్షణ, నీటివనరుల నిర్మాణం వ్యవసాయ విస్తరణ విధానాలపై బడ్జెట్‌లో నిధులను ఇతోధికంగా పెంచడంతో పాటు లబ్ధిదారులైన రైతాంగం ప్రత్యక్షంగా పరోక్షంగా పరస్పరాధార సహకార సంఘాల పునరుజ్జీవన ద్వారా సాధించడం అందుకు అవసరమైన ఆచరణాత్మక చర్యలను చేపట్టడం తక్షణావసరం. ఇంతకాలం పట్టణ వాసులు, ప్రభుత్వోద్యోగులకు సరసమైన ధరలకు అందజేసే లక్ష్యంగా నిర్వహించబడుతున్న వ్యవసాయ ఉత్పత్తుల, కనీస మద్దతు ధరల ఆలోచనను, యంత్రాగాన్ని సమూల్మాలంగా సంస్కరించడం అత్యవసరం. రైతుకు, రైతు పండించే ఆహార వాణిజ్య పంటలన్నింటికి శాస్త్రీయంగా అనగా ఇతర రంగాలలో కష్టించి పనిచేసిన వారు పొందుతున్న జీత భత్యాలకు సమానంగా, నూతన ప్రమాణాల ఆధారంగా ఈ మద్దతు ధరలు నిర్ణయించబడాలి. ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు మార్కెట్‌లలో ప్రైవేటు వర్తలకులతో పోటీపడుతూ కొనుగోలు చేసి, నిల్వచేసి దేశ విదేశాలకు ఎగుమతి చేసే పూచీ కల్పించబడాలి. వ్యవసాయరంగంలో నున్న లక్షలాది సన్నకారు, చిన్నకారు రైతులకు రుణంతో పాటు తదితర పెట్టుబడి అవసరాలన్నింటిని తీర్చడానికి రైతులను పరస్పర సహాయ సహకార సంఘాల (1995)లోకి ఆకర్షించాలి. ప్రైవేటు, కార్పోరేట్ రంగం, ఆయా సందర్భాలలో రైతులకు చేదోడు వాదోడుగా నుండే సౌకర్యాలు సమకూర్చాలి. ఇటువంటి మౌళిక సంస్కరణల ద్వారా మాత్రమే వ్యవసాయ రంగం పెరిగిన ఉత్పత్తి, ఉత్పాదక శక్తి ద్వారా ఉపాధి కల్పన పాత్రను విజయవంతంగా పోషించగలుగుతుంది. వ్యవసాయ సంస్కరణల్లో భూసంస్కరణలు అంతర్భాగం. అందుకు సంబంధించిన చట్టాలు ఖచ్చితంగా అమలుపర్చబడాలి. భూములు లేని నిరుపేదలకు అదనపు భూములను పంపకం చేస్తూ వారికి తదితర సంస్కరణలలో భాగస్వామ్యం చేస్తూ వారి ఉత్పాదకతను పెంచాలి. కౌలు భూములు విధిగా రిజిష్టర్ చేస్తూ కౌలు రైతులకు అవసరమైన రక్షణలను కల్పించే కౌలుదారీ చట్టాన్ని అవసరమైన సవరణలతో అమలు పర్చాలి. మానవశ్రమ ప్రధానమైన వ్యవసాయ వృత్తి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యొక్క సహాయంతో మానవాభివృద్ధికి మరింత అధికంగా తోడ్పడుతుంది. ప్రయోజనకరమైన చిన్న పరిశ్రమగా లాభసాటి ఉద్యోగంగా మనగలుగుతుంది. ఈనాడు కేవలం 2 శాతంగా నున్న వ్యవసాయ అభివృద్ధి పెరుగుదల రేటు 11వ పంచవర్ష ప్రణాళికాంతానికి 4 శాతానికి పెరగాలని ప్రణాళికా సంఘం నిర్దేశించింది. ఇది సాధ్యపడాలంటే మెట్ట, మాగాణి

వ్యవసాయాలలో ఉత్పత్తిని ఇతోధికం చేయడంతో పాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలైన పాడిపరిశ్రమ, పశుపోషణ, మత్స్య పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, గొర్రెల, మేకల పెంపక పరిశ్రమ 6-7 శాతానికి పెరగాలి. అందుకు అవసరమైన సూక్ష్మ స్థాయి సమస్యలను ఆయా రైతులు వ్యక్తిగతంగా, సామూహికంగా సహకార పద్ధతులలో పరిష్కరించుకోగలిగే వ్యవస్థాగత సంస్కరణలు రాష్ట్ర ప్రభుత్వం ప్రధమ ప్రాధాన్యత నిస్తూ నిర్వహించాలి. ఈ విధంగా మాత్రమే వ్యవసాయరంగం ఉత్పత్తి పెరుగుదలతో పాటు ఆధునీకరించబడిన ఉపాధికల్పన కేంద్రముగా పరిఢవిల్ల గలుగుతుంది. ఇదే భారతీయ అభివృద్ధికి మార్గం. దీని ద్వారానే గ్రామీణ బడుగు, బలహీన వర్గాలు, మహిళలతో సహా ఆర్థిక, సామాజిక, అభివృద్ధిని, స్వావలంభన, స్వయం సహాయం సూత్రాల ఆధారంగా సాధించగలుగుతారు.

3. భారతదేశంలో వ్యవసాయం తరువాత అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు, హస్తకళలు వీటిని నిర్వహించే నిరుపేదలు మన ఆర్థిక, సామాజిక విధానాలకు అత్యంత ప్రధానం. చేతివృత్తులు, హస్తకళలు భారతీయ సంస్కృతిలో అత్యంత పురాతనమైనవి. శ్రమ, పరిశ్రమ మానవ జీవితానికి మూలకందం. వేలాది సంవత్సరాల నుండి సామాజిక జీవితావసరాల సృష్టి, ఉత్పత్తి క్రమంలో మానవులు తమ సృజనాత్మక శక్తిని కల్పించుకున్నారు. పని పంపకం ద్వారా తమ గ్రామం తమ సమాజంలో పరస్పర సహకార సిద్ధాంత ఆచరణతో స్వావలంభన దిశలో చరిత్రలో ప్రయాణం చేశారు. వృత్తులు కులాలుగా పరిణితి చెందినారు. వృత్తి నైపుణ్యత ఆయా కులాల ప్రత్యేకతకు నిదర్శనమైనది. కేవలం ఆహారానికి  పరిమితం కాకుండా సామాజిక జీవితావసరాల సృష్టిలో వివిధ కులాలు నిమగ్నమైపోయినవి. అందరు కృషీవలురు, శ్రమైక జీవులు సమానులుగా అవతరించి, ఎదిగి పరస్పర సహకారం మార్గంగా ప్రశాంతంగా నున్న గ్రామీణ సమాజంలో ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమిపై బలవంతులు తమ ఆధిపత్యాన్ని నెలకొల్పిన తరువాత వర్గ సమాజం ఏర్పడినట్లు చరిత్ర చెబుతున్నది. కేవలం భూమి లేక గ్రామాలు, ప్రాంతాలపై తమ ఆధిక్యాన్ని యాజమాన్యాన్ని ప్రకటించుకునే దుర్వ్యవస్థ బలపడింది. ఆధిపత్యం కొరకు పోరాటాలు, యుద్ధాలు, హింసా చోటుచేసుకున్నవి. ఫలితంగా వర్ణాశ్రమ సిద్ధాంతం అవతరించింది. అగ్రవర్ణాలు, అన్యవర్గాలు, దళితులుగా సమాజం విభజించబడింది. ఈ కృత్రిమ విభజన భగవంతుని సృష్టి అంటూ ధర్మ శాస్త్రాలు రచించబడినవి. వెనుకబడిన తరగతులు అందులోను దళితులు సమాజంలోని హీన, కణహీన స్థానాల్లోకి నెట్టబడ్డారు. ఆధునిక సామాజిక మానసిక శాస్త్రవేత్తలు ఈ పరిణామాన్ని వివిధ కోణాల నుండి విశ్లేషిస్తూ దీనిని కాలగర్భంలో కలిపివేయవలసిన మార్గాలను చూపెట్టారు. మానవులంతా ఒకటేనను మానవతా సిద్ధాంతాన్ని ప్రపంచం ముందు పెట్టారు. వెనుకబడిన దళిత, బలహీన వర్గాలు త్వరత్వరగా సాధికారులను చేస్తూ సమతా భావాన్ని చాటి చెబుతున్నారు.

సాధికారత మాటల్లోనే కాదు ఉత్పత్తి సాధనాల పంపకంలో, ఉపాధి అవకాశాల కల్పనలో సామాజిక నిత్యజీవితంలో స్పష్టంగా గుర్తింపులోకి వచ్చే విధంగా చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఆర్థిక సంస్కరణల సమస్యను అత్యంత బాధ్యతగా తగిన ప్రాధాన్యతతో కుటీర పరిశ్రమలను, చిన్న పరిశ్రమలను, హస్తకళలను సంపూర్ణంగా ఆధునీకరించి ఉపాధిని పెంపొందించే దిశలో విధానాలు రూపొందించబడాలి. ఈనాడు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ''సంక్షేమం'' అను పేరుతో నిర్వహించే కార్యక్రమాలు, కేటాయించబడే నిధులు కేవలం కంటితుడుపు చర్యలు మాత్రమే. అసలు లోపం సమస్యల అవగాహనలోనే ఉన్నది. కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు, హస్తకళలు ఒక్కొకటి ఒక్కొక్క చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయం కలిగినటువంటి రంగాలు. ఇందులో మానవుని శ్రమ ప్రధానం. మానవుని నైపుణ్యత ప్రధానం. యంత్రం మానవ శ్రమకు అనుబంధం మాత్రమే. అసలు పెట్టుబడి అంటూ ఉంటే అది మానవ శ్రమనే. ఆ శ్రమ ఎంత నైపుణ్యతతో కూడినదైతే అంత పెద్ద పెట్టుబడిగా రాణిస్తుంది. ఈ వృత్తులకు సంబంధించిన వారిలో ప్రకృతి సిద్ధంగా సృజనాత్మకత ఉంటుంది. కష్టించి పనిచేసే స్వభావం పుట్టుకతోనే ఉంటుంది. ఈనాటి పరిస్థితులలో మన దేశంలో దారిద్ర్యాన్ని తొలగించి పేదవాళ్ళుగానున్న ఈ వర్గాలను ఉన్నత స్థాయికి తేవాలంటే సహజంగా లభ్యమయ్యే పై ఉదహరించిన సద్గుణాలను, సద్బుద్దులను సమీకరించాలి. ప్రపంచ వ్యాపితంగా పెరిగిపోతున్న చిన్న, మాధ్యమిక కుటీర పరిశ్రమల లాగే అభివృద్ధి పరచాలి. వారి నైపుణాన్ని పెంచుతూ ఉత్పాదకత పెంచడం ద్వారా ఆయా సరుకులను ప్రపంచ వ్యాపితంగా ఇతరులతో పోటీ పడుతూ కూడా లాభసాటి వ్యాపారం చేయగలుగుతాం. పారిశ్రామికుల ఆదాయాన్ని ఇతోధికంగా పెంచగలుగుతాం. ఈ సరుకుల ప్రపంచ వ్యాపిత ఎగుమతి వ్యాపారంలో మనదేశం కేవలం 2-3 శాతం ఉండగా ఏమీ లేని చైనా దేశం 17 శాతాన్ని అందుకోగలిగిందంటే ఈ పరిశ్రమలపై మన ప్రభుత్వాలకు గల అవగాహనా రాహిత్యం, బాధ్యతారాహిత్యం ప్రస్ఫుటంగా కనబడుతున్నది. భారతీయ అభివృద్ధి మార్గంలో ఇది రెండవది. ప్రభుత్వాలు ఈ ప్రాముఖ్యతను గుర్తించి అవసరమైన మార్పులను చేపట్టి వార్షిక బడ్జెట్‌ల నిధుల కేటాయింపులో గుణాత్మకమైన మార్పులు చేయడం ద్వారా మాత్రమే పై లక్ష్యం సాధ్యపడుతుంది. మొక్కుబడి కేటాయింపులు, వాగ్దానాలతో జరిగేది ఏమీ ఉండదు. ''సంక్షేమం'' సాధికారత స్థానాన్ని అలంకరించ జాలదు. అది ఒక సానుభూతి పూర్వక సహాయం మాత్రమే.

పైనుదహరించిన చిన్నతరహా, మధ్యతరహా కుటీర పరిశ్రమల ఈనాటి పరిస్థితి గురించి అనుభవజ్ఞులు అందించే సమాచారాన్ని అధ్యయనం చేయడం సందర్భోచితం. చారిత్రకంగా పై పరిశ్రమలు దేశ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తిగా కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నవి. కాలక్రమేణా అభివృద్ధి అంటే భారీ పరిశ్రమల అభివృద్ది అను

అపార్థం చోటు చేసుకున్నది. సామ్రాజ్యవాదం, విదేశీ బహుళ జాతి సంస్థల వారి అనుచరులు ఇదే ప్రచారం చేశారు. మన దేశ పాలకులు అర్ధ శతాబ్ది కాలం దీన్ని నమ్మినారు. ఇంకా నమ్ముతున్నారు. సంస్కరణల తర్వాత జాతీయ సగటు ఉత్పత్తిలో ఈ పరిశ్రమల ఉత్పత్తి వాటా 15-17 శాతంకు మాత్రమే పరిమితమైయున్నది. ఫలితంగా పారిశ్రామిక సరుకులు విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం, తత్ఫలితంగా కుటీర పరిశ్రమలు, పారిశ్రామికులు దెబ్బతినిపోవడం జరుగుచున్నది. ఈ పరిశ్రమలు ఆధునీకరణ నోచుకోలేక, ఆర్థిక స్తోమత కోల్పోయి, పారిశ్రామికుల నైపుణ్యత లోటు, సాంకేతిక బలహీనతల కారణంగా, ప్రపంచీకరణ నేపథ్యంలో పోటీలో నిలవలేకపోతున్నాయి. అందువల్ల పారిశ్రామీకీకరణ క్రమం పెరగడం లేదు కదా తగ్గిపోతున్నది. భారీ పారిశ్రామిక వర్గాలు కూడా తమ లాభాలను తిరిగి పరిశ్రమలలో పెట్టుబడులుగా వెచ్చించే బదులు ఆ వనరులను అధిక లాభాలు సమకూర్చగలిగే సేవా రంగాలలోకి మళ్లిస్తున్నారు. ప్రైవేటు పారిశ్రామిక రంగం ఆధునిక యుగంలో ఉపాధి అవకాశాలు కల్పించలేకపోతున్నవి. 1997లో ఉద్యోగ అవకాశాలు 8.98 లక్షలు ఉండగా 2003 నాటికి 7.9 కి తగ్గిపోయినది.. ఈ ప్రక్రియ మరింత పెరిగిపోతున్నది. కార్పోరేట్ సంస్థలు పరస్పర సమ్మిళితం లేక కొనుగోలు పద్ధతుల ద్వారా ఐక్యమవుతూ, ఉపాధిరహిత ఉత్పాదకత పెరుగుదల ప్రయత్నాలను బహు శ్రద్ధతో కొనసాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చిన్న తరహా, మధ్య తరహా కుటీర పరిశ్రమలను, హస్తకళలను పట్టించుకోకపోవడం కంటితుడుపు చర్యలకే పరిమితం కావడం ఉపాధి కల్పనకే ఒక గొప్ప సవాల్. మొత్తం పారిశ్రామిక రంగంలో " అసంఘటిత రంగం " అనబడే పై పరిశ్రమలు 99 శాతం ఉన్నవి. అందులో 86 శాతం పారిశ్రామికులున్నారు. ఇవి పట్టణాలలో, గ్రామాలలో కోకొల్లలుగానున్నవి. ఇవే మన స్వయం ఉపాధి కల్పన కేంద్రాలు, కుటుంబ పరిశ్రమ కేంద్రాలు. వీరంతా తమ శ్రమకి విలువ తగ్గడం, ఉత్పాదకత తగ్గడం, అటు సరుకుల డిమాండ్ కూడా తగ్గడం, నాణ్యతల లోపం ఫలితంగా ఉద్యోగ భద్రతా రాహిత్యం లాంటి తీవ్రమైన జబ్బులతో సతమవుతున్నారు. రక్షించే నాధుడు లేక "సంక్షేమం" పేరుతో సంతృప్తి చెందుతున్న వినాయకులను చూస్తూ బ్రతుకు భారం ఈడ్వలేక భాదాతప్త హృదయాలతో నిర్వీర్యులై పోతున్నారు. ఇటువంటి పరిశ్రమల గురించి తీవ్రమైన ఆత్మ విమర్శతో పరిస్థితిని సింహావలోకనం చేసుకోవడం అభ్యుదయ కాముకులైన సంస్కర్తల ప్రథమ కర్తవ్యం. ఈనాటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో కోకొల్లలుగా లభ్యమతువున్న ఆర్థిక వనరుల ద్వారా "అసంఘటితం" అను అర్థరహిత పేరును మార్చివేసి సాంస్కృతిక సృజనాత్మక పరిశ్రమలుగా పేరు పెట్టి వాటిని పునరుజ్జీవనం చేయడం దేశాభివృద్ధికి తిరిగి ప్రబల చోదక శక్తిగా స్థాన ప్రధానం చేయడం విజ్ఞుల తక్షణ రాజకీయ సామాజిక కర్తవ్యం.

# దేశాభివృద్ధికి వ్యవసాయం, చిన్నతరహా, మధ్యతరహా, కుటీర పరిశ్రమలు మరియు హస్తకళల పునరుజ్జీవన అవశ్యకత - 2

వెనుకబడిన తరగతి, దళితుల గురించి వారి ఆర్థిక, సామాజిక పురోభివృద్ధి సమస్యపై సుదీర్ఘంగా చర్చించి వారి వెనుకబాటుతనాన్ని శాశ్వతంగా తొలగిస్తూ రాజకీయ నిర్ణయాలను చేయడం అత్యవసరం. ఈనాటి రాష్ట్ర జనాభా లెక్కల అంచనా ప్రకారం వెనుకబడిన తరగతుల వారి సంఖ్య జనాభాలో 52 శాతం ఉన్నట్లు ఆయా సంఘాలు ప్రకటిస్తున్నప్పటికి ప్రభుత్వంచే బహుళార్థ ప్రయోజనం కొరకు ఇంటింటికి చేయబడిన సర్వే ప్రకారం వెనుకబడిన తరగతులు రాష్ట్ర జనాభాలో 48 శాతం ఉంటారు. ఈ వర్గాలు, మొత్తం జనాభాలో 44 శాతం దారిద్ర్యరేఖకు దిగువగా నుంటారని తేల్చి చెప్పడం గమనార్హం. 4 నుండి 5 శాతం మాత్రమే ఆస్థి పాస్తులు కలిగి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు రుజువు అవుతున్నది.

మరింత వివరంగా పరిశీలించడం ఉపయోగకరం. 93 కులాలలో అత్యధిక కులాలు నిరుపేదలే కాక సంఖ్యాబలంలో చాలా తక్కువగానున్నారు. 10-15 కులాలు గణనీయమైన సంఖ్యా బలం కలిగి సామాజిక ఆర్థిక జీవితంలో ప్రముఖ పాత్రను పోషిస్తున్నారు. వారి సంఖ్యా బలాన్ని ఉజ్జాయింపుగా గుర్తించడం మన చర్చకు ఉపయోగకరం. యాదవులు, కురములు 80 లక్షలు ఉంటారు. గీత పారిశ్రామికులు 48 లక్షలు ఉంటారు. చేనేత వృత్తిపై ఆధారపడేవారు 40 లక్షలకు తగ్గరు. మత్స్యకారుల బలం 32 లక్షలు. ముదిరాజ్ కులం వారు 24 లక్షలు, రజకుల సంఖ్య తక్కువేమీ లేదు. అది 24 లక్షలు. అలాగే మున్నూరు కాపులు 24 లక్షలు, వడ్డెరలు కూడా 24 లక్షలు, తూర్పు కాపులు 16 లక్షలు, కొప్పల వెలమలు 16 లక్షలు, సంఖ్యా బలంలో అధికంగానున్న పైనుదహరించిన 10 కులాల జనాభా దాదాపు 3 కోట్ల 30 లక్షలు, తతిమ్మ కులాలన్ని దాదాపు 70 లక్షలు. మొత్తంగా దరిదాపుగా 4 కోట్లు తప్పకుండా ఉంటారు. ఇందులో సుమారు 3 కోట్ల 50 లక్షల మంది దారిద్ర్య రేఖకు దిగువుగా నుంటారు. పేదరికం గూడు కట్టుకుని ఉన్న ఇంత పెద్ద జనాభా కలిగిన శ్రమైక జీవులుగా చేతివృత్తులు నిర్వహించే వారుగానున్న వారి సంక్షేమం మరియు వారి శాశ్వత స్వయం ఉపాధి కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా పద్దు క్రింద వెచ్చిస్తున్న మొత్తం అతి స్వల్పం. ఉదాహరణకు 2006-07 బడ్జెట్‌లో వెనుకబడిన తరగతులకై

రూ.533 కోట్లు కేటాయించడం జరిగింది. ఇందులో సింహ భాగం విద్యార్థుల స్కాలర్‌షిప్, హాస్టళ్ళ నిర్వహణపై వెచ్చించడం జరుగుతున్నది. వారి శాశ్వతాభివృద్ధి, ఉపాధికల్పనపై లాంఛన ప్రాయంగా మాత్రమే వెచ్చిస్తున్నారు. బిసి కార్పోరేషన్ ఈ దిశలో నామమాత్రపు చర్యలు చేపట్టడానికి ఆర్థిక వనరులు లేకపోవడం యాధృచ్ఛికం కాదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ వర్గాలకు సాధికారతను సంతరింపజేసి వారి సహజ సిద్ధ వృత్తులను పునరుజ్జీవనం చేయడానికి మాటలు కోటలు దాటినా ఆచరణలో కాలు గడప దాటడం లేదు. ప్రభుత్వాల అవగాహన, అలనాటి సామ్రాజ్యవాద ఫ్యూడల్, భూస్వామ్య యుగాల అవగాహనను  మరిపించడం లేదు. సరికదా కొనసాగింపు జరుగుచున్నది.

జనాభాలో 18-20 శాతం వరకు సుమారు కోటిన్నరగా ఉన్న దళిత వర్గాల ప్రజల జీవన పరిస్థితుల్లో మౌలికమైన మార్పులు కనపడటం లేదు. అందులో కూడా పేదరికంలోనున్న వారు 95 శాతానికి ఏ మాత్రం తగ్గరు. వీరి సంక్షేమం, శాశ్వత అభివృద్ధి పద్దులపై రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు కనబడటానికి వెనుకబడిన తరగతుల కేటాయింపు కంటే అధికంగా నున్నప్పటికి ఆచరణలో ఇంత పెద్ద జనాభాకు ఆర్థిక, సామాజిక భద్రతను కల్పించడంలో, స్వయం ఉపాధి సమకూర్చడంలో పై కేటాయింపులు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. విద్యా, వైద్యం, గృహనిర్మాణం, హాస్టల్ సౌకర్యాల లాంటి సంక్షేమ కార్యక్రమాలతోనే సరిపోతోంది. వ్యవసాయ భూముల పంపకం, కనీస వేతనాల గ్యారంటీ ఇవ్వడం, కుటీర పరిశ్రమలు స్థాపించడం లాంటి శాశ్వత చర్యలపై నిధుల కొరత సమస్యగానున్నది.

పైనుదహరించబడిన వెనుకబడిన తరగతులు, దళితులు మాత్రమే కాక అగ్రవర్ణాలు అనబడే కులాలలో కూడా 20-25 శాతానికి తగ్గకుండా పేదరికంలో నుంటూ బ్రతుకు భారాన్ని ఈడ్వలేని పరిస్థితిలోనున్న వారి సంఖ్య దాదాపు 50-60 లక్షలుగా నుంటారు. వీరు సన్నకారు, చిన్నకారు రైతులుగానో, మధ్యతరగతిగానో ఉన్నారు.

మన రాష్ట్ర జనాభా యొక్క పేదరికం గురించి స్థూలంగా ఒక అవగాహనకు రావడం జరిగింది. పేదరికం నిర్థారణకు ప్రమాణం ఎలా ఉండాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంకు తదితర ఉన్నత స్థాయిలలో నోబెల్ బహుమాన గ్రహీత శ్రీ అమర్త్యసేన్‌లతో పాటు నిష్ణాతులు, మానవతావాదులు బాధ్యతగా చర్చించారు. ఈనాటి నాగరికతా ప్రపంచంలో, ప్రపంచీకరణ నేపథ్యంలో పేదరికాన్ని దేశ తలసరి ఆదాయ ప్రమాణం కొలమానంతో నిర్థారించడం పూర్తిగా అశాస్త్రీయమని తేల్చి చెప్పారు. అంతేకాదు రోజుకు ఒక డాలర్‌కు మించని ఆదాయం కలవారిని దారిద్ర్యరేఖకు దిగువగా నున్నట్లు ప్రపంచ బ్యాంకు చెప్పడం కేవలం అర్థరహితమని దానిని రెండు డాలర్లకు ప్రమాణీకరించాలని సవరించడం కూడా అశాస్త్రీయమని ఉద్ఘాటించడం జరిగింది. ఒక కుటుంబం సొంత ఇల్లు, వాకిలీ కలిగి కనీస పౌష్టికాహారంతో సహా విద్యా, వైద్య,

రవాణా సౌకర్యాలను సరసమైన ధరలకు పొందుతూ అప్పులులేక నాగరికతా ప్రపంచంలో తల ఎత్తుకు తిరగగలిగే పరిస్థితిని ఒక ప్రమాణం, కొలమానంగా గుర్తించాలని స్పష్టం చేశారు. ఆ కుటుంబ ఆదాయం పై ప్రమాణానికి సరిపడని సందర్భాలన్నింటిని పేదరిక లక్షణాలుగా అంగీకరించాలని చెప్పారు. పై లోటును తొలగిస్తూ జీవిత ప్రమాణాన్ని కాపాడుకుంటూ దిన దిన ప్రవర్ధమానం చెందగలిగే పరిస్థితిని మానవాభ్యుదయంగా గుర్తించాలని ఇదే అభ్యుదయ రేఖగా గమనించాలని పదే పదే ప్రకటించడం జరుగుచున్నది. ఇటువంటి వినూత్న మానవాభివృద్ధి అవగాహనను పైన ఉదహరించిన మన రాష్ట్రంలోని పేదరికానికి అన్వయించడం మన విద్యుక్త ధర్మం. అలా జరిగినప్పుడు మన రాష్ట్రంలో పైనుదహరించిన సుమారు 65 శాతం ప్రజలు పేదలే. అందులో సగానికి తగ్గకుండా అంటే 33% నిరుపేదలు. డాలర్ భాషలో దరిదాపు ఒక డాలర్ ఆదాయం కలిగిన వారు.

పేదరిక నిర్మూలన కేవలం సంక్షేమ చర్యలు అనగా విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, భోజన సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, సబ్సిడీలు, ఎక్స్‌గ్రేషియాలు, ఆపద్భంధు సహాయాలు, రుణమాఫీలు లేక వడ్డీ మాఫీలు లాంటి చర్యల వల్లనే సాధ్యపడదని 60 సంవత్సరాల స్వాతంత్ర్యానంతర అనుభవాలు రుజువు చేస్తున్నవి. సంక్షేమం ఒక సహాయం, ఉపశమనం తోడ్పాటు మాత్రమే. స్వావలంబన, స్వయం ఉపాధికల్పనలకు, ఒక మాటలో చెప్పాలంటే ఆర్థిక స్వతంత్రమునకు ప్రత్యామ్నాయం కాదు. సంక్షేమ విధానాలు అందుకు కేటాయింపులు ఆర్థికంగా అట్టడుగునుండి అభివృద్ధి పథంలోకి రావడానికి అత్యవసరం. వాటి కొరకు రాష్ట్ర బడ్జెట్‌లో సముచిత కేటాయింపులు చేయడం ఏ మాత్రం విస్మరించడానికి వీలులేని అంశం.

సంక్షేమం కంటే స్వావలంబన, స్వయం ఉపాధి కల్పన అంశాలపై బడ్జెట్ కేటాయింపులు కొన్ని రెట్లు, కనీసం 8 - 10 రెట్లుగా కేటాయించబడడం, ఆర్థిక స్వాతంత్ర్య సాధన, నిజమైన సాధికారత, సమపార్జన కొరకు అవసరం. అంకెలలో చెప్పాలంటే మన రాష్ట్రంలోనే పైన ఉదహరించిన ఆర్థిక, సామాజిక బలహీన వర్గాల సంక్షేమం కొరకు మొత్తముగా ఒక బడ్జెట్‌లో సుమారు 2 వేల కోట్లు కేటాయిస్తే ఆ వర్గాల స్వయం ఉపాధి, స్వావలంబన కొరకు కనీసం రూ. 15-16 వేల కోట్లు కేటాయించడం రాష్ట్ర మానవాభివృద్ధికి, సగటు అభివృద్ధికి అనివార్యం. ఈ దార్శనికత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవడం దురదృష్టం. ప్రజాస్వామ్యాన్ని, అధికార యంత్రాల ఎన్నికలకు పరిమితం చేయడం నిజమైన ఆర్థిక ప్రజాస్వామాన్ని విస్మరించడం దాని స్థానే అరకొర సంక్షేమ కార్యక్రమాలను గొప్ప చర్యలుగా చెప్పుకోవడం రాజకీయ అవగాహన దారిద్ర్యానికి ప్రబల నిదర్శనం.

ఆర్థిక వనరులు, బడ్జెట్ ఆదాయాలు, దేశ విదేశీ రుణ సౌకర్యాలు ఇతోధికంగా

పెరుగుతున్న ఈ కాలంలోనైనా ప్రజల పేదరికాన్ని శాశ్వతంగా తొలగించగలిగితే ఉత్పత్తి సాధనాలను సమకూర్చుకోవడం అందుకు 11-12వ పంచవర్ష ప్రణాళికలలో పెద్దగా కేటాయింపులు చేయడం తక్షణ రాజకీయ కర్తవ్యం. రాష్ట్ర జనాభాలో 10 శాతంగా నున్న యాదవులు, కురములు తమ వృత్తిపరమైన సంపదను అనగా గొర్రెల, మేకల పెంపకాన్ని వాటి సంరక్షణ సదుపాయాలని, వ్యాపారాన్ని సంబంధిత కుటీర పరిశ్రమల్ని రెండు రెట్లయినా పెంచుకోగలుగుతారు. తమ విద్య, వైద్య నాణ్యత గల సౌకర్యాలపై తమ స్వంత ఖర్చులు వెచ్చింగలుగుతారు. అనతి కాలంలో మూగ జీవులుగా కాక విద్యా బుద్ధలు కలిగిన పౌరులుగా తమ వృత్తిని ఆధునికీకరించుకోగలుగుతారు. సుఖ సౌఖ్యాలు పంచుకోగలుగుతారు.

5-6 శాతం జనాభా కలిగిన గీత పారిశ్రామికుల తక్షణ సంక్షేమం వారి వృత్తిపై విధించబడుతున్న త్రివిధ పన్నులను ఉపసంహరించుకోవడం అలాగే ప్రతి గ్రామంలో కల్లు గీత చెట్ల పెంపకం సౌకర్యాల కొరకు అవసరమైన భూములను కేటాయిస్తూ వనాలను పెంచుకోవడానికి చౌక వడ్డీపై సూక్ష్మ స్థాయి రుణ సౌకర్యాలు కల్పించడం వారి స్వావలంబనకు పెద్దగా తోడ్పడుతుంది. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిశోధనల సహాయంతో ఇతోధికంగా ఉత్పత్తిలోకి తేబడిన కల్లు ద్వారా బెల్లాన్ని తదితర ఆరోగ్యకర పానీయాలు తయారు చేసుకోవడం కుటీర పరిశ్రమని స్వయం ఉపాధి రంగంగా 2020 నాటికి తీర్చిదిద్దుకోవడం సాధించదగ్గ లక్ష్యం. ఫలితంగా ఈ వర్గంలోనున్న అజ్ఞానాంధకారాన్ని, అవిద్యను నిర్మూలించగలుగుతాం.

జనాభాలో సుమారు 4.8 శాతంగానున్న సుమారు 40 లక్షల చేనేత పారిశ్రామికులు, పద్మశాలి తదితర కులాలుగానున్నాయి. వ్యవసాయం తరువాత సంపద సృష్టిలో రెండవ స్థానాన్ని అలంకరిస్తున్నది. ఈ రంగానికి సుదీర్ఘమైన సామాజిక, సాంస్కృతిక చరిత్ర ఉన్నది. గుడ్డలు నేయడం, అత్యంత నాణ్యత గలిగిన దుస్తులు తయారు చేయడం, దేశ విదేశాలలో ప్రఖ్యాతి పొందిన రంగు రంగుల వస్త్రాలు తయారు చేయడం వీరి సొంతం. తమ దేశ ఔళి పరిశ్రమల వ్యాప్తికి, లాభాలకు పాటుపడిన బ్రిటీష్ సామ్రాజ్యవాదం మన దేశీయ వస్త్ర పరిశ్రమను అష్టకష్టాల పాలు చేసింది. ప్రజలు గత్యంతరం లేక విదేశీ వస్త్రాలను కొనుగోలు చేసే విధంగా స్వదేశీ స్వావలంబన విధానాలను నాశనం చేసింది. ఈనాటి ప్రపంచీకరణ మరియు ప్రపంచ వాణిజ్య వ్యాపార సంస్థ చేసిన నిర్ణయాల వెలుతురులో మన దేశ వస్త్ర పరిశ్రమకు అపూర్వమైన అవకాశాలు అందివస్తున్నవి. ఎగుమతి, దిగుమతి సుంకాల సరళీకరణ సబ్సిడీల సడలింపు ఫలితంగా ముఖ్యంగా గత సంవత్సరం నుండి మన అవకాశాలు బాగా పెరిగినవి. ఈ వృత్తిపై ఆధారపడుతున్న పై కులాల వారికే పరిమితం కాకుండా ఇతర కులాలకు సంబంధించిన పారిశ్రామికులను ఇందులోకి ఆకర్షించే సదవకాశాలు కలిగినవి.

చేనేత మరియు పవర్‌లూం రంగాలకు కేటాయించిన వస్త్రాల సూత్రాన్ని ఖచ్చితంగా పాటిస్తూనే మన వస్త్ర పరిశ్రమను దేశ, విదేశీ మార్కెట్‌లలో లాభసాటిగా అమ్ముకోగలుగుతాం. అయితే ప్రపంచ వ్యాపితంగా అనాధిగా పైచేయి చేసుకున్న మిల్లు గుడ్డలతో పోటీ పడాలంటే మన దేశ చేనేత మరియు పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రత్యేక రాయితీలను ఇవ్వడం చాలా అవసరం. చేనేత వస్త్రాలు తమ ప్రత్యేక నాణ్యత కారణంగా దేశ విదేశాలలో మంచి ఆకర్షణ కలిగి ఉన్నవి. అటువంటి నాణ్యతకు కొరత ఏర్పడకుండా ప్రత్యేక శిక్షణ నిర్వహించడం ఈ రంగం యొక్క ప్రత్యేక బాధ్యత. చేనేత పారిశ్రామికులు ప్రభుత్వాల నిర్లక్ష్యం, సహకార సంఘాల పేరుతో తోటి సోదరులు చేస్తున్న మోసాల ఫలితంగా, అటు వేరే వృత్తివ్యాపారంలో నిలదొక్కుకునే శక్తి లేక అత్యంత దయనీయమైన ఆర్థిక పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు ఆత్మహత్యలకు తెగిస్తున్నారు. అయితే దీనికి కారణం పరిశ్రమ కుటీర పరిశ్రమ కావడం కానేకాదు. కుటీర పరిశ్రమకు తగిన రాయితీలు ఇవ్వలేకపోవడం, ఇచ్చిన వాటిని లబ్దిదారులకు అందజేయలేకపోవడం అధికార, అనధికార వర్గాలు స్వార్థానికి తెగించడం మూలకారణం. పరిపాలన సంస్కరణలు, సహకార ఉద్యమ సంస్కరణలు పై అరిష్టాలను తొలగించగలుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం పై బహుముఖ సమస్యల పరిష్కారానికి నిధులను పెంచి ఈ వృత్తిని రక్షిస్తూ అనతికాలంలోనే అది తమ సొంత కాళ్ళపై నిలబడి పోటీని తట్టుకునే స్థితిలోకి ఎదగడం సుసాధ్యమవుతుంది.

వివిధ ఉప కులాల పేర్లు కలిగినటువంటి ముదిరాజ్ కులం బహుబాధ్యతలను నిర్వహించే ఒక సామాజిక శక్తి. జనాభాలో 3%గా నుంటూ సుమారు 24 లక్షలకు తగ్గకుండా జనాభా కలిగిన ఈ సామాజిక వర్గం చరిత్రలో ప్రధానంగా ఫలవృక్షాలు పెంచుకుని, పండ్లు ఫలాలను అమ్ముకోవడం ముఖ్యవృత్తిగా అవతరించింది. ఇటువంటి చక్కని వృత్తి వారిలో సాద్వికత, స్నేహం లాంటి సద్గుణాలను సమకూర్చింది. భూస్వామ్య యుగంలో బానిసత్వ బంధనాలతో తమ స్వతంత్ర్య కుల ధర్మాలను కోల్పోయిన ఈ వర్గం అనేక ఇతర వృత్తులను నిర్వహిస్తూ తమ ఉనికిని కాపాడుకున్నారు. ఈనాటి స్వాతంత్ర్య స్వావలంబన ఆలోచన నేపథ్యంలో ఫల వృక్షాల పెంపకం, ఫలాల అమ్మకం, ఫల ఉత్పత్తులను శీతల కేంద్రాలలో భద్రపరచడం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో వనసంరక్షణ కార్యక్రమాలను నిర్వహించడం చాలా గొప్ప అవసరం. న్యాయంగా ఈ వర్గాల జనాభా అందుకు సరిపోదు. ఒకవైపు ఉన్నత, అత్యున్నత విద్యా విజ్ఞానాల సముపార్జన చేసి సామాజిక రంగాలు అన్నింటిలో తమ పదవులను నిర్వహిస్తూనే మిగిలిన స్త్రీ, పురుషులు తమ శాస్త్ర సాంకేతిక నైపుణ్యతను తమ శ్రమ శక్తితో మేళవించి ఫల సంపదను దేశ విదేశాలకు చక్కగా ఎగుమతి చేసి గణనీయమైన లాభాలు గడించగలుగుతారు. 2020 నాటికి ఈ కల సాకారం చేసుకోవడం అందుకు అవసరమైన పెద్ద మొత్తాలను బడ్జెట్‌లలో కేటాయించడం పాలకులైన వారి కనీస

కర్తవ్యం. భూములు పూర్తిగా కోల్పోయిన వీరికి ప్రతి గ్రామంలో కనీసం 10 ఎకరాల సారవంతమైన భూమిను కొనుగోలు చేసి ఇవ్వడం, ఆ భూమిపై పండ్ల తోటలు పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను వారే సమకూర్చుకునే విధంగా వారి సహకార సంఘాలకు చౌకగా సూక్ష్మ స్థాయి రుణాలు అందచేయడం దేశభక్తియుత కర్తవ్యం. ఇదే ఒక పరిశ్రమగా భావించవచ్చు. దీనినే లాభసాటి వ్యవసాయంగా గుర్తించవచ్చు. పర్యావరణ పరిరక్షణలో సమాజం తరపున నిర్వహించబడే ఒక యజ్ఞంగా సంతృప్తిపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశలో మరింత పరిశోధన జరిపి నిధులను కేటాయించడం తక్షణ బాధ్యత.

మత్స్య పరిశ్రమ నిర్వహించేవారు మన రాష్ట్రంలో కనీసం 32 లక్షలు వున్నారు. సుమారు 800 కి.మీ. తీరప్రాంతంలో నివసించే లక్షలాది మత్స్యకారులు సముద్రంపై ఆధారపడగా మరికొన్ని లక్షలమంది మెట్ట ప్రాంతాలలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలపై ఆధారపడి తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. సమాజానికి దూరంగా ఉంటూ సాహసోపేతమైన తమ వృత్తి ధర్మంలో నిమగ్నమైన ఈ వర్గం వారు విద్య విషయంగా సామాజిక ఆర్థికపరంగా కూడా చాలా వెనుకబడి వుండడం గమనార్హం. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరికరాల ఉపయోగంలో, మెళకువతో వాటిని ఉపయోగించడం ద్వారా మత్స్య సంపదను ఇతోధికంగా పెంచుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. విద్యా విజ్ఞాన ద్వారాలను ఏమాత్రం మూసిపెట్టకుండా వృత్తిని సంపూర్ణంగా ఆధునికీకరించడం అవసరం. ఇతర చేతివృత్తులలాగే ఈ రంగంపై కూడా ఆ వృత్తిపై ఆధారపడే ప్రజల జీవితాలను బాగుపరచే లక్ష్యంతో ప్రభుత్వం బడ్జెట్‌లలో సమతూకంగా నిధులు కేటాయించాలి. సంక్షేమ నిధులే కాక వృత్తి స్వతంత్రతను సాధించిపెట్టే అవసరానికి తగిన నిధులను అందచేయాలి. అప్పుడే లక్షలాది మత్స్యకారులు సాధికారులై ఆర్థిక స్వతంత్రాన్ని అనుభవిస్తూ తమ సంపదను దేశానికి అందించగలుగుతారు. ఈ పరిశ్రమ స్వభావం మార్కెట్ సౌకర్యం ఉత్పత్తుల డిమాండ్ వెలుతురులో పై లక్ష్యసాధన రానున్న 2020 నాటికి అసాధ్యం ఏమాత్రం కాకూడదు. చిత్తశుద్ధి, సంకల్పబలం కలిగిన ప్రజాహిత ప్రభుత్వం దీనిని సాధించగలుగుతుంది. సగటు జాతీయ ఉత్పత్తినే పెంచుకోగలుగుతుంది.

ఇదే విధంగా చారిత్రక, సాంస్కృతిక, సాంప్రదాయ వృత్తులపై ఆధారపడి తమ బ్రతుకులే కాకుండా తమ సమాజానికి గణనీయమైన సేవలను అందచేస్తున్న ఇతర కులాలను పైన పేర్కొన్న వీరంతా తమ సంఖ్యాబలానికి తీసిపోకుండా సంఘానికి వివిధ రూపాలలో సంపదను సమకూర్చుచున్నారు. అయితే ఈ చేతివృత్తులు కుల వృత్తుల అభివృద్ధికి ఒక అవరోధంగా నిలిచియున్న అంశం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ వృత్తుల ప్రాధాన్యతను గుర్తించకపోవడమే. గడచిన అర్థ శతాబ్ది సుదీర్ఘ కాలంలో 10

పంచవర్ష ప్రణాళికలు పూర్తికాబడిన ఈ దశలో ఈ రంగాల పునరుజ్జీవనకు కేటాయించబడిన మొత్తాలు అతి స్వల్పం. మొత్తం జనాభాలో వారి వారి దామాషాను చూచినా, వారి పేదరికాన్ని ఎన్ని ప్రమాణాలతో కొలిచినా, సాంఘిక న్యాయ సిద్ధాంతాన్ని అనుసరించినా ప్రభుత్వాలు తమతమ బడ్జెట్‌లలో చేసిన కేటాయింపులు అత్యంత స్వల్పం. ఈ పరిస్థితిని మౌళికంగా సంస్కరించి కేటాయింపులను ఇతోధికంగా పెంచడం వారిని సాధికారులు చేయడానికి అత్యవసరం.

గత అర్ధశతాబ్ది సుదీర్ఘ ప్రయాణంలో పాలకవర్గాలు తమ ఆర్థిక, సామాజిక విధానాలను ఒక శాస్త్రీయ మానవీయ దృక్పథంతో చేయలేదు. మొదటి 3-4 దశాబ్దాల సోషలిస్ట్ దేశాల విధానాల అనుకరణతో సరిపోయింది. సగటు జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటు3-4%నకు మించకుండా నిలిచిపోయింది. 1990 దశకం నుండి ప్రారంభించబడిన సరళీకృత ఆర్థిక విధానాలు, సంస్కరణలు, దేశ విదేశీ పెట్టుబడులను మాత్రమే ప్రోత్సహించి జాతీయ సంపదను పెంచుకునే ప్రపంచబ్యాంకు సలహాలపై ఆలోచనలు కేంద్రీకరించబడినవి. ఫలితంగా సంపద పెరుగుదలలో, సగటు జాతీయ ఉత్పత్తి పెరుగుదలలో 8%నికి చేరుకోవడం సంతృప్తిని కలిగించక మానదు. అయితే ఇది ఏకపక్షంగా జరిగింది. పైనుదహరించిన అత్యధిక జనాభా నిజజీవితంలో ఈ సంపద ఫలితాలు ప్రతిబింబించడం లేదు. ధనికులు మరింత ధనికులు కావడం, ధనికులు పేదల మధ్య వ్యత్యాసం పెరుగుతూ పోవడం, అలాగే అభివృద్ధి చెందిన వెనుకబడిన ప్రాంతాల మధ్య తేడాలు తగ్గకపోవడం కొట్టవచ్చినట్లు కనబడుతున్న పరిణామం. దేశంలో కొందరు కుబేరులు ప్రపంచంలో ఉన్నత స్థానాలను అలంకరించినారని చెప్పుకోవడం, స్వదేశంలో కూడా ధనాఢ్య వర్గాల ఆస్తిపాస్తులు ఆకాశాన్ని అంటుకుంటున్నాయని మురిసిపోవడం ఈ విధంగా దేశం "వెలిగిపోతున్నదని" ప్రగల్భాలు పలకడం కేవలం పేదలను వారి పేదరికాన్ని పరిహసించడం మాత్రమే. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేదలచే సృష్టించబడిన వేలాదికోట్ల విలువైన పెట్టుబడులను ధనాఢ్య వర్గాలకు అనేక పేర్లతో వివిధ రూపాలలో ఉద్దేశపూర్వకంగానే అందచేయడం వలన ఆ వర్గాలు వెలిగిపోతున్నవి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రతి సం॥ 'సబ్సిడీల' పేరిట వెచ్చిస్తున్న సుమారు 5 లక్షల కోట్ల ధనంలో 3 లక్షల కోట్లకు తగ్గకుండా ధనవంతులకు వారి ఎగుమతి, దిగుమతి వ్యాపారాలను రక్షించడానికి, వారు పొందిన నష్టాలను పూడ్చడానికి తదితర అవసరాలకు కేటాయించడం జరుగుతుంది. మిగిలిన 2 లక్షల కోట్ల సబ్సిడీలు నూటికి 60-70 శాతంగానున్న పేద, మధ్యతరగతి వర్గాలకు అందచేయడం జరుగుతుంది. దీనినే సామాజిక న్యాయం కొరవడిన ఏకపక్ష అభివృద్ధి అంటాం. పేదల జీవితంలో అభ్యుదయంగా కనబడలేని అభివృద్ధి అంటాం. ఆర్థిక దృక్పథంలో మౌళిక మార్పులను చేసి వెనుకబడిన వర్గాల వారి సంఖ్యాబలాన్ని

ఆధారంగా చేస్తూ సామాజిక న్యాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని రానున్న దశాబ్ధంలోనైనా సమాజంలోని పేదరికాన్ని తొలగించడం పౌర సమాజ కర్తవ్యం.

దళితవర్గాల సామాజిక, ఆర్థిక దుస్థితి ముంజేతి కంకణంలాగా నున్నది. సుమారు 20% జనాభా కలిగి పైనుదహరించిన వెనుకబడిన వర్గాల కంటే కూడా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడియున్నారు. ఇంకా అనేక ప్రాంతాలలో అంటరానితనం, దేవాలయ ప్రవేశ నిరాకరణ అమలు జరుగుతుందంటే సభ్య సమాజం తలదించుకోక తప్పదు. అర్థశతాబ్ది స్వతంత్రానంతరం దళితులు ఇంతటి దౌర్భాగ్య పరిస్థితులలో నుండడానికి మూలకారణం వారికి ఆర్థిక, సామాజిక సాధికారత అందించలేకపోవడమే. వారికి ప్రత్యేకమైన ఉత్పత్తి సాధనాలు, భూమి తదితర ఉపకరణాలను సమకూర్చలేక పోవడమే. పంపకం చేయబడిన బంజరు భూములు కూడా తగిన అభివృద్ధి సౌకర్యాలు లేనందున నిస్సారమై నిష్ప్రయోజనమవుతున్నాయి. దళిత వర్గాలు నిర్వహించే వ్యవసాయం, వ్యవసాయ కూలీ, చర్మ పరిశ్రమలాంటి ఉపాధికల్పన రంగాలపై నిధులను ఇతోధికంగా కేటాయించి వారిని తమ సొంత కాళ్ళపై నిలబడి పెరిగిన ఉత్పాదకత ఆధారంగా దేశ సంపదను పెంచే దిశలో తోడ్పాటును అందించడం సంక్షేమ ప్రభుత్వం యొక్క తక్షణ కర్తవ్యం. ఈ దిశలో ఇటీవలి కాలంలో కేటాయించబడిన బడ్జెట్‌లు ఏమాత్రం సరిపోవడంలేదు. విద్య, ఆశ్రమ పాఠశాలలు, వైద్యం, గృహవసతి రంగాలలో ప్రత్యేకంగా కేటాయింపులను పెంచి దళిత వర్గాలను సమకాలీన నాగరికత ప్రపంచంలోకి వేగవంతంగా ఆకర్షించడం తక్షణ సామాజిక కర్తవ్యం. కేటాయింపులు విద్య, వైద్యరంగాలకే పరిమితం కాకుండా వారికి స్వయం ఉపాధి అవకాశాలు సమకూర్చే దిశలో నుండడం విస్మరించరాని బాధ్యత. అదే దేశాభివృద్ధికి, దారిద్ర్య నిర్మూలనకు, సంపద పెరుగుదలకు గీటురాయి.

# చేతి వృత్తులు - కుటీర పరిశ్రమలు - రాజకీయ పరిష్కారం

పారిశ్రామికీకరణ, బహుళజాతి సంస్థల ఆవిర్భావం, ఉత్పత్తులు, మార్కెట్ల విస్తరణ ఫలితంగా చేతివృత్తులు కుటీర పరిశ్రమలలో తయారుచేయబడే అనేకానేక సరుకులకు అనూహ్యమైన పోటీ ఎదురౌచున్నది. మానవుడు సమిష్టిగా, సంఘటితంగా, క్రమబద్ధంగా యంత్రాలతో పనిచేయడం పరిశ్రమల లక్షణం. ఇందులో యంత్రం మానవునిని నియంత్రిస్తుంది. పెట్టుబడి మానవశ్రమను నిర్ధారిస్తుంది. తద్విరుద్ధంగా చేతివృత్తులు కుటీర పరిశ్రమలలో యంత్రం మానవున్ని, మానవశ్రమను నియంత్రించదు. మానవుడు తన శ్రమకు అనుబంధంగా యంత్రాన్ని నడిపిస్తారు. ఇవి విడివిడిగా వికేంద్రకృతమై పారిశ్రామికుల ఆధీనంలో నుంటాయి. పారిశ్రామికీకరణ కంటే ముందు చేతివృత్తులు, కుటీర పరిశ్రమలే ఉత్పత్తిని, ఉత్పత్తి సంబంధాలని, గ్రామీణ జీవితాన్ని ప్రభావితం చేసినాయి. సమాచార విప్లవం శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వ్యాపించిన యుగంలో అభివృద్ధి చెందుచున్న దేశాలన్నింటిలో చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు ఆర్ధిక, వాణిజ్య రంగాలలో తమ అధిపత్యాన్ని, ప్రాబల్యాన్ని చివరకు వునికిని కూడా కోల్పోతున్న పరిణామాలు చూస్తున్నాం. దేశంలో, రాష్ట్రంలో కూడా వ్యవసాయం తర్వాత ఉపాధి కల్పనా రంగంలో అత్యంత ప్రధానంగా నున్న రంగం గురించి దాని రక్షణ పరివర్తన గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా చిత్తశుద్ధితో ఆలోచించకపోవడం దాని దారిన అదే పోయే విధంగా చూస్తూ కూర్చోవడం అత్యంత దారుణమైన విషయం. స్వావలంబన పేరిట ఇటువంటి పరిశ్రమలు ప్రాధాన్యత సంతరించుకున్నట్లు ప్రకటనలెన్ని చేసినా ఆచరణలో ఏమాత్రం సత్ఫలితాలను సాధించలేదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శాస్త్రీయ మానవాభివృద్ధి కలిగియుండి అర్ధం పర్ధం లేని సరళీకరణ, పారిశ్రామికీకరణ ప్రవాహంలో కొట్టుకుపోకుండా చేతివృత్తులు, కుటీర పరిశ్రమలను పరిరక్షించే విధంగా ఆలోచిస్తూ వాటి క్రమానుగత యాంత్రీకరణ మరియు పరివర్తన గురించి ప్రణాళికాబద్ధంగా ఆలోచించి విధానాలు రూపొందించి అమలు పరిచియుంటే పరిశ్రమలుకు ఇంతటి దుర్గతి పట్టియుండేది కాదు. ఇప్పటికే దేశ, విదేశ, మార్కెట్లలో ఈ సరుకులకు గిరాకీ ఇంతగా తగ్గియుండేది కాదు. మన దేశంలో గుడ్డలు మొదలుకుని నిత్యావసర సరుకులన్నింటిని 60 నుండి 70 శాతం

ప్రజలు స్వదేశీ ఉత్పత్తులను వాడుతున్నారు. ప్రపంచ వ్యాపితంగా విస్తృతంగా ఏర్పరుచున్న పర్యావరణ అనుకూల భావాల నేపథ్యంలో మన చేతి వృత్తులు, కుటీర పరిశ్రమలలో తయారు చేయబడిన అనేక సరుకుల ఎగుమతి అంత అసంతృప్తిగా లేదు. 2000-01లో 8,490.16 కోట్లగా నుంటే 2001-02 నాటికి 7,709.33, 2002-03 నాటికి 9,844.38 కోట్లు, 2003-04 నాటికి 10,465.14 కోట్లకి, 2004-05 నాటికి 13,032.70 కోట్లకి పెరిగింది. ఇంకా పెంచుకునే అవకాశాలు మెండుగా నున్నవి. ప్రపంచ వ్యాపితంగా సరుకుల ఎగుమతులలో ఇది కేవలం 2% మాత్రమే. చూస్తు వుండగానే మన తర్వాత మేల్కొన్న చైనా దేశం 17% ఎగుమతులు చేయడం గమనార్హం. ఈ ఎగుమతులలో చేనేత లేక టెక్స్‌టైల్ వస్త్రాలు లేవు, వాటికి మంచి విదేశీ మార్కెట్ వుండడం దాన్ని సొమ్ము చేసుకొవడం మన దేశ జౌళి పరిశ్రమకి, చేనేత పరిశ్రమకి గొప్ప అవకాశం. మన దేశంలో ఒక కోటికి మించి చేనేత పారిశ్రామికులున్నారు. అంతకు మించి చేతివృత్తులు పారిశ్రామికులున్నారు. వీరు రకరకాల వస్తువులు తయారు చేస్తూ తమనైపుణ్యత ఆధారంగా మార్కెట్లలో పోటీపడుతున్నారు. శతాబ్దాల స్తబ్ధత, కుల పడికట్లు తదితర అడ్డుగోడల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాలు దొరకక పరిమిత ఆర్థిక పరిధిలో సతమతమవుతున్నారు. బ్రతుకు భారం ఈడ్వలేక అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మన దేశంలోని వృత్తులు, సాంస్కృతిక ఉత్పత్తులు, కళలు, సామూహిక కుల వృత్తులుగా సాంప్రదాయ బద్ధమైన కార్యక్రమాలుగా మిగిలియున్నవి. పరస్పరం పోటీపడుతున్నవి. ఏది ఏమైన ముంచుకొస్తున్న యాంత్రీకరణ వస్తువాహనాల వినిమయ సంస్కృతిని తట్టుకోలేక మార్గాంతరం కొరకు ఆందోళన చెందుతున్నవి. చివరకు ఆధునిక నాగరికతా ప్రపంచంలో చేతివృత్తులలో చేయితో పనిచేయడం సామాజికంగా న్యూనతా భావాలకు కూడా గురికావలసి వస్తున్నది.

అలుపెరగని శారీరక శ్రమ, సృజానృకత కలిగిన దళిత వెనకబడిన తరగతుల ప్రజాశక్తి ధనిక దేశాలు ధనాఢ్య వర్గాల యాంత్రిక శక్తి ప్రాబల్యం క్రింద నలిగి నశించకముందే మానవీయ దృష్టి గలవారు మేల్కోనవలసి యున్నది. శ్రమకు నైపుణ్యతను జతపరిచే నాణ్యతగల విద్యను, విజ్ఞానాన్ని యుద్ధ ప్రాతిపదికపై వ్యాపించవలసియున్నది. పాశ్చాత్య పారిశ్రామిక నాగరికతా నిర్ధారించిన అభివృద్ధి మార్గాలను అత్యంత బాధ్యతతో విశ్లేషించవలసి యున్నది. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణలే దేశాభివృద్ధి మార్గానికి శరణ్యం, అను భావనను భారతీయ భౌతిక పరిస్థితులు ఇక్కడి జన బాహుళ్యం తమ జీవనాధారంగా ఆచరిస్తున్న శ్రమ సాంద్రత (Labour Intensive) నేపథ్యంలో విశ్లేషించడం తక్షణ కర్తవ్యం. సరుకుల ఉత్పత్తి, ఉత్పాదకతల పెరుగుదల మార్కెట్ వ్యవస్థలో ఏర్పడే పోటీకి అవసరమే, మార్కెట్ పోటిలో తట్టుకొని సంపదను పెంచుకోవడం దేశాభివృద్ధికి అవసరమే, అయితే దేశాభివృద్ధి దేశ మానవాభివృద్ధిగా గుర్తించినపుడు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు శ్రమ సాంద్రతకు

పెట్టుబడి సాంద్రత (Capital Intensive) ను అనుబంధంగా నియంత్రించక తప్పదు. ఆ మేరకు పెట్టుబడిని దాని స్వేచ్ఛకు క్రమబద్ధీకరించవలసిన అవసరం వున్నది. అభివృద్ధిని సర్వవ్యాపిత అభివృద్ధి (Inclusive growth ) గా తీర్చిదిద్ద వలసి యున్నది. పాక్షిక అభివృద్ధి (Exclusive growth ) వలన అత్యధిక జనభాకు దాపురించే పేదరికం, నిరుద్యోగం నుండి రక్షించుకోవలసియుంది. ఉత్పత్తి సాధనాల పెంపుదల, సంపద పెరుగుదల భౌతిక అభివృద్ధి అనిపించుకుంటే శ్రమ సాంద్రతల వృత్తులతో సతమతమవుతున్న కర్మవీరుల నిత్యజీవితంలో తొణకిసలాడు సంతృప్తి, సంతోషం, సర్వవ్యాపిత అభివృద్ధి అవుతుంది. లేనిచో Exclusive growth ఫలితంగా పేదలు నిరుపేదలుగా మారడం, ధనవంతులు కుబేరులుగా మారడం జరుగుతుంది. ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైపైన ఎన్ని మాటలు చెప్పినా అనుసరిస్తున్న విధానాలు ఇవే. కాబట్టి ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణ ఔషధాలను పై నుదహరించిన అభ్యుదాయానికి ఏమాత్రం ఆటంకం కలిగించకుండా పైగా తోడ్పడే విధంగా సిద్ధాంతాలను, విధానాలకు రూపకల్పన చేస్తూ ఆచరించవలసియుంటుంది. ఇదే ఒక ప్రత్నామ్యాయ ఆర్థిక విధానం. నిజమైన భారతీయ స్వదేశీ ఆర్థిక విధానం.

ఇటువంటి ప్రత్యామ్నాయం ఆర్థిక విధానం గురించి మన దేశంలోని వివిధ రాజకీయ పార్టీలకు విభిన్న అభిప్రాయాలు వుండడం ఒక వాస్తవం. కాంగ్రెస్ బి.జె.పి. లాంటి పార్టీలకు హిందూత్వం, కుహనా లౌకిక వాదం మినహాయిస్తే ఆర్థిక విధానాల పరంగా పెద్దగా చెప్పకోదగిన తేడా లేమి లేవు. యన్.డి.ఎ. ప్రభుత్వం తమ పరిపాలన ఫలితంగా దేశం వెలిగిపోయిపోయిందను కుంటే యు.పి.ఎ. ప్రభుత్వం తమ పరిపాలన ఫలితంగా దేశం మెరిసి పోతుందంటున్నది. ఆర్థిక విధానాలలో దొందూ దొందే. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణలను విశృంఖలంగా అమలు పరచడంలో ఆచరణలో వారి మధ్య తేడాలు లేవు. అతివాద పార్టీలు తమలో తరతమ తేడాలతో ప్రంపంచీకరణ, సరళీకరణ, ప్రయివేటీకరణల ప్రక్రియలను దాదాపు పూర్తిగా నకారాత్మకంగా చూస్తున్నవి. ఈనాటి ప్రపంచంలో ఉత్పత్తి సాధనాలను ఇనుమడించడానికి, ఉత్పాదకతను పెంచడానికి, ఉపాధి అవకాశాలను విస్తరించడానికి పై ప్రక్రియల ఆవశ్యకతను నిరాకరిస్తున్నవి. దేశ వెనక బాటు తనాన్ని త్వరత్వరగా తొలగించుకోవడానికి శ్రమ సాంద్రత గల చేతివృత్తులు, కుటీర పరిశ్రమలకు ప్రమాదకారి కాని విధంగా పైగా తోడ్పాటు నిచ్చేవిధంగా నియంత్రించడం, క్రమబద్ధీకరించడం యొక్క ఆవశ్యతను గుర్తించినట్లు కనబడటం లేదు.

ఈ తరుణంలో దేశం అనుసరించవలసిన ఆర్థిక విధానాల గురించి ఏర్పడియున్న కుడి, ఎడమల పోకడలను సంస్కరించుకోవడం, తదితరుల లో నున్న అవగాహన రాహిత్యాన్ని తొలగించుకోవడం దేశానికి అభ్యుదయ ఆర్థిక విధానానికి రూపకల్పన

చేయడం మద్యేమార్గన్ని అనుసరిస్తున్న పార్టీలు, శక్తులు, వ్యక్తుల తక్షణ కర్తవ్యం. స్వతంత్రం వచ్చి 60 సం॥ గడచినా స్వావలంబన, సాంఘికన్యాయం పవిత్ర ప్రజాస్వామ్యానికి మారుపేరుగా నిలచిన రాజ్యాంగాన్ని రూపొందించుకొని అర్ధ శతాబ్ధం గడచినా అత్యధిక దేశ వాసులు దరిద్ర నారాయణలుగా మిగిలి వుండడం మన భావ దారిద్ర్యానికి నిదర్శనం. పై నుదహరించిన విధంగా చేతివృత్తులు కుటీర పరిశ్రమలకు స్థిరత్వాన్ని పునరుజ్జీవనాన్ని సాధించలేక పోయినా ఆ వృత్తులపై ఆధార పడుతూ నిరుద్యోగం, పేదరికం అనుభవిస్తున్న అశేష గ్రామీణ శ్రమ జీవుల జీవితాలకు వెలుగుబాటు చూపించు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానం అవసరం.

# వ్యవసాయేతర రంగ ప్రాధాన్యత

వ్యవసాయం గ్రామీణాభివృద్ధి అను స్థూల అవగాహనలో కుటీర పరిశ్రమలు, చేతివృత్తులు, హస్తకళలు తదితర పనులు వ్యవసాయేతర రంగంగా పిలువబడుచున్నవి. వ్యవసాయ రంగం యొక్క సర్వవ్యాపిత ప్రాధాన్యత గురించి చర్చించనవసరంలేదు. ఉపాధికల్పన ఆహారభద్రతలో ఈనాటికి అత్యధిక జనాభా యొక్క జీవనాధారంగానున్నది. సగటు జాతీయాదాయంలో ఒకనాడు 60-70 శాతం భాగస్వామిగానుండి ఈనాటికి 18 శాతానికి తగ్గినా 70 శాతం గ్రామీణ ప్రజల జీవన విధానంగానున్నది. దీని ఉత్పత్తిని ఉత్పాదకతను పెంచడానికి అనేకానేక సంస్కరణలను ప్రవేశపెట్టడం తద్వారా రానున్న దశాబ్దకాలంలో వ్యవసాయ ఉత్పత్తి రేటును ఈనాటి ఒక శాతం నుండి 4 శాతానికి పెంచడాన్ని 11వ పంచవర్ష ప్రణాళికా లక్ష్యంగా ప్రకటించబడింది. ఈ విధమైన పెరుగుదలపైననే జాతీయ సంపద పెరుగుదల, 10 శాతం ఆధారపడి ఉంటుందని నొక్కి చెప్పడం జరిగింది.

వ్యవసాయేతర రంగ ప్రాధాన్యతను గుర్తించాలంటే ఈ రంగం యొక్క ప్రత్యేకతను క్షుణ్ణంగా పరిశీలించడం చాలా అవసరం. స్థూలంగా ఇది పరిశ్రమల కోవకు చెందినదే అయినా గ్రామీణ పరిశ్రమగా ఉంటుంది. శాస్త్ర సాంకేతిక విప్లవ యుగంలో ఇందులో పనిచేసేవారు నైపుణ్యతతో కూడిన పారిశ్రామికులు అవసరం. వ్యవసాయాధార పరిశ్రమలైన పాడి పరిశ్రమ, పశుపోషణ, తదితర వృత్తులను మినహాయిస్తే చేనేత, గీత తదితర చేతివృత్తులు కులవృత్తులవారంతా ముఖ్యంగా యువత నిరుద్యోగం, అర్ధ ఉద్యోగంతో సతమతమవుతున్నారు. వ్యవసాయరంగం కొత్త వారికి ఉపాధి కల్పించడంలేదు సరికదా, ఇన్నాళ్లు వ్యవసాయ కూలీలు, సన్నకారు చిన్నకారు కౌలు రైతులుగా పనిచేసిన వేలాది శ్రమజీవులు నిరుద్యోగులుగా మారిపోతున్నారు. కోట్లాది రూపాయలు అధిక వడ్డీలతో అప్పులుగా సంపాదించి, మధ్య దళారీలకు ముడుపులు చెల్లిస్తూ లక్షలమంది పొట్టచేతబట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. అప్పులు తీర్చలేక యమయాతనలు అనుభవిస్తున్నారు. తమతమ గ్రామాలలో ఉపాధి అవకాశాలుండి నాణ్యతగల విద్యాగంధం ఉండియుంటే ఈ పరిణామము జరగవలసిన అవసరమేలేదు. అటు వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం మాత్రమేకాక, ఆధునికం, యాంత్రికం చేయబడుతుండడం వలన దానిపై ఆధారపడేవారి సంఖ్య తీవ్రంగా తగ్గడం

జరుగుతున్నది. ఈనాడు అభివృద్ధి చెందిన ఏ దేశంలో కూడా పట్టుమని 10 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడడంలేదు. అంతకంటే తగ్గిన జనాభాతో యంత్రాల సహాయంతో మనకంటే రెండు మూడు రెట్లు పంటలు పండించగలుచున్నారు. శాస్త్ర సాంకేతికయుగ పుణ్యమా అంటూ ప్రతి పరిశ్రమ తక్కువమంది కార్మికులతో ఎక్కువ లాభాలు సంపాదించే ప్రక్రియలోనున్నది. ఈ విధంగా పనుల నుండి తొలగించబడుతున్న వారి సంఖ్య లక్షలకు చేరుకుంటున్నది. వారంతా పట్టణాలలో, గ్రామాలలో బ్రతుకు భారాన్ని ఈడ్చలేక సామాజిక సమస్యలకు కారణభూతమవుతున్నారు. ఇటీవల లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 3 కోట్ల 87 లక్షల 50 వేల శ్రామికులుండగా అందులో కేవలం 20 లక్షల 50 వేల మంది కార్మికులు సంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. సంఘటిత కార్మికులు 5.5 శాతమున్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉపాధి పెరుగుదల రేటు 7-8 దశకాలలో అధికంగా నుండి 9వ దశకం నుండి సంస్కరణల ప్రారంభం నుండి తీవ్రంగా తగ్గి ఈనాడు 1 శాతానికి మించి లేదు. ప్రైవేటురంగ పరిశ్రమలలో మాత్రం 4.8 శాతం పెరుగుతున్నది. ఐనా ప్రభుత్వరంగం చేస్తున్న ఖాళీలను భర్తీ చేయలేకపోతున్నది. మన రాష్ట్రంలో గ్రామీణ రంగంలో 1990లో ప్రాధమిక రంగమైన వ్యవసాయ రంగంలో 78.8% శ్రామికులుండగా మొత్తం దేశంలో 76.1 శాతమున్నారు. ద్వితీయరంగమైన పారిశ్రామిక రంగంలో మన రాష్ట్రంలో 8.6 శాతం ఉండగా దేశంలో ఇది 11.3 శాతం. అలాగే తృతీయరంగమైన సేవా రంగంలో మన రాష్ట్రంలో 12.6 శాతం శ్రామికులు పనిచేస్తుండగా, దేశంలో ఇది 12.5 శాతం. అనుదినం వ్యవసాయ రంగం నుండి విడిపోయే శ్రామిక శక్తికి గ్రామీణ పారిశ్రామిక సేవారంగాలు పని కల్పించవలసిన గురుతర బాధ్యత భయపెడుతున్నది. అలాగే ఈనాడు గ్రామీణ వ్యవసాయేతర రంగంలో ఇమిడియున్న శ్రామిక జనం సంఖ్యను పరిశీలిద్దాం. 1999-2000 సంవత్సరంలో మన రాష్ట్రంలో 25.6 శాతం పురుషులుండగా ఆ సంఖ్య దేశానికి 28.7%. అలాగే స్త్రీల సంఖ్య మన రాష్ట్రంలో 15.7 శాతం కాగా దేశంలో 14.6 శాతమున్నది. స్త్రీ పురుషులంతా కలిస్తే మన రాష్ట్రంలో గ్రామీణ వ్యవసాయేతర రంగంలో 21.2 శాతముండగా దేశం మొత్తంలో ఈ సంఖ్య 23.8 శాతంగానున్నది. ప్రపంచ చరిత్ర, అనుభవాలు వాటి గుణపాఠాలు నేర్పుతున్న పరమ సత్యమేమిటంటే వ్యవసాయరంగం ఉపాధికల్పనలోనూ, జాతీయ సంపదను పెంచడంలోనూ వేగంగా తన పాత్రను కోల్పోతోంది. ఆ స్థానాన్ని పారిశ్రామిక, సేవారంగాలు ఆక్రమించక తప్పదు. ఈ ఆక్రమణ క్రమానుగతంగా, దార్శనికతతో ప్రణాళికాబద్ధంగా జరగడం అవసరం. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా గ్రామీణ అభివృద్ధి జరగవలసిన ఆగత్యమున్నది. అందుకే వ్యవసాయేతర (non farm) చిన్న పరిశ్రమలు, సేవా ప్రక్రియలు కేంద్ర బిందువుగా మారిపోయి యున్నది. ఏమాత్రం అశ్రద్ధకు ఆస్కారం లేకుండా యుద్ధ ప్రాతిపదికపై ఈ ప్రాధాన్యతారంగ పునరుద్ధరణ, పునరుజ్జీవన నూతన

సృష్టికి రాజకీయ వ్యవస్థ పూనుకోవలసి యున్నది. వ్యవసాయరంగ ప్రాముఖ్యతను ఏమాత్రం తగ్గించకుండానే గ్రామీణ వ్యవసాయేతర రంగ ప్రాధాన్యతను గుర్తించ వలసియున్నది. దేశంలో, అలాగే మన రాష్ట్రంలో కూడా పేదరికం, అనారోగ్యం, అవిద్య ఫలితంగా సామాజిక అశాంతి, శాంతిభద్రతలకు ప్రబలకారకమైన నిరుద్యోగిత (unemployment) యాదృచ్ఛికమైనది కాదు. ఇది స్వయంకృతాపరాధం. మన విద్యావిధానం దీనికి సంపూర్ణ బాధ్యత వహించవలసి యున్నది. ప్రాధమిక విద్య మొదలుకొని కళాశాల విద్య వరకు విద్యా విధానాన్ని ప్రక్షాళనం చేయడం, విద్యను మారుతున్న శాస్త్ర, సాంకేతిక యుగ అవసరాలు తీర్చేదిగా భారతీయ విలువలను పునరుద్ధరించేదిగా మలుచుకోవడం తక్షణ కర్తవ్యం. ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నా అందులో ఇమడగలిగే సాంకేతికత నైపుణ్యత కలిగిన యువత కరువైపోతున్నది. అంగబలం అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న సామెత సాక్షాత్కరించింది. ఇది unemployment (నిరుద్యోగం) కాదు unemployability (నిరుద్యోగిత) అంటున్నారు విశ్లేషకులు. ఇది మానవ సృష్టి. ప్రజలు, ప్రజాస్వామ్యం పట్ల ఏహ్యాభావం, ద్వేషం కలిగిన రాజకీయ నాయకత్వం తరతరాలుగా పెంచి పోషించిన మహాపాపం. అవగాహనారాహిత్యం, 'అదృష్టం' అను మృదు మధుర మాటలతో దాటవేయడం, బాధ్యతల నుండి తప్పించుకోచూడడం క్షంతవ్యం కాదు.

వ్యవసాయ సంక్షోభంతోపాటు గ్రామీణ నిరుద్యోగిత సంక్షోభం శృతిమించకముందే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామీణ మౌలిక సదుపాయాల రూపకల్పనపై ద్విగుణీకృతంగా కేంద్రీకరించాలి.

i) అరకొర చర్యలకు పరిమితం కాకుండా విద్యావిధానాన్ని ప్రాథమిక స్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు సంస్కరించాలి. అందుకవసరమైన అధికారపూర్వక నిష్ణాతులతో కూడిన యంత్రాంగాన్ని రూపొందించాలి. 12వ పంచవర్ష ప్రణాళికాంతానికి వ్యవసాయంతోపాటు అన్ని రంగాలు స్కిల్స్ కలిగిన యువతీ యువకుల నిర్వహణలోకి రావాలి.

ii) ఉన్నత విద్య పూర్తి చేసుకుని ఉపాధి, స్వయం ఉపాధి సాధించే వరకు ప్రభుత్వం పేద విద్యార్థులందరికీ ఉచిత విద్య, పౌష్టికాహారం ఇనుమడించిన స్కాలర్‌షిప్‌ల చెల్లింపు బాధ్యతలు నిర్వహించాలి. రాష్ట్ర ఆదాయ వ్యయ పట్టికలో దీనికి పెద్దపీట వేయాలి.

iii) ఈనాడు మూతపడిన, నిద్రాణావస్థలోనున్న కుటీర పరిశ్రమలన్నిటినీ ఆధునీకరించడానికి సాంకేతిక నైపుణ్యత గల్గిన అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం, దానిని పునరుద్ధరించడం తక్షణ విధాన నిర్ణయం జరగాలి. అందుకవసరమైన నిధుల గురించి ప్రభుత్వం పూచీపడాలి. అందులో తగు సంఖ్యలో నైపుణ్యత కలిగిన కార్మికులకు మంచి ఉపాధి కల్పించాలి.

iv) ఈనాటి నాగరికతా జీవితంలో గ్రామాల్లో పట్టణ జీవన విధానాలు చోటుచేసుకుంటున్న తరుణంలో చాలా పెద్దగా నూతన కుటీర పరిశ్రమలు, అందుకు తగిన మానవ వనరులు అవసరమవుతున్నవి. ఎక్కడ ఎలాంటి అవసరాలున్నా, పంచాయతీరాజ్ వ్యవస్థల సహాయ సహకారంతో నిర్ధారణచేసి నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం విరివిగా, విస్తారంగా సూక్ష్మ రుణ సదుపాయాలను కల్పించాలి. పరస్పర సహాయ సహకర సంఘాలు నెలకొల్పడం ద్వారా విజ్ఞాన వికాస కార్యక్రమాల ద్వారా అవన్నీ పారదర్శకంగా, జవాబుదారీతనంతో స్వయం ఉపాధి సూత్రబద్ధంగా నిర్వహించే ఒక యజ్ఞాన్నే చేపట్టాలి. ఇందులో స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పూర్తిగా బాధ్యత వహించేటట్లు చూడాలి.

v) ఈనాటికీ ఇంకా మిగిలియున్న కుల వృత్తులను రక్షించడం తక్షణ కర్తవ్యం. అందులో పనిచేస్తున్న లక్షలాది కార్మికులు నిస్తేజంగా, నిరుత్సాహంగా, భయాందోళనలో కొట్టుమిట్టాడడం గ్రామీణ జీవితంలో ఒక భయానక దృశ్యం. రైతులు, చేతివృత్తులవారు వేలాది సంఖ్యలో ఆత్మహత్యలకు తెగించడం శాపం కాదు, మానవ దుర్మార్గం. బాధ్యతలెరుగని సమాజం, బాధ్యతారహిత ప్రభుత్వాలు చేస్తున్న హత్యలు. వీటిని నిలువరించడం, నివారించడం సభ్యసమాజం యొక్క ప్రథమ కర్తవ్యం. తనకున్న కేవలం ఒక ఎకరంన్నర మెట్ట భూమికి నీరునందించే ఒక బోరు, మోటారు కొరకు మూడు సంవత్సరాలైనా రుణ సహాయం పొందలేని అభాగ్యుని ఆత్మహత్య, చాలీచాలని జీతభత్యంతో కుటుంబ పోషణకే బాధపడుతూ కూతురు పెండ్లికి చేసిన అప్పు తీర్చలేక కుమిలి కుమిలి చివరకు ఉరికంబానికి వేలాడిన చేనేత కార్మికుడు, ఇలా ఎందరెందరో ప్రతి దినం రాజకీయ పార్టీలను వాటి నాయకులను ప్రశ్నిస్తున్నారు. కాబట్టి పేదరికాన్ని, ఉపాధి ఉద్యోగకల్పన ద్వారా శాశ్వతంగా నివారించడం నిర్మూలించడానికి ముందు అనేకానేక సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలుపరచడం అవసరం. గొర్రెల కాపరులందరి ఆస్తిగానున్న జీవాలన్నింటినీ సకాలంలో ఆరోగ్య రక్షణ చర్యలను చేపట్టడం, వారికి భీమా పథకం ద్వారా రక్షణ కవచాన్ని ఏర్పరచడం; గీత పారిశ్రామికుల సంక్షేమ నిధి భీమా సౌకర్యంతోపాటు వారిపై విధించబడుతున్న త్రివిధ పన్నులు చెట్టు పన్ను, అడ్డాపన్ను, లైసెన్సు ఫీజులను పూర్తిగా రద్దు చేయడం; పైగా వారి వృత్తిలో నాణ్యత కల్పించడానికి రుణ సౌకర్యాలు కల్పించడం; అలాగే చేనేత పవర్‌లూం కార్మికులకు చౌకగా పనిముట్లు ఇతర ఉపకరణాలు సరఫరా చేయించడం... ఇలాగే ప్రతి వృత్తిని అధిక్షేపించకుండా ఆదుకోవడం, దాన్ని నిలబెట్టడం, ఉన్న ఉపాధిని భద్రపరచడం సమకాలీన ప్రభుత్వ కనీస ధర్మం. అనేక గ్రామీణ వృత్తులు ఇటువంటి సమస్యలతో జీవన్మరణ పోరాటంలోనున్నవి. మానవాభివృద్ధి దృష్టి, మానవతా దృష్టితో అభివృద్ధి సాధించే విధానంపై బాధ్యతను ఏమాత్రం విస్మరింపజాలదు. ఇటువంటి గురుతర బాధ్యతను రాజకీయ బాధ్యతగా సంకల్పించకపోవడం పాలకవర్గాలు చేస్తున్న

ఘోర అపరాధం. 50 వేల కోట్లు పెట్టుబడి ఖాతా క్రింద ఈ సంవత్సరం చేయబడుతున్న వ్యయంలో ఒక వేయి కోట్లయినా బడుగు, బలహీన, దళిత వర్గాల శాశ్వత ఉపాధి కల్పనపై కేటాయించకపోవడం, రెండు మూడు దశాబ్దాలలో కూడా సాధించలేని భారీ నీటిపారుదల ప్రాజెక్టులపై ఏకంగా ప్రతి సంవత్సరం 10 వేలు- 15 వేల కోట్లు కేటాయించడం, జలయజ్ఞం పేరిట ధనయజ్ఞం నిర్వహించడం అలాగే అరుదైన నిధులను అనుత్పత్తిదాయకంగా వెచ్చించడం యాధృచ్ఛికం కాదు. పాలకుల ఇష్టా అఇష్టాలు, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతాలు రాజ్యమేలుతుండగా పేదరిక నిర్మూలనలో శాస్త్రీయ అవగాహన లోపించడం ఆశ్చర్యమేమీ లేదు.

సామాజిక స్పృహ, మానవీయ దృక్పథం మానవాభివృద్ధికి అంకితమైన రాజకీయ నాయకత్వం, పవిత్రమైన ప్రజాస్వామ్య వ్యవస్థ యంత్రాంగాన్ని, సంకుచిత స్వార్థపర ప్రయోజనాలకై వినియోగించరాదు. ప్రపంచవ్యాపితంగా జరిగే ఆర్థిక వనరుల ప్రవాహం మన దేశంలోనే లెక్కకు మిక్కిలిగా కనబడుతున్న మిగులు ధనం ఒకవైపు, ఆకలి చావులు, ఆత్మహత్యలు, నిరుద్యోగం, నైరాశ్యం రెండవవైపు; ఇంగితజ్ఞానం కలిగిన ప్రజాప్రతినిధులెవరూ చూస్తూ కూర్చోకూడని పరిస్థితి. మహత్తర అవకాశాలొకవైపు, చలనరహితమైన అచేతన రెండవవైపు భరించజాలని పరిస్థితి. ప్రజాధనం వికేంద్రీకృత సంస్థల ద్వారా గ్రామీణ జీవితంలో ఉపాధికల్పనతోపాటు ఉత్పాదక శక్తులు ఉత్పత్తులను పెంచడానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. గ్రామీణ మౌలిక సదుపాయాల నిర్మాణంతోపాటు వ్యవసాయేతర రంగ పునరుజ్జీవన పునర్నిర్మాణంపై వెచ్చించాలి. అందుకవసరమైతే బడ్జెట్ ఆదాయ వ్యయాల నియంత్రణకై చట్టాన్ని రూపొందించాలి. అధికార అంకెల ప్రకారం 2001 నుండి 2006 మధ్య ఆంధ్ర, కర్నాటక, కేరళ, మహారాష్ట్రలలో 9000 మంది రైతులు ఆత్మహత్యలకు తెగించారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ రిపోర్టు ఆధారంగా దేశంలోని 607 జిల్లాలలో 120 నుండి 160 జిల్లాలు తీవ్రవాదుల ప్రభావంలోనున్నవి. ఇది భారతావనిలో నాల్గవ వంతుగానున్నది. దీనివెనక నికృష్ట పేదరికం, నిరాశా నిస్పృహలతోనున్న (ఆం ఆద్మి) అనబడే సామాన్య మానవులున్నారు.

నిధులున్నాయి కానీ ప్రాధాన్యతలు లేవు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలున్నాయి కానీ వాటికి దేశభక్తియుత దార్శనికత లేదు. అభ్యుదయవాదులంతా, పరిస్థితులు చేయిదాటకముందే, నైతిక, సామాజిక విలువల వెలుతురులో, ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల రూపకల్పనకై ఏకాభిప్రాయానికి రావాలి. నవభారత నిర్మాణానికి, నవ్యాంధ్ర నాందిగా ఉపక్రమించాలి.

# ఆహార భద్రత - వ్యవసాయ ఉత్పాదకత

మన దేశ వ్యవసాయ సంక్షోభం ముదిరి దేశ ఆహారభద్రతనే ప్రశ్నిస్తున్నది. కోట్లాది సన్నకారు, చిన్నకారు రైతులు ఉపాధి భద్రతను కోల్పోతూ, చివరకు ఆత్మహత్యలకు తెగించడం, ఆహారధాన్యాల నిలువలు అడుగంటిపోవడం అత్యంత ఆందోళనకర పరిణామం. సామాజిక వ్యవసాయ శాస్త్రవేత్తలతోపాటు రాజకీయ నాయకులు ఈ అత్యవసర సమస్య పరిష్కారానికి నడుము బిగించవలసిన తరుణం ఆసన్నమైంది.

వ్యవసాయం, ప్రత్యేకంగా ఆహారధాన్యాల ఉత్పత్తి, వాటి ఉత్పాదకత జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఉండడం లేదనే హెచ్చరిక చాలాకాలంగా అగుపడుచున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని గమనించినట్లే అగుపడినా, ఆచరణలో వ్యవసాయరంగం తీవ్రంగా నిర్లక్ష్యానికి గురికాక తప్పడంలేదు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పట్ల శాస్త్రీయ అవగాహన లోపమే ఈ నిర్లక్ష్యానికి మూల కారణం. 1956-57 నుండి 1966-67 వరకు ఒక దశాబ్ద కాలంలో మన ప్రధాన ఆహారధాన్యాలైన గోధుమలు, బియ్యం ఉత్పత్తి 3 కోట్ల 80 లక్షల టన్నుల నుండి 4 కోట్ల 10 లక్షల టన్నులకు పెరిగింది. అంటే ఆ దశకంలో పెరిగిన రేటు 0.75 శాతం. 1967-68 నుండి హరిత విప్లవ దశ ప్రారంభమైంది. ఆ తర్వాత వ్యవసాయ ఉత్పత్తులు, ఉత్పాదకతలో గణనీయమైన మార్పు జరిగింది. 1967-68 నుండి 2006-07 మధ్యకాలంలో ఈ ఉత్పత్తి 5 కోట్ల 90 లక్షల టన్నుల నుండి 16 కోట్ల 90 లక్షల టన్నులకు పెరిగింది. అంటే ఈ కాలంలో సగటు ఉత్పత్తి రేటు 2.7 శాతానికి పెరిగింది. నాలుగు దశాబ్దాల కాలంలో జనాభా పెరుగుదల రేటు 2.2 శాతం ఉండగా వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల రేటు, ముఖ్యంగా గోధుమలు, వరిధాన్యం పెరుగుదల రేటు 0.5 శాతం అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతున్నది. హరిత విప్లవం ప్రారంభమైన 40 సంవత్సరాల తర్వాత మన ఆహారధాన్యాల ఉత్పత్తిని సమీక్షిస్తే, అది ప్రతి సంవత్సరం ప్రతి మనిషికి కేవలం 14 కేజీలు మాత్రమే. లేదా ప్రతి నెల ప్రతి మనిషికి ఒకే ఒక కేజీ మాత్రమే! ఈ పెరుగుదల రేటు ప్రతి సంవత్సరం 0.5 శాతం మాత్రమే. అందుకే లక్షలాది సామాన్య శ్రామికులు ఒక పూటైనా కడుపు నిండా తిండి తినలేకపోతున్నారు. హరిత విప్లవమంటూ లేకపోతే ఎన్ని కోట్ల మంది కరువు కాటకాలతో మరణించి ఉండేవారో ఊహించవచ్చు.

హరిత విప్లవ ఫలితంగా ఉత్పాదకత ఇతోధికంగా పెరిగినప్పటికీ, అదనంగా లక్షలాది ఎకరాల భూమి సాగులోకి తేబడినప్పటికి, ఈనాటికి సాగు భూమిలో 60 శాతం వర్షాధారంతో నుండడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాదికోట్ల రూపాయలు వెచ్చించి నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టిన తర్వాత కూడా ఈ పరిస్థితి మిగిలియుండడం యాధృచ్ఛికం కాదు. స్వతంత్రానికి పూర్వం నిర్మించబడిన నీటి వనరులతోపాటు స్వతంత్రానంతరం నిర్మించబడిన నీటి వనరులు, కాలవలు పూడికలతో నిండి యుండడం, నీటిని నిలువరించే శక్తిని కోల్పోయి ఉండడం, వాటిని ఉపయోగంలోకి తేవడం కూడా చేతగాని పరిపాలనలు కొనసాగడం దురదృష్టకరం.

దీనికితోడు మన రైతుల భూకమతాలు ప్రతి సంవత్సరం మరీ చిన్నవిగా పంపిణీకావడం మంచి వ్యవసాయానికి ప్రతిబంధకంగా మారిపోవుచున్నది. మన రైతాంగంలో సుమారు 60 శాతం సగటున కేవలం ఒక ఎకరం భూమికే పరిమితమవుతుచున్నారు. మరో 20 శాతం 3 నుండి 4 ఎకరాలకు పరిమితమవుతున్నారు. ఈ విధంగా సుమారు 80 శాతం రైతాంగం సన్నకారు చిన్నకారు రైతులుగా చాలీచాలని కమతాలతో సతమతమవుతున్నారు. జనాభా పెరుగుదల రేటు ప్రతి సంవత్సరం 2 శాతం అనుకున్నా ప్రతి 35 సంవత్సరాల కాలానికి అది రెట్టింపు గాక తప్పదు. క్రొత్తగా సాగులోకి తేగలిగే భూమి దాదాపు లేనట్లే భావించవలసి వస్తున్నది. అటువంటి పరిస్థితులలో కాలక్రమేణా రైతుల సగటు భూకమతం విస్తీర్ణం మరింత తగ్గుతుందనుటలో ఎలాంటి సందేహం లేదు. అంటే వంద కోట్లకు మించిపోతున్న మన జనాభా ఆహార అవసరాలు తీర్చడం, కుదించుకుపోతున్న ఈ చిన్న కమతాల ఆధారంగా అసాధ్యం. 80 శాతంగా ఉన్న ఈ బక్క రైతులు కుదించుకుపోతున్న తమ భూకమతాలపై నిలకడగా గిట్టుబాటు వ్యవసాయం చేయడం, ఉత్పాదకత, ఉత్పత్తిని పెంచడం దుర్లభం. అప్పుడే అత్యధిక ధరలు వెచ్చిస్తూ గోధుమలను దిగుమతి చేసుకుంటున్న వార్తలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నవి. ‘‘సుజలాం సుఫలాం సస్యశ్యామలాం’’ అంటూ సగర్వంగా నినదించే భారతావని మరోసారి అన్నమో రామచంద్రా అంటూ అడుక్కు తినే గతికి నెట్టబడుతుందా అనే భయాందోళన కలుగుతుంది. మరిచిపోయిన పియల్480 రోజులు మళ్లీ గుర్తుకు వస్తూ కర్తవ్య ప్రబోధం చేస్తున్నది.

ఈనాటి భారతావని, భారత జాతి, ముఖ్యంగా శ్రామిక జనావళి పూర్తిగా వేరు. ఎలాంటి నిరాశ, నిస్పృహలకు తావివ్వకుండా, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తమ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించుకోగలిగే శక్తి సంపన్నులు. విజ్ఞాన యుగ ధర్మాన్ని అన్వయిస్తూ సృజనాత్మకంగా నూతన దారులు నిర్మించుకోగలిగే సమర్థులు. 2000 సంవత్సరాల నుండి ఇంకా ఏదో ఒక రూపంలో కొనసాగుతున్న వ్యవసాయ పద్ధతులకు పూర్తిగా తిలోదకాలిస్తూ, ఉత్పత్తిని ఉత్పాదకతను పెంచుకునే

శాస్త్రీయ మార్గాలన్నింటినీ చేపట్టడంలో ఏమాత్రం వెనుకంజవేయరు. కృషీవళులందరికీ ఆధునిక విజ్ఞానాన్ని అందించగలిగే లక్షలాది విజ్ఞానవేత్తలు దీన్ని ఒక సవాలుగా స్వీకరిస్తారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి దేశ ప్రధమ కర్తవ్యంగా ఎన్నుకుంటారు. రెండవ హరిత విప్లవానికి తెరతీస్తారు.

రెండవ హరిత విప్లవం, మొదటి హరిత విప్లవం సాధించిన విజయాలన్నిటిని కొనసాగిస్తూ వాటిని పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా విస్తరిస్తుంది. మేలురకం విత్తనాలు రసాయనిక, సాంద్రత ఎరువుల వాడకం, క్రిమిసంహారక ఔషధాల వినియోగం లాంటి సూక్ష్మస్థాయి సంస్కరణలతోపాటు యంత్రాల వాడకాన్ని ప్రబలంగా ప్రోత్సహిస్తుంది. వ్యవసాయం, మానవ శ్రమ ప్రధానమైన పరిశ్రమ అయినా, యాంత్రిక వ్యవసాయం ఫలితంగా సూక్ష్మ, స్థూల స్థాయిలలో శాస్త్రీయ పరిజ్ఞానం ఉపయోగం వలన అదనపు విలువ ఇతోధికంగా సృష్టించబడుతుందనేది ప్రపంచవ్యాప్తంగా రుజువు చేయబడిన వాస్తవం. అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలోని పంటల దిగుబడితో పోల్చగా మనదేశంలోని దిగుబడులు, దాదాపు అన్ని రకాల పంటలలో, మూడు నాలుగవ వంతు మాత్రమే ఉండడం యాధృచ్ఛికం కాదు. యాంత్రిక వ్యవసాయం, పెద్ద కమతాలలో అత్యంత సులువుగా సమర్థవంతంగా, ప్రయోజనాత్మకంగా సాగుతుంది. కాలానుగుణంగా త్వరగా పంటలు మార్చడం, పంటలను రక్షించుకోవడం, ప్రకృతి ప్రమాదాల నుండి కాపాడుకోవడం సులభతరమవుతుంది.

ఈ నేపథ్యంలో మనదేశంలోని లక్షలాది చిన్న కమతాలను ఏకీకృతం చేయడం, విశాల వ్యవసాయ క్షేత్రాలుగా రూపొందించడం, అందుకు కోట్లాది యజమానులుగానున్న సన్న చిన్నకారు రైతులను ఒప్పించడం, మెప్పించడం, కార్పొరేట్ వ్యవసాయం వైపు మళ్లించడం అత్యంత ప్రధాన జాతీయ కర్తవ్యం. దేశ విశాల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ఏకాభిప్రాయాన్ని సాధించడం అభివృద్ధి కాముకులందరి దేశభక్తియుత కర్తవ్యం.

కార్పొరేట్ వ్యవసాయం అంటేనే దాన్ని వ్యతిరేకించేవారు లేకపోలేదు. ముఖ్యంగా రాజకీయపార్టీలు వాటి అనుబంధ సంస్థలలో కార్పొరేట్ వ్యవసాయం గరించి సహేతుకంగానే భయ సందేహాలున్నవి. రైతులను తన సొంత భూమి నుండి తొలగించి పెట్టుబడిదారులచే నిర్వహించబడే క్షేత్రాలలో కూలీలుగా మార్చుతుందని, రైతు తన ఆస్తిని కోల్పోతాడని, సమాజంలో అతనికి సహజంగా ఉండే గౌరవ ప్రతిపత్తి కాస్తా పోతుందని వాస్తవమైన వ్యతిరేకతలున్నవి. దశాబ్దాలుగా ప్రచారం చేయబడుతున్న సాంకేతిక నైపుణ్యత, రుణసౌకర్యం, గిట్టుబాటు ధరలు రైతు సామాన్యునికి ఇంకా అందని చందమామగా మిగిలిపోవడం బాధాకర పరిస్థితి. ఫలితంగా వ్యవసాయం, ముఖ్యంగా సన్న చిన్నకారు వ్యవసాయం, పూర్తిగా కష్ట నష్టాలకు హేతువుగా

మిగిలిపోయింది. రుణభారం రోజురోజుకు పెరిగిపోతూ వేలాది రైతుల ఆత్మహత్యలకు దారితీస్తున్నది.

వ్యవసాయ పరపతి సంఘాలు, బహుళార్థక సహకార సంఘాల ద్వారా ఆర్థిక వనరులు, సాంకేతిక నైపుణ్యాన్ని సామాన్య రైతాంగానికి అందజేసే సుమారు అర్థ శతాబ్దపు ప్రక్రియ భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారి వ్యవస్థల ప్రాబల్యం కారణంగా నిష్ప్రయోజనమైపోయి చిన్న కమతాల రైతులు కూలీలుగా మారిపోవడం, పట్టణాలకు దేశ విదేశాలకు పొట్టచేతబట్టుకుని వలసలు వెళ్లడం, చాలీచాలని జీతభత్యాలతో వారి బ్రతుకులు చితికిపోవడం నిత్యం చూస్తున్న ఘోరాలు.

వ్యవసాయ అర్థశాస్త్రవేత్తలు 11వ పంచవర్ష ప్రణాళికల్లో పొందుపరచిన చికిత్సలు వ్యవసాయ సంక్షోభాన్ని మౌలికంగా పరిష్కరించలేకపోతున్నవి. రాజకీయ సంకల్ప లోపం కారణంగా, ప్రభుత్వాలు వ్యవస్థాపర సంస్కరణలను ధైర్యంగా ఆచరించలేకపోతున్నవి. ప్రపంచీకరణ, ప్రపంచ వాణిజ్య వ్యాపార నిబంధనలు పరిస్థితిని మరింత జటిలం చేస్తున్నవి. ఏది ఏమైనా చక్కని భూములు, నదీనదాలు, కోట్లాది కృషీవలురున్న మన వ్యవసాయం పునరుజ్జీవనం పొందక తప్పదు. మానవాళి మనుగడకు ప్రబల ఉత్పత్తి సాధనముగానున్న భూమి ఈ ధరిత్రికి ప్రాణప్రదం కాక తప్పదు. విజ్ఞాన ప్రధానమైన 21వ శతాబ్ది మొదటి ఒకటి రెండు దశకాల్లోనే మానవాళి ఆహార భద్రతకై శాశ్వత పరిష్కారాన్ని సాధించి తీరాలి. అందుకు ఈ క్రింది సంస్కరణల ఔచిత్యంపై విజ్ఞులు తమ దృష్టిని సారించాలి. రాజకీయ ఏకాభిప్రాయాన్ని సాధించాలి. యుద్ధ ప్రాతిపదికపై ఈ వినూత్న విధానాన్ని మనదేశంలో, మన రాష్ట్రంలో అమలుపరచడానికి సిద్ధం కావాలి.

1. భూమి బహుముఖ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రబల సాధనంగా గుర్తించబడాలి. అది ఒక ఆస్తిగా, సొమ్ముగా పరిగణించబడే సాంప్రదాయాన్ని మూఢ నమ్మకాన్ని తొలగించాలి. సమాజానికి చెందిన సమిష్టి ఆస్తి అను భావనను క్రమంగానైనా నెలకొల్పాలి.

2. పరస్పర సహాయ, సహకార సంఘాలను ప్రతి గ్రామంలో లేక గ్రామాల సముదాయంలో నిర్మించాలి. సంపూర్ణంగా ప్రజాతంత్ర పద్ధతిలో ఎన్నుకోబడే ఆ సంఘాల నాయకత్వానికి సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. ఎట్టి పరిస్థితులలో కూడా ప్రభుత్వాలకు జోక్యం లేకుండా సంఘాలు తమ నిర్ణయాలను ఆచరించే చట్టబద్ధ రక్షణ ఉండాలి. ఈ సంఘాలు ప్రైవేటు పెట్టుబడిదారులతో సముచిత ఒప్పందాలు కుదుర్చుకునే అధికారాలు కలిగి ఉండాలి.

3. ప్రతి రైతుకు తన భూమిపై యాజమాన్యపు హక్కును సర్వే సెటిల్‌మెంట్ రికార్డు ద్వారా ఎప్పటికప్పుడు చేర్పులు మార్పుల సౌకర్యంతో సహా రెవెన్యూశాఖ అందించాలి.

4. సహకార సంఘాల ఆధారంగా, పెట్టుబడిదారుల భాగస్వామ్యంతో ఏర్పడే కార్పొరేటు వ్యవస్థలు, సువిశాల వ్యవసాయ క్షేత్రాలపై ఆధునిక వ్యవసాయాన్ని నిర్వహిస్తూ అధికోత్పత్తిని సాధించాలి. ఉత్పాదకతను పెంచాలి.

5. సహకార స్ఫూర్తితో కార్పొరేషన్‌లో చేరిన ప్రతి రైతుకు అతని సొంత భూభాగానికి సముచిత కౌలును ప్రతి ఏటా రెండు పర్యాయాలు విధిగా చెల్లించాలి. అదీగాక ఆ రైతులు, స్త్రీ పురుషులకు, ఆయా కార్పొరేషన్‌లు వారి శక్తికి తగిన ఉద్యోగులుగా, విధిగా, నియమించి ప్రతినెలా జీతభత్యాలు చెల్లించాలి. అంతేకాదు. కార్పొరేషన్ నిర్ధారణ చేసే వాటాలలో ఆయా రైతులకు తమ తమ భూభాగాలకనుగుణంగా వాటాదారులుగా గుర్తించి తగు ధృవీకరణ పత్రాలు అందజేయాలి. ఈ విధంగా సహకారస్ఫూర్తితో వ్యాపార సంస్థగా అవతరించే కార్పొరేషన్లలో రైతు తన భూమికి యజమానిగా, ప్రతి పంటకు సముచిత కౌలురేటు పొందే భూస్వామిగా, వ్యవసాయ కార్మికుడిగా తర్వాత కార్పొరేషన్ యొక్క వాటాదారుగా ఉండగల్గుతాడు. దేశ సంపద సృష్టిలో గౌరవప్రదంగా తన పాత్రను పోషించగల్గుతాడు. తాను ఈనాడు పొందుతున్న ఆదాయానికి కనీసం మూడు నాల్గు రెట్లు అధిక ఆదాయాన్ని పొందగల్గుతాడు. ఇది ఊహాచిత్రంగా కనపడవచ్చును. అయినా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన ఈనాటి వ్యవసాయానికి మోక్షం లేదు. సహకార స్ఫూర్తితో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆధునిక యాంత్రిక వ్యవసాయం చేయనిదే పెరిగే జనాభాకు ఆహార భద్రతతోపాటు ఉపాధి కూడా కల్పించడం జాతి కర్తవ్యం.

# ఆందోళన కలిగిస్తున్న ఆహార అభద్రతా భావం

ఈ సంవత్సరం ఎండలతోపాటు నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నవి. గత కొన్ని నెలల నుండి అత్యవసర వస్తువుల ధరలు 25% నుండి 75% వరకు పెరిగిపోతున్నవి. కొన్ని ధరలు చిల్లర దుకాణాలలో 100% నుండి 200% వరకు పెరిగిపోవడం అపూర్వం. దేశంలో గోధుమలు, బియ్యం నిల్వలు గతంలో 27 సంవత్సరాలలో లేనంత స్థాయికి పడిపోయినవనే వాస్తవం నమ్మశక్యంగా లేదు. మన దేశమే కాదు... ఆహార ధాన్యాల ధరలు ప్రపంచవ్యాప్తంగా ఆకాశాన్నంటుకుంటున్న వైనం ఆశ్చర్యకరం. ఈ సంవత్సరం ప్రపంచంలో 82 దేశాలు, భారత్, చైనాలతో సహా, తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోబోతున్నట్లు ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తున్నది. ఈ భయంకర పరిణామానికి కారణం, జనాభా పెరుగుదల, ప్రజల ఆదాయాలలో తరుగుదల ఆహార పదార్థాల ఉత్పాదకతల కుదింపు అనిశ్చిత వాతావరణం, అన్నింటినీ మించి ఆహారధాన్యాలు మరియు చక్కెరను జీవ ఇంధన ఉత్పత్తికి వినియోనిగించడం, వ్యవసాయ భూములను అధికంగా బయోడీజిల్‌ను సాధించే పంటలకై మళ్ళించడమేనను వాస్తవాలు వెలుగులోనికి వస్తున్నవి. అందువలననే ఆహారపదార్థాలన్నీ ఉత్పత్తి పెరిగిపోతున్నా అవసరాలకు సరిపడడంలేదు. డిమాండును సప్లయ్ అందుకోవడంలేదు. పై కారణాలలో ఏ ఒక్కటీ ప్రకృతి వైపరీత్యంతో ముడిపడిలేదు. దూరదృష్టిలేని మానవ ప్రయత్న లోపం ఇందుకు మూలకారణం. ప్రపంచీకరణ నేపథ్యంలో, ప్రపంచ దేశాల మధ్య సదవగాహన, పని పంపకంతో నీరు, భూమి అను సృష్టి ద్వయాన్ని చైతన్య సమాజం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగించగలిగితే ఈనాడు కాదు కదా ఏనాటికీ నిత్యావసర ఆహార సరుకుల కొరత ఉండదు. పై కారణాలను విశ్లేషిద్దాం..

1. జనాభా పెరుగుదల వాస్తవం. విద్యా విజ్ఞానం పెరగడం, చిన్న కుటుంబాల అనుభవం ఫలితంగా జనాభా పెరుగుదల రేటు చాలా తగ్గింది. అయినా పెరుగుతున్న సంఖ్యా బలానికి అనుగుణంగా ఆహార ఉత్పత్తుల పెరుగుదల అనివార్యం. ఈనాడు 640 కోట్లుగానున్న ప్రపంచ జనాభా ఈ శతాబ్ది అర్థభాగానికి అంటే 2050 నాటికి 900 కోట్లకు చేరుకుంటుందని అంచనా. కాబట్టి రానున్న 50 సంవత్సరాల నాటికి ఈనాటి ఆహార ఉత్పత్తిని రెట్టింపు చేయగలగడం ఒక సవాలు. తక్కువ భూమి, అతి తక్కువ నీరు, మరీ తక్కువ రసాయనిక ఎరువుల

వాడకం. అనిశ్చిత వాతావరణ మార్పుల మధ్య పై లక్ష్యాన్ని సాధించే నేర్పరితనం ఆచరించబడాలి. వ్యవసాయశాస్త్ర పరిశోధనలు వ్యవసాయ విధానాలు, ఆయా వ్యవస్థలు ఈ దృక్పథంతో తీవ్రంగా సంస్కరించబడాలి.

2. ప్రజల ఆదాయాల పెరుగుదల అంతే వాస్తవం. పేదరికం ఇంకా పెద్దగానున్నా, మధ్యతరగతి కూడా పెరిగిపోవడం వాస్తవం. స్వాతంత్ర్య సాధన రోజులలో మన దేశంలో 80% నిరుపేదలుండగా ఈనాడు వారి సంఖ్య 30%నికి తగ్గిన వాస్తవం ఎవరూ కాదనలేరు. 100 కోట్లకు మించిపోయిన ఈనాటి భారత జనాభాలో 30 కోట్లు దారిద్ర్యరేఖకు దిగువగా నుంటే 60 కోట్ల జనాభా మధ్యతరగతితో (చిన్నా, పెద్ద) కూడియున్నది. నిజంగా దీనివలన వారి ఆహార విహార అలవాట్లలో గుణాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నవి. కూరగాయలు, మాంసాదుల వాడకం చాలావరకు పెరిగింది. ఆయా సరుకుల కొరత ఉంటే, పోటీపడి పెరిగిన ధరలకైనా వాటిని కొనుగోలు చేసే ఆర్థికశక్తి పెరుగుతున్నది. దేశ ఆర్థికాభివృద్ధి వీరి జీవిత విధానాలు, అవసరాలలో ప్రతిబింబించడం సహజం. అందుకొరకు ఆహార సరుకుల ఉత్పత్తిని ఇతోధికం చేయడం గొప్ప అవసరం. పరిమిత వనరులైన భూమి, నీరు, తదితరముల ద్వారా పంటల ఉత్పాదకతను పెంచుతూ అధికోత్పత్తిని సాధించడం అత్యవసరం.

3. నీటి వినియోగం వ్యవసాయంలో కీలక సమస్యగా మారిపోయింది. వ్యవసాయంతోపాటు పట్టణ ప్రజల త్రాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలకు నీరు సరిపడడంలేదు. నీటి పొదుపు జాతీయ కర్తవ్యంగా మారింది. ప్రతి సంవత్సరం క్రొత్తగా చేరుతున్న నీటి వనరుల్లో మూడు భాగాలను వ్యవసాయానికి వినియోగించడం జరుగుతున్నది. మిగతా నీరు అడవుల పరిరక్షణ, అడవి జంతువుల రక్షణకు సరిపడడంలేదు. పట్టణ పారిశ్రామిక అవసరాలు తీర్చడం అంతంతమాత్రంగానే ఉన్నది. వాగులు, వంకలు, చెరువులు, తటాకాలు ఎండిపోవడం ఇటీవల చూస్తున్న ఆశ్చర్యకర పరిణామం. ఈనాడు వ్యవసాయానికి నీటి వినియోగం అవసరానికి మించి పోయిందని, శాస్త్రజ్ఞుల విమర్శ. భూభాగంలో 40% వ్యవసాయానికి వినియోగించబడే భూమి కూడా తగు మోతాదులో వ్యవసాయ ఉత్పత్తులను అందజేయడం లేదని నిపుణుల అభిప్రాయం. అంతేకాదు... ఈనాటి వ్యవసాయ పద్ధతుల కారణంగా వాతావరణ కాలుష్యంలో 30% బాధ్యత వ్యవసాయానిదేనని విమర్శకుల అభిమతం. కాబట్టి నీరు, భూమి, వినియోగంలో వాటి యాజమాన్యంలో అత్యాధునిక శాస్త్రీయ విజ్ఞానం వెలుతురులో మౌలికమైన మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. ఈ దిశలో భారీ సంస్కరణలు చేపట్టి సత్ఫలితాలను సాధించడం జాతీయ కర్తవ్యం.

4. మండిపోతున్న ఇంధన ధరల (డీజిల్, పెట్రోలు) కారణంగా సహజంగానే బయోడీజిల్ సాధించడానికని చక్కని వ్యవసాయ భూములను కూడా, విదేశాలలో ప్రధానంగా, బయోడీజిల్ పంటలకు మళ్ళించడం జరుగుతున్నది. అంతేకాదు ఆహారధాన్యాలు, చమురులాంటి అత్యవసర సరుకులను కూడా ఇథెనాల్ ద్వారా బయోడీజిల్ తయారీకి వాడడం ఆందోళనకరం, ఆశ్చర్యకరం. ఒక అంచనా ప్రకారం 2020 నాటికి ప్రతి సంవత్సరం 40 కోట్ల టన్నుల ఆహార పదార్థాలు ఇందుకు వినియోగించబడతాయి. ఇది ఒక సంవత్సరపు ప్రపంచ వరిధాన్య పంటతో సమానం. సంపన్న దేశాలలో కోట్లకు పడగలెత్తిన ధనాఢ్య వర్గాలకు చెందిన మానవమాత్రులు తమ కార్లను కాలుష్యరహిత ఇంధనంతో నడుపుకోవాలనే ఆపేక్ష సాధన కొరకు అనేక వేలకోట్ల డాలర్ల వ్యయంతో ఈ బయోడీజిల్ ఉత్పత్తి ఉపయోగాలు నిర్వహిస్తున్నారు. రెండవవైపు వందల కోట్ల ప్రజలు తినడానికి ఆహారధాన్యాలు అందుబాటులో లేక అర్థాకలితో అగచాట్లు పడుతున్నారు. బయోడీజిల్ ప్రయోగం లాభసాటికాదనే అనుభవం క్రమంగా గుర్తింపులోకి రావడం మంచి పరిణామం. అమెరికా విదేశాంగ మంత్రిని కండోలిజా రైస్ సాక్ష్యాత్తు అమెరికా అధ్యక్షుడు బుష్ భారతదేశంలో నున్న 35 కోట్ల మధ్యతరగతి జనాభా అతిగా తినడం కారణంగానే ప్రపంచ ఆహార సంక్షోభం ఏర్పడుతుందని ప్రకటించడం నాగరికతా ప్రపంచానికే సిగ్గుచేటు. అమెరికా ప్రజలు కూడా ఖండించవలసిన శుద్ధ అభాండం. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుదలకు చైనా, భారత్ దేశాల వినియోగం మూల కారణమంటూ పుండుపై కారం చల్లినట్లు బుష్ గారు ప్రకటించడం ఆయన అజ్ఞానానికి, సామాజిక స్పృహ లేని చైతన్యానికి ప్రబల నిదర్శనం.

5. వాతావరణంలో మార్పు వ్యవసాయంపై తీవ్రమైన ప్రభావానికి కారణ మవుతున్నది. అతివృష్టి, అనావృష్టి, అకాలవర్షాలు ఇదివరకెన్నడూ లేని విధంగా వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తున్నది. పంటల ఉత్పాదకత తగ్గుతున్నది. ఇదే కొనసాగితే రానున్న రెండు మూడు దశాబ్దాలలో ఉత్పాదకత మరింతగా తగ్గుతుందని వాతావరణ శాస్త్రజ్ఞుల అంచనా. కలుషిత వాతావరణంతోపాటు, వేడెక్కుతున్న పర్యావరణం ఫలితంగా భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తులు తీవ్రంగా దెబ్బతింటాయని శాస్త్రజ్ఞుల హెచ్చరిక. కాబట్టి పంటల ఉత్పాదకతను పరిరక్షించుకుంటూ ఇంకా ఇనుమడించుకోవలసిన తరుణంలో పై కష్టనష్టాలను నివారంచడానికి, తొలగించడానికి, వ్యవసాయ శాస్త్రజ్ఞులు రైతులు నిరంతరం పరిశ్రమించవలసియున్నది. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను ప్రక్రియలను రూపొందించుకోగలగాలి. ప్రకృతితో నిరంతరం ఆత్మరక్షణ పోరాటాన్ని నిర్వహిస్తూనే బ్రతుకు పోరాటాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాలి.

6. ఆహార పదార్థాల ఉత్పత్తి, వాటి ఉత్పాదకతను పెంచడానికి పైనుదహ రించిన దీర్ఘకాలిక చర్యలతోపాటు కృత్రిమంగా వాటి లోటును సృష్టించే వాణిజ్య వర్తక రాబంధులపై కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారా తాత్కాలికంగానైనా సమస్యను పరిష్కరించగల్గుతాము. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే కాబట్టి వారే ఇటువంటి సంఘ వ్యతిరేకత శక్తులపై డేగకన్ను వేసి దొంగ నిల్వలను వెలికి తీయడంతోపాటు, చీకటి వ్యాపారస్తులందరికీ హెచ్చరికగా కఠినమైన శిక్షలు విధించాలి. ప్రజాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ దిశలో ప్రత్యేకంగా ఉద్యమించడం హర్షదాయకం.

7. ద్రవ్యోల్బణంను నియంత్రించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగానైనా రెండు విధానపర నిర్ణయాలను చేపట్టుచున్నది. సరుకుల ఎగుమతి, దిగుమతి సుంకాలను పెంచడం లేక తగ్గించడం ద్వారా ధరలను నియంత్రించడం (Fiscal)ఒకటయితే రిజర్వుబ్యాంకు ద్వారా వడ్డీ రేట్లను పెంచుతూ క్యాష్ క్రెడిట్ దామాషా నిష్పత్తిని పెంచడం రెండవది. ధరల నియంత్రణ పేరుతో స్వదేశీ వ్యవసాయ పారిశ్రామిక ఉత్పత్తుల పెరుగుదలను ప్రభావితం చేయడం అసలు ఆర్థికాభివృద్ధికే హానికరం. అందులో నిత్యావసర ఆహార పదార్థాల ఉత్పత్తి, ఉత్పాదకతల ప్రమాణం ఏమాత్రం తగ్గడం హానికరం. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ యొక్క నియమ నిబంధనల చక్రబంధంలో మనదేశ రైతాంగానికి ప్రయోజనం మాత్రమే తప్ప ఏమాత్రం నష్టం వాటిల్లకుండా దేశ వాణిజ్య మంత్రిత్వశాఖ జాగ్రత్తపడడం దేశీయ వ్యవసాయ పరిరక్షణకు అత్యవసరం.

త్వరత్వరగా పెరిగిపోతున్న వ్యవసాయ ఉత్పత్తుల డిమాండు, వాతావరణంలో ఏర్పడుతున్న అనిశ్చితి, కీలకమైన నేల, నీరు లాంటి వనరుల తరుగుదల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆహారపదార్థాల నిరంతర సరఫరా అత్యంత జఠిలమైన సమస్యలతో కూడుకున్నది. ప్రపంచ ఆహారసంస్థ (FAO) అంచనా ప్రకారం ఇంకా 80 నుండి 100 కోట్ల ప్రజలు పౌష్టిక ఆహారలోపం వలన బాధపడుచున్నారు. అందులో సగానికి సగం భారతదేశంలో నుండడం గమనార్హం. మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఇద్దరు వ్యవసాయంపై ఆధారపడినవారే. సాంప్రదాయసిద్ధంగా పారిశ్రామికాభివృద్ధి జరిగి వ్యవసాయంపై ఆధారపడేవారు పట్టణాలకు తరలి పారిశ్రామిక కార్మికులుగా మారే పరిస్థితి ఎన్నడో పోయింది. శాస్త్ర సాంకేతిక విప్లవం ఫలితంగా అతి తక్కువమంది పారిశ్రామిక కార్మికులు అత్యధిక పారిశ్రామికోత్పత్తి చేయడం జరుగుతున్నది. కాబట్టి వ్యవసాయం అధికాహారోత్పత్తికి మాత్రమే ప్రధానం కాదు. పెరిగిపోతున్న జనాభాకి ఉపాధికల్పన, ఉద్యోగ భద్రత కీలకం. జాతీయ సంపదలో 20 శాతం కంటే తక్కువగా ఉత్పత్తి చేస్తున్న వ్యవసాయరంగం తన పాత్రను ఇతోధికం చేయడం అవసరం. ప్రకృతి

సంపద కోకొల్లలుగా నుండి మానవ శ్రమశక్తి చౌకగా లభ్యమయ్యే భారతదేశంలో వ్యవసాయరంగానికి పారిశ్రామిక సేవారంగాల కంటే అధిక ప్రాముఖ్యత ఉండక తప్పదు. వ్యవసాయరంగ సమస్యలు భూమి నీటియాజమాన్యంతోపాటు, స్థూల, సూక్ష్మ మౌలిక సదుపాయాల రూపకల్పన, నీటివనరుల నిర్మాణం, వ్యవసాయ ఉత్పత్తి ఉత్పాదకతలను గణనీయంగా పెంచడం, అందుకు అవసరమైన వ్యవసాయ శాస్త్రవేత్తల సంఖ్యను అనేక రెట్లు పెంచడం, ముఖ్యంగా వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనలలో విప్లవాత్మక మార్పులు సాధించడం లాంటివి తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నవి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిధులను కేటాయించి వ్యవసాయ దేశంగానున్న భారతావనిని మూడు పూలు ఆరు కాయలుగా వృద్ధిలోకి తేక తప్పదు. దీనికి నిరుద్యోగం, ఆకలిచావులు వినా మరో ప్రత్యామ్నాయం ఉండబోదు. చిన్న సన్న భూకమతాలను ఏకీకృతం చేస్తూ రైతులు ఐచ్ఛికంగా నిర్మించుకునే పరస్పర సహాయ సహకార సంఘాల నేతృత్వంలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తూ సువిశాల వ్యవసాయ క్షేత్రాల్లో, అధికోత్పత్తి ఉత్పాదకతలను సాక్షాత్కరిస్తూ, సుసంపన్న వ్యవసాయ విస్తరణ సాధించడం భారతజాతి అవసరం. వ్యవసాయ శాస్త్రజ్ఞుల అత్యాధునిక అవగాహన ప్రకారం భూగర్భ జలాలను పెంచుకోవడంతో పాటు భూసార సంరక్షణ అత్యధిక ప్రాధామ్యత గల అంశం. ప్రాణప్రదమైన, జీవనాధారమైన భూమి కొట్టుకుపోవడం ఫలితంగా ఇప్పటికే సగానికి మించిన భూభాగం నిస్సారమైపోయినది. రెండు, మూడు దశాబ్దాల సన్నిహిత భవిష్యత్తులో మిగిలిపోయిన సారం  కూడా కొట్టుకుపోయి భూములు ఎడారులుగా మారి ఎలాంటి పంటలకు కూడా ఉపయోగపడని ప్రాణాంతక పరిస్థితి పొంచికూర్చున్నది. కొబట్టి భూసార సంరక్షణకై ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై వనరులను కేటాయించి వాటర్ షెడ్‌ల నిర్మాణాన్ని చేపట్టడం అత్యవసరం. నీటి వనరుల పద్దుపై నిధులను కేటాయించే సందర్భంలో సింహభాగాన్ని వాటర్ షెడ్‌ల నిర్మాణం అనగా వాలు భూముల భూసారాన్ని సంరక్షించే విధంగా కేటాయించాలి. ఆ తర్వాత చిన్న నీటి వనరుల నిర్మాణం, ఆ తర్వాత మధ్య తరహా నీటి వనరుల నిర్మాణం చేపట్టాలి. ఈ పని చేయగా మిగిలిన అదనపు నిధులను పెద్ద నీటివనరుల నిర్మాణంకై కేటాయించాలి. ఈనాడు తల్లక్రిందులుగా అనుసరించబడుచున్న ప్రాధామ్యతలు కేవలం అశాస్త్రీయం. భూసార సంరక్షణకు విరుద్ధం.

వ్యవసాయం పరిమితమైన భూములపై శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన వెలుతురులో అత్యధిక మోతాదులో ఉత్పత్తులు పెంచవలసిన కర్తవ్యం మన ముందున్నది. మున్ముందు ఈ కర్తవ్యం మరింత ప్రాధాన్యతను సంతరించుకోబోతున్నది. శాస్త్రజ్ఞుల అవగాహన ప్రకారం స్థూలంగా వ్యవసాయ పంటలకి పందొమ్మిది పోషకాలు అవసరం. అందులో మూడు పోషకాలు సూర్యరశ్మి, నీరు, కార్బనము ప్రకృతి సిద్ధముగానే లభిస్తుంది.

మానవ ప్రయత్నం అక్కరలేదు. తత్తిమా 16 పోషకాలు మానవ కృషి ద్వారా పంటలకు సరియైన మోతాదులలో సకాలంలో, ఆయా భూముల, భూసార పరీక్షలపై ఆధారపడి మాత్రమే అందించవలసియుంటుంది. అప్పుడే పరిపూర్ణంగా పోషకాలను పొందిన పైర్లు పుష్కలంగా పండుతాయి. ఉత్పాదకత ఇతోధికంగా ఇనుమడిస్తుంది. ప్రపంచ మార్కెట్లో నాణ్యతాపరంగా అమూల్యమనిపించుకోవడానికి రసాయనిక ఎరువుల స్థానే సేంద్రీయ ఎరువుల వాడడం జన సమ్మతం. జన్యు మార్పిడి ఒక్కటే అధికోత్పత్తికి సరిపోదు, పైనుదహరించిన వివిధ పద్ధతులు అనుసరించక తప్పదు. అందుకవసరమైన నిధులను వెచ్చించక తప్పదు. కాబట్టి వ్యవసాయం విశాల కమతాలలో సహకార పద్ధతులలో ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్య సూత్రాలపై ఆధారపడి పునర్ నిర్మాణం చేయక తప్పదు. వ్యవసాయ సంస్కర్తలు ప్రతిస్పందించాలి.

# "పంచవర్ష ప్రణాళిక" - ధృక్పథంలో మౌలికమైన మార్పులు అత్యవసరం

స్వాతంత్ర్యానంతరం మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యాలో ఆర్థిక,సామాజిక పురోభివృద్ధికి అంచలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించి అమలుపరచడానికై సృష్టించిన 'పంచవర్ష ప్రణాళికల' సిద్ధాంతంతో స్ఫూర్తి పొందారు. మన రాజ్యాంగంలో దీని విధి విధానాల గురించి చర్చించలేదు. కాబట్టి దీనికి రాజ్యాంగబద్ధ నియమ నిబంధనలు లేవు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిష్ణాతులైన అర్థశాస్త్రవేత్తలు, అనుభవం కలిగిన పరిపాలనా నిపుణులతో ఈ ప్రణాళికా సంఘాలను నియమించుతూ వస్తున్నది. స్థూలంగా దేశం ఆర్థికాభివృద్ధిని సాధించడం దీని ప్రధాన లక్ష్యం. అందుకు వ్యవసాయం, వాణిజ్యం, వ్యాపారం, పరిశ్రమ సేవా రంగాల ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుదల సాధించడానికి ఈ విధంగా దేశ సంపదను వేగవంతంగా పెంచుకొంటూ ఆర్థిక, సామాజిక న్యాయాన్ని సమకూర్చే కార్యక్రమాలను రూపొందించడం అందుకు అవసరమైన నిధులను కేటాయించడం ప్రణాళిక సంఘ ప్రధాన బాధ్యతగా నిర్వహణ జరుగుతున్నది. వివిధ రాష్ట్రాలు, వివిధ వర్గాలు, వివిధ రంగాల ఆదాయ వ్యయాలలోనున్న అంతరాలను గుర్తిస్తూ దేశ వ్యాపిత సమతుల అభివృద్ధిని సాధించడం ఈ సంఘం యొక్క పని విధానం.

స్థూలంగా పైనుదహరించిన లక్ష్యం బాగున్నప్పటికి గడచిన అర్థ శతాబ్దపు 10 పంచవర్ష ప్రణాళికల అనుభవం సంతృప్తికరంగా లేనట్లు వివిధ విశ్లేషణల ద్వారా బోధపడుతున్నది. అభివృద్ధి, వనరుల సమీకరణ, అభివృద్ధి ఫలితాల విభజన, పేదరిక నిర్మూలన లాంటి మౌలిక సిద్ధాంతాల విషయంలో గత అర్థ శతాబ్ది సుదీర్ఘ కాలంలో అవగాహన మార్పు, సరికొత్త ఆలోచనలు చోటు చేసుకున్నవి. గత రెండు దశాబ్దాల ప్రపంచీకరణ పరిణామాలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో చోటుచేసుకొన్న విప్లవాత్మకమైన మార్పులు, నూతన విధి విధానాలకు ప్రోత్సాహకరంగా నుంటూ ఆచరణాత్మకమైన, ప్రయోజనాత్మకమైన విధానాల రూపకల్పన చేయడం జరుగుచున్నది. శరవేగంగా కొనసాగుతున్న పై ప్రక్రియల నేపథ్యంలో మన ప్రణాళిక సంఘ లక్ష్యాలు, కార్యక్రమాలు, సాధించిన ఫలితాలు విజ్ఞులందరికి అసంతృప్తిదాయకంగా నున్నవి. సామాన్య ప్రజల

నిత్య జీవితంలో గూడు కట్టుకొనియున్న అసంతృప్తి, నైరాశ్యాన్ని తొలగించలేక పోవుచున్నది. పేదరికం ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనున్నట్లు "ప్రణాళికాబద్ధ ప్రగతిని" వెక్కిరిస్తున్నది. ప్రతి ప్రణాళిక తర్వాత దాని నిర్వహణ అనుభవ సంపద క్రోడీకరించబడు తున్నప్పటికి అందు నుండి వెలువడే గుణపాఠాలు స్వీకరించడం లేదు. ప్రణాళికాబద్ధ ప్రగతి దేశ సంపద పెరుగుదలలో ఇటీవల గణనీయంగా లెక్కలోకి వస్తున్నా ప్రజా జీవితం ముఖ్యంగా అత్యధిక జనాభాతో కూడిన గ్రామీణ ప్రజాజీవితంలో చెప్పుకోదగిన గుణాత్మక మార్పును సాధించలేకపోతున్నది. వ్యవసాయాధార, గ్రామీణ పరిశ్రమలు, కోట్ల సంఖ్యలో యుక్త వయస్సులోకి వస్తున్న యువతరాలకు ఉపాధి కల్పించలేక పోవడం, యువతరం, మేధావి వర్గంతో సహా వలసలకు గరికావడం తగ్గడం లేదు కదా అనుదినం పెరిగి పోతున్నది. 11వ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా పత్రాలు, దాని విశ్లేషణాత్మక వివరణలు, యధాపూర్వ ఆలోచనలు, వాగ్దానాలకు పరిమితమవుతున్నవి. కాని కాలం, లోకం ఆశిస్తున్న, ఆందోళన చెందుతున్న, ఉపాధి కల్పన, సమతుల సంపద విభజన లాంటి తక్షణ సమస్యలకు, సమాధాలను అందించలేకపోతున్నవి.

కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన అసంఘటితరంగ పరిశ్రమల జాతీయ కమీషన్ సమర్పించిన నివేదిక పై అనుభవాలకు అద్దం పడుతున్నది. ప్రణాళికా సంఘ ధృక్పధంలోను మౌలికమైన మార్పు రావాలని స్పష్టం చేస్తున్నది. దేశ ఆర్థిక అభివృద్ధి సాధన మాత్రమే ప్రణాళికా సంఘం యొక్క లక్ష్యం కాకూడదని, సమాజంలోని పేద, బలహీన వర్గాల పురోభివృద్ధికి అవసరమైన ఆర్థిక, సామాజిక, సృజనాత్మక చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఇది కష్టసాధ్యమే అయినా అత్యవసరమని ఉద్ఘాటించింది. నూతన ఆలోచనలు అత్యాధునిక ప్రక్రియల ద్వారా ఇవి సుసాధ్యమని స్పష్టం చేసింది. మార్కెట్ వ్యవస్థ కేవలం ధనాడ్య వర్గాలు, మధ్య తరగతి వారికి ఉపకరించినా దేశంలో అత్యధికులుగా నున్న బడుగు, బలహీన వర్గాల ఆర్థిక సామాజిక జీవన ప్రమాణాలను పెంచడంలో ప్రభుత్వం యొక్క పాత్ర అత్యంత ప్రధానమని చెప్పింది. ఆర్థిక సంస్కరణలను నిరాటంకంగా కొనసాగిస్తునే, సంస్కరణల ప్రయోజనాలు పేదరిక నిర్మూలన లక్ష్యంతో ఉండక తప్పదని తేల్చి చెప్పింది. దేశ జనాభాలో 77%గా వున్న 83 కోట్ల 60 లక్షల మంది ఆర్థికంగా, సామాజికంగా అందుబాటులోకి రాని అవకాశాలతో సతమతమవుతున్నారని; 23 కోట్ల 50 లక్షల మంది మాత్రమే తమ కాళ్ళ మీద తాము నిలబడే స్వశక్తిని సంపాదించుకున్నారని ఈ కమీషన్ సాధికారికంగా స్పష్టం చేసింది. మన ప్రణాళికలు గ్రామీణాభివృద్ధి పేరిట స్థూలంగా వ్యవసాయం, నీటి పారుదల పైన పెట్టుబడులను కేంద్రీకరించినప్పటికి ఆత్మ విమర్శనాత్మకంగా విశ్లేషిస్తే దాని ద్వారా గొప్పగా ప్రయోజనం పొందిన వారు ధనికులు, ఆస్థులు కలిగిన వారేనన్న వాస్తవాన్ని విస్మరించలేరు. రుణ సౌకర్యం రెండు, మూడు రేట్లకు పెంచబడినప్పటికీ సన్నకారు,

చిన్నకారు రైతులు నిరుపేదలు పొందిన సౌకర్యం అతి స్వల్పం. అంతే కాదు గ్రామీణ జీవితంలో స్వయం ఉపాధి రంగంలో నున్న అత్యధికులు అసంఘటిత కార్మికులు. వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికులు తదితర అనేక వృత్తులపై ఆధారపడే పారిశ్రామికులంతా ఈ ఆసంఘటిత రంగంలోని వారు. పారిశ్రామికాభివృద్ధి ఫలితాలు వీరికి దక్కడం లేదు. వీరి శ్రమశక్తికి నాణ్యత, నైపుణ్యత అను విలువలు జతపరచబడటం లేదు. అటువంటి విద్య వీరికి అందుబాటులో లేనే లేదు. అసలు మన ప్రాథమిక, మాధ్యమిక విద్యా విధానాలు ఇటువంటి సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యతలకు పూర్తిగా సంబంధం లేకుండా నుండటం ఇందుకు మూల కారణం. సగటు 25 సంవత్సరాల వయస్సు గల భారత యువతీ యువకులు 52 కోట్లుగా నున్నారు. ఇందులో అత్యధికులు కేవలం అక్షరాస్యతకు మాత్రమే నోచుకున్నప్పటికి నైపుణ్యత నందించే సాంకేతిక విద్యకు దూరంగా నుండిపోయినారు. వీరికే సాంకేతిక విద్యా గ్రంథం అబ్బియుంటే వీరు వచ్చే కొన్ని దశాబ్దాల వరకు దేశ సంపదను ఇతోధికంగా పెంచడం, దానిని పంచడంలో మొనగాళ్ళుగా నిలిచిపోతారు. దేశ దారిద్ర్యం శరవేగంగా తగ్గిపోతూ దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన తల ఎత్తుకు తిరిగే స్థితికి చేరుకుంటుంది. గత ప్రణాళికా సంఘాల నిర్వాకం వలననే ఈ దుస్థితి దాపురించింది. 11వ పంచవర్ష ప్రణాళిక చర్విత చరణంగా గత ప్రణాళికల పాటనే పాడుతున్నది. అందుకే పంచవర్ష ప్రణాళిక దిశను, లక్ష్యాలను ఆమూలాగ్రంగా సంస్కరించడం అత్యవసరం.

కేంద్ర ప్రభుత్వం మరియు ప్రణాళికా సంఘాలు ఆచరణలో పూర్తిగా విఫలత చెందుతున్న ప్రధాన అంశం పేదరిక నిర్మూలన, వారి సామాజిక భద్రత రూపకల్పన, సామాన్య ప్రజల అత్మాభిమాన పునరుజ్జీవ ప్రక్రియలో పంచాయితీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రబలమైన పాత్ర, ఏ మాత్రం తగ్గించడానికి వీలులేనిది. ''గాంధీ యుగం'' నుండి '' సమ సమాజం'' వరకు అనుదినం హోరెత్తిన ప్రచారంతో ప్రభుత్వాలు కాలక్షేపం చేస్తున్న నిజమైన వికేంద్రీకృత పరిపాలనా వ్యవస్థ ప్రజల ప్రత్యక్ష పాత్రను ఆకర్షించగలిగే పంచాయితీ రాజ్ వ్యవస్థ గురించి పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం యాధృచ్ఛికం కాదు. రాజ్యాంగ సవరణ కూడా చేయబడి దశాబ్దాలు గడిచినా ఆ దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కాలు గడప దాటడం లేదు. కారణాన్ని గ్రహించడం కష్టం కాదు. పరిపాలనా అధికారాన్ని తమ గుప్పిటిలో పెట్టుకొని దానితో తాము తమ వంధి మాగధుల స్వార్థపర ప్రయోజనాలను పరిరక్షించుకోవడం, సాధించుకోవడం, విస్తరించుకోవడం అధికార వర్గాల ముఖ్యోద్దేశం. దేశ సంపద పెరిగిపోయి దేశం వెలిగిపోతున్నదని లేక మెరిసిపోతున్నదని ప్రగల్భాలు కొట్టే పాలకులు దేశ జనాభాలో 77% నిర్భాగ్యుల జీవితాలను సౌభాగ్యవంతులను చేయగలిగే పంచాయితీ రాజ్ వ్యవస్థను కేవలం లాంఛన ప్రాయం చేస్తూ ఆచరణలో దానిని ప్రబల ప్రజాస్వామ్య

వజ్రాయుధంగా తీర్చిదిద్దడానికి ఏ మాత్రం సిద్దంగా లేరు. వీరంతా ప్రజాస్వామ్యాన్ని నమ్మిన వారు కాదు. ప్రజాస్వామ్యాన్ని అమ్ముకుని తమ దళారీ పెట్టుబడి దారీ విధానాన్ని పోషించుకునే ప్రబుద్దులు. అందుకే 3 సంవత్సరాలుగా నిర్విరామ కృషితో అసంఘటిత కార్మికులపై విశ్లేషణ నిర్వహించిన శ్రీ అర్జున్ సేన్ గుప్తా కమీషన్ పంచాయితీ రాజ్ వ్యవస్థకు ప్రాణప్రధానం చేయడం ప్రధమ కర్తవ్యంగా ప్రవచించింది.

అసంఖ్యాకంగా నున్న అసంఘటిత కార్మికులు, వారి వునికి, వారి మనస్తత్వం, వారి దీనావస్థకు సంబంధించిన అనేక వివరాలు ఈ కమీషన్ వివరించి చెప్పింది. వీరిలో  స్పష్టంగా నాలుగు విభజనలు అగుపడుచున్నట్లు వివరించింది. అట్టడుగునున్న పేదలు, పేదలు, పేదరికం అంచులోనున్న దరిద్రులు, మరియు అస్థిరత కారణంగా బ్రతుకు భారాన్ని ఈడ్వలేని మధ్య తరగతి వారు. వరుసగా వీరి తలసరి వినిమయం 9 రూపాయలు, 12 రూపాయలు, 15 రూపాయలు మరియు 20 రూపాయలు  నుండటం గమనార్హం. దేశంలో వీరి సంఖ్యా బలం 83 కోట్ల 60 లక్షలు వున్నట్లు ఈ కమీషన్ గుర్తించడం జరిగింది. ఇందులో సింహభాగం అంటే 82% దళితులు, గిరిజనులు ఇతర వెనుకబడిన తరగతుల వారు, ముస్లింలు కావడం కూడా ఆశ్చర్యకరం కాదు. వీరంతా ఈనాటి యుపిఏ ప్రభుత్వ పరిభాషలో "ఆమ్-ఆద్మి" (సామాన్య పౌరులు) అని పిలువబడే భారత పౌరులు. కటిక దరిద్ర్యం కొంతవరకు తగ్గుముఖం పట్టినా దారిద్ర్యం అంచులోనున్న వారైన పేదలు, నిరుపేదల సంఖ్య పెరిగిపోతున్నది. ఇలా పెరగడం యాధృచ్చికం కాదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ పేదల పట్ల అనుసరిస్తున్న విముఖ వైఖరి దీనికి ప్రధాన కారణం. నిధులను కేటాయించడంలో అత్యంత ప్రాధాన్య ఇవ్వవలసిన ఈ అసంఘటిత కార్మికుల శ్రమ శక్తి, పనిలేక, నైపుణ్యత లోపించి పునరుత్పత్తికి, సంపద పెంపుదలకు స్వావలంభన సమకూర్చడానికి ఏ మాత్రం ఉపకరించడం లేదు. ఉపాధి కల్పన రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేయబడ్డది. అరకొర సంక్షేమ కార్యక్రమాల కంటితుడుపు చర్యలతో సంతృప్తి పరచబడుచున్నది. దేశ సంపద, నిధుల కేటాయింపు, కాంట్రాక్టర్లు, దళారీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ప్రధానంగా ఉపయోగపడుచున్నది. పాలకులు ప్రణాళికా సంఘ "నిపుణులు" ఈ పరమసత్యాన్ని మాట వరసకు వల్లె వేసినా ఆచరణలో దీనిని సరిదిద్దలేకపోవడం జాతి దురదృష్టం.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికాభివృద్ధి పేరిట ప్రత్యేక ఆర్థిక మండలుల ఏర్పాట్ల కొరకు  చట్టబద్ద చర్యలు చేపట్టుచున్నారు. దేశ, విదేశీ పెట్టుబడిదారుల పెట్టుబడులను పెద్ద ఎత్తున  ఆకర్షించడానికి దేశ సంపదను పెంచడానికి ఉద్దేశించబడిన మంచి సూత్రాన్ని ఆచరణలో నిరర్థకం చేస్తూ వుండటం బుద్ధి జీవులు చూస్తున్న నిష్టుర సత్యం. వ్యవసాయ భూములు చౌకగా, నిర్బంధంగా  రైతుల నుండి కొనుగోలు

చేయడం మౌలిక సదుపాయాలు సమకూర్చడం పేరిట వందల, వేల కోట్ల ప్రజాధనం విచ్చల విడిగా వెచ్చించడం కార్మిక చట్టాల ఆచరణపై ఆంక్షలను విధించడం ఫలితంగా దేశ, విదేశీ ధనాఢ్య వర్గాలకు ఉచిత సేవలను అందించడం జరిగిపోతున్నది. ఇటు దేశ జనాభాలో 82%గా నున్న అసంఘటిత కార్మిక వర్గం మాత్రం క్షంతవ్యం కాని నిర్లక్ష్యానికి బలి పెట్టబడుతున్నది. ఇది కఠోర, నిష్టుర సత్యం. ఆర్థిక ప్రజాస్వామ్యం " ఆమ్ -ఆద్మీ" పట్ల ఏ మాత్రం అభిమానం వున్న ప్రభుత్వమైనా గ్రామీణ అసంఘటిత కార్మికుల నైపుణ్యత పెంచుతూ వారి ఉపాధి కల్పనకై పెట్టుబడులను వెచ్చిస్తూ వారి శ్రమ శక్తి ఉత్పాదకత, పెంచుతూ, ఫలితంగా నిజమైన మానవాభివృద్ధిని సాధించడం, పేదరికాన్ని త్వరితగతిన తగ్గిస్తూ 2020 నాటికి పూర్తిగా తొలగిస్తూ పోగలిగే గ్రామీణ ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు రూపకల్పన చేయడం అందుకు చట్టపర చర్యలు చేపట్టడం తక్షణ కర్తవ్యం. ఇటువంటి మౌలిక మార్పు అను ప్రశ్నను రాజనీతిజ్ఞత కలిగిన నాయకులు వేసుకొని సమాధానం చెప్పవలసిన ప్రధానమైన రాజకీయ కర్తవ్యం.

నూతన ఆర్థిక విధాన రూపకల్పనలో అసంఘటిత రంగ పరిశ్రమల పునరుజ్జీవనం యొక్క కీలక పాత్రపై శ్రీ అర్జున్ సేన్ గుప్తా నేతృత్వంలో నియమించబడిన కమీషన్ రిపోర్ట్ ఎత్తిచూపుతున్నది. బడ్జెట్ల కేటాయింపులలో ప్రాధామ్యతలను స్పష్టం చేస్తున్నది. సంపద పెరగగానే సంతోష పడకూడదని సర్వజన సంతోషమే నిజమైన జాతి సంపదని ఉద్ఘాటిస్తున్నది. ఆర్థిక ప్రజాస్వామ్యం సర్వ ప్రజల సమతుల అభ్యుదయాన్ని కోరి అందుకు వుద్యమించే రాజకీయ శక్తులు, వ్యక్తులు, కమీషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేయడం, గుణ పాఠాలు నేర్చుకోవడం, ఆచరించడం తక్షణ కర్తవ్యం.

దేశ సంపద వేగంగా పెరుగుతూ దేశ విదేశీ బహుళ జాతి సంస్థలతో పెనవేసుకుపోవటం, ప్రపంచీకరణ ప్రయోజనాలను ధనాఢ్య వర్గాలకే పరిమితం చేయడం నయా ఉదారవాద సిద్ధాంతం. పేదరిక నిర్మూలన సమతుల అభివృద్ధిని ఆకాంక్షించే 21వ శతాబ్దంలో ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అతివాదులతో సహా పై నయా ఉదారవాద పోకడలను ఆ సిద్ధాంతాన్ని ఓడించవలసిన తరుణం ఆసన్నమైంది. ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ వ్యాపిత మానవాభివృద్ధి సంస్థలన్నీ కూడా ఈ దిశలో అనుదినం సృజనాత్మకంగా ఆలోచించడం సంతృప్తిదాయకం. అతివాద వుద్యమాలన్నీ ఇదే దిశలో పయనించడం ప్రజల ఆత్మ విశ్వాసానికి మూలధనం. రాజకీయవాదులు వారి వారి పార్టీలు తాము నయా ఉదారవాదం, పెట్టుబడిదారీ ప్రపంచీకరణ సిద్ధాంతంతో నుంటారా లేక ప్రజాహిత ప్రజాస్వామ్య ప్రపంచీకరణ ఆధారంగా సంస్కరణల ద్వారా పేదరికాన్ని తొలగిస్తూ సమసమాజం దిశలో పయనిస్తారా తేల్చుకోవాల్సి ఉన్నది. ప్రణాళికా రచనలు చేసే మేధావులు పంచవర్ష ప్రణాళిక సంఘ సభ్యులు గత 10

పంచవర్ష ప్రణాళికల నుండి గుణపాఠాలను స్వీకరించడం, ప్రణాళిక సంఘ సభ్యత్వం, అధికార కేంద్రాలకు చేరువగా నుండే పదవీ వ్యామోహ వికారాలకు భిన్నంగా, సామాన్య ప్రజలు, శ్రమ జీవుల హృదయ స్పందనలను ప్రతిధ్వనించే నవతరంగా వెలుగొందవలసిన చారిత్రక కర్తవ్యం ప్రశ్నిస్తున్నది. ఈనాటి అభ్యుదయ ప్రజా వుద్యమాలు ప్రజలను ఈ దిశలో నడిపిస్తున్నవి. ఆశాజనకమైన ఉజ్వల భవిష్యత్తు, జనావళిని ఉత్సాహపరుస్తున్నది. కాబట్టి దేశంలో మన రాష్ట్రంలో కూడా అభ్యుదయ రాజకీయ శక్తుల మధ్య సంబంధాలు, కార్యక్రమాల గురించి పునరాలోచన, పునరేకీకరణ, అభ్యుదయం తక్షణ కర్తవ్యం.

# ద్రవ్యోల్బణం

'దీనిని ధరల పెరగడం' అంటారు. అర్థశాస్త్రం ప్రకారం 'అతి తక్కువ సరుకులను అత్యధిక ధనం వెంబడించడం'గా వర్ణిస్తారు. సామాన్యంగా డిమాండ్‌కు సరిపడ సరుకుల సప్లయి లేకపోవడం వలన మార్కెట్‌లో ఆయా సరుకుల ధరలు పెరిగిపోవడం చూస్తుంటాము. ఈ పరిస్థితి తాత్కాలికంగా కొన్ని సరుకుల కొరత వలన ఏర్పడవచ్చు. తిరిగి ఆయా సరుకులు మార్కెట్లో అవసరం వున్నంతగా లభిస్తే ధరలు పడిపోవడం సర్వసామాన్యం. ఇది ప్రపంచవ్యాప్త అనుభవం. అయితే ఇటీవల ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలోను దాదాపు అన్ని రకాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం అల్పాదాయ వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనకు గురికావడం చూస్తున్నాం. సహజంగా ప్రతి సంవత్సరం 4.5% ధరలు పెరగడం వలన గొప్ప నష్టం వుండదని అది సగటు జాతీయ ఉత్పత్తికి హానికరం కాదని అర్థశాస్త్రవేత్తల అభిప్రాయం. అసలు దేశాభివృద్ధి క్రమంలో కొద్దిపాటి ధరల పెరుగుదల అనివార్యం అని కూడా అంటారు. కానీ ఈనాడు మన దేశంలో ద్రవ్యోల్బణం (ధరల పెరుగుదల) 6 మాసాల అనతి కాలంలోనే 8.5%నికి పెరిగిపోవడం ఈనాటికి 12%నికి పెరిగిపోవడం విజ్ఞులందరినీ ఆశ్చర్యచకితులను చేస్తున్నది. ఇదే పరిస్థితి కొనసాగి ద్రవ్యోల్బణం రెండంకెలకు చేరక తప్పదని అభిప్రాయం ఏర్పడుచున్నది. ఈ ధరల పెరుగుదల కారణంగా సంభవించే ఆర్థిక, సామాజిక పరిణామాలను అర్థం చేసుకోవడం అట్టే ఇబ్బందికరం కాదు. ఈనాటి సంక్షోభం, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన దేశాలలోని బలహీనవర్గాల దయనీయ పరిస్థితులు దీనికి ప్రబల సాక్ష్యం. ఈనాటి ద్రవ్యోల్బణం విశ్వవ్యాపితమే కాక మానవ శ్రమ మూర్తీభవించే వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలను పూర్తిగా అలుముకుంటున్నది. ధరల పెరుగుదల కనుగుణంగా జీతభత్యాలు కూడా పెరిగే వర్గాలపై ద్రవ్యోల్బణ ప్రభావం అంతగా ఉండదు. కొన్ని సందర్భాలలో ధరల పెరుగుదల నెపంతో జీతభత్యాలను దామాషాకు మించినట్లు పెంచుకోవడం గమనార్హం. ప్రపంచంలోని అత్యధిక దేశాలలో స్వల్ప, అల్ప ఆదాయాలతో బ్రతుకు భారాన్ని ఈడ్వలేని అత్యధికుల జీవితాలను ద్రవ్యోల్బణం దుర్భరం చేస్తున్నది. ద్రవ్యోల్బణం పేరిట ప్రకటించబడే అంకెలు కేవలం టోకు ధరల పెరుగుదలను మాత్రమే సూచిస్తుండగా చిల్లర దుకాణాలలో ఈ సూచిక మరింత పెరిగి సుమారు రెండింతలుగా నుండడం గమనార్హం.

ఈనాటి ప్రపంచ దేశాలలో అక్కడి ఉత్పత్తి సాధనాల ద్వారా ఆయా ప్రజలు సృష్టిస్తున్న జాతీయ సంపదలోని అగాధాన్ని రేఖామాత్రంగా చూద్దాం. ప్రపంచం మొత్తంగా ప్రతి సంవత్సరం సృష్టించబడుచున్న సంపద 31 ట్రిలియన్ల డాలర్లుగా అంచనా వేయవచ్చు. (ఒక ట్రిలియన్ అనగా ఒక లక్ష కోట్ల డాలర్లయితే) ఇందులో 30 కోట్ల జనాభా కలిగిన అమెరికా దేశం ఒకటే 13 ట్రిలియన్ డాలర్ల సంపదను సృష్టిస్తున్నది. యూరప్‌లోనున్న అభివృద్ధి చెందిన దేశాలన్నీ కలిపి, సుమారు 20 కోట్ల జనాభా కలిగి మరో 13 ట్రిలియన్ డాలర్ల సంపదను సృష్టిస్తున్నాయి. చైనా దేశం 120 కోట్ల జనాభా కలిగి 1.5 ట్రిలియన్ డాలర్ల సంపదను సృష్టించగా 113 కోట్ల జనాభా కలిగిన భారతదేశం తమ వార్షిక సంపదను 1 ట్రిలియన్ డాలర్లకు పెంచుకున్నదని దేశ నాయకులు విజయోత్సాహాన్ని ప్రదర్శించారు. ఈ విధంగా సుమారు 300 కోట్ల జనాభాకు మించని 20 దేశాలు సృష్టించిన సంపద 28.5 ట్రిలియన్ డాలర్లు కాగా సుమారు మరో 300 కోట్ల జనాభా కలిగిన 166 దేశాలు సృష్టిస్తున్న వార్షిక సంపద కేవలం 2.5 ట్రిలియన్ డాలర్లు మాత్రమేనను కఠోర సత్యాన్ని దర్శించడం అత్యంత బాధాకరం. మానవ నాగరికత పరిణామ క్రమంలో దేశాల మధ్య ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు ఎంత తీవ్రంగా నున్నాయో గమనించదగినది. అనాగరిక, రాచరిక వలసవాద వర్గాలు ప్రపంచ చరిత్రను ఎన్ని వైవిధ్యాలతో నడిపించాయో గమనార్హం. ఇటువంటి వైవిధ్యభరిత ప్రపంచవ్యాపిత సమాజాలను శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సృష్టించిన ప్రపంచీకరణ ఎంతటి మంచి, చెడు పరిణామాలకు దారితీస్తుందో సులభంగానే అర్థం చేసుకోగలుగుతాము. ప్రజాహిత ప్రపంచీకరణ, వెనుకబడిన దేశాలు అక్కడి ప్రజలను త్వరితగతిన అభ్యుదయ మార్గాన్ని నడిపించడానికి ప్రబల సాధనంగా ఉంటుంది. తోటి మానవుని వెనుకబాటుతనాన్ని, అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వెనుకబడిన దేశాల ప్రజల శ్రమశక్తిని కారుచౌకగా కొనుగోలు చేసి సరుకులను ఉత్పత్తి చేస్తూ ప్రపంచ మార్కెట్‌లలో అతి ప్రియంగా వాటిని అమ్మకం చేస్తూ ధనాన్ని మూటకట్టుకునే బహుళజాతి పెట్టుబడిదారీ వర్గాల నాయకత్వంలో ఏర్పడుతున్న ఈనాటి ప్రపంచీకరణ ప్రక్రియ పై నుదహరించిన విధంగా దేశాల మధ్య, ఆయా దేశాల ప్రజల మధ్యనున్న అగాధాన్ని మరింతగా పెంచుతున్నది. సరుకుల కొరత, ఆదాయాల పెరుగుదల కారణంగా ఏర్పడుచున్న అధిక ధరల భారం ప్రపంచంలోని మూడింట రెండు వంతుల ప్రజలపై మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా నున్నది. ఆర్థిక, సామాజిక సంస్కర్తలు ముఖ్యంగా ప్రజాతంత్రవాదులైన రాజకీయ నాయకులు పై పరిణామాన్ని ఒక సవాలుగా స్వీకరించి చైతన్యవంతమైన ప్రజా వుద్యమాల బలంతో ప్రత్యామ్నాయ విధానాల ఆధారంగా పరిష్కరించవలసి యున్నది.

వ్యవసాయ, పరిశ్రమలు, సేవారంగాలలో శ్రామికులు సృష్టిస్తున్న వినిమయ సరుకులలో అధిక ధరల కారణంగా అత్యంత తీవ్రంగా ఇబ్బందులను సృష్టించేది.

వ్యవసాయ పంటల కొరత. వ్యవసాయం స్థూలంగా ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ఫలాలు, మాంసాదులతో కూడిన అమూల్యమైన భారీ పరిశ్రమ. భారతదేశంలో 65%గా ఉన్న గ్రామీణ జనాభా అందులో 75%గానున్న రైతులు, రైతు కూలీలకు ఉపాధి కల్పించే వ్యవస్థ. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలలో కేవలం జనాభాలోని 5%నికి మించకుండా వ్యవసాయ వృత్తి జీవనాధారంగా నుంటే, భారత్-చైనా దేశాలతో సహా 150 దేశాలకు మించిన ప్రపంచ దేశాలలో వ్యవసాయ వృత్తి ప్రాణప్రదం. ద్రవ్యోల్బణ ఫలితంగా వ్యవసాయ సరుకులను సరసమైన ధరలకు ఆహారాన్ని అందచేసే బృహత్తర కర్తవ్యంతోపాటు వ్యవసాయ వృత్తిని తమ జీవిత ఆధారంగా బ్రతుకుతున్న మూడింట రెండు వంతుల మానవకోటి ఆహార భద్రతతో పాటు బహుముఖ అభివృద్ధిని సాధించే విధంగా ఆలోచించి విధానపర నిర్ణయాలను ఆచరించవలసి యున్నది. ఐక్యరాజ్యసమితి మధ్యంతర నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో సగానికి సగం అంటే 300 కోట్లకు తగ్గని జనాభా అధిక ధరల కారణంగా ఆహార కొరత వాతపడే ప్రమాదం పొంచి కూర్చున్నది. అదే నివేదిక ప్రకారం ప్రపంచంలో పౌష్టికాహారం లోపం వలన ప్రతిరోజు 18 వేల మంది బాలబాలికలు మరణిస్తున్నారు. ఈ నేపథ్యంలో మన దేశంతోపాటు ప్రపంచ దేశాలలో కూడా ఆహార కొరతను తీర్చడమే కాక ఆహారాన్ని అన్ని రూపాలలో కూడా సంవృద్ధిగా ఉత్పత్తి చేస్తూ సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంచడం జాతీయ, అంతర్జాతీయ కర్తవ్యం. కొందరు అర్థశాస్త్రవేత్తలు ద్రవ్యోల్బణంనకు మూల కారణం వ్యవసాయ సరుకుల కొరతగా మాత్రమేనని వాదిస్తున్నారు. మన దేశానికి పరిమితమవుతూ ఈ వాదన ఎంతవరకు సాత్వికమో విశ్లేషించడం సమస్య పరిష్కారానికి ఆవశ్యం. ఆహార సరుకుల కొరతకు ముఖ్యకారణం స్పెక్యులేషన్ అంటారు. సరుకులను, ముఖ్యంగా ధాన్యాన్ని చౌకగా కొని నిలువచేసికొని తిరిగి మార్కెట్‌లో ధరలు పలికినపుడు వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకునే వర్తక వ్యాపారులు కొందరు లేక పోలేదు. దీనిని అరికట్టడానికి ఒకటికి మించిన చట్టాలు అమలులోనున్నవి. వాటిని అధికారగణం చిత్తశుద్ధితో అమలు పరిచి అధిక ధరలకు అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఎల్లప్పుడూ వున్నదే. ఈనాడు మరింత పట్టుదలతో ఆ చట్టాలను అమలు పరచడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం. అత్యంత అసక్తికరమైన అంశం అమెరికా అధినేత జార్జిబుష్ గారు స్వయంగా నొక్కి వక్కాణించిన విషయం. భారత్-చైనా దేశస్థులు వేగవంతంగా వెలుగొందుతున్న వార్షిక జాతీయ ఉత్పత్తుల పెరుగుదల కారణంగా తమ ఆహార అలవాట్లను మార్చుకుంటున్నారని, చిరు ధాన్యాలను భుజించే వారు మాంసాహారానికి మళ్ళి పోతున్నారని వారి ఉవాచ. మాంసాహారానికి అవసరమైన పశుపోషణ కొరకు సామాన్యంగా భుజించే ధాన్యానికంటే సుమారు 6 రెట్ల ధాన్యం అవసరమవుతుందని, ఫలితంగా ఈ దేశాలలో ఏర్పడుచున్న ఆహార కొరతతో పాటు ప్రపంచవ్యాపిత ఆహార కొరతకు కూడా కారణభూతమవుతున్నదని వారి అభిభాషణ.

జార్జిబుష్ గారి వాదన స్థూలంగా పాక్షిక సత్యాన్ని మాత్రమే తెలియచేస్తున్నది. భారత్-చైనా దేశాలలో కష్టజీవులు వెనకటి లాగా చెమటలు కార్చే కాయ కష్టాన్ని ఇదివరకు చేసినంతగా చేయనవసరం లేకుండా పోయింది. దీనికి కారణం క్రమంగా వ్యవసాయంలో చోటు చేసుకొంటున్న వ్యవసాయ యంత్రాలు, శ్రామికులు కొంత విశ్రాంతిగా వ్యవసాయం చేస్తున్నందుకు సంతోషించదగినది. కాయకష్టానికి అవసరమైన కేలరీలు అవసరం కొద్దిగా తగ్గుచున్నవి. దానికి బదులుగా కూరగాయల వాడకం, పాలు పెరుగు మాంసాదుల వాడకం కొంత వరకు పెరిగింది. గత శతాబ్ది ఎనిమిదవ దశకంలో భారత పౌరులు ప్రతి సం॥ 178 కిలో గ్రాముల ఆహార ధాన్యాలను వినియోగించగా 2006 సం॥రానికి అది 156 కిలో గ్రాములకు తగ్గినట్లు అంకెలు నిర్ధారిస్తున్నవి. చైనాలో కూడా ఆహార ధాన్యాల వాడకం, పశు ఆహారంతో సహా 1996లో 2428 కేలరీలు బలాన్ని సృష్టించేదిగా ఉండి ఆ తర్వాత సం॥లలో అది 2268 కేలరీలకు ఈనాటికి తగ్గింది. కాబట్టి ఆహార అలవాట్లలో వచ్చిన మార్పు ఆహార పంటల ఉత్పత్తి కొరతకు లేక వాటి ఎగుమతి కొరతకు కారణంగా చెప్పడం హాస్యాస్పదం.

భారతదేశం 2001-02 నకు 212 మి. టన్నుల ఆహార ధాన్యాన్ని ఉత్పత్తి చేయగా ఇది గత కొన్ని సం॥లలో తగ్గిపోతు వుండడం ఆందోళనకరంగా నున్నది. 2002-03 సం॥లో 174.8 మి. టన్నులు, 2003-2004లో 213.2 మి. టన్నులు, 2004-05లో మరింత తగ్గి 198.4 మి. టన్నులు, 2005-06లో 208.6 మి. టన్నులు, 2006-07లో 213 మి. టన్నులకు చేరింది.2007-08 సం॥ ఈ ఉత్పత్తి పెరిగి 227 మి.టన్నులకు చేరుతుందని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నది. పై పరిస్థితి నిజంగా ఆందోళనకరం.

ఆహార ఉత్పత్తి దాదాపు స్తంభించినట్లు తీవ్రమైన కొరత ఏర్పడబోతున్నట్లు సులభంగా గ్రహించవచ్చు. చైనా పరిస్థితి కూడా అంతబాగాలేదు. 20 సంవత్సరాల కింది నాటికి ఆహార ధాన్యాల ఉత్పత్తి పూర్వం కంటే 40% పెరిగితే ఇటీవల ఈ పెరుగుదల 7.5 శాతానికి పరిమితం కావడం అక్కడి ప్రభుత్వం ఆందోళన చెందుచున్న వాస్తవం. సత్యం ఇలా వుంటే జార్జిబుష్ గారు దీనిని వక్రీకరించడం ఆశ్చర్యకరం. న్యాయంగా అమెరికా దేశంలో స్థూలకాయం గల వారి సంఖ్య దినదినం పెరిగిపోతున్నది. మాంసాహార ప్రాధాన్యం దీనికి మూలకారణమని అక్కడి ప్రజలు ధాన్యాదులు, కూరగాయాలను తమ ప్రధాన ఆహార వస్తువులుగా పెంచుకోవాలని అక్కడి ప్రజారోగ్య నిపుణులు చాలాకాలంగా వాదిస్తున్నారు. సాధారణ అమెరికన్ పౌరులు తాను భోంచేసిన పదార్థంలో 30 శాతాన్ని మాత్రమే జీర్ణించుకో గలుగుతున్నాడని ఆహారంలోని చాలాభాగం అనవసరంగా తీసుకుంటున్నాడని వారి అభిప్రాయం. దీని ద్వారా పేద దేశాల ప్రజలు పౌష్టికాహారం లోపం వలన అర్థాయుష్కులవుతుంటే, ధనిక దేశాల పౌరులు అనేకులు ఆహారాన్ని అతిగా తీసుకోవడం వలన అర్థాయుష్కులవు

చున్నారని స్పష్టమౌచున్నది. ఏది ఏమైన జార్జిబుష్‌తో సహా రాజకీయ వేత్తలు అర్థశాస్త్ర నిపుణులు సమతుల ఆహారం గురించి సమతుల వాణిజ్య వ్యాపారం గురించి తమ పరిణత భావాన్ని వెలిబుచ్చుతూ ఆచరించడం ఈ శతాబ్దపు కర్తవ్యం.

మరోక మౌళిక కారణం ఈ ఆహార కొరతకు కొందరు నిష్ణాతులు చూపెడుతున్నారు. అసలు వ్యవసాయం మించరాని పరిమితికి చేరుకున్నదని ఆ పరిమితిని దాటితే పర్యావరణ సమతులం పూర్తిగా తారుమారవుతుందని, మానవ కోటి మనుగడకే అది హానికరమని వారి విశ్లేషణ. ఇందులో కూడా సత్యం కొంత మాత్రమే వున్నట్లు అనుభవజ్ఞులు నమ్మచెప్పుచున్నారు. వ్యవసాయ వ్యాప్తికి, భూమి వాడకానికి పరిమితులు నుండవలసినదే. అటవి సంపద, అడవి జంతువుల పరిరక్షణ జాతి కర్తవ్యం. అంతమాత్రాన వ్యవసాయ పంటల ఉత్పత్తి అపరిమితమైనదని కాని, సాగులోనున్న భూమిని సంపూర్ణంగా వినియోగిస్తున్నామని కాని అర్థముకాదు. దేశంలో ఇంకా కోట్లాది ఎకరాల సాగులాయకు భూమి సాగులోకి తేబడలేదు. సాగులోనున్న భూమిలో సగానికి మించిన భూమికి వర్షాదారం తప్ప శాశ్వత జలాధారలు లేవు. సాగు చేయబడుతున్న భూమి కూడా అత్యధిక భాగం మాంధాతల నాటి వ్యవసాయ పద్ధతుల ఆధారంగా కొనసాగుచున్నది. ఆధునిక వ్యవసాయం కొరకు వాటర్‌షెడ్‌లు, చిన్న నీటి వనరుల నిర్మాణం ప్రాణప్రదం. వాటి వలన భూసార సంరక్షణ భూగర్భ జల పరిరక్షణ నిరంతరాయంగా కొనసాగుచున్నది. మేలురకం విత్తనాల వాడకం, రసాయన, జీవ సాంకేతిక ఎరువుల వాడకం వ్యవసాయ యంత్రాల ఉపయోగం పంటలు పరిరక్షణ అంతే ప్రధానం. ఇటువంటి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులననుసరిస్తేనే ఉత్పాదకత పెరిగి ఉత్పత్తి ఇనుమడిస్తుంది. మన దేశంలో వ్యవసాయ పంటల దిగుబడి సరాసరి అభివద్ధి చెందిన దేశాలతో పోల్చగా సగంకాదు కదా 3వ వంతుకూడా లేకపోవడం యాదృశ్చికం కాదు. సిద్ధాంతాలు ఎన్ని ప్రవచించినా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో ఈ రంగానికి కేటాయించబడిన మొత్తాలు అతిస్వల్పం. పాలక వర్గాలు ప్రజల ఆహార భద్రత, గ్రామీణ రైతులు, రైతుకూలీల ఉపాధి భద్రతకు తగినంత ప్రాధాన్యతను ఇవ్వడం లేనట్లు ఘంటాపథంగా రుజువవుచున్నది. వారి దృష్టి పట్టణాలు, అక్కడి ధనిక వర్గాల ప్రయోజనాలను అధికంగా ఆకర్షిస్తున్నట్లు బడ్జెట్ కేటాయింపులు ఋజువు చేస్తున్నవి. అన్నింటికి మించి ఆహార కొరతకు మూలకారణం ఉత్పత్తి దారులైన రైతులు అనుభవిస్తున్న కఠిక దారిద్ర్యం. రైతుపండించిన పంటలకు ధరలను నిర్ణయించే సందర్భంలో రైతుపెట్టే పెట్టుబడులన్నీ తిరిగి రావడంతో పాటు సమాజంలో రైతు సగౌరవంగా బ్రతకడానికి అవసరమైన ఖర్చులను కూడా జతపరచవలసియుంటుందని, రైతు ప్రతి సంవత్సరం నిర్భయంగా తన కృషికి సరిపోయే విధంగా డబ్బును ఆదా చేసుకోగలిగే విధంగా నిర్ణయాలు జరగాలని స్వాతంత్రానంతరం నుండి ఈనాటి వరకు వ్యవసాయ అర్థశాస్త్రవేత్తలు రైతు ఉద్యమ నాయకులు నిరంతరాయంగా

పోరాడుచున్నారు. రైతు మాట వినిపించుకునేవాడు లేడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వంచే నియమించబడిన స్వామినాథన్ కమీషన్ నివేదికను కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టడం, ప్రక్కన పెట్టడం క్షంతవ్యం కాని సామాజిక నేరం.

ప్రజాస్వామ్యం, రైతుస్వామ్యంలో ఏర్పడబోయే ప్రభుత్వాలు ఈ ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలని గౌరవిస్తాయని ఆశించవచ్చును. కాబట్టి ఈనాటి ఆహార ఉత్పత్తుల కొరత అధిక ధరల సంక్షోభానికి, వ్యవసాయ ఉత్పత్తుల కొరత కారణంగా కనబడుచున్న ద్రవ్యోల్బణ సమస్య శాశ్వత పరిష్కారానికి మరో హరిత విప్లవం, నిరంతర హరిత విప్లవం ఏకైక పరిష్కారం. వ్యవసాయ ఉత్పత్తులు గానీ, పారిశ్రామిక ఉత్పత్తులు గానీ సేవా రంగ ప్రయోజనాల అభివద్ధి గానీ దేశ సంపద పెరుగుదలలో సముచిత భాగాలలో ప్రతిభింబించవలసిన అవసరం అత్యంత ప్రధానం. ఈ నాటి ప్రపంచీకరణ ఫలితంగా ప్రపంచంలో ఏ మూలలో ఏ వస్తువు కొరతగా నున్న దాని ప్రభావం ప్రపంచ వ్యాపితం చేయడానికి ముఖ్యంగా బలహీన దేశాలలోని బలహీన వర్గాలు బలిపెట్టడానికి ధనమదం కలిగిన బహుళజాతి సంస్థలు నిద్రాహారలు లేకుండా కృషి చేస్తున్నాయి. దీనిని తట్టుకోవడానికి దేశంలోని పాలక వర్గాలు, రాజకీయ పార్టీలు, దేశభక్తియుత జాతీయదృక్పథాన్ని ప్రదర్శించవలసియున్నది. స్వయం ఉపాధికల్పన, స్వావలంబన దేశ ఆర్థిక స్వతంత్రత లక్ష్యాలలో ఒకేమాట, ఒకేబాటలో నడవవలసిన కర్తవ్యమున్నది. ప్రధాన మంత్రిగారు క్రూడాయిల్ ధరల పెంపుదలను సమర్థిస్తూ చేసిన ప్రసంగం ఆసక్తిదాయకం. ధనవంతులు తమ ధనాన్ని పునరుత్పత్తికి భావితరాలు సంక్షేమ కార్యకమానికి మళ్లించాలని, ఇంధన వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని, వృధా ఖర్చులను తగ్గిస్తూ విలాసవంత వస్తువాహనాల కొనుగోలును తీవ్రంగా తగ్గించాలని చెప్పిన విషయాలన్నీ భారతీయ సంస్కృతి సాంప్రదాయలకు ముఖ్యంగా జాతిపిత మహాత్మా గాంధీగారి ఉద్భోధనలకు పూర్తిగా అనుకూలంగా నున్నవి. అయితే ప్రధాన మంత్రిగారు నాణానికి ఒక పార్శ్వాన్ని మాత్రమే ఉల్లేఖించారు. మన ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టబడీదారీ ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా కుప్పలు, కుప్పలుగా చేరిపోతున్న విదేశీ ద్రవ్యం దానిపై నియంత్రణ స్వదేశీ ప్రణాళిక బద్ధ అభివృద్ధి పథంలో ఈ విదేశీధనాన్ని ఉపయోగించు లక్ష్యాల గురించిగాని, కర్తవ్యాల గురించి గానీ మౌనముద్ర దాల్చారు. దేశంలో పెరిగిన ద్రవ్యోల్బణం లేక అధిక ధరలలో ఆహార ధాన్యాల కొరత కారణంగా పెరిగినది 6-7 శాతానికి మించినది కాదని అర్థశాస్త్రవేత్తలు విశ్లేషించి చెప్పుచున్నారు. దేశ సంపదలో కేవలం 18% వాటా కలిగిన వ్యవసాయ రంగం ధరలు పెరుగుదలకి మూల కారణమని చెప్పుకోవడం అశాస్త్రీయం. పారిశ్రామిక ఉత్పత్తులు, సేవారంగాల కార్యక్రమాలు అత్యంత ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. అందులో దేశ, విదేశీ కార్పోరేట్ సంస్థలు కలిసి కొకోల్లలుగా దేశ విదేశీ బ్యాంకుల ద్వారా పెట్టుబడులు సమకూర్చుకుని అతి ఉదారంగా నిర్వహిస్తున్న వాణిజ్య

వ్యాపార కారణంగా ధరల పెరుగుదల అదుపు లేకుండా కొనసాగుచున్నది. మన దేశ జనాభాలో 78 కోట్ల మంది రోజుకి రూ. 20లకు మించని ఆదాయంతో బ్రతుకు భారాన్ని ఈడ్చుచున్నారని అర్జున్ సేన్ గుప్తా కమిటీ ఇటీవలనే సమర్పించిన రిపోర్ట్ స్పష్టం చేస్తున్నది. వీరిలో ఎవరూ కూడా సరుకుల ధరలు పెంచి విలాస జీవితాలు అనుభవించేవారుండరు. మిగతా 30 కోట్ల మంది ప్రజలు తమ ఆదాయాలలో తరతమ తేడాలున్నప్పటికీ తాము సంపాదిస్తున్న అదనపు ఆదాయంతో విలాసవంతమైన జీవితాలు గడపడానికి ఆస్తులు సంపాదన, వాహనాల కొనుగోలు, విలాస వంతమైన జీవిత విధానాలతో మార్కెట్లను శాసిస్తున్నారు. కాబట్టి మన దేశంలో ధరల పెరుగుదల, ఆహార ఉత్పత్తుల కొరత కంటే ధనాఢ్యుల అవసరాల కారణంగా ఏర్పడుతున్నట్లు కళ్ళకు కట్టినట్లే కనబడుచున్నది. దీనినుండి బయటపడాలంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇంతవరకు తీసుకున్న చర్యలు అనగా విదేశీ సరుకుల దిగుమతిపై సుంకాల తగ్గించడం, స్వదేశీ వస్తువుల ఎగుమతిపై సుంకాలు పెంచడం, బ్యాంకు రుణాలపై వడ్డీలు పెంచడం లాంటివి పరిష్కరించజాలవు. అవికూడా పారిశ్రామిక సేవా రంగాలలో ఉత్పత్తిని, ఉత్పాదకతను ఏమాత్రం తగ్గించకుండా వుండే విధంగా జాగ్రత్త పడవలసియున్నది. ఉత్పత్తి పెరుగుదల ధరల పెరుగుదలకి దివ్వ ఔషదం. దేశ సంపద సృష్టికర్తలైన రైతు కూలీల ధరలు జీత భత్యాల రూపంలో పునః పంపకం అయ్యే విధంగా చట్టబద్ధమైన రాజకీయ పరమైన నిర్ణయాలను చేసి ఖచ్చితంగా అమలు పరచాలి. ద్రవ్యోల్బణం విదేశాల నుండి దిగుమతి చేయబడుతుందనే వాదన కూడా వున్నది. అదికూడా పాక్షిక సత్యం.

దేశ ప్రభుత్వం ఈ సంక్లిష్ట పరిస్థితులలో రాజకీయ సంకల్ప బలంతో అన్ని రాజకీయ పక్షాల ఏకాభిప్రాయంతో మనదేశ ఉత్పత్తి సాధనాలను సంపూర్ణంగా ఉపయోగిస్తు ఉత్పత్తిదారులను సమన్వయం చేస్తూ క్రియాశీల చర్యలను చేపట్టక తప్పదు. అందుకు ప్రగతిశీల అభ్యుదయ శక్తులు, వ్యక్తులు ముందడుగు వేయకతప్పదు. మనకు తల మానికంగా నున్న ఒకచిన్న దేశం భూటాన్‌ను దర్శించిన మన ప్రధాన మంత్రి గౌరవనీయులు మన్‌మోహన్ సింగ్‌గారు అత్యంత ఆసక్తి దాయకమైన సత్యాన్ని వెలిబుచ్చారు. అక్కడి ప్రజలు, ప్రభుత్వము అధికారికంగా సామాన్య కుటుంబ జీవితంలో వికసించే సంతృప్తిని, సంతోషాన్ని తమ దేశ ప్రగతిని కొలమానంగా గుర్తిస్తారట. ఈ పరమ సత్యం యావత్ ప్రపంచానికి వర్తిస్తుంది. మనదేశం మరియు పాకిస్తాన్‌కి కీర్తి కిరీటాన్ని సంపాదించి పెట్టిన అర్థశాస్త్రవేత్తలు అమర్త్యసేన్ మరియు కీ॥శే॥ మక్బూల్-ఉల్-హక్ గారలు దీనినే ఒక సిద్ధాంతంగా ఆవిష్కరించారు. మన ప్రధాని దీనిని ఆచరిస్తారని ఆశించవచ్చునా?

సరుకుల కొరత - నోట్ల ముమ్మరం: ధరల పెరుగుదల రూపంలో అల్పాదాయ

వర్గాల నిజ జీవితంలో దుర్భర దారిద్ర్యాన్ని సృష్టిస్తున్న సత్యాన్ని చూస్తున్నాం. పెట్రోలు ధరలు ఆరు మాసాల అనతి కాలంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగి పావడం కారణంగా దాని ప్రభావం అనివార్యంగా ధరల పెరుగుదలకు దారితీసిందని గౌ॥ ఆర్థిక శాఖా మాత్యులు, ప్రధాన మంత్రిగారు నమ్మబలుకు తున్నారు. ద్రవ్యోల్బణం ఈనాటికి రెండంకెలకు (12 శాతం) దాటి అన్ని రకాల సరుకుల ధరల పెరుగుదల రూపంలో జనజీవితాన్ని మరింత దుర్భరం చేయడం ఆర్థిక సంక్షోభానికి ప్రబల సంకేతం. గతనాలుగు సంవత్సరాలుగా సగటు జాతీయాభివృద్ధి రేటు క్రమంగా 8-9 శాతానికి పెరిగినట్లు అగుపడినా, ఈ దరల పెరుగుదల ఫలితంగా సంపద పంపకంలో, అనుభవంలో అత్యంత ఆశ్చర్యకర అంతరాలు ఏర్పడుతున్నవి. పేదరికం పెరిగిపోతున్నది. దీన్ని నివారించడానికి వ్యవసాయ పారిశ్రామిక, సేవా రంగాలలో ఉత్పత్తి, ఉత్పాదకతలను నిరంతరాయంగా పెంపొందిచడానికి కృషిచేయడంతోపాటు స్వదేశంలో నోట్ల ముద్రణ, ధన ప్రవాహాన్ని అరికట్టడానికి కూడా కఠిన చర్యలు చేపట్టక తప్పదు. విదేశీ నిధులు డాలర్ల రూపంలో, మన ఆర్థిక రంగాలలో పెట్టుబడి రూపంలో కుప్పలు కుప్పలుగా వచ్చిపడుతుండడం ఇదివరకెన్నడూ లేని పరిణామం. ఆ డాలర్లను మార్చడానికి స్వదేశీ కరెన్సీని అధికంగా అచ్చువేయక తప్పడంలేదు. ఏది ఏమయినా జాతీయ సంపద ప్రమాణం, నోట్ల ముద్రణ వాటి చలామణి ప్రమాణాల మధ్య ఒక ఆరోగ్యకర నిష్పత్తిని ఏర్పాటుచేస్తూ దాన్ని నిలకడగా నుండే విధంగా నియంత్రించే బాధ్యత రిజర్వుబాంకు వారిపైనుంటుంది. ఈ నిష్పత్తి అపరిమితంగా పెరిగిపోతున్నట్లు అందుతున్న తాజా సమాచారం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నది. 2005 - 2008 మధ్యకాలంలో స్వదేశీ నోట్ల ముద్రణ పెరిగింది. విదేశీ ద్రవ్యం యొక్క రాబడి గూడా గణనీయంగా పెరిగింది. డాలర్లను రూపాయలుగా మార్చడానికి మరిన్ని రూపాయలు ముద్రించడం జరిగింది. పై రెండు సంవత్సరాల అనతికాలంలో సరుకుల పెరుగుదల పెద్దగా పెరగలేదు కాబట్టి అతి తక్కవ సరుకులను అతి ఎక్కువ ధనం వెంటాడే సూత్రం అక్షరాల అమలు జరిగింది. దీనికి తోడు ఇంధన ధరల పెరుగుదల అగ్నికి ఆజ్యం పోసినట్లు పరిణమిస్తున్నది. పరిస్థితి విషమించి పాలక వర్గాలకు కొరకరాని కొయ్యగా తయారైంది. అర్థశాస్త్ర వేత్తల అభిప్రాయం ప్రకారం, కేంద్ర ప్రభుత్వం వద్ద పేరుకుపోతున్న ద్రవ్య నిధులను దేశ ఆర్థిక సౌష్టవాన్ని సాధించే అప్పులు, వడ్డీలు తీర్చడానికి వినియోగించి యుంటే మార్కెట్లో డబ్బు చలామణి ఇంతగా పెరిగేది కాదు. దాని బదులు రాజకీయ లబ్ధి పొందే ఆశతో గ్రామీణ పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన నెపంతో ప్రతిఫలాన్ని, సంపద సృష్టికి ముడిపెట్ట కుండా ధన ప్రవాహాన్ని నిర్వహించడం కూడా జరుగుతున్నది. ద్రవ్య చలామణికి తగిన సరుకుల ఉత్పత్తి పెరగని కారణంగా ధరల పెరుగుదల ఆర్థిక అసమానతలను మరింత బాధాకరంగా పెంచేస్తున్నది. ఆర్థిక ద్రవ్య విధానాల నిర్వహణ బాధ్యులు తమ బాధ్యతను పూర్తిగా, ఆర్థిక సమతుల్యాన్ని సాధించే లక్ష్యంతో నిర్వహించడం తక్షణ అవసరం.

ధరల పెరుగుదల ప్రహసనాన్ని ఒక అర్థశాస్త్రవేత్త ఎస్.ఎస్. బాగయ్ గారు ఆశ్చర్యకర వాస్తవాలను కండ్లకు కట్టినట్లు చూపెడుతున్నారు. 1947 నుండి ఈనాటి వరకు భారత దేశ సగటు జాతీయఉత్పత్తి 15 రెట్లు పెరిగితే నోట్ల చలామణి ఇదే కాలంలో ఘోరంగా 462 రెట్లు పెరిగింది. దీని ఫలితంగా ధరల పెరుగుదల 51 రెట్లు పెరిగింది. రూపాయి విలువ 98 శాతానికి పడిపోయింది. 1980కి పూర్వం గత శతాబ్దికాలంలో రూపాయలలో ధనం క్రమంగా 12382 కోట్లకు పెరిగింది. కాని 1980 తర్వాతి 28 సంవత్సరాల అనతికాలంలో ఈ ధనం 602706 కోట్లకు చేరుకున్నది. 1857-1939 మధ్య 82 సంవత్సరాల బ్రిటీష్ వారి కాలంలో ధరల పెరుగుదల కేవలం 3 రెట్లు పెరిగింది. ప్రపంచీకరణ, సరళీ కరణ యుగారంభంలో ఒక అభివృద్ధి చెందుతున్న భారతదేశ ఆర్థిక స్థితిగతులు ఇంతగా తమ సమతుల్యాన్ని కోల్పోవడం ఘోరం. అర్థశాస్త్రవేత్తలు శక్తి  సామర్థ్యాలకు ఒక గొప్ప సవాలు.

# ప్రజల సాధికారత - పరిపాలన వికేంద్రీకరణ

ఆరు దశాబ్దాల స్వతంత్రం తర్వాత గూడా భారతావని కటిక దారిద్ర్యంతో నాగరిక ప్రపంచంలో తల ఎత్తుకొని తిరగలేని దౌర్భాగ్య సరిస్థితి కొనసాగడం పౌర సమాజానికి సిగ్గుచేటు. వంద పదమూడు కోట్ల జనాభాలో 80 కోట్ల పట్టణ గ్రామీణ నిరుపేదలు రోజు తలసరి కేవలం 20 రూపాయల ఆదాయంతో జీవిస్తుంటే మిగతా 33 కోట్లలో అత్యధికులు మధ్య తరగతికి చెంది బ్రతుకు పోరాటంలో ఈతి బాధలనుభవిస్తున్నారు. ఇందులో కొందరు కోట్లకు పడగలెత్తి విలాసవంత జీవితాలతో కులుకు తున్నారు. 45 లక్షల కోట్ల రూ॥కు దాటిన దేశ వార్షిక సంపదలో సింహభాగాన్ని తోటి ప్రజల కనీస అవసరాలకు కాకుండా, పట్టణాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, పేరిట ధనాఢ్య వర్గాల స్వంతం చేసుకుంటున్నాయి. సగటు వార్షిక జాతీయ ఆదాయం 8-9 శాతం పెరుగుతున్నప్పటికి అంతకు మించిన అనగా టోకు ధరలు 12%; రిటైల్ ధరలు 25%కు తగ్గకుండా పెరుగుతున్న నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా పేదరికం ఏ మాత్రం తగ్గడం లేదు. మధ్య తరగతికి చెందిన వారు కూడా పేదవాళ్లుగా మారి పోతున్నారు. మన దేశ సంపద పెరుగుదల ఒక ప్రహసనంగా పరిణమించింది. ధనికులు పేదల మధ్య అంతరం వివిధ రాష్ట్రాలు, రాష్ట్రాలలో వెనక బడిన ప్రాంతాలలోని వెనకబాటుతనం గూడా పెరిగిపోతున్నది. గ్రామాలు, పట్టణాల మధ్య వ్యత్యాసాలు అసాధారణంగా పెరిగిపోతున్నవి. ప్రజల కనీస జీవితావసరాలు, పరిశుభ్రమైన మంచి నీటి సరఫరా, మురికి వాడల నిర్మూలన, ప్రజారోగ్యం, పాఠశాలల పనితనం ప్రయాణ, రవాణా సౌకర్యాలు తదితర సదుపాయాలు ఇంకా అందని చందమామగా మిగిలిపోవడం మన రాజకీయ వ్యవస్థ నిర్వాకాన్ని కండ్లకు కట్టుచున్నది.

ఇంతటి వెనకబాటు తనానికి ప్రధాన కారణం ప్రజలను సాధికారులను చేయనిరాకరించడం. యుగయుగాల రాచరిక, భూస్వామ్య, పెద్దరిక పరిపాలనకు అలవాటుపడిన రాజకీయ నాయక గణం పాలనాధికారున్ని కొందరి గుప్పెట్లో పెట్టుకోవడం జరుగుత్నుది. దీనిని ప్రజాస్వామ్య పరిపాలనగా పరిహసించడం, వంచించడం జరిగిపోతున్నది.

1993లోనే మన రాజ్యాంగ 73-74వ సవరణల ద్వారా వికేంద్రీకరణ సిద్ధాంతాన్ని చట్టబద్ధం చేసింది. దీని ఫలితంగా ప్రజల మౌలిక సదుపాయాలు రోడ్లు, నీరు,

ఆరోగ్యం, పారిశుద్యం, చెత్తా చెదారాన్ని తొలగించడం, పర్యావరణ పరిరక్షణ, విద్య, సాంస్కృతిక కర్తవ్యాలు, మురికి వాడల నిర్మూలన, వీధి దీపాలు, వీటన్నిటి నిర్వహణ బాధ్యతలు పంచాయితీలు, పురపాలక సంఘాలకు హస్తగతం చేయడం జరిగింది. మూడంచెల ప్రజాస్వామ్య పరిపాలన వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక స్వపరిపాలనకు అంతే ప్రాధాన్యత నివ్వడం జరిగింది. 15 సంవత్సరాలు గడిచినా అధికారాన్ని నిర్వహిస్తున్న రాజకీయ పార్టీలు రాజ్యాంగం నిర్దేశించిన వికేంద్రీకరణను ఆచరణలో తృణీకరిస్తున్నాయి. పంచాయితీ రాజ్ వ్యవస్థకు విధులుగాని, నిధులను గాని మళ్లించడానికి నిరాకరిస్తున్నవి. రాజ్యాంగ బద్ధంగా ఏర్పరచబడిన స్టేట్ ఆర్థిక కమీషన్ పనిని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ సర్వాధికారాలను వివిధ శాఖలద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది. పూర్వం 8-10 శాఖలుగానున్న ప్రభుత్వం మంత్రుల కనుగుణ్యంగా 40 శాఖలుగా పరిపాలన వ్యవస్థను విస్తరించడం క్షంతవ్యంగాని ఇష్టారాజ్యం. గంపెడు ఆశలతో ప్రజల మన్ననలను పొందిన సర్పంచ్. ఎంపిటిసి, జిల్లా పరిషత్తు గౌరవ సభ్యులు సామాన్య గ్రామీణ అవసరాలు తీర్చె నిధుల కొరకు శాసన సభ్యులు, మంత్రుల చుట్టూ ప్రదక్షణాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించినట్లుగా మారింది. మంత్రులు, శాసన సభ్యులు, తమ రాజకీయ ప్రయోజనాల కొరకు ప్రజా ప్రతి నిధులను నానా ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ పవిత్రతను కలుషితం చేయడం అత్యంత విడ్డూరం. 15-20 లక్షల కోట్లకు తగ్గకుండా, ఇంకా దినదినం పెరిగిపోతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బడ్జెట్లలో కనీసం 50 శాతం నిధులు పంచాయితీ రాజ్ వ్యవస్థలకు మళ్లించవలసియుండగా ఈనాడు నామ మాత్రమైన విధుల నిర్వహణ పేరిట కేవలం 7 శాతానికి మించకుండా ఇవ్వబడుచున్నవి. అవి వారి జీతభత్యాలకు గూడా సరిపడవు. కేరళ రాష్ట్రంలో విధులు, నిధులు మళ్లింపు సత్ఫలితాలనిస్తున్న అనుభవం అందరికి ఆదర్శం. విద్యా వ్యాప్తి అధికంగా నున్న కారణంగా కేరళలో వికేంద్రీకరణ ప్రక్రియ విజయవంతమవడం హర్షదాయకం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు పన్నుల ద్వారా ముఖ్యంగా వ్యాట్ ఫలితంగా ఆదాయాలు గణనీయంగా పెరగడం గమనార్హం. ఇందులో నుండి తమ శాఖలకు కేటాయింపులు, అప్పులు, వడ్డీలు చెల్లించిన తర్వాత గూడా దేశ వ్యాపితంగా పంచాయితీ రాజ్ వ్యవస్థలకు 50000 కోట్ల నుండి లక్ష కోట్ల రూపాయల నిధులను కేటాయించవచ్చును. సగటు గ్రామానికి 10 లక్షల రూపాయలు తగ్గకుండా నిధులను మళ్లించవచ్చును. దానికి తోడు ఆయా వ్యవస్థలు పన్నుల ద్వారా ఇతోధికంగా నిధులను సమకూర్చుకోవచ్చును. ఈ విధంగా గ్రామీణ స్వపరిపాలన అర్థవంతం, ప్రజల జీవితాలు సంతోషదాయకం కాక తప్పదు. గ్రామీణ ప్రజలలో ఈనాడు కనబడుచున్న రాజకీయ అనిశ్చితి, అవిశ్వాసం, నిరాశ నిస్పృహలు తొలగిపోవడానికి దారులు సుగమంకాక తప్పదు. అసమాన అభివృద్ధి కారణంగా ఏర్పడి యున్న ప్రాంతీయతత్వం పూర్తిగా

తొలగిపోవడానికి ఎంతగానో వీలుకలుగుతుంది. ప్రజలు తమచేతులారా తమ తమ మౌలిక సదుపాయాలను నిర్మించుకుంటూ వాటిని సంరక్షించుకునే స్వావలంబన మనస్తత్వం వేళ్లూనుకుంటుంది. ప్రజలు, ప్రభుత్వం బాగస్వాములుగా మారిపోయి బడుగు బానిస భావదాస్యం నుండి విముక్తిని పొందుతారు. స్వతంత్రతా ప్రాణవాయువును పీల్చుకుంటూ మానసిక వికాసాన్ని పొందగల్గుతారు. అప్పుడే ప్రజాస్వామ్యం ప్రజల జీవితంలో సుఖశాంతులను సమకూర్చె ప్రజల సామాజిక వ్యవస్థగా పరిఢవిల్లుతుంది. ఈ విప్లవాత్మక మార్పులు లేకుండా అధికార బృందం ద్వారా అనధికార నాయకులు దాతలుగా వ్యవహరించినా, ప్రజా బాహుళ్యంలో అసంతృప్తి జ్వాలలు చల్లారవు. ఏదో ఒక రూపంలో వేర్పాటు వాదం విభజన వాదం రూపాలలో పెల్లుబుకుతుంటాయి. చివరకు లక్షలాది అమరవీరుల త్యాగంతో సాధించబడిన స్వాతంత్రం, రాజ్యాంగ నిర్వీర్యం, నిరర్ధకంగా మారి అరాచకం దాపురించే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి ముఖ్య మంత్రులు ప్రతి సార్వత్రిక ఎన్నికలకు ముందు వికేంద్రీకరణ వ్యవస్థ విధాన పత్రంపైననే తమ మొదటి సంతకం ఉంటుందని చేసే ప్రతిజ్ఞలు ఉత్తర కుమార ప్రతిజ్ఞలుగా మారిపోకుండా ప్రజలు జాగ్రత్త పడాలి. తమ సుసంఘటిత ఉద్యమబలంతో రాజకీయ నాయకత్వాన్ని కర్తవ్యోన్ముఖులను చేయాలి.

వికేంద్రీకరణ ఫలితంగా సిబ్బంది కొరత, ప్రజా ప్రతినిధుల అనుభవ రాహిత్యం కారణంగా అభివృద్ధి కుంటుపడుతుందని, అవినీతి పెరిగిపోతుందని పరిపాలనా సామర్ధ్యం సన్నగిల్లుతుందనే అర్ధరహిత వాదనలు లేవనెత్తేవారు లేకపోలేదు. ఇవ్వన్ని కేవలం కట్టు కథలు. రిజర్వేషన్ ఫలితంగా అధికారాలు పొందిన బడుగు, బలహీన వర్గాలు మహిళామణుల సాధికారికతను నీరుగార్చే దురుద్దేశంలో లేక చేయబడుతున్న కుంటిసాకులు. విద్యా విజ్ఞాన వేత్తలు పరిపాలనా సామర్ధ్యం కలిగిన అధికారుల కొరత లేని మన దేశంలో వారందరి సేవలు ద్వారా గ్రామీణ స్వపరిపాలనా ప్రక్రియలను విజయవంతం చేయగల్గుతాము. ప్రతీ గ్రామీణ సముదాయానికి ఒక పాలనాదక్షుడిని కార్య నిర్వాహణాధికారిని నియమించి తీర్మానాలకు ప్రజల ప్రత్యక్ష జోక్యంతో, వారి పార దర్శకత్వంతో నిర్వహించడం, కొత్త ప్రయోగమే అయినా అనతి కాలంలో అందరి హర్షామోదాలను సాధించగలిగే సుపరిపాలనగా, పరిణత ప్రజాస్వామ్య పరిపాలనగా నిర్వహించగల్గుతాము. పరిపాలనలో, ద్రవ్యవినియోగంలో జరిగే నేరాలను నిరోధించడానికి, శిక్షించడానికి ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టుల నిర్మాణం ద్వారా కూడా సురాజ్య వ్యవస్థను సురక్షితం చేసికోగల్గుతాము. అభివృద్ధికార్యక్రమాల రూపకల్పన, అంచనాల నిర్వహణ, నిర్మాణ ప్రక్రియల కొరకు కోకొల్లలుగా లభ్యమయ్యే ప్రైవేటు నిపుణులు, ప్రభుత్వేతర సలహా సంఘాల సేవలను వినియోగించుకోవడం సాద్యపుడుతుంది. నాణ్యత, సాధికారిత, జవాబుదారితనం లాంటి విలువలను అక్షరాల ఆచరించడానికి చక్కని అవకాశాలేర్పడుతాయి.

అధికార వికేంద్రీకరణ ఫలితంగా విజయవంతంగా మరియు ఆదర్శవంతంగా పునర్నిర్మాణాన్ని సాధించిన నగరాలు, పట్టణాలు, గ్రామాలు వివిధ రాష్ట్రాలలో నున్నవి. మహారాష్ట్రలోని రాలేగాంసిద్ధి అను గ్రామము అలాగే గుజరాత్‌లో అహ్మద్‌నగర్, సూరత్‌లాంటి పట్టణాలు అతివేగంగా అభివృద్ధి చెందిన ఉదాహరణలు. ఇంకా వెలుగులోనికి రానటువంటి గ్రామాలు, పట్టణాలున్నవి. వారు సాధించిన మహత్తర అనుభవాలు దేశవ్యాపితంగా పంచాయితి రాజ్ సంస్థలకు అందుబాటులోకి తెస్తూ స్థానిక మెళుకువలను వాటితో జతపరుస్తూ పంచాయితీరాజ్ వ్యవస్థను, రాజ్యాంగంలోని 11-12 షెడ్యూల్‌లో పొందు పరచబడిన విధులను విజయ వంతంగా నిర్వహించడం ఈనాటి దేశ భక్తియుత కర్తవ్యం.

# తెలంగాణా సాయుధపోరాటం

హైద్రాబాద్ సంస్థానాధిపతి అయిన నిజాం నవాబు యొక్క నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆనాటి ఫ్యూడల్ వ్యవస్థను తుదముట్టించడానికి జరిగిన చారిత్రాత్మక తెలంగాణా ప్రజల సాయుధ పోరాటం భారతదేశ స్వాతంత్ర్యం మరియు ప్రజాస్వామ్యం కొరకు జరిగిన పోరాటంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టము. సుమారు 4,000 మంది స్త్రీ, పురుషులు ఆత్మార్పణ చేశారు. తెలంగాణా ఆంధ్ర మహాసభ, భారత కమ్యూనిస్టు పార్టీ ఈ వీరోచిత పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వాన్ని అందించాయి.

1946లో ప్రారంభమైన ఈ ప్రజా పోరాటం 1951 చివరి వరకూ నిర్వహించబడింది. 5 సంవత్సరాలు నిరంతరాయంగా ఈ పోరాటం అనేక రంగాలలో మహత్తరమైన విజయాన్ని సాధించింది. నిరంకుశ నైజాంను గద్దెదించడం మొదటి విజయం, భూపంపకం సమస్యను రైతాంగ సమస్యగా ఎలుగెత్తి చాటడం పాక్షికంగానైనా సాధించటం రెండవ విజయం. ఈ సువిశాల ప్రజా ఉద్యమంలో కమ్యూనిస్టులతో పాటు వివిధ రాజకీయ పక్షాలు తమ కర్తవ్యాన్ని నిర్వహించాయి. స్టేటు కాంగ్రెసు కూడా ఈ వెల్లువలో గణనీయ మైన పాత్ర నిర్వహించింది.

## పూర్వరంగం:

హైద్రాబాద్ సంస్థానాన్ని అసఫ్‌జాహి వంశస్తులైన రాజులు 3 శతాబ్దాలుగా పరిపాలించారు. తెలంగాణా పోరాటం నాటికి పాలించిన నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ పాదుషా అనే వాడు 7వ రాజు. 16 జిల్లాలతో కోటీ 70 లక్షల జనాభాతో కూడిన ఈ సంస్థానం భారతదేశంలోనే అన్ని సంస్థానాలకన్నా పెద్దది. ఈ సంస్థానంలోని అంతరంగిక పరిస్థితి అత్యంత దయనీయంగా నుండినది. సంస్థానములో 40% భాగం జాగీర్లు, మఖ్తాలు, పాయగాలు, ఇనాంలు, చిన్న సంస్థానాల పేరిట నుండేది. వీరంతా నైజాం నవాబులాగా చిన్న చిన్న సంస్థానాధీశులుగా తమ నిరంకుశ పరిపాలనను కొనసాగించేవారు. ఈ సంస్థానాలలో సర్వాధికారాలు, పోలీసు జైళ్లు, కోర్టులతో సహా అన్ని ఆ సంస్థానాధీశుని క్రిందనే కొనసాగేవి. పన్నుల వసూళ్ల ఆదాయమంతా సంస్థాన ఆధీశునికే చెందేవి. నైజాం నవాబు స్వంత ఖర్చుల కొరకని సంస్థానంలోని అనేక గ్రామాలను వాటి ఆదాయాన్ని కేటాయించేవారు. ఈ గ్రామాలు సర్ఫేఖాస్ గ్రామాలుగా

పిలువబడేవి. ఇవి ఎక్కువగా హైద్రాబాద్ పట్టణానికి దగ్గరగా నలువైపులా వుండేవి. ఈ గ్రామాలలోని ఆర్థిక వ్యవస్థ సర్వం నిజాం ఏజంట్ల కబంధ హస్తాలలో కేంద్రీకృతమై యుండేది. దాదాపు సగభాగమగానుండిన ఈ మొత్తం గ్రామాలలోని ఫ్యూడల్ వ్యవస్థ ఆ గ్రామాల ప్రజల జీవిత పార్శ్వాలన్నింటిలో వుండి ప్రభావితం చేసింది. అర్థ బానిస విధానాలు అక్షరాలా అనుసరించబడేవి. మిగతా సగభాగముగా నుండిన గ్రామీణ జీవితం కూడా ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థలోనే వుండినది. ఈ గ్రామాలని ఖాల్సా గ్రామాలని పిలిచేవారు. వెనుక నైజాం ప్రభుత్వానికి ప్రజలనుండి పన్నులు వసూలు చేసి పెట్టే మధ్య దళారీ వ్యవస్థ వుండేది. మొదటి సర్ సాలార్‌జంగ్ ప్రధానిగా నున్నపుడు ఈ వ్యవస్థను రద్దుచేసి సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వమే తమ యంత్రాగం ద్వారా ఈ ప్రజలనుండి పన్నుల వసూళ్ళు చేయడం ప్రారంభించింది. అపుడు పదవుల నుండి తొలగించబడిన ఈ భూస్వామ్య వర్గానికి, నైజాం ప్రభుత్వం దేశ్‌ముఖ్‌లు, సర్ దేశ్‌ముఖ్‌లు, దేశ పాండ్యలు, సర్‌దేశ్‌పాండ్యేలు అనే బిరుదల నిచ్చింది. మధ్య దళారీల పాత్ర ద్వారా వచ్చే ఆదాయాన్ని తొలగించినందులకు వారికి ప్రతి సంవత్సరం కొంత పారితోషికం ఇవ్వబడ్డది. దీనిని రుసుం లేక మన్సబు అనేవారు. ఆనాటి రాజకీయ వ్యవస్థలో ఈ దేశముఖులకు, దేశ పాండ్యలకు జాగీరు మక్తాదారుల సరసన గౌరవస్థానం వుండేది. ఈ దేశముఖ్‌లు తమ స్వంత కమతాలుగా సాగుతున్న మంచి భూములన్నింటినీ సొంత పట్టాలుగా సెటిల్‌మెంటు చేయించుకొన్నారు. అదీకాక అనేక సందర్భాలలో రైతులు పొట్టగొట్టుకొని స్వాధీనం చేసుకొని అనుభవించిన భూములను కూడా బలవంతంగా వీరు దురాక్రమణ చేసుకొన్నారు. దీనికి తోడు 1929 నుండి ప్రపంచ వ్యాపితంగా వచ్చిన ఆర్థిక సంక్షోభం రైతాంగ ఆర్థిక వ్యవస్థను తునాతునకలు చేసింది. భూమి శిస్తు చెల్లించలేని కారణంగా రైతాంగం తమకున్న స్వల్ప పట్టా భూకమతాలకు రాజీనామాలు పెట్టవలసి వచ్చింది. దీనిని అదునుగా తీసుకొని భూస్వాములు మరింతగా భూములను ఆక్రమించుకొన్నారు. ఈ విధంగా రైతువారీ సెటిల్‌మెంటు జరుపబడిన ఖాల్సా ప్రాంతాలలో కూడా ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ బలపడింది. జాగీరు గ్రామాలలో అనుసరించబడే దోపిడీ విధానాలు పద్ధతులు అన్నీ ఖాల్సా గ్రామాలలో కూడా మరో రూపములో అనుసరించబడేవి. పన్నుల భారం, వెట్టి చాకిరీ చేయించుకొనడం, క్రూరహింసలకు గురి చేయడం, భయంకర వాతావరణాన్ని నెలకొల్పి కొనసాగించడం అన్ని ప్రాంతాలలోనూ సాధారణ విధానముగా కొనసాగింది. భూస్వాములు తమ స్వంత వ్యవసాయంతో పాటు అత్యధిక భాగం కౌలుదారులచే చేయించుకొనేవారు. మూడువ వంతుకు తగ్గకుండానే వ్యవసాయ పంటలు భూస్వాములకు అప్పగించబడేవి.

వెట్టి చాకిరీ విశృంఖలంగా కొనసాగేది. గ్రామ రైతులందరూ తొలకరి రాగానే తమ అరకలు సిద్ధం చేసుకొని మొదలు భూస్వాముల భూములు దున్ని విత్తనాలు వేసి

ఆ తరువాతనే తమ స్వంత కమతాలలో సేద్యం చేసుకోవలసి వచ్చేది. భూస్వాముల అవసరాల కొరకై అడవి నుండి ఉచితంగా కర్ర సరఫరా చేసే బాధ్యత, ఎడ్లు, బండ్లు గల రైతులపై నుండేది. గ్రామ సాముదాయిక ఎరువు మొత్తం భూస్వాముల పొలాలలోకి చేర్చవలసిన బాధ్యత గూడా ఈ రైతుల పైననే వుండేది. గ్రామములోని వెనుకబడిన తరగతులు, హరిజనులు, గిరిజనులు విధిగా నిర్ణీతమైన ఏదో ఒక పద్ధతిలో ఫలితము లేని సేవ, ఉచిత సేవ అనగా వెట్టి చాకిరీ చేయవలసి వచ్చేది. ఉదాహరణకు హరిజనులు వారి కుటుంబాలను భాగాలుగా లెక్కించుకొని ఈ భూస్వాముల కుటుంబాలకు వంతుల వారీగా వారి వ్యవసాయం చేయవలసిన విధి వుండేది. పంటలో నుండి ఏదో కొంత భాగం దాన రూపంలో భూస్వాములు ఇచ్చే దానితో సంతృప్తి పడవలసిందే గానీ వారికి జీత భత్యాల లెక్క అంటూ వుండేది కాదు. భూస్వాముల వ్యవసాయంలో చనిపోయిన జంతువుల తోళ్ళను శుభ్ర పరచడం, వాటితో చెప్పులు కుట్టడం, ఇతర పరికరాలు తయారు చేయడం అదే విధంగా ఈతచెట్ల నారతో త్రాళ్ళు పేనడం అవసరమున్నన్ని అందివ్వడం, చీపుర్లు తయారు చేసియివ్వడం ఇవన్నీ హరిజనుల వంతు. ఏ రాత్రి ఏ పగలు ఇటువంటి ఏ అవసరమైనా వెంటనే సరఫరా చేయవలసిన బాద్యత "అ వంతు మాదిగది" అందులో ఏలోటు జరిగినా ఆ భూస్వామి కోపతాపాలకు గురి కావలసి వచ్చేది. ఏ మాత్రం బదులు లేక ఎదురు మాట్లాడినా భూస్వాముల ఆగ్రహానికి బలి కావలసి వచ్చేది. హరిజనులు, గిరిజనులు, చాకలి, మంగలి వంటి దళిత వర్గాల వారిని వారు చేసిన తప్పులకు శిక్షగా బరిగెలతో కొట్టడం, వంగబెట్టి వీపుపై రాళ్ళు ఎత్తడం, ముంతలో నిప్పుచేసి అందులో మిరపకాయలు వేసి ఘాటైన ఆ పొగమంటను ముక్కుకు కట్టడం ఇవి సామాన్యమైన చిత్రహింసలే. చాకలివాళ్ళు ఉచితంగా బట్టలు ఉతికేవారు. మంగలివారు క్షురకర్మలే కాకుండా భూస్వాముల ఇండ్లలో సాయంకాలం దీపాలు వెలిగించడం, పడకలు సిద్ధం చేయడం వంటి పనులు చేసేవారు. అన్ని కులాలకు అన్ని రకాల వారు వారి వృత్తికి తగినటువంటి వెట్టి చాకిరీ బాధ్యతలుండేవి. చివరకు బ్రాహ్మణులు, అయ్యవారలు వారు కూడా ఈ విధినుండి తప్పించుకోడానికి వీలు లేదు. వారు ఈ దేశముఖుల భూస్వాముల ఇండ్లలో సంవత్సరాంతం అవసరమయ్యే విస్తరులు కుట్టి అప్పగించవలసిన బాధ్యత గలిగి యుండేవారు. ఈ విధంగా వెట్టి చాకిరి ఆనాటి బానిస బ్రతుకులను నిరూపించింది.

ప్రభుత్వోద్యోగులు గ్రామానికి వచ్చినప్పుడు అవసరమైన ఏర్పాట్లన్నీ గ్రామాధికారులైన దేశ్‌ముఖ్‌లు వారి గుమాస్తాలు సామాన్య ప్రజలచే ఉచితంగా నిర్భంధంగా చేయించేవారు. మసీదులో లేక చావడిలో శుభ్రం చేసి మంచాలు వేసి, మంచినీళ్లు ఏర్పాటు చేయవలసిన బాధ్యత గ్రామ చాకలి వాండ్లది. వారి దస్త్రాలను, మూటలను ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి మోసుకొని పోవలసిన బాధ్యత మాల మాదిగలది. ఉద్యోగస్థులకు

ఇష్టాన్నము వండి పెట్టవలసిన బాధ్యత కుమ్మరులది. వంటలకు సరిపడే సామగ్రి నేయితో సహా అందించ వలసిన బాధ్యత కోమటి వాండ్లది. ఇటువంటి పరాన్నజీవి పద్ధతులను పట్టుదలతో అమలు జరుపుతూ గ్రామ జీవితాన్ని శాసించేవారు.

చెక్కు చెదరని నిరంకుశ వ్యవస్థలో పౌరసత్వాలు పూర్తిగా మృగ్యం. సంస్థాన వ్యాపితంగా ప్రజలు ఎక్కడ ఏ సమావేశాన్ని లేక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవలసి వచ్చినా ప్రభుత్వ అనుమతి పొందటం అనివార్యం. అందుకు ఒకటికి మించి నాలుగైదు కాగితాలు నింపి వివిధ అధికారులకు దరఖాస్తులు పెట్టితే గానీ ఆ విషయం పరిశీలించబడేది గాదు. పరిశీలన తరువాత అనుమతి కాస్తా నిరాకరించబడేది. ఎక్కడైనా పొరపాటున అనుమతి లేకుండా ఏ కారక్రమం నిర్వహించబడినా తుదకు ఇంటి లోపల సమావేశం లాంటిది జరిగినా దానికి సంబంధించిన వారు కూడా తీవ్ర నిర్బంధ విధానానికి గురి చేయబడేవారు. సంస్థానం తెలుగు, మరాఠి, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలతో కూడుకున్నవి. అందులో తెలుగువారు సగానికీ సగం. ఈ ప్రజలు తమ మాతృ భాషను ఏ మాత్రం ఆరాధించుకునే అధికారం కలిగి వుండేవారు కాదు. ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత విద్య వరకూ ఉర్దూ మాధ్యములోనే విద్య గరుపబడేది. తెలుగు పుస్తకాలు, పత్రికలు అసలు వుండేవి కావు. 20వ శతాబ్దపు మూడవ దశకము నుండి అక్కడక్కడా తెలుగు పత్రిక ప్రచురణలు రావడం ప్రారంభమైంది. ఎక్కువ భాగం ఆంధ్ర ప్రాంతం నుండి దిగుమతి చేయబడినవే. తెలుగు భాష రాదని ఆ నాటి పాలకులు "తెలంగీ బేఢంగీ" అని వెక్కిరించేవారు. గ్రంధాలయములు, పఠనాలయాలు పేరుకు కూడా లేవు. పరిపాలన సంపూర్ణముగా నైజాముచే నామకరణము చేయబడిన ప్రధానమంత్రి అతని సలహాదారుచే నిర్వహించబడేది. బ్రిటీషు ఇండియాలో వున్న కనీస, పరిమిత, పరోక్ష ఎన్నికలు కూడా వుండేవి కావు. హిందువులూ అత్యధికులుగా వున్నప్పటికీ వారి మత సంస్థలను పోషించుకోవడం, ఇష్టదేవతలను ఆరాధించుకోవడం కూడా పెద్ద సమస్యగా వుండేది. మత సంబంధ సమావేశాలు, ఊరేగింపులు, ఉత్సవాలు, పోలీసుల కఠినమైన నిఘాలోనే జరిగేవి. పరిపాలనలో ముస్లిం మతస్థులకు ప్రధాన బాధ్యత ఇవ్వబడేది. హిందువులలో భూస్వామ్యవర్గాలకు చెందినట్టి ఉర్దూ భాషలో ప్రావీణ్యత కలిగినట్టి కొందరికి మాత్రమే అవకాశాలు దొరికేవి. ముస్లిం మత ప్రజానీకానికి అత్యధిక ప్రోత్సాహం లభించేది. హిందువులను ముఖ్యముగా దళితులైన హరిజనులను ఇస్లాం మతంలోకి మార్చటం పెద్ద ప్రయత్నంగా కొనసాగింది. "తబ్లీగ్-ఇస్లామ్" అను సంస్థ ఈ మతమార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ మత మార్పిడి కార్యక్రమాలు హిందువులలో సంచలనానికి కారణ భూతమైనవి. హిందువులు కూడా మతం మార్చబడిన హిందువులను తిరిగి మతంలోకి చేర్చుకొని శుద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఒక దశలో ప్రభుత్వం ఈ రెండు రకాల మత మార్పిడి సంస్థలపై నిషేధాన్ని విధించింది. ముస్లిము మత ప్రచారం నిరంతరాయంగా ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష ప్రోత్సాహంచే

నిర్వహించబడేది. నిజాం రాజు దైవాంశ సంభూతుడని ఆచంద్రార్కం అసప్‌జాహీ వంశం వర్థిల్లుతుందనీ ఈ సంస్థానంలో ప్రతి ముసల్మానులు ఒక రాజు అని ప్రచారం కొనసాగేది. దీనివల్ల ముస్లిం ప్రజలు మత పిచ్చితో గ్రుడ్డి హిందూ ద్వేషముతో నిజాం ప్రభుత్వాన్ని రక్షించుకొనే లక్ష్యంతో సంఘాలు, సమావేశాలు నిర్వహించేవారు. ముస్లింల ఐక్య సంఘటన అను అర్థాన్ని కల్పించే ''మజ్లిస్ - ఇతెహాదుల్ - ముసల్మీన్'' అను సంస్థను ప్రారంభించి కొలది కాలములోనే రాష్ట్ర వ్యాపిత ముస్లిం ఉద్యమంగా వ్యాపింపజేశారు. దీనికి ప్రతి క్రియగా హిందువులలో మత సాంఘిక సంచలనం సంతరించుకొన్నది. అందులో అభ్యుదయ రాజకీయ శక్తులు తల ఎత్తడం ప్రారంభమైంది. ఆర్య సమాజ ప్రచారం, ప్రారంభమై చైతన్య యువకులైన హిందువులకు సమావేశ కేంద్రముగా పరిణమించింది. ముస్లిం మత ప్రచార నిరోధక శక్తిగా ఆర్య సమాజం అవతరించింది. హిందూ ధర్మ ప్రచారం చాటున స్వేచ్ఛా స్వాతంత్ర్య సంకేతాలు కూడా ప్రచారం చేయబడేవి.

నిజాం పాలకులు తమ నిరంకుశ పరిపాలనకు పెద్ద అండగా బ్రిటీషు సామ్రాజ్య వాద పరిపాలనను ఎంచుకొనేవారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు తమ అధికార విస్తరణలో ఈ అసఫ్‌జాహీ వంశీయులను పెద్ద ఎత్తున ఉపయోగించు కొన్నారు. అందుకే దేశంలో అనేక సంస్థానాధీశులు వున్నప్పటికీ బ్రిటీషు వారు నిజాం సంస్థానాన్ని దాని పాలకులను ''పెద్ద విశ్వాస పాత్రులుగా'' గుర్తించేవారు. వీరి సేవలను మెచ్చుకొని నమ్మకమైన అధికారులకు ''ఒబీడియంట్ ఆఫ్ బ్రిటీషు ఎంపైర్'' (ఒ.బి.ఇ.) అను బిరుదాంకితం చేసేవారు.

ఇటువంటి ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక రాజకీయ పరిస్థితులు నిజాం రాచరికాన్ని ఒక బలహీనమైన పునాదిగా కనబడతాయి. ప్రజలలో చైతన్యం, జాగృతి పెరిగిన కొలది ఉన్న కాస్త పునాదులు సంకుచితం కావడం, బలహీనపడడం జరిగింది. తెలుగు, మరాఠి, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలలో భాషా సాంస్కృతిక సంఘాలు ఆవిర్భావం పొందడం జరిగింది. విద్యార్థి, యువకులపై జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు ప్రధానంగా నికృష్టమైన అంతరంగిక పరిస్థితులు తమ ప్రభావాలను వేయడం జరిగింది. ఉదాహరణకు 1922లో హైదరాబాదులోని వివేక వర్ధనీ థియేటరులో ఒక హిందూ సాంఘిక సభ జరిగింది. ఆ సభలో ప్రసంగాలన్నీ ఉర్దూలోనూ, మరాఠీలోనూ జరిగినవి. ఒకే ఒక వక్త, ప్లీడరు తెలుగులో మాట్లాడబోయాడు. సభికులంతా హేళన చేసి ఆయనను మాట్లాడనీయలేదు.

తెలుగు భాషకు, తెలుగు వక్తకు జరిగిన అవమానాన్ని గమనించిన కొందరు ముఖ్యులు ఆంధ్రభాషకు, సాంస్కృతికి సముచితస్థానం కల్పించాలన్న ఆశయంతో ''ఆంధ్రజనసంఘం'' స్థాపించారు. ఇది ఆంధ్రమహాసభకు నాందీవాచకం పలికింది. ఆ

తరువాత రెండు సంవత్సరాలలో నిజాం రాష్ట్రములోని తెలుగు సంస్థలన్నీ కలిసి ఆంధ్రజన కేంద్రసంఘాన్ని ఏర్పాటు చేశాయి. ఈ కేంద్రసంఘానికి కీ.శే. శ్రీ మాడపాటి హనుమంతరావుగారు కార్యదర్శిగా వుండేవారు. ఈ సంఘం ప్రపథమంగా ''వెట్టి చాకిరి, వర్తకసంఘం'' అన్న రెండు కరపత్రాలను ప్రచురించింది. మెదటిది సామాన్య ప్రజలకు సంబంధించినది కాగా రెండవది అధికారులకు వర్తకులు ఉచితంగా సరుకులు సప్లైచేసే పద్ధతికి వ్యతిరేకంగా నున్నది. ఈ కేంద్రసంఘం క్రమంగా పరిణతిచెంది తెలుగు ప్రజల అన్నిరకాల ఉద్యమ ప్రవాహాల కేంద్రముగా మారింది. 1930లో ఆంధ్రజన కేంద్రసంఘం జోగిపేటలో ప్రథమ ఆంధ్రమహాసభని నిర్వహించింది. దానికి శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షత వహించారు. హైద్రాబాదునుండి శ్రీ రావి నారాయణరెడ్డి, శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డిగారలతో కూడిన 15 మంది యువకదళం మహాసభకు వలంటీర్లుగా సైకిళ్లపై జోగిపేటకు వెళ్లింది. 1931లో శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి అధ్యక్షతలో ద్వితీయాంధ్ర మహాసభ దేవరకొండలో జరిగింది. అభ్యుదయ భావాలుగల యువతరం గ్రామాలలో ప్రచారంచేస్తూ మహాసభలోపాల్గొన్నది. తృతీయాంధ్ర మహాసభ ఖమ్మంలో 1934లో జరిగింది. పులిజాల వెంకట రంగారావు దీనికి అధ్యక్షత వహించారు. 1935 డిసెంబరులో చతుర్ధాంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో జరిగింది. దీనికి ఆంధ్రోద్యమ స్థాపకులైన మాడపాటి హనుమంతరావుగారు అధ్యక్షత వహించారు. 1936లో 5వ ఆంధ్ర మహాసభ షాద్ నగర్‌లో జరిగింది. దీనికి శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు. 6వ ఆంధ్ర మహాసభ 1937లో నిజామాబాదులో జరిగింది. దీనికి శ్రీ మందుముల నరసింగరావు అధ్యక్షత వహించారు. 7వ ఆంధ్ర మహాసభ హైదరాబాదు జిల్లా మల్కీపురంలో 1940లో జరిగింది. దీనికి మందుముల రామచంద్రారావు గారు అధ్యక్షత వహించారు. 8వ ఆంధ్ర మహాసభ నల్గొండ జిల్లా చిలుకూరు గ్రామంలో 1941లో జరిగింది. దీనికి సుప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకులు తరువాత జరిగిన తెలంగాణా సాయుధ పోరాట నిర్మాత అయిన శ్రీ రావి నారాయణ రెడ్డి గారు అధ్యక్షత వహించారు.

ఈమహాసభకు అనేక విషయాలలో గత మహాసభలతో తేడా వుంది. ''ఈ మహాసభ యొక్క అగ్ర ఆసనాధిపతి పేరు వినగానే ఎనిమిదవ మహాసభనుండి ఆంధ్ర నాయకత్వమొక కొత్త మార్గం అనుసరించుచున్నదని తోచక మానదు.'' అని కీర్తిశేషులు శ్రీ మాడపాటి హనుమంతరావుగారు రచించిన ఆంధ్రోధ్యమయను గ్రంథములో ఈ విశేషాన్ని ఉటంకించారు. 9వ ఆంధ్ర మహాసభ 1942లో శ్రీ మాదిరాజు రామకోటేశ్వరరావు గారి అధ్యక్షతన వరంగల్లు తాలూక ధర్మవరంలో జరిగింది. 10వ ఆంధ్ర మహాసభ హైదరాబాద్‌లో జరిగింది. శ్రీమతి సరోజినిదేవి కుమారుడు డాక్టరు జయసూర్య ఆహ్వాన సంఘాధ్యక్షులుగా పనిచేశారు. అధ్యక్ష పదవికై మితవాద వర్గ అభ్యర్థి శ్రీ కొడా వెంకట రంగారెడ్డి మరియు అతివాదుల అభ్యర్థి శ్రీ బద్దం ఎల్లా రెడ్డి గారల మధ్య తీవ్రమైన

పోటీ జరిగింది. కొద్ది మెజారిటీతో శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారు గెలుపొందారు. 11వ ఆంధ్ర మహాసభ 1944లో భువనగిరిలో జరిగింది. ఈ మహాసభలో కూడా అధ్యక్షపీఠాన్ని ఆక్రమించుకోడానికి మితవాదులు ప్రయత్నంచేశారు. అతివాదుల నిర్మాణబలాన్ని చేధించలేక అసలు ఆంధ్రమహాసభ వేదికనుండే నిష్క్రమించారు. శ్రీ రావి నారాయణరెడ్డిగారు ఏకగ్రీవంగా అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఈనాటికి ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టులు, అతివాదులు, ప్రజాస్వామ్యవాదుల చేతిలో - ఒక బలమైన ఆయుధంగా రూపొందింది. నైజాం నిరంకుశ పాలన ఫ్యూడల్ వ్యవస్థను పెకిలించి వేయనిదే హైదరాబాదు సంస్థానాన్ని విచ్ఛిన్నం చేసి భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడనిదే ప్రజలకు విముక్తిలేదని కృతనిశ్చయంగా ప్రకటించడం జరిగింది.

రెండవవైపు హైదరాబాద్ సంస్థానంలో ఏర్పడిన స్టేటు కాంగ్రెసు 1938లో నిర్వహించిన సత్యాగ్రహోద్యమం నిజాం పరిపాలనను కూలద్రోయడానికి ఉద్దేశించబడిన ప్రజా ఉద్యమాలకు దోహదం చేసింది.

భారత కమ్యూనిస్టుపార్టీ, సంస్థానంలో రాజకీయ పరిణామం క్షుణ్ణంగా పరిశీలించింది. స్టేటుకాంగ్రెసులోని వామపక్షాలతోనూ, కామ్రేడ్స్ అసోసియేషన్ పేరుతో నిర్మాణమవుతున్న యువతరంతోనూ సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకొన్నది. శ్రీ రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మినరసంహారెడ్డి వంటి తెలంగాణా స్టేటు కాంగ్రెసు నాయకులను కమ్యూనిస్టులుగా మార్చింది. కామ్రేడ్స్ అసోసియేషన్ నాయకులైన ముఖ్దుం మొహియుద్దీన్, రాజ బహద్దూర్ గౌర్ గారలు కమ్యూనిస్టు నాయకులుగా ఎదిగిన శ్రీ దేవులపల్లి వెంకటేశ్వరరావు, యస్. రామనాథం తదితర వామపక్ష భావాలుగల యువకులెందరో కమ్యూనిస్టుపార్టీలో చేరారు. మరట్వాడాకు చెందిన శ్రీ చంద్రగుప్త చౌదరి, వి.డి. దేశపాండ్యేగారలు కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు. ఈవిధంగా తెలంగాణా, మరట్వాడా ప్రాంతాలలో కమ్యూనిస్టుపార్టీ శాఖలు ఏర్పడినవి.

చాలకాలం కమ్యూనిస్టులు ఆంధ్రమహాసభను పోరాటవేదికగా తీర్చిదిద్దటానికి రహస్యంగా కృషిజేశారు. 1944లో భువనగిరి మహాసభలో మితవాదులు విడిపోయిన తరువాత ఆంధ్ర మహాసభ నిరంతరాయంగా ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల సాధనకై నిర్భయంగా పోరాడే రాజకీయ ప్రజాసంస్థగా రూపొందింది. కామ్రేడ్ మఖ్దుం మొహిద్దీన్, రాజబహద్దూర్ గౌర్, వి.డి.దేశ్‌పాండే, జవ్వాద్ రజ్వీ మొదలగు వారి నాయకత్వములో కార్మిక సంఘాలు ఏర్పడటం, అఖిల హైదరాబాదు ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ఏర్పడటం జరిగింది. అటు అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘం నాయకత్వంలో క్రమక్రమంగా సంస్థానంలోని అన్ని జిల్లాలలో విద్యార్థి సంఘాలు ఏర్పడటం జరిగింది. తెలంగాణా జిల్లాలలో విద్యార్థులు పౌరహక్కులకై పోరాడటం ప్రారంభించారు. ఈవిధంగా తెలంగాణాలో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో ప్రజా ఉద్యమం బలమైన శక్తిగా పరిణమించింది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ రాజకీయ చిత్రపటములో మౌళికమైన మార్పు కలిగింది. ఫాసిస్టు శక్తులు ఓడించబడ్డాయి. సామ్రాజ్యవాదం బలహీనపడింది. వలస, అర్థవలస దేశాలలో విముక్తి ఉద్యమాలు ఉవ్వెత్తున లేచాయి. అజేయమనుకొన్న ఫాసిజాన్ని మట్టికరిపించి తూర్పు యూరపు దేశాలకు విముక్తి ప్రసాదించిన సోవియట్ రష్యా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయి. సామ్రాజ్యవాద వ్యవస్థకు పోటీగా సోషలిస్టు వ్యవస్థరూపొందింది.

భారతదేశంలో స్వతంత్ర పోరాటం అంతిమ దశకు చేరుకొన్నది. అజాద్ హింద్ సైనికుల విచారణపై జరుపబడిన ప్రదర్శనలు, నావికుల తిరుగుబాటు పోలీసుల తిరుగుబాటు, కార్మికుల సమ్మె నోటీసులు బ్రిటీషు సామ్రాజ్య వాదానికి అంతిమ హెచ్చరికగా పనిచేశాయి.

భారతదేశంలో వెల్లువగా వ్యాపిస్తున్న బ్రిటీషు వ్యతిరేక ప్రజాపోరాటాల ప్రభావం సంస్థాన ప్రజలపై కూడా పడ్డది. హైద్రాబాద్ సంస్థానంలోని ప్రజా ఉద్యమం ఈ నూతన వాయువులను పీల్చుకొని ప్రతిస్పందించడానికి సంసిద్ధముగా నుండినది. అదివరకే ప్రజానాయకులుగా, జాతీయనాయకులుగా గుర్తింపు పొందిన యువనాయకులెందరో ఈ జాతీయ స్రవంతిలో ఒక భాగంగానే హైద్రాబాద్ సంస్థాన ప్రజా ఉద్యమాన్ని మలచడానికి సిద్ధపడ్డారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో పట్టణ - గ్రామీణ ప్రాంత ప్రజా ఉద్యమాలను నిర్మించారు. విద్యార్థులు తమ పౌరసత్వ హక్కులకై పోరాటరంగంలోకి దిగారు. కార్మికులు తమ వేతన సమస్య పరిష్కారమునకై సమ్మె, పోరాటాలను నిర్వహించడానికి నడుంకట్టారు. గ్రామీణ భూస్వామ్య వ్యవస్థ క్రింద నలిగిపోతున్న రైతు కూలీలు తమ భవిష్యత్తును తీర్చిదిద్దు కోవడానికై సంసిద్ధం కాసాగారు. ఆకునూరు, మాచిరెడ్డి పల్లి గ్రామాలలో నిర్భంధ లెవీ వసూలుచేస్తుంటే ఎదిరించిన రైతులపై పోలీసులు చేయిచేసుకున్నారు. స్త్రీలను చెరిచారు. ఈ దారుణ ఘటన సంస్థాన ప్రజలనే కాకుండా భారత జాతీయ ఉద్యమాన్ని కూడా ప్రభావితం చేసింది. మహాత్మాగాంధీ గారి ఆదేశంపై పద్మజానాయుడుగారు ఈ సంఘటనపై విచారణ జరిపి గాంధీగారికి నివేదిక అందజేశారు. జనగామ తాలూకాలో భూస్వాములు దురాక్రమణ చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకొనడానికై రైతులు పోరాటం ప్రారంభించారు. విసునూరు రామచంద్రారెడ్డి లాంటి భూస్వాములు తమ గూండాల బలగాలతో దౌర్జన్యాలు ప్రారంభించారు. అంధ్ర మహాసభ గ్రామ గ్రామాన ప్రజలను మేల్కొలిపింది. సంఘటితం చేసింది. మార్గదర్శకత్వం వహించింది. వందలు, వేలుగా యువకులు ఈ సంఘ నాయకులుగా ముందడుగువేశారు.

ఈ పరిస్థితులు చూచిన నైజాం నవాబు తమ భవిష్యత్తుకు ప్రమాదముందని గ్రహించి నిర్బంధ విధానాన్ని ప్రారంభించారు. ఉధృతమవుతున్న ప్రజా ఉద్యమాన్ని

మొగ్గలోనే త్రుంచి వేయాలనుకొన్నాడు. బ్రిటీషు సామ్రాజ్య వాదులతో మంతనాలాడి తన సంస్థానాన్ని స్వతంత్ర దేశంగా నిలుపుకోవాలనుకొన్నాడు. 1947 జూన్ 12వ తేదీన స్వతంత్ర సంస్థానం ప్రకటించుకొన్నాడు.

ఇటువంటి పరిణామాలు సంస్థాన రాజకీయాలలో సంచలనం కలిగించినవి. బ్రిటీషు సామ్రాజ్యవాదులు నైజాము నవాబు కలిసి పన్నుతున్న కుట్రలు స్పష్టంగా కనబడ్డాయి. ప్రజా ఉద్యమాలకు ఏర్పడుతున్న ప్రమాద సంకేతాలు స్పష్టమైనాయి. తెలంగాణా వ్యాపితంగా పెచ్చరిల్లుతున్న పోలీసు దౌర్జన్యాలు, భూస్వాముల గూండాల స్వైర విహారాలు ప్రజాతంత్ర శక్తులకు సవాలుగా కనబడ్డాయి. కమ్యూనిస్టు పార్టీ, అంధ్ర మహాసభల నాయకులు ఈ పరిణామాలను సమీక్షించారు. పెరుగుతున్న దౌర్జన్యాన్ని అరికట్టడానికి ప్రజల దళాలను నిర్మించి ఎదిరించాలని తీర్మానించారు. అందుకు అవసరమైన ప్రాథమిక, లాఠీ శిక్షణలు ఇవ్వడం ప్రారంభించారు. అనతి కాలంలోనే నల్గొండ జిల్లాలో కడవెండి, దేవరుప్పల, పాతసూర్యాపేట లాంటి గ్రామాలలో ఇతర జిల్లాలలో గూడా కొన్ని గ్రామాలలో గూండాల దాడులను అంధ్ర మహాసభ దళాలు త్రిప్పికొట్టాయి. ఈ పోరాటంలో కడవెండిలో కామ్రేడ్ దొడ్డ కొమరయ్య అమర వీరుడయ్యారు.

భారత రాజకీయ చరిత్రలో అత్యంత వేగముగా మార్పులు జరుగుతున్న సమయమిది. బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని విభజించడానికి విజయవంతమైన ప్రయత్నం చేశారు. ఆగష్టు 15, 1947న మనదేశ స్వాతంత్ర్య పోరాటాన్ని యినుమడింపచేయసాగారు. భారత ప్రభుత్వం ఈ ప్రజా వెల్లువను తన అధికారాన్ని ఉపయోగించి క్రమ క్రమంగా దేశంలోని సంస్థానాలన్నీ భారతదేశంలో విలీనం కావడానికి అంగీకరింప జేసింది. నైజాం నవాబు మాత్రమే విలీనాన్ని వ్యతిరేకించినాడు. స్వతంత్ర హైద్రాబాద్ ఉంటుందని ప్రకటించాడు. హైద్రాబాద్ సంస్థాన ప్రజలు ముఖ్యంగా తెలంగాణా ప్రాంత ప్రజలు నైజాం నవాబు యొక్క ఈ నిర్ణయాన్ని ప్రతిఘటించి ఓడించడానికి సంసిద్ధమయ్యారు. అంతకు ముందు కనబడని అనేక నూతన శక్తులు ఈ పోరాటంలోకి ఆకర్షించబడ్డారు. హైద్రాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరి తీరవలసిందే అనునినాదం ఏకైక తక్షణ రాజకీయ ప్రజానినాదంగా పరిణమించింది. ఈ వాతావరణంలో కమ్యూనిస్టు పార్టీ, అంధ్ర మహాసభ చక్కని ఎత్తుగడలతో ప్రజలను సమీకరించింది. సమరశీల, నైజాం వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా మలచింది. స్టేటు కాంగ్రెసులో అతివాదులుగా స్వామీ రామనంద తీర్థ నాయకత్వంలోనున్న వారు నిజాం వ్యతిరేక సమరశీల పోరాటానికి అనుకూలముగా తయారైనారు.

కానీ శ్రీ బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి గారల నాయకత్వములో నున్న మితవాద నాయకత్వం తమ పోరాటాన్ని లాంఛనప్రాయమైన

సత్యాగ్రహం వరకే పరిమితం చేసింది. భారత యూనియన్‌లో చేరవలసినదిగా నిజాంకు విజ్ఞప్తి చేసింది. నిషేధించబడిన జాతీయ పతాకాన్ని ప్రతిష్ఠించాలనీ తీర్మానించింది. ఐక్య పోరాటంలో సాగిపోదామని ప్రకటించిన ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు జాతీయ పతాకాన్ని ఎగురవేసే ఈ నిర్ణయాన్ని బలపరుస్తూ కార్యక్రమాన్ని అందించాయి. కొలది రోజులలోనే వందలాది గ్రామాలలో యువకులు జాతీయ పతాకాన్ని అత్యంత ధైర్య సాహసాలతో ఆవిష్కరించారు. నిరోధించిన పోలీసులు గూండాలను విజయ వంతంగా ఎదిరించారు. స్టేటు కాంగ్రెసు పిలుపు ప్రకారమే ఈతచెట్లు, తాటిచెట్లు నరకటం విస్తృతంగా కొనసాగింది. ప్రభుత్వానికి లెవీ ధాన్యాన్ని చెల్లింపు నిరాకరించే ఉద్యమం విస్తారంగా కొనసాగింది. అనేక మంది ముస్లింలు కూడా ఈ జాతీయ పోరాటంలో భాగస్వాములుగా చేరి నిజాం నిరంకుశ విధానాన్ని ఖండించారు. కానీ నిజాం ప్రభుత్వం మాత్రం చరిత్ర గమనాన్ని, పరిస్థితులను చూచి అర్థం చేసుకోడానికి నిరాకరించింది. తన బలగాలతో స్వాతంత్ర పోరాటాన్నే అణచడానికి నిశ్చయించింది. జాతీయ పతాకాన్ని త్రొక్కివేయడం, దేశ భక్తులందరినీ అరెస్టు చేస్తూ చిత్రహింసలకు గురిచేయడం, చంపడం, ఇండ్లు లూటీచేయడం, తగులబెట్టడం, స్త్రీలను చెరచటం విశృంఖలంగా కొనసాగించింది. ప్రతీచోట ఆంధ్ర మహాసభ,  కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ నైజాం ముష్కరులు నెదిరించారు. నైజాం పోలీసులతో పాటు సైనిక బలగాలును మజ్లీస్‌చే నిర్మించబడిన రజాకారు దళాలు వేల సంఖ్యలో రంగంలోకి దిగాయి. ప్రజా పోరాటాన్ని అణచడానికి పూనుకొన్నాయి. హైద్రాబాదు ప్రజలు ఇటువంటి జీవన్మరణ పోరాటం జరుపుతుండగా కేంద్రములో అధికారములో నున్న కాంగ్రెసు నాయకత్వం నిజాంతో రాజీ, రాయబారాలు ప్రారంభించింది. విదేశీ వ్యవహారాలు, రక్షణ, రవాణా ఈ మూడు కేంద్ర ప్రభుత్వానికి దఖలు పరచి మిగతా అధికారాలన్నీ తన చేతులలోనే ఉంచుకోనే విధంగా భారత యూనియన్‌లో చేరవలసిందని నైజాం నవాబుతో చర్చలు కొనసాగించింది. నైజాం నవాబు నిర్వహిస్తున్న నిర్బంధ విధానం గురించి ప్రజా పోరాటాలు గురించి ఏమీ మాట్లాడలేదు. అయినప్పటికీ దీనిని గూడా నిజాం తృణీకరించాడు. చివరకు 1947 నవంబరులో భారత ప్రభుత్వం నిజాంతో యధాతధా ఒడింబడికను చేసుకొన్నది.

ఈ ఒడంబడిక ప్రకారం భారత ప్రభుత్వం నైజాం యొక్క అంతరంగిక వ్యవహారంలో జోక్యం కల్పించుకోదు. సంస్థానములో మత సామరస్యం, శాంతిభద్రతలను కాపాడటానికి భారత ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. దీనికి బదులుగా నైజాం విదేశాలలో తన రాయబార కార్యాలయాలను నెలకొల్పకుండా వుండాలి. తన ఏజంటు జనరల్ ఆఫీసులను మాత్రం స్థాపించుకోవచ్చును. ఈ ఒప్పందం ఒక సంవత్సరం పాటు కొనసాగుతుంది. ఆ తరువాత శాశ్వత ఒప్పందం కుదుర్చుకొంటారు.

ఈ యధాతద ఒడంబడిక సంస్థాన ప్రజలలో ఆగ్రహాన్ని కల్పించింది. భారత ప్రభుత్వం నిరంకుశ నిజాం పట్ల ఇంతటి దిగజారుడు వైఖరిని అనుసరించడాన్ని ప్రజాస్వామ్య వాదులంతా నిరసించారు, ఖండించారు. ప్రజా ఉద్యమాలను రక్తపుటేరులలో ముంచడానికి నిజాం నవాబుకు మరికొంత అవకాశం కల్పించినట్లైంది. ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొన్నాడు. తిరుగుబాటు కొనసాగిస్తూన్న ప్రజలపై కక్షతో విరుచుకుపడ్డాడు. వేలాది సమరయోధుల్ని అమాయక ప్రజల్ని తన పొట్టన పెట్టుకొన్నాడు. పాకిస్థాన్, బ్రిటన్, తదితర దేశాల నుండి ఆయుధాలు సేకరించడం ద్వారా తన సైనిక శక్తిని ఆధునీకరించాడు. కాశీం రజ్వీ నాయకత్వములో మజ్లీస్ స్వచ్ఛంధ సేవకులు రజాకారుల పేరుతో ఆధునిక ఆయుధాలు చేపట్టి గ్రామాలపై అమానుష్యంగా దాడులు కొనసాగించారు. హైద్రాబాదు సంస్థానంలో నున్న హిందువులను అత్యధిక భాగం హతమార్చి ఇతర రాష్ట్రాలనుండి ముస్లింలను దిగుమతి చేసుకొని ముస్లిం రాజ్యముగా కొనసాగాలని క్రూర పన్నాగాలు పన్నాడు. లక్షలాదిముస్లింలు నైజాం నవాబు యొక్క ఈ పన్నాగాన్ని తెలుసుకొని తప్పుకొన్నారు. హైద్రాబాదులో ప్రముఖ పారిశ్రామిక వేత్త అయిన లాయక్ అలీని ముఖ్యమంత్రిగా నియమించి కొందరు హిందువులను, ముస్లింలను మంత్రులుగా నియమించారు. తన నిరంకుశ పరిపాలనకు ప్రజాస్వామ్య రంగుపులమడానికి నిష్ఫల ప్రయత్నం చేశాడు.

అంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు నైజాం నవాబు యొక్క ఈ ఎత్తుగడలను పటాపంచలు చేశాయి. నైజాం పైశాచిక పరిపాలన అంతమొందించిన నాడే నిజమైన ప్రజాస్వామ్యం అమలులోకి వస్తుందని ప్రకటించడం జరిగింది. సంస్థాన కాంగ్రెసు వారు సందిగ్ధావస్థలో పడ్డారు. యధాతధ ఒడంబడికను వ్యతిరేకించలేదు. వ్యాపిస్తున్న ప్రజా ఉద్యమాలలో భాగస్వాములు కాలేదు. అయినా అనేక మంది కాంగ్రెసు యువకులు అభ్యుదయ భావాలు కలవారు. ప్రబలుతున్న ప్రజా ఉద్యమాన్ని సమర్ధించారు.

ఇటువంటి విషమ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ శాఖలు చరిత్రాత్మక పాత్రను నిర్వహించాయి. ప్రజల పోరాట చైతన్యాన్ని సరిగ్గా అంచనా వేశాయి. నిజాం సాయుధ దళాలు, రజాకారు గుండాలు సాగిస్తున్న దుష్కృత్యాలకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని శాశ్వతంగా అంతం చేసే వరకూ ప్రజల ప్రాణమాన, ఆస్తుల రక్షణ కొరకు సాయుధ ప్రతిఘటన సాగించవలసినదిగా పిలుపునిచ్చాయి. కమ్యూనిస్టు పార్టీ, అంధ్ర మహాసభ, అఖిల హైద్రాబాదు ట్రేడు యూనియన్ కాంగ్రెసుల తరపున కామ్రేడు మఖ్దూం మొహియుద్దీన్, రావి నారాయణరెడ్డి, బద్ధం ఎల్లారెడ్డి గారలు సాయుధ ప్రతిఘటనకై పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్యార్థి యువజన సంఘాలు ఈ జీవన్మరణ పోరాటంలో యవతరం తన చరిత్రాత్మక పాత్ర నిర్వహించాలని పిలుపు నిచ్చాయి.

ఈ పిలుపు నిజంగా గ్రామీణ పేదలందరిచే ఆమోదం పొందడానికి ఒక నిర్ధిష్ట కార్యక్రమం కూడా అందించటం జరిగింది. గ్రామాలలో వెట్టి చాకిరికి స్వస్థి చెప్పాలని భూస్వాములు ఆక్రమంగా, దౌర్జన్యంగా అక్రమించుకొన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, కౌలుదారులకు న్యాయమైన కౌలు రేటు నిర్ణయించాలని, వ్యవసాయ కార్మికులకు కూలిరేట్లు పెంచాలని, పాత ఋణాలు రద్దు కావాలని మొదలగు అంశాలతో కూడిన కార్యక్రమాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అమలుచేయడానికి ప్రజాకమిటీలు నిర్మించాలని, సాయుధ గెరిల్లా దళాల నిర్మాణం చేయాలని, పిలుపు నివ్వడం జరిగింది. అది వరకే కార్యరంగంలోనున్న వేలాది అంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ఈ పిలుపును అందుకొన్నారు. దళాలుగా మారిపోయారు. తెలంగాణాన్ని అనుకొనివున్న ఆంధ్ర ప్రాంతాన్ని స్థావరాలుగా మార్చుకొన్నారు. ఆంధ్ర ప్రాంతంలో వున్న కమ్యూనిస్టు కమిటీ తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, దళాల రక్షణకి ఎంతగానో కృషి చేసింది. ఆర్థికంగా, సైనికంగా నైజాం బలగాలను తట్టుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలను అందించింది. అనేక మంది కార్యకర్తలు, నాయకులు ఆంధ్ర ప్రాంతం నుండి తెలంగాణాలోకి చేరి ఇక్కడి సాయుధ పోరాట నిర్మాణాన్ని చేపట్టారు. ఆ తరువాత అనేకులు ఆత్మార్పణ కూడా చేశారు. అలాగే మరట్వాడా, కర్ణాటక ప్రాంతాల కమ్యూనిస్టులు అవతలి ప్రాంతాలలో నున్న కమ్యూనిస్టు కమిటీలు తమశక్తి మేరకు సహాయాన్ని అందించాయి. పోరాటం నూతన స్థాయికి చేరుకొన్నది. దళాలు ఆయుధాలు చేబూని జైత్ర యాత్రలు సాగించాయి. గ్రామ గ్రామాన విముక్తి దళాలకు ప్రజలు తండోప తండాలుగా ఎదురు వచ్చి స్వాగతం చేయడం వలన శత్రువుకు ఎదురుదాడి చేయడం సులభమే అవుతుందన్న సత్యాన్ని అనేక అనుభవాల ద్వారా గుర్తించడం జరిగింది. దళాలు చిన్నగా చేసి ఆత్మరక్షణ ఏర్పాట్లన్నీ చేస్తూ శతృ కేంద్రాలపై మెరుపు దాడులు చేయడం ప్రారంభించారు.

అనేక ప్రాంతాలలో కస్టమ్ అవుట్ పోస్టులు ధ్వంసం చేయబడ్డాయి. గెరిల్లా దళాలు ప్రజల ప్రత్యక్ష సాయంతో బాహాటంగా తిరుగుతూ విస్తృత రాజకీయ ప్రచారాన్ని కొనసాగించాయి. ఈ దళాలకు ప్రజలు ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇచ్చేవారు. శత్రువుల ఆచూకి అందించేవారు. నైజాం సైన్యాలు, రజాకారు మూకలు గ్రామాలలో అడుగు పెట్టకుండా చేయడానికి అనేక రోడ్లను త్రవ్వివేసి గోతులు తీసే కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు. ఈ రకంగా ఈ పోరాటంలో ప్రజల పాత్ర ప్రత్యక్షంగానో, చురుకుగానో కొనసాగింది. దళ సభ్యులు వివిధ స్థాయి రాజకీయ నాయకులు నీటిలో చేపలలాగా ప్రజల మధ్య వుండి ప్రజల చేత పోరాటాన్ని నడిపించేవారు.

ప్రజానీకంపై అమానుషమైన దాడులను సాగించే నిజాం దళాలకు సాయంచేసే

పీడకులైన భూస్వాములు వారి ఏజంట్లనేక మందిని ప్రజలు శిక్షించారు. కొన్ని సందర్భాలలో వారిని చంపటం కూడా జరిగింది. కొందరిని ప్రజా కోర్టులో శిక్షించారు. దానితో తమ ప్రాణాలు రక్షించుకోడానికి గెరిల్లా పోరాటం సాగుతున్న ప్రాంతాలు వదిలి భూస్వాములు, పట్టణాలకు పరిగెత్తారు. గ్రామీణ ప్రాంతమంతా ప్రజా దళాలకు వదలి వేయబడింది. సాయుద దళాలు వున్నప్పుడే ప్రభుత్వమంటూ వుండేది. అలాలేనిచోట అంధ్ర మహాసభ కమిటీలే పాలకులు. పగలొక ప్రభుత్వం. రాత్రొక ప్రభుత్వం రెండు ప్రభుత్వాలుండేవని ప్రజలు చెప్పుకొనేవారు. రవాణా సౌకర్యాలు లేని దూరప్రాంతాలకు పోలీసు దళాలు తరచుగా వెళ్ళేవి కావు.

సంస్థాన కాంగ్రెసు కూడా కొన్ని సాయుధ దళాలను నిర్మాణం చేసింది. కొన్ని ప్రాంతాలలోని పోలీసు స్టేషన్లపై దాడులుకూడా జరిపారు. కానీ అనతి కాలంలోనే నిజాం బలగాల ఉధృతాన్ని తట్టుకోలేక సరిహద్దులకు ఉపసంహరించుకొన్నారు. ఎంతో మంది కాంగ్రెసు యువకులు తమ నాయకత్వం చూపిన బలహీనతలను వ్యతిరేకించారు. నిజంగా సరి అయిన ప్రోత్సాహమే ఇస్తే పోరాటంలో పాల్గొని విజయాలు సాధించగలిగే కార్యకర్తలు కాంగ్రెసుకు లేకపోలేదు.

ప్రఖ్యాత నల్గొండ జిల్లా, వరంగల్లు జిల్లాలలో ప్రధానంగాను, కరీంనగర్, మెదక్, అదిలాబాదు, హైద్రాబాదు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో ఈ సాయుధ ప్రతిఘటన పెద్దఎత్తున కొనసాగింది. రాజధాని నగరమైన హైద్రాబాదుకు కొలదిమైళ్ల దూరములోనే సాయుధ ప్రతిఘటన కేంద్రాలు ఏర్పడ్డాయి. ఈవిధంగా కనీసం 4000 గ్రామాలు విముక్త ప్రాంతాలుగా పరిగణించబడ్డాయి. ఆ గ్రామాలలో నిజాం పరిపాలన తుదముట్టించి ప్రజాపరిపాలన కొనసాగించడం జరిగింది. ఈ గ్రామాలలో సుమారు 10 లక్షల ఎకరాల భూమి ప్రజలకు పంచబడ్డది.

తెలంగాణాలోని మిగతా ప్రాంతాలకు కొన్ని పట్టణాలకు కూడా ఈ సాయుధపోరాటం వ్యాపించింది. ప్రజలు ఆత్మరక్షణ దళాలను ఏర్పాటు చేసుకొని రజాకారు మూకల దౌర్జన్యాలను వీరోచితంగా ఎదిరించారు. అదే విధంగా మరాట్వాడా, కర్ణాటక ప్రాంతాలలో నిజాం వ్యతిరేక ప్రతిఘటన పోరాటాలు, దళ చర్యలు కొనసాగినవి. సంస్థాన వ్యాపితంగా నిజాం ప్రభుత్వం ప్రజల కోపాగ్నికి గురి అయినది. ప్రజాస్వామ్య వాదులు స్వాతంత్ర పిపాసగలవారు ఎవరూగూడా నిరంకుశ నిజాం సైనికపాలనపట్ల సానుభూతి చూపించలేదు. ఈవిధంగా తెలంగాణా ప్రాంతములో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వములో సువిశాల వేదికపైన అంధ్ర మహాసభ నేతృత్వములో స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, భూస్వామ్య వ్యతిరేక మహోద్యమం వెల్లువలా కొనసాగింది. అనతికాలం లోనే మరెన్నో వేల గ్రామాలు విముక్తి ప్రాంతాలుగా ప్రకటించబడి నిజాం ప్రభుత్వాన్ని కూలద్రోసే రాజకీయ ఉద్యమ పరిణామం కనుచూపు మేర కొలిక్కి వచ్చింది.

1948 సెప్టెంబరు 13 నాడు భారతసైన్యం పలుదిశలనుండి సంస్థానంపై దాడిచేసింది. ''పోలీసుచర్య'' జరిపింది. అదివరకే ప్రజలచే వెలివేయబడి ఒంటరిగా మిగిలిన నిజాం బలగాలు బలోపేతమైన భారతసైన్యం ముందు కుప్పకూలిపోయాయి. మతమౌఢ్యంతో సాగిపోతున్న వేలాది రజాకార్లు, సింహగర్జనతో ముందుకు సాగిపోతున్న భారత ట్యాంకుల క్రింద నలిగి చితికి పోయారు. కొన్ని గంటలలోనే ఈసైన్యాలు నలుదిశలనుండి హైద్రాబాదు నగరాన్ని కైవసం చేసుకొన్నది. తాము ద్వేషిస్తున్న కిరాతక ప్రభుత్వం ముక్కలు చెక్కలై కుప్పకూలిపోవడాన్ని కండ్లారా చూస్తున్న ప్రజాసామాన్యం నిట్టూర్పు విడిచింది. పీడ విరగడ కావడంతో అమితోత్సాహాన్ని ప్రదర్శించింది. స్వతంత్ర హైద్రాబాదు నినాదం మూగబోయింది. హైద్రాబాదు సంస్థానం భారతదేశంలో విడదీయరాని భాగంగా మారింది. సంస్థాన రాజకీయ, ఆర్థిక సాంఘిక సమస్యలు సువిశాల భారతావని సమస్యలతో ముడివడిపోవటం ప్రారంభమైంది.

కేంద్ర కాంగ్రెసుకు నాయకత్వం అనుసరించిన రాజకీయ పంథా తెలంగాణా ప్రాంతములో నూతన సమస్యలను సృష్టించింది. తెలంగాణాలో విముక్తి ఉద్యమానికి ప్రధాన నాయకత్వం వహించి అనేక త్యాగాలుచేసిన కమ్యూనిస్టు పార్టీ, అంధ్ర మహాసభపై నిషేధం పెట్టింది. వేలాది కార్యకర్తలు, నాయకులను అరెస్టుచేసి జైళ్ళునింపడం ప్రారంభించింది. అంత వరకు నిజాం ముష్కరుల నెదిరించిన ప్రజాసేవకులు అమాంతంగా భారతసేన దాడికి గురికావలసి వచ్చింది. వందలాది కమ్యూనిస్టులు సైనికులచే హతమార్చబడ్డారు. వేలాది కార్యకర్తలు అరెస్టుచేయబడి జైళ్ళలో నెట్టబడ్డారు. ఉన్న జైళ్ళు సరిపోవని అనేక క్యాంపుజైళ్లు ఏర్పాటుచేయబడ్డాయి. పోలీసులు, సైనికులు, కనీవిని ఎరుగనివిధంగా కమ్యూనిస్టులను చిత్రహింసలకు, చిత్రవధలకు గురిచేశారు. కమ్యూనిస్టుపార్టీ విముక్త ప్రాంతాలను నిర్మించి భూస్వామ్య విధానాన్ని తుదముట్టించడాన్ని భారతప్రభుత్వం సహించలేదు. గ్రామీణ జీవితంలో దోపిడీలేని ప్రజాస్వామ్య పరిపాలనచూచి కేంద్ర పాలకులు భయపడ్డారు. ఇది ఇలాగే కొనసాగితే తమ పరిపాలనకే ప్రమాదముగా పరిణమించవచ్చునని ఆందోళన చెందారు. ఆనాటి కేంద్ర హోంమంత్రి శ్రీ సర్ధార్ పటేల్ చేసిన ఉపన్యాసాలు దీనికి ప్రబల నిదర్శనం.

అత్యంత హీనమైన ఈదమనకాండను కమ్యూనిస్టు యోధులు వీరోచితంగా ఎదిరించారు. పోలీసు యాక్షను తరువాత రాజకీయ పరిస్థితులలో వచ్చిన మౌళిక వర్గ సంబంధాలు రాజకీయ మార్పు గురించి ఓపికతో ఆలోచించి నిర్ణయించడానికి కూడా కాంగ్రెసు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదు. గ్రామీణ ప్రజానీకాన్ని గూడా సామూహిక హింసలకు గురిచేసింది. కమ్యూనిస్టుపార్టీ, అంధ్ర మహాసభలు అమలుపరిచిన నిర్ణయాలు పెద్దఎత్తున తిరగదోడడం ప్రారంభించింది. కాంగ్రెసు నాయకులకు తీవ్రపరిణామాలను కల్పించే సంస్కరణలు అంగీకరించే ఇష్టంలేదు. వలస, అర్ధవలస, సాంఘిక, ఆర్థిక వ్యవస్థను క్రమంగా సంస్కరించే తన లక్ష్యాలకు అనుగుణంగా స్వతంత్ర పెట్టుబడిదారీ

పంథా పెదుగుదలకు కృషి చేయాలన్నది కాంగ్రెసు విధానం . అదే విధానాన్ని హైద్రాబాదు సంస్థానంలో అనుసరించదలచుకొన్నది. సంస్థానాధిపతితో భూస్వాములతో రాజీపడే విధానాన్ని అవలంభించింది. ఫ్యూడల్ వ్యవస్థను తుడిచెపెట్టే బదులు ఆ వ్యవస్థను సంస్కరిస్తూ తమ రాజ్యాధికారాన్ని పదిలపరచుకొనే విధానాన్ని అనుసరించింది.

కేంద్ర కాంగ్రెసు నాయకత్వం సూచించిన రాజీ ప్రతిపాదనలు మొదలే నైజాం అంగీకరించినట్లయితే సంస్థానంలో ఆర్థిక, సాంఘిక మార్పులు ఈ మాత్రం కూడా వచ్చేవి కావు. నిజాం మొండితనం - మూర్ఖత్వంతో భారత యూనియన్‌ను ధిక్కరించినందు వలన సైనిక చర్య ద్వారా మాత్రమే అతని అధికారం అంతమైనందువలన భారత ప్రభుత్వం పాత యంత్రాంగాన్ని తుడిచి పెట్టి కొత్త వ్యవస్థను నిర్మించుకోవలసి వచ్చింది. అందుకే ఇతర స్వదేశీ సంస్థానములో కొన్ని సంస్కరణలు మరింత వేగంగా జరిగినవి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో నడుస్తున్న గెరిల్లా పోరాటం, ప్రజాతంత్ర ఉద్యమం బలీయముగా నుండటం దీనికి ముఖ్యకారణం.

పోలీసు చర్య తరువాత జనరల్ జె.యన్.చౌదరి గవర్నర్ జనరల్‌గా నియమించబడ్డాడు. ప్రభుత్వ యంత్రాంగంలో గూడుకట్టుకొని యున్న నిజాం విశ్వాసపాత్రులైన ఉన్నతాధికారుల ప్రక్షాళన జరిగింది. కొత్త ఉద్యోగస్థులు, వారి స్థానాన్ని ఆక్రమించారు. హైద్రాబాదు సైన్యాన్ని భారత యూనియన్ సైన్యంతో విలీనం చేశారు. నిజాం నామమాత్రపు పాలకుడుగా మిగిలిపోయారు. ప్రజా ఉద్యమ ఉధృతిని అది సాధించిన మౌలిక విజయాలను చూస్తూ కాంగ్రెసు పరిపాలన కూడా కొన్ని ముఖ్యమైన వ్యవస్థాపూర్వక మార్పులను సాధించే చట్టబద్ధ చర్యలు చేయవలసి వచ్చింది. 17 కోట్ల రూపాయల నష్టపరిహారాన్నిచ్చి జాగీర్దారీ వ్యవస్థను రద్దు చేశారు. నిజాం నవాబుకు కూడా ఏడాదికి ఒక కోటి రూపాయల నష్టపరిహారం ఇచ్చారు. హైద్రాబాదు జిల్లాలో 20 వేల ఎకరాల భూమిని అతని స్వంత ఉపయోగానికి వదలివేశారు. అసలు ప్రపంచంలోకెల్లా పెద్ద ధనవంతుడుగా ప్రతీతి చెందిన నిజాం నవాబు యొక్క స్వంత ఆస్థిని, కట్టడాలని బ్యాంకు నిలువలను, వజ్ర వైఢూర్యాలనూ, బంగారు వెండిని ఏమాత్రం ముట్టుకోలేదు. నిజాం చేసిన మహా పాపాలకు కాంగ్రెసు ప్రభుత్వం యిచ్చిన బహుమతి ఇది.

సైనిక ప్రభుత్వం ప్రకటించిన జాగీర్దారీ విధానం రద్దు చట్టం వలన జాగీర్దారీ వ్యవస్థ కుప్పకూలి పోయింది. తాము సాగుచేసుకొన్న భూములపైన వారు యజమానులుగా మిగిలిపోయారు. తమ సాగులోనున్న భూములపై రైతాంగ మంతా యాజమాన్యపు హక్కు సాధించుకొన్నది. జాగీర్లలోనున్న అధిక శిస్తులు రద్దు అయి ఖాల్సా ప్రాంతంలోని శిస్తులకు సమానము చేయబడ్డది. తరువాత 1950లో మరొక భూసంస్కరణల చట్టం కౌలుదారీ చట్టం పేరిట అమలులోకి వచ్చింది.

దీని ప్రకారం లక్షలాది సామాన్య కౌలుదారులు చట్టబద్ధమైన రక్షణ పొందారు. బేధఖలు కాకుండా వంశ పరంపర కౌలు హక్కు -కౌలు భూమిని కొనుక్కొనే హక్కులాంటి ప్రధానమైన హక్కులు ఈ చట్టములో పొందుపరచబడ్డాయి. భూస్వాములు భూములపై సీలింగ్ అనే సిద్ధాంతం ప్రప్రథమంగా ఉల్లేఖించబడ్డది. కాంగ్రెసు వాదులలో కూడా అభ్యుదయ వర్గం శ్రీ స్వామీ రామానంద తీర్థ నాయకత్వంలో ఏర్పడి ప్రజాహిత విధానాలకు కొంత కారణభూతమైంది. మితవాద నాయకత్వానికి వ్యతిరేకంగా ఈవర్గం నిరంతరం తన వత్తిడిని తెచ్చేది. శ్రీయుతులు బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, డా. యం. చెన్నా రెడ్డి మొదలగు వారు మితవాద గ్రూపులో అగ్రగణ్యులైతే శ్రీయుతుల స్వామీ రామానంద తీర్థ, గోవిందధాస్ ష్రాఫ్, వి.బి. రాజు, డా. మెల్కోటే. డి.జి. బిందు, పి.వి. నరసింహారావు మొదలగు వారు అభ్యుదయ భావాల గ్రూపులో అగ్రగణ్యులని పేర్కొనవచ్చు.

మారిన నూతన రాజకీయ పరిస్థితులలో సాయుధ గెరిల్లా పోరాటాన్ని యధాతధంగా కొనసాగించడమా లేక సాయుధ పోరాటాన్ని ఉపసంహరించుకొని ఏర్పడిన నూతన రాజకీయ పరిస్థితులలో నూతన ఎత్తుగడలతో ప్రజా ఉద్యమాన్ని నిర్వహించాలా అను అంశంపై కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన అభిప్రాయ భేదాలు తలెత్తినవి. 1948 సెప్టెంబరులో జరిగిన పోలీసు చర్య వెను వెంటనే ఈ వివాదం అవతరించింది. కాలము గడచినకొలది, కొనసాగుతున్న సాయుధ గెరిల్లా పోరాటం బాహ్యంగా శత్రుదాడులకు గురి అవుతూ అంతరంగికంగా అభిప్రాయ భేదాలతో కొట్టుమిట్టాడుతూ మొత్తముగా క్రమంగా క్షీణ దశలో పడ్డది. వందల దళాలలో వేలాది గెరిల్లా యోధులతో లక్షలాది కష్ట జీవుల కనుసన్నలతో పుట్టి పెరిగి తెలంగాణా ఆర్థిక, సాంఘిక, రాజకీయ చిత్రపటములో చెరగని స్థానాన్ని ఏర్పరచుకొన్న ప్రజా ఉద్యమం కాబట్టి ఎన్ని బలహీనతలు వెన్నంటినా అది సులభంగా కృంగిపోలేదు. కృషించి పోలేదు. అడవులలోకి, సుదూర కొండ ప్రాంతాలలోకి తరలిపోయిన గెరిల్లా దళాలు తమ ఆత్మరక్షణకై విశ్వప్రయత్నాలు కొనసాగించినవి.

1948 మధ్య భాగం నుండి 1952 మధ్య భాగము వరకు దాదాపు 4 సంవత్సరములు అత్యంత కఠినమైన పరిస్థితులలో అనుకూల రాజకీయ వాతావరణంలో అంతరంగిక విభేదాలతో ప్రజానాయకులుగా పేరు ప్రతిష్టలు సంపాదించుకొన్న గెరిల్లా యోధులు తమ జీవితాన్ని గడిపారు. జాతీయ కాంగ్రెసు జవహర్‌లాల్ నెహ్రూగారి నాయకత్వంలో పరిపాలన సాగిస్తున్న రోజులవి. సుధీర్ఘ స్వాతంత్ర్య పోరాటంలో కన్న కలలను నిజం చేసుకొందామనే అమిత ఆకాంక్షతో ఎదురుచూస్తున్న ప్రజలు నెహ్రూ ప్రభుత్వానికి కొండంత అండ ఇస్తున్న కాలమది. ఇటువంటి వినూత్న రాజకీయ పరిణామాన్ని ఏ మాత్రం గుర్తించ నిరాకరించింది. 1948లో కలకత్తాలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ

రెండవ కాంగ్రెసు, మనదేశానికి వచ్చింది. అసలు స్వతంత్రమే కాదని నెహ్రూ, చైనాలో చెంగ్ ఖైషేక్ లాగా సామ్రాజ్యవాదుల తొత్తుగా పనిచేస్తున్నాడని విశ్లేషణ చేయబడ్డది. దేశములో ప్రజలందరిలో నూతన ప్రజాతంత్ర విప్లవ చైతన్యం కట్టలు త్రెంచుకొని ప్రవహిస్తున్నదని, విప్లవపార్టీ అయిన భారత కమ్యూనిస్టు పార్టీ విప్లవ పోరాటానికి పిలుపు ఇవ్వడమే తరువాయి అని నిర్ధారణ చేయడం జరిగింది. పిలుపునుగూడా ఇవ్వటం జరిగింది. ఈ పిలుపు ఫలితంగా దేశ వ్యాపితంగా ముఖ్యంగా పార్టీ బలంగా నున్న కేంద్రాలలో వందలాది కమ్యూనిస్టు వీరులు ఆత్మ బలిదానం చేయవలసి వచ్చింది. క్రమక్రమంగా పార్టీ బలము తరుగుతూ పోయిందే కానీ విజయాలు సాధించలేదు. ఉద్యమాలు విస్తరించలేదు. పార్టీ పట్ల ప్రజల ప్రత్యక్ష సహకారం సన్నగిల్లుతూ పోయింది. ఒకానొక దశ చేరుకొన్న తరువాత ఈ ప్రత్యక్ష సంబంధం కూడా తెగిపోయింది.

1948 రెండవ పార్టీ కాంగ్రెసులో అనుసరించిన పంథా సరి అయినది కాదని భారత విప్లవం చైనా విప్లవ పంథాలో కొనసాగుతుందని గ్రామీణ ప్రాంతాలలో గెరిల్లా దళాలు ఏర్పడి విముక్త ప్రాంతాలను నిర్మించి తరువాత పట్టణ ప్రాంతాలను చుట్టుముట్టి పట్టణాలను విముక్తి చేయాలనే వాదన బయలుదేరింది. ఇలాంటి గెరిల్లా పోరాటం దావానలంగా వ్యాపిస్తుందని వీరి విశ్లేషణ. ఒక సంవత్సరములోగానే ఈ సిద్ధాంతం కేంద్ర నాయకత్వముచే అంగీకరించబడి ఆచరించబడ్డది. వ్యూహం ఎత్తుగడలలో మార్పుతేబడ్డది. ఒకటి రెండు సంవత్సరాలలో ఈ ఎత్తుగడలు కూడా చిత్తయి పోయినవి. ప్రజల చైతన్య స్థాయికి అందని పొందని నినాదాలుగా మిగిలి పోయినవి. పార్టీ ప్రజలనుండి మరింత వెలివేయబడి దూరం అయినది. అయితే పార్టీ సభ్యులు, కార్యకర్తలు ముఖ్యంగా అత్యంత ఉన్నత త్యాగానికి స్థిరపడి పార్టీని నమ్మి రణరంగంలో దూకిన గెరిల్లా యోధులెందరో ప్రాణతర్పణ చేశారు. అసమానమైన ఆధునిక ఆయుధాలు కలిగిన భారత సైన్యాన్ని ఎదిరించలేక అసువులుబాశారు.

దేశ వ్యాపిత కమ్యూనిస్టు కేంద్రాలలో ఈ అనుభవాలు కష్ట నష్టాలు కనబడినా కమ్యూనిస్టు పార్టీకి బలమైన పూర్వ రంగం కలిగిన తెలంగాణా పోరాటంలో గెరిల్లా యోధులు చాలా పెద్ద మూల్యం చెల్లించవలసి వచ్చింది. వేలాది గెరిల్లా యోధులు తాము నమ్మిన సిద్ధాంతాన్ని క్రమశిక్షణతో ఆచరిస్తూ అంతిమ శ్వాసవదిలారు. 1952లో దేశవ్యాపితంగా జరిగిన సాధారణ ఎన్నికల తరుణంలోనే సాయుధ పోరాట విరమణ జరిగింది. అది గూడా వాస్తవిక పరిస్థితులలో విధి లేక చెప్పినట్లుగా చెయ్యబడిందేకాని బాధ్యతాయుతంగా పార్టీ యొక్క అధికారిక ప్రకటనలు వెలువడలేదు. సాయుధ పోరాటంలో ఎన్ని రాజకీయ బలహీనతలు ఉన్నప్పటికీ అననుకూల పరిస్థితులలో అనవసర త్యాగాలు చేసి తీవ్రంగా నష్టపోయినప్పటికీ తెలంగాణా ప్రాంత కష్టజీవులు కమ్యూనిస్టు పార్టీని ఏ మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ఆనాటికి భూస్వామ్య వర్గం

కాంగ్రెసు పార్టీ బలముతో తిరిగి తన దుర్మార్గాలను బలపరచుకొన్నప్పటికీ వారు కొనసాగించిన దుర్మార్గాలను కన్పరచిన కమ్యూనిస్టు వ్యతిరేకతను సహించలేదు.

సాయుధంగా ఎదిరించలేని పరిస్థితులలో ఓట్ల ద్వారా తమ వ్యతిరేకతను ప్రస్ఫుటం చేశారు. ప్రజాతంత్ర ఐక్య సంఘటన పేరుతో చేయి గుర్తుతో తెలంగాణా ప్రాంతములో ఎన్నికలలో నిలబడిని కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరులు అత్యధికులు అత్యధిక మెజారిటీలతో గెలుపొందారు. ఒకరు రెండు సీట్లను మూడు సీట్లను కూడా గెలిచిన అనుభవాలు వున్నాయి. నల్గొండ పార్లమెంటు సీటుకు పోటీ చేసిన శ్రీ రావి నారాయణ రెడ్డిగారు, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కంటే కూడా ఎక్కువ మెజారిటీతో గెలుపొంది భారత దేశంలోనే రికార్డు సృష్టించారు.

ఈ చారిత్రిక తెలంగాణా సాయుధ పోరాటం గురించి సమిష్టి అభిప్రాయాలు ఏర్పడక పోవడం అనుభవాల గురించి ఏకాభిప్రాయం కలిగి సకాలంలో గుణ పాఠాలు తీసి యువతరానికి అందజేయకపోవడం చాలా దురదృష్టకరం. ఈ మహోజ్వల ప్రజా పోరాటం గురించి అశాస్త్రీయమైన, అవాంఛనీయమైన గుణపాఠాలు తీయబడి బహుళ ప్రచారంలో పెట్టబడ్డవి. వాటిని కాదనడానికి బాధ్యతతో ఎవరూ ముందుకు రాలేని పరిస్థితి కూడా కలిగింది. తత్ఫలితంగా తెలంగాణా వీరోచిత గెరిల్లా పోరాటం అనుభవాల పేరిట అనేకానేక వ్యక్తిగత హింసా వాదాలు చెలరేగి ''అరాచక అతివాద విధానాలు'' అమలుపరచ బడ్డాయి. ''విప్లవం'' పేరిట నిజమైన విప్లవోద్యమానికి తీరని హాని సమకూర్చడం జరిగింది. కమ్యూనిస్టు ఉద్యమానికి అపఖ్యాతిని కూడా అంటగట్టడం జరిగింది. బూర్జువా భూస్వామ్య వర్గాలు స్వైర విహారం చేస్తూ అతివాద ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా అణచి వేయడానికి వీలు కలిగింది.

తెలంగాణా సాయుధ పోరాటం గురించి తెలంగాణా సాయుధ పోరాట వజ్రోత్సవ సందర్భములో అమూల్యమైన అనుభవ సంపదను అందించడం జరిగింది. ఆ మహత్తర సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొని నాయకత్వం వహించిన అకుంఠిత త్యాగాలు చేసిన విప్లవవీరులు తమ అమూల్య అనుభవాలను వ్రాతపూర్వకంగా ప్రజలముందు పెట్టారు. అసలు తెలంగాణా పోరాట నిర్మాతలలో అగ్రగణ్యులు పోరాట నిర్వహణలో అసహాయ శూరులో అననుకూల పరిస్థితులలో పోరాట ఉపసంహరణ దీక్షాదత్తులు, ఈనాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు గారు తెలంగాణా సాయుధ పోరాట వజ్రోత్సవ సందర్భంగా రచించిన తమ వ్యాసంలోని ఈక్రింది భాగము అత్యంత కనువిప్పుగా నుంటుంది.

''తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సాగుతున్న సమరశీల ప్రజా ఉద్యమాన్ని అణచి వేయటానికి భారత ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేయసాగింది. 50 వేల సైనికులను, సాయుధ పోలీసులను మోటారు రవాణా వాహనాలతో సహా

దేశంలోని వివిధ రాష్ట్రాలనుండి సమీకరించి సంస్థానంలోకి పంపింది. గెరిల్లా పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో సైనిక శిబిరాలు ఏర్పరచింది. రవాణా సౌకర్యాలు ఆధునీకరణ చేయబడ్డాయి. అన్ని జిల్లా, తహసీలు కేంద్రాల మధ్య టెలిగ్రాఫ్, టెలిఫోన్ సంబంధాలు ఏర్పరిచారు. గెరిల్లా పోరాట ప్రాంతాలలో వైర్లెస్ సమాచార కేంద్రాలను పెట్టారు. తగినంతగా ఆయుధాలు లేని గెరిల్లా దళాలు, ఈ ఆధునికమైన సైనిక శక్తిని ఎదుర్కోవడం తేలికకాదు. ఇంతకు ముందు గెరిల్లాలు ప్రతిఘటించిన నిజాం సాయుధ బలగాలు, రజాకార్ దళాలు, భారత సైన్యంతో పోలిస్తే ఎందుకు కొరగావు.

ఇవన్నీగాక పూర్తిగా నూతనమైన ముఖ్యమైన ఒక కొత్త రాజకీయ పరిస్థితి ఏర్పడ్డది సంస్థానంలో, పోలీసు చర్య తరువాత ఏర్పడిన ఈ పరిణామాన్ని పరిశీలనలోకి తీసుకోవాలి? పోరాటకాలంలో నిజాం వ్యతిరేక సంఘటనగా కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీ తదితర రాజకీయ శక్తులు రూపొందకపోయినప్పటికీ ఈ శక్తులన్నీ నిజాంకు వ్యతిరేకంగా తమకు తోచిన పద్ధతిలో పోరాడాయి. ప్రజలంతా ఐక్యంగా ఉన్నారు. సాయుధ పోరాటాన్ని బలపరచటమో, లేక సానుభూతి ప్రదర్శించటమో చేసేవారు. నిజాం దళాలు, రజాకారు గూండాలు తమను ఒక వైపున ఊచకోత సాగిస్తూండగా తమ నాయకులు, నిజాంతో రాజీకై సాగిస్తున్న కుట్రలవల్ల కాంగ్రెసును అనుసరిస్తున్న ప్రజానీకం ఆగ్రహం ప్రదర్శించేవారు. పోలీసు చర్య తరువాత పరిస్థితి మౌలికంగా మారింది. పట్టణాలలోని సాధారణ ప్రజానీకము, సాయుధ పోరాటాలు జరగని ప్రాంతాలలోని ప్రజానీకం, మొత్తం మీద కాంగ్రెసును బలపరచేవారు. రైతాంగంలోని పై వర్గం, సాయుధ పోరాట ప్రాంతాలలో సైతం కాంగ్రెసువైపు చేరారు. నిజాం నిరంకుశ పాలన అంతమైనందుకు ప్రజలు మొత్తం మీద హర్షం వెలిబుచ్చారు. తన వాగ్దానాలు అమలు జరుపటానికి గాను కాంగ్రెసుకు ఒక అవకాశం ఇవ్వాలని వారు అనుకున్నారు. సంస్థానంలో సాయుధ పోరాటం కొనసాగించడం పట్ల దేశ ప్రజలు సానుభూతి ప్రదర్శించే స్థితిలో లేరు.

ఆనాటి రాజకీయ, సైనిక పరిస్థితిపై వాస్తవ దృష్టితో సరియైన అంచనా వేసుకున్నట్టయితే, సాయుధ పోరాటం సాగించడం అసాధ్యమని సహజంగా ఎవరైనా నిర్ణయానికి వస్తారు. వీరోచిత సాయుధ పోరాటం పొందిన విజయాలను కాపాడుకోటానికి నూతన అవకాశాలను వినియోగించుకొని దానిని పునర్నిర్మించటానికి ఒక నూతన విధానం అత్యవసరమని గుర్తించేవారు.

కాని అలా జరుగలేదు. ఏమంటే అంతకుముందే 1948 ఫిబ్రవరిలో కలకత్తాలో మనపార్టీ పూర్తి సెక్టేరియన్ రాజకీయ ఆచరణాత్మక విధానంతో కూడిన రాజకీయ పంథాను చేపట్టింది. ఈ కాంగ్రెసులో కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర శాఖ ప్రముఖ పాత్ర వహించింది. ఈ సెక్టేరియన్ విధానాన్ని అవకాశంగా తీసుకొని కాంగ్రెసు ప్రభుత్వం

మన పార్టీపై నిర్బంధ విధానం తీవ్రతరం చేసింది. కలకత్తా కాంగ్రెసుకు పూర్వమే మన పార్టీ అంధ్రశాఖపై ఈ దాడి ప్రారంభమైంది. తెలంగాణా సాయుధ పోరాటానికి ఆంధ్ర ప్రాంతం సరఫరా వేదికగా ఉండకుండా చేసేందుకే ఈ దాడి ఉద్దేశితమైంది.

కమ్యూనిస్టు పార్టీని బలమైన వందలాది సాయుధ పోలీసులు చుట్టుముట్టారు. ప్రజలందరినీ మందకట్టి, వారిపై లాఠీలు ప్రయోగించారు. నగ్నంగా గ్రామాలలో వారిచే ప్రదర్శనలు చేయించారు. స్త్రీలను చెరిచారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుల సానుభూతిపరుల పంటలను నాశనం చేశారు. సాగు చేయటానికి వీలులేకుండా వారు నిరోధించబడ్డారు. కొంత మంది కమ్యూనిస్టులను కాల్చివేశారు.

ఈ పరిస్థితులలో, పూర్తి నిస్పృహతో, కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రశాఖ 'కంటికి కన్ను, పంటికి పన్ను' అనే నినాదం ద్వారా ప్రతిఘటనకు పిలుపునిచ్చింది.

కాని ప్రభుత్వం యొక్క, ఆంధ్ర కాంగ్రెసు యొక్క సమిష్టి దాడిని తట్టుకోగల స్థితిలో కమ్యూనిస్టు ఉద్యమం లేదు. ఈ సందర్భములో మరొక విషయం గుర్తుంచుకోవాలి. అప్పుడు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడైన యన్.జి. రంగా నాయకత్వాన కాంగ్రెసు గూండా దళాలను ఏర్పరచింది. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమంపై దాడులు, చిత్రహింస సాగించటంతో, సాయుధ పోలీసులకు ఈ గూండా దళాలు తోడ్పడ్డాయి. 1948 సెప్టెంబరులో యూనియన్ సైన్యాలు హైద్రాబాదు సంస్థానంలో ప్రవేశించక ముందే ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం ఒక మూలకు నెట్టివేయబడింది. కనుక పోలీసు చర్య తరువాత ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలోని కమ్యూనిస్టు ఉద్యమాన్ని "ఇక ముందు ఏమి చెయ్యాలి" అనే ప్రశ్న ఎదుర్కొన్నది.

రెండు ప్రాంతాలలోని కమ్యూనిస్టు పార్టీలు సన్నిహిత సహకారంతో పనిచేస్తూ వచ్చాయి. కలకత్తా కాంగ్రెసు తర్వాత కొద్ది కాలానికి రెండు నాయకత్వాలను విలీనంచేసి, ఉద్యమాన్ని నడపడానికి ఒకే నాయకత్వం ఎన్నుకోబడింది. తెలంగాణా సాయుధ పోరాట భవిష్యత్తు ఏమి అనే సమస్య ఇప్పుడీ నాయకత్వాన్ని ఎదుర్కొంది. ఈ క్రమంలో, ఈ సంయుక్త నాయకత్వం తెలంగాణాకు, ఆంధ్ర ప్రాంతాలకే కాక మొత్తం దేశానిక్కూడా వర్తించే ఒక సమగ్ర రాజకీయ విధివిధానాన్ని రూపొందించింది. భారత విప్లవం రష్యన్ పంథాలోకాక అందుకు ప్రత్యామ్నాయంగా చైనా పంథాలో సాగుతుందనే వాదన రూపొందింది. ఈ సిద్ధాంత ప్రతిపాదనగల పత్రాన్ని నూతన నాయకత్వం రూపొందించింది.

**ఈ పత్రంలోని ప్రధాన అంశాలు ఇవి:**

భారతదేశ విప్లవం ప్రజాతంత్ర విప్లవ దశలో ఉంది. భారతదేశం వెనుకబడిన అర్ధవలస దేశం కనుక ఈ విప్లవ పంథాను అనుసరిస్తుంది. తెలంగాణా సాయుధ గెరాల్లా పోరాటం ఇందుకు తార్కాణం. ఈ పంథాలోని కీలకాంశం ఏమంటే, భారతదేశంలో

కూడా ప్రజాతంత్ర విప్లవం చైనాలో వలెనే సాయుధ గెరిల్లా మార్గాన్ని చేపడుతుంది. రష్యాలో వలె రాజకీయ సాధారణ సమ్మె సాయుధ తిరుగుబాటు పంథాను కాదు. విప్లవంలో కార్మిక వర్గం ప్రత్యక్షంగా నాయకత్వ పాత్రను వహించ లేదు. నాయకత్వ పాత్ర కార్మిక వర్గ పార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుంది. మొదట్లో దేశంలోని వివిధ ప్రాంతాలలో సాయుధ గెరిల్లా ప్రతిఘటన కేంద్రాలను అభివృద్ధి చేయాలి. పిమ్మట ఈ ప్రాంతాలు విముక్త ప్రాంతాలు ఔతాయి. స్వంత సాయుధ బలగాలను ప్రభుత్వ యంత్రాంగాన్ని కలిగి ఉంటాయి. ఆ పిమ్మట విముక్త ప్రాంతాల నుండి బయలుదేరిన సైనిక దళాలు పట్టణ ప్రాంతాలను విముక్తి చేస్తాయి.

ఇది సర్వ సమగ్రమైన ఊహా ప్రధానమైన సెక్టేరియన్, పంథా. దేశ పరిస్థితులతో ఏమాత్రం పొందికలేని పంథా. చైనా పంథాకు మక్కీకి మక్కీ అనుసరణ. చైనా విప్లవం కష్టభూయిష్టమైన దీర్ఘకాల పోరాట పంథాను చేపట్టవలసి రావటానికి, ఆ దేశంలో ఉన్న భౌతిక పరిస్థితులు, నాయకత్వ పరిస్థితులు కారణం.

**మొదటి అంశం:**

చైనా అర్థికంగా చాలా వెనుకబడిన దేశం. ఆధునిక పరిశ్రమలు, ఆధునిక రవాణా సౌకర్యాలు అతి స్వల్పం, బూర్జువా వర్గం బలహీనంగా వుంది.

**రెండో అంశం:**

చైనాలో కేంద్ర ప్రభుత్వ పాలన అతి బలహీనంగా ఉండేది. రాష్ట్ర పరిపాలనపై సైనిక ప్రభువులు పెత్తనం చేస్తూ వుండేవారు.

**మూడో అంశం:**

చైనాలో మొదటి నుండి విప్లవం 'సైనిక విప్లవ ప్రతీఘాతాన్ని ఎదుర్కొనే సైనిక విప్లవం' పంథాను అనుసరించింది. స్వంత సైనిక బలం కలిగిన కమ్యూనిస్టు పార్టీ విప్లవానికి నాయకత్వం వహించింది.

**నాలుగోఅంశం:**

ప్రథమ సోషలిస్టు దేశమైన, సోషలిస్టు మహా దేశం చైనాకు పొరుగున ఉంది. ప్రారంభం నుండి విప్లవానికి సాయం చేస్తూఉంది. విప్లవం యొక్క ఆఖరు దశలలో, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత చైనా విప్లవానికి సోవియట్ యూనియన్ పెద్ద ఎత్తున ప్రత్యక్ష సహాయం అందజేసింది. జపాన్ సైన్యాన్ని చావు దెబ్బతీసి పారిశ్రామికంగా బాగా అభివృద్ధియైన మంచూరియాను సోవియట్ యూనియన్ స్వాధీనం చేసింది. అప్పటి నుండి చైనా విప్లవ అంతిమ విజయం వరకు సోవియట్ యూనియన్ చైనా కమ్యూనిస్టు పార్టీకి అవసరమైన సహాయాన్నంత యిచ్చింది. సోవియట్ యూనియన్ నుండి

సర్వతోముఖమైన ఈ సహాయం అందకపోయినట్లయితే చైనా విప్లవ భవిష్యత్తు ఎలా ఉండేదో ఎవ్వరూ చెప్పలేరు.

చైనాలో సాయుధ పోరాటానికి యిన్ని అనుకూల పరిస్థితులున్నప్పటికీ, చైనా విప్లవం కష్టతరమైన దీర్ఘకాల పోరాట మార్గాన్ని చేపట్టక తప్పలేదు. అక్కడ కార్మిక వర్గం సంఖ్యాబలంలోనూ, గుణాత్మకంగానూ బలహీనంగా ఉండటం, విదేశీ సామ్రాజ్యవాదులు జోక్యం చేసుకోవటం అందుకు కారణం.

24 సంవత్సరాల క్రితం సైతం పై పరిస్థితులలో ఏ ఒక్కటి భారతదేశంలో లేవు. అట్టి స్థితిలో కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రశాఖ నాయకత్వం పైన పేర్కొన్న చైనా నమూనా పంథాను ప్రతిపాదించింది. చైనా అంతగా భారతదేశం వెనుకబడి లేదు. మనం స్వాతంత్ర్యం పొందేనాటికే భారతదేశంలో భారీ పరిశ్రమలు గణనీయంగా ఏర్పడినాయి. రవాణా సౌకర్యాలు బాగా ఏర్పడ్డాయి. కేంద్రీకృతమూ, సుసంఘటితమూ అయిన పరిపాలనా వ్యవస్థఉంది. భారత జాతీయ కాంగ్రెస్ రూపంలో బలమైన బూర్జువా వర్గ పార్టీ ఉంది. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన అపారమైన పలుకుబడి, ప్రతిష్ఠ కాంగ్రెసు నాయకత్వానికి ఉన్నవి. తనకు గల విస్తారమైన మెజారిటీతో కేంద్ర ప్రభుత్వం పైన, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలపైన కాంగ్రెసు పార్టీ తన పెత్తనం సాగిస్తున్నది. కాంగ్రెసుతో పోల్చి చూస్తే కమ్యూనిస్టు పార్టీ రాజకీయంగా, బలహీనంగా ఉంది. దేశంలో విస్తారమైన ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ శాఖలు లేవు.

కాని కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర శాఖ నాయకత్వం తన స్వీయ మానసిక ధోరణిలో ఈ ప్రమాదకరమైన పంథాను చేపట్టింది. పైన వివరించినట్లు నిర్దిష్టమైన అనుకూల పరిస్థితులున్న తెలంగాణాలో, నిజాం వ్యతిరేక పోరాట దశలో సాధించిన పరిమిత విజయాలతో ఉత్తేజితమై ఈ పంథాను చేపట్టింది.

ఈ ఆంధ్ర నాయకత్వం స్వీయ మానసిక ధోరణిలో ఈ పంథా చేపట్టడానికి గల మరొక కారణాన్ని కూడా యిక్కడ పేర్కొనాలి. ఛాంగ్కై షేక్ సేనలపై చైనా ఎర్ర సైన్యం అద్భుత విజయాలను సాధిస్తున్నది. వియత్నాం, మలయా, బర్మా, ఫిలపైన్ తదితర ఆగ్నేయాసియా దేశాలలో విస్తారంగా సాయుధ గెరిల్లా పోరాటాలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ కూడా స్వీయ మానసిక ధోరణికి గొప్ప ఊతం యిచ్చాయి. చైనా, ఆగ్నేయాసియాలో పెల్లుబుకుతున్న ప్రజా విప్లవ వెల్లువ భారతదేశం పైన కూడా గొప్ప ప్రభావాన్ని కలిగిస్తుందనీ, మన దేశంలోని విప్లవ శక్తుల పురోగమనానికి తోడ్పడుతుందని ఆశించటం జరిగింది.

ఆశ్చర్యకర విషయమేమంటే సరిగ్గా 20 సంవత్సరాల తర్వాత తిరిగి కమ్యూనిస్టు పాత నాయకత్వానికి చెందిన కొందరి నాయకత్వాన ఆనాడు మేము ఏ పంథా

అవలంభించామో సరిగ్గా అదే పంథాను అవలంభించారు. శ్రీకాకుళం జిల్లా నక్సలైట్ ఉద్యమం మన తెలంగాణా పోరాటాన్ని అత్యధికులైన ప్రజలు బలపరచగా శ్రీకాకుళం పోరాటానికి అట్టి విస్తారమైన ప్రజా తోడ్పాటు లేదు. తెలంగాణా పోరాటం క్రూర నిర్బంధ విధానాన్ని అయిదేళ్ల పాటు తట్టుకోగలిగింది. శ్రీకాకుళం పోరాటం ఒకటిన్నర సంవత్సరాలలో మునిగి పోయింది. మార్క్సిస్టు పార్టీ నాయకత్వం, చైనా నాయకత్వం యొక్క అతివాద వాగాడంబరంతో తన అనుచర వర్గాన్ని పెడమార్గాన్ని పట్టించింది. అనుభవ శూన్యులైన యువకులు కార్యాచరణ కావాలి అనే సమయానికి వారికి దోహదం చేసింది. కనుక ఈ విఫల పోరాటానికి ప్రధాన బాధ్యత మార్క్సిస్టు పార్టీ నాయకత్వం వహించవలసి వుంది. భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన మనకు కూడా ఈ విషయంలో కొంత బాధ్యత ఉన్నదని నేను అనుకుంటున్నాను. చరిత్రాత్మక తెలంగాణా పోరాటం యొక్క విలువైన అనుభవాల గని నుండి గుణ పాఠాలు కొత్త తరానికి అందించక పోవటమే ఆ బాధ్యత.

పోలీసు చర్య తర్వాత మారిన భౌతిక పరిస్థితులలో, సాయుధ పోరాటాన్ని సాగించటం సరైనది కాదని ఒక కొత్త ఎత్తుగడల విధానం అవసరమైందని అనుభవమే తెలియజేస్తున్నది. శ్రీకాకుళం విషయంలో ఇది మరింత దుందుడుకుతనంతో కూడిన అనుమతించ వీలు లేని ఎత్తుగడ కూడా. ఏమంటే అక్కడ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి గనుక గత 25 సంవత్సరాలలో మన దేశం పరిశ్రమలు, రవాణా, విద్యుచ్ఛక్తి వంటి రంగాలలో గణనీయమైన పురోగతి సాధించింది. ఆధునికమైన కార్మికవర్గం ఏర్పడ్డది. మన దేశంలో సాయుధ విప్లవమే జరుగవలసి వుంటే అది చైనా విప్లవ మార్గాన్ని అనుసరించబోదు. చైనాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున ప్రజా కార్యాచరణలోకి ఆనాడు రాలేకపోయింది. కార్మిక వర్గం ప్రత్యక్షంగా పాల్గొని విప్లవానికి నాయకత్వం వహించే మార్గాన్నే భారత దేశంలో అనుసరించ వలసి వుంటుంది. చైనాలో వలె మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ యొక్క పరోక్ష పాత్ర ద్వారా కార్మిక వర్గం నాయకత్వం నిర్వహించే సమస్యే లేదు.

తెలంగాణా పోరాటంలోని ఈ మలుపును వివరించే సందర్భంలో ఈ సమస్యపై ఇంత సుధీర్ఘంగా వివరించవలసి వచ్చినందుకు నేను విచారిస్తున్నాను. కాని ఇది అవసరం. ఏమంటే ఈ నాటికీ కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ సమస్యపై పొరపాటు అభిప్రాయాలున్నాయి  గనుక.

తెలంగాణా పోరాటగాథ క్రమాన్ని తిరిగి కొనసాగిద్దాము. భారత విప్లవాన్ని గురించిన పై అవగాహన ఉన్నందువలననే కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర శాఖ నాయకత్వం సాయుధ పోరాటాన్ని కొనసాగించాలనే నిశ్చయించినదని ఇక్కడ స్పష్టం చేయవలసివుంది. ఇంతకు ముందే చెప్పినట్టు తెలంగాణా పోరాటాన్ని అణచటానికి భారత ప్రభుత్వం అన్ని

సన్నాహాలు చేసింది. 1948 ఆఖరుకు కమ్యూనిస్టుల బలమైన కేంద్రాలపైన గెరిల్లా దళాలపైన సాయుధ సేనలు దాడి చేశాయి. భారత సైనిక దళాలతో జరిగిన ఘర్షణలో చాలామంది కామ్రేడ్స్, గెరిల్లా యోధులు చనిపోయారు. సహజంగానే ఇంతటి రాజకీయ సైనికదాడిని తెలంగాణా పోరాటం తట్టుకోగల స్థితిలో లేదు. పోరాటాన్ని ఉపసంహరించటమా లేక మరొక మార్గాంతరాన్ని చేపట్టడమా అనే సమస్య మాకు ఎదురైంది.

పై నుదహరించిన అనుభవం గుణపాఠం చరిత్రాత్మకమైనది. స్వయంగా పోరాట ఆరంభ దశనుండి అంతిమ దశ వరకూ రాజకీయ నాయకులుగా రథ సారథ్యం వహించిన చండ్ర రాజేశ్వరరావుగారి అవగాహన అక్షరాలా నిజం. పోలీసు చర్య తరువాతనే మన పోరాట ఎత్తుగడలలో మౌళికమైన మార్పులు రావాలని పార్టీలో ప్రతిపాదించి అంతరంగిక పోరాటం కూడా దైర్య సాహసాలతో నిర్వహించిన శ్రీ రావి నారాయణ రెడ్డి, కీర్తిశేషులు బద్దం ఎల్లారెడ్డి, ముఖ్దుం మొహిద్దీన్ గారలు తదితరలు - సంపూర్ణముగా పై అభిప్రాయంతో ఏకీభవించే వారు. పై అభిప్రాయానికి భిన్నముగానున్న రెండు ప్రధాన అభిప్రాయాలను గురించి రెండు వాక్యాలు వ్రాయడం అవసరం.

కీర్తిశేషులు సుప్రసిద్ధ ప్రజానాయకుడు, మార్క్సిస్టు పార్టీ నిర్మాత అయిన శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యగారు తెలంగాణా సాయుధ పోరాటంపై ఒక పెద్ద గ్రంధాన్ని రచించారు. అందులో తెలంగాణా సాయుధ పోరాటం గురించి వివిధ దశలలో వివిధ ఘట్టాల గురించి అనేక వివరాలతో వ్రాయడం విశేషం. ఈ మహోజ్వల పోరాటంలో వివిధ రంగాలలో వీర మరణం చెందిన అమరజీవుల గురించి వివరణాత్మకమైన సమాచారాన్ని అందించడం మన అదృష్టం. అయినా ఈ గ్రంథం రాజకీయంగా నిష్పక్షపాతంతో సమగ్రత గలిగి వున్నదనుట అవాస్తవమవుతుంది. తెలంగాణా సాయుధ పోరాట నిర్మాతలు, త్యాగధనులనేకులను వారి ఉజ్వల పాత్రలను విస్మరించడం జరిగింది. చరిత్రకారులు చేయగూడని పని ఇది. రాజకీయంగా ఈ పోరాటం గురించి శ్రీ సుందరయ్యగారి అవగాహన అనుభవం ఇలా వుంది. "పోలీసు చర్య తరువాత రాజకీయ బలాబలాలలో మార్పు వచ్చిన తరువాత ఈ సాయుధ పోరాటం ఆత్మరక్షణ సాయుధ పోరాటంగా ప్రజల పాక్షిక విజయాల సంరక్షణ పోరాటంగా కొనసాగించ వలసిందే. ఉపసంహరించుకోవాలనడానికి రాజకీయంగా ఆస్కారములేదు".

పై అభిప్రాయం ఎంత అస్తవ్యస్తమైనదో అనాటి సంక్లిష్ట రాజకీయ పరిణామాలలో ఎంత అనార్థాలకు దారితీసిందో శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారి వ్యాసంలో ప్రస్ఫుటంగా చెప్పబడింది.

అలాగే తెలంగాణా సాయుధ పోరాటంలో నిర్మాతగా నుండిన కీర్తిశేషులు దేవులపల్లి వెంకటేశ్వరరావుగారు కూడా తమ ఒక గ్రంథములో తెలంగాణా పోరాటం గురించి ఇలా అభిప్రాయపడ్డారు.

''తెలంగాణా సాయుధ పోరాటం ఉపసంహరించాలనే వాదన విప్లవ ప్రతీఘాతమైనది. పోలీసు చర్య తరువాత గూడా తెలంగాణాలో అటువంటి సాయుధపోరాటాన్ని కొనసాగించటానికి అనుకూల పరిస్థితులేయున్నవి. రాజకీయ నాయకత్వాల మార్పిడి తప్ప ప్రజలు మాత్రం అత్యంత ఉన్నత సాయుధ పోరాట రూపాన్ని కొనసాగించడానికి అన్ని విధాలా భాగస్వాములయ్యేవారు. దానిని అనాటి (1949) కేంద్ర కమిటీ వ్యూహరచనల ప్రకారం నిరంతరాయంగా కొనసాగించవలసిందే.''

పై అభిప్రాయం ఎంత వాస్తవానికి భిన్నంగా వుండినదీ కూడా పైనుదహరించిన వ్యాసం సుస్పష్టం చేస్తుంది.

తెలంగాణా సాయుధ పోరాటం దిన దిన ప్రవర్ధమానం చెందిన రోజులలో అనన్య సామాన్యమైన అత్యంత అనుభూతిని కలిగించే అనుభవాల నందించింది. తెలంగాణా ప్రాంతంలో ప్రధానంగా భారతదేశంలో సాధారణంగా జరిగిన మార్పులను ప్రభావితం చేసింది. పోలీసు చర్య తరువాత కూడా 4 సం॥ల సుదీర్ఘకాలం కొనసాగిన ఈ పోరాట అనుభవాలు విప్లవ కారులందరికీ అశేషమైన గుణపాఠాలను అందజేసింది. ప్రతి అనుభవం ఒక గ్రంథం. ప్రతి నష్టం, కష్టం, ఒక సైద్ధాంతిక కిరణం, ప్రతి విజయం ఒక విజయ పతాకం. ఈ అనుభవం సమస్తం ఒక విజ్ఞాన దీపం.

# హైదరాబాద్ సంస్థాన విమోచన విప్లవోద్యమం అందించిన చతుర్విధ సందేశం

**భా**రతదేశ సుదీర్ఘ స్వాతంత్రోద్యమంలో అయిదు వందలకు మించిన చిన్న పెద్ద సంస్థానాలలో నిర్వహించబడిన సంస్థాన ప్రజల పోరాటాలు అత్యంత ప్రధానమైనవి. సంస్థానాధీశుల నిరంకుశ పరిపాలనను వ్యతిరేకించటంతో పాటు ఆ సంస్థానాధీశులకు అన్ని విధాల అండదండలు అందించే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కూడా ఈ వుద్యమాలు నిర్వహించబడినవి. జనాభాలో అతి పెద్ద సంస్థానంగా హైదరాబాద్ సంస్థానం వుండింది. అ తరువాతనే కాశ్మీరు, ట్రావెన్‌కూర్, కొచ్చిన్, మైసూర్ లాంటి సంస్థానాలు వుండినవి.

హైదరాబాద్ సంస్థానంలో కొనసాగిన ప్రజావుద్యమం దశల వారీగా విస్తృతమై చివరకు 1947-15 ఆగస్టు తరువాత విజృంభించింది. నైజాం నవాబు తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయ నిరాకరించడంతో ఇక్కడి సంస్థాన ప్రజల పోరాటం సంస్థాన విమోచన వుద్యమంగా భారతదేశంలో తక్షణం విలీనం కావాలనే ఏకైక నినాదంపై సమరశీల వ్యూహం, ఎత్తుగడలతో నిర్వహించబడ్డది. అప్పటికే రాజకీయ రంగంలో బలమైన సంస్థలుగా ఎదిగిన స్టేట్‌కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ, ఆర్యసమజం నైజాం విసిరిన సవాలుకు సముచిత సమాధాన్ని అందించడానికి విడివిడిగానైనా ఒకే ధ్యేయంతో సమరశీల పోరాటాలు నిర్వహించాయి. పదమూడు మాసాల ప్రత్యక్ష యుద్ధం చివరకు 1948 సెప్టెంబరు 17న స్వతంత్ర భారత ప్రభుత్వ పోలీసు చర్య ఫలితంగా విజయం సాధించింది. మువ్వెన్నల జెండా గ్రామ, గ్రామాన రెపరెపలాడింది. మత మౌఢ్యంతో, నిరంకుశ రాజ్యాధికారంతో విర్రవీగిన నైజాం కేంద్రపభుత్వానికి లొంగిపోయాడు. హైద్రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం పొందింది. సంస్థాన ప్రజలు వారికి నాయకత్వం వహించిన రాజకీయ పార్టీలు, సంస్థలు, వ్యక్తులు సగర్వంగా సంస్థాన చరిత్రలో నూతన అధ్యాయానికి తెర లేపారు.

1) హైద్రాబాద్ సంస్థానాన్ని ఆసఫ్ జాహి వంశుస్థులైన రాజులు షుమారు 3 శతాబ్ధాలుగా పరిపాలించారు. చివరి రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 7వ వాడు. 16 జిల్లాలలో కోటి డెబ్బయి లక్షల జనాభాతో అతి పెద్ద సంస్థానంగా నుండింది. సంస్థాన

ప్రజల జీవితం అత్యంత దారుణంగా నుండినది. సంస్థానంలో నలబైశాతం భాగం జాగీరులు, మక్తాలు, పాయగాలు, ఇనామ్‌లు చిన్న చిన్న సంస్థానాలతో కూడి వుండేవి. వారికి రెవెన్యూ, పోలీసు, జైళ్ళు, కోర్టులతో సహా అన్ని నిర్వహించే అధికారం వుండినది. నైజాం తమ కుటుంబపోషణకై వందలాది గ్రామాలు తమ స్వంత గ్రామాలుగా "సర్ఫేఖాస్" గ్రామాలుగా వుంచుకొనేవాడు. ఇవికాక 'ఖాల్స్' ప్రాంతంగా మిగిలిన గ్రామాలలో వందల, వేల ఎకరాలు కలిగిన ఫ్యూడల్ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, దేశ్ పాండేలు తమ పెత్తనాన్ని నిర్వహించేవారు. ప్రజలపై విపరీతమైన పన్నులు విధించటం వాటిని నిర్భంధంగా వసూలు చేయడం, యివ్వలేని పేద ప్రజలను రకరకాల చిత్రహింసలకు గురి చేయటం నిత్యకృత్యంగా కొనసాగింది. జీత భత్యం లేకుండా వుచితంగా భూస్వాములకు అన్ని విధాల, రకాల శ్రమలు అందించడం "వెట్టిచాకిరి" చేయడం ఆచారంగా కొనసాగినది. అన్ని కులాలకు చెందిన రైతులతో సహా చేతివృత్తులు, దళితులు, వ్యవసాయ కార్మిక వర్గాలు నిర్భంధంగా భూస్వాముల నిరంకుశ పాలన క్రింద నలిగిపోయేవారు. అమానుషమైన చిత్ర హింసలకుబలి అయిపోయేవారు. ఎదురు మాట్లాడిన, ఎదిరించిన అత్యంత హేయమైన శారీరక, మానసిక హింసలకు గురి చేయబడేవారు. ప్రభుత్వ పోలీసు యంత్రాంగంతో పాటు జాగీరుదారుల గూండా తండాలు గ్రామాలను శాసించేవారు. ప్రజలకు శాంతి భద్రతలను మృగ్యం చేసేవారు. ఇటువంటి అమానుష అర్ధబానిస, బానిస జీవితాల నుండి సెప్టెంబరు 17, 1948 నాడు రాజకీయ విముక్తి సాధించబడింది. సంస్థానం భారత జాతిలో విలీనం పొందింది. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా స్వపరిపాలన సాధించుకొనే సదవకాశం వచ్చింది. ఇది ప్రపంచంలో అన్ని దేశాల అనుభవం, స్వతంత్రం ఒక జన్మహక్కుగా గుర్తింపు పొందిన శుభధినం-ఇదే ప్రదమ సందేశం.

2) మాతృభాషలో అసలు చదువులేదు. ఉర్దూభాష మాద్యమంగానే ప్రాథమిక విద్యనుండి వున్నత విద్య వరకు నిర్వహించబడేది. ఒకటి, రెండు ఉర్దూ దినపత్రికలు మినహా తెలుగు వార్తా పత్రికలు లేనే లేవు. చాలాకాలం తరువాత శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వంలో "గోలకొండ" పత్రిక అన్ని రకాల ప్రభుత్వ దిగ్భంధనల మధ్య ప్రచురించబడేది. అక్షరాస్యత 6 శాతానికి మించలేదు. ఇంతటి చీకటి యుగం నుండి విముక్తి చెందడానికి ప్రప్రధమంగా 1922లో"ఆంధ్రజనసంఘం" శ్రీ మాడపాటి హనుమంతరావు గారు కార్యదర్శిగా అవతరించింది. తెలుగుభాష సంస్కృతి, పరిరక్షణ, అభివృద్ధి ఆదర్శంగా ఈ సంస్థ కార్యక్రమాలను చేపట్టింది. క్రమంగా వెట్టి చాకిరి వ్యతిరేకత, రైతు రక్షణ పేరిట తీర్మానాలు చేయడం, గ్రామీణ, పట్టణ ప్రజలను సమీకరించడం అలాగే మరాట్వాడ ప్రాంతంలో మహారాష్ట్ర పరిషత్, కన్నడ విభాగంలో కర్నాటక పరిషత్తులు నిర్మించబడ్డాయి. కాంగ్రెస్, ఆంధ్రజనసంఘం ఆంధ్ర మహాసభగా తెలుగు ప్రజల ప్రజాసంఘంగా పరిణితి చెందింది. 1930లో శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి

అధ్యక్షతన ప్రథమ ఆంధ్రమహాసభ జోగిపేటలో నిర్వహించబడినది. 1931లో శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారి అధ్యక్షతన దేవరకొండలో ద్వితీయాంధ్ర మహాసభ జరిగింది. 1934లో శ్రీ పులిజాల వెంకట రంగారావు గారి అధ్యక్షతన తృతీయాంధ్ర మహాసభ ఖమ్మంలో జరిగింది. 1935లో డిశంబర్ మాసంలో శ్రీ మాడపాటి హన్మంతరావు గారి అధ్యక్షతన చతుర్ధాంధ్ర మహాసభ సిరిసిల్లలో జరిగింది. 5వ మహాసభ శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారి అధ్యక్షతన 1936లో షాద్‌నగర్‌లో జరిగింది. 1937లో శ్రీముందుముల నర్సింగరావు గారి అధ్యక్షతన 6వ ఆంధ్ర మహాసభ నిజామాబాద్‌లో జరిగింది. 1940లో హైదరాబాద్ జిల్లా మల్కిపురంలో శ్రీ ముందుముల రామచంద్రరావు గారి అధ్యక్షతన 7వ మహాసభ జరిగింది. 1941లో శ్రీ రావి నారాయణరెడ్డి గారి అధ్యక్షతన నల్లగొండ జిల్లా చిలకూరులో 8వ మహాసభ జరిగింది. 1942లో శ్రీ మాదిరాజు రామకోటేశ్వరరావుగారి అద్యక్షతన వరంగల్ తాలూకా ధర్మవరంలో 9వ మహాసభ జరిగింది. 1943లో హైదరాబాద్‌లో జరిగిన 10వ ఆంధ్రమహాసభలో ఆంధ్రమహాసభ అద్యక్ష పదవికి మొదటిసారి తీవ్రమైన పోటీఏర్పడ్డది. సంస్దాన ప్రజల సమరశీల పోరాటాలు విస్తృతంగా కొనసాగిన సమయం. ఆంధ్ర మహాసభలో ప్రబల స్దానాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ సంపాదించుకున్నది. మితవాద వర్గ అభ్యర్దిగా శ్రీ కొండా వెంకటరంగారెడ్డి, అతివాదుల అభ్యర్దిగా శ్రీ బద్దం ఎల్లారెడ్డి గార్ల మధ్య తీవ్రమైన పోటీ జరిగింది. కొద్ది మెజారిటితో శ్రీ కొండా వెంకటరంగారెడ్డి గారు గెలుపొందారు. 1944లో భువనగిరిలో 11వ ఆంధ్రమహాసభ జరిగింది. మితవాదులు అధ్యక్ష పదవిని సాధించడానికి తీవ్రంగా ప్రయత్నించినప్పటికి అది సాద్యపడలేదు. శ్రీ రావి నారాయణరెడ్డి గారు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డారు. 1930లో ప్రారంభమయిన ఆంధ్రమహాసభ 1944 వరకు అనగా 14 సంవత్సరాల అనతికాలంలో 11 మహాసభలు జయప్రదంగా నిర్వహించుకోవడం లక్షలాది ప్రజలకు స్వతంత్రం, ప్రజా స్వామ్యం, సందేశాలను అందించడం ఒక మహత్తర మైన గుణపాఠం. శత్రువు నీడలో అనేక కష్ట, నష్టాల మధ్య త్యాగధనులు తమ దీక్షా, దక్షతలతో స్వాతంత్ర సౌధాన్ని నిర్మించుకున్న నిర్దిష్టమైన తీరు తెన్నులు కండ్లకు కట్టినట్లుగా కనబడే వుద్యమ నిర్మాణ అనుభవం. 1938లో హైద్రాబాద్ సంస్థాన స్టేట్ కాంగ్రెస్ నిర్వహించిన సత్యాగ్రహ వుద్యమం తదుపరి కారక్రమాలు ఈ ప్రజావుద్యమంలో విశిష్టపాత్రను పోషించినవి. హైద్రాబాద్ నగరంలో సుప్రసిద్ద కవి, కార్మికనాయుకులు శ్రీ ముఖ్దూం మొహియుద్దీన్, డా. రాజ్‌బహదుర్‌గౌర్ తదితర సహచరుల ఆధ్వర్యంలో కామ్రేడ్స్ అసోసియేషన్ అను సంస్ద వెలిసింది. జాతీయకాంగ్రెస్ నాయకురాలు శ్రీమతి సరోజిని నాయుడు వారి కుమారుడు శ్రీ జయసూర్యనాయుడు ఈ సంస్ద వెనుక నిలిచిన ప్రముఖులు. అఖిల హైద్రాబాద్ విద్యార్ది సంఘం పేరుతో సంస్థాన జిల్లాలన్నింటిలో విద్యార్ది వుద్యమం అంచెలంచెలుగా అభివృద్దిని సాధించింది. పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిభావంతులైన

విద్యార్థులు నాయకత్వం వహించారు. తర్వాత నైజాం వ్యతిరేక రాజకీయ వుద్యమాలలో రాణించారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ విభాగంగా అఖిల హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అన్ని పారిశ్రామిక కేంద్రాలలో రోడ్, రవాణా పరిశ్రమలలో తమ సంఘాలను నిర్మించడం, విస్తృత పరుచుకోవడం, గణనీయమైన సమ్మెపోరాటాలు నిర్వహించి విజయాలు సాధించడం ఒక ప్రముఖ పాత్ర. మహారాష్ట్ర, కర్నాటక ప్రాంతాలలో కూడా ఈ అనుభవాలు చోటు చేసుకున్నవి. భాషా సంస్కృతుల పేరిట ఆరంభించబడిన అభ్యుదయ వుద్యమాలు నిరంకుశ పాలకులు విధించిన ప్రతిబంధకాలన్నింటిని తమ శక్తియుక్తుల ద్వారా ఎదిరించి సాహసోపేతమైన సమరశీల పోరాటాల వరకు విజృంభించిన చారిత్రక అనుభవం-ఇది ద్వితీయ సందేశం.

3) గత శతాబ్ది 3వ దశకం ఆరంభం నుండి సంఘటితం చేయబడిన సంస్థాన ప్రజా చైతన్యం వుద్యమాల అభివృద్ధికి సంస్కరణలు అన్ని రంగాలలో తీవ్రమైన సంస్కరణలు అత్యంత అవశ్యకమనే నినాదాన్ని చేపట్టినవి. అనాటి ప్రభువులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ఉపన్యాసాలు చేయడమే కాక ప్రజల హృదయాలను హత్తుకొని పోయి వారిలో భావ విప్లవాన్ని సంతరింపచేయడానికి జానపద కళలను ప్రబల సాధనాలుగా వినియోగించడం జరిగింది. బుర్రకథలు, వగ్గు కథలు, భాగవత రూపాల ద్వారా నిరంకుశత్వాన్ని, బానిసత్వాన్ని, వెట్టిచాకిరి విధానాన్ని చీల్చిచెండాడే వున్నత సమర శీలభావోద్రేకాలను, త్యాగాన్ని ప్రేరిపింపచేయడం జరిగింది. అటు మరుగున పడియున్న సామాజిక సంస్కర్తల చరిత్రలను వారి అమూల్య రచనలు, కళాఖండాలను పామర ప్రజల వరకు కొనిపోవడం జరిగింది. మూడనమ్మకాల వ్యతిరేక, స్త్రీ స్వాతంత్ర్య అనుకూల సామాజిక సంస్కరణల సాహిత్యాన్ని గ్రంధాలయ వుద్యమాల ద్వారా ప్రబలంగా ప్రచారంలోకి తేవడం జరిగింది. అంటరాని తనాన్ని వ్యతిరేకించడం, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించడం. బాల్యవివాహాలను వ్యతిరేకించడం, స్త్రీలను గౌరవించడం ఒక సాంస్కృతిక పునరుజ్జీవన వుద్యమంగా, ఆర్థిక, రాజకీయ వుద్యమాలు పోరాటాల సరసనే నిర్వహించబడినవి. ఫలితంగా ప్రతిసభ, మహాసభ, పోరాటం పరిపూర్ణ సందేశంగా ప్రజలను ఆకట్టుకున్నవి. రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక సంస్కరణల అవసరాన్ని ఎలుగెత్తి చాటినవి. సంస్థాన విముక్తి సాధించక ముందే ప్రజాసంఘాల నాయకత్వంలో సాధ్యమైనంత వరకు పై సంస్కరణలు ఆచరణలో పెట్టబడినవి, భూస్వాముల అన్యాక్రాంతంలో నుండి దున్నేవాడికి దూరంగా నిరుపయోగంగా నుండిన లక్షలాది ఎకరాల మాగాణిని ప్రజసంఘాల కార్యకర్తలు తమ సంఘటిత బలం ద్వారా దున్నేవాడికి హస్తగతం చేసారు. అలాగే సామాజిక సంస్కరణలను, బహుకష్ట నష్టాలకు గురి అవుతూ పరిమితంగానైనా అమలు పరిచారు. నూతన జీవిత ఆదర్శాలను చక్కని ఉదహారణలుగా రూపొందించారు.

పరిణతి చెందిన ప్రజాచైతన్యం, ప్రజావుద్యమం విమోచనానంతరం ఏర్పడిన పాలక వర్గాలపై తమ ప్రభావాన్ని వేసినవి. ఎన్నికల విజయాలతో పాటు ఆర్థిక సామాజిక పరిపాలన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మొదలు కౌలుదారీ విధాన సంస్కరణల చట్టం, ఆతర్వాత భూసంస్కరణల చట్టం భారతదేశంలోనే ప్రపథమంగా హైద్రాబాద్ సంస్థానంలో అమలు పరచబడినవి. షుమారు నలభై లక్షల ఎకరాలు భూమిపై కౌలు రైతులు చట్టబద్ధ రక్షణ సాధించారు. భూస్వాముల దయా, దాక్షిణ్యాలపై ఆధారపడకుండా న్యాయమైనా కౌలు రేట్లు చెల్లిస్తూ సంపూర్ణ భద్రతను చట్టబద్ధంగా సాదించుకున్నారు. మరికొన్ని లక్షల ఎకరాలు బంజరు భూములు భూమి లేని నిరుపేదలు ముఖ్యంగా దళితులు స్వంతం చేసుకోగలిగారు. వెట్టిచాకిరి, శారీరక, మానసిక హింసలాంటి అమానుష స్థితి గతులనుండి విముక్తి సాధించారు. మాతృభాషలో విద్యతో పాటు విద్యాలయాల విస్తరణ, ప్రజరోగ్య పరిరక్షణ, సాంఘిక, సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వ బాధ్యతలుగా గుర్తించబడి ఆచరించబడినవి. సహకర సంఘాల వ్యవస్థను స్థాపించి రైతులు చేతివృత్తులపై ఆదారపడే కార్మికులకు రుణ సదుపాయం కల్పించే వ్యవస్థీకృత సదుపాయం సమకూర్చడం జరిగింది. పంచాయితీ రాజ్‌వ్యవస్థను ఏర్పరచి గ్రామ రాజస్థాపన దిశలో నూతనంగా స్థానిక స్వపరిపాలన వ్యవస్థకు పునాదులు వేయడం జరిగింది. వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, ఇతోధికంగా అభివృద్ధి చెందినవి. శతాబ్దాల చీకటి కోణాలలో ఆధునిక అరుణకాంతులు చొరబడ్డాయి.

సంస్థాన విమోచన వుద్యమం బడుగు, బలహీన వర్గాల్లో తమ ఉజ్వల భవిష్యత్తు పట్ల ఎన్నెన్లో ఆశలు కల్పిస్తే అటు భూస్వామ్య, ధనిక వర్గాలలో కూడా తమ స్వార్ధపర జీవితం పట్ల అన్నే ఆశలు కల్పించినది. అధికార పార్టీలో తమ ప్రాబల్యాన్ని పెంచుకుంటూ తమ పాక్షిక ప్రయోజనాల సాధనకే ప్రాధాన్యతనిచ్చారు. పేదరిక నిర్మూలన, సాంఘిక సంస్కరణల చట్టాలను అమలు పరచడంలో అలసత్యం వహించడమే కాక వాటిని అమలు పరచకుండా కార్యాచరణలు చేపట్టారు. ఫలితంగా దేశంలో అభివృద్ధి చట్టాలను చేయడంలో తప్ప వాటి ఆచరణ ద్వారా ప్రజా జీవితంలో తగినంతగా అగుపడలేదు. పైగా ధరల పెరుగుదల, ఆదాయాల నిలకడ ప్రజాసామాన్యంలో ముఖ్యంగా బలహీన వర్గాలలో అసంతృప్తికి దారితీసింది. విప్లవసిద్ధాంతాలను ఒంటబట్టించుకున్న వేలాది యువతీ యువకులు విమోచనం అందించిన రాజకీయ స్వతంత్రాన్ని కూడా కాదంటూ సంపూర్ణ ఆర్థిక స్వాతంత్రం లేని పరిస్థితులు పట్ల అసహనాన్ని ప్రకటిస్తూ తమ సమరశీల సాయుధ పోరాటాన్ని మరొక 3 సంవత్సరాలు సుదీర్ఘకాలం కొనసాగించారు. అసమాన, అననుకూల పరిస్థితులలో ఒంటెత్తు పోకడతో నిర్వహించబడిన ఈపోరాటం, ఒక ఆత్మరక్షణ పోరాటంగా చెప్పుకోబడినా ప్రజా వుద్యమ నిర్మాణంలో గడించిన అమూల్యమైన అనుభవాల వెలుతురులో ఒక తీవ్రవాద వుద్యమంగా మిగిలింది. నేల విడిచి సాము చేసిన చందంగా మిగిలింది. దురదృష్టవశాత్తు ఇదే సిద్ధాంతం ఈనాటి

వరకు నిష్ఫల తీవ్రవాదవుద్యమంగా పరిమితంగానైనా కొనసాగుతుంది. దేశాభివృద్ధికి అమూల్య సంపదగా మలుచుకోబడవలసిన మానవ వనరులు నిష్ప్రయోజన మవుతున్నాయి.

స్వాతంత్రానంతరం మూడున్నర దశాబ్దాల వరకు రాష్ట్రాలు, కేంద్రంలో సృష్టించుకో బడిన ప్రజాస్వామ్య సంస్థలు, వ్యవస్థలను ఆర్థిక స్వాతంత్రానికి అత్యంతవసరమయిన సంస్కరణలను సాధించే ఉపకరణాలుగా తీర్చిదిద్దడంలో కాంగ్రెస్ పార్టీ విఫలత చెందింది. వీటిని స్వార్ధ పర వర్గాలు తమ సంకుచిత ప్రయోజనాలకే వినియోగించ గలిగాయి. పార్లమెంటు, శాసనసభ, పంచాయితీరాజ్ లాంటి పరిపాలన వ్యవస్థలో ప్రజాహిత సంస్కరణలు, అభ్యుదయ విధానాలు రూపొందించబడలేదు, చేపట్టబడలేదు. రాజ్యాంగంలో రచించుకున్న ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ఉద్ఘాటనలు, పునరుద్ఘాటలనలతో సరిపుచ్చుకోబడుతున్నాయి. ప్రజల ఆర్థిక, సామాజిక పురోభివృద్ధికి కంటకంగా నుంటూ కాలదోషం పట్టిన విధానాలు సంస్కరించబడలేదు. మెకాలే రూపొందించిన విద్యావిధానం యువతరంలో స్వతంత్ర సృజనాత్మక ఆలోచాన విధానాన్ని సంపాదించుకోనీవడం లేదు. వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య వ్యాపార రంగాలలో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అనివార్యమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించబడలేదు. అందుకు అత్యంత ప్రధానమైన దేశ, విదేశీ ఆర్థిక వనరుల సమీకరణ జరుగలేదు. ఫలితంగా మూడున్నర దశాబ్ధాల సుదీర్ఘకాలం దేశ సగటు జాతీయ ఉత్పత్తి రెండున్నర నుండి 3 శాతానికి మించలేదు. వెనుకబాటు తనాన్ని త్వరిత గతిన తొలగిస్తూ ఉత్పత్తి ఉత్పాదకతలలో, సంపద సృష్టిలో మన దేశం సగటు జాతీయ ఉత్పత్తి రెండున్నర నుండి 3 శాతానికి మించలేదు. ఉత్పత్తి, ఉత్పాదకతలలో, సంపద సృష్టిలో మన దేశం చాలా వెనకబడి పోయింది. వెనుకాబాటు తనాన్ని త్వరిత గతిన తొలగిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకతలను గణనీయంగా పెంచ గలిగే సంస్కరణల ఆలోచన 1991 నాటి వరకు రానేలేదు. అప్పుడు ప్రారంభించబడిన సంస్కరణల పర్వం అనేక ఆటుపోట్లతో ఈనాటి వరకు ఒక స్పష్టమైన దార్శనికతతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు పోవడం లేదు. అక్కడక్కడ పరిమిత రంగాలలో చేపట్టబడుతున్న సంస్కరణల ఫలితాలు నేర్పుతున్న గుణపాఠాలకు కూడా గుర్తింపు ఇవ్వడం జరగడం లేదు. ఈనాడు శరవేగంగా అలుముకుంటున్న ప్రపంచీకరణ గురించి ప్రపంచబ్యాంకు, ప్రపంచ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య వ్యాపార సంస్థల మూల సిద్దాంతాల గురించి ఏర్పడియున్న అనవసర అనుమానాలను, దురభిప్రాయాలను తొలగించుకొంటూ వాటిని మనదేశ అవసరాలకనుగుణంగా ఉపయోగించుకొనే పూహ్యాం, ఎత్తుగడలును అనుసరించడం అత్యవసరం, అనివార్యం. వీటి ద్వారా ధనాఢ్యదేశాలు, బహుళజాతి సంస్థలు మన ఆర్థిక, రాజకీయ స్వాతంత్రాన్ని సులభంగా కబళించ గలుగుతాయను కోవడం మనదేశ పరిణిత ప్రజాచైతన్యాన్ని కించబరచటమే అవుతుంది. సత్యాన్వేషణ

ద్వారా మాత్రమే సంస్కరణల అవసరం అర్ధమవుతుంది. విజ్ఞులు రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఇందుకు కృషి చేయడం అవసరం. జాతీయంగా అనేక అననుకూల పరిస్థితుల మధ్య, ఆర్థిక వనరులు, మానవ వనరుల కొరతల మధ్య పరిమితమయిన రాష్ట్ర పరిధిలో గత 8 సంవత్సరలుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో చేపట్టబడి సత్ఫలితాలను అందిస్తున్న సంస్కరణల ప్రక్రియ దేశంలోని అభివృద్ధి కాముకులను ఆకర్షిస్తున్నది. మానావాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్న ప్రపంచ వ్యాపిత సంస్థలు ఈ అనుభవాన్ని శ్లాఘిస్తున్నవి. ఇలాంటి సంస్కరణలను దేశ వ్యాపితంగా విస్తరించడం తప్ప గత్యంతరం లేదనే అభిప్రాయాన్ని ఆర్థిక, సామాజిక రాజకీయ విజ్ఞులు సుస్పష్టంగా చెప్పడం జరుగుచున్నది. అయినా దురదృష్టశాత్తు సంకుచిత పార్టీ రాజకీయాలు, అధికార వ్యామోహాలు, స్వార్ధ పర వర్గాలలో అవసరమున్నంత సానుకూలతను కల్పించడం లేదు. ప్రతి సంస్కరణ మానవీయ దృష్టితో, అందరి ఏకాభిప్రాయంతో మాత్రవే విజయవంతంగా నిర్వహించబడి సత్ఫలితాలను అందించగలుగుతుంది. రాజకీయ ఏకాభిప్రాయ రాహిత్యం సంస్కరణల సార్ధకతను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. 1978లో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చైనా గడిచిన 25 సంవత్సరాలలో అనన్యమైన అభివృద్ధి వేగాన్ని పుంజుకుంటున్నది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాలన్నింటిలో సగటున 10 శాతానికి అబివృద్ధి రేటు సాధించింది. పేదరికం దాదాపు తొలగించబడింది. ఇవన్నీ సంస్కరణల ఫలితంగా దేశ, విదేశీ, ఆర్థిక, శాస్త్ర, సాంకేతిక వనరులను ప్రోగు చేసుకోవడం ద్వారానే సాధ్యపడ్డవి. మనదేశం సంస్కరణల వినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయజాలదు. కరుడు గట్టిన, కాలం చెల్లిన భావాలను, అభిప్రాయలను మార్చుకోవడమే సంస్కరణలకు పునాది. ఈ బృహత్తరమైన సిద్ధాంతాన్ని రాజకీయాలకు గెలుపు ఓటములకు అతీతంగా గుర్తించడం దేశ భక్తికి నిదర్శనం. ఆనాడే ఆర్థిక స్వాతంత్రం అందుబాటులోకి వస్తుంది - ఇదే తృతీయ సందేశం.

4) హైదరాబాద్ సంస్థాన చరిత్ర విమోచనం నాటికి కొన్ని వందల సంవత్సరాలు కలిగివున్నది.ఔరంగజేబు మొగల్ చక్రవర్తులలో చివరివాడు. అతనికి అంతులేని రాజ్యకాంక్ష, దురహంకారం, గర్వం, నియంతృత్వ గుణాలున్నాయని చరిత్ర చెబుతుంది. దక్షిణ భారతం అతని రాజ్యకాంక్షకు గురయింది. దక్కన్ గోలకొండను జయించాడు. మరట్వాడాలోని ఔరంగాబాద్‌ను రాజాధానిగా చేసుకొని పాలించాడు. మీర్ ఖమ్రుద్దీన్ అనువాడిని దక్కన్‌కు సుబేదారుగా నియమించాడు. ఖమ్రుద్దీన్ రాచకుటుంబీకులు, అసాధరణ ప్రతిభావంతులు. ఔరంగజేబు మరణానంతరం తన ప్రాంతమని నర్మద నుంచి కావేరికి, మచిలీపట్నం నుండి బీజాపూర్ వరకు దక్షిణ పీఠభూమి అంతటిని వశపర్చుకున్నాడు. 1724వ సంవత్సరంలో ఆసఫ్‌జాహి వంశాన్ని స్థాపించాడు. మహారాష్ట్రులు ఖమ్రుద్దీన్ రాజ్య విస్తరణను నిలువరించారు. వారి దాడులకు విసిగిన

ఖమ్రుద్దీన్ తన రాజధానిని తెలంగాణాలోని హైద్రాబాద్‌కు మార్చాడు. ఖమృద్దీన్ మరణానంతరం ఆయన కొడుకులు రాజ్యాధికారం కోసం ఘర్షణ పడ్డారు. ఆనాటికే భారతదేశంలో అంతర్గత వైరుధ్యాలను ఉపయోగించుకుంటూ ఫ్రెంచి ఇంగ్లీషు వారు తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో వున్నారు. ఖమృద్దీన్ రెండవ కుమారుడు నాసిర్ జంగ్ బ్రీటీష్ వారి సహాయం తీసుకున్నాడు. తనతో పోటీ పడుతున్న తన మేనల్లుడు ముజఫర్ జంగ్‌పై యుద్ధం ప్రకటించాడు. ముజఫర్ జంగ్‌కు ఫ్రెంచివారు సహాకరించారు. ఈ యుద్ధంలో ముజఫర్ ఓడిపోయి చెరసాల పాలయ్యాడు. అటు ఒక పఠాన్ వీరుడు నాసిర్‌ను ఒడించాడు. సమయం కనిపెట్టి ఫ్రెంచివారు ముజఫర్‌ను గద్దెక్కించారు. మరొక పఠాన్ ముజఫర్‌ను తొలగించాడు. ఫ్రెంచివారు ఖమృద్దీన్ 3వ కుమారుడైన సలాబత్ జంగ్‌ను గద్దెనెక్కించారు. ఆసఫ్‌జాహి రాజ్యంలోని తెలుగుప్రాంతాలన్నింటిని కలిసి 'తెలంగాణా' అన్నారు. తెలుగులు వుండు ప్రాంతం 'తెలంగాణా'. అప్పుడు ఈనాడు వున్న ఆంధ్రప్రదేశం సొంతం తెలంగాణానే. సలాబద్‌జంగ్ ఫ్రెంచివారికి 26 లక్షల రూపాయిలు ఋణపడిపోయారు. ఫ్రెంచి అప్పుల వాళ్ళు అతని వెంటపడ్డారు. అప్పుడు అతడు 1753లో తెలంగాణాలోని 1) ముస్తాఫానగర్ 2) రాజమహేంద్రవరం 3) శ్రీకాకుళం జిల్లాలను ఫ్రెంచి వారికి అప్పగించాడు. అప్పుడు ఆ జిల్లాల సంవత్సర ఆదాయం రు.31 లక్షల రూపాయలు. సలాబత్ జంగ్ తన రాజ్యరక్షణ కొరకు రాయబేరాలు సాగించాడు. తన రక్షణకు గాను ఇంగ్లీషు వారికి తెలంగాణాలోని 1)నిజాంపట్నం 2) మచిలీపట్నం 3) కొండవీడు 4) పల్కమనేరు లను 1759లో అప్పగించాడు. ఫ్రెంచి వారికి ఆంగ్లేయులకి అసఫ్‌జాహి సర్కారు వారి నుంచి వచ్చిన జిల్లాలు కావడం వలన ఆప్రాంతాలుకు 'సర్కారు జిల్లాలు' అనే పేరు వచ్చింది. కాల గమనంలో మొదలు ఫ్రెంచి వారికి ఇచ్చిన జిల్లాలు కూడా బ్రిటీష్ వారి పరమయినాయి. బ్రిటిష్ వారు సలాబత్ జంగ్‌ను నమ్మలేదు. అతనిని తొలగించారు. 1772లో ఖమ్రుద్దీన్ 4వ కుమారుడు నిజాం అలీని గద్దెనెక్కించారు. నిజాం అలీ పూర్తిగా అసమర్దుడు. అధికారం సర్వస్వం బ్రిటిష్ వారు చెలాయించారు. ఇంతలో మహారాష్ట్రులు నిజాం అలీపై దండెత్తారు. నిజాం అలీ ఓడిపోయాడు. మధ్యన ఆంగ్లేయులు నిజాం అలీని రక్షించే నెపంతో సైన్యాలు పంపించారు. అందుకు పెద్ద మొత్తంలో డబ్బు అడిగారు. అదివరకే ఆంగ్లేయులకు పెద్దగా ఋణపడియున్న నిజాం అలీ తన రక్షణ కోసం ఇంగ్లీషు వారు నిర్వహించే సేనల ఖర్చుల కొరకు బ్రిటిష్ వారికి 1) కంభం 2) కర్నూలు 3) ఆధోని 4) రాయదుర్గం 5) గుత్తి 6) కడప 7) బంగినపల్లి 9) అనంతపురం 10) బళ్ళారి 11) మదనపల్లి 12)వాయల్పాడు జిల్లాలను 1800 సంవత్సరంలో ధారదత్తం చేసాడు. అందుకే ఆ జిల్లాలకు దత్త మండలాలు అను పేరువచ్చింది. తతిమా తెలుగు ప్రాంతం 'తెలంగాణా'గా మిగిలింది.

ముస్లిం రాజుల అసమర్ధత, ధన దాహం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుటిల నీతి

కారణంగా సువిశాలమైన తెలుగుప్రాంతం విభజించబడింది. స్వాతంత్ర్యానంతరం పొట్టి శ్రీరాములు గారి పట్టుదల, ఆత్మార్పణ తర్వాత పూర్వపు తెలంగాణాలోని భాగమైన ఆంధ్రప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ సిఫార్సులు మరియు తెలుగు ప్రజల చిరకాల ఆందోళన ఫలితంగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1-11-56 నాటికి ఆంధ్రపదేశ్ ఏర్పడింది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం తమ మాతృక తెలంగాణాతో కలిసినప్పుడు న్యాయంగా 'తెలంగాణా ప్రదేశ్' అనవలసింది. ఆంధ్రప్రాంతం విస్తీర్ణంలో, జనాభాలో అధికంగా నుండడం వలన ఆంధ్రప్రదేశ్ అను నామకరణం జరిగింది. అందులో తెలంగాణా అసలు సిసలైన ప్రాంతం.

ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాలలో నిర్వహించబడిన స్వాతంత్రోద్యమ ఆరంభం నుండే తెలుగు ప్రజలను విభజించిన ఈ కృత్రిమ సరిహద్దులు తొలగిపోవాలని కోరడం జరిగింది. భాషా ప్రయుక్త తెలుగు రాష్ట్రం లేక విశాలాంధ్రలోనే అభివృద్ధి, అభ్యుదయం సుస్యాధమని ప్రకటించారు. సాంస్కృతిక వికాసానికి, ఆర్థిక సామాజిక పునరుజ్జీవనానికి భాషా ప్రయుక్త రాష్ట్రం అనివార్యమని ఎలుగెత్తి చాటి చెప్పారు. చివరకు సాధించారు. సంస్కృతి, సాంప్రాదాయాల పునురుజ్జీవనంపై విశ్వాసం లేని కొందరు రాజకీయ నాయకులు విశాలాంధ్ర ఏర్పాటు సమయంలోనే తమ అభ్యంతరాన్ని ప్రకటించారు. ప్రజాబాహుళ్యం యొక్క అభిమతం ముందు దీనిని ఎవరు పట్టించుకోలేదు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత షుమారు 150 సంవత్సరాలుగా విడిపడిన తెలుగు ప్రజల మధ్య ఏర్పడుతున్న పునరైక్యతలో అసమానతలు చోటు చేసుకోవడం సహజంగా జరిగింది. పాలకుల అసమర్ధత, సంకుచిత అధికార ప్రలోభాలు ఈ చిన్న వైరుధ్యాలను పెద్దగా చేసి చూపడం జరిగింది. హైద్రాబాద్ సంస్థానంలో ప్రధాన రెవెన్యూ ఆదాయంగా నుండిన 'అబ్కారీ' ఆదాయం విలీనమైన ఆంధ్రప్రాంతంలో మధ్యపాన నిషేధం కారణంగా ఆబ్కారీ ఆదాయం లేకపోవడం ఈ అంతరానికి మూలకారణం. ఉభయ ప్రాంతాల ఉద్యోగస్తుల ప్రమోషన్లు, సీనియారిటీ లిస్టుల రూపకల్పనలో అవకతవకలు కూడా కొంతవరకు చోటు చేసుకోవడం జరిగింది. ఇంతకు మించిన వైరుధ్యం ఎంత వెదికినా కనబడదు. బ్రిటీష్ పాలన క్రింద 150 సంత్సరాలు నుండిన సర్కారు దత్త మండలాలు పెద్దగా అభివృద్ధిని సాధించినాయని చెప్పడం దుస్సాహసమవుతుంది. అయితే కాటన్‌దొర పుణ్యమా అంటూ నిర్మించబడిన కృష్ణ-గోదావరి నదులపై బ్యారేజిలు నిర్మించబడ్డాయి. ఫలితంగా కొన్ని లక్షల ఎకరాల తీరప్రాంత భూములలో మాగాణిగా మారి వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం జరిగింది అక్కడి ప్రజల ఆర్థిక స్థితిగతులు మెట్ట ప్రాంత ప్రజలకంటే గణనీయంగా బాగుపడ్డాయి. 1969లో అధికార పార్టీకి చెందిన నాయకులు అధికార పంపిణీ ఉద్దేశ్యంతో వేర్పాటు వాదాన్ని లేవనెత్తారు. కొన్ని మాసాలు తెలంగాణా ప్రాంతాన్ని ఊపివేసారు. ఈ వుద్యమంలో కొందరు ఆత్మార్పణ కూడా చేసారు. అయితే అదే పార్టీకి చెందిన అగ్రనాయకత్వం జోక్యం, అధికార పునర్ విభజన ఫలితంగా

వేర్పాటు వుద్యమం సమసిపోయింది. ఇలాంటి వుద్యమం రాజకీయ అసంతృప్తి వాదులకు అప్పుడప్పుడు ఆలంబనంగా తయారైంది. వెనకబాటు తనానికి మూలకారణం ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్య, సాగునీరు, త్రాగునీరు, రోడ్డు - రవాణా మౌళిక సదుపాయాలు సమకూర్చడంలో పాలకవర్గాలు బాధ్యతగా గుర్తించి పరిష్కరించకపోవడమే. ఈ వెనుకబాటుతనం తెలంగాణాకే పరిమితం కాలేదు. సువిశాల రాయలసీమ (దత్త మండలం) ఉత్తర, దక్షిణ సర్కారు జిల్లాలో మెట్ట ప్రాంత్రాలు కూడా వెనకబడేవున్నాయి. మౌళిక సదుపాయాల సత్వర నిర్మాణం గురించి దేశ వ్యాపితంగా శాస్త్రీయ అవగాహన లేకపోవడం అందుకు అత్యవసరమయిన ఆర్థిక వనరులను దేశ, విదేశీ ఆర్థిక సంస్థల నుండి సాధించే శక్తి యుక్తులు లోపించడం అసలు పరిపాలన ప్రజల చేత, ప్రజలకొరకు అను సిద్ధాంతంపై విశ్వాసం లేకపోవడం. రాష్ట్రానికి పరిమితంగా నున్న ఆర్థిక వనరుల వినియోగంలో కాని కేంద్రం నుండి పరిమితంగానే వస్తున్న నిధుల, రుణాల పంపకంలో కాని పక్షపాతాలకు ఆస్కారం లేదు. రాష్ట్ర రాజధానిగా హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వాస్తవం జగద్విదితం. ఉభయ ప్రాంతాల పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార వేత్తలు తమ పెట్టుబడులను ఉపయుక్తంగా వెచ్చించడం వలన ఈ అభివృద్ధి సాధ్యపడుతుంది. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాలు గత 45 సంవత్సరాలలో పరిమిత వనరుల నేపథ్యంలో మౌళిక రంగాలలో కొంతవరకు అభివృద్ధిని సాధిస్తున్నాయి. సంస్కరణలు సత్వర మానవీయ అభివృద్ధిపై దృఢ విశ్వాసం కలిగినవి. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలిస్తున్న 8 సంవత్సరాలలో అన్ని రంగాలలో అంతకు ముందు 35 సంవత్సరాల సుదీర్ఘ పరిపాలనలో సాధించిన దానికి మించిన అభివృద్ధిని సాధించడం జరిగింది. ప్రతిగ్రామం, పట్టణం దీనికి సాక్ష్యం. ఇటువంటి సరిస్థితులలో కూడా అభివృద్ధికి తోడ్పడుతూ దాని వేగాన్ని మరింత పెంచవలసిన రాజకీయవేత్తలు తిరిగి వేర్పాటు వాద బావుటాను ఎగరవేస్తున్నారు. రాజకీయ ఏకాభిప్రాయాన్ని సమకూర్చవలసిన సమర్థులు వేర్పాటు నినాదంతో కొనసాగుతున్న అభివృద్ధిని కుంటుపరుస్తున్నారు. ఇది తెలంగాణా ప్రాంతానికి, ఆంధ్రప్రదేశ్‌కి దురదృష్టకరం. దశాబ్దాల విలీనీకరణ ఫలితంగా ఉభయ ప్రాంతాలలో సృష్టించబడిన విలీన వుద్యమాల వైఫల్యాల కారణంగా మరింత ధృడపడిన తెలుగు ప్రజల సమైక్యత అభేద్యమైనది. చరిత్రలో చోటు చేసుకొన్న తాత్కాలిక వేర్పాటును అధిగమించి సమైఖ్యతను సాధించుకున్న ఆంధ్రప్రదేశ్ సమైఖ్యత ఆదర్శవంతమయింది. ఈ సమగ్రత, సమైఖ్యత నాలుగవ సందేశం. దీని పరిరక్షణ అత్యంత ప్రధాన రాజకీయ కర్తవ్యం.

# ఆంధ్రప్రదేశ్ సమైక్యతను సంరక్షించలేని కాంగ్రెస్

1. ఆరు దశాబ్దాల క్రితం నైజాం నిరంకుశ పాలన నుండి విముక్తి పొందిన తెలంగాణ ప్రాంతం, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిస బంధనాలను తెంచుకున్న ఆంధ్ర ప్రాంతంతో ది.1-11-1956 నాడు కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ జరిగింది. భాష, కుల, మత ప్రాంతీయ విబేధాలు, వైషమ్యాలు లేకున్నా.. అభివృద్ధి క్రమంలో తోటి అంధ్రప్రాంతంతో పోల్చినప్పుడు తెలంగాణ ప్రాంతం విద్య, విజ్ఞానం, సామాజిక చైతన్యం, పరిపాలన అనుభవంలో చాలా వెనుకబడి ఉండడం కారణంగా తెలంగాణ నాయకులలో ఆనేకానేక సందేహాలు ఏర్పడి కొందరు సమైక్య రాష్ట్రావతరణను వ్యతిరేకించటం జరిగింది. ఈ అసమానతలు, అణచివేతకు, అభివృద్ధిలో అక్రమాలకు, పక్షపాతాలకు దారితీస్తాయనే భయాందోళనలు బహిరంగంగానే వెలిబుచ్చడం జరిగింది.

2. ఆనాటి మద్రాస్ రాష్ట్రాన్ని విభజించి, అక్టోబర్ 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. అంధ్ర, తెలంగాణల విలీనాన్ని వ్యతిరేకించిన, ప్రధానంగా కాంగ్రెస్ నాయకులు మొదటి రాష్ట్రాల పునర్విభజన కమీటీ (SRC) ముందు తమ తీవ్ర అభ్యంతరాలను పెట్టారు. ఈ అభ్యంతరాల సారాంశాన్ని (TRC) తమ నివేదికలో (పేజి 105) పొందుపరుస్తూ స్థూలంగా ఇలా వ్రాశారు. "కోస్తా ప్రాంతానికి చెంది, అభివృద్ధిలో ముందున్న ఆంధ్రులు తమను దోపిడీ చేసన్తూ వెనుకబాటుతనంలో ముంచి వేస్తారేమోననేది, విద్య విషయంగా ఆర్థికంగా వెనుకబడిన తెలంగాణ ప్రాంతం వారు విశాలాంధ్ర నిర్మాణాన్ని వ్యతిరేకించటానికి ప్రబల కారణంగా కనబడుతున్నది". జస్టిస్ ఫజల్ అలీ గారి నాయకత్వంలోని మొదటి ఎస్సార్సీ సుధీర్ఘ చర్చలు పరిశీలన తర్వాత ఆనాటి హైద్రాబాద్ రాష్ట్రం అంటే తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడితేనే వారి సత్వరాభివృద్ధికి తోడ్పడుతుందని నివేదించారు. ఒక ఐదు సంవత్సరాల తర్వాత తెలంగాణ శాసన సభలో మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదిస్తే ఆంధ్ర ప్రాంతంతో కలసిపోవచ్చునని కూడా ఆ నివేదికలో సూచించారు ఈ నివేదికకు తగు ప్రాధాన్యతనిస్తూ, ఆమోదించ తగినదని ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గారు ది.16-01-56 న తమ రేడియో ప్రసంగం ద్వారా జాతికి తెలియజేసినారు. ఆ తర్వాత రాజకీయ కదలికలు ఊపందుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం కావాలనేవారు ఒక వైపు, ఆంధ్రప్రాంతంతో కలవాలనే వారు మరో వైపు తమ తమ పావులను కదిలించారు.

అప్పుడు ఆంధ్ర, తెలంగాణ ప్రాతాలలో బలంగానున్న భారత కమ్యూనిస్టు పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రంగా విశాలాంధ్ర ఏర్పడాలని గట్టిగా ఆందోళన చేసింది. ఇటు కాంగ్రెస్ నాయకత్వంలో విభేధాలు ఏర్పడినవి. కొండా వెంకట రంగారెడ్డి, చెన్నారెడ్డి గారలు తెలంగాణ రాష్ట్రం కావాలనే వత్తిడి తేగా, తాము ముఖ్యమంత్రిగా చేసిన భూసంస్కరణలను భూస్వామ్య వర్గం తిరగ తోడతారని ఇదువరకే బలంగానున్న భారత కమ్యూనిస్టు పార్టీ మరింత బలాన్ని పుంజుకుంటుందని, విశాలాంధ్ర ఏర్పడితేనే వారి ఆట కట్టించ వచ్చునని, బూర్గుల రామకిషన్ రావు, స్వామి రామానంద తీర్థ, పి.వి.నరసింహరావు గారి వర్గం ప్రయత్నించింది. ఢిల్లీలో పలుకుబడి గల్గిన నెహ్రూ, మౌలనా అబుల్ కలాం ఆజాద్ గారలు చలించ లేదు. హోం మత్రిగా వున్న గోవింద్ వల్లభ్ పంత్ గారు మొదట నెహ్రూ గారినే బలపర్చినా ఆ తరువాత తాను మారి, నెహ్రూ గారిని కూడా మార్చివేసినారు. విశాలాంధ్ర వాదన నెగ్గింది. తెలంగాణవాదుల భయాందోళనలన్నింటిని లేకుండా చేయడానికి షరతులతో కూడిన తీర్మానం చేయడం జరిగింది. తెలంగాణ ప్రాంతం వారికి జనాభా ప్రాతిపదికన ఉద్యోగాలు, అభివృద్ధి అంశాలలో ఎలాంటి వివక్షత చూపకుండా ప్రాధాన్యాతనిస్తామని ఆంధ్ర ఆసెంబ్లీ కర్నూలులో ది.25-11-55 నాడు ఏకగ్రీవంగా తీర్మానించింది. తెలంగాణ ప్రాంత అభివృద్ధి ప్రథమ కర్తవ్యం (Special Charge)గా నొక్కివక్కాణించింది. ఆనాటి ఆంధ్ర ఉప ముఖ్యమంత్రి గారైన నీలం సంజీవ రెడ్డి గారు ఆంధ్ర శాసనసభలో అధికార తీర్మానాన్ని (1-2-56) ప్రవేశపెట్టి ఆమోదం పొందినారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధి సమైక్య రాష్ట్ర అవతరణకు ప్రధాన షరతుగా గూడా తీర్మానించినారు. పై తీర్మానాలు రాజకీయ మంతనాల తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ పంత్ గారు ఢిల్లీలో ఆంధ్ర - తెలంగాణ నాయకుల సంయుక్త సమావేశాన్ని (19-2-56) పిలిచారు. అందులో తెలంగాణ ఆభివృద్ధి, ఉద్యోగ రక్షణలే ప్రధాన షరతుగా విశాలాంధ్ర నిర్మాణానికి ఆమోదం సాధించినారు. 14 అంశాలతో కూడిన అగ్రిమెంటు జెంటిల్‌మెన్ అగ్రిమెంట్‌గా 20-2-56 తేదిన అమోదించబడ్డది.

3. ఈ ఒప్పందం వెలుతురులో, తెలంగాణ ప్రాంతానికి ఇవ్వబడిన హామీలను ఆమలుపరచడంలో తోడ్పాటునిస్తూ, నిఘా పెడుతూ, కావలి కుక్కలా పనిచేయడానికై తెలంగాణ ప్రాంత శాసనసభ్యులందరితో కూడిన తెలంగాణా ప్రాంతీయ కమిటీ నిర్మాణం జరిగింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371కి సవరణ చేస్తూ దీనిని రాజ్యాంగ బద్ధం చేయడం జరిగింది. తేది.1-2-58 నాడు భారత అధ్యక్షుడు 105 మంది శాసనసభ్యులతో కూడిన ప్రాంతీయ కమిటీని ప్రకటించినారు. ఆ తర్వాత ఈ ప్రాంతీయ కమిటీ ప్రాముఖ్యత గురించి వివరిస్తూ కేంద్ర హోం మంత్రి గారు పార్లమెంటులో సుధీర్ఘ ప్రకటన చేశారు. తెలంగాణ విషయంలో ప్రాంతీయ కమిటీకి మరియు రాష్ట్ర మంత్రి వర్గానికి ఎలాంటి అభిప్రాయ బేధాలు వచ్చినా.. పరస్పర అవగాహనతో

పరిష్కరించుకోవాలని, అలా పరిష్కరించుకోలేకపోతే రాష్ట్ర గవర్నరు గారు జోక్యం చేసుకొని పరిష్కరిస్తారని, వారి నిర్ణయం తుది వాక్యంగా నుంటుందని నిర్ద్వంద్వంగా ప్రకటించినారు. అంతే సంగతులు. ప్రాంతీయ కమిటీకి, ప్రభుత్వానికి ఒకటి, రెండు కాదు లెక్కలలో, విధానాల రూపకల్పనలో, ఆచరణలో అనేక లోపాల గురించి విభేదాలు ఏర్పడినవి. వాటిని నామమాత్రంగా పట్టించుకోవడమే గానీ, పరిష్కరించబడిన దాఖలాలు లేవు. ఆంధ్ర, తెలంగాణకు చెందిన మంత్రులు, ప్రాంతీయ కమిటీకి ఇవ్వవలసిన రాజ్యంగబద్ధ గౌరవాన్ని ఇవ్వలేక పోయారు. అనేక పర్యాయాలు ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు, ప్రతిపక్ష నాయకులు ఢిల్లీ వరకు వెళ్ళి మొర పెట్టుకోవడం కూడ జరిగింది. పట్టించుకునే నాధుడు లేడు. హామీలలో ప్రకటించబడిన గవర్నరు గారి పాత్ర నామమాత్రంగా కూడా కనబడలేదు. వారి చేతికందించిన వినతి పత్రాలను యధాలాపంగా తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం వినా స్వతంత్రించి తీసుకున్న చర్య లేనే లేదు. రాష్ట్రం, కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ అంటూ ఒక వెనుకబడిన ప్రాంతముందని గానీ, పెద్దమనుషుల ఒప్పందాన్ని అమలు పరచవలసిన రాజకీయ నైతిక భాధ్యత తమపై ఉందని గాని భావించలేనే లేదు. దీని ఫలితంగా తిరిగి లోలోపటి తెలంగాణ ఉద్యోగులు, విద్యార్థులు, మేధావి వర్గంలో అసంతృప్తి పెరగడం జరిగింది.

4. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ముఖ్యమైన ముల్కీ నిబంధన నిరంతరం అచరించబడుతుందని హామీ ఇవ్వడం జరిగింది. వరుసగా తెలంగాణలో 15 సంవత్సరాలకు తగ్గకుండా నివాసం కలవారు ముల్కీలని (స్థానికులు) చట్టబద్ధంగా నిర్ణయించడం జరిగింది. ఉద్యోగాల నియామకంలో, ప్రమోషన్లు ఇవ్వడంలో తెలంగాణ ప్రాంతం వారికి ప్రత్యేక పట్టికలు తయారు చేస్తూ దామాషా ప్రకారం దీనిని నిర్వహించే హామీ ఆచరణలో అనేకానేక సందర్భాలలో ధిక్కరించడం జరిగింది. లంచగొండితనం, బంధుప్రీతి, అశ్రిత పక్షపాతం, స్వైరవిహారం చేయగా తెలంగాణ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగింది. ముల్కీ సర్టిఫికెట్లు సంపాదించటం, ప్రమోషన్ల లిస్టుల రూపకల్పనలో ఈ అనర్థం బాగా చోటు చేసుకున్నది. బాధితులు హైకోర్టు, సుప్రీంకోర్టుల చుట్టూ తిరిగి విసిగి వేసారడం జరిగింది. ఇవ్వబడిన 14 హమీలు ఈ విధంగా తృణీకరించడం జరిగింది. తెలంగాణ ప్రాంతీయ సంఘం (TRC) రాజ్యాంగ బద్ధంగా పనిచేసినప్పటికి అందులో కూడా ఒక్కటంటే ఒక్క హామీ గౌరవించబడలేదు. ఈ కమిటీ వారు 1956 నుండి 1969 వరకు రాష్ట్ర ఆదాయ వ్యయాలను పరిశీలిస్తూ ప్రతి సంవత్సరం తెలంగాణ ఆదాయ మిగులును ఎత్తి చూపడం జరిగింది. రాష్ట్ర బడ్జెట్ లోటుగా వుండటం సహజంగానే ఉన్నా.. తెలంగాణ ప్రాంత ఆదాయం తెలంగాణ ప్రాతంలో పూర్తిగా ఖర్చు చేయబడలేదని, ఆ నిధులు ఇతర ప్రాంతానికి మళ్ళించబడిన సత్యాన్ని అంకెలతో సహా రుజువు చేయడం జరిగింది. తిరిగి వచ్చే సంవత్సరం ఈ

లోటును పూడ్చాలని కూడా TRC తీర్మానాలు చేయడం జరిగింది. అయినా పట్టించుకొనే నాథుడే లేడు. జవాబుదారీతనం అవసరమనే రాజ్యాంగబద్ధ హామీని తుంగలో తొక్కడం జరిగింది. ఒకటికి మించిన సందర్భాలలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీగారిని కూడా కలిసి జరుగుతున్న అన్యాయాన్ని వివరించడం జరిగింది. వెనుకబడిన తెలంగాణ అభివృద్ధికి అధికనిధులు కేటాయించటం దేవుడెరుగుగాని, అసలు తెలంగాణ ఆదాయాన్ని ఇతర ప్రాంతాలకు మళ్ళించటం సరికాదని చెప్పటం జరిగింది. సమస్యలను పరిష్కారిస్తామని, సరిచేస్తామని శుష్క వాగ్దానాలుతప్ప కాలు గడపదాటని ఘటనలు ఎన్నో.

5. తెలంగాణ మిగులు నిధుల మళ్ళింపు, తెలంగాణ ఉద్యోగుల సమస్యలు చిలికి చిలికి గాలివానలా పరిణమించి 1969 విద్యార్థి ఉద్యమ రూపంలో తెలంగాణ జిల్లాలు భగ్గుమన్నాయి. దీనికి నాయకత్వం వహించి పదవులను పదిలం చేసుకోవడానికి రంగ ప్రవేశం చేసిన వారంతా కాంగ్రెస్ వారేనను వాస్తవం గమనార్హం. సమస్యల పరిష్కారానికి వాగ్ధానం చేయడం, వాగ్ధానాలను భంగపరచడం, ఉద్యమాలను వుసికొల్పడం, తిరిగి రాజీలు చేసికొని ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ వారి రాజకీయ సంస్కృతికి ఈ పోరాటం అద్దం పడుతుంది. అనేక వేల మంది విద్యార్థి, యువకులు, పౌరులు ఈ మహోద్యమములో సమిధలయ్యారు. 11-4-69 నాడు లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ 8 అంశాలతో కూడిన ప్రణాళికను ప్రకటించారు. తెలంగాణ ప్రాంతీయ కమిటీకిగల అధికారాలను పెంచడం, ముఖ్యమంత్రి నాయకత్వంలో ఉన్నాతాధికారాలు గల తెలంగాణ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పడటం, ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ద్వారా తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తేల్చడం, విధ్యాభివృద్ధి, ఉద్యోగస్తులకివ్వబడిన రాయితీల పున:పరిశీలనలు ఈ 8 అంశాలలో ముఖ్యమైనవి. ఇందులో ముల్కీ నిబంధనల అమలు అంశం లేకపోవడం గమనార్హం. ఇది ఆనాటికే జఠిలమైన సమస్యగా తయారయ్యి, పరిష్కరించడానికి సాధ్యపడని స్థాయికి చేరిపోవడం ముఖ్యకారణం. పోరాట ఉధృతాన్ని చూస్తూ, తిరిగి శ్రీమతి గాంధీ గారు తెలంగాణ ప్రజా సమితి నాయకులతో సంప్రదించి 18-9-71 నాడు 6 ఆంశాతో కూడిన మరో ఒప్పందాన్ని చేసుకున్నారు. దీనిలో ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధం చేయడానికి, తదితర వాగ్ధానాలను తు.చ. తప్పకుండా అమలు పరచడానికి అంగీకరించినారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారిని మార్చడం, శ్రీ చెన్నారెడ్డి గారిని ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా అందలమెక్కించడం లాంటి పార్టీపర నిర్ణయాలను అమలుపరచినారు. తెలంగాణా ప్రజా సమితి కాంగ్రెస్ పార్టీలో విలీనమైపోయింది. 1972, అక్టోబర్ 3 నాడు సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. ఇది వరకు రాజ్యాంగ విరుద్ధమని, రద్దు చేయబడిన ముల్కీ నిబంధనలు పూర్తిగా రాజ్యాంగ సహితమైనవని, వాటిని ఖచ్చితంగా పాత తేదీ నుండే (Retrospective effect) అమలు పరచాలని తీర్మానించింది.

6. తెలంగాణా వ్యాపిత ఉద్యమం, ఫలితంగా మారిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత సర్దుబాట్లు మరో సంక్షోభానికి దారితీసినవి. ముల్కీ నిబంధనలు రద్దు కావాలని లేదా ప్రత్యేకాంధ్ర రాష్ట్రం నిర్మాణం కావాలని ఈ ఉద్యమ నినాదం. ఆంధ్ర ప్రాంతంలో విస్తృతంగా ప్రబలిన ఈ ఉద్యమం రాష్ట్ర మంత్రివర్గం నుండి ఆంధ్ర ప్రాంత మంత్రుల రాజీనామాకు దారితీసింది. జనవరి 18, 1973 నాడు ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు గారు తమ మంత్రిమండలి రాజీనామాను ప్రకటించినారు. 1973, డిసెంబర్ 10 వరకు అధ్యక్ష పరిపాలన నడిచింది. ఈ దిశలో 1973లో కేంద్ర ప్రభుత్వం 6 అంశాలతో కూడిన మరొక ప్రకటన చేసి ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ కోరికలను పరిష్కరించింది. దీని ప్రకారం ముల్కీ నిబంధనలను రద్దు పరచడం, తెలంగాణా ప్రాంతీయ కమిటీని కూడా రద్దు పరచడం ఆమోదించబడినవి. దీంతో ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఉపసంహరించబడింది. తిరిగి ఆంధ్రప్రాంత మంత్రులు అధికారాన్ని చేపట్టారు. శ్రీ జలగం వెంగళరావు గారి నాయకత్వంలో కొత్త మంత్రివర్గం ఏర్పడ్డం, 6 సూత్రాల పథకం, తెలంగాణా పెద్ద మనుషుల ఒప్పందానికి ప్రాంతీయ కమిటీకి పూర్తిగా విరుద్ధం. అయినా కలహించుకున్న కాంగ్రెస్ నాయకులంతా తిరిగి కలిసిపోయినారు. ప్రజలు కాంగ్రెస్ కార్యకర్తలతో సహా తీవ్రమైన వెన్నుపోటు బాధను అనుభవించినారు. 6 సూత్రాల పథకం అమలు పరచబడలేదు. తెలంగాణా ప్రాంతీయ కమిటీ మాత్రం రద్దు చేయబడినది. అనేక వాగ్ధానాలు రాజ్యాంగ సవరణ ఆధారంగా ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేయబడిన తెలంగాణా ప్రజలు మొదటి రోజు నుండే వాగ్ధానాల భంగపాటు తనాన్ని అనుభవించవల్సి వచ్చింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమం ఫలితంగా, వాగ్ధానాలను అమలు జరిపించుకునే అవకాశాన్ని కూడా కోల్పోవడం జరిగింది. ఆ తరువాత అసంతృప్తులు పెరగడం వినా ఆంధ్ర, తెలంగాణా ప్రజల మధ్య సంఘీభావం, సద్భావం, మానసిక ఐక్యత, అభివృద్ధి చెందటం జరగలేదు. తరాలు మారినప్పటికి మనసులో ఉన్న అంతరాలు, అనుమానాలు, అపనమ్మకాలు తొలిగిపోలేదు. తెలంగాణా ప్రజల మనస్తత్వంలో సహజంగా కనబడేది సాత్వికగుణం, అమాయకత్వం, సహనం అయినా అపనమ్మకం, అన్యాయం శృతి మించితే దానిపై రాజీలేని తిరుగుబాటుతనం. ఈ గుణాలు శతాబ్ధాల కాలం రాచరిక పాలన కింద అణచివేత కారణంగా చోటుచేసుకున్న తామసగుణాలు. ఆంధ్ర ప్రాంత ప్రజల మనస్తత్వంలో సులభంగా గుర్తించగలిగే గుణాలు వ్యవహార జ్ఞానం, యుక్తిగా లక్ష్యాన్ని సాధించే నేర్పరితనం, ప్రాబల్య రాజకీయ చర్యల ద్వారా చొరవతో ముందుకు దూసుకుపోవడం. ఇవి బ్రిటీష్ సామ్రాజ్య పాలనలో అనుభవం ద్వారా నేర్చుకున్న సద్గుణాలు. ఇది తెలంగాణా, ఆంధ్ర ప్రాంత ప్రజల మధ్య విభజనను ద్దేశించి చేస్తున్న విశ్లేషణ కానేకాదు. ఒకే భాష, ఒకే ప్రాంతం, ఒకే సాంస్కృతిక సంపద కలిగిన తెలుగు వారిలో శతాబ్ధాల కాలం విడిపోయిన కారణంగా చోటు చేసుకున్న నాగరికత, సాంస్కృతిక పొరలను గుర్తించడానికి ఉద్ధేశించినది. గత అర్థ శతాబ్ధి కాలంలో, చిత్తశుద్ధి ఉంటే ఈ

పొరలను తొలగించడంలో కృతకృత్యులమయ్యేవారం. పాలకుల అధికార దాహం వలన తెలుగుతల్లి బిడ్డల మధ్య అవిశ్వాసం చోటుచేసుకోవడం కేవలం దురదృష్టకరం.

తెలుగుతల్లి కన్నబిడ్డలు, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాల వారు మానసికంగా, భావోద్రేకతతో స్నేహంగా కలిసిఉండటానికి ఒకే భాషకు, ఒకే రాష్ట్రం కంటే భాషా ప్రయుక్తంగా ఒకటికి మించిన రాష్ట్రాలుండడం, చారిత్రక, సాంస్కృతిక ఐక్యతకు దోహదపడుతుందేమోనని భావించబడుతున్నది. పరిపాలనా సౌలభ్యం ఏర్పడి, పరస్పర సందేహాల నివృత్తి చేసుకోవడానికి దోహదపడుతుందని ఆశించడం జరుగుతున్నది. తెలంగాణా ప్రాంతంలో విస్తృతంగా ప్రబలంగా ఏర్పడియున్న వేర్పాటు భావాలను సంకుచిత రాజకీయ స్వార్థపరులు దుర్వినియోగం చేయడానికి ఎలాంటి ఆస్కారం ఇవ్వని విధంగా ప్రజల మనోభావాలకు ఆర్థిక సామాజికాభివృద్ధి దిశలో మళ్లించడానికి ఈ ప్రజాహిత విభజన బహుళంగా తోడ్పడుతుందుని కోరడం జరుగుతున్నది. జాతీయ సమైక్యత, మానవాభివృద్ధి పునాదుల పైననే బలోపేతమవుతుందనే చారిత్రక సత్యం. ఇట్టి పరిపాలన వికేంద్రీకరణను సూచిస్తునది.

తెలుగుదేశం పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకున్న 1983 సంవత్సరం. నుండి ప్రభుత్వానికే నూతన అర్థాన్ని సంతరింపచేయడానికి పూనుకున్నది. తెలంగాణా ఉద్యోగులు తమకు అన్యాయం జరిగిందని తెలియచేయగానే, అటువంటి అన్యాయాన్ని తొలగించడానికి 610 జీవోను కీర్తి శేషులు ఎన్.టి. రామారావు గారు ప్రకటించడం జరిగింది. అదే దారిలో సమస్య పరిష్కారానికి గిర్‌గ్లానీ కమీషన్‌ని కూడా వేయడం జరిగింది. అభివృద్ధికి సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారానికి పూనుకునే దశలోనే తిరిగి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని లేవదీయడం జరిగింది. ఉభయ ప్రాంతాల ప్రజల మధ్య ఇంకా కోలుకోని అసంతృప్తిని సులభంగా రెచ్చగొట్టడం వెనుకటి లాగే రాజకీయ లబ్ధిని ఆశించడం మనం చూస్తున్న పరిణామం. 2004 సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తెలుగుదేశాన్ని గద్దె దించడానికి చేసిన రాజకీయ ప్రయత్నాలు, ఆ తరువాత పరిణామాలు, 2006లో టీఆర్ఎస్ అధ్యక్షుని రాజీనామా, తిరిగి 2008లో టిఆర్ఎస్ పార్లమెంట్, అసెంబ్లీ సభ్యుల రాజీనామాలు, ఉప ఎన్నికలు రావడం వాటి ఫలితాలన్నీ నిన్న మొన్నటివి. ఇవి కూడా తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను, తెలుగు ప్రజల భావ సమైక్యతను పునరుద్ఘాటిస్తున్నవి. విజ్ఞులు విశాల దృష్టితో, పరిణత రాజనీతిజ్ఞతతో రానున్న సార్వత్రిక ఎన్నికల కంటే చాలా ముందుగానే విధానపర నిర్ణయాన్ని ప్రకటించడం అవసరం.

మొన్న జరిగిన ఉప ఎన్నికలు, టీఆర్ఎస్ వారు అనవసరంగా, అకాలంగా తెలంగాణా ప్రజలపై రుద్దినప్పటికి ప్రజలిచ్చిన తీర్పు అత్యంత ఆసక్తిదాయకమే. చీటికి మాటికి ఎన్నుకోబడిన పదవులకు రాజీనామా పెట్టి తిరిగి ప్రజల వద్దకు అదే

అంశంపై ఓటు వేయాలని కోరడం ప్రజాభిప్రాయాన్ని చులకనగా చేసినట్లు ప్రజలు భావించారు. ప్రత్యేక తెలంగాణా సాధన ఉద్యమాన్ని విశాల ప్రాతిపదికపై కాక, ఒకే పార్టీ, ఒకే నాయకుడు, అతని మానసిక రాజకీయ బుద్ధి కుశలతపైననే ఆధారపడి నిర్వహించడం అసలు ఉద్యమానికే బలహీనత కలుగుతుందని కూడా స్పష్టం చేసినారు. టీఆర్ఎస్ యొక్క కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి, తదితర అభ్యర్థులకు తీవ్రంగా తగ్గిన ఓట్ల శాతం దీనిని రుజువుచేస్తున్నది. కాంగ్రెస్, టీడిపి నాయకత్వం తెలంగాణా ప్రజలు ప్రత్యేక రాష్ట్రంపై గల ప్రగాఢ విశ్వాసాన్ని గౌరవిస్తున్నట్లు, దానికి అనుగుణ్యంగానే సరైన సమయంలో సరైన నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఇచ్చిన హామీని ప్రజలు బాధ్యతగా గమనించారు. విశ్వసించారు. ఫలితంగా కాంగ్రెస్, టీడిపి అభ్యర్థులు ఊహించిన విధంగానే గెలుపొందడం జరిగింది. అంతమాత్రాన ఈ పార్టీలను బలపర్చిన ఓటర్లు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వ్యతిరేకులని కాని, టీఆర్ఎస్‌ను బలపర్చిన ఓటర్లు మాత్రమే ప్రత్యేక తెలంగాణాకు అనుకూలురని అభిప్రాయపడటం సరైనది కాదు. ఏది ఏమైనా త్వరలోనే రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాధ్యత గల రాజకీయ పార్టీలు త్వరగానే తెలంగాణా అంశంపై తమ తుది నిర్ణయాన్ని నిశ్చితంగా, నిర్ద్వందంగా ప్రకటిస్తూ ప్రజల్లోకి వెళ్లడం, ప్రజాస్వామ్య ప్రక్రియకు అలంకారంగానుంటుంది.

గత నాలుగు సంవత్సరాల కాంగ్రెస్ పాలన నిర్వాకం రాష్ట్ర ప్రజలలో అసంతృప్తి జ్వాలలను రేకిత్తించడం నిర్వివాద అంశం. ముఖ్యంగా హైదరాబాద్ నగరం దాని పరిసర జిల్లాలైన రంగారెడ్డి, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ భూములతో పాటు లక్షలాది ఎకరాల ప్రైవేట్ వ్యవసాయ భూములను కూడా సామ, దాన, బేధ దండోపాయాలతో పరిశ్రమల పేరిట, ఎస్.ఈ.జెడ్ పేరిట కోటీశ్వరులు బహుళజాతి పెట్టుబడిదారులకు కట్టబెట్టిన విధానం కేవలం అప్రజాస్వామ్యమే కాక అవినీతి, ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి లాంటి దుర్లక్షణాలకి పరాకాష్ఠ. నాలుగు సంవత్సరాల నుండి కొనసాగిన ఈ దుశ్శాసన పర్వం తెలంగాణా ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. ప్రత్యేక రాష్ట్ర వాదనను ఇది వరకున్నదానికంటే ఇమ్మడి ముబ్బడిగా పెంచింది. తెలంగాణా ప్రాంతంలో ప్రవహించే కృష్ణ, గోదావరి నదీ జలాల వినియోగం, వివిధ ప్రాజెక్టుల రూపకల్పనలో, నిర్వహణలో గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి అనుసరించిన ఏక ఛత్రాధిపత్య విధానం అందరితో పాటు తెలంగాణా ప్రజల కోపాగ్నికి ఆజ్యం పోసినట్లుగా పరిణమింమింది. అఖిల పక్ష సమావేశాల ద్వారా ఈ మౌలిక సమస్యలను ఓపికగా చర్చించి అందరికి అమోదయోగ్యమైన నిర్ణయాలను చేయాలని వేడుకున్నప్పటికి ప్రభుత్వం ఏమాత్రం లక్ష్య పెట్టకుండా ఏకపక్ష నిర్ణయాలు చేసి అమలు పర్చడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనం. గుడ్డిగా ధనబలం, మందబలంతో గోదావరి లోయ నీరును కృష్ణా నది లోయకు మళ్లిస్తూ, కృష్ణా నది లోయ నీరును పెన్నా నది లోయకు తరలించే నిర్ణయాలను ప్రజలపై రుద్దడం,

పోతిరెడ్డిపాడు నీటి మట్టాన్ని ఏకపక్షంగా తగ్గించడం, నీటి చౌర్యంగా సంబంధిత ప్రజలు వాపోతున్నారు, ఖండిస్తున్నారు. తెలంగాణా ప్రజలు నిశ్చేష్టులవుతూ ప్రత్యేక రాష్ట్ర వాదనను ఏకైక పరిష్కార మార్గంగా మరింత ధృడంగా భావిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలన తీరుతెన్నులు, విశృంకలంగా విస్తరిస్తున్న అవినీతి, ప్రజా భాహుళ్యంలో అసహనాన్ని పెంచుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే 60 సం॥ల ప్రత్యేక తెలంగాణా వాదనను ముఖ్యమంత్రి గారి నాలుగు సంవత్సరాల అనతికాల పరిపాలన రెట్టింపుగా పెంచింది. ఎన్.టి. రామారావు గారి కాలంలో వెలువడిన 610 జీవో ఆ తరువాత చంద్రబాబు నాయుడు గారి కాలంలో మరింత స్పష్టతతో వెలువడిన ఆదేశాలను గత నాలుగు సంవత్సరాలలో అమలు పరచడానికి చెప్పుకోదగిన చర్యలు తీసుకోవడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలత చెందింది. ఫలితంగా తెలంగాణా ఉద్యోగులు, యువతరం, ప్రభుత్వ వ్యతిరేక భావంతో ప్రత్యేక రాష్ట్రమే గత్యంతరమనే నిర్ణయానికి వస్తున్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రజల వెనుకబాటు తనాన్ని త్వరితగతిన తొలగిస్తూ సురాజ్య స్థాపన దిశలో పరిపాలనను గుణాత్మకంగా మార్చాలంటే ఒకే భాషకు ఒకే రాష్ట్రమను సెంటిమెంట్‌ను ప్రక్కన పెట్టి ఒకే భాషకు ఒకటికి మించి రాష్ట్రాలు ఏర్పడటం భౌతిక పరిస్థితులు సృష్టిస్తున్న పరిస్థితిగా అర్థం చేసుకోక ఉండలేము. ఒక ప్రాంత ప్రజల భావోద్రేక పూరిత అభిప్రాయాన్ని ఆమోదించడానికి, భావోద్రేక రహిత ప్రాంత ప్రజాభిప్రాయంపై ఆధారపడి నిర్ణయించ పూనుకోవడం, సాత్విక ఆలోచన అనిపించుకోదు. అసంబద్ధ ఆలోచనగా నుంటుంది. ఇంతటి జఠిలమైన సమస్యను విశాల హృదయం, ప్రజా సేవపై అంకిత భావం, రాజనీతిజ్ఞత కలిగిన నాయకత్వం పరిష్కరించకలుగుతుంది. పార్టీ శ్రేణులు సంయమనంతో క్రమశిక్షణను పాటిస్తూ ప్రజాహిత నిర్ణయానికై వేచియుండటం ప్రజాస్వామ్య కర్తవ్యం.

(తెలంగాణా అంశంపై తెలుగుదేశం పార్టీచే నియమించబడిన కోర్ కమిటీకి ది. 18.06.2008 సమర్పించబడిన మొదటి పత్రం)

# "విశాలాంధ్ర " భావోద్రేక పూరిత స్వతంత్రోద్యమ నినాదం "తెలంగాణా" వెనుకబడిన ప్రాంత, సత్వర, సమతుల అభివృద్ధి అవసరం

## దశాంశ పత్రం

1) ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు ఒకే భాష, ఒకే సంస్కృతి, భౌగోళిక ఐక్యత కలిగియున్నప్పటికీ చారిత్రికంగా సుమారు 150 సం॥లు విడివిడిగా నుండడం, వివిధ పాలక వర్గాల ఆధీనంలో నుండడం కారణంగా ఈ రెండు ప్రాంతాల మధ్య ఒకే జాతీయత, భావ సారూప్యత కొరవడియుండడం ఒక ప్రత్యేకత. ఒకే తల్లి బిడ్డలుగా, ఒకే కుటుంబ సభ్యులుగా భావోద్రేక పూరితంగా, ఏకశిల సాదృశ్యంగా పరిణమించడానికి చైతన్యవంతమైన ప్రయత్నాలు చెయ్యడం అవసరం. దీనికి చారిత్రిక బంధనాల బిగింపు, జాతీయతా భావ తెగింపు, ప్రబలంగా తోడ్పడుతుంది. ఆరు దశాబ్దాల పరిపాలన, అనైక్యత మరియు వేర్పాటు భావజాల హేతువును నిర్మూలించలేకపోయింది. సామాన్య రాజకీయ కుదుపుల కారణంగా వేర్పాటు వాదం వేళ్ళూనడం తరచుగా అగుపడుతున్న వాస్తవం. జాతీయతా భావం అభేధ్యంగా ధృడపడాలంటే చరిత్ర సృష్టించిన సమైక్యతా విలువలను వెలికితీసి మాత్రమే ఐచ్ఛిక ఐక్యత రూపకల్పన సాధ్యపడుతుంది.

2) బ్రిటిష్ పాలకులు, ముస్లిం పాలకులు భారతదేశాన్ని ఆక్రమించకముందు తెలుగు మాట్లాడే ప్రజలంతా కొన్ని శతాబ్దాల కాలం కలిసిమెలసివున్న చరిత్ర తెలిసినదే. ముస్లిం పాలకులు దక్షిణ భారతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఔరంగజేబు చక్రవర్తి తెలుగు ప్రాంతాన్ని ఆక్రమించాడు. అతని తర్వాత అతని సుబేదారు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. ఈదశలో ఈస్ట్ - ఇండియా కంపెనీ వేషంతో విభజించి పాలించే రాజనీతిని అనుసరించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ముస్లిం రాజ మహారాజులకు అప్పులు ఇచ్చి తదితర ప్రలోభాలకు గురిచేసి దేశాన్ని తమ ప్రత్యక్షపాలన క్రిందకి తెచ్చిన తీరుతెన్నులు చరిత్రలోని ప్రధాన ఘట్టాలు. ఇదే విధానాన్ని అనుసరించి ముస్లిం పాలకులు ఉత్తర సర్కారు జిల్లాలను బ్రిటీష్ పాలకులకు అమ్ముకున్నారు. దక్షిణ కోస్తా జిల్లాలను ఫ్రెంచి పాలకులకు అమ్ముకున్నారు. బ్రిటీష్ పాలకులు ఫ్రెంచి పాలకులకు తగు మూల్యం చెల్లించి దక్షిణ కోస్తా జిల్లాలను తమ కైవసం చేసుకున్నారు.

ఆ తర్వాత కొలది కాలంలోనే ముస్లిం నవాబులు రాయలసీమ అనబడే జిల్లాలను దత్త మండలంగా బ్రిటిష్ వారికి మొదలు తాకట్టు పెట్టి తర్వాత తెగనమ్ముకున్నారు. ఇవి పోగా మిగిలిన తెలుగు ప్రాంతం మరట్వాడ, కర్నాటక ప్రాంతాలతో సహా హైదరాబాదు సంస్థానం పేరుతో నైజాం పాలన క్రింద కొనసాగింది. ముస్లిం పాలకుల క్రింద వున్న తెలుగు మాట్లాడే ప్రాంతాలన్ని "త్రిలింగ" ప్రాంతంగా వాడుక భాషలో అభివర్ణించబడ్డాయి. రాజమహేంద్రవరంలోని ద్రాక్షారామం, కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, కరీంనగర్ జిల్లాలలోని కాళేశ్వరం ఈ మూడు లింగాలు. దీని నుండే 'త్రిలింగ లేక తెలంగాణా' పేరు వచ్చినట్లు వీరు మాట్లాడే భాష పేరు తెలుగు అనబడినట్లు చారిత్రిక ఆధారాలు రుజువు చేస్తున్నవి. రాయలసీమతో సహా ఉత్తర, దక్షిణ, సర్కారు జిల్లాలు బ్రిటిష్ పరిపాలన క్రింద మద్రాస్ ముఖ్యపట్టణంగా ఇతర ప్రాంతాలలో కలిసి వుండడం, హైదరాబాదు నగరం కేంద్రంగా మరట్వాడ, కర్నాటక జిల్లాలతో కలిసి మిగిలిన తెలుగు జిల్లాలు (తెలంగాణా) హైదరాబాద్ సంస్థానంగా నుండడం జరిగింది. ఈ విధంగా ఒకే తల్లి బిడ్డలుగా ఒకే సంస్కృతి, ఒకే భాష భౌగోళిక ఐక్యత కలిగిన తెలుగు ప్రజలు చారిత్రికంగా 150 సం॥లకు మించిన కాలం వివిధ విభిన్న పాలకుల క్రింద బానిసలుగా బ్రతకవలసిన దౌర్భాగ్యం తెలుగు ప్రజలు అనుభవించిన ఉమ్మడి రాజకీయ వారసత్వం.

3) స్వంతంత్రానంతరం, ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత తిరిగి తెలుగు ప్రజలు ఒకే గొడుగు క్రిందకి రావాలనే ప్రయత్నాన్ని చైతన్య పూర్వకంగా స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ నాయకులు చేపట్టారు. భారత ప్రభుత్వం రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను నియమించింది. జస్టిస్ ఫజల్ అలీ అధ్యక్షతన సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త కుంజ్రూ మరియు సుప్రసిద్ధ చరిత్రకారుడు కె.ఎం. పాణికర్ సభ్యులుగా ఈ కమిటీ నియమించబడింది. బ్రిటిష్ పరిపాలన, సంస్థానాధీశుల పరిపాలన కాలంలో కృత్రిమంగా రూపొందించబడిన రాష్ట్రాల పునర్విభజనను స్వతంత్ర ప్రజాస్వామ్య దశలో ప్రజాభిప్రాయాని కనుగుణంగా ముఖ్యంగా భాషా ప్రయుక్తంగా వునర్నిర్మించాలనేది ఈ కమీషన్ లక్ష్యం. నిపుణులతో కూడిన ఈ కమీషన్ ఆంధ్ర, తెలంగాణాల విలీనం గురించి కూడా విశ్లేషించింది. అనుకూల, ప్రతికూల ప్రజాభిప్రాయాలను పరిశీలించి కేంద్రానికి నివేదికను సమర్పించింది. అందులో సుస్పష్టంగా నిర్ధ్వంద్వంగా ఇలా పేర్కొన్నది. హైద్రాబాద్ సంస్థానంలో నైజాం నిరంకుశ పాలన క్రింద వెనుకబడినది తెలంగాణా ప్రాంతం. దీనితో పోల్చినప్పుడు కొలది పౌరసత్వాలతో వివిధ రంగాలలో కొంతవరకైనా అభివృద్ధిని సాధించినది ఆంధ్రప్రాంతం. తెలంగాణా ప్రాంతంలో కల్లు, సారాయి వ్యాపారంపై వచ్చే అమ్మకం పన్ను ఆంధ్రప్రాంతంలో లేదు. ఏది ఏమైనా వెనకబడిన తెలంగాణా ప్రజలలో ఆంధ్రప్రాంతంలో విలీనం కావడానికి భయసందేహాలు వున్నవి. కాబట్టి కనీసం 5 సం॥ల పాటు తెలంగాణా ప్రాంతం వేరుగానుంటూ ఈ

తర్వాత ఎన్నుకోబడిన శాసనసభ్యులు మూడింట రెండు వంతులు ఆంధ్రప్రాంతంలో విలీనం కావాలని తీర్మానించిన తర్వాత సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం సముచితం''. కమిషన్ వారి ఈ ప్రతిపాదనను ఆనాటి హోం మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ గారు, ప్రధాని నెహ్రు గారు, మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారలు పూర్తిగా ఆమోదించినారు. అయినా ఆనాటి తెలంగాణాలోని రాజకీయ పరిస్థితుల కారణంగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు కేంద్ర నాయకత్వం తమ ఆమోద ముద్ర వేసింది. 1-11-56 నాడు ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగింది. ఆంధ్ర - తెలంగాణాతో పాటు దేశ వ్యాపితంగా జరిగిన పునర్విభజన ప్రక్రియ ఒక సత్యాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒకే భాష మాట్లాడుతూ విడివిడిగా నున్న ప్రాంతాలను ఐక్యం చేసింది. ఒకే భాష మాట్లాడినప్పటికి చారిత్రిక కారణాల వలన ప్రాంతాల మధ్య అభివృద్ధిలో గణనీయమైన తేడాలు కనబడితే ఆ తేడాలు తొలిగిపోయే వరకు వాటిని విడిగా నుంచడం, తిరిగి మానసిక ఐక్యత ఐచ్ఛిక సమైక్యత సమకూర్చిన తర్వాత ఐక్య రాష్ట్రం చేయడం కమీషన్ అభిమతం. ఆనాడే సర్ధార్ కె.ఎం. పాణికర్ గారు తమ భిన్నాభిప్రాయంలో చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను నొక్కి వక్కాణించినారు. పునర్విభజనను ప్రజల బహుముఖ అభివృద్ధికి ఒక చక్కని అవకాశంగా మలుచుకోవాలన్నారు. కుల, మత, భాష ప్రాంతీయ తత్వాలకు అతీతంగా ఆలోచిస్తూ చిన్న రాష్ట్రాలు అభివృద్ధికి సోపానాలుగా ఉపయోగపడతాయని స్పష్టం చేసారు. ఇటీవల ఏర్పడిన ఉత్తరాఖండ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌ల తదితర చిన్న రాష్ట్రాల ఆవశ్యకత, ప్రసక్తి ఆనాడే వచ్చింది. ఇప్పటికే చర్చనీయాంశాలుగా మిగిలియున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని 3 చిన్న రాష్ట్రాలు, మహారాష్ట్రలోని విదర్భ, హైదరాబాదు సంస్థానంలోని తెలంగాణా గురించి సర్దార్ పాణికర్ గారు అప్పుడే వాటి హేతుబద్దతను స్పష్టం చేసారు.

4) పైన పేర్కొనిన చారిత్రిక నేపథ్యం, ఆరు దశాబ్దాల అనుభవం, రాష్ట్రాల పునర్విభజన అవశ్యకతకు ఒకే ఒక ప్రధాన కారణాన్ని ఎత్తి చూపుచున్నది. అదే ''సమతుల మానవాభివృద్ధి''కి సోపానంగా నుండే చిన్న రాష్ట్రాల రూపకల్పన. ప్రపంచవ్యాపిత అనుభవాలు ఈ కఠోర సత్యాన్ని రుజువు చేసినవి. 70 సం॥ల సోషలిస్టు వ్యవస్థగా వెలుగొందిన సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలలో చోటు చేసికొన్న రాష్ట్రాల పునర్విభజన, చిన్న రాష్ట్రాలు మానసిక ఐక్యతగల రాష్ట్రాల అవతరణకు అద్దం పడుచున్నది. ప్రజల ఆత్మాభిమానానికి అగ్రతాంబూలం ఇచ్చిన వైనం ఆశ్చర్యాలను కలిగిస్తున్నది. యూరప్‌లో, మన దేశంలోని ఒక రాష్ట్రం కంటే చిన్నవిగానున్న దేశాలు అనేక రాష్ట్రాలుగా పాలనా సౌకర్యాన్ని ప్రధానాంశంగా గుర్తించిన అనుభవం నాగరికత ప్రపంచంలో కొత్తది కాదు. 30 కోట్ల జనాభా కలిగిన అమెరికా దేశంలో 50 రాష్ట్రాలుండడం కొట్టవచ్చినట్లు కనబడే పరిపాలనా విభజన. మన దేశంలోనే చిన్న రాష్ట్రాలుగా నున్న పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, గోవా మరియు సిక్కిం రాష్ట్రాలు బహుముఖ అభివృద్ధిలో ముందంజవేయడం మన అనుభవం. చిన్నగానున్న కేరళ రాష్ట్రం

మానవాభివృద్ధిలో సాధించిన మహోన్నత స్థానాన్ని అమర్త్యసేన్ ప్రపంచానికే ఆదర్శమని రుజువుచేశారు. పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పరిపాలనలో ఎంత వెనుకబడియున్నాయో వివిధ అంకెలు రుజువు చేస్తున్నాయి. ప్రభుత్వం అంటే ఒక ముఖ్యమంత్రి, మంత్రివర్గం వారి కార్యదర్శివర్గానికి పరిమితమైన అంశం ఎన్నడో కాలగర్భంలో కలిసిపోయింది. ప్రభుత అనునది రాజకీయ, ఆర్థిక పాలనా అధికారాన్ని అన్ని స్థాయిలలో, అన్ని రంగాలలో సమర్థవంతంగా, సమన్వయ పూర్వకంగా నిర్వహించబడే ఒక బృహత్తర ప్రక్రియ. వివిధ వ్యవస్థలను, సంస్థలను ప్రజా బాహుళ్యం యొక్క ప్రయోజనాలను సాధించే విధంగా రూపకల్పన చేసే ప్రక్రియ. పౌరుల జీవితాలలో గుణాత్మకమైన మార్పులను సుసాధ్యం చేయగలిగే సుపరిపాలన మాత్రమే ప్రభుతకు ప్రాణపదం. అంతేకాదు ప్రభుతలోని ఏ ఒక్క అంశమైన దుర్వినియోగం చేయబడితే అది ప్రజా జీవితాన్ని ఎంతగానో కలుషితం చేయగలుగుతుంది. ఇలాంటి దురవస్థలకు ఆస్కారం లేకుండా ప్రజాబాహుళ్యం యొక్క నిత్య జీవితాన్ని సుఖసంతోషాలతో సుసంపన్నం చేసే యంత్రాంగమే ప్రజాతంత్ర ప్రభుత్వం. అధికార వికేంద్రీకరణ, పాలనలో ప్రజల ప్రత్యక్ష పాత్ర, ప్రజల నిర్ణయాధికారం, పారదర్శక పనితనం దీనికి ప్రాణప్రదం. ఇది సాధ్యపడాలంటే స్థానిక స్వపరిపాలనతో కూడిన చిన్న రాష్ట్రాల అవతరణ అనివార్యం. అందులోనూ వెనకబాటుతనం, పరస్పర అవిశ్వాసం చోటుచేసికొన్న ప్రాంతాల మధ్యన స్నేహబంధాన్ని, సఖ్యతను, సదావగాహనను సృష్టించి పెంచగలిగే వజ్రాయధం చిన్న రాష్ట్రాల ప్రాతిపదిక. తెలంగాణాలో ఈనాటి పరిస్థితికి ఇదొక్కటే పరిష్కార మార్గం.

5) ఆధునిక శాస్త్ర సాంకేతిక యుగధర్మం ప్రపంచీకరణ. ఇది విశృంఖలంగా జరిగిపోతున్నది. దీని ప్రభావం గురించి అతి సూక్ష్మంగా విశ్లేషిస్తూ మన దేశ ప్రజావసరాల పరిష్కారానికి దీనిని ఉపయోగించుకోవడం, ఆవిధంగా దీనిని ప్రజాహిత ప్రపంచీకరణంగా మలుచుకోవడం ఆధునిక సామాజిక శాస్త్రజ్ఞుల ప్రథమ కర్తవ్యం. ఇది జరగాలంటే ఇంతవరకు ఆచరించబడుచున్న కాలదోషం పట్టిన పద్ధతులకు స్వస్తి చెబుతూ విన్నూత్న నియమ నిబంధనలకు రూపకల్పన చేయవలసియుంటుంది. నాణ్యత గల ఉత్పత్తులను జన బాహుళ్యానికి అందుబాటులోకి తేవలసియుంటుంది. శాసన, న్యాయవ్యవస్థ, పరిపాలనా సంస్థలలో తీవ్రమైన మార్పులు చేయవలసియుంటుంది. బౌతిక, వస్తు వాహనల అభివృద్ధితో పాటు విద్య, వైద్య సముపార్జనలాంటి మానవాభివృద్ధి ప్రమాణాలను పాటించవలసి వుంటుంది. ఈ ప్రక్రియలో ప్రపంచంలోని 177 దేశాలలో 126వ స్థానంలోనున్న భారదేశాన్ని ఎంతో పైకి లేవనెత్తవలసియున్నది. దేశ జనాభా సగటు జాతీయ అభివృద్ధికి దీటుగా మానవాభివృద్ధిని సాధించవలసియున్నది. పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలు ప్రవేశపెట్టడం ద్వారా మాత్రమే ఇది సాధ్యపడుతుంది. చిన్న రాష్ట్రాలు ఇందుకు అనివార్యం. ఇదే ప్రపంచ పరిపాలనా వ్యవస్థల పరిపూర్ణ

అనుభవం. భారతదేశ వ్యాపితంగా చిన్న రాష్ట్రాల సిద్ధాంతాన్ని త్వరత్వరగా అమలు పరచగలిగితే నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లుతుంది. ప్రజాస్వామ్యం ఎన్నికలు, అధికారానికి మాత్రమే పరిమితమవుతున్న మనదేశ పరిస్థితులలో దీనిని ప్రజలకొరకు, ప్రజలచేత నిర్వహించబడే ప్రజల ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దడం రాజకీయ పార్టీల తక్షణ కర్తవ్యం. వెనుకబడిన తెలంగాణా ప్రాంతం ఒక చిన్న రాష్ట్రంగా ప్రపంచీకరణ అందిస్తున్న అపూర్వ అవకాశాలను సంపూర్ణంగా ఉపయోగించుకుంటూ సత్వరాభివృద్ధిని సాధించగలుగుతుంది.

6) 1991లో ప్రారంభించబడిన ఆర్థిక సంస్కరణలు మన పరిపాలనా వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నవి. ప్రభుత్వం, ప్రైవేటు రంగాలలో కొనసాగుతున్న అభివృద్ధి, సంపద ఉత్పత్తి ఏకపక్షంగా కొనసాగుతున్నది. అభివృద్ధి సమస్యలు, అభివృద్ధి ఫలితాల పంపకం మార్కెట్ వ్యవస్థ ప్రమేయంతో పరిష్కరించబడుచున్నవి. దీని ఫలితంగా అభివృద్ధి క్రమంలో హనికరమైన పోటీలు, అభివృద్ధి ఫలితాల పంపకంలో లబ్ధిదారులకు తీరని అన్యాయాలు చోటుచేసుకొంటున్నవి. ఒకటిన్నర దశాబ్ధ అనతికాలంలో ధనవంతులు, పేదల మధ్య అంతరం అనూహ్యంగా పెరిగిపోతున్నది. ఉన్నత విద్య, వైద్య, గృహ వసతి, రవాణా తదితర సౌకార్యలు పేదలకు అందని చందమామలాగా మిగిలిపోతున్నవి. నాగరిక సమాజంలో మనదేశంలోనున్న 80%జనాభా కేవలం ప్రతిదినం తలసరి 20 రూపాయల ఆదాయంతో జీవించవలసి వస్తున్నది. సంపద సృష్టికర్తలు పేదలుగా మిగులుతూ సంపన్నులు కోటికి పడగలెత్తుతున్నారు. ఈ పరిణామాన్ని నిలువరించగలిగే ప్రభుత్వాల ఆవశ్యకత, యంత్రాంగం యొక్క సామర్థ్యం ఇతోధికం చేయకతప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ సంస్థలకు ఇదో పెద్ద సవాలు. దీనికి ధీటైన సమాధానం ఇవ్వగలిగే సుపరిపాలన, దార్శనికత కలిగిన సమర్థ పరిపాలన చిన్న రాష్ట్రాలలోనే సుసాధ్యం.

7) కుల వ్యవస్థ మన దేశంలో ఒక సామాజిక వాస్తవం. సమాజాన్ని చీల్చిన వర్ణ వ్యవస్థ సామాజిక ఐక్యతకు పెద్ద అవరోధంగా పరిణమించింది. మన రాజ్యాంగం కుల వ్యవస్థ నిర్మూలన లక్ష్యంతో సామాజిక, ఆర్థిక సంస్కరణలను ఆదేశిక సూత్రాలుగా పొందుపర్చింది. దేశవ్యాపితంగా బ్రిటీష్ సామ్రాజ్య వ్యవస్థ అంతవరకు వున్న ఉత్పత్తి సాధనాలను ధ్వంసం చేస్తూ ఆర్థిక పురోభివృద్ధిని తీవ్రంగా అరికట్టింది. అందువల్ల సుమారు 100కు మించిన కులాలకు చెందిన బడుగు, బలహీన వర్గాలు, దళితులు తమ కుల వృత్తులను కోల్పోవడం జరిగింది. అంతేకాదు గ్రామీణ ఫ్యూడల్ వ్యవస్థ, జమీందారీ, జాగీర్‌దారీ, భూస్వామ్య వ్యవస్థలో బానిస బ్రతుకు భారాన్ని మోయవలసి వచ్చింది. బానిసలుగా, అస్వతంత్రులుగా బలవంతుల ఉక్కుపాదాల క్రింద నలిగిపోవలసి వచ్చింది. స్వతంత్రం వచ్చిన 60 సం॥రాలలో ఈ వర్గాల జీవన పరిస్థితులలో నామమాత్రం

మార్పు కనబడుతున్నా అందులో 80 నుండి 90 శాతం దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం లాంటి దురవస్థలకు బలికావడం ఇంకా చూస్తున్న వాస్తవం. తెలంగాణా ప్రాంతాలలోనైతే పైన సామ్రాజ్యవాదం, మధ్యన రాచరికం క్రింద భూస్వామ్య వ్యవస్థ ఈ మూడింట క్రింద బలహీనవర్గాలు నులిపి వేయబడినవి. ఆధునిక అవగాహన ప్రకారం స్వతంత్రానికి అర్థం, పరమార్థం 'మానవాభివృద్ధి' అయినప్పుడు కోట్లాది వెనకబడిన తరగతులు దళితుల పురోభివృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధమ కర్తవ్యం. అది సాధ్యపడాలంటే కేవలం స్వపరిపాలన గల చిన్న రాష్ట్రాల ద్వారానే సాధ్యపడుతుంది. విశాల రాష్ట్రంలో ఈ వర్గాలను పట్టించుకునే నాధుడుండడు. ఇది ఈనాడు పెద్ద రాష్ట్రాలుగా నున్న ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొట్టువచ్చినట్లు అగుపడుతున్న వాస్తవం. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిణి మాయావతి ఆనాడు శ్రీ కె.ఎం. పాణికర్ గారు చేసిన ప్రతిపాదనను ఈనాడు ఆమోదిస్తూ ఉత్తరప్రదేశ్‌ను 3 రాష్ట్రాలుగా విభజించే ఆలోచన చేయడం ముదావహం. అంతేకాదు పెద్ద రాష్ట్రాలలో మహిళాభ్యుదయం, మైనార్టీల సంక్షేమం అజెండాలోని చివరి అంశాలుగా మాత్రమే మిగిలిపోతాయి. చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను ఎత్తి చూపడానికి ఇంతకు మించిన చర్చ అవసరం లేదు.

8) మరో కోణం చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను ఆకర్షిస్తున్నది. కీ॥శే॥ రాజీవ్‌గాంధీ నాయకత్వంలో పరిపాలనా వికేంద్రీకరణ గురించి చేయబడిన 73-74 రాజ్యాంగ సవరణలు దాదాపు కాగితాలకే పరిమితమైపోయినది. అగ్రవర్ణాలు, ధనాఢ్య వర్గాలతో కూడిన రాజకీయ నాయకత్వం ఈ సంస్కరణల ప్రాధాన్యతను జీర్ణించుకోలేకపోతున్నవి. అధికార కేంద్రీకరణకు అలవాటు పడిన పాలకగణం, కేంద్రీకృత అధికార రుచికి మరిగిన రాజకీయ నాయకత్వం పంచాయితీ రాజ్ వ్యవస్థలో అధికారాన్ని పంచుకోవడానికి ఆచరణలో నిరాకరిస్తున్నవి. రాజ్యాంగం ఆదేశించిన నిధులు, విధులను మళ్ళించడానికి నిరాకరిస్తున్నవి. పెద్ద రాష్ట్రంలో ఎన్నుకోబడిన పంచాయితీ రాజ్ నాయకత్వం తమ హక్కులకై పోరాడలేక పోతున్నవి. అధికార దర్పంతో పరిపాలన యంత్రాంగం యొక్క కుయుక్తుల ద్వారా స్థానిక స్వపరిపాలనలాంటి గాంధేయ సిద్ధాంతాన్ని కాలరాచివేస్తున్నది. చిన్న రాష్ట్రాలలో సాధికారులైన ఓటరు మహాశయులు ఇటువంటి అక్రమాన్ని అరికట్టగలుగుతారు. తమ ఉనికిని చాటుకుంటూ ప్రజాస్వామ్య ప్రభుత్వానికి వన్నె తేగలుగుతారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న సంబంధ బాంధవ్యం చిన్న రాష్ట్రాలకు ఉపయుక్తంగా నుండ గలుగుతుంది. సంఖ్యాబలం కలిగిన రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని రాష్ట్రాల సమాఖ్యగా అర్థవంతం చేయగలుగుతాయి. ప్రణాళిక సంఘం నిర్ణయాలు, ఆర్థిక సంఘం సలహాలను సమన్వయం, సముతులం చేసికోగలుగుతాయి. చిన్న రాష్ట్రాలు (కేంద్రం) సమాఖ్య సభ్య రాజ్యాలుగా ప్రజల జీవిత రంగాలన్నింటిపై తమ పరిపాలనను భద్రపరుచుకుంటూ ఉమ్మడి అంశాలైన విదేశీ, రక్షణ, ద్రవ్య విధానాలను కేంద్రానికి అప్పగించగలుగుతాయి. ఈనాడు చిన్న,

పెద్ద రాష్ట్రాలు తరతమ రాజకీయ బలా బలాలను వినియోగిస్తూ ఒక గందరగోళ పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనిని, సర్కారియా కమిటీ నివేదిక వెలుతురులో ప్రక్షాళన చేసి సరిచేయవలసిన అవసరం ఎన్నడో ఏర్పడినది. రాష్ట్రాల బలహీనత కారణంగా కేంద్రం అయిష్టత ఫలితంగా ఈ దిశలో ముందడుగు పడడంలేదు. ఏది ఏమైన చిన్న రాష్ట్రాలైన తెలంగాణా, విదర్భ, ఉత్తరప్రదేశ్‌లోని చిన్న రాష్ట్రాలు ఈ దశలో గుణాత్మకమైన మార్పును సాధించగలుగుతాయి. మరొక ముఖ్యాంశం. పరిపాలనా సౌష్టవం కొరకు పౌర సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, సహాకర సంఘాల పాత్ర అత్యావశకము. వీటి ద్వారా దేశ అభివృద్ధికి కీలకమైన సామాజిక పెట్టుబడిని సంతరించుకోగలుగుతాం. ప్రభుత్వ అధికారులు, అనధికారులు తమ సూక్ష్మస్థాయి కృషి ప్రయత్నం ఫలితంగానే ఈ అమూల్య సామాజిక పెట్టుబడిని ప్రోగుచేయగలుగుతాం. పెద్ద రాష్ట్రాలలో ఇటువంటి ప్రయత్నం నామమాత్రంగా కూడా జరగడంలేదు. అభ్యుదయానికి అవసరమైన ఈ ఇంధనం, దాని చోదకశక్తి చిన్న రాష్ట్రాలలో చేయబడే పెద్ద ప్రయత్నాల ఫలితంగానే అందుబాటులోకి వస్తుంది.

9) ఈనాడు కేంద్ర, రాష్ట్ర పరిపాలన వ్యవస్థలలో గూడుకట్టుకుని వున్న లంచగొండితనం, అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం జాతి అభివృద్ధికి గొప్ప అవరోధాన్ని కల్పించడమే కాక అవమానాన్ని మూటకట్టిపెట్టుతున్నాయి. ప్రజల వద్దకు పాలన, వికేంద్రీకృత ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నామమాత్ర వశిష్టంగా మిగిలిపోయి రాజకీయమంటే కేవలం అధికార సాధన, ఆర్థిక వనరుల సంపాదనగా పరిగణించ బడుచున్నది. అందుకొరకు ధనబలం, కండ బలం విశృంఖలంగా వినియోగించబడుచున్నది. రాజకీయం పరిపూర్ణంగా నేరమయం కావడం కండ్లార చూస్తున్న కఠోరసత్యం. అవినీతి నిర్మూలన గురించి లెక్కకు మిక్కిలి నివేదికలు ఉన్నప్పటికీ వాటిని వ్యక్తపరిచే నైతికశక్తిని, రాజకీయ సంకల్పబలాన్ని పాలక వర్గాలు కోల్పోతున్నవి. ప్రపంచ వ్యాపిత అనుభవాల నేపథ్యంలో ఈ అవినీతిని అరికట్టడం అసాధ్యం కానే కాదు. రాజకీయ సంకల్పబలం కలిగి సామాజిక పెట్టుబడి కొల్లలుగా ఏర్పడితే ఈ జాడ్యాన్ని తరిమికొట్టడం సాధ్యం. ఆధునిక శాస్త్ర సాంకేతిక నైపుణ్యతను వినియోగిస్తూ న్యాయశాస్త్రాలకు పదును పెడుతూ నేరస్థులకు కఠినశిక్షలు విధించడం, రెండవవైపు సామాజిక స్పృహను విస్తరిస్తూ క్రమంగా ఈ దిశలో విజయపరంపరలను సాధించగలుగుతాం. రాష్ట్ర ఆదాయంలోని ప్రతిపైసా అర్హతగల లబ్ధిదారులకు చెందే విధంగా చూడగలుగుతాం. దేశభక్తికి నూతన అర్థాన్ని సంతరింపచేయగలుగుతాం. నవసమాజ నిర్మాణానికి యువతీ  యువకులను కంకణబద్ధులం చేయగలుగుతాం. ఇంతటి పరిమాణాత్మక సూక్ష్యస్థాయి బాధ్యతల నిర్వహణ వికేంద్రీకరణ వ్యవస్థల ఆధారంగా దానికి మారు పేరుగా నిలిచే చిన్న రాష్ట్రాల పరిధిలోనే సాధ్యపడుతుంది.

10) పై రేఖామాత్రంగా నుదహరించిన విలువలు, సంస్కరణలు, ఆచరణ చిన్న రాష్ట్రాలలోనే సుసాధ్యం. పెద్ద రాష్ట్రాలలో అసాధ్యం. లేక కష్ట సాధ్యం. ఈనాడు చర్చించబడుచున్న ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ముక్కోటి తెలుగు వారికి నిలయంకాగా ఎనిమిదన్నర కోట్ల తెలుగు ప్రజల సాంస్కృతిక, సమైక్యతకు సాధనంగానుండాలి. సుపరిపాలన సాధనలో తోటి ఆంధ్ర ప్రభుత్వంతో స్ఫూర్తిని పొందుతూ, పోటీ పడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా వెలుగులోకి రావాలి. అనతికాలంలోనే అన్ని రంగాలను ఆవరించిన వెనకబాటుతనాన్ని పారద్రోలుతూ గుణాత్మకంగా విద్యా, వైద్య రంగాలలో అత్యంత వేగంగా ఎదగాలి. కోకొల్లలుగా నున్న వనరులన్నింటిని సద్వినియోగ పరుస్తూ మానవాభివృద్ధిలో ముందంజ వేయాలి. భూస్వామ్య వ్యవస్థ, ధనాఢ్య వర్గాలు సృష్టించిన దురవస్తలకు వ్యతిరేకంగా ప్రపంచ చరిత్రలోనే సువర్ణక్షారాలతో లిఖించబడిన తెలంగాణాలోని సామాజిక విప్లవం సంపూర్ణం చేయబడాలి. దున్నేవాడికి భూమి, అన్ని రంగాలలోనున్న శ్రమ జీవుల శ్రమకి సంపూర్ణ ప్రతిఫలాన్ని పువ్వులో పెట్టి అందచేసే సురాజ్యం ఏర్పడాలి. ప్రాంతీయ తదితర అసమానతలు తుడిచి పెట్టబడాలి. నాలుగువేల స్వాతంత్ర సమరయోధులు, నాలుగు వందల ప్రత్యేక తెలంగాణా పోరాట యోధుల కలలు సాకారం కావాలి. ఇటువంటి సైద్ధాంతిక పటిమ కలిగియుండి, ప్రజాతంత్ర విలువలకు కట్టుబడియుండి ఉద్యమాలే ఊపిరిగా యుండే సమర్ధవంతమైన త్యాగధనుల అంకితభావంతో ఈ నవ తెలంగాణా, చిన్న రాష్ట్రమైన ప్రజా తెలంగాణా అవతరించగలుగుంది. తోటి తెలుగువారైన ఆంధ్రప్రాంత ప్రజల ప్రేమాభిమానాలను చూరగొంటూ పరస్పర సహకారాన్ని అందిపుచ్చుకొంటూ ఒకే భాష మాట్లాడే రెండు తెలుగు రాష్ట్రాలుగా భారతదేశంలోనే తమ విశిష్టతను, ప్రతిభను ప్రదర్శించగలుగుతాయి.

(తెలంగాణా అంశంపై తెలుగుదేశం పార్టీచే నియమించబడిన కోర్ కమిటీకి సమర్పించిన రెండవ పత్రం)

# మార్క్సిజం నవజీవనం, పునరుజ్జీవనం పొందడం అవశ్యం

మార్క్సిస్టు మూల సూత్రాల ప్రకారం మారుతున్న భౌతిక పరిస్థితులలో సిద్ధాంతం గూడా చేర్పులు, మార్పులు పొందవలసియుంటుంది. అప్పుడే అది కార్యాచరణకు మార్గదర్శకంగానుంటుంది. కారల్‌మార్క్స్ తర్వాత లెనిన్ మహాశయుడు రష్యా విప్లవ నిర్వాహణకై మార్క్సిజాన్ని ప్రబల సిద్ధాంత ఆయుధంగా వినియోగించారు. తన సృజనాత్మక ప్రతిభాపాటవాలతో ఆనాటి రష్యన్ భౌతిక పరిస్థితుల కనుగుణ్యంగా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోనుంచారు. రష్యన్ విప్లవ విజయం తర్వాత అయిదు సంవత్సరాల అనతికాలంలోనే ఆ మహా మేధావి హఠాత్తుగా కన్నుమూశాడు. ఆయన తర్వాత కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన స్టాలిన్ తనదైన ప్రత్యేక శైలిలో మార్క్సిస్టు సిద్ధాంతానికి భాష్యం చెప్పారు. చలనసహితమై, మృధుమధురమై, మానవీయమై, సృజనాత్మకమైన మార్క్సిజాన్ని మార్పులేని, బండబారిన, మూఢాచారంగా మలిచారు. అనుభవాల వెలుతురులో సిద్ధాంతాన్ని మార్చడానికి ప్రయత్నించిన వారందరిని రివిజనిస్టులుగా, పెట్టుబడిదారి సిద్ధాంత ఏజెంట్లుగా చిత్రించి వారిని వారి ఆలోచనా ధోరణలను అత్యంత క్రూరంగా అణచివేయడం జరిగింది. రష్యాలో స్టాలినిజం, చైనాలో మావోయిజం, మార్క్సిజంగా ప్రచారం చేయబడినవి. సుధీర్ఘకాలం అధికారంలో నున్నా, ఆర్థిక, రాజకీయ సమస్యలకు పరిష్కారం చూపించలేకపోయినవి. అపారమైన నష్టకష్టాలకు కారణభూతమై చివరకు ''సోషలిస్ట్ వ్యవస్థ''గా నిర్మించబడిన సౌధం కుప్పకూలిపోక తప్పలేదు. ఆ తర్వాతగాని ''స్టాలినిజం'' ఆనాటి ''మావోయిజం''లు నిజమైన మార్క్సిజం కాదని పట్టువిడుపులు లేని, ఒంటెత్తుపోకడలతో కూడిన, మూర్ఖత్వం మూర్తీభవించిన అరాచకవాదమని ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా మేధావి వర్గం గుర్తించడం జరుగుతున్నది.

ఏది ఏమైనా మానవ సమాజ పరిణామములో మతోద్యమాల తర్వాత సాంఘిక జీవితాన్ని అత్యధికంగా ప్రభావితం చేసిన సిద్ధాంతం మార్క్సిజం. తత్వశాస్త్రాన్ని మాయమిథ్యలతో కూడిన భావవాదం నుండి హేతువాదం, భౌతిక వాదంలోకి మళ్లించింది. తత్వశాస్త్రం సామాజిక పరిణామక్రమాన్ని గుర్తిస్తూ సాంఘిక జీవితాన్ని అభివృద్ధి పరిచే ప్రబల సాధనంగా రూపొందించింది. మానవ శ్రమను, శ్రమశక్తిని వెలలేని సృజనాత్మక శక్తిగా వెలుగులోకి తెచ్చింది. బడుగు బానిసలుగానుండిన

శ్రమజీవులలో అపారమైన ఆత్మ విశ్వాసాన్ని క్రియాశీలతను, పోరాటపటిమను సంతరింపచేసింది. వర్గచైతన్యాన్ని రగిలించి పీడిత కార్మికవర్గంలో పెట్టుబడిదారి వర్గ దోపిడీకి వ్యతిరేకంగా మహోద్యమాల నిర్మాణానికి దోహదం చేసింది. వర్గ దోపిడీని అంతమొందించగలిగే రాజకీయ విప్లవోద్యమాల నిర్మాణానికి, వాటి విజయానికి బాటలు వేసింది. 1917లో రష్యాలో ప్రథమ సమాజవాద విప్లవానికి పదునైన ఆయుధంగా ఉపకరించింది. విప్లవ విజయాన్ని పరిరక్షించుకుంటూ వివిధ జాతుల, మతాల ప్రజల మధ్య సదవగాహన కల్పిస్తూ సుస్థిరతను సాధ్యం చేసింది. నూతన ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను నెలకొల్పింది. సామ్రాజ్యవాద తృష్ణతో, పశుత్వానికి తెగించిన నాజీయిజం, ఫాసియిజంల నరహంతక శక్తులను నిర్మూలించి ప్రజాస్వామ్యానికి, మానవ విలువలకి పట్టంకట్టింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం స్వేచ్ఛా స్వాతంత్ర వాయువులుతో బానిస ప్రపంచాన్ని నిద్రమేల్కొల్పి స్వాతంత్రోద్యమాలలోకి ఆకర్షించింది. వందకు మించిన దేశాలు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలో సామ్రాజ్యవాద బానిస సంకెళ్లను త్రెంచుకొని స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. ఈ మహత్తర జాగృతి వెనుక సోవియట్ రష్యా సాధించిన మహత్తర విప్లవ విజయంతో మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల ప్రభావం కొట్టవచ్చినట్టు అగుపడింది. ఆ తరువాత సుమారు 25 సంవత్సరాల వరకు, అటు సామ్రాజ్యవాద దేశాలు, ఇటు సోషలిస్టు దేశాల మధ్య కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం, సామ్రాజ్యవాద పన్నాగాలకు, తృతీయ ప్రపంచయుద్ధ కుతంత్రాలకు అడ్డుకట్టవేసింది. ప్రపంచ శాంతికి, ప్రజాస్వామ్యానికి విజయాన్ని సాధించింది. తూర్పు యూరపు దేశాలు చైనా, వియత్నాం, ఉత్తర కొరియా, మంగోలియా, క్యూబా దేశాలలో మొత్తం ప్రపంచంలో మూడవ వంతు దేశాలలో సమ సమాజ వ్యవస్థలు నిర్మించుకోవడానికి, వాటిని నిలబెట్టుకోడానికి మార్క్సిజం మొక్కవోని ధైర్యసాహసాలను అందించింది. శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన వ్యాప్తికి, ఉత్పత్తి, ఉత్పాదకతల అభివృద్ధికి, సాంఘిక న్యాయ సాధన లక్ష్యంగా గల సమాజ వాద కార్యక్రమాలకి ప్రపంచ శాంతి, విశ్వమానవ కళ్యాణానికి మారుపేరుగా మార్క్సిజం పరిఢవిల్లింది. మానవేతిహాసంలో ఇరువదవ శతాబ్దం మార్క్సిస్టు శతాబ్ధిగా కలకాలం నిలుస్తుంది.

భౌతిక శాస్త్రం, సామాజిక శాస్త్రాలలో తమకంటే ముందే అనేకులు చేసిన పరిశోధనలను ఆధారం చేసుకొని కారల్‌మార్క్స్, ఫెడరిక్ ఎంగెల్స్‌లు ఈ క్రింది శాశ్వత సత్యాలను వెలుగులోకి తెచ్చారు. శాస్త్ర, సాంకేతిక సామాజిక పరిణామ అనుభవాల వెలుతురులో ఈ శాశ్వత సత్యాలు గూడా ఆధునీకరించబడం అవసరమన్నారు. భావ భౌతిక జగమంతా పరస్పర విరుద్ధ శక్తుల అంతర్గత సంఘర్షణతో సమైక్య స్వరూపంలో నుంటు, నిరంతరం మార్పు చెందే క్రమములో నుంటుందని మార్క్సిజం యొక్క గతితార్కిక భౌతిక వాదం తెలియజేస్తుంది. ఈ సూత్రాన్ని సామాజిక పరిస్థితులకు, పరివర్తనలకు వర్తింపజేస్తూ వివిధ సామాజిక శక్తుల మధ్య సంఘర్షణ, సమైక్యతను

విశ్లేషించే సిద్ధాంతము చారిత్రిక భౌతికవాదంగా రూపొందిచడం జరిగింది. సంఘర్షణ, సమైక్యత, సంచలనం, పరిణామం, అభివృద్ధి, శాస్త్ర సాంకేతిక ప్రగతి దాని నిరంతర ప్రభావం, పరిణతి లాంటి సజీవ సృజనాత్మక భావాలు మార్క్సిజం అందజేసిన అపురూప ఆలోచనలు. వందల వేల సంవత్సరాల శాస్త్ర సామాజిక విలువలు మానవ సంపదగా భద్రపరచి, పోషించబడి, ఆధునీకరించబడి, భవిష్యత్తుకు మార్గదర్శక సూత్రాలుగా మలచడం గతితార్కిక చారిత్రిక భౌతికవాద సిద్ధాంతాల పరమలక్ష్యం. జగత్తును చలనరహితమైన, జఢత్వంతో కూడిన, మానవాతీత శక్తితో సృష్టించబడి మానవమాత్రుల ప్రమేయంలేని మిధ్య మాయ అని మతమౌఢ్యంతో కూడిన భావవాదం తెలియజేస్తుంది. ఈ భావవాదానికి హేతువాదం, పరిణామవాదంతో ఎలాంటి సంబంధ లేదు. "అగమ్యం" "అగోచరం" "అదృష్టం" భావవాద గుర్తులు. వాస్తవ పరిస్థితులు, వాటి పరిణామక్రమాల విశ్లేషణలపై ఆధారపడకుండా వ్యక్తి ప్రాధాన్యత, స్వీయమానసిక ధోరణికి ప్రాధాన్యతనిచ్చే భావవాద మనస్తత్వాలు మార్క్సిజం యొక్క సృజనాత్మకతను నిత్యనూతన పరిణామత్మక సత్యాన్ని మరుగుపరచడం, చివరకు దానిని నిర్జీవం చేయడం జరిగింది. వివిద దేశాలలోని సాంస్కృతిక, సామాజిక ప్రత్యేకతలను అక్కడి ప్రజాసామాన్యం యొక్క మానసిక ప్రవృత్తులను లక్ష్యపెట్టకుండా "మార్క్సిజం" పేరుతో యాంత్రికంగా బండ సూత్రాలను నిర్ధాక్షిణ్యంగా వర్తింపజేయడం జరిగింది. స్టాలినిజం, మావోయిజంలు ఇదే పని చేసినవి. సుమారు రెండు వందల సంవత్సరాల నాటి ఆరంభంలో వున్న పెట్టుబడిదారి సమాజ పరిస్థితిని విశ్లేషించి కారల్‌మార్క్స్, ఫెడరిక్ ఎంగేల్స్ గారలు చేసిన సూత్రీకరణలు పెట్టుబడిదారి సమాజపరిణామ పరివర్తనల వెలుతురులో సవరింపులు, చేర్పులు, మార్పులతో ఆధునీకరించబడవలసి వుండినది. అటువంటి నవజీవనం ఆధారంగానే మార్క్సిజం ప్రతి చారిత్రిక దశలో పునరుజ్జీవం పొందుతూ, సామాజిక ప్రగతికి దిక్సూచిగా ఉపకరిస్తుంది. మార్క్సిజానికి అందించవలసిన నవ జీవనం, మార్క్సిజం పేరిట వ్యవహరించబడే అపభ్రంశాలు. అపశృతులను ఎత్తిచూపటంపై శాస్త్రవేత్తల తక్షణ కర్తవ్యం. ఈ కర్తవ్య నిర్వహణలో ఈ క్రింది ముఖ్యాంశాలు గమనార్హం.

## రాజ్యాధికారం:

మార్క్సుగారి మూల సిద్ధాంతం ప్రకారం ఉదాత్తమైన మానవ కళ్యాణ లక్ష్యసాధన కొరకు రాజ్యాధికారం అవసరం. దోపిడీ వర్గాల చేతినుండి రాజ్యాధికారాన్ని కార్మికవర్గం హస్తగతం చేసుకోవడం తమ లక్ష్యసాధనం సుగమమం చేయడం కొరకు వ్యతిరేక వర్గాల ప్రతిఘటనను అణచివేయడం ముఖ్యోద్దేశం. కాని సోవియట్ రష్యా తదితర కమ్యూనిస్టు దేశాలలో రాజ్యాధికార సాధన, దాని పరి రక్షణ ప్రధాన లక్ష్యంగానే మారింది. సమసమాజ నిర్మాణం తర్వాత రాజ్య వ్యవస్థ అనవసరమై క్రమంగా

ఘుల్లిపోతుందనే మార్క్సిస్టు మూలసూత్రం మటుమాయమైపోయింది. తద్విరుద్ధంగా కమ్యూనిస్టు పార్టీ చేతిలో అధికారం కేంద్రీకరించబడ్డది. ప్రతిపక్షాల భిన్నాభిప్రాయాలకు స్థానం లేకుండా సంపూర్ణ నిరంకుశత్వానికి రష్యాలో కార్మికవర్గ నియంతృత్వం, చైనాలో ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వమనే పేర్లతో సమర్థించి శాశ్వతం చేయడం జరిగింది. కమ్యూనిస్టు మానిఫెస్టోలో మార్క్సు, ఏంగెల్స్ గారలు ఇలా వ్రాశారు. "వ్యక్తులందరి స్వతంత్ర అభివృద్ధి ప్రాతిపదికగా ప్రజలందరి స్వతంత్రాభివృద్ధిని సాధించే వ్యవస్థనే కమ్యూనిజం". మరోచోట మార్క్సు గారంటారు "స్వేచ్ఛా స్వాతంత్రాల ప్రపంచాన్ని సృష్టించడమే కమ్యూనిజం యొక్క లక్ష్యం". నిజంగా ఇదే మానవతావాద లక్ష్యం. రాజ్యాంగ వ్యవస్థ నిర్భంధ విధానాన్ని నిర్వహించే సాధనం మాత్రమేనని సాంఘిక లక్ష్యసాధన తర్వాత దీని అవసరమే వుండదని క్రమంగా దీని స్థానే పరిపూర్ణ వ్యక్తి స్వాతంత్ర్యం, స్వేచ్ఛ నెలకొల్పబడాలని ఆకాక్షించిన పరిపూర్ణ ప్రజాతంత్రవాది మార్క్సు. పెట్టుబడిదారి వర్గాధికారాన్ని పూర్తిగా తొలగించిన తర్వాత కమ్యూనిస్టు పార్టి నిర్వాహకుల చేతిలో ఈ నిరంకుశాధికారం నిరవధికంగా కేంద్రీకృతం కావడం మార్క్సిస్ట్ మూలసూత్రానికి పూర్తిగా విరుద్ధం. మార్కెట్ వ్యవస్థ ద్వారా స్వేచ్ఛాయుత పరివర్తనకొరకు ప్రయత్నించిన గోర్భచేవ్ లాంటి సంస్కర్తలు కూడా కేంద్రీకృత అధికారం కల్గిన కమ్యూనిస్టు పార్టీ ద్వారా ఈ మార్పును సాధించాలనుకున్నారు. అది సాధ్యపడలేదు. మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఏడు దశాబ్దాల సుధీర్ఘకాలంలో అణచిపెట్టబడిన స్వేచ్ఛ, అమాంతంగా కట్టలు త్రెంచుకొని పొంగిపొరలి సోవియట్ యూనియన్‌ని విచ్ఛిన్నం చేసింది.

## 2. ఆర్థిక పునాదివాదం

సాంఘిక పురోభివృద్ధి, పేదరిక నిర్మూలన కొరకు ఆర్థికాభివృద్ధి అనివార్యం. కాని ఆర్థిక పునాదివాదం ఈ అంశాన్ని మాత్రమే చర్చించదు. ప్రధాన ఉత్పత్తి సాధనలపై యాజమాన్యం అధారంగా ఏర్పడే వర్గ సంబంధాలు మాత్రమే చారిత్రక పరిణామానికి మూలమని ఈ సిద్ధాంతం తెలుపుతుంది. సామాజిక వర్గ వ్యవస్థ ప్రాతిపదిక నుండే భావాలు, నైతిక విలువలతో సహా అన్ని విలువలు, వ్యవస్థలు, సిద్ధాంతాలు బయలుదేరుతాయి. ఈ విధంగా ఏర్పడే ఉపరితలం భౌతికంగా నుండే వర్గ సమాజ ప్రయోజనాల పరిరక్షణకు పూనుకొంటుంది. పాలకవర్గ ప్రయోజనాలని కాపాడుతుంది. ఉత్పత్తి సంబంధాల ఆధారంగా ఏర్పడే ఉత్పత్తి శక్తులు అభివృద్ధి మాత్రమే చరిత్రగతిని నిర్ధారణ చేస్తుంది. భావాలు, సిద్ధాంతాలు, ప్రజాభిప్రాయాలు వ్యవస్థను సుస్థిరం చేయడానికి ఉపయోగపడతాయి కాని వ్యవస్థను మార్చడానికి ఉపయోగపడలేవు. చరిత్రలో మానవునికి సృజనాత్మక పాత్ర అంటూ ఉండదు. మానవుడు చరిత్రను సృష్టించే వాడు కాదు. చరిత్ర చేతిలో ఒక పనిముట్టు మాత్రమే. ఇదే నిజమైతే

పెట్టుబడిదారి వ్యవస్థలో దాని ఉపరితలం నీడలో స్వయంగా మార్క్సులాంటి మానవుడు అద్భుతమైన, అనూహ్యమైన సంచలనాన్ని సృష్టించే సిద్ధాంతానికి రూపకల్పన చేయటం, అది వాయువేగంగా కార్మికలోకాన్ని ఆకర్షించటం జరిగేదికాదు. కార్మికుల ఐక్య ఉద్యమాలు, పోరాటాలు గణనీయమైన విజయాన్ని సాధించటం దుర్లభమయ్యేది. మార్క్సు గారే చెప్పినట్లు “తత్తశాస్త్రవేత్తలు ప్రపంచాన్ని వివిధ రకాలుగా అభివర్ణించారు కాని కావలసింది అభివర్ణన మాత్రమేకాదు ప్రపంచాన్ని మార్చాలి”. నూతన భావన శక్తి సామర్థ్యాల గురించి మార్క్సుగారి కంటే అధికంగా చెప్పనక్కరలేదు. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్య ఆధారంగా ఏర్పడే వర్గ సంబంధాల వ్యవస్థ, సాంప్రదాయాలు, నీతులు, రీతులు, న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థలపై తమ ప్రభావాన్ని కొంత వరకు చేసినా, దానికి వ్యతిరేకంగా ఉత్పన్నమయ్యే భావజాలం మార్పును సూచించే అభిప్రాయాలుకూడా తమ ప్రభావాన్ని గణనీయంగానే వేయగలుగుతాయి. ఆర్థిక పునాది వాదంపై ఆధారపడుతూ మార్క్సుగారు ఉపరితల వ్యవస్థలను, రాజ్యాంగ యంత్రంతో సహా తదితర వ్యవస్థలను బ్రద్దలు కొట్టనిదే నూతన వ్యవస్థకు అంకురార్పణ అసాధ్యమన్నారు. ఈ అభిప్రాయం ఆధారంగానే కార్మిక వర్గ నియంతృత్వం అనివార్యమన్నారు. విప్లవ విజయానంతరం కార్మికవర్గ నియంతృత్వం అత్యవసరమని, బూర్జువా వర్గ ఉపరితల వ్యవస్థలను బ్రద్దలుకొట్టి వాటిని తుత్తునియలు చేయటం అవసరమని సూత్రీకరించారు. ఈ కర్తవ్య నిర్వహణ పూర్తయిన తరువాత కార్మిక వర్గ నియంతృత్వ ప్రభుత్వం క్రమంగా ధుల్లి పోతుందని కూడా సూత్రీకరించారు. ఆచరణలో ఈ సిద్ధాంతం రుజువు కాలేదు. ఊహాజనితమైన ఉపరితల వ్యవస్థలు బ్రద్దలు కొట్టబడలేదు. ఆ తరువాత రాజ్యవ్యవస్థ ధుల్లిపోనులేదు. కార్మిక వర్గ నియంతృత్వ పాలన పేరుతో కమ్యూనిస్ట్ పార్టీ అధికార వర్గం అత్యంత నిరంకుశమైన, అప్రజాస్వామ్యమైన, పట్టువిడుపులు లేని, ప్రజాభిప్రాయంతో పొంతన లేని పరిపాలనను నిర్వహించింది. మానవుల వ్యక్తిగతమైన, సామూహికమైన పౌరసత్వాలు నిర్ధాక్షిణ్యంగా అణచివేయబడినవి. స్వతంత్ర స్వేచ్ఛాయుత వ్యక్తులయొక్క స్వతంత్ర సమాజ నిర్మాణమనే మార్క్సుగారి మానవీయ లక్ష్యమే పూర్తిగా దెబ్బతినిపోయినది. కాబట్టి ఆర్థిక పునాది, దాని ఆధారంగా నిర్మితమయ్యే ఉపరితల సిద్ధాంతం పాక్షిక సత్యం మాత్రమే. పరిపూర్ణ సత్యంకానేకాదు. పాత కొత్త భావాలు, వ్యవస్థల మధ్య నిరంతరం నిత్యం సంఘర్షణ తప్పదు. నూతన భావం జనసామాన్య హృదయాలను ఆకర్షిస్తుంది. అది ఒక భౌతిక శక్తిగా విస్తరించి ప్రజాబాహుళ్యం యొక్క ప్రత్యక్ష కార్యాచరణకు పురికొల్పుతుంది.

## 3. కార్మిక విప్లవ అనివార్యత

పెట్టుబడిదారి వ్యవస్థలో శ్రమ ఒక సరుకుగా పనిచేస్తుందని చక్కగా సృజనాత్మకంగా కారల్ మార్క్స్ అభివర్ణించారు. శ్రమ, శ్రమశక్తి, శ్రామికుడికి అత్యంత గౌరవ ప్రతిపత్తిని

సంతరింప చేసారు. సరుకులన్నిట్టిలాగే సరఫరాపై ఆధారపడి శ్రమ విలువ నిర్ధారించబడుతుందని చెప్పారు. శ్రామికునికి, అతని కుటుంబానికి అవసరమైన కనీస అహారం, శ్రమశక్తిని పునరుత్పత్తి చేయడానికి అవసరమైన ఖర్చు ఆ శ్రమకు విలువగా నుంటుందని స్పష్టం చేశారు. దీనికి ఆర్థిక పునాది వాద సిద్ధాంతాన్ని వర్తింపచేస్తూ, శ్రమశక్తి పునరుత్పత్తికి అవసరమయ్యే వ్యయం ఇంచుమించు స్థిరంగానుంటుందని, కార్మికుడు సృష్టించే విలువ నిరంతరం పెరుగుతుందని, పని పంపకం, యంత్రాల ప్రయేయం వలన ఈ అదనపు విలువ సృష్టి కొనసాగుతుందని చెప్పారు. నిత్యం పెరిగిపోయే శ్రమ యొక్క ఉత్పాదకత ఒకవైపు, స్థిరంగా నిలచిపోయే కార్మికుని వేతనం మరొకవైపు ఉండడం వలన, ఉత్పత్తి చేయబడే సరుకులను కొనుగోలు చేసే అర్థిక స్థోమత కార్మిక వర్గంలో లేకపోవడం కారణంగా అధికోత్పత్తి సంక్షోభాలు ఏర్పడతాయని ప్రతి సంక్షోభం అంతకుముందటి దానికంటే తీవ్రంగా ఉంటుందని స్పష్టపరిచారు. ప్రతి సంక్షోభం తరుణంలో అధికోత్పత్తిని కుదించే ఉద్దేశ్యంతో ఉత్పత్తి సాధనాలలో ఒక భాగాన్ని ధ్వంసంచేయటం జరుగుతుందన్నారు. ఇంతవరకున్న మార్కెట్లను పూర్తిగా దోపిడీ చేయటంతో పాటు క్రొత్త మార్కెట్లను సంపాదిస్తూ అధికోత్పత్తి సంక్షోభాన్ని పెట్టుబడిదారీ వర్గం పరిష్కరించే ప్రయత్నం నిరంతరం చేస్తుందని విశ్లేషించారు. ఈ మార్కెట్లు కూడా కొంత కాలం తరువాత నిస్సారం అయిపోవటం ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ అంతులేని సంక్షోభంలోకి దిగిపోతుందని చెప్పారు. దరిమిలా కార్మిక వర్గం తమ సంఖ్యా బలాన్ని ఇతోధికంగా పెంచుకొంటూ చైతన్య వంతమౌతుందని పట్టణాలలో కేంద్రీకృతమౌతుందని, తమ బలాన్ని పెంచుకొంటుందని సెలవిచ్చారు. ఈ విధంగా ''పెట్టుబడిదారీ వర్గం తన గోతిని తానే త్రవ్వుకొంటుందని'' మార్క్స్ సెలవిచ్చారు. ''పెట్టుబడిదారీ వర్గం, తానే తన వర్గ నిర్మూలనకవసరమైన స్వీయ మానసిక, మరియు భౌతిక శక్తులను సిద్ధపరచుకొంటుందని'' స్పష్టపరిచారు. ''పెట్టుబడిదారీ వర్గ దుర్గాలు కూలిపోవడం, శ్రామిక విప్లవ విజయం, రెండూ అనివార్యం''. అని ఘంటాపథంగా ప్రకటించారు. ఆర్థిక పునాది సిద్ధాంతం మరియు గతి తార్కిక భౌతిక వాద సిద్ధాంతం ఆధారంగా కారల్ మార్క్స్ పై ''అనివార్య'' సిద్ధాంతానికి రూపకల్పన చేసారు. కాని చరిత్ర ఈ బాటలో నడవ లేదు. కార్మికుల జీతభత్యాలు వారి కనీస అవసరాల పూర్తి వరకే నిలిచిపోలేదు. పెరిగినవి. ప్రారంభంలో వారి శ్రమ యొక్క ఉత్పాదకతకు అనుగుణ్యంగా పెరగకపోయినప్పటికీ ఆ తర్వాత గణనీయంగా పెరిగినవి. పాశ్చాత్య దేశాలలో తరచు కార్మికుల వేతనాలు వారి శ్రమశక్తి యొక్క ఉత్పాదకతలో వచ్చిన పెరుగుదల దామాషాకు మించి పెరగడం జరుగుతున్నది. ప్రభుత్వాలు ఈ విధంగా అవసరానికి మించి వేతనాలను పెంచకూడదని యాజమాన్యాన్ని, కార్మికవర్గాన్ని అర్థించడం సహజంగా చూస్తున్న పరిణామము. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని కార్మికవర్గం పెట్టుబడిదారి వ్యవస్థకి వ్యతిరేకంగా విప్లవ

కర్తవ్యాన్ని నిర్వహించడం, కార్మిక వర్గ నాయకత్వంలో విప్లవ విజయం సాధించడం, విప్లవనాంతర కాలంలో కార్మిక వర్గ నియంతృత్వం ఏర్పడి పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకై నిర్మించబడిన ఉపరితల సంస్థలు, వ్యవస్థలను బ్రద్ధలు కొట్టడం చారిత్రిక భౌతిక వాదంలో సూత్రీకరించబడిన పై సిద్దాంతం కేవలం ఊహాజనితంగా, మిథ్యగా మిగిలిపోయింది. వాస్తవ పరిణామము పై సిద్ధాంతానికి పూర్తిగా భిన్నంగా జరుగుతున్నది. కమ్యూనిస్టు విప్లవం, అభివృద్ధి చెందిన బ్రిటన్ అమెరికా లాంటి దేశాలలో రాలేదు. 1917లో వెనకబడిన రష్యాలో, 1949లో మరో వెనకబడిన చైనా దేశంలో విప్లవ విజయం సాధ్యమైంది. ఈ దేశాలలో విప్లవానికి నాయకత్వం వహించింది పారిశ్రామిక కార్మిక వర్గం కాదు. కార్మిక, కర్షక ప్రయోజనాల రక్షణకై పూనుకొన్న మధ్యతరగతి మేధావి వర్గం వారే ఈ విప్లవాలకి నాయకత్వం వహించారు. విప్లవానంతరం నియంతృత్వ ప్రభుత్వాలను ఏర్పర్చారు, కొనసాగించారు. ప్రజాతంత్రం, స్వేచ్ఛా స్వాతంత్రాల అనుభవం, సాంప్రదాయం లేని దేశాలలో నియంతృత్వం ఏర్పడితే ప్రజాస్వామ్య అనుభవాలు లేని ప్రజలు ఆ నియంతృత్వాలని సులభంగా వదిలించుకోలేదు. రష్యా, చైనా తదితర దేశాలలో ఇదే జరిగింది. ఇంకా జరుగుతున్నది.

## 4. మృగ్యమైన ప్రజాస్వామ్యం

మానవతావాది అయిన కారల్ మార్క్సు గారి సిద్ధాంతాన్ని ఆచరించిన లెనిన్, ఆయన మరణానంతరం స్టాలిన్ నిర్మించిన సిద్ధాంతంలో ప్రజాస్వామ్యం సంపూర్ణంగా అంతరించిపోయింది. స్వేచ్ఛా, స్వాతంత్రం, సోదరత్వంలాంటి విశ్వవ్యాపిత మానవ హక్కులు మృగ్యమైపోయినవి. కారణం తెలిసికోవడం కష్టసాధ్యంకాదు. ఈ విలువలు శాశ్వత విలువలుగా గుర్తించ నిరాకరించబడినవి. ఆర్థిక పునాది నిర్మించే ఉపరితల విలువులుగా, అధికార వర్గ ప్రయోజనాన్ని మాత్రమే పరిరక్షించే వర్గ పక్షపాతంగా గల సూత్రాలుగా తేల్చివేయడం జరిగింది. వర్గపునాదిని కూలదోస్తూ, ఈ ఉపరితల నియమ నింబధనలు కూడా బ్రద్ధలు కొట్టకతప్పదని, అప్పుడే విముక్త కార్మిక వర్గం తమ స్వంతమైన ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛా స్వాతంత్రాలని, నీతినియమాలని నెలకొల్పుకుంటుందని చారిత్రక భౌతిక వాద పాఠంగా వల్లె వేయడం జరిగింది. ఈ సిద్ధాంతం ప్రకారం సాధారణ సమాజంలో, “బూర్జువా వర్గ ధృక్పధం” నుండి విముక్తి సాధించిన కొందరు వ్యక్తులు మాత్రమే “నూతన విలువలు” అర్థం చేసికోగల్గుతారు. ప్రజాసామాన్యం అయా సామాజిక ఆర్థిక పునాదిపై నిర్మించబడిన ఉపరితల ప్రభావంలో నుంటారు. అటువంటి ఆలోచనలే చేస్తారు. అంతకు మించి చూడలేరు. ఆర్థిక పునాదిని కూల్చివేసి, దానికి సంబంధించిన ఉపరితల వ్యవస్థలను బ్రద్ధలు కొట్టబడిన తర్వాతనే, అనగా నూతన ఆర్థిక పునాది నిర్మాణం తర్వాతనే ప్రజానీకం నూతన విలువలను అర్థం చేసికుంటూ వాటిని ఆస్వాదించగల్గుతారు. దీని ప్రకారం వర్గ రహిత

ధృక్పధాన్ని అలవర్చుకోగల్గిన కొందరు వ్యక్తులు పార్టీగా ఏర్పడి తమ సుసంఘటిత, సమరశీల శక్తియుక్తుల ద్వారా రాజ్యాధికారాన్ని సంపాదిస్తారు. ఆ తర్వాత విప్లవపార్టీ బూర్జువా వర్గం నుండి సర్వ ఉత్పత్తి సాధనాలను హస్తగతం చేసికుంటుంది. తదనంతరం ప్రజలలో సమాజవాద భావాలు, విలువలు, వ్యవస్థలు క్రమంగా చోటుచేసుకుంటాయి. రాజకీయ విప్లవం ప్రథమం, ఆర్థిక విప్లవం ద్వితీయం, సాంస్కృతిక విప్లవం తృతీయం, అదీ వరస, ఈ విధంగా సాధించబడే పరివర్తనలో ప్రజాస్వామ్యం అగుపడదు. ఎంత మంచి ఉద్దేశ్యాలు గలిగిన వ్యక్తులైనా, ప్రజలలో స్వేచ్ఛా, స్వాతంత్ర, ప్రజాతంత్ర సాంప్రదాయాలు కరువైనప్పుడు వారు అందు కొరకై పోరాడలేరు. అన్యవర్గ ధోరణుల అణచివేతకు పేరిట తలెత్తే ప్రతి ప్రజాతంత్ర శక్తి, ఉద్యమం అణచివేతకు గురిచేయబడుతుంది. రష్యా, తూర్పుయూరపు దేశాలు చైనా చరిత్రలో ఇటువంటి చేదైనా, విలువైన అనుభవాలు సాక్ష్యాలుగా నున్నవి. స్వాతంత్ర్యం, సౌహార్ధత్వం, సమానత్వం, ఈ మూడు విలువలు ప్రజాస్వామ్యంలోని అంతర్భాగాలు. ఇవి నీతి నియామాలకి మూలకందం. ఇవన్ని మానవులు తమ సామాజిక జీవిత పోరాటంలో సాధించుకున్న ఉన్నత విలువలు. అందరి హృదయాలలో తారాడే పరమసత్యాలు. వాస్తవ జీవిత పరిస్థితిలో ముఖ్యాంశాలు. ఇవే ఉపరితలంలోనికి నెట్టివేయబడితే, విప్లవ కారుల కార్యాచరణ అరాచకంగా మారక తప్పదు వారి ముందుండే ప్రజాస్వామ్య నైతికవిలువలన్ని అన్యవర్గ విలువలే. అవన్ని బ్రద్దలు కొట్టవలసినవే. కార్మిక విప్లవ విజయం తర్వాత ఏర్పడే నూతన వర్గ పొందికల ఆధారంగా నూతనంగా విలువలు ప్రజాస్వామం, నీతి నియమాలు, న్యాయధర్మ సూత్రాలు వగైరా పునర్మించబడుతాయి. ఈ సైద్ధాంతిక ప్రాతిపదిక కారణంగానే భారత దేశంలో కమ్యూనిస్టులు 1947 ఆగస్టు 15నాడు సాధించబడిన స్వతంత్ర్యాన్ని అసలు స్వతంత్రంగా అంగీకరించలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత ప్రజాభీష్టాన్ని కాదనలేక వాస్తవాన్ని విస్మరించలేక స్వాతంత్ర్యాన్ని అంగీకరించడం జరిగింది. ఎందుకు అంగీకరించారో, ఎందుకని మొదలే నిరాకరించారో, ఈ చర్చ ఇంతవరకు జరగలేదు. విధిలేక అంగీకరించడం జరిగింది. అలాగే మన దేశ రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలలో పేర్కొనబడిన, ఆర్థిక, సాంఘిక సమానత్వ సూత్రాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలు, స్థానిక స్వపరిపాలనా సూత్రాలు నియమాలన్నీ బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థలనీ, బూర్జవా ప్రజాస్వామ్య సూత్రాలని లాంఛనప్రాయంగా ఆమోదించడం జరుగుతున్నది. మార్క్సిజం నేర్పిన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతం సూత్రీకరించిన ఆర్థిక పునాది, దాని ఉపరితల సిద్ధాంతంలో పై అంశాలు ఏ మాత్రము ఇమడలేవు. ఆ సిద్ధాంతాన్ని నమ్మిన మార్క్సిస్టుల బుర్రలో ఆ అంశాలు ప్రవేశించలేవు. ప్రవేశించినా ''బూర్జువా'' విశేషణం సహితంగా ప్రవేశిస్తాయి. కాని వాటి సార్ధకత, ప్రయోజనం గురించి ఏమాత్రం విశ్వాసం, నమ్మకం కుదరదు. నిజమే ఈ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, సాంఘిక న్యాయం

సమానత్వ సూత్రాలు చిత్తశుద్ధితో శ్రమజీవులు, బడుగు ప్రజల జీవితాలు బాగుపర్చడానికి ఉపయోగపడడంలేదు. చాలా సందర్భాలలో ఇటువంటి మంచి నిబంధనల వెనుక మోసం, దగా కూడా చోటు చేసుకోవడం జరుగుతున్నది. కార్మికవర్గం శ్రమజీవులు, దళితులు, ప్రజాతంత్ర వాదులంతా ఈ సూత్రాలను ప్రజలందరి జీవితాలను మార్చే విధంగా ఆచరించే పోరాటాలలో నిరంతరం భాగస్వాములు కావలసిందే. రాజీలేని సమరశీల పోరాటాల బలంతో ఈ మానవీయ, ప్రాధమిక సత్యాలను ఆచరణలో సాధించవలసిందే. కాని అసలు ప్రకటిత సూత్రాలన్ని హుళక్కి అని, అవి ఒక మిధ్య అని త్రోసి పారవేసి రాబోయే విప్లవం తర్వాత సృష్టించబడే నూతన విలువలకే వేచియుండడం నిర్హేతుకం, అశాస్త్రీయం. వివిధ కమ్యూనిస్టులు తమ కార్యక్రమాలలో ప్రకటించుకునే "జాతీయ ప్రజాస్వామ్యం", నూతన ప్రజాస్వామ్యం "ప్రజల ప్రజాతంత్ర ప్రజాస్వామ్యం" "సోషలిస్ట్ ప్రజాస్వామ్యం" ఇత్యాది సిద్ధాంతాలు ఆయా సైద్ధాంతిక ప్రాతిపదికపై గుణాత్మకంగానే వేరువేరు అర్ధాలను అందచేస్తాయి.

## 5. లక్ష్యం - మార్గం

ఆర్థిక పునాది సిద్ధాంతం ప్రాతిపదిక పైననే, లక్ష్యసాధన కొరకు ఏ మార్గమైన సరియైనదేననే సూత్రం కమ్యూనిస్ట్ ఉద్యమాలలో ప్రధానంగా చోటుచేసుకొన్నది. "శాంతియుత" "ప్రజాస్వామ్యయుత" మార్గాలు బూర్జువా సమాజంలో బూర్జువా వర్గ ప్రయోజనాలకే పరిమితమౌతాయని, విప్లవ లక్ష్యసాధనలో ఏ మార్గం అవసరమైతే ఆ మార్గాన్ని, ఆ సాధనాన్ని వినియోగించటం, వర్గ పక్షపాతం, వర్గ కసితో, అధికార వర్గాల చేతి నుండి అధికారాన్ని లాగివేయటమే పవిత్రమైన పరిశుభ్రమైన మార్గమని సాంప్రదాయ మార్క్సిజం తెలియచేస్తుంది. ప్రజాబాహుళ్యం యొక్క ప్రత్యక్ష ప్రమేయం లేకుండానే కొందరు విప్లవ కారులు తాము నమ్మిన విప్లవ సిద్ధాంతానికి అంకితమై ఒంటరిగా సాహసోపేతమైన చర్యల ద్వారా అధికారవర్గాన్ని వ్యక్తులతో సహా అంతమొందించటం సక్రమమైన మార్గమౌతుందని సాంప్రదాయ మార్క్సిజం సమర్థిస్తుంది. ఆర్థిక పునాది సిద్ధాంతం దీన్ని అనుమతిస్తుంది. దేశదేశాలలో విప్లవోద్యమాల అనుభవాలు, విజయవంతమైనవి, ఓడిపోయినవి, అన్ని ఒకే ఒక పరమ సత్యాన్ని వేనోళ్ల చాటి చెపుతున్నవి. ఉదాత్తమైన రాజకీయ సాంఘిక విప్లవ సాధనలో బాధితులైన ప్రజాసామాన్యం తమ అనుభవ జ్ఞానంతో లక్ష్య సాదనకై అవసరమైన మార్గాన్ని తామే ఎన్నుకొంటారు. శత్రువర్గాల వైఖరి, ప్రజాబాహుళ్యం చైతన్యస్థాయి, బాధితుల పోరాటపటిమ, ఇవన్ని కలసి ఎన్నుకొన్న మార్గం లక్ష్య సాధనలో అత్యుత్తమం. ఈ మార్గం కూడా దశల వారీగా మార్పులు చెందవచ్చును. పౌరసత్వాల ప్రాధమిక హక్కులకై ప్రచారదశ నుండి ఎదిగి సాయుధ తిరుగుబాటుగా పరిణమించవచ్చు. ప్రజాబాహుళ్యం యొక్క ప్రత్యక్ష పాత్ర ఆధారంగా నిర్వహించడిన పలు ప్రజా విప్లవ పోరాటాలు విజయఢంకా మ్రోగించినవి.

ప్రజా కుట్రల ద్వారా సాగె తిరుగుబాట్లు సాధారణంగా ఓటమిపాలు కావలసి వచ్చింది. కాబట్టి రాజకీయ, సాంఘిక ఉద్యమాలన్నిటికి పలానా మార్గాన మాత్రమే నిర్వహించి, విజయం సాధిస్తామని, మార్గమే లక్ష్యంగా ప్రకటించుకోవడం కేవలం అశాస్త్రీయం అసమంజసం. దేశ ప్రజలందరూ ఆకాంక్షించే శాంతియుత, ప్రజాతంత్రయుత మార్గాలన్నిటిని వినియోగించడం, అందులకై చిత్తశుద్ధితో పాటుపడడం, మంచి లక్ష్య సాధనలో మంచి మార్గాన్ని అవలంభించే మంచితనాన్ని పెంచుకోవడం అత్యవసరం. ఆపైన అనుభవశాలురైన ప్రజలు అవసరంగా, అనివార్యంగా నిర్ణయించుకునే మార్గం సన్మార్గంగా లక్ష్య సాధనకై అవసరమైనదిగా గుర్తింపు పొందుతుంది. చరిత్రాత్మక తెలంగాణా విముక్తి పోరాటం ఇదే సత్యాన్ని ధృవీకరించింది.

## 6. పరిశ్రమల జాతీయం

మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం పరిశ్రమలలో కార్మికులు సామూహికంగా కృషిచేస్తూ సరకుల ఉత్పత్తి చేస్తారు. ఈ విధంగా ఉత్పత్తి విధానం సామాజికమైనదిగా చెప్పవచ్చును. కాని ఉత్పత్తి చేయబడే సరకులపై పెట్టుబడిదారైన యజమానికే సర్వహక్కులు సంక్రమిస్తాయి. పెట్టుబడిదారి సమాజానికి పూర్వం వ్యవస్థలో వ్యవసాయం, చేతివృత్తులలో ఉత్పత్తి వ్యక్తిగతంగా నుంటూ, ఉత్పత్తి ఫలితాలు గూడా వ్యక్తిగత అనుభవంలోకి వచ్చినవి. కాని పెట్టుబడి దారీ వ్యవస్థలో ఉత్పత్తి సామాజికంగాను, ఉత్పత్తులు వ్యక్తిగతంగా నుంటున్నాయి. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించడం ద్వారా పెట్టుబడిదారి వర్గ దోపిడిని అంతమొందించాలని మార్క్సిజం ఆలోచించింది. ఉత్పత్తితో పాటు ఉత్పత్తుల యాజమాన్యం గూడా సామాజికం చేయడం ద్వారా ఈ వైరుధ్యాన్ని పరిష్కరించాలని మార్క్సిజం అభిప్రాయం. కార్మిక విప్లవం ద్వారా ఏర్పడే ప్రభుత్వం కార్మిక వర్గ ప్రభుత్వము కాబట్టి పరిశ్రమలన్నీ జాతీయం చేయబడి ప్రభుత్వ యాజమాన్యం క్రిందికి తేవడమే శాశ్వత పరిష్కారంగా చెప్పబడ్డది. సోషలిస్టు విప్లవాలు విజయవంతమైన దేశాలన్నిటిలో ఈ ప్రక్రియ జరిగింది. చిన్న పెద్ద పరిశ్రమలు వాణిజ్య వ్యాపారాల సంస్థలన్నీ ప్రభుత్వ యాజమాన్యం క్రిందకి తేబడినవి. జాతీయం చేయడం, సోషలిజం యొక్క ప్రదమ లక్షణంగా ప్రపంచ వ్యాపితంగా ప్రసిద్ధికి వచ్చింది. సోషలిజం దాని దేశాలలో గూడా భారీ పరిశ్రమలు, కీలకపరిశ్రమలు ప్రాతిపదిక పరిశ్రమలు జాతీయం చేయబడి ప్రభుత్వాల యాజమాన్యంలో నిర్వహించబడినవి. ఈ రంగంలో అనేక దశాబ్దాల ప్రపంచ వ్యాపిత అనుభవం అత్యంత ఆసక్తికరమైనది. జాతీయం చేయబడిన పరిశ్రమలన్ని తమ ఉత్పత్తి, ఉత్పాదకత, లాభనష్టాల ఆధునీకరణ విషయాలన్నింటిలో ఎవరికి జవాబు దారీగా లేకుండా పోయినవి. వినియోగదారులకి తమ సరకులను ఎన్నుకోవడంలో, మంచి చెడు నిర్ధారణలో మార్గాంతరం అంటూ లేనేలేదు. ధరల నిర్ణయం మార్కెట్ ఆధారంగా గాక యాజమాన్యం అవసరాలను బట్టి మాత్రమే

జరిగింది. అయితే క్రమ క్రమంగా కార్మిక వర్గ యాజమాన్యంలో జాతీయం చేయబడిన పరిశ్రమల నిర్వహణలో కార్మిక వర్గానికి ఏలాటి ప్రత్యక్ష జోక్యం లేకుండా పోయింది. ఉత్పత్తి క్రమంలో ఉత్పాదకత పెంచే బాధ్యతలో నాణ్యతను పెంచే అవసరంలో, లాభాలు పెంచుతూ నష్టాలు తగ్గించే అంశంలో కార్మికులకి, కార్మిక సంఘాలకి ఏలాటి బాధ్యత లేకుండా పోయింది. ఈ విధంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికులకి ఉత్పత్తి ఫలితాలతో నిమిత్తం, బాధ్యతలేనట్లే జాతీయం చేయబడిన పరిశ్రమలన్నిటిలో కూడా ఉత్పత్తులపై కార్మికవర్గానికి ప్రమేయం లేకుండా పోయింది. స్వేచ్ఛాయుత మార్కెట్ లేకపోవటం, ప్రజల అవసరాలతో నిమిత్తం లేకపోవటం, సప్లై మరియు డిమాండ్ సూత్రం వర్తించకపోవటం, సరకుల ధరలు యధేచ్ఛగా అధికారవర్గంచే నిర్ణయించబడడం కారణంగా జాతీయం చేయబడిన పరిశ్రమల ఆర్థిక వ్యవస్థ ప్రపంచ మార్కెట్‌లో ఉత్పాదకత, నాణ్యత, ధరవరల రంగాలలో పూర్తిగా వీగిపోవటం, వెనుకబడిపోవటం, చివరకు కుప్పకూలిపోవటం జరిగింది. సోవియట్ రష్యా, చైనా, తూర్పు యూరపు దేశాలు చివరకు వాటిని అనుకరించిన భారతదేశం లాంటి దేశాలలో కూడా ఈ ఘోరమైన నష్టజాతకమైన అనుభవాలు కోకొల్లలుగా కలిగినవి. ఈ అనుభవాలన్నింటి నుండి మెరుపురేఖగా అగుపడే అంశం. ఉత్పత్తి చేసే కార్మికుల ప్రత్యక్ష ప్రమేయం. ఉత్పత్తితో పాటు ఉత్పత్తులను సమాజానికి అందచేసే బాధ్యత కూడా కార్మికుల ప్రత్యక్ష నిర్వహణలో జరగాలి. ఇది సాధ్యపడాలంటే కార్మికవర్గం ఆయా పరిశ్రమలలో వాటా దారులుగా నుండి తీరాలి. లాభనష్టాలకు జవాబుదారీ బాధ్యత వహించాలి. పరిశ్రమలు పెట్టుబడిదారీ యాజమాన్యం నుండి కార్మికుల యాజమాన్యం క్రిందికి రావాలి. ఈ రకమైన కార్మిక సహకార రంగంగా ఈ వ్యవస్థ నిర్వహించబడాలి. కాబట్టి జాతీయ, ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిశ్రమల నిర్వహణ జరపటం సర్వరోగ నివారిణి కాజాలదు. కార్మికుల యాజమాన్యం అసలేకాదు.

## 7. ముగింపు

పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సంపూర్ణ సోషలిజం మాత్రమే. ప్రారంభదశలోనే పెట్టుబడిదారీ వర్గ దోపిడీ, కార్మిక వర్గ ఈతి బాధలు పరిశీలించి సమసమాజం సిద్ధాంతాన్ని సృష్టించిన మహామేధావి కారల్ మార్క్స్ జీవితకాలంలోనే చాలా మార్పులు వచ్చినవి. ఆయన మరణానంతరం వర్గ సమాజం, పెట్టుబడిదారీ వర్గ దోపిడి విధానం, కార్మిక వర్గ ప్రయోజనాలలో అనేకానేక మార్పులు వచ్చినవి. రష్యాలోని విప్లవ నిర్మాత లెనిన్ మహాశయుడు మార్క్సిస్ట్ మూలసూత్రాలను ఆయన కాలపు ప్రపంచ పరిస్థితులకు అన్వయిస్తూ మార్క్సిజాన్ని ముందుకు తీసుకుపోవటం జరిగింది. ఆ తరువాత రష్యా అధినేత స్టాలిన్ ఒకవైపు చైనా మహానాయకుడు మావో మరో వైపు మార్క్సిజం పేరిట క్షంతవ్యం కాని, అప్రజాస్వామిక, నిరంకుశ, చివరకు

అటవిక చర్యలకు పాల్పడి మార్క్సిజానికే తీరని కళంకం తెచ్చిపెట్టారు. మార్క్సిస్ట్ మూలసూత్రాలను చారిత్రిక పరిస్థితుల విశ్లేషణ పరిశీలనపై ఆధారపడి కాకుండా యాంత్రికంగా వర్తించడం వలన అసలు మార్క్సుగారు కొంతవరకు యాంత్రికదృష్టితో వ్యవహరించినట్లు జీవితానుభవం స్పష్టంచేస్తుంటే, మార్క్సిస్ట్‌లమని చెప్పుకొనే మహానాయకులు ఈ సిద్ధాంతాన్ని మరింత యాంత్రికంగా స్వీయమానస ధోరణిలో వినియోగించారు. సాధించిన కొన్ని విజయాలకు అతి పెద్ద మూల్యం చెల్లించారు. ఏమైనా మార్క్సిజం యొక్క గతితార్కిక, చారిత్రక భౌతికవాదం, వర్గసమాజ ఆవశ్యకతను ఘంటాపథంగా చాటటం, ఇవన్నీ ఈనాటికీ సజీవమైన సూత్రాలు. మానవసమాజం ఉన్నంతకాలం మరపురాకుండా గుర్తించబడే సత్యాలు. మార్క్సిజం ఉన్నతమైన మానవతావాదం అజరామరం. మారుతున్న పరిస్థితులకు అనుగుణ్యంగా మృధువుగా మలచగలిగే చారిత్రిక సిద్ధాంతం. ఇందులోనుండి ఈనాడు నిర్జీవం, నిరర్థకం, అయిన అంశాలను తొలగిస్తూ, సజీవం సహేతుకమైన అంశాలను మార్పులు చేర్పులతో సహా కొనసాగించటం మహత్తరమైన వైజ్ఞానిక ప్రక్రియ. మార్క్సిస్ట్‌లు, మానవతావాదులు ఇందుకు ఉపక్రమించాలి. ఇరవై ఒకటవ శతాబ్దంలో కాలిడనున్న ఈనాటి ప్రపంచం మార్క్సుగారి కాలంతో పోల్చగా గుణాత్మకంగా ఊహించిన విధంగా మారిపోయింది. శాస్త్ర, సాంకేతిక విప్లవాల పర్యవసానంగా, వాణిజ్య వ్యాపారాల అభివృద్ధి ఫలితంగా భూగోళంలోని దేశాల మధ్య దూరం పూర్తిగా తగ్గిపోయింది. గ్లోబలైజేషన్ నిజంగా జరిగిపోతున్నది. ప్రపంచ వ్యాపారంలో 95శాతం తమ గుప్పిటలో పెట్టుకోగా తతిమ్మా ప్రపంచ దేశాల ఉత్పత్తి వ్యాపారం వేళ్ళపై లెక్కించగలిగే మోతాదులో మాత్రమే మిగిలిపోయింది. ఈనాటి ప్రపంచంలో ప్రధాన వైరుధ్యం అభివృద్ధి చెందిన ఏడెనిమిది దేశాలు అభివృద్ధి చెందుతున్న వందకు మించిన దేశాల మధ్యనున్నది. అభివృద్ధి చెందిన దేశాల మధ్య వైరుధ్యాలు తీవ్రంగానే ఉంటున్నా అవి ప్రపంచ దేశాల సంపదను ఇంకా కొల్లగొట్టడానికి కలసికట్టుగానే కృషిచేయడం, ప్రపంచ పర్యావరణ కాలుష్యానికి 75 శాతం కారణం కావడం గమనార్హం. గుత్త పెట్టుబడిదారీ వర్గం బహుళ జాతి సంస్థల రూపంలో ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రైవేటు రుణ సంస్థలు, ప్రపంచ వాణిజ్య వ్యాపార సంస్థ అగు గాట్ ద్వారా, అసమాన వ్యాపారం అనర్థదాయకమైన షరతుల ద్వారా తమ మార్కెట్టు దోపిడిని నిర్విఘ్నంగా సాగించడంతో పాటు దాన్ని శాశ్వతంగా చేసుకోవడానికి సర్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ విధంగా నయావలసవాద వలయాన్ని ప్రపంచ వ్యాపితంగా నిర్మిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ నూతన యుగంలో, నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కొరకు సమైక్యంగా పట్టువిడుపులు లేకుండా ఉద్యమించవలసిన చారిత్రక అవసరం ఏర్పడియున్నది. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఒకవైపు జాతీయ స్వాతంత్ర్యం ఆర్థిక స్వావలంబన ప్రాతిపదికపై పెట్టుబడిదారీ ప్రపంచ సంబంధాలకై

పోరాడే వర్గాలు మరోవైపు విచక్షణారహితంగా విదేశీ బహుళ జాతి సంస్థలకి ద్వారాలు తెరచివేయాలనే దళారి పెట్టుబడిదారీ వర్గాల మధ్య సంఘర్షణ పెరుగుతున్నది. దేశ ఆర్థిక స్వావలంబనకు, స్వాతంత్ర్యానికి ఎలాంటి హాని రాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడే రీతిలో విదేశీ, స్వదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, రుణాలను సంపాదిస్తూ, నియమనిబంధనలతో కూడిన మార్కెట్ వ్యవస్థ ఆధారంగా ప్రైవేటు, ప్రభుత్వ రంగ పరిశ్రమల వ్యవస్థ ఆధారంగా ఆర్థికాభివృద్ధిని సాధించే దేశభక్తియుత ఉద్యమాల క్రమంగా అభివృద్ధి చెందుతుండడం సంతోషదాయకం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో శ్రమజీవుల ఆర్థిక, సాంఘిక, రాజకీయ ఉద్యమాలకు దశ, దిశలను నిర్ణయించే వ్యూహరచన అవసరం. దిక్సూచిక లాగా మార్గదర్శకత్వం వహించే సిద్ధాంత రూపకల్పన అత్యంతవశ్యకం. సజీవమైన మార్క్సిస్టు సూత్రీకరణల ఆధారంగా దేశ సంస్కృతి సాంప్రదాయాలు, సంఘ సంస్కర్తలు, నవయుగ వైతాళికులందించిన స్ఫూర్తితో సిద్ధాంతకర దీపిక నందించటం ఈనాటి తక్షణ కర్తవ్యం.

# సోవియట్ యూనియన్ అస్తమయం

తూర్పు యూరపు మరియు సోవియట్ పరిణామాలు ఒకటి తర్వాత ఒకటిగా అత్యంత ఆశ్చర్యాన్ని కలిగించాయి. సోవియట్ వ్యతిరేకులుగూడా ఊహించని పరిణామాలకి సోషలిస్టు ప్రభుత్వం లేకుండా పోవడమే కాక వివిధ జాతుల ఐచ్ఛిక ఐక్యతకు మారు పేరుగా చెప్పబడిన సోవియట్ యూనియన్ బ్రద్ధలైపోవుచున్నది. తూర్పు యూరపు దేశాలు ఇదివరకే ఒకటి తర్వాత మరొకటి సోషలిజానికి తిలోదకాలిచ్చి పెట్టుబడిదారి పద్ధతిగల ప్రభుత్వాల నెన్నుకున్నాయి. అక్కడి కమ్యూనిస్టు పార్టీలు చిన్న పార్టీలుగా ఎన్నికలలో ఓట్లు తెచ్చుకున్నాయి.

ప్రపంచ కమ్యూనిస్టులే కాకుండా అభ్యుదయవాదులందరికి మనస్తాపం కలిగిస్తూ వారిని కుదిపివేస్తున్న ఈ పరిణామాలు నాకు గూడా అత్యంత బాధాకరంగా నున్నవి. సామ్రాజ్యవాద పీడనతో బానిస బ్రతుకులు భరించలేని వందలకోట్ల ప్రజలకు సోవియట్ యూనియన్ మార్గదర్శిగా కనబడింది. పెట్టుబడిదారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే అశేష కార్మిక జనావళికి ఆశాజ్యోతిగా వెలిగింది. ఇటీవలి చరిత్రలో నూతనంగా స్వతంత్రం పొందిన సుమారు వందకు మించిన దేశాలన్నిటికి ఆప్తమిత్రుడుగా, ఆపద్భాంధవుడుగా నిలబడ్డది. ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు, వాటి నాయకురాలయిన అమెరికా కుతంత్రాలన్నిటిని అడుగడుగునా బట్టబయలుచేస్తూ ఎండగట్టింది. ఈనాడు అమాంతంగా చరిత్రనుండే అంతర్ధానమైపోయింది. ప్రపంచంలో పెద్ద అగాధం, పూరించలేని శూన్యం ఏర్పడిపోయింది.

ఈ ఆశ్చర్యకర పరిణామాలు అకస్మాత్తుగానే జరిగినవా? పెట్టుబడిదారి దేశాల ప్రత్యక్ష లేక ప్రచ్ఛన్న యుద్ధం కారణంగా సంభవించినవా? లేక మరేకారణం? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగిన తర్వాతనే సరైన గుణపాఠాలు నేర్చుకోగలం. ఇంకా అనేక విషయాలు వెలుగులోకి రావచ్చును. నేను అర్థం చేసుకున్నంత వరకు ఇవి అకస్మిక పరిణామాలు కానేకావు. అనేక దశాబ్దాలనుండి అంతర్గత వైరుధ్యాల కారణంగా లోలోపల కుమిలిపోయి తర్వాత కుప్పకూలిపోయిన పరిణామమే. ప్రత్యక్ష లేక ప్రచ్ఛన్న యుద్ధాలు జరగలేదు. ఒక్క తుపాకీ పేలలేదు. ఒక్క మానవుడు చావలేదు. సోవియట్ వ్యతిరేకులకే అర్థంకాని అనూహ్య పరిణామము.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, కోమిన్ టర్న్ సమావేశాల నిర్ణయాలు విప్లవానంతరం లెనిన్, స్టాలిన్ గారలు అనుసరించిన వివిధ విధానాలను పరిశీలించగలిగినవారే ఈనాటి పరిణామాలకు మూలకారలణాలను అర్థం చేసికోగల్గుతారు. నా ముందున్న పరిమిత సమాచారము నా జ్ఞాపకశక్తి ఆధారంగా నేను స్థూలంగా ఈ క్రింది కారణాలను చూడగల్గుచున్నాను. సావియట్ యూనియన్ ఒక గొప్ప అంతర్జాతీయ భారాన్ని తన భుజస్కందాలపై మోసింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడే విముక్తి ఉద్యమాలకు అన్ని విధాల సహాయపడింది. దీనికి వియత్నాం విముక్తి పోరాటము చక్కని ఉదాహరణ. స్వాతంత్రాలు సాధించిన అనేక దేశాలకు రాజకీయంగానే కాక ఆర్థిక సహాయాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని ఉదారంగా చౌకగా అందజేసింది. ఎప్పటికప్పుడు ఏర్పడుతున్న సంక్లిష్టయుద్ధ పరిస్థితులలో బలహీన దేశాలకు అండగా నిలుస్తూ అనేక కష్టనష్టాలకు గురి అయింది. తూర్పు యూరపు దేశాలలో లక్షలాది సంఖ్యలో సైన్యాలనుంచి అందుకొరకై అపరిమితమైన ఖర్చులను భరించింది. అన్నిటికంటే ప్రధానంగా సోవియట్ యూనియన్ తన సిద్ధాంతం ప్రకారం ప్రపంచశాంతి సంరక్షణను తన కర్తవ్యంగా భావించింది. ప్రపంచ కమ్యూనిజం, దాని అధినేత సోవియట్ యూనియన్‌ను ఒక పెద్ద బూచిగా, ప్రమాదంగా చిత్రించిన అమెరికా ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. దాని వెనక తమ వ్యాపార వాణిజ్య ప్రయోజనాలను సాధించింది. యుద్ధసామాగ్రిని, ఆయుధాలను, విమానాలను తయారుచేసే పరిశ్రమలను నెలకొల్పింది. ఆ ఉత్పత్తులన్నింటిని ఎగుమతి చేస్తూ అపారమైన ధనాన్ని సంపాదించింది. ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ సంరక్షకుడిగా, తాను మాత్రం, ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని సృష్టించిన అమెరికా దాని ద్వారా విపరీతంగా లాభపడింది. సోవియట్ యూనియన్, ఈ ప్రచ్ఛన్న యుద్ధ వ్యూహాన్ని ఛేదించి, దీని వెనకనున్న కమ్యూనిస్టు వ్యతిరేక కట్టుకథలను పటాపంచలు చేయగలిగియుండేది. సోవియట్ యూనియన్ ప్రపంచశాంతి, యుద్ధ వ్యతిరేకతను ఒక ప్రపంచ రాజకీయ ఎత్తుగడగానే అంగీకరించిందిగాని ఒక వ్యూహాత్మక విధానంగా విశ్వసించలేదని నా నమ్మకం. సామ్రాజ్యవాదమున్నంతకాలం యుద్ధాలు అనివార్యమనే సైద్ధాంతిక నిర్ధారణను ఎవ్వరూ మార్చలేదు. ఇటీవల కాలములో శాంతి, సహజీవనం, నిరాయుధీకరణ నినాదాలు ఇవ్వబడిన వాటికి వ్యూహాత్మక ప్రాధాన్యత నిశ్చయంగా ఇవ్వబడలేదు. సోవియట్ విదేశాంగ విధానం శాంతికాముకంగా ఉన్నా, ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని కల్పించిన అమెరికా ప్రయత్నాలను వమ్ముచేయడానికి, ఈ మధ్య శ్రీ గోర్బాచేవ్‌గారు కృతనిశ్చయంతో వ్యూహాత్మకంగా చేసిన ప్రయత్నాలు అంతకుముందు రెండు మూడు దశాబ్దాల క్రితమే చేయవలసింది. చేయలేకపోయారు. యుద్ధాలు అనివార్యమనే సిద్ధాంతం అడ్డువచ్చింది. కాబట్టి ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ రక్షణ, పీడిత ప్రజల ఉద్యమాల పరిరక్షణ తన పవిత్ర అంతర్జాతీయ కర్తవ్యంగా సోవియట్

భావించింది. అణుయుద్ధం. అంతరిక్షయుద్ధం, అనివార్యంగా రావచ్చుననే భయం వదలలేదు. కాబట్టి యుద్ధ సన్నాహాలు, ఆయుధాల ఉత్పత్తి, ఆదునిక ఆయుధాల సమీకరణపై దేశ సంపదలోని అత్యధిక భాగం వెచ్చించబడ్డది. సామ్రాజ్యవాద దేశాలలాగా విదేశీ వనరులను సంపాదించే వాణిజ్య వ్యాపారాలు సోవియట్ యూనియన్‌కి లేవు. స్వంత వనరులపై ఆధారపడడం ద్వారానే అంతర్జాతీయ కర్తవ్యాలు, యుద్ధ సన్నాహాలు చేయవలసి వచ్చింది. సోషలిస్టు దేశాలన్నిటిలో కేవలం సోవియట్ యూనియన్ ఒంటరిగా ఈ భారాన్నంతా మోయడం దాదాపు అసాధ్యమైన విషయం. ఐనా అలా జరిగింది. దీని దుష్ఫలితాలు సోవియట్ అంతరంగిక ఆర్థిక విధానాలపై ఎంతగానో పడ్డాయి. సావియట్‌లోని రాజకీయ, పార్టీవ్యవస్థ దాని ఉక్కు చట్రం అంతరంగిక సమస్యలను బయటికి ఏమాత్రం పొక్కనీయలేదు. తొక్కిపెట్టింది. అంతర్గత వైరుధ్యాలు తీవ్రతరమై పరిమాణాత్మకంగా అభివృద్ధి చెందినవి. తుదకు బ్రద్ధలుకాక తప్పలేదు. సోవియట్ విచ్ఛిత్తికి ఇది ప్రథమ ప్రబల కారణమని నా అభిప్రాయం.

రెండవ ప్రదాన కారణం మొదటి కారణం నుండి ఉత్పన్నమయ్యేదే. పరిమిత ఆర్థిక వనరులలో సింహభాగం దేశరక్షణ, విదేశీ సోషలిస్టు వ్యవస్థల రక్షణ తదితర అంతర్జాతీయ కర్తవ్యాలకై కేటాయించిన తర్వాత స్వంత దేశాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకై మిగిలేది స్వల్పమే. విదేశాలనుండి సంపాదించేది ఏమిలేని సోషలిస్టు వ్యవస్థ యూరపులో అత్యంత వేగంగా కొనసాగిన శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ప్రయాణంలో అరవై దశకం నాటికే వెనక పట్టుపట్టింది. సాంకేతిక విప్లవ నిర్వహణలో ఒకటి రెండు సంవత్సరాల వెనకబాటుతనమే తీరని నష్ట కష్టాలకు కారణభూతమౌతుంది. అటువంటి పరిస్థితులలో కనీసం రెండు దశాబ్ధాలు వెనకబడిపోవడం వలన సోవియట్ యూనియన్ లోని పారిశ్రామిక ఉత్పత్తి, దాని నాణ్యత, పరిశ్రమల ఉత్పాదకత, అంతర్జాతీయ ప్రమాణాలతో వాటి విలువ తీవ్రంగా దెబ్బతినిపోయింది. అధునాతన నాగరికతకై ఉరకలు వేసే యువతరాన్ని అడుగడుగునా నిస్పృహ, నిరుత్సాహాలకు గురి చేయబడడం చెప్పబడిన రాజకీయ, అంతర్జాతీయ కారణాలు వారికి ఏమాత్రం సంతృప్తిని కలిగించలేదు. సరికదా వారి భావాలు అణచివేతకు గురిచేయబడినవి. నిర్బంధ విధానం అమలు జరిగింది. దీనికి సమాధానంగా లోలోన తిరుగుబాట్లు పెరిగిపోక తప్పలేదు. విలాస వస్తువులతో పాటు, నిత్యావసర వస్తువులు గూడా అందుబాటులో లేకపోవడం, తుదకు ఆహారం గూడా అందుబాటులో లేకపోవడం, అడగడానికి, ఆందోళనచేయడానికి పౌరహక్కులు లేకపోవడం, నిజంగా పౌరజీవితాన్ని దుర్భరం చేసినవి. పాత వ్యవస్థపై కోపాన్ని పెంచినవి. అవకాశం దొరకగానే గ్రుడ్డి ద్వేషంతో, గమ్యం, లక్ష్యంలేని తిరుగుబాటుకు దారితీసింది.

పై రెండు ప్రధాన కారణాలకు కారణమైంది, మూడవ ముఖ్యకారణం. అనవసరమైన, అవాస్తవమైన అపోహలతో లేని సమస్యలను సృష్టించుకుంటూ పరిష్కరించుకునే కమ్యూనిస్టుపార్టీ నిర్మాణ విధానము మూలకారణం. కేంద్రీకృత "ప్రజాస్వామ్య సిద్ధాంతం" ప్రాణాంతకంగా పనిచేసింది. విప్లవ విజయానికి విప్లవానంతర దండయాత్ర లేక అంతర్యుద్ధ వాతావరణంతో సృష్టించబడిన కేంద్రీకృత ప్రజాస్వామ్య సిద్ధాంతం, లేక కమాండిజం, ఉక్కు క్రమశిక్షణ, పవిత్ర సిద్ధాంతాలుగా, కలకాలం ఆచరణయోగ్య విధానాలుగా అనుసరించబడినవి. బహుళపార్టీ ప్రజాస్వామ్యం రద్దుచేయబడ్డది. కార్మికవర్గపార్టీ అయిన కమ్యూనిస్టు పార్టీయే ఏకశిలా సాదృశ్యంగా, ప్రజలందరి మనోభావాలను ప్రతిబింబిస్తుందని, దాని నాయకత్వమే, కార్మికవర్గ నియంతృత్వానికి నిదర్శనమని, ఈ సిద్ధాంతాన్ని వ్యతిరేకించే వారంతా దేశద్రోహులని నిర్ధారణ చేయడం జరిగింది. వ్యతిరేక శక్తులను అణచివేయడం ద్వారానే కార్మికవర్గ నియంతృత్వం వేళ్లూనుకుంటుందని శాసించడం జరిగింది. ప్రతిపక్షం లేకుండా చేయబడింది. స్వయంగా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వ స్థాయినుండి క్రిందివరకు వేలుకాదు, లక్షలమంది హతమార్చబడినారు. ఉద్వాసనకు గురిచేయబడినారు. ప్రజాస్వామ్యం నామరూపాలు లేకుండా చేయబడి నియంతృత్వం విలయతాండవం చేసింది. ఇదంతా సోషలిజం, కమ్యూనిజం, మార్క్సిజం, లెనినిజం పేరిట జరిగింది. నిజంగా అందులో ఏది కాదు. పచ్చినియంతృత్వానికి, అధికార దాహంతో ప్రత్యర్థుల అణచివేతకు అలవాటుపడిన స్టాలినిజం మాత్రమే ఇది. దీనికి బీజాలు లెనిన్‌గారి పార్టీ నిర్మాణ సూత్రాలలో లేకపోలేదు. అయితే అత్యవసర విప్లవ పరిస్థితులలో, అంతర్యుద్ధ పరిస్థితులలో తాత్కాలికంగా చేయబడిన కొన్ని నిర్ణయాలను అదనుగా తీసికొని, లెనిన్ మరణానంతరం మారిన పరిస్థితులలో కూడా కొనసాగించి, వాటిని శాశ్వతం చేసి, వాటికి సైద్ధాంతిక ప్రాశస్త్యమును సమకూర్చింది స్టాలిన్‌గారే. అంత మాత్రాన స్టాలిన్ పాత్ర అంతా నష్టజాతకమని అనలేము. లెనిన్ మరణానంతరం పార్టీని నిర్మించడంలో రెండో యుద్ధకాలంలో పార్టీని, ప్రభుత్వాన్ని నిలబెట్టి విజయం సాధించడంలో సోవియట్ ప్రజల నాయకుడిగా స్టాలిన్ అమోఘమైన పాత్ర నిర్వహించారు. ఆయన రెండు పార్శ్వాలు గమనించవలసినవే. స్టాలిన్ తర్వాతనైనా వ్యవస్థలో మార్పు రాలేదు. అపరిమితమైన కేంద్రీకరణ, కమాండిజం, ప్రభుత్వం ప్రజాసంస్థల స్థానాలలో పార్టీ మాత్రమే నిర్ణయాత్మక బాధ్యతలు నిర్వహించడం జరిగింది. అప్రజాస్వామిక నిరంకుశ వ్యవస్థ, అన్ని స్థాయిలలో అధికార కేంద్రీకరణ చేస్తూ సర్వాధికారాలను నిర్వహించే నియంతలను సృష్టిస్తుంది. సర్వాధికార రుచిమరిగిన పార్టీనేతలు ప్రజాస్వామ్యాన్ని పెరగనీయరు. అణచిపెడతారు. అది ఒక పెద్ద స్వార్థ ప్రయోజనంగా మారుతుంది. అదే అక్కడ జరిగింది. ఆ పార్టీకి ప్రత్యేక అస్తులు, పార్టీ సభ్యులకు ప్రత్యేక రాయితీలు, పార్టీ నాయకులకు ప్రత్యేక అధికవేతనాలు, సౌకర్యాలు, రాజలాంఛనాలు, ఇవ్వబడినవి.

మిగతావారికి ఏమీలేవు. వారు రెండవ శ్రేణికి చెందిన పౌరులు. దీన్ని కాదన్న వారికి అత్యంత దారుణమైన శిక్షలు. కాబట్టి ఈ వ్యవస్థ సంస్థాపకులు గతించినా వ్యవస్థ తనకుతాను పోషించుకున్నది. నిరంకుశత్వం, నియంతృత్వం మూర్తీభవించిన నాయకత్వం పైనుంచి క్రిందివరకు నిర్మించబడింది. ప్రజలు, ప్రజాతంత్రకారులు తలవంచుకొని కాలక్షేపం చేయడానికి అలవాటుపడ్డారు. పరిస్థితులు పరిపక్వమయ్యేవరకు నివురుగప్పిన నిప్పులా కొనసాగింది. ఆ తర్వాత భగ్గున మండింది. సోవియట్ యూనియన్ రాజ్యాంగంలో, పార్టీ నిర్మాణ సూత్రాలలో పొందుపరచబడియున్న ఈ అప్రజాస్వామ్యం, నిరంకుశత్వం, నియంతృత్వం గురించి లెనిన్ కాలములోనే ధైర్యంగా విమర్శించిన, దూరదృష్టి కలిగిన ప్రజానాయకులు, ఆలోచనాపరులు లేకపోలేదు. జర్మన్ కమ్యూనిస్టు విప్లవకారి అయిన రోజాలక్జెంబర్గ్ పాత్ర అద్వితీయమైనదని ఘంటాపథంగా చెప్పవచ్చును. అంతటి దూరదృష్టి గలిగి, ప్రజాస్వామ్యంపై అచంచల విశ్వాసం కలిగిన మహిళామణిని కన్న జర్మన్ జాతికి నా జేజేలు. బర్ట్రాండ్ రస్సల్స్‌గారు ఇరవయ్యవ దశకంలో సోవియట్ యూనియన్ వెళ్ళారు. విప్లవ పరిణామాలను పరిశీలించారు. లెనిన్ గారితో మాట్లాడినారు. ఈ విధానాలు విప్లవ విజయానికి, విప్లవానంతర పరిస్థితులలో కూడా చాలా బాగా తోడ్పడినాయని శ్లాఘించారు. అయితే కేంద్రీకృతం, అప్రజాస్వామ్యం, నియంతృత్వం ఎట్టి పరిస్థితులలో కూడా శాశ్వతం చేయరాదని అలా జరిగితే భావితరాలు క్షమించరని విప్లవ విజయాలు పటాపంచలుకాక తప్పవని తన పుస్తకం "విప్లవానికి పూర్వం, విప్లవానంతర బోల్షి విజం"లోను స్పష్టంగా చెప్పారు. మహా మేధావులు, ప్రజాస్వామ్యవాదులు బోల్షి విజంలోని అంతర్గత వైరుధ్యాలను, వాటివలన కలిగే ప్రమాదాలను పసికట్టక పోలేదు. హెచ్చరించారు గూడా. సుప్రసిద్ధ ఇటాలియన్ విప్లవకారుడైన గ్రాంస్కి తదితర ఫ్రెంచ్, జర్మన్, బ్రిటిష్ విప్లవకారులు, సోషల్ డెమాక్రాట్లు ఈ సత్యాలను చెప్పారు. అయితే వాటన్నింటిని విప్లవ ప్రతీఘాతక శక్తుల ప్రచారాలుగా త్రోసిపారవేయడం జరిగింది. నిజంగా ఈ విమర్శలకు సానుకూల ప్రతిస్పందన కలిగి సోవియట్ పార్టీ మరియు పరిపాలనలలో సకాలములో సంస్కరణలు జరిగియుంటే కమ్యూనిస్టు, సోషల్ డెమోక్రాట్ల మధ్య సయోధ్య కుదిరి జర్మనీలో ఫాసిజాన్ని నివారించడం తత్ఫలితంగా ప్రపంచ రాజకీయాల దిశను చరిత్రగతినే మార్చడం సాధ్యమయ్యేదేమో చెప్పలేము. సోవియట్ యూనియన్‌లో సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి సోషలిస్టు విజయాలను రక్షించుకుంటూ దేశ సమైక్యతకు భంగం కలుగకుండా చూచే అవకాశాలుండినావనే నా అభిప్రాయం. కామ్రేడ్ గోర్భచేవ్ అత్యంత సమర్థవంతమైన దూరదృష్టి గలిగిన నాయకుడు. ప్రపంచ పరిణామాలను సూక్ష్మదృష్టితో విశ్లేషించగల సమర్థుడు. అయిదు సంవత్సరాల అనతికాలంలో ప్రజాస్వామ్య విలువలను ప్రపంచ వ్యాపితంగా చాటిచెప్పి ప్రచ్ఛన్న యుద్ధాన్ని అంతమొందించడంలో అద్వితీయ పాత్ర నిర్వహించారు. తత్ఫలితంగా అత్యంత అవసరమైన వనరులను, ఆయుధాల

కొరకు కాకుండా అభివృద్ధి కార్యక్రమాలకై తరలించడం సాధ్యపడుతున్నది. ప్రపంచశాంతి, సుస్థిరత, మానవాళి అభివృద్ధి సాధ్యం చేయబడుచున్నది. ఆయన చరిత్ర పురుషుడుగా, మహాత్ముడుగా కీర్తించబడుతాడనడంలో ఏలాటి సందేహం లేదు.

అయితే తన స్వదేశములోనే తన నాయకత్వంలోని కమ్యూనిస్టుపార్టీ తనకు చుక్కెదురైంది. తాను ప్రవేశపెట్టి బహుకష్టంగా పార్టీచే ఒప్పించిన ఆర్థిక, రాజకీయ సంస్కరణలు అడుగడుగునా నీరు గార్చబడినవి. అధికార దాహంతో నుండి, ప్రత్యేక సౌకర్యాలకు అలవాటుపడిన పార్టీ నాయకత్వం పనిగట్టుకొని గోర్బచేవ్‌గారి సంస్కరణలను ఓడించినది. తాను ఆశించిన ఫలితాలు సాధించలేని గోర్బచేవ్ జనాన్ని తిరుగుబాటు చేయమని పాత వ్యవస్థను బట్టబయలు చేయమని, నిర్భీతితో ఖండించమని, నిస్పృహతో పిలుపునిచ్చారు. దీని ఫలితంగా ప్రజలలో క్రోధాగ్ని చెలరేగింది. అడ్డూ అదుపూ లేకుండా పెచ్చరిల్లింది. సంస్కరణ ఉద్యమాన్ని నిర్వహించవలసిన కమ్యూనిస్టు పార్టీ నిశ్చేష్టురాలుగా నిస్సహాయస్థితిలో పడిపోయింది. పైపెచ్చు దీనికి కారకుడైన కామ్రేడ్ గోర్బచేవ్‌ను రంగంనుండి తొలగించడానికి కుట్ర పన్నింది. సైన్యంసహాయ నిరాకరణవలన ప్రజల ప్రజాతంత్ర ప్రభంజనం ఫలితంగా కుట్ర విఫలమైంది. ఐతే పరిస్థితిని ప్రతీపశక్తులు కమ్యూనిస్టు వ్యతిరేకశక్తులు, సామ్రాజ్యవాద అనుకూల శక్తులు యుక్తిగా వినియోగించుకున్నవి. అవకాశవాది ఎలిత్సీన్‌ను గద్దెనెక్కించి గోర్బచేవ్‌ను పదవీచ్యుతుణ్ణి చేయడం జరిగింది. దీనితో 70 సంవత్సరాల సుధీర్ఘ విప్లవచరిత్ర అంతమైంది. వివిధజాతుల ఐక్యతపై ఆధారపడిన సమాఖ్య విచ్ఛిన్నమైంది. వేర్పాటువాదం, కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదం కట్టలు తెంచుకొనిపారింది. సోవియట్ యూనియన్ అస్తమయం జరిగింది. ప్రపంచ శాంతిప్రియ, ప్రజాస్వామ్యవాద ప్రజల ఆశాజ్యోతి ఆరిపోయింది.

అత్యంత బాధాకరమైన ఈ పరిణామాలు అనుభవాలనుండి ప్రజాతంత్రశక్తులు, కమ్యూనిస్టులు విలువైన గుణపాఠాలు నేర్చుకోవడం అత్యవసరం. అవి ప్రధానంగా ఈ క్రింది విధంగా ఉండాలని నా అభిప్రాయం.

1. స్వతంత్రం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మానవజాతి సృష్టించిన అత్యంత ఉన్నతస్థాయి గలిగిన విలువలు. 'సమానత్వము' అను విలువ వీటికి ఈ శతాబ్దంలో తోడుచేయబడినది. ఈ విలువలను పోషించని వ్యవస్థ, వాటిని అణచివేయ ప్రయత్నించే వ్యవస్థ కాలగర్భంలో కలిసిపోక తప్పదు.

2. అన్ని స్థాయిలలో ప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సంస్థలే ప్రజల పక్షాన నిర్ణయాలు చేయాలి. వాటిని ప్రజల తోడ్పాటుతో ఆచరించాలి.

3. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం మాత్రమే. ''కేంద్రీకృత ప్రజాస్వామ్యం''

ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనది. ఈ వాస్తవాన్ని చరిత్ర రుజువు చేసింది.

4. ''కార్మికవర్గ నియంతృత్వం'', ''కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం'' ప్రజాస్వామ్యానికే వ్యతిరేక సూత్రాలు. అశాస్త్రీయమైనవి.

అంతర్జాతీయ రంగంలో అనుసరించదగిన గుణపాఠాలు:

1. అంతర్జాతీయ రంగంలో బాండుగ్‌లో భారత్, చైనా మొదలగు దేశాలచే ప్రకటించబడిన పంచశీలాల ఆధారంగా ప్రపంచదేశాల మధ్య సంబంధ బాంధవ్యాలుండాలి.

2. ప్రపంచ వాణిజ్య వ్యాపార, మార్కెట్ వ్యవస్థల్లో ఆ మూలాగ్రమైన సంస్కరణలు చేయబడి నూతన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం జరగాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల వనరులను తరలించుకుపోతున్న అభివృద్ధిచెందిన దేశాల దుర్విధానాలు అరికట్టబడాలి. అభివృద్ధి చెందిన దేశాల వనరులనుండి గణనీయమైన భాగం అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధికై తరలించబడాలి. సమాన ప్రాతిపదికపై వాణిజ్య, వ్యాపారాలు జరగాలి.

3. అంతర్జాతీయ పోలీసు జవానుగా లేక అందరికంటె పెద్దగా పెద్దరికంతో తూలుతున్న అమెరికా విధానాన్ని అభివృద్ధిచెందుతున్న దేశాలు సమైక్యంగా ఎదిరించాలి. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలమధ్య అంతర్గత వైరుధ్యాలను వినియోగించుకుంటూ ప్రపంచశాంతిని, సమాన ప్రాతిపదికలపై విజయవంతం చేయాలి.

4. మిత్రరాజ్య సమితి నిబంధనలు సవరించబడాలి. అది అన్ని సభ్యదేశాల సమిష్ఠి వ్యక్తిగత అవసరాలు తీర్చడానికి ప్రబల సాధనంగా వినియోగించబడాలి. దాని క్రింద పనిచేసే, ఆర్థిక, సాంస్కృతిక తదితర సంస్థలన్నీ పునరుజ్జీవం చేయబడాలి. సభ్యదేశాలు అందుకై కృతనిశ్చయంతో పాటుపడాలి.

ఇటీవలి కాలంలో చైనా దేశంయొక్క విదేశీ అంతరంగిక విధానాలలో వస్తున్న మౌలికమైన మార్పులు సంతృప్తికరంగా నున్నవి. గతకాలపు పొరపాట్లతో తగిన గుణపాఠాలు నేర్చుకుంటున్నట్లు కనబడుతున్నది. కార్మికవర్గ నియంతృత్వం, ప్రజాస్వామ్యం విషయంలో ఇంకా చాలా ముందడుగు వేయవలసియున్నా, సక్రమమైన దిశలో మార్పులు రావడం ఆశాజనకం. 120 కోట్ల జనాభా కలిగి, భారతదేశానికి ఇరుగు పొరుగుననున్న గొప్ప చారిత్రిక, సాంస్కృతిక సంబంధాలున్న చైనాదేశం అత్యంత కీలకమైన పాత్ర నిర్వహిస్తున్నది. భారత్ - చైనా మైత్రి ప్రపంచంలో అభేద్యమైన కోటగా నిలుస్తుంది. శాంతి, ప్రజాస్వామ్యం, సమసమాజం కొరకు నిర్ణయాత్మక పాత్రను నిర్వహిస్తుంది.

లెబనాన్, ఉత్తర కొరియా, క్యూబా దేశాలుగూడా సోషలిస్టు వ్యవస్థలను రక్షించుకుంటూ ముందడుగు వేస్తాయని ఆశించవచ్చును.

## మన గమ్యం:

అత్యంత ప్రాచీన సంస్కృతి సత్సాంప్రదాయాలు గల భారతజాతి అభివృద్ధిని సామ్రాజ్యవాదం రెండు శతాబ్ధాలు వెనక్కి నెట్టింది. ఇంకా అవిద్య, అజ్ఞానం, పేదరికంలో మ్రగ్గి ఉన్న భారతదేశ గమ్యం సమసమాజం సాషలిజం తప్ప పెట్టుబడిదారీ విధానం కానేకాదు. అయితే సోవియట్ అస్తమయంతో అక్కడి సోషలిస్టు నిర్మాణ సూత్రాలు వ్యర్ధమైనవని రుజువైంది. చైనాతో సహా ప్రపంచమంతా తగు గుణపాఠాలను నేర్చుకుంటున్నవి. ఆధునిక సాంకేతిక పారిశ్రామిక యుగంలో సాద్యమైనంత వేగంగా బహుముఖ అభివృద్ధిని సాధిస్తూ, ఆ అభివృద్ధి ఫలితాలను శ్రమజీవులందరికి బాధ్యతగా, వారి శ్రమకు ప్రతిఫలంగా అందజేయగలిగే రాజకీయ వ్యవస్థ సాధననే సోషలిజమని నా అభిప్రాయము. ఈ వ్యవస్థ ప్రజాతంత్ర మానవీయ విలువల ఆధారంగానే సాధ్యపడుతుంది. మనదేశంలోని మత ప్రవక్తలు, సంఘసంస్కర్తలు, విప్లవవీరులు నిర్ధేశించిన మార్గాలు సమసమాజ నిర్మాణాన్ని సూచిస్తున్నాయి. మార్క్సిజం అను సత్యాన్వేషణ ఆయుధాన్ని వినియోగించి విశ్లేషిస్తే పై యదార్ధం స్పష్టంగా అగుపడుతుంది. సోషలిజం ధ్యేయంగల రాజకీయపక్షాలన్నీ శాస్త్రీయ ధృక్పథంతో పరిశీలించి మనదేశానికి అవసరమైన మార్గాన్ని నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతగానో ఉన్నది. ఇప్పటికే అనేక ప్రయోగాలు జరిగినవి. కష్టనష్టాలతో కూడిన విలువైన అనుభవాలు కలిగినవి. అనుభవాలన్నిటిని మేళవించి, అంతర్జాతీయ అనుభవాల వెలుతురులో, సమసమాజ సాధనమార్గాన్ని రూపొందిస్తారనటంలో ఏలాటి సందేహం లేదు.

(రావి నారాయణ రెడ్డి గారితో చర్చించి రచించినది. వారి మరణానంతరం వారి కుటుంబ అనుమతితో అచ్చు వేయబడిన 'నా జీవిత పథం' లో చేర్చబడినది. మా భావ సమైక్యతకు ప్రతిబింబంగానున్న ఈ వ్యాసాన్ని పై వివరణతో ఈ పుస్తకంలో తిరిగి అచ్చువేయడం జరుగుతున్నది.)

# మారుతున్న సమాజం - మానవ సంబంధాలు

కీ॥శే॥ డా.ఎం.ఆర్. అప్పారావు గారి 91వ జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొని ప్రసంగించవలసిందిగా నన్ను ఆహ్వానించిన ప్రియమిత్రులు, చిరకాల సహచరులు, పాత్రికేయులు, 'భూమిక ఫౌండేషన్' అధ్యక్షులు మరియు "డా. ఎం.ఆర్. అకాడమీ - నూజివీడు" ప్రధాన కార్యదర్శి గారైన ఎ.యస్.ఆర్. కృష్ణ గార్కి వారి సహచరులకి హార్ధిక కృతజ్ఞతలు. ఎం.ఆర్. అప్పారావు గారు విశిష్ట వ్యక్తిత్వం కలిగిన అనన్య సామాన్య మానవీయ విలువలకు ఒక ప్రతీక. ఆంధ్రప్రదేశ్ మొదటి శాసనసభలో (1957) నుండి ఆ తర్వాత కూడా సన్నిహితంగా ప్రజాసమస్యలపై ఉమ్మడి అవగాహనతో, కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామిగా నుండిన మధుర స్మృతులు నా జీవితంలో మరుపురానివి. అత్యున్నత సంస్కృతి - సాంప్రదాయాల కుటుంబంలో జన్మించి విద్యా బుద్ధులను వంట పట్టించుకుని ప్రజాసేవారంగంలో పరమ సాత్వికుడిగా, శాంతమూర్తిగా,




*కీ॥శే॥ డాక్టర్ ఎం.ఆర్.,అప్పారావుగారి 91వ జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొని ప్రారంభోపన్యాసం చేసి ప్రస్తుత నూజివీడు శాసనసభ్యులు అప్పారావుగారిచే సన్మానం పొందుచున్న చెన్నమనేని. ప్రక్కన సభాధ్యక్షులు శ్రీ ఎ.ఎస్.ఆర్. కృష్ణ.*

ఉదారస్వభావుడుగా కీర్తినార్జించిన ఎం.ఆర్. తమ సమకాలీకులకే కాకుండా రానున్న తరాల వారికి మార్గదర్శకుడు. విద్యావేత్తగా, శాసనసభ్యుడిగా, మంత్రిగా ఎం.ఆర్. పోషించిన పాత్రలు అద్వితీయం. వారి సంస్మరణగా ఈ నాటి సామాజిక అభివృద్ధికి, అభ్యుదయానికి మూలకందమైన గ్రామీణాభివృద్ధి గురించి దాని అవగాహనకు సంబంధించి వినమృతతో నా కొన్ని అనుభూతులను అందించడం సముచితంగా భావిస్తున్నాను.

మన దేశం, రాష్ట్రం ప్రధానంగా 70 శాతం జనాభాతో కూడిన గ్రామీణ జీవితంపై ఆధారపడియున్న విషయం నిర్వివాదమైంది. ఈ పరమ సత్యాన్ని మన దేశ ప్రజాసంస్థలు, నాయకులు స్వతంత్రానికి పూర్వమే గుర్తించారు. స్వతాంత్రానంతరం పట్టణాలతో పాటు పేదరికం కేంద్రీకృతమైన గ్రామాల సమగ్ర అభివృద్ధిని సాధించడానికి సర్వ ప్రయత్నాలు చేయాలని సంకల్పించారు. రాజ్యాంగంలో దిశా నిర్దేశం చేశారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా గ్రామీణాభివృద్ధి, వికేంద్రీకృత స్వపరిపాలనను శాసనబద్ధం చేశాం.

గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా చేపట్టబడిన గత అర్ధ శతాబ్ది చర్యల అనుభవాలు మన లక్ష్య శుద్ధి, సంకల్పశుద్ధిని సమర్ధించడం లేదు. ఈ అవగాహన వివిధ పరస్పర వైరుద్యాలకు, అస్పష్టతలకు ఆస్కారం కల్పిస్తున్నవి. గ్రామీణాభివృద్ధి సాధించడంలో అంకిత భావలోపం, అయిష్టం చోటు చేసుకుంటున్నది. ఫలితంగా అధికార వికేంద్రీకరణ నామమాత్రము, లాంచనప్రాయము అయినది. గ్రామీణులు సర్వ స్వతంత్రులుగా తమ సమస్యలను తామే ఎంపిక చేసుకొని వాటి పరిష్కార నిర్ణయాలను తామే చేసుకొని తమ నిర్ణయాలను తామే సమిష్టిగా అమలు పరుచుకునే ప్రజాస్వామ్యం ఇంకా ఒక కలగా మిగిలి యుండడం ఆశ్చర్యకరం. గ్రామీణాభివృద్ధి పథకాల రచన, ప్రణాళికల రూపకల్పన, ఆచరణ నింబంధనావళి ఇవన్నీ ఢిల్లీ కేంద్రం నుండి రాష్ట్ర కేంద్రాలకి ఆ తర్వాత వివిధ రంగాలకు సంబంధించిన ఉన్నత అధికార వర్గం మరియు కలెక్టర్ల ద్వారా క్రింది ఉద్యోగ బృందం చేతుల మీదుగా గ్రామానికి అందచేయబడుతున్న వైనం వర్ణనాతీతం. ఇందులో గ్రామీణులచే ఎన్నుకోబడిన స్థానిక స్వపరిపాలన యంత్రాంగానికి ఎలాంటి ప్రమేయం లేకపోవడం, అధికారుల ఆదేశాల మేరకు ఆచరణలో వారికి సహాకరించడం తదుపరి కొనసాగింపు చర్యల గురించి కూడా అధికారుల ఉత్తర్వుల కొరకు వేచియండడం ఈ నాడు గ్రామీణ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎం.పి.టి.సిలు, మండల, జిల్లా పరిషత్ సభ్యులు అనుభవిస్తున్న వాస్తవాలు. భిన్న, భిన్న భౌగోళిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో విభిన్న స్థానిక అవసరాల వెలుతురులో దేశం లేక రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం, జిల్లా పరిషత్తు తమ అభివృద్ధి పథకాలను తామే రచించుకోవడం, వనరులను సమకూర్చు

కోవడం, అభివృద్ధి పథకాలలో తమ ప్రత్యక్ష ప్రమేయ పాత్రలను పోషించడం వికేంద్రీకృత ప్రజాస్వామ్యం యొక్క మూల సిద్ధాంతం. కేంద్ర, రాష్ట్ర పరిపాలకులు, అధికారగణం తమ తమ అమూల్యమైన సూచనలను, సలహాలను అందచేయడం స్వపరిపాలన ప్రక్రియకు సమర్థవంతమైన తోడ్పాటును సమకూర్చడం, అవసరమైన సందర్భాలలో స్థానిక ప్రజాప్రతినిధుల శక్తి, సామర్థ్యాలను ఇతోధికం చేయడం మాత్రమే వారి కర్తవ్యం. ఈనాటి పరిస్థితి పై మూల సూత్రానికి ఇంకా తల్లక్రిందులుగానున్నట్లు వేరే చెప్పనక్కరలేదు. ఇటువంటి పరిస్థితికి కారణాలను ఎక్కడనో వెతకవలసిన పనిలేదు. అధికార, అనధికార నాయకత్వంలో గ్రామీణాభివృద్ధి అవగాహన గురించి ఇంకా బహుళంగా మిగిలియున్న అసంబద్ధ అస్పష్ట ఆలోచనలు, అవగాహనా రాహిత్యం మూలం.

ప్రప్రథమంగా ఇంకా అభివృద్ధి ప్రణాళికా రచయితల ఆలోచనలలో చోటు చేసుకొని యున్న PERCOLATION లేక ఇంకిపోవడం అను సూత్రం. దేశ వ్యాపిత మౌళిక సదుపాయాలైన రైల్వేలైన్లు, విమాన, నౌకాయానాల నిర్మాణం, భారీ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్డు - రవాణా, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం లాంటి కట్టడాలు వాటి నిర్వహణ ఫలితంగా జరిగే అభివృద్ధి ఫలితాలు తమంతట తామే గ్రామీణ ప్రజా బాహుళ్యానికి ముఖ్యంగా పేద ప్రజానీకానికి అందుబాటులోకి వస్తాయనే ఆలోచన కాలదోషం పట్టినది. పైనుదహరించిన భారీ, మౌళిక సదుపాయాలు వెనుకబడిన దేశాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగియున్న అవసరాలుగా గుర్తించబడినవి, నిర్మించబడినవి కూడా. అయితే గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన, ఒక ప్రత్యేక అంశంగా జాతి ప్రధాన లక్ష్యంగా గుర్తించబడి దాని సాధనలో ఆర్థిక, మానవ వనరులను వినియోగించాలని ఆధునిక, సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలు, ఐక్య రాజ్యసమితి, ప్రపంచబ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థలు సుమారు 4 దశాబ్దాల క్రిందనే గుర్తించి ఆ దిశలో తమశక్తి యుక్తులను ఉపయోగించడం జరుగుచున్నది. ఇంతటి సత్యాన్ని మన పాలకులు సంపూర్ణంగా గుర్తించి ఆచరించకపోవడం అత్యంత దురదృష్టకరం. అర్ధ శతాబ్ధికి మించిన సుదీర్ఘ ప్రయాణం తర్వాత కూడా గ్రామీణ అభివృద్ధి పేరిట లక్షల కోట్ల ధన వ్యయం జరిగిన తర్వాత గ్రామీణాభివృద్ది ఒక కొరకరాని కొయ్యగా, మిధ్యగా మిగిలియుండడం గురించి అధికార, అనధికారా బాధ్యులు తీవ్రమైన ఆత్మవిమర్శతో తమ ఆలోచనలను సంస్కరించుకోవడం అత్యవసరం.

గ్రామీణాభివృద్ది లేక దేశాభివృద్ధి ప్రధానంగా భౌతిక, మౌళిక సదుపాయాల నిర్మాణంపై ఆధారపడియుంటుందనే విషయం కేవలం పాక్షిక సత్యం మాత్రమే. గ్రామాలలో నివసించే సామాజిక ప్రజానీకం యొక్క నిత్య జీవితంలో ముఖ్యంగా పేద

ప్రజల బ్రతుకులలో ప్రతిబింబించే సంతృప్తి, సంతోషం అభివృద్ధికి ప్రబల సంకేతం. మౌళిక సదుపాయాల నిర్మాణం అభివృద్ధికి ఒక పార్శ్వం కాగా గ్రామీణ పేదల నిత్య జీవితంలో అగుపడే మార్పు సిసలైన అభ్యుదయం. గ్రామీణ ప్రజలు భార్య బిడ్డలతో కూడిన వారి కుటుంబం స్వయం ఉపాధి ఆధారంగా సంపాదించిన ఆదాయంతో తమ భోజనాన్ని పౌష్టికాహారంతో సహా తామే సమకూర్చుకోవడం, స్వంత ఇల్లు కలిగి యుండటం తమ బిడ్డలను దగ్గరలోని బడికి పంపించి ఉన్నత విద్య అందచేయగలగడం, తమ కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా దగ్గర అసుపత్రిలో చికిత్సలు పొందడం, త్రాగడానికి మంచినీరు పొందడం, రోడ్డు, రవాణా సౌకర్యాలను కలిగియుండడం, సాగునీరుతో పాటు తాము చేసే పరిశ్రమకి కనీస సౌకర్యాలను సమకూర్చుకోగలగడం, నిరాడంబర జీవితాన్ని సగౌరవంగా గడపడం, మితిమీరిన అప్పులు లేకపోవడం - ఇవన్నీ సామాన్య గ్రామీణ కుటుంబానికి వుండవలసిన పరిస్థితులు. ఇవి సాధ్యపడాలంటే భౌతికంగా గ్రామీణ సమిష్టి జీవితానికి నిర్మించబడే కనీస అవసరాల కట్టడాలు, గ్రామీణ కుటుంబాల అభివృద్ధికి మంచి ఉపకరణాలు మాత్రమే. కుటుంబంలో నుండే స్త్రీ, పురుషులైన మానవులు వారిలో నిర్మితమయ్యే సృజనాత్మక శక్తి సామర్థ్యాలు, నైపుణ్యత, కుటుంబ స్వావలంబనకు మూలకందం. అందుకు విద్య, ఆరోగ్యం, కీలకాంశాలు మానవాభివృద్ధికి ప్రాణప్రదం. ఈ సందర్భంగా "దారిద్ర్యరేఖ" అను కొలమానాన్ని విశ్లేషించడం అవసరం. ఏనాడో ప్రపంచబ్యాంకు అధినేతలు నిర్ణయించిన రేఖ అది. ఒక రోజుకి ఒక డాలరు లేక దానికి అనుగుణ్యమైన రూపాయలలోని వేతనం సంపాదించలేని వారు దారిద్ర్యరేఖకు దిగువనున్నట్లు ఆశాస్త్రీయంగా, అయాచితంగా అర్థం చెప్పబడింది. దశాబ్దాలు గడిచినా ఈ రేఖ మారడంలేదు. మన దేశంలో సుమారు 35 కోట్ల ప్రజలు ఈ రేఖకు దిగువుగానున్నట్లు చెప్పబడుచున్నది. కాని నోబెల్ బహుమాన గ్రహీత అమర్త్యసేన్ మరెందరో ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు నిర్ద్వంధంగా, ఘంటా పథంగా పైనుదహరించిన విధంగా చెప్పబడే కుటుంబ జీవన ప్రమాణాన్ని కొలమానంగా అంగీకరిస్తే మనదేశంలో సగానికి తగ్గకుండా జనబాహుళ్యం పేదరికంతో బాధపడుతున్నదని చెప్పారు. స్వావలంబనకు కేంద్రబిందువైన స్వయం ఉపాధి, ఉద్యోగం తదితర అంశాలకు నోచుకోకుండా ఈతి బాధలు అనుభవిస్తున్నదన్నారు. దేశంలో గొప్పగానే జరుగుచున్న పారిశ్రామికాభివృద్ధి, మౌళిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడటం లేదు. ఇది ఉపాధి, ఉద్యోగరహితమైన అభివృద్ధి. ధనవంతులు, పేదల మధ్య అగాధాన్ని పెంచుతున్న అభివృద్ధి. అనుదినం నాగరికతా ప్రపంచంలో పెరుగుతున్న కనీస జీవితావసరాలను తీర్చుకోలేకుండా సంఖ్యలో పెరిగిపోతున్న నిరుపేదలకు అందుబాటులోకి రాని అభివృద్ధి. ఒకే దేశంలో రెండు వర్గాలుగా ధనికులు - పేదలు దిన దిన ప్రవర్ధమానానికి గురి చేస్తున్న అభివృద్ధి. ఈ వాస్తవాన్ని నిర్ధిష్టమైన అంకెల నేపద్యంలో గమనించండి. స్వాతంత్రానంతర అర్ధశతాబ్ది

కాలంలో, 10 పంచవర్ష ప్రణాళికల ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి రానున్న 2010 నాటికి ఇలావుంటుందని "ది గ్రేట్ ఇండియన్ మిడిల్ క్లాస్" అను గ్రంథంలో ప్రామాణికంగా తెలియచేయడం జరిగింది. సంవత్సరానికి 90 వేల రూపాయల ఆదాయానికి మించని కుటుంబాలు 11 కోట్ల 44 లక్షలు వుండగా వారి జనాభా 61 కోట్ల 80 లక్షలు వుంటుంది. మొత్తం జనాభాలో వీరు 51.5 శాతం. గ్రామీణ జనాభాలో వీరు 84.2 శాతం. ప్రతి సంవత్సరం వీరి పెరుగుదల -2.1 శాతం. అంటే ఈ సంఖ్య పెరగడంలేదు. కాని కేవలం నూటికి ఇద్దరు మాత్రమే తగ్గుతున్నారు. జనాభా పెరుగుదలను లెక్కలోకి తీసుకుంటే ఈ తగ్గుదల నామమాత్రమే. ప్రతి సంవత్సరం 90 వేల నుండి 2 లక్షలలోపు ఆదాయం కలిగిన దిగువ మధ్యతరగతిని చూడండి. అది 7 కోట్ల 53 లక్షల కుటుంబాలతో 40 కోట్ల 50 లక్షల జనాభా కలిగివున్నది. దేశ జనాభాలో ఇది 38.9 శాతం. గ్రామీణ జనాభాలో 61.2 శాతం. వీరి వార్షిక పెరుగుదల రేటు 7.8 శాతం. ఎగువ, మధ్య తరగతిని పరిశీలించండి. ప్రతి సంవత్సరం 2 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు మించని ఆదాయం కల కుటుంబాలు 2 కోట్ల 84 లక్షలు. వారి జనాభా 15 కోట్ల 30 లక్షలు. దేశ జనాభాలో వీరు 12.8 శాతం. గ్రామీణులలో వారు 33.4 శాతం. వారి వార్షిక పెరుగుదల రేటు 12.9 శాతం. చివరకు ధనవంతుల సంఖ్యలను చూడండి. సంవత్సరానికి కోటి రూపాయలు అంతకుమించి ఆదాయం కల కుటుంబాల వారి సంఖ్య 38 లక్షలు. వారి జనాభా 2 కోట్లు. దేశ జనాభాలో వారు 1.7 శాతం. గ్రామీణ జనాభాలో 2.2 శాతం. వీరి వార్షిక పెరుగుదల రేటు 21.4 శాతం. ఈ విధంగా 22 కోట్ల 19 లక్షల కుటుంబాలలో 119 కోట్ల 50 లక్షల జనాభా వుంటారు. 100 కుటుంబాలలో 68.8 శాతం గ్రామీణ ప్రాంతంలో వుంటారు. ఇందులో ఆర్థిక పెరుగుదల రేటు సగటున 2.1 శాతం వుంటుంది.

ఈ దయనీయ పరిస్థితి ఎంతటి ఆశ్చర్యాన్ని కలిగిస్తుందో వేరే చెప్పనక్కరలేదు. మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థలను ప్రక్షాళనం చేస్తూ, సంస్కరిస్తూ దిశలను మార్చని ఎడల భారతమాత మరెన్నో శతాబ్దాల తరువాత గాని సుభిక్షాన్ని చవిచూడలేదు. రాజకీయ నాయకులు దేశ ఆర్థిక పరిస్థితిని విశ్లేషించడం ప్రధానబాధ్యత. ఆ తర్వాతనే అధికార పంపకానికై చేయవలసిన ప్రయత్నం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక విధానాలు రాజ్యాంగంలో నిర్దేశించబడిన దిశలో, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 'కనీస ఉమ్మడి కార్యక్రమం' దిశలో నడిచినా భారతావని అభివృద్ధి క్రమములో పై అపభ్రంశాలు చోటు చేసుకొనేవి కావు. సగటు జాతీయ ఉత్పత్తి ఏడున్నర, ఎనిమిది శాతం సాధించామని అనతికాలంలో తొమ్మిది, పది శాతానికి చేరుకుంటామని జబ్బలు చరుచుకోవచ్చు. అంకెలలో ఇది సత్యదూరం కాదు. కాని గ్రామీణ ప్రజల నిజజీవితంలో ఇది ప్రతిబింబించడంలేదు సరికదా, వారికి

సరికొత్త సమస్యలను సంపాదించి పెట్టుచున్నది. స్వదేశీ వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల ఫలితంగా వచ్చిన ఆదాయంకంటే వివిధ రూపాలలో ప్రపంచీకరణ ఫలితంగా విదేశాల నుండి చేరుతున్న ఆదాయం ఈ సగటు జాతీయ సంపద పెరుగుదలకు గణనీయంగా కారణభూతమవుతున్న వాస్తవాన్ని గుర్తించాలి.

అసమతులంగా, పేదరికాన్ని పెంచేదిగా కొనసాగుతున్న ఆర్థిక విధానాలలో మౌళిక సంస్కరణలు చేయకుండా గ్రామీణాభివృద్ధిని కొన్ని ప్రభుత్వ శాఖల ద్వారా సాధించలేము. ప్రభుత్వ ఆదాయ, వ్యయాల పట్టికలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేయడం ప్రథమ కర్తవ్యం. గ్రామీణ, రక్షిత త్రాగునీటి సౌకర్యాల నిర్మాణం, పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారాన్ని సమకూర్చడం అందుకు అవసరమైన నిధులను వెచ్చించడం జాతీయ కర్తవ్యం. ఈ బాధ్యతలతో పాటు రాజ్యాంగ సవరణల ద్వారా అందచేయబడిన ఇరవై తొమ్మిది బాధ్యతలను గ్రామీణ స్వపరిపాలన యంత్రాగానికి అందచేస్తూ గ్రామీణ నాయకత్వాన్ని తీర్చిదిద్దడం ద్వారా ప్రజా బాహుళ్యాన్ని అభివృద్ధిలో ప్రత్యక్ష భాగస్వామ్యం సత్వరం చేయవలసి వున్నది. అప్పుడే అభివృద్ధి దిశ మారుతుంది. వ్యవసాయం ఒక ప్రబల ఉపాధి ఉద్యోగ కల్పన మాధ్యం. భూసంస్కరణల చట్టాలను అమలు పరుస్తూ వ్యవసాయం చేయగలిగే భూమిలేని పేదలకు ఈ ఉత్పత్తి సాధనాన్ని అందచేయడం తక్షణ కర్తవ్యం. సం॥నికి వందరోజుల ఉపాధి హామినిచ్చే పథకం కొంతమందికి కొద్దిపాటి ఉపాధి ఊరట కలిగించవచ్చు. అది స్వావలంబనకు తోడ్పడుతూ శాశ్వత ఉద్యోగాన్ని కల్పించేది కాదు. విద్యా బలం, స్వంతశక్తి సామర్థ్యాల ఆధారంగా మెళుకువలతో కూడిన చిన్న, మధ్యతరహా కుటీర పరిశ్రమలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు మాత్రమే ఆదాయాలు పెంచడానికి తోడ్పడతాయి. పెరుగుతున్న జీవన ప్రమాణాలను చేరుకోవడానికి నిరుద్యోగ, నిస్పృహ జీవిత పరిస్థితులను మెరుగుపరుచుకోవడానికి తోడ్పడుతాయి. కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు ఇటువంటి వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించవలసి వుంటుంది. అందుకు అవసరమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందచేస్తూ ఋణ వ్యవస్థ, మార్కెట్ వ్యవస్థలను పెంపొందించవలసి వుంటుంది. అప్పుడే గ్రామీణాభివృద్ధికి నిజమైన మార్గం ఏర్పడుతుంది. ఇటువంటి అభివృద్ధిని మాత్రమే నిజమైన మానావాభివృద్ధిగా ప్రతి సం॥ ఐక్యరాజ్యసమితి, ప్రపంచబ్యాంకు ఎలుగెత్తి చాటడం జరుగుతుంది. ఇందులోనే మానవ పెట్టుబడి బహుళంగా వినియోగించబడుతుంది. దళితులు, వెనుకబడిన తరగతులు, తదితర బలహీన వర్గాల పరస్పర ఆధారిత సహకారం పారిశ్రామికాభివృద్ధికి సామాజిక పెట్టుబడిగా ఉపకరిస్తుంది. అభివృద్ధి అభ్యుదయంగా పరిణమిస్తుంది.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న విప్లవాత్మక మార్పులు సమాచార విప్లవం, వాటికి తోడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన అత్యధిక లాభాలను

పెట్టుబడులుగా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎగుమతి చేయడం ఒక నూతన పరిస్థితిని గత రెండు దశాబ్దాలుగా ఆవిష్కరిస్తున్నవి. ఈ ప్రపంచీకరణ పక్రియ అనేక సకారాత్మక పరిణామాలతో పాటు నకారాత్మక పరిణామాలకు కూడా కారణభూతమవుతున్నది. దేశ రాజకీయ, ఆర్థిక, సర్వం సహా అధికారాలను భద్రపరుచుకుంటూ దేశ అర్థికాభివృద్ధికి అవసరమైన వనరులను నిర్భయంగా విదేశీ పెట్టుబడులును ఆహ్వానిస్తూ రాబట్టుకోగలిగే రాజకీయ నాయకత్వం తప్పకుండా పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి రంగాలలో వేగవంతమైన అభివృద్ధిని సాధించగలుగుతుంది. అలాకాక శక్తిహీనతతో విదేశీ ప్రలోభాలకు గురి అవుతూ విదేశీ నిధులను సంపాదించి విలాసవంతమైన జీవితాలు గడిపిన అనుభవాలు కోకొల్లలు. దక్షిణ అమెరికా, దక్షిణ ఆసియా దేశాలు ఇందుకు ఉదాహరణలు. అందుకు విరుద్ధంగా చైనా, వియత్నాం లాంటి అగ్నేయ ఆసియా దేశాల అనుభవం చక్కని గుణపాఠాలను అందచేస్తున్నవి. చైనా మనకంటే వెనకబడిన దేశం, జనాభాలో మనకు మించిన దేశం. 1978 నుండి ఆర్థిక సంస్కరణలు చేపట్టి ప్రపంచీకరణ ఫలితంగా అందుబాటులోకి వచ్చిన విదేశీ పెట్టుబడులను పెద్దగా సంపాదించి చక్కగా, ప్రణాళికాబద్ధంగా భారీ పరిశ్రమలతో పాటు గ్రామీణ పరిశ్రమలను నెలకొల్పుతూ సామాజిక పెట్టుబడుల ఆధారంగా గ్రామీణాభివృద్ధిని అనతికాలంలో సాధించిన వాస్తవం అద్భుతం. పట్టణ, గ్రామీణ అభివృద్ధి క్రమాలలో ఏర్పడిన అసమతుల్య పరిణామాన్ని తొలగించాలని గ్రామీణాభివృద్ధిపై మరింత కేంద్రీకరించాలని అక్కడి అధికార పార్టీ నిర్ణయించడం ముదావహం.కాబట్టి ప్రపంచీకరణ అనగానే అదిరి బెదిరి పోవడం లేదా అంతా బాగుందని చిందులు తొక్కడం కేవలం అశాస్త్రీయం. ఈనాటి అభివృద్ధి పథాన్ని ప్రభావితం చేసే ప్రపంచీకరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకునే నేర్పరితనం, రాజకీయ సంకల్పబలం అవసరం.

గ్రామీణాభివృద్ధికి పటిష్టమైన స్థానిక స్వపరిపాలన సిద్ధాంతం, ఆచరణ, ఎంత ప్రధానమైనదో ప్రయివేటు రంగ పారిశ్రామిక, వాణిజ్య వ్యాపారాలు అంతే ప్రధానం. స్వాతంత్ర్యానంతరం సుమారు నాలుగు దశాబ్దాల కాలం ప్రభుత్వరంగ సంస్థల ద్వారానే బహుముఖ అభివృద్ధిని సాధించగలుగుతామనే విశ్వాసంతో ప్రణాళికలు రచించబడినవి. సగటు జాతీయాదాయం పెరుగుదల సామాజిక న్యాయం సాధన ఈ విధంగానే సాధ్యపడుతుందని నమ్ముకోవడం జరిగింది. మన అనుభవం విరుద్ధ ఫలితాలను అందించింది. అభివృద్ధి రేటు 3-4కి మించలేదు. ప్రభుత్వ రంగ పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార సంస్థలు సగానికి మించి ఖాయిలా పడిపోయినవి. మిగతా సంస్థలు లాభాలు గడించినా వాటి సమకాలీన ప్రైవేటు సంస్థలతో పోల్చినప్పుడు చాలా వెనుకబడిపోయినవి. జాతి సంపద పెరగనిదే సంపద పెంపకం గ్రామీణాభివృద్ధి సాధించడం దుర్లభం. కాబట్టి మన దేశీయ పారిశ్రామిక అవసరాలను గుర్తించడానికి దేశీయ ప్రయివేటు

పెట్టుబడులను, అవసరమైన చోట విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం అత్యవసరం. అప్పుడే దేశీయ పెట్టుబడిదారులు సంపాదించిన పెద్ద మొత్తాలలో నున్న పెట్టుబడులు దేశ జాతీయ ఉత్పత్తిని పెంచడానికి ఉపయోగపడతాయి. అంతమాత్రాన లాభాసాటిగానున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను వ్యతిరేకించడం వాటి ప్రయివేటీకరణ కోరడం అర్ధరహితం. గ్రామీణ పునరుజ్జీవనం, నిరుద్యోగ నివారణ, పేదరిక నిర్మూలన జరగాలంటే అర్థిక వనరులను సమకూర్చుకోవడం, గ్రామాలకు తరలించడం అత్యంత ప్రధాన రాజకీయ కర్తవ్యం. ప్రపంచీకరణ పక్రియను ప్రభుత్వరంగ లాభాలను ప్రయివేటు రంగ మిగులు నిధులను గ్రామీణాభివృద్ధి లక్ష్య సాధనకు ఉపయోగించుకోవడం దేశ ఆర్థిక స్వతంత్ర సాధనకు ప్రశ్నార్ధకం.

శరవేగంగా మారుతున్న ఈ నాటి సమాజం వినూత్న మానవ సంబంధాలను కోరుతున్న పరిస్థితిని చూస్తున్నాం. సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధిని సాధించాలంటే దేశ సంపదను వేగంగా పెంచుకునే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసియున్నది. అభివృద్ధిని మానావాభివృద్ధిగా గమనించవలసియున్నది. దళిత, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల స్త్రీ, పురుషులతో కూడిన సమాజంలో సుఖ శాంతులు నెలకొల్పడానికి స్వయం ఉపాధి, శాశ్వత ఉద్యోగ అవకాశాల రూపకల్పన తక్షణ కర్తవ్యం. అందుకు బహుముఖ రంగాలలో వ్యక్తులుగా, సంస్థలుగా మనవంతు కర్తవ్యాలను నిర్వహిస్తూ సామాజిక పెట్టుబడిగా నిలచే ప్రజాశక్తిని సృష్టించడం, పోషించడం దేశ భక్తులందరి కర్తవ్యం. ఈకర్తవ్య నిర్వాహణ ద్వారా ఎం.ఆర్. లాంటి ధన్య జీవులకు శ్రద్ధాంజలి ఘటించగలుగుతాం.

# విన్నూత్న విద్యా విధానం విస్మరించరాని తక్షణ జాతీయ కర్తవ్యం

సరస్వతి మందిరమైన భరత భూమికి విద్య, విద్యా విధానం ఈనాడు కరువైనది. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అనేక విద్యా వేత్తలు నూతన విద్యా విధాన ఆవిష్కరణకై తమ శక్తి సామర్థ్యాలను పరీక్షించుకుంటున్నారు. ఏకాభిప్రాయం కుదరక పోవడం, వారి మధ్య సమన్వయం సాధించకపోవడం, ఫలితంగా ఒక దిశా నిర్ధేశం జరగకపోవడం దురదృష్టకరం.

స్వాతంత్రానంతరం 55సం।ల తర్వాత 2002 సం॥లో 86వ రాజ్యాంగ సవరణ చేసుకున్నాం. దీని ద్వారా 6-14 సం॥ల వయస్సుకల బాల బాలికలందరికి విద్య ప్రాధమిక హక్కుగా నిర్దేశించుకున్నాం. 2005లో ఉన్నత విద్యా విషయక సలహా బోర్డు వారు ఇచ్చిన సూచనల ఆధారంగా ఒక చిత్తు విద్యా బిల్లును రూపొందించుకున్నాం. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం తమ రాజ్యాంగ బద్ద బాధ్యతను నిర్వహించడంలో క్షంతవ్యం కాని తాత్సార్యాన్ని ప్రదర్శిస్తున్నది. ధనా భావాన్ని సాకుగా చూపెడుతూ ఈ బాధ్యతను రాష్ట్రాల పైకి నెట్టుచున్నది. కేంద్ర విద్యా బిల్లు రూపొందించబడిన ఒక సం॥ర సుదీర్ఘకాలం తర్వాత ఈ బిల్లు వెలుతురులో రాష్ట్రాలు తమ విద్యా బిల్లులను రూపొందిస్తూ వాటిని చట్టాలుగా మార్చి అమలు పర్చుకోవలసిందిగా 2006లో ఉత్తర్వును పంపించింది. దీనితో అసలు బిల్లును వ్యతిరేకించే కొందరు, కేంద్ర బిల్లు వలన విద్యా వ్యాపారానికి ఇబ్బందులు కలుగుతాయని మరి కొందరు బిల్లు వాయిదా పడినందుకు సంతృప్తి చెందారు. విద్య పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా యుద్ధప్రాతిపదికపై విస్తరించవలసిన అగత్యాన్ని గుర్తించవలసిన కేంద్ర ప్రభుత్వం ధన భావం పేరిట తమ పైనున్న గురుతర బాధ్యత నుండి తప్పించుకోవడం దారుణం.

2002 నాటి మానవ వనరుల శాఖ సేకరించిన గణాంకాల సూచన ప్రకారం 6-14 సం॥ల వయస్సు కల బాల బాలికల సంఖ్య 21 కోట్లు. ఇందులో 3 కోట్ల బాలబాలికలు పాఠశాలల ముఖమే చూడలేదు. ఒకటి నుండి 8వ తరగతి వరకు పాఠశాలల్లో లాంఛనంగానైనా చేర్చబడిన 18 కోట్ల బాల బాలికలలో 52 శాతం అనగా 9 కోట్లకు మించిన బాల బాలికలు (DROP OUT) చదువు మానుకొంటున్నారు. అంటే

12 కోట్ల బాల బాలికలు 86వ రాజ్యాంగ సవరణ ఫలితాన్ని అనగా 8 సం॥ల నిర్బంధ ఉచిత విద్యాభ్యాసాన్ని పొందలేకపోతున్నారు. విద్యాలయాలలో చేర్చబడినట్లు చెప్పబడుచున్న 9 కోట్ల పిల్లలు వ్రాయడం, చదవడం అంకెలు నేర్చుకోవడం లాంటి కనీస స్థాయి నైపుణ్యతలను సాధించుకోలేక పోతున్నారు. ఇది మన ప్రభుత్వ విద్యాలయాల పరిస్థితి. మరొక కోణం నుండి విశ్లేషించుకుందాం. 6 - 14 సం॥ల వయస్సు కల 21 కోట్ల పిల్లలలో ఒకే ఒక కోటి మంది పిల్లలు 11 మరియు 12వ తరగతులలోకి చేరుతున్నారు. అంటే మరెన్ని కోట్ల బాల బాలికలు ప్రాథమిక విద్య స్థాయిలోనే విద్యకు దూరమైపోతున్నారన్నా వాస్తవం కండ్లకు కట్టినట్లు కనబడుచున్నది. ఇందులో అత్యధికులు పేదలు, దళితులు, ఆదివాసులు. ముఖ్యంగా ఆడపిల్లలు కావడం గమనార్హం. 86వ రాజ్యాంగ సవరణ ఫలితంగా రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆర్టికల్‌లో 21ఎ 4వ నిర్దేశించిన "6-14 సం॥ల వయస్సుకల పిల్లలందరికీ ప్రభుత్వం నిర్బంధంగా, ఉచితంగా విద్యాభ్యాస సౌకర్యాన్ని సమకూర్చుతుంది" అను ప్రాథమిక హక్కు ఆచరణలో నిరర్థకం చేయబడుచున్నది.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం 21వ శతాబ్ది ప్రపంచ పరిణామాలను గొప్పగా ప్రభావితం చేస్తున్నది. ప్రతి జీవన రంగానికి విజ్ఞాన (KNOWLEDGE) ప్రధాన చోదక శక్తిగానున్నది. మన దేశంలో కూడా ఒక KNOWLEDGE COMMISSION పని చేస్తున్నది. భారతావనిలో ఈనాడు సగటు వయో ప్రమాణం 25 సం॥లు కలిగిన యువతరం 52 కోట్లకు మించి వున్నారు. వీరిలో అత్యధికులు పేదలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన దీనులు, మహిళలు వున్నారు. నిరుద్యోగులుగానున్నారు. నిరుద్యోగానికి కారణం వారిలో కొరవడిన నైపుణ్యత (SKILLS) అను అంశం గమనార్హం. కాబట్టి మన సమస్య నిరుద్యోగం (UNEMPLOYMENT) కాదు. నిరుద్యోగిత (UN EMPLOYABILITY) మాత్రమే. మన విధాన రూపకర్తలు ఈ సత్యాన్ని పరిపూర్ణంగా గుర్తించగలిగితే ప్రపంచం ఊహిస్తున్నట్లు రానున్న అర్ధశతాబ్ది అనతికాలంలోనే భారతదేశం ఒక అగ్రగామి దేశంగా పరిణతి చెందగలుగుతుంది. ఇప్పటికే మన విద్యావిధానంలో ఎన్ని లోపాలున్నా కీడులో మేలుగా అనివార్యంగా ఇంగ్లీష్ భాష మాధ్యమంగా సాంకేతిక విద్యనభ్యసించిన లక్షలాది భారతీయ యువతీ యువకులు ప్రపంచంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటున్నారు. ప్రతి సం॥ వేల కోట్ల డాలర్ల నిధులను మాతృ దేశానికి తమ కానుకలుగా చెల్లిస్తున్నారు. మన విద్యా విధానం మౌళికంగా సంస్కరించబడి కాలానుగుణంగా తీర్చిదిద్దబడినట్లయితే ఈ విద్యాబలంతో మన దేశం బహుముఖాభివృద్ధి సాధించడానికి ఎంతోకాలం పట్టదు.

పైనుదహరించిన పరిమాణాత్మక, గుణాత్మక, శాస్త్రీయ విద్యా సంస్కరణలు పరిపూర్ణం కావాలంటే మరో మహత్తర సంస్కరణ కూడా అవసరం. విద్య ఉపాధికి సాధనం మాత్రమే కాదు. విజయవంతమైన జీవితానికి ప్రబల సాధనం. కాబట్టి మనం

ఆవిష్కరించబోయే నూతన విద్యా విధానం ఈనాటి విజ్ఞానయుగ ధర్మాన్ని పాటిస్తూనే యుగయుగాల కాల పరీక్షలను ఎదిరించి నిలదొక్కుకున్న భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల విలువలను బహుశ్రద్ధతో సంతరించుకోవలసి వున్నది. ''ధనం మూలం ఇదం జగత్'' కొంత వరకు నిజం కావచ్చు. కాని నీతి నియమాలు, మానవతా విలువలు, సర్వకాల సర్వావస్థలలో మానవ సమాజానికి, మానావాభివృద్ధికి ప్రాణ ప్రదం అనే పరమ సత్యాన్ని విస్మరించకూడదు. పైనుదహరించిన భౌతిక, ఆధ్యాత్మిక విలువలు అనుదినం సమకూర్చే సృజనాత్మక విద్యా విధాన ఆవిష్కరణ విద్యావేతల తక్షణ కర్తవ్యం.

గుణాత్మక మానవ వనరుల అభివృద్ధి ఉత్పత్తి రంగాలన్నింటిలో అత్యంత కీలకమైనదను విషయం నిర్వివాదాంశం. ఇందులో మన దేశం ఈనాటికి కూడా దక్షిణ అసియా, ఆగ్నేయ ఆసియా దేశాల కంటే వెనకబడి వుండడం స్వయంకృతాపరాధం. నైపుణ్యత గల శ్రామిక శక్తి మాత్రమే అధికోత్పత్తిని, విలువలతో కూడిన సంపదను సృష్టించగలుగుతుంది. ప్రాధమిక విద్య అత్యంత ప్రధానం. ఈనాటికి మన దేశ ప్రాథమిక పాఠశాలలకు మౌళిక సదుపాయల కొరత కొట్టవచ్చినట్లు అగుపడుచున్నది. గదులు, వాటికి కాంపౌండ్లు, మరుగుదొడ్లు కొరత, చివరకు బ్లాక్ బోర్డులకు కూడా దిక్కులేని పరిస్థితి వున్నది. సుశిక్షితులైన ఉపాధ్యయల కొరత, తదితర పరికరాల కొరత తీవ్రంగానున్నది. సాంప్రదాయబద్ధంగా బానిస విద్యా విధాన రూపకర్త మెకాలే (Mechale) నిర్మించిన విద్య విధానం స్థూలంగా కొనసాగుచున్నది. అర్ధ శతాబ్ధి అనుభవం తర్వాత అందరికీ విద్యా, ఒక విలాసం కాదని ఈ నాటి విజ్ఞానయుగంలో తక్షణ జాతీయ అవసరమని పాలకులు గుర్తించడం సంతృప్తికరం. విధానపర మౌళిక మార్పులు జరగకుండా సర్వశిక్ష అభియాన్ వలన వన గూరేది కాలదోషం పట్టిన నిరుపయోగమైన ప్రస్తుత విద్యను మరింత వ్యాపకంలోకి తేవడం మాత్రమే. సంతకం చేయగలగడమే అక్షరాస్యతకు నిర్వచనమనే భావం వలన ఒరిగేదేమి లేదు. కనీస వ్రాయ చదువు రావడం, గణాంక పరిచయం కలగడం ప్రమాణంగానుండక తప్పదు. ఈ వెలుతురులో మన దేశంలో ఇంకా 60 నుండి 70 కోట్ల వరకు నిరక్షరాస్యులు వుండటం తలవంపుకు కారణం. ప్రక్కనున్న చైనా దేశంలో 73 శాతం జనావళి అక్షరాస్యులుగానున్నారు. తదితర ఆసియా దేశాలలో కూడా గణనీయంగా నున్నది. వారినుండైనా మనం నేర్చుకోలేకపోవడం క్షంతవ్యంకాని నిర్లక్ష్యం. ఈ పరిస్థితులలో ప్రాధమిక విద్యకు కూడా నోచుకోలేని అభాగ్యులు నూటికి 50 వంతులకు తగ్గకుండా వున్నవారు పేదవారే. మధ్యతరగతి ఆపై తరగతి వారు ఎన్నో కష్టాలు పడుతూ తమ బిడ్డలకు మంచి పాఠశాలల్లో ప్రాధమిక ఉన్నత విద్యను నేర్పించగలుగుతున్నారు. ఆమాత్రం జరగడం

వలననే ఈనాడు గుణాత్మక విద్య కొందరికైనా అందుబాటులోకి వస్తున్నది. ఉపాధి అవకాశాలు కనుచూపు మేరలో కనబడుచున్నవి. అయినా అత్యధిక పేదలకు అది అందని మావిగా మిగిలిపోతున్నది.

మరొక కోణం నుండి పరిశీలించడం అవసరం. విజ్ఞానయుగ ఫలితంగా దేశ సుఖ సంపద విద్యపైననే ఆధారపడియుంటుంది. విద్య, ఆర్థిక, సామాజిక పరిణామక్రమాన్ని వేగవంతం చేస్తుంది. విద్య వలన ఉత్పత్తి సామాజిక స్పృహను ఇనుమడిస్తుంది. వస్తూత్పత్తి (Manufacturing) రంగం విస్తరిస్తుంది. సాంకేతిక శాస్త్రీయ విద్య కారణంగా నైపుణ్యత కలిగిన మానవశ్రమ ప్రధానమైన వస్తూత్పత్తి విస్తృతంగా జరుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ఉత్పత్తుల ఎగుమతి పెరుగుతుంది. దురదృష్టవశాత్తు మనదేశ ప్రణాళికాబద్ధ వ్యవస్థలలో మొదటి ప్రణాళికా కాలం నుండే విద్య గురించి శాస్త్రీయ అవగాహన పూర్తిగా లోపించింది. లాంఛన ప్రాయంగా మాత్రమే విద్యను గుర్తించడం జరిగింది. విద్య, ఆర్థిక అభివృద్ధి, ఉపాధికల్పనకై ప్రబల సాధనంగా ఉపయోగపడుతుందనే దార్శనికతలోపించింది. ప్రపంచవ్యాపితంగా 95శాతం 15-35 సం॥ల మధ్య వయస్సుకల యువతీ యువకులు వృత్తిపర నైపుణ్యత లేక వ్యాపార విద్యనభ్యసిస్తుండగా మన దేశం పూర్తిగా నిద్రావస్థలో నుండి పోయింది. కేవలం 2 శాతం విద్యార్థులు వృత్తిపర శిక్షణతో కూడిన విద్యనభ్యసిస్తుండడం అత్యంత బాధకర సత్యం. ప్రపంచంలో 2 - 2 1/2 వేల వృత్తులకు సంబంధించిన శిక్షణా తరగతులుండగా మన దేశంలో కేవలం 71 వృత్తులు పరిగణనలోకి రావడం మన ధృక్పథంలోని గ్రుడ్డి తనానికి తార్కాణం. వృత్తిని, వాణిజ్య వ్యాపారాన్ని బోధించగల కేంద్రాలు చైనాలో 5,00,000 జపానులో 10,00,000 దక్షిణ కొరియాలో 7,50,000 నుండగా మనదేశంలో 11,000 మాత్రమే నుండడం యాధృశ్చికం కాదు. 8 నుండి 10 సం॥లు ప్రాధమిక వున్నత పాఠశాలల్లో చదువుకున్న కోట్లాది యువతీ యువకులు ఏ పనికి కొరగాకుండా సమాజానికి భారంగా మిగిలిపోతున్న వైనం ఆశ్చర్యకరం. 1991 నుండి ప్రారంభమైన సరళీకరణ సంస్కరణ తర్వాత మానవ వనరుల అవసరం ఇనుమడించింది. అనేకానేక పరిశ్రమలలో నిపుణతలేని కార్మిక శక్తి పరిశ్రమల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నది. పరిశ్రమలు నిపుణత కలిగిన యువశక్తి కొరకు తపిస్తున్నాయి. విద్యాలయాలు, కళాశాలలు వారికి సమాధానం చెప్పలేక చింతిస్తున్నవి. ఇది ఈనాటి పరిస్థితి.

ఈ నూతన విద్యా విధానాన్ని త్వరితగతిన అమలు పరచాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకు గణనీయమైన ఆర్థిక వనరులను కేటాయించాలి. కేంద్ర ప్రభుత్వం 11వ పంచవర్ష ప్రణాళిక కొరకు రు. 2,74,228 కోట్లు కేటాయించినట్లు ప్రకటిస్తున్నారు. ఇది 10వ ప్రణాళికలో కేటాయించబడిన 62,461 కోట్లు కంటే అత్యధికం అనుకుంటున్నారు.10వ ప్రణాళికలో విద్యపై మొత్తం బడ్జెట్‌లో 7.68 శాతం కేటాయించగా

11వ ప్రణాళికలో ఇది 19 శాతానికి పెరిగినట్లు సంతోషిస్తున్నారు. దీనికి తగు మోతాదులు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు వాటాలను జతపరచవలసియున్నది. ఏది ఏమైనా ఈ నాటి ఆర్థిక, సామాజిక, ఉపాధి కల్పన కర్తవ్యాల నేపద్యంలో పై మొత్తాలు సరిపోవు. నిధులను ఇతోధికంగా పెంచకతప్పదు. కేటాయించబడిన నిధులు పూర్తిగా ఫలప్రదంగా, ఉపయుక్తంగా వెచ్చించబడే పూచీ, జవాబుదారీతనం అవసరం. విద్య దేశంలో ప్రతి బాలబాలిక ముంగిట వారిని అన్నివిధాల ఆకర్షించే విధంగా వినూత్న పద్దతులలో ప్రవేశపెట్టాలి. ఉపాధి కల్పనకు ఉపకరించే అనేకానేక వృత్తుల ఆధారంగా తీర్చిదిద్దబడాలి. ప్రాధమిక ఉన్నత కళాశాల విద్యను దాని పాఠ్యాంశాలను, ప్రయోగశాలలను పరస్పరం శాస్త్రీయంగా అను సంధానం చేస్తూ ప్రతి పంచవర్ష ప్రణాళిక కోట్లాది శ్రమైక వీరులను జాతికి అందించే బాధ్యతను నిర్వహించాలి. మానవ వనరులు మానవాభివృద్ధి, సామాజికాభివృద్ధికి ప్రాణ ప్రదమనే పరమసత్యాన్ని నమ్మూతూ ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలు ఈ దిశలో అంకిత భావంతో ముందడుగు వేయాలి. 'ఆలస్యం అమృతం విషం' దీనికి సంపూర్ణంగా వర్తిస్తుంది.

# భారతదేశ ప్రధమ స్వాతంత్ర సమరం (1857-58) సంస్మరణ

నూట యాభై సం॥ల క్రితం ప్రప్రధమంగా భారతదేశమంతా మేల్కొని బ్రిటీష్ సామ్రాజ్యవాదం, దాని ఈస్ట్ - ఇండియా కంపెనీ, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటాను ఎగురవేసింది. ఈనాడు భారత జాతి నలుమూలల ఈ మహోద్యమాన్ని సంస్మరించుకొంటున్నది. ఈ మహోద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు ముకుళిత హస్తాలతో నివాళులు అర్పిస్తున్నది. వారు అందించిన స్వాతంత్రంతా స్ఫూర్తిని మననం చేసుకుంటున్నది. జాతీయతను, లేక భారత జాతీయతకు పునరంకితమవుతున్నది.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాదు నగరానికి ఈ మహాధ్యమంతో అత్యంత సన్నిహిత కాదు ప్రత్యక్ష సంబంధం కలిగి యుండడం మన రాష్ట్ర ప్రజల అదృష్టం. 1857 జూలై 17 రోజున ఆనాటి హైదరాబాదు సంస్థానంలో అయిదు వందల మంది యువకులు సాయుధులై, నగరంలో నడిబొడ్డున బ్రిటీష్ రెసిడెంట్ కార్యాలయంగా నుండిన సుల్తాన్ బజార్‌లోని కోఠిపై సాహసోపేతంగా దాడి చేసారు. బ్రిటీష్ ముష్కరులను మట్టుబెట్టి రెసిడెన్సీని ఆక్రమించడానికి దండెత్తినారు. భరతమాత సంకెళ్ళను బ్రద్దలుకొట్టి దేశ విముక్తిని సుగమం చేద్దామనుకున్నారు. కాని సమరయోదులు శత్రుమూకల పశుబలాన్ని ఎదిరించడంలో విఫల మనోరధులు కాకా తప్పలేదు. శత్రుబలగాల ఎదురుదాడిలో వందలాది సమరయోధులు రక్తతర్పణ చేయక తప్పలేదు. దళనాయుకుడు తుర్రెబాజ్‌ఖాన్ తాత్కాలికంగా తప్పించుకున్నా తిరిగి శత్రువలయంలో చిక్కక తప్పలేదు. ఆ వీరుడు మాజీ సైనికుడు హంతకులు అతనిని కాల్చిచంపారు. అతని శవాన్ని అదే సుల్తాన్ బజార్‌లోని ఒక చెట్టుకు వేళ్ళాడగట్టారు. ఈ విధంగా స్వాతంత్రోద్యమ జ్వాలను చల్లార్పగలుగుతామనుకున్నారు. నిజమే. అసమాన బలం గలిగిన తిరుగుబాటు ఉద్యమం ఓడిపోయింది. కానీ భారతజాతిని అంతకుముందెన్నడూ కనివినీ ఎరగని విదంగా సమైక్యపరిచింది. బానిస బ్రతుకునుండి విముక్తిని సాధించవలసిన ఆవశ్యకతను అజెండాలోకి తెచ్చింది. స్వతంత్ర, సౌభ్రాత్రత్వం లాంటి మహోన్నత భావాలకు పదునుపట్టింది. కుల, మత, బాష, ప్రాంతీయ అడ్డుగోడలను ఛేదిస్తూ భారత భూమి సమైఖ్యతను, భరతజాతి గౌరవ ప్రపత్తులను ఇనుమడింపచేసింది.

ఈ మహోద్యమాన్ని ఓడించిన బ్రిటీష్ సామ్రాజ్యవాదులు, వారి అనుచరులు కేవలం సిపాయిల తిరుగుబాటుగా వర్ణించారు. సమకాలీన దేశ, విదేశీ చరిత్రకారులు ఈ తిరుగుబాటుకుగల కారణాలన్నింటిని సోదహరణంగా వివరించి దీనిని ఒక జాతీయ మహోద్యమంగా స్పష్టం చేసారు. ఆనాడు బ్రతికియుండి ప్రపంచ ప్రజా ఉద్యమాల స్వభావాలను విశ్లేషించిన సుప్రసిద్ధ విప్లవకారులైన కారల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌గారలు 1857 - 58 తిరుగుబాటును క్షుణ్ణంగా విశ్లేషించినారు. ఇది విధేశీ బానిసత్వానికి వ్యతిరేకంగా భారత ప్రజల వీరోచిత తిరుగుబాటని తేల్చి చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వం, భారత దేశ ఆర్థిక, సామాజిక జీవితాన్ని నాశనం చేసిన వుదంతాలను ఉటంకించారు. సహజసిద్ధమైన భూ అమరిక విధానాన్ని తల్లక్రిందలు చేసి నూతన భూస్వామ్య విధానాన్ని స్థాపించిన తీరు తెన్నులను, దానికి వ్యతిరేకంగా సామాన్య రైతాంగం నిర్వహించిన అనేక ఉద్యమాలను వివరించారు. రైతాంగంలో ఏర్పడిన తిరుగుబాటు భావాలు ఎత్తిచూపారు. అలాగే చేతివృత్తులపై ఆధారపడి నాణ్యతగలిగిన అనేకానేక వస్తువుల ఉత్పత్తిని, వాటి ఎగుమతి, దిగుమతి వ్యాపారాన్ని బ్రద్దలు కొట్టిన బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానాన్ని కండ్లకు కట్టినట్టు చూపించారు. ఉత్పత్తి సాధనాలను కోల్పోయి, ఉత్పత్తి ప్రక్రియను గత్యంతరం లేక వదులుకొని అలమటించిన కోట్లాది శ్రామికుల అక్రోశానికి అద్దం పట్టినట్లు ఎందరో చరిత్రకారుల రచనలు ఋజువుచేస్తున్నవి. 1813 వరకు భారతదేశం ఎగుమతి ప్రధానమైన దేశంగా ప్రసిద్దిలోకి వచ్చింది. ముఖ్యంగా చేనేత పరిశ్రమ, తదితర చేతి వృత్తుల ఉత్పత్తులు ప్రపంచవ్యాపితంగా భారతదేశానికి చక్కని కీర్తి ప్రతిష్టలను సంపాదించినవి. బ్రిటిష్ పరిపాలన ప్రారంభంతో ఈ పరిస్థితి క్రమక్రమంగా, అయినా అతి త్వరలోనే తల్లక్రిందులుగా మారింది. కోట్లాది శ్రామికులతోపాటు వారిపై ఆధారపడి వ్యాపారం చేసిన దేశీయ పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు నిశ్చేష్టులైపోయారు. విదేశీ వ్యాపారస్తుల దాడిని తట్టుకోలేక చివరకు వారి వ్యాపారాలలో గుమస్తాలుగా బ్రతకవలసిన దుస్థితి ఏర్పడింది.

ఈస్ట్ ఇండియా కంపెనీ వాటాదారులుగా ఇంగ్లండ్‌లోనున్న వారి కధనాలు చరిత్రలో చదివితే బ్రిటిష్ సామ్రాజ్యవాదం మన దేశ ఆర్థిక విధానాన్ని కొల్లగొట్టిన తీరు తెన్నులు ఆశ్చర్యకరంగా కనబడతాయి. భారత ప్రభుత్వం అది బ్రిటిష్ పరిపాలననే అయిన పరిపాలన ఖర్చుల నిమిత్తం ఇంగ్లండ్‌లొ వున్న బ్రిటిష్ ప్రభుత్వానికి చెల్లించిన ఋణాలు, అవి ప్రతి సంవత్సరం పెరిగిపోయిన మొత్తాలు ఆశ్చర్యం కల్పించక మానవు. అందుకని భారతదేశంలోని వివిధ రంగాలలో తమ బ్రతుకు భారాన్ని ఈడ్చుచున్న సామాన్య కష్టజీవులపై మోయరాని పన్నుల భారాన్ని వేయడం జరిగింది. వాటి వసూళ్ళలో ఆచరించబడిన నికృష్ట, నిర్బంధ విధానాలు ఊహాతీతంగా నుండినవి. ఈదేశ ప్రజలు, మానవులు కాదు కదా అడవి జంతువులకంటే హీనంగా చూడబడ్డారు. కరువు కాటకాలు, వరదల వాతబడిన ప్రజల కడగండ్లు ఊహతీతం. మానవ హక్కులు మాటే తెలియని

పరిస్థితి. ఈ నేపద్యంలో ప్రజలను చైతన్యవంతులను చేసి వారిని సంఘటిత పరచిన మహానుభావులెందరో తమ త్యాగపూరిత జీవితాలను అర్పించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం స్థానిక హిందూ - ముస్లిం, సిక్కు మతాలకు సంబంధించిన ప్రజల మనస్సులలో తమ స్వంత మతాలను కూడా ద్వేషించి క్రిష్టియన్ మతాన్ని ఆదరించే విధంగా మత మార్పిడి ప్రయత్నాలు చేసారు. దాని ఫలితంగా కూడా హిందూ, ముస్లిం మతాలకు చెందిన ప్రజలలో క్రిష్టియన్ మత వ్యతిరేక భావాలు చోటు చేసుకున్నవి. కంపెనీ దారులు, బ్రిటిష్ పాలకులు పరమతాన్ని తమపై రుద్దుతున్నారనే ద్వేషంతో ఈ తిరుగుబాటు ఉద్యమంలో పాల్గొన్నారు.

1857 - 58 తిరుగుబాటు ఓటమికి గురి కాబడిన తర్వాత నిర్వహించబడిన జాతీయ స్వతంత్ర ఉద్యమాలకి చక్కని గుణపాఠాలను అందచేసింది. అంతకుముందు ప్రాంతాలు, భాషలు, వివిధ రాజపీఠాలకు అక్కడక్కడా సైనికుల కోపతాపాలకు పరిమితమైన తిరుగుబాట్లు దేశవ్యాపిత తిరుగుబాటుగా మరింత అనుభవాన్ని అందించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం మత తత్వాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకోవాలని చేసిన కుయుక్తులను ఓడించి హిందూ - ముస్లిం సమైక్యతా భావాన్ని తెరమీదకి తెచ్చింది. అనేకానేక జాతీయవాదులు, వివిధ మతాలకు చెందినవారైనా జాతి విముక్తి ఉద్యమంలో భుజం భుజం కలిపి పోరాడవలసిన ఆవశ్యకతను స్పష్టం చేసింది. జాతీయ స్వతంత్రపోరాటం పైపై నున్న పెత్తందారులకు మాత్రమే పరిమితం కాకూడదని అందులో అణగారిన ప్రజాబాహుళ్యం యొక్క ప్రత్యక్షపాత్ర అత్యవసరం అను యదార్థాన్ని శిలాక్షరంగా రుజువుచేసింది. ఒక దేశ స్వతంత్ర సంగ్రామం ప్రపంచవ్యాపిత పీడిత ప్రజల విమోచన ఉద్యమాలతో అవిభాజ్యమని, సామ్రాజ్యవాదం సంపూర్ణంగా అభివృద్ధి నిరోధకమని, దాని అంతం ప్రపంచ ప్రజల కర్తవ్యంగా తెరమీదకి తేవడం జరిగింది.

స్వతంత్రానంతర 60 సం॥ల అనుభవం మనదేశ జీవితంలో గుణాత్మకమైన మార్పును ప్రదర్శిస్తున్నది. మన స్వరాజ్యం మనం కోరిన సురాజ్యానికి, సామ్యవాదానికి ఎంతో దూరంగా ఉన్నప్పటికీ సాధించుకున్న రాజకీయ ప్రజాస్వామ్యం సాధించుకోవలసిన సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యానికి మార్గదర్శకం అవుతున్నది. స్వతంత్ర, ప్రజాతంత్ర, సమత, సర్వసత్తాక సూత్రాలు మూర్తీభవించిన మన రాజ్యాంగ చట్టం మన చేతిలో ఒక ప్రబల సాధనం. 1857, ఆ తర్వాత స్వాతంత్ర సమరయోధులు అందించిన వరప్రసాదం.

# నవ దార్శనికత ఆవశ్యం

పరిణామం క్రమానుగతంగా, అర్థవంతంగా ముందుకు మున్ముందుకు నడిచే పక్రియ. ఈ ప్రక్రియ గత అనుభవాల నుండి గుణ పాఠాలను స్వీకరించి ఆచరించి ముందుకు సాగుతుంది. కాబట్టి నిత్య నూతన స్పష్టత, దార్శనికతతో వేగంగా పురోభివృద్ధిని సాధిస్తుంది. విప్లవం ఈ పురోభివృద్ధి క్రమములో ఏర్పడే గుణాత్మకంగా త్వరితగతిన సంభవించే గొప్ప మార్పు. ఇది పరిణామక్రమములోని అంతర్భాగం మాత్రమే. కాని పరిణామానికి ప్రత్యామ్నాయం కాజాలదు. సామాజిక మార్పుకు సంబంధించిన కారణాల గురించి ఆర్థిక, సామాజిక, మానసిక, రాజకీయ శాస్త్రవేత్తలు తమ అనుభవ సంపద నుండి సాధించిన సైద్ధాంతిక వెలుగుబాట "పరిణామం". ఆధునిక చరిత్రకారులు పరిణామశాస్త్ర ఆధారంగా, సామాజిక అభ్యుదయానికి శీఘ్రతర అభ్యుదయానికి శాస్త్రీయ పరిణామం ఏకైక మార్గమని రుజువు చేశారు.

చరిత్రకారులు జస్వాల్ సింగ్ సబర్వాల్ తమ సునిశిత విశ్లేషణ ద్వారా ఆంగుస్ మెడిసన్ సేకరించిన ప్రపంచ స్థూల జాతీయ ఉత్పత్తుల చరిత్రను ఉదహరిస్తూ ప్రపంచ నాగరికతా చరిత్రలో సుదీర్ఘకాలంలో భారత చైనా దేశాలు ప్రథమ, ద్వితీయ స్థానాలను అలంకరించియున్నాయని ఋజువు చేశారు. ఈ దేశాల పూర్వ వైభవాన్ని గుర్తు చేస్తూ వాటి ఆత్మవిశ్వాసాన్ని ప్రతిష్టించారు. ప్రపంచదేశాలలో స్థూల జాతీయ గణంకాలను ఆవిష్కరించారు. ప్రతి పరిణామం అభ్యుదయానికి దారి తీయదు. అభ్యుదయాన్ని కోరుకునే వ్యక్తులు, శక్తులు ఉద్దేశ పూర్వకంగా చైతన్యవంతమైన కృషిని ఒక పదార్థముగా సమకూర్చిన తరువాత పరిణామక్రమం అభ్యుదయాన్ని సాధించడంలో సఫలం అవుతుంది. అలాకాక అభ్యుదయ వ్యతిరేక శక్తులు ఇదే విధముగా తమ లక్ష్య సాధనకై ప్రయత్నిస్తే అది పరిణమించి ఒక బలమైన తిరోగమన శక్తి, ప్రతీపశక్తిగా మారుతుంది. కాబట్టి సత్ పరిణామం, దుష్ పరిణామంలు ఏర్పడతాయి. పరిణామ రహితంగా స్తబ్దత ఎంతోకాలం వుండదు. భారత, చైనాలతో పాటు అనేక దేశాల చరిత్రలను విశ్లేషిస్తే పైనుదహరించిన పురోగమన, తిరోగమన పరిణామాలు స్పష్టంగా కనపడతాయి.

## ప్రపంచ స్థూల ఉత్పత్తిలో శాతం

| క్రమ సంఖ్య | ఇండియా | చైనా | జపాన్ | అమెరికా | యూరప్ | తతిమ్మ ప్రపంచ దేశాలు |
|---|---|---|---|---|---|---|
| 1 ఎడి | 33 | 27 | 1 | 0 | 14 | 25 |
| 1500 ఎడి | 25 | 25 | 3 | 0 | 21 | 26 |
| 1820 ఎడి | 15 | 33 | 3 | 2 | 27 | 20 |
| 1870 ఎడి | 12 | 17 | 2 | 9 | 38 | 22 |
| 1913 ఎడి | 8 | 8 | 4 | 21 | 39 | 20 |
| 1950 ఎడి | 4 | 5 | 3 | 28 | 31 | 29 |
| 1973 ఎడి | 3 | 5 | 8 | 23 | 29 | 32 |
| 2001 ఎడి | 4 | 7 | 8 | 23 | 21 | 37 |
| 2008 ఎడి | 6 | 13 | 7 | 21 | 19 | 34 |

మానవుడు మనిషిగా అవతరించి సంఘ జీవిగా ఎదిగినది ఆఫ్రికా ఖండంలోనని, అక్కడి నుండే మానవజాతి ఇతర ఖండాలలోకి పయనించినట్లు చరిత్రకారులు చెప్పుచున్నారు. ఈ ప్రక్రియ సుమారు 40 వేల సం॥లుగా కొనసాగినట్లు చెప్పుతున్నారు. భారతదేశంలో అటవిక, ఆదిమ మానవ సమాజాలు 40 నుండి 50 వేల సం॥లు గడిపినట్లు కూడా చరిత్రకారులు అంచనాకట్టుచున్నారు. ఆ తర్వాతనే అనగా సుదీర్ఘ సంఘజీవిత పరిణామ ఫలితంగా ప్రకృతి రహస్యాలను తెలిసికుంటూ ఉత్పత్తి సాధనాల సాధనకు వాటి వినియోగానికి ఉపక్రమించినాడు. భారతదేశంలో క్రీస్తుకు పూర్వం కనీసం 3 వేల సం॥ల మానవ సమాజం సంఘ జీవితం గడుపుతూ జంతువుల వేటాడే దశ నుండి వ్యవసాయదారుని దశకు చేరుకున్నట్టు సంఘములో పని పంపకాలు కూడా చేసుకున్నట్లు అనేక సాక్ష్యాధారాలు ద్వారా ఋజువవుతున్నది. నాగరిక జీవితం గడుపుతు మంచి చెడులను నిర్ధారిస్తూ, సాంస్కృతిక విలువలకు రూపకల్పన చేసినట్లు వాటిని పోషించినట్లు వేద వేదాంతాలు, భారత భాగవతాలు, పురాణాలు వేన్నోళ్ళ స్పష్టం చేస్తున్నవి. అందుకే క్రీస్తుశకం 1 నాటికే ప్రపంచ స్థూల ఉత్పత్తిలో 33% ఉత్పత్తిని సాధించి భారతదేశం అగ్రగామిగా నిలిచినట్లు పైనుదహరించిన అంకెల ద్వారా చరిత్రకారులు రుజువు చేస్తున్నారు. ఆ తర్వాత స్థానాన్ని 27%తో చైనా అలంకరించడం కూడా అత్యంత ఆసక్తిదాయకం. ఈ రెండు దేశాల చరిత్ర అత్యంత

పురాతనమైనవి. యావత్తు ప్రపంచానికి నాగరికత సంస్కృతుల విలువలను ప్రసరింప చేసినట్లు స్పష్టంగా ద్యోతకమవుచున్నది. ఆ తర్వాత 1700 సం॥ల వరకు భారత్, చైనాలు తమ అగ్రగామి పాత్రను కోల్పోకుండా పరిరక్షించుకున్నట్లు తెలుస్తున్నది. 18వ శతాబ్దం ఆరంభం వరకు ఈ రెండు దేశాలు సంపూర్ణ స్వతంత్రం కలిగి ఉత్పత్తి శక్తులు వాటి సాంకేతికతలో అధికృత కలిగి యుండినవి. 18వ శతాబ్ది నుండి 20 శతాబ్దం చివరి వరకు ఈ రెండు దేశాలు ఆశ్చర్యకరంగా పతనావస్థలోకి కూరుకుపోయినవి. దీనికి ఎన్నోకారణాలు వున్నవి. అంతరంగిక తిరోగమనంతో పాటు ప్రపంచదేశాలు ముఖ్యంగా యూరప్ దేశాలు ఉత్పత్తి సాధనాల సృష్టి, వినియోగంలో ముందుకు దూసుకొని పోవడం ముఖ్యకారణం. యూరప్‌లో ఏర్పడిన పారిశ్రామిక విప్లవం, అమెరికా సంయుక్త రాష్ట్రాల (USA)ఆవిర్భావం, చైనాలో మింగ్ మరియు కింగ్ రాచరికాల కాలంలో పొందిన పతనం, బ్రిటిష్ సామ్రాజ్య పాలనలో భారతదేశం కోల్పోయిన స్వతంత్ర ప్రతిపత్తి మొదలగు కారణాలు స్పష్టంగా కనబడుచున్నవి. 20వ శతాబ్దంలో చైనాలో సంభవించిన అంతర్యుద్ధం ఆ తర్వాత మావో అనుసరించిన తీవ్రవాద, ఉగ్రవాద విధానాలు ఇటీవల కాలంలోనే గొప్ప తిరోగమన పరిణామాలకు మూలకారణాలన్నది సుస్పష్టం. అయితే స్వతంత్రం చరిత్రగమనాన్ని పూర్తిగా మార్చి వేసింది. 1978 నుండి చైనా అన్ని రంగాలలో సంస్కరణల బాట నడిచింది. ఉత్పత్తి సాధానాలు, ఉత్పత్తి పెరుగుదల, వాటి పంపకం, ప్రపంచ వ్యాపితంగా ఆవిష్కరించబడు చున్న జ్ఞాన విజ్ఞానాన్ని సంపాదిస్తూ దానిని తమ దేశ పరిస్థితులకు అన్వయింపచేయడం గొప్ప సిద్ధాంత కర్తవ్యంగా రూపొందించుకున్నది. దీనితో చైనా దేశాభివృద్ధి బహుముఖంగా శరవేగంగా జరుగుతూ పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునే స్థాయికి చేరుకోవడం చరిత్రలోనే గొప్ప అభ్యుదయ పరిణామం.

భారతదేశం స్వతంత్రానంతరం 40 సం॥లు వరకు సాధించిన అభివృద్ధి కేవలం నత్తనడకతో పోల్చదగినది మాత్రమే. సోవియట్ రష్యా తదితర సోషలిస్టు దేశాల మార్గాలను స్థూలంగా తమ ఆదర్శంగా ఎంచుకున్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూగారి దార్శనికత వేగవంతమైన అభివృద్ధికి ఆస్కారం కలిగించలేదు. ప్రపంచ అనుభవాల నుండి దూరంగానుంటూ స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ పేరుతో దిగుమతులకు ప్రాధాన్యతనిస్తూ శాస్త్ర, సాంకేతిక ప్రగతిని ప్రోత్సహించకుండా దేశపారిశ్రామిక ఆర్థిక పురోభివృద్ధిని స్తంభింపచేయడం జరిగింది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటు 2-3 శాతానికి పరిమితమయిపోయింది. ఫలితంగా దేశ సంపద పెరుగుదల మందకొడిగా కొనసాగింది. సంపద పంపకం కూడా లాంఛన ప్రాయంగా జరిగింది. 20వ శతాబ్ది ఉత్తరార్ధ భాగంలో ప్రపంచవ్యాపితంగా కొనసాగిన శాస్త్ర, సాంకేతిక విప్లవాల ప్రభావం, ప్రపంచీకరణ ప్రభావం బలహీనంగానున్న భారత ఆర్థిక వ్యవస్థపై పడినది. దేశ ఆర్థిక విధానం తీవ్రమైన ద్రవ్య సంక్షోభం కారణంగా చతికిలపడిపోయింది.

దేశ సంపదగా నున్న అనేక టన్నుల బంగారాన్ని బ్రిటన్ బ్యాంకులలో తాకట్టు పెట్టింది. ఆర్థిక వనరులను సమకూర్చుకోక తప్పలేదు. అప్పుడు అనగా 1991లో ఆర్థిక సంస్కరణల అవసరం గుర్తుకువచ్చింది. అంతకుపూర్వం అనుసరించిన విధానాలకు బదులు సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణల నేపథ్యంలో స్వదేశీ, స్వతంత్ర ఆర్థిక విధానాలకు బాటలు వేయడం జరిగింది. దేశ ఆర్థిక స్వతంత్రత కొరకు ఏ మాత్రం భంగం కలగకుండా, అటు అభివృద్ధి వేగాన్ని పెంచే లక్ష్యంతో పారిశ్రామిక, వాణిజ్య వ్యాపార సంస్కరణలు చేపట్టడం జరిగింది. 15 సం॥ల అనతికాలంలోనే దేశ సంపదల పెరుగుదల రేటు 9 శాతానికి చేరుకోవడం పై సంస్కరణల ఫలితంగా అని గుర్తించడం జరుగుచున్నది.

ఈ సంస్కరణలను మహోద్యమంగా నిర్వహించి దేశ పురోభివృద్ధిని, సంపదను ఇతోధికంగా పెంచుకోవడం సంస్కరణల ఫలితాలను సామాన్య శ్రమజీవులకు అందచేస్తూ వారి పేదరికాన్ని త్వరత్వరగా తగ్గిస్తూ ఒక దశాబ్ధి కాలంలోనే దానిని నిర్మూలించడం ప్రధాన లక్ష్యముగా దేశ నాయకత్వం ఎన్నుకోవలసి యున్నది. ఒకటిన్నర దశాబ్ధం సరళీకరణ అనుభవాలు మరొక జటిలమైన సమస్యను ఎత్తి చూపుచున్నవి. పైనుదహరించిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అంశాలు సంపూర్ణంగా తమ ఆర్థిక ప్రయోజనాలను, ప్రాబల్యాలను పెంచడానికి ఉపయోగించాలని మన దేశ ధనిక వర్గాలు, దేశ, విదేశీ బహుళజాతి సంస్థల సంపూర్ణ సహాయ సహకారంతో సాధించాలని ప్రయత్నిస్తున్నాయి. దేశంలో బహుళజాతి పెట్టుబడి నాయకత్వంలో ఇక్కడి అశేష మానవ వనరుల శ్రమ శక్తిని కారుచౌకగా కొల్లగొట్టాలని కుటిల ప్రయత్నాలు జరుగుచున్నవి. జనాభాలో ఇప్పటికే 68% ఆధారపడియున్న వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడానికి మందకొడిగా అభివృద్ధి క్రమంలోనున్న వస్తూత్పత్తి (Manufacturing) కుటీర పరిశ్రమలను నిర్లక్ష్యం చేసే పరిస్థితులు ప్రస్ఫుటంగా అగుపడుచున్నవి. వేగంగానే అభివృద్ధి చెందుతున్న సేవారంగాన్ని బహుళజాతి వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తూ దేశ ఆర్థిక విధానాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే దేశ స్థూల జాతీయ ఆదాయం పెరుగుదల రేటు రెండంకెలు దాటినప్పటికి దేశ స్వతంత్ర ఆర్థికాభివృద్ధి, పేదరిక నిర్మూలన ఒక కలగానే మిగిలిపోతుంది. దేశ ధనాఢ్య వర్గాలు కొట్లకు పడగెత్తవచ్చు. ప్రపంచ ధనవంతుల శ్రేణిలో అగ్రతాంబులాలు పొందవచ్చు. కానీ దేశంలో ధనవంతులు, పేదల మధ్య అంతరం మరింత పెరిగిపోతుంది. తలసరి ప్రతిరోజు ఆదాయం 20 రూ॥ మాత్రమే కలిగిన 83 కోట్ల మంది జనం శాశ్వతంగా పేదరికంలో మ్రగ్గిపోతారు. సమయం మించి పోకముందే ఆర్థిక ప్రజాస్వామ్యం, సాంఘిక న్యాయం కోరే అతివాద ప్రజాతంత్ర వాదులు పెరిగిపోతున్న "కార్పోరేట్ చోదక అభివృద్ధి" మార్గాన్ని అడ్డుకోవాలి. పారిశ్రామిక వస్తూత్పత్తి రంగం ప్రధానంగా వ్యవసాయ రంగం పురుజ్జీవనానికి

ఉద్యమించాలి. లేనిచో విశృంఖలంగా విస్తరిస్తున్న బహుళజాతి సంస్థలు తమ ధన బలంతో బలహీన దేశాల ఆర్థిక స్వతంత్రాన్ని హరింపచేస్తూ అక్కడ కారుచౌకగా లభించే మానవశ్రమను కొల్లగొడుతూ ఆయా దేశాల ఆర్థిక స్వతంత్రాన్ని, సంపద పెరుగుదలని పూర్తిగా అణిచివేసే ప్రమాదం పొంచియున్నది. ఒకసారి ప్రపంచ సంపద సృష్టిలో ఈనాడున్న దారుణమైన అసమానతలను తొలగించడం అవసరం. ఈనాటి ప్రపంచంలో ఆర్థిక సంపద పంపకం అత్యంత జుగుప్సాకరంగా నున్నది. బాధ్యతగల ఒక అంచనా ప్రకారం ప్రపంచ స్థూల జాతీయ ఉత్పత్తి 33 ట్రిలియన్ డాలర్లు. అందులో 13 ట్రిలియన్ డాలర్ల సంపద 30 కోట్ల జనాభా కలిగిన అమెరికా దేశానిదే. ఆస్ట్రేలియా, జపాన్ మరియు యూరప్‌లోని అభివృద్ధి చెందిన సుమారు 40 కోట్ల జనాభాకలిగిన దేశాల స్థూల జాతియోత్పత్తి మరొక 13 ట్రిలియన్ డాలర్ల కోట్లు. మిగిలిన 7 ట్రిలియన్ కోట్లు సంపదను సృష్టిస్తున్న దేశాలు సంఖ్యలో 80 కాగా వాటి జనాభా మొత్తం 265 కోట్లు. ఒక ట్రిలియన్ అనగా 100 బిలియన్లు. ఒక బిలియన్ అనగా 100 కోట్లు. వీటిని రూపాయలతో అర్థం చేసుకొవాలంటే రూ॥40తో గుణించవలసి యుంటుంది. 100 కొట్లకు పైగా జనాభా కలిగి గత సం॥ భారత జాతీయ స్థూల ఉత్పత్తి ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నందుకు మనం గొప్పగా చెప్పుకున్నాం. పై అంకెల వెలుతురులో మనం సాధించిన ఆర్థిక ప్రగతి ప్రపంచ చిత్ర పటంలో ఎంత మాత్రముందో గమనార్హం.

శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు చక్కని ప్రత్యామ్నాయ మార్గాన్ని ఆవిష్కరిస్తున్నవి. సాంప్రదాయ వ్యూహమైన భారీ పరిశ్రమల నిర్మాణం, కుటీర పరిశ్రమలు కనుమరుగు కావడం, వ్యవసాయం దాదాపు మృగ్యం కావడం ఈ కాలానికి పూర్తిగా అసంబద్ధం. జన సాంద్రత కలిగిన భారత్ - చైనాలాంటి దేశాలు శ్రామిక జనావళికి మానవ శ్రమ ప్రధానమైన స్వయం ఉపాధి సిద్ధాంతంతో త్వరితగతిన పేదరికాన్ని తొలగిస్తూ నిర్మూలించడానికి వ్యూహాత్మకంగా వినూత్న దార్శనికతను రూపొందించుకోక తప్పదు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తూ జన బహుళ్యానికి ఉపాధిని సమకూర్చగలిగే పరిశ్రమ వ్యవసాయం. వ్యవసాయాధారిత పరిశ్రమలు, వస్తూత్పత్తి పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు మాత్రమే. ఈ నాటి శాస్త్ర సాంకేతిక, జీవ సాంకేతిక ఆవిష్కరణలను శ్రమ ప్రధానమైన వృత్తులు, వుద్యోగాలకు వర్తింపచేస్తూ ప్రజలకు ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు జాతీయ ఉత్పత్తిని, సంపదను పెంచుకోగలుగుతారు. ఇటువంటి వ్యూహాత్మక పరిణామం వేగవంతంగా జరగాలంటే ప్రభుత్వం, ప్రయివేటు రంగాలు తమ తమ వనరులను ఇటువైపు పెద్దగా మళ్ళించడం అత్యవసరం. మౌళిక సదుపాయాల నిర్వహణ జన బాహుళ్యం యొక్క భాగస్వామ్యం సాధించడానికి వనరుల మళ్ళింపే అనివార్యం. ఈ దిశలో ఈనాడున్న సాంప్రదాయబద్ధ వ్యవస్థలను సంస్కరిస్తూ సంబంధించిన వారి భాగస్వామ్యాన్ని నెలకొల్పుతూ కొత్త సంస్థలను, వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవలసి

యుంది. మానవాభివృద్ధి లక్ష్యం కలిగిన వారంతా ఈ వినూత్న దార్శనికతను అనుసరించక తప్పదు. పట్టణాలు, గ్రామాలమధ్య తారతమ్యం తగ్గడానికి వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి నిత్యం హరిత వాతావరణం ద్వారా కలుషిత జీవితాలను పునరుజ్జీవింపచేయడానికి ఇదే సన్మార్గం.

రాజకీయ నాయకత్వం ఇటువంటి దార్శనికతతో సమైఖ్యంగా నయా ఉదారవాదం సృష్టిస్తున్న భయంకర భవిష్యత్తును నిలువరించడం అత్యవసర కర్తవ్యం. ప్రపంచీకరణను ప్రజాస్వామ్య ప్రపంచీకరణగా, ప్రయివేటీకరణను ప్రజోపయోగంగా, సరళీకరణను సర్వజన సంక్షేమ లక్ష్యంగా మలుచుకోవడం అత్యవసరం. ఇటువంటి పరిణామం తనంతట తాముగా సంభవించడం సాధ్యపడదు. అభ్యుదయ వాదులు, రాజకీయ సంకల్పబలంతో సుసంఘటిత ప్రజాచైతన్య శక్తితో మాత్రమే సాధించగలుగుతారు.

# సృజనాత్మకత ఆర్య సమాజ ఆవశ్యకత

బాల్యం నుండే ఉన్నతమైన ఆలోచనలకు, సత్‌ప్రవర్తన కొరకు స్ఫూర్తి నిచ్చిన ఆర్యసమాజం గురించి, ఆర్యసమాజ ఉద్యమ నేత పండిట్ నరేంద్రజీ గురించి వారి స్మారికలో నా భావాలను వ్యక్తపరచే భాగ్యం కలిగినందుకు ఆనందిస్తున్నాను. ఆర్య సమాజం భారతదేశంలో బలోపేతమైన సంఘ సంస్కరణ ఉద్యమముగా ఆవిర్భవించింది. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలలో దేదీప్యమానంగా వెలుగొందుచున్న, సాత్విక చింతన సద్భావన, సత్‌ప్రవర్తనలను వికసించేసే సత్యాన్ని తమ "సత్యార్థ ప్రకాష్" ద్వారా ప్రపంచాన్ని మేల్కొలిపిన స్వామి దయానంద సరస్వతి ఆధునిక భారత రత్నగా కలకాలం నిలిచియుంటారు. స్వాతంత్రోద్యమ కాలంలో దేశవ్యాపితంగా ఆర్యసమాజం మూఢనమ్మకాలు, అజ్ఞాన అంధకారం, కుల, మత అడ్డుగోడలు సృష్టించిన దేశ అనైక్యతను తొలగిస్తూ చైతన్యవంతమైన ఐక్యతను, ఆత్మగౌరవాన్ని ఆకాశానికందే విధంగా చాటి చెప్పింది. వలస వాదులైన బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా నిర్మించబడిన స్వాతంత్రోద్యమంలో అనన్య సామాన్యమైన సమరశీల పాత్రను పోషించింది. భారతీయ ధర్మ ప్రచారాన్ని పోషించింది. భారతీయ ధర్మ ప్రచారాన్ని విదేశీ బానిసత్వ వ్యతిరేక మహోద్యమంతో మేళవింపచేసింది.

స్వాతంత్రానంతరం ఆరు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో ఆర్య సమాజం "స్వతంత్రత"ను సార్థకం చేయడానికి శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేసింది. చేస్తూ ఉన్నది. భారతీయ సాంస్కృతిక విలువలను, ఆ విలువలను పోషించే బాధ్యతల నిర్వహణలో సంఘ సంస్కర్తలు, రాజకీయ నాయకుల దృష్టిని ఆకర్షించడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నది. స్వాతంత్ర సమరయోధుల సందేశాన్ని యువతరాలకు అందించడానికి సర్వప్రయత్నాలు చేస్తున్నది. హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమంలో వేగుచుక్కలా వెలిగిన ఉక్కు మనిషి పండిట్ నరేంద్రజీ శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న ప్రక్రియ దీనికి ప్రబల నిదర్శనం.

ఆర్య సమాజం తదితర ప్రజాసంస్థల రాజకీయ పార్టీల సదుద్దేశాలు ఎలా వున్నప్పటికి స్వతంత్రానంతర పరిణామాలు మరో విధముగా నుండడం దేశభక్తులందరిని కలవర పెడుతుండడం కాదనలేని వాస్తవం. చక్కని రాజ్యాంగ చట్టాన్ని ఆమోదించుకొని అర్థశతాబ్ది గడించింది. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థల రూపకల్పన చేసుకొని

ప్రణాళికాబద్ధ ఆర్థిక సామాజికాభివృద్ధి సిద్ధాంతాల రూపకల్పన చేసుకుని ఆరు దశాబ్దాలు కావస్తున్నది. అయినా సామాన్య భారతీయుడు స్వతంత్ర పౌరుడుగా తల ఎత్తుకొని తిరగలేక పోవుచున్నాడు. విద్య, విజ్ఞానం ఆధారంగా స్వయం ఉపాధి సాధించలేక పోతున్నాడు. పరిశ్రమ ద్వారా దేశ సంపద సృష్టి క్రమంలో పాల్గొనలేకపోతున్నాడు. కుల, మత అడ్డుగోడల కారణంగా సాధించబడిన జాతీయ సమైక్యతను కూడా కాపాడలేక పోతున్నాడు. మూర్ఖత్వం, మూఢ నమ్మకాల ఉక్కు పంజరం నుండి అత్యధిక భారతీయులు విముక్తిని సాధించలేక, ఆధునిక నాగరికతా ప్రపంచంలో స్వాతంత్ర స్ఫూర్తిని పొందలేక పోతున్నారు. ఈ పరిస్థితికి గల కారణాలను తెలిసికోవడం అసాధ్యముకాదు. మానవ హక్కులను, మానవీయ విలువలను పూర్తిగా విస్మరిస్తూ ఆధునిక నాగరికత పేరుతో స్వార్థపరులు, పరాన్న జీవులు అధికార పీఠాలను అధిరోహించడమే ప్రధాన కారణం. తమ రాజ్యాధికారాన్ని కొనసాగించడానికి వేద కాలం నుండి పోషించబడుచున్న సమత, మమత, సౌహార్ధత, సౌశీల్యత లాంటి విశ్వవ్యాపిత విలువలను విస్మరించడం, అణచివేయడం ఒక ఆధునిక నాగరికతగా నమ్మచెప్పడం ముఖ్యకారణం. ఇదే ఒక సిద్ధాంతంగా వివిధ రూపాలలో అన్ని సామాజిక జీవనరంగాలలో ఆరాధించబడడం ఆందోళనకర పరిణామం. ఫలితంగా సామాజిక, ఆర్థిక ముఖ్యంగా రాజకీయ రంగాలు కలుషితం కావడం ప్రజాబాహుళ్యం యొక్క జీవితాలు సంస్కరించలేని దుస్థితిలో నుండి పోవడం అత్యంత బాధాకరమైన పరిస్థితి. ఇది ఇలాగే కొనసాగితే భారతదేశం సంపన్న దేశంగా మెరిసి పోయినప్పటికి అత్యధిక భారతీయులు అన్ని రంగాలలో వెనకబడి పోవడం కుల, మత విబేధాలు పెచ్చరిల్లడం ఆర్థికంగా చితికి పోవడం ఏమాత్రం ఆశ్చర్యకరం కాదు.

ఈ దుష్పరిణామాన్ని అడ్డుకొని స్వతంత్ర ఫలాలను అన్ని వర్గాలకి, ప్రాంతాలకి సమతుల్యంగా అందచేసే సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని మరో స్వాతంత్ర మహోద్యమంగా నిర్వహించవలసియున్నది. భారతీయ సంస్కృతి - సాంప్రదాయాలు వాటి నుండి జన్మించి దేశ స్వతంత్రాన్ని సాధించిన సమరయోధులు విసురుతున్న సవాలు ఇది. దీనికి సమాధానం దేశ వ్యాపిత ప్రజాఉద్యమాలు మాత్రమే ఇంకా చీకటి కోణాలలో మ్రగ్గియున్న భారతీయులను తట్టి మేల్కొలపాలి. తమ జన్మహక్కు అయిన ఆర్థిక, రాజకీయ స్వతంత్ర స్ఫూర్తిని అందించాలి కుల, మత ప్రాంతీయ తత్వాల అడ్డుగోడలు తొలగించాలి. భారత జాతీయత, భిన్నత్వంలో ఐక్యత, సమత, మమత, సద్భావన లాంటి ధర్మాలను ప్రతిష్టించాలి. వీటి పరిరక్షణ కొరకు కోట్లాది గ్రామీణ, పట్టణ శ్రమైక జీవుల ప్రజాశక్తిని నిర్మించాలి. ఇటువంటి సామాజిక పెట్టుబడి మాత్రమే నవ భారత నిర్మాణానికి నాందిగా నిలుస్తుంది.

సత్యం, ధర్మం, విద్యా-విజ్ఞానం లాంటి భారతీయ తాత్విక చింతనల సాంద్రత నుండి పుట్టి పెరిగి కాల పరీక్షలను తట్టుకున్న ఆర్య సమాజ నిర్వాహకులు, నాయకులు, అనుచరులు పైనుదహరించిన శూన్యాన్ని పూరించగలుగుతారు. సనాతన ధర్మ ప్రచారకుల పరిమితులను ఆధిగమించి ఆధునిక విజ్ఞానయుగ ధర్మంతో మేళవించగలుగుతారు. సనాతన ఆధునిక యుగ ధర్మాల మధ్య వంతెనలు నిర్మించగలుగుతారు. ఈనాటి శాస్త్రసాంకేతిక యుగ ఫలితంగా ఏర్పడుతున్న ప్రపంచీకరణ నేపథ్యాన్ని ఫలప్రదంగా వినియోగిస్తూ, అన్యవర్గాల అక్రమాలను నిలువరిస్తూ స్వతంత్రత ఫలితాలను పామర జనానికి అందించే బాధ్యతలను, ప్రబల సాధనాలుగా వినియోగించగలుగుతారు. ఆర్య సమాజ కేంద్రాలను విరివిగా విస్తరించి లక్షలాది యువతీ, యువకులను రెండవ స్వతంత్ర పోరాట యోధులుగా తీర్చిదిద్దగలుగుతారు. రాజకీయ పార్టీలకు అతీతముగా నుంటూ రాజకీయ కార్యకర్తలలో నూతన దేశభక్తి, అంకిత భావాన్ని సృష్టించగలుగుతారు. ఆర్యసమాజం తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తూనే భారత జాతికి నిజమైన సాధికారత, సర్వసత్తాక శక్తిని సాధించడానికి తోడ్పడగలుతారు. సృజనాత్మక ఆర్యసమాజం యొక్క అవసరాన్ని గుర్తించడం నా కర్తవ్యం.

# రెండవ స్వతంత్ర పోరాటం అవసరం

స్వాతంత్ర సమరయోధులమైన మనకు పై శీర్షిక ఆశ్చర్యాన్ని కలిగించదు. "స్వతంత్రం" అనగా విదేశీ పాలన నుండి విముక్తిని సాధించడం మాత్రమే కాదు. శతాబ్దాల తరబడి దుర్భర జీవితాన్ని గడిపిన కొట్లాది భారతీయ శ్రమ జీవులు తమ జీవితాలు బాగు పడాలని నాగరికతా ప్రపంచంలో సముచిత స్థానాన్ని అలంకరించాలని తమ శ్రమకు తగిన ప్రతిఫలం అందాలని అందుకు ప్రధాన ప్రతిబంధకంగానున్న విదేశీ, స్వదేశీ బానిస బంధనాలను బ్రద్దలు కొట్టాలని వుద్యమించినారు. అమరజీవి భగత్‌సింగ్ రాసిన వుత్తరాలు, చేసిన ప్రసంగాలు ఇందుకు ఒక మచ్చుతునక. తెల్ల దొరల పరిపాలనను కూల్చివేసి నల్లదొరల పరిపాలనను కొనుక్కోవడం విప్లవవీరుల ఉద్దేశం కాదన్నారు. సమ సమాజం దిశలో సాంఘిక న్యాయాన్ని సాధించడం సమరయోధుల కర్తవ్యమని ప్రబోధించారు. "స్వతంత్రం" గురించి మహాకవి, భరతజాతి సాంస్కృతిక ప్రతినిధి, ప్రధమ నోబెల్ బహుమతి గ్రహీత, గీతాంజలి రచయిత అమరజీవి రవీంద్రనాధ్ ఠాగూర్ విస్తృతమైన బహుముఖమైన అర్ధాన్ని ఈ క్రింది విధంగా ప్రచురించారు.

- "నిర్భయంగా తల ఎత్తుకు తిరగ గలిగే;
- విజ్ఞానం విశృంఖలం కాగలిగే;
- సంకుచిత అడ్డుగోడల ఫలితంగా విశ్వం ముక్కలు ముక్కలుగా చీలిపో వీలులేని;
- సత్య సౌధాంతరాల నుండి మాత్రమే మాటలు వెలువడేటి;
- అవిశ్రాంత పరిశ్రమ మాత్రమే పరిపక్వతకు మూలాధారం కాగలిగే;
- మూర్ఖత్వం మూఢనమ్మకాల అలవాట్ల ఎడారిలో హేతువాద సజీవ స్రవంతి తన దారిని కోల్పోవీలులేనటువంటి;

నీచే ముందడుగు వేయబడే మనస్సు, బుద్ధి, నిత్యనూతన వికాసం, విస్తృతి పొందే ఆలోచనలు, ఆచరణలు కలిగినటువంటి స్వర్గధామమైన "స్వతంత్రం" లోకి, తండ్రీ, నాదేశాన్ని మేల్కొలుపు".

ఇటువంటి స్వతంత్రాన్ని మనదేశం, రాష్ట్రం ఎంత వరకు సాధించింది? సమర యోధులతో పాటు ఈనాటి దేశభక్తులంతా వేసికొంటున్న ప్రశ్న ఇది. సరియైన సమాధానం

రాక సందిగ్ధావస్థలో సతమతమవుతున్న సందర్భమిది. 60 సం॥ల సుదీర్ఘకాలం తర్వాత ఇంకా ఈ ప్రశ్న అగమ్యగోచరంగా మిగిలియుండడానికి కారణం కేవలం అవగాహన రాహిత్యం.

మన దేశ అభివృద్ధికి అర్థం మారుతున్నది. విదేశీ పాలన విరగడ కావడంతో దేశం అభివృద్ధి పథంలో అడుగు పెట్టిందని నమ్మినవారు కొందరు దేశ సంపద పెరుగుదల అభివృద్ధికి ప్రబల సంకేతమని మరి కొందరు అభివృద్ధి అతి సామాన్యుని నిజజీవితంలో వికాసాన్ని దర్శించడం మాత్రమేనని మానవీయ ధృక్పధాన్ని ఆవిష్కరిస్తున్న అమర్త్యసేన్, కీ॥శే॥పాకిస్థాన్ నివాసి మఖ్బూల్ ఉల్‌హక్ లాంటి అత్యాధునిక మానవ శాస్త్రవేత్తలు.

2007లో మన దేశం ఆర్థికాభివృద్ధి రేటు 9 శాతానికి తగ్గకుండా నున్నట్లు అన్ని సూచికలు తెలియచేస్తున్నవి. అయినప్పటికి మానవాభివృద్ధి రేటు అతి స్వల్పంగానున్నట్లు కూడా వాస్తవాలు ఋజువుచేస్తున్నవి. ఇటీవల శ్రీ పి. సాయినాథ్‌గారు చేసిన విశ్లేషణ గమనార్హం. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) రూపొందించిన మానవ అభివృద్ధి సూచికలో మనదేశం 128వ స్థానం కలిగి యున్నది.

మానవ అభివృద్ధి నివేదికలో మొత్తం 177 దేశాలు ఉండగా మనం కింద నుంచి 50వ స్థానంలో ఉన్నాము. ఆదిమవాసులను, దళితులను ప్రత్యేక దేశంగా భావించి లెక్కవేసినట్లయితే అప్పుడది 25వ స్థానంలో ఉంటుంది. ఇదియిలావుండగా వరుస క్రమంలో మనకన్నా వెనుకబడిన పలు దేశాలు అనేక విషయాలలో మనకన్నా మెరుగ్గా ఉన్నాయి. ఇతర దేశాలలో మనకన్నా అభివృద్ధి ఎక్కువగా ఉన్నందునే మనం వెనుకబడ్డాము.

1990 నుంచి మానవ అభివృద్ధి సూచిక (హెచ్‌డిఆర్)ను యుఎన్‌డిపి ప్రచురిస్తున్నది. ఈ నివేదిక, సంక్షేమం అన్న పదానికి జిడిపీని దాటి మరింత విస్తృతమైన అర్థాన్ని ఇస్తున్నది. ఈ నివేదికను తయారు చేసేటప్పుడు, మానవాభివృద్ధి మూడు కోణాల నుంచి చూస్తారు. సుదీర్ఘమైన ఆరోగ్యకర జీవితం, విద్య, కొనుగోలు శక్తిదృష్ట్యా అమెరికన్ డాలర్లలో తలసరి జిడిపీ లెక్కింపు. ఇక యిప్పుడు అభివృద్ధి సూచికలో మన స్థానమేమిటో చూద్దాము. దాదాపు దశాబ్దకాలంగా రక్తసిక్త అంతర్యుద్ధంలో కొట్టుమిట్టాడు తున్న ఎల్‌సాల్వెడార్ 103వ స్థానంలో ఉన్నది. అంటే మనకన్నా 11 స్థానాలపైన ఉన్నది. అంటే 117వ స్థానంలో ఉన్నది. మద్య అమెరికాకు చెందిన గ్యాటెమాల దీర్ఘకాలంపాటు అంతర్యుద్ధంలో చిక్కుకొనటమేకాక, దాదాపు సగం మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం జరిగిన చిట్టచివరి అంతర్యుద్ధంలో దాదాపు 2 లక్షల మంది చనిపోవడమో లేక కనిపించకుండా పోవడమో జరిగింది. ఒక కోటి 10 లక్షల జనాభావున్న ఈ చిన్న దేశం మనకన్నా 10 స్థానాలు ఎగువన ఉన్నది. అంటే 118వ

స్థానాన్ని సంపాదించుకున్నది. ఆఫ్రికాలోని బోట్సువానా గత ఏడాది మనకన్నా దిగువస్థాయిలో ఉన్నది. 2006లో దాని స్థానం 131. ఈసారి అది మనకన్నా 4 స్థానాలు పైనున్నది. అంటే అభివృద్ధి సూచికలో 124వ స్థానాన్ని ఆక్రమించింది. నానారకాల ఇబ్బందుల్లో వున్న ఆక్రమిత పాలస్తీనా 106వ స్థానంలో ఉన్నది. భారతదేశం కన్నా చాలా ముందున్నది. ఆసియా దేశాల విషయానికివస్తే రెండవ ప్రపంచ యుద్ధంలో దారుణంగా దెబ్బతిన్న వియత్నాం 105వ స్థానాన్ని ఆక్రమించగా శ్రీలంక సైతం మనకన్నా ముందువుండి 99వ స్థానంలో నిలబడింది. కజికిస్థాన్, మంగోలియాలు కూడా మనకన్నా అభివృద్ధి చెందాయి. మొదటిది 79 నుండి 73వ స్థానంలోకి, రెండవది 116 నుంచి 114వ స్థానానికి చేరుకున్నది.

“ఈ సందర్భంగా ఒక విషయాన్ని గమనించాలి. కొన్ని దేశాలు మనకన్నా 30 స్థానాలు పైనున్నాయి. మరికొన్ని దేశాలు మనకన్నా 30 స్థానాలు దిగువన ఉన్నాయి. అయితే వీటిలో ఏవి మన దేశంలోవలె 9% అభివృద్ధిరేటును కలిగిలేవు” అలానే ఒక్కటి కూడా ఆర్థిక రంగంలో సూపర్‌పవర్‌గా ఎదగటంలేదు. సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రరాజ్యం కూడా కాదు. అణుశక్తికి సంబంధించిన విజ్ఞానం కూడా లేదు. భారతదేశంలో ఉన్నంతమంది శత కోటీశ్వరులు ఈ మొత్తం అన్ని దేశాలలో కలిపినా ఉండరు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో మన దేశం కన్నా పెద్దవిగా చెప్తున్న దేశాలు అభివృద్ధి సూచిలో మనకన్నా ముందున్నాయి.

భారతదేశంలో శత కోటీశ్వరులు ఉన్నమాట నిజమే. ఈ విషయానికి సంబంధించి 2006లో 8వ స్థానంలో ఉన్న మనం ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో 4వ స్థానానికి చేరుకున్నాము. కాని మానవ అభివృద్ధి సూచిలో మాత్రం మన స్థానం 126 నుంచి 128కి పడిపోయింది. శత కోటీశ్వరుల విషయంలో మాత్రం మనమీ భూమండలంపై చాలా ముందున్నాము. క్యూబాలో ఒక్కరంటే ఒక శత కోటీశ్వరుడు కూడా లేడు. తలసరి ఆదాయాన్ని లెక్కలోకి తీసుకున్నట్లయితే ప్రపంచ మొత్తంమీద అది చాలా దిగువన ఉంటుంది. కాని మానవ అభివృద్ధి సూచి విషయానికి వస్తే అది 51వ స్థానంలో ఉన్నది. అంటే మనకన్నా 77 స్థానాలు పైనున్నది. అత్యధిక మానవ అభివృద్ధి బృందంలో దానికి స్థానం లభించింది. ఆవిర్భావంనాటి నుంచి క్యూబాపై ఆర్థికపరమైన ఆంక్షలు అమలవుతున్నాయి. అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇతర దేశాలకన్నా ప్రతి వస్తువూ క్యూబాలో ఎక్కువ ధర ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించి అమెరికా చేసే తరసరి ఖర్చులో 4శాతాన్ని మాత్రమే క్యూబా చేస్తున్నది. కాని ఈ రంగంలో అది అద్భుతమైన ప్రగతిని సాధించింది. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ మెక్సికో, రష్యా, చైనాల కన్నా క్యూబా అభివృద్ధిలో ఉన్నత స్థానంలో ఉన్నది.

భారతదేశంలోని పిల్లల్లో దాదాపు 30% మంది తక్కువ బరువుతో ఉన్నట్లు మానవ అభివృద్ధి సూచి తెలిపింది. అభివృద్ధి సూచిలో 177వ స్థానంలో వున్న గునియా, బుర్కినా ఫాసోలలో తక్కువ బరువువున్న పిల్లలు వరుసగా 22, 19 శాతం ఉన్నారు. 169వ స్థానంలో వున్న ఇథియోపియాలో కూడా ఇలాంటి పిల్లల శాతం 15 శాతంగా ఉన్నది. ఇదేవిధంగా ఐదేళ్ళలోపు పిల్లల్లో బరువుతక్కువగా ఉన్నవారు భారతదేశంలో 47 శాతం కాగా ఇథియోపియాలో 38 శాతంగా ఉన్నారు. ప్రపంచం మొత్తం మీదనే మన దేశంలో పౌష్టికాహార లోపంతో భాదపడుతున్న పిల్లలు ఎక్కువగా ఉన్నారు.

అర్థికాభివృద్ధి రేటు అధికంగానున్నా పేదరికం తగ్గకపోవడం, తగ్గినా నామమాత్రమే తగ్గడం, ఈ విధంగా ధనికులు పేదల మధ్య అంతరం దినదినం పెరిగిపోవడం దేశ భక్తులు ఎదుర్కొంటున్న గొప్ప సవాలు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరించిన ఆర్థిక సామాజిక విధానాల ఫలితంగా అటు 60 సం॥లలో దేశ జనాభా 3 రెట్లకు మించి పెరిగిపోవడం వలనకూడా పేదలకి సమస్యలు జటిలమైన సమస్యలుగా మిగిలి పోయినవి. అభివృద్ధి మానవీయ అభివృద్ధిగా స్వతంత్రం ఆర్థిక, సామాజిక స్వతంత్రంగా, ప్రజాస్వామ్యం 73- 74వ రాజ్యంగ సవరణలు వెలుతురులో సాధికార ప్రజల స్వావలంబనతో కూడిన స్వపరిపాలనగా సంస్కరించబడి పరివర్తన చేయబడిన దశలోనే స్వాతంత్ర సమరయోధులు, త్యాగధనులు, విప్లవకారులు కోరిన స్వతంత్రం సాధ్యపడుతుంది. అధికార కేంద్రీకరణ, స్వార్థం, అవినీతి అరికట్టబడిన యుగంలోనే మానవ వికాసం, సమసమాజ పరిమళం సుసాధ్యమవుతుంది. ఇవి సాధించబడాలంటే దేశ వ్యాప్తంగా విశాల, ప్రజా ఉద్యమాలు ద్వారా జన జాగరణం అత్యంత ప్రధాన కర్తవ్యం. ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులలో మౌళికమైన మార్పు సాధించబడాలి. అందుకొరకు విద్యా, వైద్య, విధానాలలో, వ్యవసాయ, పారిశ్రామిక విధానాలలో తీవ్రమైన ప్రయోజనాత్మకమైన సంస్కరణలు యుద్ధ ప్రాతిపదికపై చేపట్టి ఆచరించబడాలి. అభివృద్ధి అక్షరాల సామాన్యుని నిత్యజీవితంలో తొణికిసలాడాలి. ఈ కర్తవ్య నిర్వహణలో రాజకీయాలకు అతీతంగా దేశభక్తులంతా నడుం బిగించి ముందడుగు వేయాలి. స్వాతంత్ర సమరయోధులు వారి వారసులు ఈ రెండవ స్వతంత్ర పోరాటానికి నాయకత్వం వహించాలి.

# సత్యమేవ జయతే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ చంద్రబాబునాయుడు గారు అనేక సవాళ్ళను స్వీకరిస్తూ తమ వంతు సమాధానాన్ని సమర్థవంతంగా అందచేస్తున్న ఆధునిక సంస్కర్త. ప్రజలకొరకు, ప్రజలచేత నిర్వహించబడే ప్రజల ప్రజాస్వామ్యం అను సిద్ధాంతం ఆయన ఆదర్శం. గ్రామస్థాయినుండి పార్లమెంటు వరకు అధికారాలు, విధులు, బాధ్యతలు సముచితంగా పంపకం చేయబడి ప్రయోజనాత్మకం పొందడం వారి గమ్యం. ఫలితంగా రాష్ట్రం, దేశం అన్ని రంగాలలో నిత్య నూతన అభివృద్ధి వేగాన్ని పుంజుకోగలవనేది ఆయన తపన.

దసరా పండుగ వాతావరణం. శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ, నవరాత్రులు సందర్భం. తెల్లవారితే జాతిపిత మహాత్మాగాంధీ గారి జన్మదినోత్సవం. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవ సందర్భంగా ఎనిమిదికోట్ల ఆంధ్రుల సద్భావన ప్రతీక శేషవస్త్ర కానుకను వారి ప్రతినిధిగా, పాలనా రథసారథిగా శ్రీ నారా చంబ్రాబునాయుడు అక్టోబర్ 1వ తేదీ బుధవారం జరిగే గరుడ సేవలో స్వామివారికి సమర్పించడానికి వెళుతుండగా సాయంత్రం గం.4-20 ని॥ల సమయంలో కొండ దిగువ అలిపరి వద్ద తీవ్రవాదులు అమర్చిన క్లెమోర్‌మైన్స్ పేలుడు దుర్ఘటనకు గురికావడం అత్యంత దురదృష్టకరం. వారితో పాటు కారులో కూర్చున్న మంత్రి గోపాలకృష్ణారెడ్డిగారు, శాసనసభ్యులు శ్రీ చదలవాడ కృష్ణమూర్తి, రాజశేఖరరెడ్డిగారు, డ్రైవర్ శ్రీనివాసరాజులు ఈ దుస్సాహస చర్య వాత పడినారు. క్షణంలో సత్య-అసత్య, హింస-అహింసల మధ్య అప్రకటిత అణుయుద్ధం జరిగింది. ప్రేలుడుతో భూమి దద్దరిల్లింది. చీకటి ధూళిలో వెలుగు మసకబారిపోయింది. కోట్లాది ప్రజల ఆశాజ్యోతి ఆరిపోతుందనే భయంతో ప్రకృతి కంపించిపోయింది. మరుక్షణం ఆత్మబలం ఆధారంగా ఆందోళనకర ముఖకవళికలతో చంద్రబాబునాయుడి పూర్ణ విగ్రహ దర్శనమిచ్చింది. కబళించబోయిన మృత్యువును జయించి పునర్జన్మ సాధించిన వీర విగ్రహదర్శనం అమిత అనందాన్నిచ్చింది. ''నేను బాగున్నాను-మన వారెలా ఉన్నారు'' అను పలకరింపు ఆయన ఆప్యాయత, అభిమాన, అనురాగానికి ప్రతీక. తీవ్రగాయాలు కలిగిన అందరూ ప్రాణాపాయం నుండి భయటపడడం అనూహ్య అదృష్టం. దేశ ప్రజల పుణ్యఫలం.

తమ అభిమాన ప్రియతమ నాయకుడు శ్రీ చంద్రబాబునాయుడు మృత్యముఖం నుండి సురక్షితంగా బయటపడిన వార్త దేశ, విదేశీ అభిమానులలో సంతోషాన్ని,

సంతృప్తిని కల్పించింది. భారత అధ్యక్షుడు మొదలుకుని దేశ, విదేశీ ప్రజానాయకులు, తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. ఒక పాలనా ప్రతిభాశాలి, దీక్షా దక్షతలు గల సంస్కర్త మృత్యువును జయించినందుకు అమిత ఆనందాన్ని ప్రకటించారు. లక్షలాది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సభ్యులు తమ ప్రియతమ నాయకుడిని సందర్శిస్తూ తమ ప్రత్యక్ష ప్రేమిభిమానాలు అందిస్తున్నారు.

తీవ్రవాదం హింసను తమ ప్రధాన ఆయుధంగా ఎన్నుకుంటుంది. మత మౌఢ్యం, సంకుచిత జాతీయ, ప్రాంతీయ తత్వాలతో తీవ్రవాదులుగా హింసావాదాన్ని వ్యాపింపచేయడం ఇటీవల పెచ్చురిల్లుతున్నది. సీమాంతర ఉగ్రవాదం కాశ్మీర్‌లోగాని, ఈశాన్య రాష్ట్రాలలోగాని పెద్దగా జాతీయ సమగ్రతకు ప్రమాదకరంగా పరిణమించినవి. 'మార్క్సిజం-లెనినిజం- మావో' ఆలోచన విధానం పునాదిగా దేశంలో దాదాపు 29 నక్సలైటు గ్రూపులు పనిచేయగా వాటిలో పీపుల్స్‌వార్, జనశక్తి లాంటి గ్రూపులు ఆంధ్రరాష్ట్రంలో తీవ్రవాదాన్ని కొనసాగిస్తున్నవి. సాక్షాత్తు ముఖ్యమంత్రికే గురిపెట్టింది తామేనని పీపుల్స్‌వార్ ప్రకటించుకుంది. ఇది వామపక్ష తీవ్రవాదం. భారతదేశంతోపాటు ప్రపంచవ్యాపితంగా నిర్వహించబడిన వీరోచిత విముక్తి ఉద్యమాలు, స్వతంత్రోద్యమాలు హింసాప్రయోగం గురించి అమూల్యమైన అనుభవాన్ని అందించినవి. ఆబాలగోపాలంగా నుండే లక్షలాది స్త్రీ, పురుషులు తమ సుసంఘటిత శక్తియుక్తులను సంపూర్ణంగా ప్రదర్శించిన తర్వాత కూడా శత్రువర్గాలను ఓడించడానికి కొన్ని ప్రాంతాలలో కొంతమేరకు హింసకు ప్రతిహింసను విధిగా, అనివార్యంగా ఉపయోగించడం జరిగింది. చైనా విప్లవ నిర్వహకులు సాయుధ పోరాట ఆవశ్యకత గురించి తమ అనుభవసారాన్ని ఇలా తెలియచేసారు. "జనబాహుళ్యంలో అత్యధికులు అలాగే సంఘటిత ఉద్యమకారులలో అత్యధికులు తమ లక్ష్యసాధనలో సాయుధపోరాటం వినా గత్యంతరం లేదని భావించిన భౌతికపరిస్థితుల నేపథ్యంలోనే హింసకు-ప్రతిహింస అవసరమవుతుంది." అదేవిధంగా ప్రపంచ మార్క్సిస్టు, లెనినిస్టు విప్లవకారులు తమ విప్లవోద్యమ అనుభవసారాన్ని సమిష్టిగా, బాధ్యతగా తీర్మానరూపంలో అందిస్తూ సాయుధ పోరాటానికి చతుర్విద భౌతిక పరిస్థితులు విధిగా విశ్లేషించబడాలని నొక్కివక్కాణించారు. శత్రు లేక శత్రువర్గం దేశ ప్రజల అభిమానాన్ని, విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయి చీత్కరించబడి యుండాలి. ఇది ప్రథమం. శత్రువు లేక శత్రువర్గం ప్రపంచవ్యాపిత ప్రజాతంత్ర స్వతంత్ర దేశాల నుండి వెలివేయబడియుండాలి. ఇది రెండవది. శత్రువు లేక శత్రువర్గం తమ అంతః కలహాలతో అంతరంగిక విబేదాలతో అనైక్యంగా అసంఘంటితగా మిగిలిపోవాలి. ఇది మూడవది. విప్లవకారుల ఉద్యమ్యాల లక్ష్యం సంపూర్ణంగా ప్రజా బాహుళ్యం యొక్క స్వాతంత్ర్య సౌభాగ్యం అయి ఉండాలి. వారి సంఘటిత సమరశీల సైనికశక్తి శత్రువర్గాల పాటవ శక్తిని ఓడించదగినదిగా గుర్తించాలి. ఇది నాల్గవది అత్యంత ప్రధానమైనది. పై అనుభవాలు సువర్ణాక్షరాలతో లిఖించదగినవి.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత శ్రీ చంద్రబాబునాయుడు గారు అనేక సవాళ్ళను స్వీకరిస్తూ తమ వంతు సమాధానాన్ని సమర్ధవంతంగా అందచేస్తున్న ఆధునిక సంస్కర్త. ప్రజలకొరకు, ప్రజలచేత నిర్వహించబడే ప్రజల ప్రజాస్వామ్యం అను సిద్ధాంతం ఆయన ఆదర్శం గ్రామస్థాయినుండి పార్లమెంటు వరకు అధికారాలు, విధులు, బాధ్యతలు సముచితంగా పంపకం చేయబడి ప్రయోజనాత్మకం పొందడం వారి గమ్యం. ఫలితంగా రాష్ట్రం, దేశం అన్ని రంగాలలో నిత్య నూతన అభివృద్ధి వేగాన్ని పుంజుకోగలవనేది ఆయన తపన. స్వాతంత్ర్యానంతర అర్థశతాబ్ది సుదీర్ఘ కాలయాపన తరువాత ప్రపంచ దేశాలన్నిటికంటే ఎక్కువ పేదలు కలిగిన దేశంగా, వెనుకబడిన దేశంగా లేక రాష్ట్రంగా మిగిలియుండడం ఆయనకు ఏమాత్రం మింగుడుపడడంలేదు. తనదైన శైలిలో రోజుకు 17 గంటలు పనిచేస్తూ ఒక భగీరధుడుగా, కృషీవలుడిగా, కర్మయోగిగా, కర్తవ్య నిర్వహణ చేస్తున్నారు. తన 8 సం॥ల అనతికాల పరిపాలన ద్వారా ఆంధ్రరాష్ట్రాన్ని అనేక మౌళిక రంగాలలో ముందడుగు వేయించగలగడం ఆయనకు, ఆయన పార్టీకి గర్వకారణం కాగా సంకుచిత రాజకీయ ప్రత్యర్థులకు కంటకంగా పరిణమిస్తున్నది. ఆర్థికాభివృద్ధిని, శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధిని చూస్తూ సహించలేని సంకుచిత మనస్కులు తమ రాజకీయ భవిష్యత్తుపట్ల దిగాలు పడిపోతున్నారు. విశాల హృదయం, క్రీడాస్ఫూర్తితో రాజకీయాలకు అతీతంగా సంస్కరణలకు స్వాగతం పలకకుండా 'ఆటంకవాదులకు అన్ని విధాల తోడ్పడుతున్నారు. అధికార సాధనలో అన్నిరకాల ప్రయత్నాలు అనుసరణీయమనే చిన్న బుద్ధితో రాష్ట్రాభివృద్ధికి ఏర్పడుతున్న పెద్ద అవకాశాలను చేజార్చుచున్నారు. రాజకీయాలలో గొప్ప చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ సంస్కరణల పర్వాన్ని 1991లోనే తెరతీసిన కాంగ్రెస్‌పార్టీ ఈనాడు దూరదృష్టితో ముఖ్యమంత్రికి తమ సహాయ సహకారాలు అందించవలసినదిపోయి అడుగడుతునా అడ్డుకోవడం అర్థరహితం. కేవలం సంకుచిత తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల సాధనే లక్ష్యగా పెట్టుకోవడం దురదృష్టకరం.

అన్నిరకాల తీవ్రవాదాల్ని వ్యతిరేకిస్తూ రాజకీయాలలో హింసను ఖండిస్తున్న విప్లవోద్యమాల అనుభవ భాండాగారం కలిగియున్న అతివాద పార్టీలు ముఖ్యమంత్రిపై జరిగిన అమానుషమైన దాడిని ఖండించడం సముచితంగానున్నది. ఈనాటి ప్రపంచీకరణ నేపథ్యంలో ఏర్పడుతున్న ఇబ్బందులను అతివాదపార్టీలు కూడా అభ్యుదయ దృక్పథంతో విశ్లేషించి గుర్తించవలసిన అవసరం ఉన్నది. ఉత్పత్తి శక్తులను నిరాటంకంగా పెంచుతూ అత్యాధునిక సాంస్కృతిక విలువలను పోషిస్తూ, పాటిస్తూ విశ్వమానవ దృక్పధాన్ని ఆచరించాలని ఇటీవలనే చైనా కమ్యూనిస్టు పార్టీ 16వ మహాసభ ఆమోదించిన అద్భుతమైన ఆలోచనా విధానం అభ్యుదయవాదులందరికీ శిరోధార్యం. ఆధునిక సంస్కర్త, శక్తిశాలి, చంద్రబాబునాయుడుగారిపై జరిగిన పాశవిక హత్యాకాండను ఖండిస్తూ అదే సందర్భంగా ప్రముఖ వ్యక్తులు, సంస్థలు, పత్రికలు అనేకానేక సామాజిక ఆర్థిక,

అంతర్గత వైరుధ్యాలను లోటుపాట్లను ఎత్తిచూపించడం ముదావహం. అయితే శతాబ్దాల బానిసత్వం కారణంగా దశాబ్దాల నిష్క్రియాత్మక పాలన ఫలితంగా ఇంకా మిగిలియున్న, అనేకానేక రుగ్మతలకు పరిష్కారం ఒకే ఒక్కటి. అభ్యుదయ రాజకీయ శక్తులమధ్య సదవగాహన, ఉమ్మడి అవగాహన కార్యాచరణ. దానికితోడు సంఘటిత ప్రజా ఉద్యమాల నిర్వహణ. అంతేకాని అందులో హింసావాదానికి, తీవ్రవాదానికి ఎలాంటి ప్రమేయాన్ని ఎట్టి పరిస్థితులలో కూడా అనుమతించకూడదు.

ప్రపంచవ్యాపితంగా అటు రష్యా, తూర్పు యూరప్ దేశాలలో ఇటు చైనా, వియత్నాం దేశాలలో కమ్యూనిస్టు ఉద్యమాలు పొందిన అనుభవాలు ఆధునిక విప్లవ ఉద్యమాలకు గొప్ప మార్గదర్శకాలు. పిడివాదం, పడికట్టువాదం గతి తర్కానికే గొప్ప ఆటంకం. మార్పుకు మారుపేరైన మార్క్సిజం ఈనాటికి సామాజిక స్థితిగతుల విశ్లేషణ, సామాజిక పురోభివృద్ధి సాధనలో ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. సిద్ధాంతం కార్యాచరణలో రాజ్యాంగబద్ధంగా సమరశీల ప్రజా ఉద్యమాల నిర్మాణానికి గొప్ప అవకాశాలున్నాయి. న్యాయంగా అటువంటి ఉద్యమాలు త్వరితగతి సంస్కరణల నిర్వహణ, వేగవంతమైన అభివృద్ధి సాధనలో ఎంతగానో ఉపయోగపడతాయి. ఒక జాతీయ స్రవంతిలో వైశాల్యాన్ని విశిష్టతను సంతరింపచేస్తాయి. ఈనాటి తీవ్రవాదులు ఏ కోవకు చెందినవారైనా తమని తాము సంస్కరించుకుంటూ రాజ్యాంగబద్ధంగా ప్రవహించే జాతీయ స్రవంతిలో తమ సముచిత స్థానాన్ని సాధించుకోవడం, దానిని పోషించుకోవడం వారి హితైషులందరు కోరగలిగే ఏకైక కోరిక.

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తమ సుసంఘంటిత చైతన్యవంత ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణ ద్వారా మాత్రమే పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారిపై జరిగిన కిరాతక ప్రయత్నాన్ని ఓడించగల్గుతారు. ప్రజాస్వామ్యశక్తులు, వ్యక్తుల సహాయ సానుభూతులను సమీకరిస్తూ, సంఘటితపరుస్తూ హింసావాదాన్ని అరికట్టగలుగుతారు. కోటి వరాలతో తమ సమస్యల తక్షణ పరిష్కరాలను పొందుతూ శాశ్వత పరిష్కారాల కొరకు తమ ఉద్యమాన్ని ప్రజాతంత్ర పద్ధతులలో కొనసాగించగలుగతారు. చైతన్యవంతమైన ప్రజల సుశిక్షిత, సంఘటిత శక్తిని ఎటువంటి తీవ్రవాదం కూడా ఎదిరించలేదు. మహాత్మాగాంధీని పొట్టనపెట్టుకున్న పైశాచికం సత్యాహింసల గాంధీయిజాన్ని ఓడించ జాలలేదు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల నిండు ప్రాణాల్ని బలిగొన్న, సంకుచిత జాతీయ తీవ్రవాదం బ్రతికిబట్టకట్టలేదు. యువ ముఖ్యమంత్రి, ఆధునిక శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన పోషకుడు, గొప్ప ఆర్థిక, సాంఘిక సంస్కర్త అయిన చంబ్రాబునాయుడుని అర్థాయుష్కుడిగా చేయ ప్రయత్నించిన హింసాత్ములు ఏనాడో ఒకనాడు తాము చేసిన అకృత్యానికి పశ్చాత్తాపాన్ని ప్రకటించక తప్పదు.

# సమైక్య ఆంధ్రప్రదేశ్ సమతుల అభివృద్ధి

వేద వాఙ్మయంలో ఆంధ్ర జాతి ప్రసక్తి ఉన్నది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో భాగంగానున్న తెలుగు ప్రజలు తమ జాతీయ ఉనికిని వ్యక్తీకరిస్తూ తెలుగు ప్రజలను సంఘటిత పరుస్తూ జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో సముచిత పాత్రను పోషించే లక్ష్యంతో ఆంధ్ర మహాసభ అను సంస్థను నెలకొల్పారు. దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు దీనికి ఆధ్యుడు. ఈ విధంగా చరిత్ర పుటలలో గుర్తించబడిన ఆంధ్రజాతి ఒక ఉద్యమంగా ఎదిగింది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ నినాదంతో విజృంభించింది.

సుమారు 200 సం॥ల క్రితం వరకు ఈనాటి ఆంధ్రప్రదేశ్ మొత్తం తెలంగాణా అను పేరుతో పిలవబడింది. ముస్లిం పాలకుల క్రింద ఉండిన కర్ణాటక, మరట్వాడ ప్రాంతాలతోపాటు ఈ సువిశాల తెలంగాణా కలిసి ఉండేవి. తెలుగువారి సాంస్కృతిక కేంద్రాలైన కాళేశ్వరం (తెలంగాణాలోనిది) శ్రీశైలం (రాయలసీమలోనిది) మరియు ద్రాక్షారామం (సర్కారు జిల్లాలోనిది) మూడు సుప్రసిద్ధ శివాలయాలు. ఈ మూడు లింగాల మధ్య భూభాగం ''త్రిలింగ''గా నామకరణం పొందింది. ఉర్దూ భాషలో ఉచ్చారణ ఫలితంగా ''తెలంగాణా'' అని పిలువబడింది. ఇక్కడి ప్రజలు మాట్లాడే భాష పేరుకు సరిపడే విధంగా అనగా ''తెలుగు'' భాషగా పేరొందింది. ఈ పేరు కూడా ఉర్దూ భాషలో ''తెలంగీ''గా వక్రీకరించబడినది కూడా.

కాబట్టి 'ఆంధ్ర', 'తెలంగాణా' అను పేర్లు ఒకే ప్రాంతానికి చెంది ఒకే భాష మాట్లాడి, ఒకే సాంస్కృతిక పరంపరకు సంబంధించి ఉన్న ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. చరిత్రలో నైజాం నవాబు బ్రిటీష్‌వారికి అమ్ముకోవడమో, తాకట్టు పెట్టుకోవడమో జరిగినందున సుమారు రెండు వందల సం॥ల క్రితం సర్కారు జిల్లాలు, రాయలసీమ జిల్లాలు తెలంగాణా మాతృక నుండి భౌగోళికంగా బ్రిటిష్‌వారి ఆధీనంలో మద్రాస్ రాష్ట్రంలో చేరిపోయినవి. తర్వాత స్వాతంత్ర్యానంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ జరిగింది. 1956లో భాషాప్రయుక్త రాష్ట్రాల కొరకు జరిగిన ఉద్యమాల ఫలితంగా, హైద్రాబాద్ సంస్థాన విచ్ఛిత్తి జరిగి విశాలాంధ్ర లేక ఆంధ్రప్రదేశ్ అవతరించింది. బానిస బంధనాలలో భాష, సంస్కృతి సంప్రధాయాలను కూడా పరిరక్షించుకోలేని తెలుగుజాతి తిరిగి ఐక్యతను సాధించింది. సామ్రాజ్యవాదం, రాచరికాల ఉక్కుపాదాల క్రింద నలిగిపోయిన తెలుగు

ప్రజలు తరతమ తేడాలతోనున్న వెనుకబాటునాన్ని తొలగించుకోవడానకి సమైక్య పరిపాలనను సాధించుకున్నారు. 1956 నవంబరు 1 నుండి ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రజల జీవితంలో నూతన అధ్యాయంగా నిలుస్తుంది.

ఇటువంటి చారిత్రిక ఒడిదుడుకుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలు ఆర్థిక, సామాజిక, అభివృద్ధి క్రమంలో ఒకే విధంగా లేవు. అభివృద్ధిలో లేక వెనుకబాటుతనంలో తరతమ తేడాలు చాలాకాలం వరకు కొట్టవచ్చినట్లుగా ఉండినవి. పాలకవర్గం చిత్తశుద్ధితో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక ఆసక్తి చూపించిన సందర్భాలలో, ఆయా రంగాలలో అభివృద్ధి సాధ్యపడ్డది. అలాకాని సందర్భాలలో అభివృద్ధి కుంటుపడిపోవడం, నత్తనడక నడవడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత 3 దశాబ్దాల వరకు ఏకధాటిగా పరిపాలించిన కాంగ్రెస్‌పార్టీ అనుసరించిన రాజకీయ, ఆర్థిక, సామాజిక విధానాల కారణంగా అసలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేగం అత్యంత దారుణంగా ఉండింది. రాష్ట్ర సగటు ఉత్పత్తి పెరుగుదల రేటు ఏనాడు 2 నుండి 3 శాతానికి మించలేదు. ఉత్పత్తి శక్తులు పెరగకపోవడం ఉత్పత్తి-ఉత్పాదకతలు నామమాత్రంగా పెరగడం వలన మానవాభివృద్ధి జరగలేదు సరికదా పేరుకుపోయిన ప్రాంతీయ అసమానత తగ్గిపోలేదు. పేదరికం పెరిగింది. వాస్తవం ఈ విధంగా నుంటే తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన కాంగ్రెస్ నాయకులే, కాంగ్రెస్ పాలకులే తెలంగాణా వెనుకబాటుతనానికి ఆంధ్ర పాలకుల పక్షపాత విధానాలు ఇక్కడి నిధులను వెచ్చించకుండా ఆంధ్ర ప్రాంతానికి తరలించినారనే అసత్యపు ఆరోపణలు చేయసాగారు. తెలంగాణాలో ఏర్పడిన ఉద్యోగ అవకాశాలను ఆంధ్ర ప్రాంతం వారు హస్తగతం చేసుకున్నారని, ఆ తర్వాత ముఖ్యంగా 1969లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారి నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమాలు నిర్వహించబడినవి. ఉద్దేశపూర్వకంగానే వెనుకబాటుతనానికి ఉన్న ఆర్థిక, రాజకీయ కారణాలను కప్పిపుచ్చి ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టడం జరిగింది. వేలాది యువతీ యువకుల్ని పోరాటంలోకి ఆకర్షించి వందలమంది ప్రాణాలు బలికొనడం జరిగింది. చివరకు తమ స్వంత కాంగ్రెస్‌పార్టీ నాయకత్వ కుమ్ములాటల ద్వారా పదవులు సంపాదించుకొని ప్రజలను నట్టేట ముంచడం జరిగింది. కీర్తిశేషురాలు అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ అప్పటి ముఖ్యమంత్రి కీర్తిశేషులు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని ముఖ్యమంత్రిపదవి నుంచి తప్పించడం, వేర్పాటు ఉద్యమ నాయకుడు కీ॥శే॥ శ్రీ మర్రి చెన్నారెడ్డి గార్ని ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా చేయడం, తెలంగాణావాసి శ్రీ పి.వి.నరసింహారావు గారిని ముఖ్యమంత్రిగా నియమించడం, ఆ తర్వాత వేర్పాటు ఉద్యమం శాంతించడం జగమెరిగిన సత్యం. కాంగ్రెస్‌పార్టీవారు తమ పదవుల వేటలో కులతత్వాలతోపాటు అనువు దొరికితే పదునైన ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టే విద్యలో సిద్ధహస్తులు.

ఆ తర్వాత కాలంలో కీ॥శే॥ ఎన్.టి.రామారావుగారి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. శ్రీ ఎన్.టి.ఆర్. వెనకబాటుతనంతో, పేదరికంతో అల్లాడిపోతున్న తెలుగు ప్రజలలో నూతన చైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచడానికి అహరహం కృషిచేసారు. ఇటువంటి మానసిక పరిపక్వత రావడానికి ఆర్థిక, సామాజిక పరిపాలనా సంస్కరణల ఆవశ్యకతను గుర్తింపులోకి తెచ్చారు. కఠినమైన నిర్ణయాలు చేసి సంస్కరణలు చేపట్టకముందే తిరిగి కాంగ్రెస్‌పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అప్పుడైనా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై కేంద్రీకరిస్తూ సగటు ఉత్పత్తిని పెంచే ప్రయత్నానికి బదులు యధాపూర్వ కాంగ్రెస్ పార్టీ పాలనా సంస్కృతి వాతపడిపోయారు. అయిదు సం॥ల పరిమిత కాలంలో ముగ్గురు ముఖ్యమంత్రులు అనేకులు మంత్రిపదవులు సాధించుకున్నారు.

అధికార దాహం ఒక హేయమైన సంస్కృతిగా ప్రజలకు కండ్లకు కట్టినట్లుగా కనిపించింది. దానితో ప్రజలు కాంగ్రెస్ పార్టీని అసహ్యించుకున్నారు. తిరిగి తెలుగుదేశం పార్టీని, అధినేత ఎన్.టి.ఆర్.ను భారీ మెజారిటీతో అందలం ఎక్కించారు. తెలుగు దేశం పార్టీలో దురదృష్టవశాత్తు ఏర్పడిన నాయకత్వ లోపం ఫలితంగా ఎన్.టి.ఆర్ గద్దె దిగడం, శ్రీ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడం ఆంధ్రదేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపు. ఆ తర్వాత 1999 వరకు శ్రీ నారా చంద్రబాబునాయుడు సంస్కరణల సిద్ధాంతాన్ని అమలుపరుస్తూ తనదైన ప్రత్యేక శైలిలో పరిపాలన నిర్వహిస్తూ ప్రజా బాహుళ్యానికి సన్నిహితుడుగా, ఆప్తుడుగా పరిణతి చెందడం, తద్వారా రాజనీతికి వినూత్న ప్రయోజనాన్ని సమకూర్చడం గొప్ప అనుభవం. ఫలితంగా 1999 ఎన్నికలలో శ్రీ చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో తెలుగుదేశం అఖండ విజయాన్ని సాధించడం ఒక జాతీయ సంఘటనగా, అంతర్జాతీయ ఆసక్తికరంగా చోటుచేసుకున్న మంచి మార్పు. ఈనాటి వరకు అంటే గత ఎనిమిదిన్నర సం॥లలో తెలుగుదేశం ప్రభుత్వం అన్ని రంగాలలో సాధించిన విజయాలు అపూర్వమైనవి. రాష్ట్ర మౌళిక సదుపాయాలను అత్యంత వేగంగా సమకూర్చడం జరిగింది.

విద్య, వైద్య, సాగునీరు, త్రాగునీరు, రోడ్డు రవాణా, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి-సరఫరా రంగాలలో గత దశాబ్దాల కాలంలో చేయలేని అభివృద్ధిని సాధించడం జరిగింది. పేదరికాన్ని గణనీయంగా తగ్గిస్తూ ప్రాంతీయ అసమానతలను తొలగించడంపై ప్రత్యేక శ్రద్ధాశక్తులను చూపెట్టడం జరిగింది. ప్రభుత్వ ఆదాయాలను వెచ్చించడంలో, నూతన ప్రాధామ్యతలను ఏర్పాటు చేయడం జరిగింది. గడచిన ఎనిమిదిన్నర సం॥లలో తెలంగాణాప్రాంతం సాధించిన అభివృద్ధి అపూర్వమేకాక, ఆశ్చర్యకరమైన స్థాయికి చేరుకున్నది. స్థూలమైన ఈ క్రింది వాస్తవాలు ప్రాంతీయ అసమానతల తగ్గింపు లేక నిర్మూలన ఋజువుచేస్తాయి. ఆంధ్ర-తెలంగాణా ప్రజల మధ్య సృష్టించబడిన ప్రాంతీయ

అసమానతల అపభ్రంశాన్ని తొలగిస్తాయి.

చంద్రబాబునాయుడిగారి శాస్త్రీయమైన మానవీయ అభివృద్ధి విధానాలపట్ల ప్రజలలో ఏర్పడియున్న ఆదరాభిమానాలను ఆవిష్కరిస్తాయి. 1990-91 నుండి 94-95 కాలంలో అభివృద్ధి అంశాన్ని ఆ తర్వాత 95-96 నుండి 2002-2003 వరకు గల ఎనిమిది సం॥ల కాలంతో పోల్చుకోవడం ద్వారా సాధించిన అభివృద్ధి ప్రమాణాన్ని గమనించగలుగుతాము. మొదటిది కాంగ్రెస్ కాలం కాగా, రెండవది చంద్రబాబు కాలంగా విశ్లేషించడం ఉపయుక్తంగా ఉంటుంది.

## పెరిగిన పెట్టుబడుల శాతం:

వ్యవసాయరంగాన్ని తీసుకోండి కాంగ్రెస్ కాలంలో రాష్ట్రం మొత్తంగా 301.17 కోట్లు ఖర్చు చేయబడగా, తెలంగాణాకు 110.32 కోట్లు అనగా 36.83% ఖర్చు చేయడం జరిగింది. చంద్రబాబునాయుడుగారి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 882.78 కోట్లు ఖర్చుచేయబడం జరిగింది. భారీ నీటివనరులను చూడండి కాంగ్రెస్ కాలంలో రాష్ట్ర మొత్తంగా రూ.1691.25 కోట్లు ఖర్చుచేయబడగా తెలంగాణాకు 484.35 కోట్లు అనగా 28.64% ఖర్చుచేయడం జరిగింది. అదే చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 4794.48 కోట్లు ఖర్చు చేయబడగా తెలంగాణా ప్రాంతంపై 953.81 కోట్లు అనగా 43.89% ఖర్చుచేయడం జరిగింది. మధ్యతరహా నీటిపారుదలపై కాంగ్రెస్ కాలంలో రాష్ట్రం మొత్తంగా 89.52 కోట్లు వెచ్చించగా తెలంగాణాపై 23.16 కోట్లు అనగా 25.87% ఖర్చుచేయడం జరిగింది. ఇదే చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 586.79 కోట్లు ఖర్చుచేయబడగా తెలంగాణాపై 301.01 కోట్లు అనగా 29.67% ఖర్చు చేయడం జరిగింది. చిన్న నీటివనరులకు కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 186.73 కోట్లు ఖర్చుకాగా తెలంగాణా ప్రాంతంలో 79.96 కోట్లు అనగా 42.82% ఖర్చుచేయడం జరిగింది. చంద్రబాబుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 1126 కోట్లు వెచ్చించగా తెలంగాణాపై 518.75 కోట్లు అనగా 46.07% వెచ్చించడం జరిగింది.

పరిశ్రమలు తీసుకోండి. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 63.03 కోట్లు ఖర్చు చేయబడగా తెలంగాణాపై 10.37 కోట్లు అనగా 16.45% ఖర్చుచేయడం జరిగింది. మరి చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 64.82 కోట్లు ఖర్చుచేయబడగా తెలంగాణాపై 24.61 కోట్లు అనగా 37.96% ఖర్చుచేయడం జరిగింది.

ప్రాథమిక విద్య తీసుకోండి. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 4899.55 కోట్లు ఖర్చుచేయగా తెలంగాణాపై 1890.72 కోట్లు అనగా 38.68% ఖర్చుచేయడం జరిగింది. చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 16155 కోట్లు ఖర్చుచేయబడగా తెలంగాణాపై 6,789.95 కోట్లు అనగా 42.03% ఖర్చుచేయడం జరిగింది. ఇంటర్

మీడియట్ విద్య చూడండి. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 422.73 కోట్లు ఖర్చుకాగా తెలంగాణాపై 153.40 కోట్లు అనగా 36.29% ఖర్చుచేయడం జరిగింది. అదే చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రంలో 1553.38 కోట్లు ఖర్చుచేయబడగా తెలంగాణాపై 627.25 కోట్లు అనగా 40.38% ఖర్చుచేయడం జరిగింది. సాంకేతిక విద్య తీసుకోండి. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 314.46 కోట్లు ఖర్చుపెట్టగా తెలంగాణాపై 200.77 కోట్లు అనగా 63.84% ఖర్చుచేయడం జరిగింది. అయితే చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 904.81 కోట్లు ఖర్చుపెట్టగా తెలంగాణాలో 623.16 కోట్లు అనగా 68.09% ఖర్చుచేయడం జరిగింది. ఆరోగ్యమే తీసుకోండి. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రం మొత్తంగా 768.18 కోట్లు ఖర్చు కాగా తెలంగాణాలో 294.28 కోట్లు అనగా 38.31% ఖర్చు చేయడం జరిగింది. చంద్రబాబునాయుడుగారి కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 2484.50 కోట్లు ఖర్చుకాగా తెలంగాణాపై 1006.80 కోట్లు అనగా 40.52% ఖర్చుచేయడం జరిగింది. ఈ విధంగా పైన ఉదహరించిన ముఖ్యమైన శాఖలే కాక అన్ని శాఖలలో కూడా కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఖర్చు చేయబడ్డ మొత్తం తక్కువగా నుండడం తెలంగాణాపై ఖర్చుచేయబడిన మొత్తం కూడా తక్కువగా నుండడం చూడగలుగుతాం. అదే చంద్రబాబునాయుడుగారి కాలంతో పోల్చినపుడు రాష్ట్రవ్యాప్తంగా ఆయాశాఖలపై చేయబడిన ఖర్చులు ఇతోధికంగా పెరిగినవి. చాలా సందర్భాలలో 2, 3 రెట్లకు పెరిగినవి. తెలంగాణాపై చేయబడిన ఖర్చులు సుమారు 40 నుంచి 45 శాతాన్ని అందుకున్నవి.

విద్యుచ్ఛక్తి, నీటిపారుదల రంగాలు ఇంకా సూక్ష్మంగా పరిశీలిద్దాం. విద్యుచ్ఛక్తి స్థాపిత శక్తి కోస్తా జిల్లాలలో 3334.09 మెగావాట్లు ఉండగా, రాయలసీమలో 1434.73 మెగావాట్లు ఉంది. తెలంగాణాలో 3653.51 మెగావాట్లతో మొత్తానికి 43.38% ఉంది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి, సరఫరా మరియు పంపక రంగాలలో శ్రీ చంద్రబాబునాయుడుగారు 100 మాసాలలో 1836.47 కోట్లు కాగా, రాయలసీమ జిల్లాలలో 1451.55 కోట్లు ఉండింది. తెలంగాణాలో 7362.14 కోట్లతో మొత్తంపై 69.13% వెచ్చించడం జరిగింది. దీనిని ఎవరు కాదనగలరు? విద్యుచ్ఛక్తి రంగంలో వ్యవసాయానికి ఇవ్వబడిన సబ్సిడీ మొత్తం 100 మాసాల చంద్రబాబుగారి పరిపాలనలో పరిస్థితి ఇలా ఉంది. కోస్తా ప్రాంతానికి 3767 కోట్లు సబ్సిడీ ఇవ్వగా రాయలసీమకు 3,690 కోట్లు ఇస్తూ మొత్తంపై 58.31% వెచ్చించడం జరిగింది. కళ్ళున్నవారెవరైనా దీనిని గమనించలేరా? చంద్రబాబు వందమాసాల పాలనలో కొత్తగా ఇవ్వబడిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య చూడండి. కోస్తాలో 1,27,753; రాయలసీమలో 1,26,837; అదే తెలంగాణాలో 4,21,748 ఇవ్వబడ్డాయి. ఈ విధంగా మొత్తం వ్యసాయ కనెక్షన్లు 31-10-2003 నాటి కోస్తాలో 4,12,417; రాయలసీమలో 5,01,241; తెలంగాణాలో 13,68,487 ఉన్నాయి. ఒక్క తెలంగాణాలోనే 59.96% ఉన్నాయి.

నీటిపారుదల విషయం పరిశీలిద్దాం. 1989-94 సం॥రాల కాంగ్రెస్ పరిపాలనలో నూతనంగా సాగులోకి తేబడిన భూమి, తెలంగాణా ప్రాంతంలో 54,700 ఎకరాలు; ఆంధ్రలో 71,200 ఎకరాలు; రాయలసీమలో 31,700 ఎకరాలు ఉండగా శ్రీ చంద్రబాబునాయుడుగారి పాలనలో నూతనంగా సాగులోకి తేబడిన భూమి తెలంగాణాలో 4,45,600 ఎకరాలు; ఆంధ్రలో 4,07,557 ఎకరాలు మరియు రాయలసీమలో 1,56,605 ఎకరాలు ఉన్నవి. తెలంగాణాలో ఎక్కువ సాధించినవి గమనార్హం. 1989-94 అనగా కాంగ్రెస్ పాలనలో నీటి వనరులపై తెలంగాణాలో 835.64 కోట్లు; రాయలసీమలో 918.41 కోట్లు; ఆంధ్రలో 625.58 కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. అదే చంద్రబాబునాయుడుగారి పాలనలో తెలంగాణాలో 3851.26 కోట్లు; రాయలసీమలో 3,023.79 కోట్లు; ఆంధ్రలో 1989.61 కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర వనరులతోపాటు, ప్రపంచబ్యాంకు తదితర అంతర్జాతీయ సంస్థల నుండి అప్పులు చేసి నీటిపారుదల రంగాన్ని అభివృద్ధిచేసిన వాస్తవం కండ్లకు కట్టినట్లుగా కనపడుతుంది. కాంగ్రెస్ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 2379.63 కోట్లు ఖర్చుకాగా శ్రీ చంద్రబాబునాయుడుగారి కాలంలో 8864.66 కోట్లు ఖర్చుచేసి చూపెట్టడం జరిగింది.

పైన పోల్చబడిన కాలపరిమితిలో కాంగ్రెస్, తెలుగుదేశాల మధ్య తేడా స్పష్టంగా నున్నప్పటికీ వెనుకబడిన తెలంగాణాపై వెచ్చించబడిన మొత్తం యొక్క శాతం హెచ్చుగానుండడం గమనార్హం.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ తర్వాత నుండి అనగా 47 సం॥ల సుదీర్ఘ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల మధ్య ఏర్పడియుండిన తారతమ్యాలు మొదలు కొద్దికొద్దిగా ఇటీవలి కాలంలో త్వరితగతిని చెరిగిపోవడం జరిగింది. 6,7 లక్షల జనాభా కలిగిన జంటనగరాలు 75 అక్షలకు మించిపోతున్నవి. రాష్ట్రవ్యాపిత పర్యాటక పరిస్థితి, సరుకుల రవాణా స్థితిగతి అత్యంత వేగంతో అభివృద్ధిచెందింది. సంబంధ బాంధవ్యాలు కూడా విశేషంగా పెరిగినవి. మానసిక అభిమానాలు అభివృద్ధి చెందినవి. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రప్రజల మధ్య ప్రాంతీయతత్వ అపోహలు, అనుమానాలు చెరిగిపోయినవి. సమగ్రత గణనీయంగా పెరిగింది. ఆంధ్ర రాష్ట్రం సమైక్యతతో అభివృద్ధి వేగంలో ఇతర రాష్ట్రాలతో పోటీపడుతూ ముందుకు దూసుకుపోతున్నది. వివిధ రంగాలలో చేపట్టబడిన వ్యవస్థాగత సంస్కరణలు, ప్రాధాన్యతల సంస్కరణలు, మౌళికరంగంపైన పెద్ద ఎత్తున పెట్టబడిన పెట్టుబడులు ఈ మంచి ఫలితాలకు మూలం. విజన్ 2020 ఆధారంగా అభివృద్ధి, అభ్యుదయంపై తదేక దృష్టిని కేంద్రీకరించడం వలన ఇది సాధ్యపడింది. బడుగు, బలహీన వర్గాలు, దళితులు ముఖ్యంగా మహిళలను సాధికారం చేసే బృహత్ ప్రయత్నం ప్రజాసామాన్యంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తున్నది. దేశ, విదేశాల నిపుణులు ఈ సంస్కరణ సహిత పరిపాలనను చూచి హర్షిస్తున్నారు.

అనతికాలంలోనే ఆంధ్రప్రదేశ్ అక్షరక్రమంలో అగ్రగామిగా అవతరిస్తుందని ఆశీర్వదిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సంస్కరణలను వ్యతిరేకిస్తూ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణలను గుర్తించ నిరాకరిస్తున్న పక్షాలన్నీ తెలుగుదేశం సాధిస్తున్న ప్రగతిని అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. విశాలాంధ్ర సాధనలో దాన్ని సుస్థిరం చేయడంలో ప్రముఖపాత్రను పోషించిన వామపక్షాలు, తెలంగాణా కాంగ్రెస్‌లోని బలమైన పక్షం ప్రత్యేక తెలంగాణా వాదాన్ని బలపర్చే దిశలో తమ ప్రయత్నాలను కొనసాగించడం యాదృచ్ఛికం కాదు. ఒకనాడు ప్రత్యేక తెలంగాణావాదం కాంగ్రెస్‌లో పదవుల సాధనకై ఎత్తుగడగా ఉపయోగించబడితే ఈనాడు పదవులతోపాటు దేదీప్యమానంగా అభివృద్ధిని సాధిస్తున్న బహుముఖ సంస్కరణలను నిరోధించడానికి ఈ ప్రత్యేక తెలంగాణావాదం ఒక ఆయుధంగా ఉపయోగించబడుచున్నది. కరుడుగట్టిన, కాలదోషం పట్టిన, ఆచరణలో విఫలత చెందిన ఆలోచనలను సంస్కరించుకోలేని రాజకీయశక్తులు గత్యంతరం లేక ఒక కూటమి ఏర్పాటుకై సంసిద్ధం కావడం జరుగుచున్నది. రానున్న ఎన్నికలలో సీట్ల సర్దుబాటు, అవగాహన, వివిధరకాల పొత్తుల ఆలోచనలు వీరి మధ్య విస్తృతంగా, బలంగా కూడా చోటుచేసుకుంటున్నవి. ఏది ఏమైనా ఉత్పత్తి శక్తుల పెంపకం, ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవడం, సాంఘిక న్యాయం, సమతుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవడం తత్ఫలితంగా పేదరికాన్ని తీవ్రంగా తగ్గించడం, ప్రాంతీయ అసమానతలను చెరిపివేయడం తెలుగుదేశంపార్టీ అనుసరిస్తున్న రాచమార్గం. దీనిని ఓడించడం రాజకీయ ప్రతీపశక్తుల పల్లకాదు. కేవలం పదవీ వ్యామోహపీడితులైన వేర్పాటువాదులతో అసలు కాదు. తెలంగాణా ప్రజలు సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం వ్యతిరేక విప్లవాత్మక పోరాటాలలో విశేష అనుభవాలను సాధించినారు. సువిశాల రాజకీయ ఐక్యతతో అభివృద్ధి నిరోధక శక్తులను ఓడించే విద్యను నేర్చుకున్నారు. అనన్య సామాన్యమైన త్యాగాలతో అభివృద్ధి పథాన్ని ఎన్నుకున్నారు. అందుకే "వీర తెలంగాణ నాది-వేరు తెలంగాణా కాదు" అని అన్నాడు మన సి.నా.రె.

# వెనకబాటుతనం - అభివృద్ధి ఒక విశ్లేషణ

వెనకబాటుతనం, అభివృద్ధి అను భావాలకు అర్థాలు మారుతున్నవి. శరవేగంగా పురోగమిస్తున్న శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం, విజ్ఞానం వెనకబాటుతనాన్ని తగ్గించడంలో తొలగించడంలో అలాగే అభివృద్ధిని అర్థవంతం, విస్తృతం చేయడంలో ప్రముఖపాత్రను పోషిస్తున్నవి. కాబట్టి కాలక్రమేణా సంక్రమిస్తున్న పరిణామము మార్పుల నేపథ్యంలో వెనకబాటు తనానికి అభివృద్ధి క్రమాన్ని అంచనా కట్టడం అవసరం.

సామ్రాజ్యవాద యుగంలో సామ్రాజ్యవాద దేశాలు బానిస దేశాలుగా ప్రపంచ దేశాలను విశ్లేషించడం స్వతంత్రానంతరం అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలు, అభివృద్ధి చెందుచున్న దేశాలు, వెనుకబడిన దేశాలుగా ప్రపంచ దేశాలను గుర్తిస్తున్నాం. అర్ధశతాబ్ది క్రింద బానిసలు, అర్ధ బానిసలుగా నున్న దేశాలు ఈనాడు అభివృద్ధి పథంలో పోటీపడుతూ ముందడుగు వేస్తున్నాయి. చైనా, రష్యా, లాంటి దేశాలు అభివృద్ధి చెందుచున్న దేశాలలో అగ్ర శ్రేణిని అలంకరిస్తున్నాయి. అన్ని రంగాలలో వెనకబాటు తనాన్ని తొలగించుకుంటూ అభివృద్ధి వేగాన్ని పుంజుకుంటున్నాయి.

భారతదేశం సుదీర్ఘ కాలం బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి బానిసగా నుంటే దేశంలో సుమారు 3వ భాగం రాజులు, సంస్థానాధీశులాధీనంలో నుండింది. కాశ్మీర్, హైద్రాబాద్, మైసూర్, ట్రావెన్‌కూర్, కొచ్చిన్, సంస్థానాలు పెద్దవి కాగా, మొత్తం సుమారు 500 సంస్థానాలు నుండినవి. అక్కడి ప్రజలు బ్రిటిష్ సామ్రాజ్య వాదంతో పాటు స్థానిక సంస్థానాధీశుల ఉక్కు పాదాల క్రింద నలిగివుండే వారు. స్వాతంత్ర్యానంతరం ఒకటిన్నరసంవత్సరం లోగా ఈ సంస్థానాలన్ని ఐచ్ఛికంగానో, బలవంతంగానో భారతదేశంలో విలీనం కావడం జరిగింది. ఈ విధంగా భారతావని స్వతంత్రత సాధించడం జరిగింది. మొత్తం దేశమే వెనక బడి యుండగా సంస్థాన ప్రజలు మరింత వెనకబాటు తనంతో నికృష్ట జీవితం గడపవలసి వచ్చింది. గడచిన అర్ధశతాబ్ది కాలంలో, దేశంలో అలాగే సంస్థానాలలో అనేకానేక రంగాలలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. జన జీవితంలో చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే ఆధునిక అవసరాలు కోరికలతో పోల్చగా సాధించబడిన అభివృద్ధి సరిపోవడం లేదు.

అందరికీ సంతృప్తిని అందించడం లేదు. ఇంకా వెనక బడి యున్నామనే భావన జనాభాలో కనీసం మూడవ వంతు ప్రజలలో ప్రబలంగానే వున్నది. అభివృద్ధి క్రమంగా జరిగినా దాని సమగ్రత, విస్తీర్ణం, వేగం చాలడం లేదు. కోట్లాది జనం అవిద్య, అనారోగ్యంతో పాటు కనీస మౌళిక సదుపాయాల కొరత కారణంగా దారిద్ర రేఖకు దిగువనవున్నారు.

సంస్థానాలు రద్దు పరచబడి భారతదేశంతో విలీనం చేయబడిన తరువాత నుండి గడచిన అర్ధ శతాబ్ధికి పైబడిన కాలంలో సంస్థాన ప్రజల రాజకీయ, ఆర్థిక సామాజిక స్థితిగతులలో గొప్పమార్పు వచ్చింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినాయి. ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, గుజరాత్ రాష్ట్రాలు అవతరించినవి. సంస్థానాలు బ్రిటిష్ పాలనల మధ్య విభజన రేఖలు తొలగిపోయినవి. పరిశ్రమలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, గ్రామీణాభివృద్ధి, రోడ్డు రవాణా రంగాలలో అభివృద్ధి జరిగింది. ఉభయ ప్రాంతాల ప్రజల మధ్య ఆర్థిక, సామాజిక సంబంధ బాంధవ్యాలు అల్లుకుపోయినవి. పైనుదహరించినట్లు సంస్థాన, సంస్థానేతర ప్రజల మధ్య హద్దులు - సరిహద్దులు పూర్తిగా చెరిగిపోయినవి.

ఈనాడు దేశంలో వెనకబాటు తనాన్ని గుర్తించడానికి సరికొత్త ప్రమాణాలను అనుసరించవలసిన ఆవశ్యకత ఏర్పడినది. దేశంలో వివిధ ప్రాంతాలు ప్రకృతి సిద్దంగా అతివృష్టి- అనావృష్టి కారణాల వలన ప్రత్యేక సమస్యల నెదుర్కొంటు అభివృద్ధి సాధనలో వెనకబడి పోవలసి వస్తున్నది. అటవిక గిరిజన ప్రాంతలలో తీవ్రమయిన సామాజిక వెనకబాటుతనం వల్ల అభివృద్ధి ఆశించిన ఫలితాలను అందించడం లేదు. భారత దేశంలోనే గూడు కట్టుకునియున్న వర్ణాశ్రమ ధర్మం ఫలితంగా దళిత వెనుకబడిన వర్గాలుకు చెందిన అత్యధికులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందలేక పోతున్నారు. జనాభాలో సగ భాగంగా వున్న మహిళాలోకం ఇప్పుడిప్పుడే స్వతంత్రం, సాధికారత గడప తొక్కడం ఆరంభించింది. వెనకబాటుతనాన్ని వివిధ జీవన రంగాలలో అనగా విద్య, వైద్యం, పౌష్టికాహారం, సమానత్వంలో కూడా చూచి గుర్తించవలసిన ఆగత్యం వున్నది. గత అర్ధ శతాబ్దిలో సాధించబడిన బహుముఖ అభివృద్ధి పూర్వ కాలంతో పోల్చినపుడు గొప్పగానే కనబడుచున్నది. అయితే వర్ధమానకాలం, ఈనాటి ప్రపంచీకరణ, నాగరికతల నేపధ్యంలో యువతరానికి అతిస్వల్పంగానే కనబడుతుంది. ఇది సహజం. యువతరం యొక్క అలోచనలను, అవసరాలను ప్రాతిపదికలుగా గుర్తించి అభివృద్ధి పధకాలకు దిశా దశలను నిర్ధేశించడం ప్రణాళికా రచయితల బృహత్తార కర్తవ్యం. ఈ నూతన ధృక్పధంతోనే వెనకబాటుతనాన్ని వెతికి గుర్తించడం దానిని నివారించడానికి నిర్దిష్టమైన విధానాలను రూపోందించడం, ఆచరించడం అత్యవసరం. అంతేకాని కాలదోషం పట్టిన, అశాస్త్రీయమైన కుల, మత, భాష ప్రాంతీయతల ప్రాతిపదికన వెనకబాటుతనాన్ని నిర్ణయించడం అశాస్త్రీయం, అసంబద్ధం, అనర్ధకం.

స్వాతంత్రనంతర అర్థశతాబ్ది మహాప్రస్థానంలో భారత జాతి విద్యా, విజ్ఞాన రంగాలలో ప్రపంచంలోనే 3వ స్థానాన్ని అలంకరించడం అభివృద్ధిలో 5వ స్థానాన్ని సంపాదించడం గర్వకారణం. జనాభాలో 2వ దేశంగా నుండి. సుమారు 3వ వంతు జనాభా దారిద్ర్య రేఖకు దిగువగా నుండడం, ప్రపంచ పేదలలో అధికుల నిలయంగా నుండడం జాతికే అవమానకరం. ఈ పరిణామాన్ని ఇంతవరకు విశ్లేషించిన రాజకీయ, సామాజిక అర్థశాస్త్రవేత్తలు భిన్నాభిప్రాయలు వెలిబుచ్చినప్పటికి ఈనాడు అందరూ స్థూలంగా ఆమోదించిన సత్యం ఒకే ఒకటి అదే సంస్కరణల సిద్దాంతం.

"అభివృద్ధికి" అర్థాలు మారిపోయిన యుగమిది. పారిశ్రామీకీకరణ, వాణిజ్య, వ్యాపార పురోభివృద్ధి, ఎగుమతి ప్రధానమైన అభివృద్ధి పెట్టుబడుల విస్తరణ అభివృద్ధికి సూచిక మాత్రమే. జాతీయ తలసరి అదాయం పెరగడం అభివృద్ధి సూచికగా పూర్వం గుర్తించేవారు. కొందరి సంపాదనను అందరి సంపాదనగా చిత్రించే అపభ్రంశం అది. "మానవాభివృద్ధి" నూతన ఆవిష్కరణ. అట్టడుగున వున్న సామాన్యుడి జీవితంలో ప్రతిబింబించే సుఖ సంతోషం దీనికి గీటురాయి. వారిలో సాధించబడిన విద్య, విజ్ఞానం, ఆరోగ్యం, పౌష్టికాహారం మాత శిశు సంరక్షణ, వృద్దుల సంక్షేమం, ఉత్పత్తి సాధనాలపై సాధికారత, స్వశక్తి స్వావలంబన లాంటి అంశాలు మానవాభివృద్ధికి మూల కందాలు. కోట్లాది శ్రమజీవుల ప్రత్యక్షపాత్ర దీనికి మార్గం. దీనిని సుగమం, సుసాధ్యం చేయవలసిన ప్రధాన బాధ్యత ప్రజాస్వామ్య ప్రజాహిత పాలకవర్గాలది. ఈ అవగాహన లోపమే గత దశాబ్ధ కాలం అశించిన అభివృద్ధిని సాధించలేకపోవడానికి మూలకారణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల కొరత, స్వదేశీ పెట్టుబడులను ప్రోత్సహించకపోవడం, విదేశీ పెట్టుబడుల పట్ల ఏహ్యాభావాన్ని ప్రదర్శించడం, శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవ వనరులను సాధించ లేకపోవడం ఇవన్నీ అభివృద్ధి పట్ల కాలదోషం పట్టిన బావాల ఫలితంగా ఏర్పడిన దోషాలు. అందుకే దశాబ్దాల తరబడి జాతీయ, అంతర్జాతీయంగా ఏర్పడిన సదవకాశలను సద్వినియోగం చేసుకోలేకపోవడం జరిగింది. అభివృద్ధి, మానవాభివృద్ధి చాలా పరిమితంగా కొనసాగింది అవకాశాలు కొరకు అందోళన చెందిన యువత నిరాశ, నిస్పృహలతో మతతత్వం, కులతత్వం, ప్రాంతీయ తత్వాలను ఆశ్రయించడం లాంటి దుర్లక్షణాలు చోటుచేసుకున్నవి. పరిపాలనా రంగతో సహ అన్ని రంగాలు క్షాళనం చేయడం, ఉత్పత్తి దాయకం, ఉపాధికల్పనయుతం చేయడం సంస్కరణ ఉద్యమాల లక్ష్యం. ప్రతికూల ఫలితాలనిస్తూ సామాజిక పురోగమనాన్ని నిరోధించే నియమ నిబంధనలను తొలగిస్తూ విన్నూత్న ఆలోచనలతో అత్యంత ప్రధానమైన మానవవనరులను అందులోని ప్రజాశక్తిని ఉపయుక్తంగా మలుచు కోవడం అభ్యుదయ శక్తుల కర్తవ్యం. ఈనాడు సాధించబడిన జాతీయ సగటు అభివృద్ధి వేగాన్ని ఐదున్నర, ఆరు శాతం నుండి 10వ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకోబడిన 8వ శాతాన్ని సాధించడం అత్యవనరం.

మానవాభివృద్ధి లక్ష్యంగా అన్ని వర్గాలు, ప్రాంతాలలో ఇంకా పెద్దగానే మిగిలిన దారిద్ర్యాన్ని పారద్రోలడం జాతి ప్రధాన కర్తవ్యం. 1991లో ప్రారంభించబడిన ఆర్థిక సంస్కరణలు బహుముఖం చేస్తూ, వేగిర పరస్తూ అర్థవంతం, ప్రయోజనాత్మకం చేయడం అందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణకు పూనుకోవడం ప్రజాతంత్ర వాదులందరి కర్తవ్యం. దీనిని ఏకైక సిద్ధాంతంగా నమ్ముతూ అంకిత భావంతో నిర్విరామంగా కృషి చేస్తున్న మన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సంస్కరణలకి మారుపేరు. 8 సం॥ల అనతికాలంలో ఆయన నాయకత్వంలో అన్ని రంగాలలో ఆంధ్రప్రదేశ్ సాధించిన విజయాలు, అభ్యుదయ కాముకులందరిని ఆకర్షిచడం యాధృశ్చికం కాదు. మన ఆర్థిక, సామాజిక మార్పుకు ప్రబల సాధనంగా గుర్తించబడిన సంస్కరణల శకానికి ఆయన నాయకుడు. అభ్యుదయ గాములందరు రాజకీయాలకు అతీతంగా చేయి చేయి కలిపి సంస్కరణల వుద్యమాన్ని కొనసాగించడం అభివృద్ధి సాధనకి, వెనకబాటుతన నివారణకి అవసరం.

# మన ఉన్నత విద్యా విధానము

సాధారణ విద్య మరియు ఉన్నత విద్య లక్ష్యాలు, వాటి సాధన మార్గాల గురించి ఇంతవరకు మనదేశ విజ్ఞాన వేత్తలు క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన నివేదికలు అందజేసియున్నారు. విద్య వ్యక్తిగతమే కాక సమాజపరమని, సామాజిక పరివర్తనలో విద్య ఒక క్యాటలిటిక్ (Catalytic) ఏజంటుగా పనిచేస్తుందని, అది ఒక సంక్షేమ కార్యక్రమమే కాక దేశ అభివృద్ధికి అత్యంత ఉత్తమమైన పెట్టుబడియని నిర్ద్వందంగా విశ్లేషించి చెప్పారు. మనదేశంలో అక్షరాస్యులు, విద్యాధికుల సంఖ్య అత్యంత వెనకబడియుందని దీనిని త్వరితగతిన పరిమాణాత్మకంగా, గుణాత్మకంగా అభివృద్ధి పరచాలని స్పష్టం చేశారు. ఈ వెలుతులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానాన్ని రూపొందించి అమలుపరచి అనతికాలంలోనే సత్ఫలితాలను సాధించాలని నిరంతరం ప్రకటనలు చేయడం జరుగుచున్నది. ఇప్పటికీ ప్రకటనల పర్వం దాటి ఫలితాలను పొందిన స్థితికి చేరుకోలేదు. తిరిగి విద్యా విధానల గురించి చర్చలు కొనసాగడం ఏమాత్రం సంతృప్తికరంగా లేదు.

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అత్యధికంగా ఆధునికంగా విస్తరించుచున్న ఈనాడు మనదేశం విద్య విషయంగా వెనకబడియుండడం యాధృశ్చికం కాదు. విజ్ఞానవంతుల సంఖ్యా బలంలో ప్రపంచంలో మూడవ దేశంగా వున్నప్పటికి అదే విజ్ఞాన ప్రయోగం ఫలితంలో అట్టడుగున పడియుండడం అత్యంత విచారకరం. కాలగమనంతో ఈ అంతరాయం మరింతగా పెరిగి మనదేశం సుదూర కాలంలో కూడా అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడగల్గుతుందని అనునది సందేహాస్పదం. కాబట్టి మనదేశ ఉన్నత విద్యా విధానానికి స్పష్టమైన, శాస్త్రోక్తమైన రూపకల్పన చేసి యుద్ధ ప్రాతిపదికపై ఆచరించి అనతికాలంలో సంతృప్తికర ఫలితాలను సాధించవలసియున్నది.

ఉన్నత విద్యా విధానం మనదేశ ఆర్థిక, సాంఘిక విధానంలో అంతర్భాగం. దేశ సమగ్ర అభివృద్ధి దిశ దశలపై ఇది ఆధారపడి వుంటుంది. ఇది మన విద్యావేత్తలు గుర్తించిన సత్యమే. మన దేశ ఆర్థిక, సాంఘిక పురోభివృద్ధికి ఒక స్పష్టమైన జాతీయమైన మార్గము నాలుగు దశాబ్దాల స్వాతంత్ర్యానంతర సుదీర్ఘ కాలంలో నిర్ణయించుకోలేక పోవడం గమనార్హం. ఇంకా పారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య, వ్యాపార విధానాల

రూపకల్పనలు చర్చల్లో వుండడం గమనార్హం. ఫలితంగా మన దేశ అభివృద్ధి మార్గం, లక్ష్యం ఇంకా అస్పష్టంగా నుండడం వాస్తవం. ఈ కాలంలో అనిశ్చితంగానైనా, ఆదర్శ రహితంగానైనా ఆర్థిక, సాంఘిక అభివృద్ధి క్రమం కొనసాగింది. రకరకాల ప్రయోగాలతో తాత్కాలిక ప్రయోజనాలతో, ఆపత్కాల విధానాలతో, జనాకర్షణ అవసరాలతో ఇంత పెద్ద దేశ కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఇటువంటి విధానాల ఫలితంగా ప్రతి సందర్భంలో కూడా ఆశించిన ఫలితాలు సాధించబడలేదు. లక్ష్యాలు నెరవేర్చబడలేదు. అన్ని రంగాలలో నిరాశలు, నిస్పృహలు ఏర్పడినవి. ఈ దుష్పరిణామాలు యువతరంలో నైరాశ్యానికి దారితీస్తూ వారిలో సహజ సిద్ధంగా నుండే దేశాభిమానం, దేశభక్తి, దేశసమగ్రత, సమైక్యతలాంటి వున్నత విలువలను కృంగదీశినవి. ఈ విధంగా దేశమే కృంగి నీరసించిపోతున్నది. రెండవ వైపు పై నుదహరించిన గమ్యం, లక్ష్యంలోని తాత్కాలిక విధానాల చాటున స్వార్థపరశక్తులు విజృంభించినాయి. అనాయాసంగా, కృషిలేకుండా అమాంతంగా ధనికులుగా మారే యుక్తులు, కుయుక్తులు ప్రబలంగా అన్ని రంగాలలో చోటుచేసుకున్నాయి. ఒక విద్యగా ప్రచారంలోకి వచ్చినవి. పారిశ్రామిక, వ్యవసాయ కృషి ఫలితంగాకాక నిష్క్రియాపరంగా, దళారీ వృత్తిగా, లంచగొండితనంతో ధనార్జన చేసే నయా ధనిక వర్గం ఏర్పడింది, బలపడుచున్నది. తరతరాలుగా ఆకాంక్షించి గౌరవించబడిన పవిత్రవిలువలు, దేశభక్తి, నిస్వార్థత, స్వార్థత్యాగం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, కుల మత సామరస్యం, జాతీయత, శాంతి సహజీవనం, శాస్త్రీయదృక్పథం, స్త్రీలపట్ల గౌరవం, సమభావం, కష్టించి పనిచేయడం, ఇవన్నీ నిర్లక్ష్యం చేయబడుచూ చివరకు వ్యతిరేకించబడుచున్నవి. కుల మత వైషమ్యం, దళితులపై దమనకాండ, ప్రాంతీయతత్వం పెచ్చురిల్లుచున్నవి. హింసా ప్రవృత్తి పెరిగి విద్వేషాగ్నులు నలుదిశలలో చెలరేగుచున్నవి. హింసావాదం సులభసాధనంగా ఆచరింబడుచున్నది. దేశ విదేశీ శత్రువులు బహువిధంగా ఈ అగ్నికి ఆజ్యంపోస్తున్నారు. పరిస్థితి దేశ వ్యాప్తంగానే శృతిమించి రాగాన పడుచున్నది. ఇది మన దేశ ఆర్థిక సాంఘిక విధానాలు, వాటిలో అవిభాజ్యంగా నున్న విద్యా విధానం యొక్క ఘోర వైఫల్యానికి నిదర్శనం కాదా? నిస్సందేహంగా ఈ విధానాల వైఫల్యమే దీనికి ప్రబల కారణం.

ఈ నేపథ్యంలో మన ఉన్నత విద్యా విధానానికి రూపకల్పన చేయవలసియున్నది. అత్యంత అరుదైన మానవ వనరులు, అశేష మానవాళిని కార్యరంగంలోకి ఆకర్షించగల శక్తియైన ఉన్నత విద్యను పరిమాణ గుణాత్మకంగా అభివృద్ధిపరచవలసి వుంది. ఉన్నత విద్యతో అత్యంత సన్నిహితంగా ముడిపడియున్న పారిశ్రామిక, వ్యవసాయ జాతీయ, ప్రజాతంత్ర దేశ భక్తియుత శక్తుల మధ్య సమన్వయం సాధించవలసియున్నది.

శతాబ్దాల సామ్రాజ్యవాద పీడన ఫలితంగా మనదేశం ప్రపంచ అభివృద్ధిలో వెనకబడియుండడమే కాక సహజసిద్ధంగా నుండిన దేశీయ అభివృద్ధి మార్గం నుండి

తొలగించబడినది. దేశీయ వృత్తి, వాణిజ్య, వ్యాపార సాధనాలు లేకుండా చేయబడ్డాయి. ఇంతటి వెనుకబాటు తనం నుండి బయటపడి ఆధునిక అభివృద్ధి మార్గములో పయనించడం కష్టసాధ్యమే. అయినా సాంకేతిక విప్లవ యుగంలో శాస్త్రీయ దృక్పథంతో పట్టుదల మరియు సంకల్పబలంతో అపారమైన మానవ వనరుల వినిమయంతో ఎంతటి వెనకబాటుతనానైనా తొలగించుకొని ఆధునిక పథంలో ముందడుగు వేయడం సాధ్యం. పారిశ్రామికాభివృద్ధికి అగ్రతాంబూలం అవసరం. అయితే ఈనాటి సాంకేతిక యుగంలో వెనకటిలాగా పారిశ్రామికాభివృద్ధితో నిరుద్యోగ సమస్యకు పరిష్కార మార్గం సాధ్యపడుతుందని విశ్వసించలేము. సుమారు 100 సంవత్సరముల పారిశ్రామిక అభివృద్ధి ఫలితంగా దేశ జనాభాలోని 15% వరకైనా ఈ రంగం ఆధారపడడం కష్టసాధ్యమవుతున్నది. కార్మికశ్రమ శక్తిస్థానే యాంత్రిక శక్తి విజయవంతంగా పనిచేస్తున్న ఈనాటి ప్రారిశ్రామిక ప్రగతితో ఈ మాత్రం జనాభా కొరకు ఉద్యోగ భద్రత నిలబట్టుకోవడం కష్టసాధ్యం. కాబట్టి ప్రపంచ మార్కెట్‌లో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ తప్పని ఈ తరుణంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా ఉపాధికల్పన లేక నిరుద్యోగ నిర్మూలన లక్ష్యాన్ని చాలా పరిమితంగా మాత్రమే సాధించగల్గుతాం. అయితే నిత్యావసర సరుకుల ఉత్పత్తి వాటి పంపకంలో తప్పకుండా కొద్ది కాలంలోనే స్వావలంబన సాధించడం సాధ్యపడుతుంది. ఇదే ప్రధాన లక్ష్యంగా పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయవలసియున్నది. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగుల సైతం ఉపాధిని సంపాదించుకుని ఆరోగ్యకర అభ్యుదయ జీవన స్రవంతిలో ముందుకు పోవాలంటే వ్యవసాయం మరియు వ్యవసాయాధార పరిశ్రమలు విశేషంగా, ప్రత్యేకంగా అభివృద్ధి చేయబడాలి. ఈ రంగానికి ఈనాడు పట్టించబడిన గ్రహణాన్ని తొలగించి సమాజంలో గౌరవప్రద స్థానాన్ని సంతరింపచేయాలి. ఇది శాస్త్రీయ విజ్ఞాన భరితమై యువతరానికి గ్రామసీమలు నిలయమై దేశాభివృద్ధికి దేశీయమైన ప్రత్యేకమార్గంగా గుర్తింపుపొందాలి. పాశ్చాత్య పట్టణ ప్రధాన సంస్కృతి నుండి విముక్తి చేయబడాలి. అపారమైన ప్రకృతి సంపద కొల్లలుగా లభ్యమయ్యే వ్యవసాయ రంగాన్ని నవతరానికి సంతృప్తి కలిగించే ఉద్యోగముగా తీర్చిదిద్దబడాలి. కేవలం పరిశ్రమలకు చౌకగా ముడిసరుకులనందిస్తూ ప్రకృతి వైపరీత్యాలకు బలియగుచూ ఆర్థికంగా చితికిపోతూ ద్వేషించబడి, ధూషించబడే ఈనాటి దయనీయ స్థితినుండి ఈ రంగం బయటపడాలి. కర్షకులు గౌరవ ప్రతిపత్తులుగల కృషీవరులుగా ఆదరించబడాలి. అప్పుడే వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార రంగాలు సాద్యమైనంత మోతాదులో యువశక్తిని తమలో ఇముడించుకొని తమ ఉత్పత్తిని, ఉత్పాదకతను సాధించగలుగుతాయి. ఇది సాధ్యపడాలంటే కేంద్రం నుండి గ్రామస్థాయి వరకు ప్రణాళికబద్ధ ప్రగతి మార్గాన్ని నిర్దేశించుకోవడం అత్యవసరం. ప్రభుత్వాలు దూరదృష్టితో ప్రపంచ అభివృద్ధి క్రమంలో తమ పాత్రను విస్మరించకుండా వివిధ రంగాల ప్రాధాన్యతలను తప్పకుండా సంపూర్ణ ఆధునీకరణ ప్రయత్నాన్ని విడవకుండా చేయవలసి

వుంటుంది. కేవలం దేశంలోని 5% జనాభాకు అవసరమైన విలాస వస్తువుల అనవసర దిగుమతుల కారణంగా దేశ ప్రజల నడుములు విరగగొట్టే అప్పులు, పన్నులు, ద్రవ్యోల్బణ దుర్విధానాలకు భరతవాక్యం పలకాలి. నూతన పారిశ్రామిక విధానం ఎగుమతులు ప్రధానంగా ఆర్థిక స్వతంత్రత ఆధారంగా ప్రైవేటు, పబ్లిక్ రంగాల మేలుకలయికగా దేశ పురోభివృద్ధికి రాచబాటగా నిర్ణయించబడాలి. నయావలస వాదులు వారి సంస్థలు కోరిన విధంగా స్వతంత్ర ఆర్థికాభివృద్ధికి హాని కలిగించే మార్గాలను నిరాకరించాలి. ఈవిధంగా మన రాజకీయ స్వతంత్ర్యాన్ని ఆర్థిక స్వతంత్రంగా పరిణతి కల్పించి స్వతంత్ర దేశంగా ఆత్మగౌరవంతో ప్రపంచ దేశాలలో తలెత్తుకుని తిరగగలగాలి. సాంఘికంగా, ఆర్థికాభివృద్ధి ఫలితాలను ప్రయోజనాలను అట్టడుగునబడియున్న బలహీన వర్గాలకు వారి వారి కృషి ఫలితాలుగా వారికి అందజేయబడాలి. క్షుద్ర రాజకీయ జనాకర్షణ విధానాల వలయం నుండి జనాభాలో శ్రమవీరులుగా నున్న 35% జనాభాను విముక్తిచేయాలి. వారిలో సహజ సిద్ధంగా వున్న శ్రమశక్తి పట్ల అభిమానాన్ని, వారి ఆత్మాభిమానాన్ని ఇనుమడింపచేయాలి. స్వతంత్ర పౌరులుగా దేశ సంపదను పెంచడంలో తమ విద్యుక్తధర్మాన్ని నిర్వహించినందుకు జాతి గౌరవంలో వారు పాలుపంచుకోవాలి.

ఇటువంటి భవిష్యత్ సాధనలో మన సాధారణ విద్యావిధానం, ఉన్నత విద్యా విధానం తమ వంతు బాధ్యతను నిర్వహించడానికి పదునుపెట్టబడాలి. ప్రాథమిక, సెకండరీ, ఇంటర్ మీడియట్ మరియు డిగ్రీ కళాశాలలు తమ తమ స్థాయిలలో ప్రయోజనకరంగా నిర్వహించబడాలి. ప్రారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య, వ్యాపార రంగాలలో విరివిగా ఉపాధికల్పన ప్రణాళికలు సిద్ధంచేయబడి నాటితో సెకండరీ, ఇంటర్ మీడియట్ మరియు ఉన్నత విద్య ముడిపెట్టబడాలి. విద్యాలయాలు, కళాశాలలు, ఉత్పత్తి రంగాలతో అత్యంత సన్నిహితంగా సమన్వయం చేయబడాలి. వృత్తి విద్య ప్రధాన విద్యగా ప్రయోజనకర ఉపాధి సాధనంగా తీర్చిదిద్దబడాలి. విద్యార్థులలో అత్యధిక శాతం కనీసం 90% ఈ దిశలో సంతృప్తికరమైన, జీవనాధారమైన శక్తి సామర్థ్యాలను సాధించుకున్నామనే ధైర్యంతో జీవనయాత్రను సాగించాలి. ఇది తప్పమరో మార్గం వుండదు. వుండకూడదు. ఈనాటి పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగానుండడం మన గతకాలపు గందరగోళ విధానల ఫలితమే. ఈ గందరగోళం నుండి బయటపడడమే నూతన విద్యా విధానం యొక్క ప్రధమ కర్తవ్యం. ఉన్నత విద్య కేవలం డిగ్రీల కితాబుల సాధనంగా నడుస్తున్నది. పరిమితమైన ప్రభుత్వ ఉద్యోగాల సాధనకై పోటీపడుచున్న అపరిమితమైన యువతీ, యువకులు ఈ డిగ్రీల కొరకు ఉద్యోగాలకై పాస్ పోర్ట్‌లుగా వున్న ఈ డిగ్రీలకై కళాశాలల్లో చేరి ఉత్తీర్ణులవుచున్నారు. ఆ తరువాత ఉద్యోగ ప్రవేశం దొరకక ఉద్యోగ వేటలో ఓడిపోయి, ఓటమిని చవిచూచి నిరాశ, నిస్పృహల గాడాంధకారంలో దారీతెన్నూ లేక తిరగబడుతున్నారు. దేశం, సంఘం తుదకు తమ కుటుంబంపై గల అభిమానాలను త్యజిస్తున్నారు. గత రెండు దశాబ్దాల

సుదీర్ఘ కాలంలో ఈ విషఫలితాలు పెచ్చుపెరిగి పరాకాష్టకు చేరుకుంటున్నవి. మన విద్యావిధానం 10% పుణ్యం 90% పాపాన్ని సృష్టిస్తున్నది. ఇది స్వయంకృతాపరాధ ఫలితం. దీనిని ఆమూలాగ్రంగా త్వరగా సంస్కరించనిదే ఒక్కడుగు కూడా ముందుకు వేయలేము.

దీనిని విద్యావేత్తలు. అధ్యాపక ఉపాధ్యాయులు, విద్యార్థుల మీదు మిక్కిలి రాజకీయనాయకులు ఒక అత్యవసర పరిస్థితిగా భావించక తప్పదు. సమగ్రమైన సంస్కరణలతో అవిభాజ్యమైన ఉన్నత విద్య సంస్కరణను నూతన విద్యా విధానం ద్వారా సాధించాలి. ఉన్నత విద్య ప్రత్యక్షంగా తన పాత్రను నిర్వహించాలి. సమాజం, దేశ అభివృద్ధికి పాటుపడగలిగే కొన్ని ప్రధాన రంగాలను విస్మరించకుండా కృషిచేయాలి. ఎంత మంచి విధానాన్ని అనుసరించినా మనదేశంలో పెరుగుతున్న జనాభా దృష్టిలో పేదరిక నిర్మూలన, సాంఘిక న్యాయసాధన దాదాపు అసంభవంగా కనబడుచున్నది. విద్యా వ్యాపకం విద్యావంతుల ఆదర్శం. ఈ దిశలో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నవి. అందుకవసరమైన ప్రత్యేక పాత్రను ఉన్నత విద్య నిర్వహించవచ్చును. పర్యావరణ పరిరక్షణ కూడా ఉన్నత విద్యలో ప్రధాన అంశంగా నిర్వహించవలసి వుంటుంది. పట్టణ, గ్రామాల మధ్య పెరిగిపోతున్న తేడాలను తగ్గిస్తూ, గ్రామసీమలలో ప్రకృతి ఒడిలో కష్టించి పనిచేస్తూ పట్టణ సుఖాలను అనుభవించగల అవకాశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టవలసియున్నది. విద్య అర్థరహితమైన, అరాచకమైన పరిణామాలకు దారితీయకుండా ప్రధానంగా సంస్కార సాధనంగా మలచబడాలి. ఋషులు, మునులు వేదకాలం నుండి అందించిన ఆధ్యాత్మిక చింతన ఆ తరువాత వివిధ మత ప్రవక్తలు, సంఘ సంస్కర్తలు అందించిన విలువైన మానవీయమైన సంస్కృతి, సాంప్రదాయాలను పోషిస్తూ దానితో ఆదునిక శాస్త్రీయ సమసమాజ దృక్పధాలకు వంతెనలు నిర్మించే ప్రగతిశీల కర్తవ్యాన్ని నిర్మించే బాద్యత ఉన్నతవిద్యదే.

దేశ ప్రగతికి సోపానంగా నుండి ప్రాతిపదిక చట్రంగా పనిచేయు విద్యా విధానంపై అందులో శిఖరాగ్రంగా నుండే ఉన్నత విద్యకై వనరులను కేటాయించడం చర్చానీయాంశం కాకూడదు. మన దేశ ఆర్థిక వనరుల పంపకంలో విద్య సముచిత స్థానాన్ని అలంకరించాలి. దేశ వార్షిక ఆదాయం నుండి ఈనాడు వెచ్చించబడుచున్న సుమారు 3% వనరులను కనీసం రెట్టింపు చేసి 6% వరకు పెంచడం అత్యవసరం. ఆ వనరులను వివిధ విజ్ఞాన రంగాలకు సమపాళ్లలో పంపకం చేసుకోవచ్చు. సాంకేతిక విద్య ముఖ్యంగా ఇంజనీరింగ్, వైద్య విద్య అనేక కష్టాలలో వున్నవి. వాటి విస్తరణ అత్యవసరంగా నున్నప్పటికీ వాటి పట్టభద్రుల అగచాట్లు నిరాశాజనకంగా వున్నవి. ఉపాధి లేక, అవకాశాలు లేక విదేశాలకు మన మేధాశక్తి వలసపోవుచున్నది. అవమానకరమైన ఈ బ్రెయిన్ డ్రెయిన్ ప్రక్రియను అరికట్టాలి. మన దేశంలో పరిశోధన

అవకాశాలను విస్తృత పరుస్తూ పబ్లిక్ మరియు ప్రైవేట్ రంగాలలో సముచిత వేతనాలతో ఉద్యోగ పరిరక్షణ గ్యారంటీచేయాలి.

ఉన్నత విద్యను క్రమంగానైనా ప్రైవేటు రంగానికి ధారాదత్తం చేయాలని ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తున్నది. చర్య కూడా చేపట్టబడుచున్నది. ఈ ఆలోచన దేశ ఆర్థిక, సాంఘిక పునరుజ్జీవనంలో అవినాభావంగా నుండలసిన నూతన విద్యా విధాన ఫలితంగా రావడం లేదు. మళ్ళీ తాత్కాలిక ఆలోచన ఫలితంగానే కలుగుచున్నది. ఇది హానికరం. ఉన్నత విద్య ఉన్నత ఆదర్శాల సాధన. అది తన ఔన్నత్యంలో, విస్తరణలో దిన దిన ప్రవర్ధమానం కావాలి. అందులోనుండే విద్యార్థులకు చౌకగా, సులభంగా విద్యనభ్యసించే అవకాశం వుండాలి. భావి పౌరులను తీర్చిదిద్దే సృష్టికర్తలుగా నుండే అధ్యాపకులు సమాజంలో అత్యంత ఉన్నత కర్తవ్య నిర్వహణ చేసినందుకు సముచిత ప్రతిఫలం పొందితీరాలి. ఎట్టి పరిస్థితులలో కూడా వారి జీవిత ప్రమాణం పడిపోకూడదు. ఇది ఉపాధ్యాయ అధ్యాపకులందరికీ చట్టబద్దంగా గ్యారంటీ చేయబడాలి. ప్రభుత్వం వేయికళ్ళతో విద్య, విద్యార్థి, అధ్యాపక ప్రయోజనాలను భాధ్యతగా కాపాడాలి. విద్య ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో విస్తరించడం అభ్యంతరం కాకూడదు. వివిధ రంగాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ద్వారా విద్యా ప్రమాణాలు పట్టభద్రుల సామర్థ్యాలు కాలానుగుణంగా పెరుగుతూపోవాలి. ఇదే ప్రధాన లక్ష్యంగా నుండాలి. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు స్వతంత్రంగా, ప్రజాతంత్రంగా పనిచేయాలి. ఈనాడు దాపురించిన రాజకీయ జోక్యాలు అసలు విద్యకు, విజ్ఞానానికి హానికరంగా పరిణమిస్తున్నవి. వీటిని అరికట్టి నిజమైన స్వతంత్ర ప్రతిపత్తిని సాధించాలి. ఉన్నత విద్య గురించి చర్చా ఘోస్టులతో పాటు దేశ వ్యాప్తంగా బాధ్యతగల పక్షాలన్నింటి మధ్య సదవగాహన సాధించి తుదిరూపమివ్వాలి.

# తెలుగు నాట వ్యవసాయ రంగంలో నాలుగు దశాబ్ధాల పరిణామాలు

తెలుగు నాట అత్యంత భారీ పరిశ్రమ వ్యవసాయం. 75% శ్రామికులకు ఉపాధి కల్పించే ప్రధాన రంగం. పెరుగుతున్న జనాభాకు ఉపాధి అవకాశాలను అందించగల రంగం. శాస్త్రీయ అభివృద్ధి వ్యవసాయ రంగములో విప్లవాత్మక మార్పులను తెచ్చిపెట్టింది. భోజనం మాత్రమే కాకుండా ఇతర జీవితావసరములను సమకూర్చుకునే ఆర్థిక స్తోమతను కూడా ఈ రంగం కల్పిస్తున్నది. ఇటీవలి కాలంలో భారతదేశ వ్యవసాయ రంగములో గొప్ప మార్పులు వచ్చినవి. ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలబడి నూతన వ్యవసాయ ప్రక్రియను నిర్వహిస్తున్నది. స్వాతంత్రానంతర గత నాలుగు దశాబ్ధాల పరిణామాలు అత్యంత  ఆసక్తికరమైనవి.

స్వాతంత్రానికి పూర్వం నాలుగు దశాబ్ధాల సుదీర్ఘ కాలంలో నిర్వహించబడిన సంఘటిత జాతీయ స్వాతంత్ర్య ఉద్యమాలలో రైతాంగం యొక్క పాత్ర అద్వితీయమైనది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమ రాజ్యాధికారాన్ని సుస్థిరము చేసుకొనడానికై స్వదేశీ భూస్వామ్య రాచరిక వర్గాలపైననే ఆధారపడినారు. అసలు మనదేశములో వర్గరహితమైన గ్రామీణ జీవితములో భూస్వామ్య వర్గాన్ని సృష్టించి పోషించడములో బ్రిటీష్ సామ్రాజ్యవాదులు గొప్ప పాత్రను నిర్వహించినారు. సంస్థానాలు, రాచరికాలను కాపాడడంలో కూడా గొప్ప పాత్ర నిర్వహించినారు. ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ గ్రామీణ ప్రజల జీవితాన్ని దుర్భరము చేసింది. స్వాతంత్ర పోరాటాలలో ప్రత్యక్ష పాత్ర నిర్వహించిన గ్రామీణ ప్రజలు, వారి ప్రతినిధులు తమ పోరాటాల ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో పాటు భూస్వామ్య వ్యవస్థను కూడా కూలద్రోయాలని ఆకాక్షించారు. 40వ దశకంలో వీరోచితంగా నిర్వహించబడిన రైతుపోరాటాలు దీనికి ప్రబలతార్కాణం. బెంగాలులో జరిగిన కౌలు రైతుల తెభాగా పోరాటం, కాశ్మీరులో భూసంస్కరణల కొరకు మహరాజుకు వ్యతిరేకంగా నిర్వహించబడిన ఉద్యమం, ట్రావెన్ కూర్, కొచ్చిన్ సంస్థానంలో జరిగిన రైతుల పోరాటాలు, హైద్రాబాద్ సంస్థానంలో భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా తెలంగాణా ప్రాంతములో నిర్వహించబడిన వీరోచిత విప్లవ సాయుధ పోరాటం ఇవన్నీ మన సామ్రాజ్య వ్యతిరేక భూస్వామ్య వ్యతిరేక పోరాటములో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టాలు.

స్వాతంత్ర్యానంతరం ఈ రైతు పోరాటాలు తమ ప్రప్రథమ విజయ పతాకాన్ని ఎగురవేసినవి. కొద్ది మాసాల తరతమ తేడాలున్నప్పటికీ దేశ వ్యాపితంగా జాగీరుదారీ, జమిందారీ వ్యతిరేక చట్టాలు ఆమోదించబడి అమలుపరచబడినవి. ఆంధ్ర ప్రాంతములో జమిందారీ రద్దు చట్టం, తెలంగాణా ప్రాంతములో జాగీరుదారీ మొదలగు వ్యవస్థల రద్దు చట్టాలు అమలులోకి వచ్చినవి. భూకేంద్రీకరణ కొంతవరకు తగ్గినప్పటికీ వేలాది ఎకారాలతో కూడిన గ్రామాలకు గ్రామాలు తమ జాగీరులు, జమీనులు, అగ్రహారాలు, ఇనాములుగా తమపాదాల క్రింద తొక్కిపెట్టిన ప్యూడల్ వ్యవస్థ బ్రద్ధలు కొట్టబడింది. లక్షలాది రైతులు శతాబ్దాల తరువాత స్వేచ్ఛా స్వాతంత్ర వాయువును పీల్చుకోగలిగినారు. నిజంగా ఈ 40వ దశకం ఒక దోపిడీ వ్యవస్థను అంతమొందించి నూతన శకానికి శ్రీకారం చుట్టింది. ప్యూడల్ వ్యవస్థలోని ఒక శత్రువర్గాన్ని అంతమొందించిన రైతు ఉద్యమాలు అంతటితో విశ్రమించలేదు. అర్ధ ప్యూడల్ వ్యవస్థగా వేలాది ఎకారలపై యాజమాన్యపు హక్కులు చెలాయించే నిరంకుశ భూస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసినవి. దున్నేవానికే భూమి అను నినాదముతో లక్షలాది కౌలు రైతులు ప్రభుత్వ బంజరులపై పట్టాలు ఇమ్మని లక్షలాది వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు విజృంభించినారు. 1959వ దశకం ఈ పోరాటాలలో ప్రారంభమైంది. జమిందారీ రద్దు, జాగీర్‌దారీ రద్దు, ఇనాందారీ రద్దు చట్టాలను చిత్తశుద్ధితో అమలుపరచడానికై ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని జిల్లాలలో రైతులు, గ్రామీణ పేదలు తమ నిరంతర పోరాటాలను నిర్వహించారు. తత్ఫలితంగా పై చట్టాలను అమలు జరిపించుకోవడంతో పాటు భూములపై గరిష్ట పరిమితిని విధిస్తూ, కౌలుదారులను రక్షిస్తూ కౌలు రేట్లను క్రమబద్ధం చేసే చట్టాలు ఆమోదించబడినవి. సవరించబడినవి.

40వ దశకంలో ప్రారంభమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటములోని రెండవ అధ్యాయం గత నాలుగు దశాబ్దాల కాలంలో కొనసాగింది. ఇంకా కొనసాగుతున్నది. అయితే భూసంస్కరణల చట్టం, కౌలుదారీ చట్టం, బంజరు భూములు పంపక నిబంధనలు ప్రజా పోరాటాల ఫలితంగా రెండు మూడు పర్యాయాలు సవరించబడినవి. ప్రతి సవరణ రైతాంగం భూమిలేని పేదలకు అనుగుణంగా తేబడింది. రైతు పోరాటాలు స్థానికంగా రాష్ట్ర వ్యాపితంగా అనేక విజయాలు సాధించినవి. చట్టాలను సాధించడంలో రైతులు సమరశీల త్యాగపూర్వక పోరాటాలు కీలకమైన పాత్ర నిర్వహించినప్పటికీ ఈ చట్టాలను ఆచరణలో అమలు పరచడంలో నీరుగార్చుతూ, నిష్ప్రయోజనం చేయడంలో భూస్వామ్య వర్గ దృష్టితో పనిచేసే అధికార బృందం అనేక అవరోధాలను సృష్టించింది. భూస్వాములతో కుమ్మక్కై మోసపూరిత పట్టాలను సృష్టిస్తూ అనవసర వ్యాజ్యాలను పెంచుతూ కోర్టుల చుట్టూ రైతాంగాన్ని త్రిప్పి విసిగించడం జరిగింది. అసంఘటిత రైతాంగం ఈ స్వార్థపర వర్గాలు సృష్టించే నిత్య నూతన కుతంత్రాలను అరికట్టడంలో, ఎదిరించడంలో అనేక ఇబ్బందులకు గురికావలసివచ్చింది. ఫలితంగా భూసంస్కరణల

చట్టాలు ఉద్దేశించిన లక్ష్యాన్ని పూర్తిగా సాధించలేదు. లక్షలాది ఎకరాల భూమి ఉచితంగా భూమిలేని నిరుపేదలకు దక్కవలసింది దక్కలేదు. భూస్వాములు కాలమార్పును గమనిస్తూ లక్షలాది ఎకరాల భూమిని భూసంస్కరణల చట్టాల పరిధి నుండి తప్పించడానికి బినామి క్రయ విక్రయాల ద్వారా మొదలు భూమిని దాచుకొన్నారు. తరువాత క్రమంగా జాగ్రత్తగా ఆ భూములను అమ్మి సొమ్ముచేసుకున్నారు. ఈ ప్రక్రియ గత 3 దశాబ్దాల కాలంలో పెద్దగా జరిగింది. కొద్దిగానైనా ఇంకా జరుగుతూనే వుంది. ఈ విధంగా భూస్వామ్యవర్గ ప్రయోజనం దెబ్బతింటూ, భూకేంద్రీకరణ గణనీయంగా సన్నగిల్లింది. సన్నకారు, చిన్నకారు రైతులు లక్షలాది సంఖ్యలో వ్యవసాయ రంగంలో ప్రవేశించారు. కౌలురైతులు పట్టాదారులుగా మారినారు. ఈనాడు ఆంధ్రరాష్ట్రములోని వ్యవసాయ కమతాలలో 90% మించిన కమతాలను సన్నకారు, చిన్నకారు కౌలు రైతులతో సహా సొంతసేద్యం చేసుకునే మామూలు రైతులేవున్నారు. వీరి స్వాధీనంలో సాగులోని భూమిలో సుమారు 90% ఉండటం యాధృచ్ఛికంగాదు. ఇది గత నాలుగు దశాబ్దాల సుదీర్ఘ నిరంతర రైతు ఉద్యమాల సత్ఫలితం.

ఆంధ్ర రాష్ట్ర వ్యవసాయ రంగములో భూసంబంధ పోరాటాలు చిరస్మరణీయమైన ప్రథమ అధ్యాయంగా ఉంటుంది. ఇందులో నుండే వ్యవసాయ అభివృద్ధి, వ్యవసాయ విస్తరణలు, బహుముఖ వ్యవసాయం, ఉత్పత్తి - ఉత్పాదకాల పెరుగుదల రెండవ అధ్యాయంగా కొనసాగుతుంది. 1956 నుండి 1966 వరకూ హరిత విప్లవానికి పూర్వదశగా గుర్తించవచ్చు. 1967 నుండి 1976 వరకూ హరిత విప్లవ దశగా పరిగణించవచ్చును. 1977 నుండి 1985 వరకూ హరిత విప్లవానంతర దశగా గమనించవచ్చు. ఈ మూడు దశలు కలిపి అంటే 1956 నుండి 1985 వరకూ 30 సంవత్సరముల వ్యవసాయ ప్రగతిని సమీక్షించుకోవచ్చును.

భారతదేశంలో 60వ దశకం మధ్యభాగంలో ప్రారంభమైన హరితవిప్లవం పంజాబ్, హర్యానా, పశ్చిమ యు.పి. ప్రాంతాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలనన్నింటినీ ప్రభావితం చేసింది. ఆంధ్రదేశం ఈ హరిత విప్లవ ప్రభావములో క్రమక్రమంగా చేరుకున్నది. సాంప్రదాయసిద్ధమైన వ్యవసాయ పద్ధతుల స్థానే ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టడమే హరితవిప్లవము యొక్క ముఖ్య పరిణామము. మేలు రకం విత్తనాలు ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకం, నీటి పారుదలను క్రమబద్ధం చేయడం, ఈ వ్యవసాయంలోని క్రొత్తదనానికి ముఖ్యాంశాలు. దీనితో పాటు రవాణా, మార్కెట్టు తదితర ప్రాతిపదిక సౌకర్యాలు కూడా ఈ సాంకేతిక మార్పులతో కూడిన వ్యవసాయానికి తోడ్పడినవి. ఈ కాలంలో ఆంధ్రరాష్ట్రములోని ముఖ్యమైన పంటలు తమ సహజ పరిమితులను దాటి ముందజవేసినవి. సగటు ఉత్పత్తి పెరగడమే కాక ప్రతి ఎకరా దిగుబడిగూడా పెరిగింది. హరిత విప్లవానికి తోడునీడగా అగుపించే ప్రభావము ప్రాంతీయ అసమానతలు. ఒక ప్రాంతం వేగంగా ముందజవేస్తే హరిత విప్లవ ప్రాతిపదిక సౌకర్యాలకు నోచుకోని వెనుకబడిన ప్రాంతాలు వెనుకనే వున్నాయి. ఈ అసమానతలను సరిచేయడం

ఒక ప్రధాన రాజకీయ సాంఘిక కర్తవ్యముగా ముందుకు వచ్చింది. రాష్ట్రములో సగటు సాగు భూమిలో 27% భూమిలో వరి పంట పండించడం జరుగుచున్నది. ఇది రాయలసీమలో 12%, తెలంగాణాలో 20% వుండగా సర్కారు జిల్లాలలో 44% వున్నది. పై ఉదహరించిన మూడు దశలు అనగా హరితవిప్లవ పూర్వము, హరిత విప్లవ కాలము. హరిత విప్లవానంతరం ఈ మూడు దశలలో ధాన్యపు పంట వివిధ రకాలుగా ఉన్నది. మొదటి దశలో వరిధాన్యం సాగుచేయు విస్తీర్ణములో పెరుగుదల రేటు సర్కారు జిల్లాలలో 2% వుండగా అది క్రమంగా తగ్గి మూడవ దశలో 1.34% చేరింది. సగటు సర్కారు జిల్లాలో ఈ విస్తీర్ణం పెరుగుదల రేటు 2.66% వుండినది. రాయలసీమలో వరిపంట విస్తీర్ణం పెరుగుదల మొదటిదశలో 2.29 వుండగా రెండవ దశలో తగ్గి 1.37% నకు చేరింది. మూడవ దశలో అసలు పెరుగుదల లేక వున్నది కూడా తగ్గి -3.72% నికి చేరింది. తెలంగాణా ప్రాంతంలో వరి విస్తీర్ణము మొదటి దశలో 1.51% నుండి రెండవ దశలో 1.41%నకు తగ్గి మూడవ దశలో మరింత తగ్గి 0.25%నకు చేరుకొన్నది. ఈ విధముగా రాష్ట్ర వ్యాపితముగా వరి విస్తీర్ణము పెరుగుదల రేటు మొదటి దశలో 1.89 వుండగా రెండవ దశలో తగ్గి 0.93%నకు చేరి మూడవ దశలో 0.38%నకు చేరింది. అదే విధంగా వరి ధాన్యములో ఉత్పత్తి సర్కారు జిల్లాలో మూడు దశలలో కూడా సగటు 2.79% వుడంగా, రాయలసీమలో 1.82%, తెలంగాణాలో 0.91% మరియు రాష్ట్ర వ్యాపితంగా 2.92% వుండినది. ఉత్పాదకతను పరిశీలించగా మూడుదశలలో కూడా సర్కారు జిల్లాలలో 2.24% వుండి రాష్ట్ర వ్యాపితముగా 2.27%గా వుండగా రాయలసీమలో 1.76%, తెలంగాణా జిల్లాలలో 3.11%గా వున్నది. హరిత విప్లవ ఫలితంగా రాష్ట్ర వ్యాపితంగా ఉత్పాదకత మొదటి దశలో 1.47% వుండగా రెండవ దశలో 3.16% మరియు మూడవ దశలో 4.92% వుండడం గమనార్హం. వరి ధాన్యముతో పాటు మొత్తం కాయ ధాన్యాల పంటల విస్తీర్ణము కూడా రాష్ట్ర వ్యాపితంగా మొత్తం సాగు భూమిలో మొదటి దశలో 63.33% వుండినది. విస్తీర్ణములో పెరుగుదల లేదు. ఉత్పత్తి మరియు ఉత్పాదకతలలో కొంత పెరుగుదల జరిగింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి హరిత విప్లవం తరువాత 8.78% చొప్పున పెరిగింది. మూడవ దశలో తగ్గి 3.59%నకు చేరింది. ఈ పెరుగుదల సర్కారు జిల్లాలలో గణనీయముగా నుండి, రాయలసీమ, తెలంగాణా ప్రాంతములలో కొద్దిపాటిగానున్నది. ఈ పరిశీలన ఈ క్రింది విషయాలను స్పష్టపరుస్తున్నది. ఈ కాలములో వరితోపాటు ఆహార ధాన్యాల విస్తీర్ణములో పెరుగుదల లేదు. కొద్దిగా తగ్గింది కూడా. మొదటి దశ కంటే రెండవ దశ అయినా హరితవిప్లవ కాలంలో ఉత్పత్తి, ఉత్పాదకత బాగా పెరిగింది. హరిత విప్లవానంతర కాలంలో పై పెరుగుదల రేటు నిలకడగా నుండటమే మరింత పెరగడమే కాక కుదించుకు పోతుంది. ఉత్పత్తి పెరుగుదల తాత్కాలికమైపోయింది. వ్యవసాయం గిట్టుబాటుగా నుండకపోవడము మాత్రమే ఈ పెరుగుదల రేటు కుదించుకు పోవడానికి మూలకారణము.

నూనె గింజల ఉత్పత్తి ఆంధ్ర రాష్ట్రములో సాగు భూమిలో 14.87 శాతము విస్తీర్ణములో చేయుబడుచున్నది. ఒక్క వేరుశనగనే 10.01% విస్తీర్ణములో పండించబడుచున్నది. రాయలసీమలో ఈ పంట ప్రధానంగా నుండి సాగు భూమిలో 25% విస్తీర్ణములో వేయబడుచున్నది. సర్కారు జిల్లాలలో ఇది 4.75%, తెలంగాణాలో 5.83% విస్తీర్ణములో పండించబడుచున్నది. హరిత విప్లవానంతర కాలంలో నూనెగింజల ఉత్పత్తి పెరుగుదల రేటు రాయలసీమలో 4.88% వుండగా తెలంగాణాలో 9.18% నుండడం గణనీయమైనది. మొత్తం మూడు దశలలో కూడా ఈ పెరుగుదల రాష్ట్ర వ్యాపితంగా 1.63% నుండినది. మొదటిదశలో రాష్ట్రములో నూనెగింజల ఉత్పత్తి పెరుగుదల రేటు (మైనస్) -4.38% వుండగా రెండవ దశలో పెద్దమార్పువచ్చినది. ఈ పెరుగుదల రేటు 2.84%నకు చేరుకొన్నది. మూడవ దశలో ఈ పెరుగుదల రేటు మరింత పెరిగింది. అన్ని ప్రాంతాలలో పెరిగింది. రాయలసీమలో 7.4% వుండగా, సర్కారు జిల్లాలల్లో 10.71%నకు పెరిగింది. సాగు భూమి విస్తీర్ణములో పెరుగుదలతో పాటు ఉత్పత్తిలో కూడా పెరుగుదల స్పష్టముగా కనబడుచున్నది. వేరుశనగ ఉత్పత్తి పెద్దగా ముందంజవేయడం ఇంకా సాధించవలసి యున్నది.

రాష్ట్రములోని సగటు సాగు భూమిలో 1.07 శాతము చెరకు పంట పండించబడు చున్నది. సర్కారు జిల్లాలలో 1.67 శాతము, రాయలసీమలో 0.73 శాతము తెలంగాణాలో 0.72 శాతము పండించబడుచున్నది. మొత్తం కాలములో చెరకు పంట విస్తీర్ణము సర్కారు, రాయలసీమ జిల్లాలలో 2.63 శాతము మరియు 2.97 శాతము ప్రతి సంవత్సరము పెరుగుచున్నది. పంట ఉత్పాదకతలో పెరుగుదల రాష్ట్ర వ్యాపితంగా తగ్గి (మైనస్)-1.33 శాతమునకు చేరుకున్నది. ఉత్పత్తి మూడు ప్రాంతాలలో పెరిగినది. సర్కారు జిల్లాలో ఈ పెరుగుదల రేటు 2.13 శాతము, రాయలసీమలో 2.73 శాతము, తెలంగాణాలో 1.31 శాతము. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 1.97 శాతము వున్నది. చెరుకు పంటలోని ఉత్పత్తికి మూలకారణం పంట విస్తీర్ణము పెరుగుదల మాత్రమేకానీ పంటలోని ఉత్పాదకత పెరుగుదల మాత్రము కాదని తెలుస్తున్నది. సాంకేతికంగా, శాస్త్రీయంగా చెరకు విత్తనం, ఎరువులకు సంబంధించిన ప్రయోగాల ఫలితాలు చెరుకు రైతుల వరకూ చేరి తత్ఫలితంగా ఉత్పాదకత రేటు పెరగవలసియుంది. అప్పుడు చెరకు ఉత్పత్తి ముందజ వేయగలుగుతుంది.

సాగు భూమి 1.51 శాతము విస్తీర్ణములో పొగాకు పంట పండించబడుచున్నది. ఇందులో 3.25 శాతము సర్కారు జిల్లాలో, 0.53 శాతము రాయలసీమలో 0.48 శాతము తెలంగాణాలో పండించబడుచున్నది. అన్ని దశలలో సాగుభూమి పెరుగుదల రాయలసీమలో 5.19 శాతము, తెలంగాణాలో 3.12 శాతము నుండి రాష్ట్ర వ్యాపితంగా 1.08 శాతము నుండినది. ఉత్పాదకతలో పెరుగుదల సర్కారు మరియు తెలంగాణా జిల్లాలో 4.13 శాతము మరియు 1.73 శాతము వుండగా రాయలసీమలో (మైనస్)

-0.95 శాతము వుండడం గమనార్హం. మొత్త కాలంలో ఉత్పత్తి పెరుగుదల 1.67 శాతము వుండినది.

అన్ని పంటలు, ఆహార వాణిజ్య పంటలు హరిత విప్లవ కాలంలో గణణీయంగా పెరిగినవి. అయినా ఈ పెరుగుదల రేటు తరువాత కాలంలో తగ్గుమొఖం పట్టినవి. వరి పంటకు మినహాయిస్తే ఇతర పంటలలో పెద్ద ముందజ కనబడటము లేదు సరికదా ఉత్పాదకత రేటు క్రమంగా తగ్గముఖం పట్టింది. హరితవిప్లవ ఫలితంగా మెట్ట పంటలపై ఆధారపడే రాయలసీమలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో చెప్పుకోదగిన మార్పురాలేదు. ఇక్కడ వ్యవసాయ వ్యూహములోనే మౌళికమైన మార్పును తెచ్చి ఊట చెరువులు, ఆనకట్టలు మొదలగు కట్టడాల ద్వారా అనావృష్టిని ఎదిరించగలగాలి. సాంకేతికపరమైన మెట్ట సేద్యము ద్వారా ఉత్పత్తి ఇనుమడించాలి. ఈవిధంగా ఉత్పత్తిలో ప్రాంతీయ అసమానతను తగ్గించాలి. హరిత విప్లవానికి కారణభూతమైన మేలు రకపు విత్తనాలు, మంచి ఎరువులు, క్రిమి సంహారక మందులు, నీటి వనరులు, పరపతి సౌకర్యాలు మరియు మార్కెట్లు సదుపాయాలు గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడే సత్ఫలితాలను ఇవ్వగలుగుతాయి. ఈ ఫలితాలు నిలకడగా వుంటాయి. వ్యవసాయం చేసే సామాన్య రైతాంగం యొక్క ఆర్థిక సౌష్టవానికి దోహదం చేస్తాయి. ఏది ఏమైనా వ్యవసాయ ఉత్పత్తి యొక్క విలువ రాష్ట్రములో 1956-67లో అప్పటి ధరల ప్రకారం 380 కోట్ల రూపాయలు వుండగా 1987-88 నాటికి ఈ విలువ పెరిగి 6,290 కోట్ల రూపాయలు చేరుకున్నది. ఈకాలంలో తగ్గిన రూనాయి విలువను దృష్టియందుంచుకొన్నప్పటికీ ఈ పంటల విలువ పెరుగుదలలో గొప్ప మార్పు స్పష్టమగుచున్నది. రాష్ట్రములోని 70 శాతము జనాభా వ్యవసాయంపై ఆధారపడుచూ రాష్ట్ర ఆదాయములోని 38 శాతము వ్యవసాయం ద్వారా సాధించబడుచున్నది.

వ్యవసాయంపై అధిక పెట్టుబడిని వెచ్చించి సాంకేతిక, శాస్త్రీయ నైపుణ్యాన్ని నిరంతరం వినియోగిస్తూ ఉత్పత్తిని సాధిస్తూ దాని ఫలితాల మూలంగా రైతాంగం వారి చుట్టూ వుండే శ్రామిక వర్గం యొక్క జీవన ప్రమాణాలను పెంచుకోవలసిన అవసరం వున్నది. వ్యవసాయరంగంపై మొదటి మూడు ప్రణాళికలలో వరుసగా 12.70 శాతము, 19.81 శాతము మరియు 22.51 శాతము పెట్టుబడిని వినయొగించడం జరిగింది. ఆ తరువాత పంచవర్ష మరియు వార్షిక ప్రణాళికలలో ఈ కేటాయింపులు తగ్గినవి. 7వ ప్రణాళికా కాలంలో వ్యవసాయరంగం పై 10.10 శాతము కేటాయించడము జరిగింది. నీటి పారుదల మరియు విద్యుచ్ఛక్తి కేటాయింపులు అన్ని ప్రణాళికలలో గూడా 50 శాతము మించిన కేటాయింపులు చేయడం జరిగింది. వ్యవసాయం, నీటిపారుదల విద్యుచ్ఛక్తి రంగాలన్నీ కలిపితే పెద్దమొత్తాల కేటాయింపులే జరిగాయి.

పై నుదహరించిన కొన్ని ముఖ్యమైన పంటలలో సాధించిన ప్రగతితోపాటు ఇతర వాణిజ్య పంటలు, నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో కూడా గణణీయమైన

ప్రగతి సాధించడం జరిగింది. నూనెగింజలు పప్పుధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల ఇంకా మందకొడిగా వున్నది. ఈ రంగంలో అధికోత్పత్తి వంగడాలను నిర్ధారణచేసి వినియోగించడంలో చెప్పుకోదగిన ముందంజవేయడం లేదు. ఇంకా పరిశోధనలు జరుగుచున్నవి. సాధించిన నైపుణ్యత ఆచరణలోకి రాలేదు. ఉత్పత్తి ఉత్పాదకతల పెరుగుదలలో ప్రతిబింభించడం లేదు.

వ్యవసాయ రంగం కేవలం ఆహార ధాన్యాలు, వాణిజ్య పంటల ఉత్పత్తి వరకే పరిమితం కారాదు. ఆంధ్ర రాష్ట్రంలో గత నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో పశుపోషణ, పాడిపరిశ్రమ కోళ్లపెంపకం, పండ్లతోటలు, కూరగాయలు, పూలతోటలు పెద్దగా వ్యాపకంలోకి రావడం జరిగింది. పట్టు పరిశ్రమ బహుళంగా అభివృద్ధి చెందుతున్నది. సుమారు 800 కి.మీ. గల సముద్ర తీరంలో, నదులు చెరువులలో చేపల పెపకం వ్యాపకంగా జరిగింది. ఆధునీకరించడం కూడా జరుగుచున్నది. ఇవన్నీ కలసి వ్యవసాయ రంగం సుమారు 87 శాతము గ్రామీణ శ్రామికులకు ఉపాధికలిపించే ప్రధానరంగంగా పరిణితిచెందింది. అయితే అభివృద్ధితో పాటు అభివృద్ధి సమస్యలు ఉత్పత్తిదారులను వేదించుచున్నవి. పెట్టుబడి సమస్య, శీతలీకరణ సౌకర్యాలు, గోడౌన్ల సమస్య, మార్కెట్ ఎగుమతుల సమస్యలు ఇనుమడించుచున్నవి. ఇందులో స్వావలంబన ఆధారంగా ఉపాధికల్పించుకునే వారు పెద్దవారితో పోటీలో నిలువలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం చిన్న యూనిట్లతో సహా అన్నింటిపై సమస్యల పరిష్కారములో ప్రత్యేక తోడ్పాటు, సంరక్షణ కల్పించాలని వీరంతా ఆందోళన చేస్తున్నారు. భారతదేశం ఈనాడు తన స్వంత అభివృద్ధి మార్గాన్ని నిశ్చయించుకుని ధైర్యసాహసాలతో ముందడుగు వేయవలసియున్నది. ఆంధ్ర దేశం ప్రత్యేకంగా ఈ దిశలో నిర్ణయానికి వచ్చి కృతనిశ్చయంతో సాగిపోవడానికి అనువైన పరిస్థితులున్నవి. సుదూర భవిష్యత్తులో కూడా వ్యవసాయ రంగమే ప్రధాన మానవ శక్తి వినిమయరంగంగా నిలిచే భౌతిక పరిస్థితులు ముమ్ముందున్నవి. వ్యవసాయ రంగానికి సాంకేతిక, శాస్త్రీయ నైపుణ్యతలతో ఆధునీకరించబడిన వినూత్న బహుముఖ వ్యవసాయరంగానికి, గౌరవకర ప్రతిపత్తిని సంతరింపచేసి యువతరం ఖచ్చితంగా ఈ రంగాన్ని ఎన్నుకొని తమ సృజనాత్మక శక్తియుక్తులను, విద్యా, విజ్ఞాన ప్రతిభాపాటవాలను ఉపయోగించి తమ భవిష్యత్తును, రాష్ట్ర దేశ భవిష్యత్తును తీర్చిదిద్దవలసిన బృహత్తర కర్తవ్య నిర్వహణ చేసి తీరుతుందనడములో సందేహము లేదు. ఆంధ్రప్రదేశ్ చారిత్రకంగా అనతికాలంలోనే నిజమైన అన్నపూర్ణగా, అష్ట ఐశ్వర్యాలతో తులతూగి కష్టజీవుల కర్మభూమిగా ప్రవర్ధమానం అవుతుంది.

# వెనుకబాటుతనం - సహేతుక అవగాహన

మన దేశం అత్యంత ప్రాచీన సంస్కృతి, మానవీయ సంప్రదాయాలు కలిగి వున్నప్పటికి చారిత్రక కారణాల వల్ల సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యవస్థ శతాబ్దాలపాటు నిలువు దోపిడీకి గురిఅయి ప్రపంచ వ్యాపిత అభివృద్ధి స్రవంతి నుండి వెలివేయబడింది. సుమారు 200 సం.లు వెనుక బాటుతనంలో 50 సం.ల క్రితమే బానిస బంధనాల నుండి విముక్తిని సాధించింది. 50 సం.ల స్వతంత్ర్య భారతదేశం తన వెనుకబాటు తనాన్ని తొలగించుకొనే దిశలో ఆశించిన విజయాలను సాధించలేక పోయింది. అయినా అభివృద్ధి చెందుతున్న దేశాలలో మొదటి శ్రేణికి చేరుకున్నది. బలోపేతమైన ఆర్థిక వ్యవస్థగల ప్రపంచ దేశాలలో మూడవ స్థానాన్ని శాస్త్ర, సాంకేతిక మానవ వనరుల సంఖ్యలో 3వ స్థానాన్ని కలిగి వున్నది. ఈనాటికి 100 కోట్ల జనాభా కలిగి ఆర్థిక, సామాజిక వెనుకబాటు తనంతో ముందంజ వేయలేకుండా నిలచివున్నది.

గత అర్థ శతాబ్ది సుదీర్ఘ కాలంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పరిమితమైన ఫలితాలు సాధించినవి. స్వాతంత్ర్యం సాధించిన నాడు 30 కోట్ల జనాభాలో సుమారు కేవలం ఒక కోటి మంది భాగ్యవంతులు, 4 కోట్ల మంది మధ్య తరగతి వారు వుండగా 25 కోట్ల మంది జనం పేదరికం, అర్థ బానిస అవశేషాలతో అష్టకష్టాలతో కాలం గడిపేవారు. 50 సం.ల తరువాత ఈనాడు 100 కోట్ల జనాభాలో సుమారు 10 కోట్ల మంది భాగ్యవంతులు, 50 కోట్ల మంది మధ్యతరగతి వారు వుండగా 40 కోట్ల మంది గ్రామీణ, పట్టణ పేదలు దారిద్ర్య రేఖకు దిగువుగా నుంటూ అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగంతో నికృష్ట జీవితం గడుపుచున్నారు. ఈ పరిస్థితిని వివిధ కోణాలలో విశ్లేషించవచ్చు. 40 కోట్ల ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువుగా వుండిపోవడమంటే స్వతంత్ర్యం సాధించిన నాటి మొత్తం 30 కోట్ల జనాభా కంటే 10 కోట్లు ఎక్కువగానే పేదరిక చీకటి కోణంలో వున్నారు. 100 కోట్ల ప్రపంచ పేదలలో ఆసియా మొత్తంలో 80 కోట్లు వుండగా అందులో సగానికి సగం ఒక్క భారతదేశంలోనే వుండడం నాగరికతా ప్రపంచంలో మనం తలదించుకోవలసిన విషయం. అక్షరాస్యతలో, ప్రాథమిక ఆరోగ్యపరిరక్షణలో కోట్లాది ప్రజలు అట్టడుగున వుండిపోవడం అత్యంత బాధాకరమైన సత్యం. మన తరువాత స్వతంత్ర్యం పొందిన దేశాలు సాధించిన గణనీయమైన విజయాలను కూడా మనం సాధించలేక పోవడానికి కారణం పాలక వర్గాల వైఫల్యాలకు నిదర్శనం. ఇదే

గణాంక పరిస్థితిని మరో కోణం నుడి విశ్లేషించవచ్చును. 50 సం.లలో 3 రెట్లకు మించి జనాభా పెరిగినప్పటికి ఈనాడు 100 కోట్ల ప్రజలలో సుమారు 10 కోట్ల మంది భాగ్యవంతులు కాగా 50 కోట్ల మంది తరతమ తేడాలతోనైనా మధ్యతరగతిలో చేరుకున్నారు. మిగతా 40 కోట్లు దారిద్ర్య రేఖకు దిగువుగా వున్నా ఆకలి మంటల అష్ట దరిద్రం, అర్ధ బానిస సామాజిక పీడన నుండి బయటపడ్డారు. ఆత్మాభిమానంతో తమ హక్కుల సాధనకై పోరాడుతున్నారు. ఈ విధంగా ఆనాటి 30 కోట్ల ప్రజలను ఈనాటి 100 కోట్ల ప్రజలతో పోల్చగా భాగ్యవంతులు 10 రెట్లు (అనగా జనాభాలో 3 శాతం నుండి 10 శాతం) మధ్య తరగతి వారు 12 రెట్లు పెరగగా (అనగా జానాభాలో 16 శాతం నుండి 50 శాతం) పేదలు 80 శాతం నుండి 36 శాతంకు తగ్గారు. ఇది గత 8 పంచవర్ష ప్రణాళికల ఫలితం. వ్యవసాయ ఉత్పత్తి సుమారు 4 రెట్లు పెరగడం, కొంతవరకు పారిశ్రామికాభివృద్ధి జరగడం, వాణిజ్య వ్యాపారాలు పుంజుకోవడం జరిగింది. ప్రణాళికాబద్ధంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాలలో ఎన్నుకున్న లక్ష్యాలను సాధిస్తూ సామాజిక న్యాయాన్ని, సమత్వాన్ని సాధించగలిగి వుంటే ఈనాడు దేశం యింత పేద దేశంగా వుండేది కాదు.

దేశం అభివృద్ధి వేగం అత్యంత మంద కొడిగా 5-6 శాతాన్ని దాటకుండా నుండడం పేదరికం పెరిగిపోవడానికి మూల కారణం మన పాలకులు అనుసరించిన దివాళా కోరు ఆర్థిక రాజకీయ-విధానాలే. ఉత్పత్తి, పంపిణీ, మారకం సాధనాలన్నీ ప్రభుత్వ రంగంలోనే కేంద్రీకరిస్తూ దేశ, విదేశీ ప్రయివేటు పెట్టుబడులను నిరుత్సాహ పరుస్తూ ప్రపంచ మార్కెట్ పోటీ నుండి దూరం కావడం, మార్కెట్ పోటీ నుండి రక్షణ పేరిట వేల కోట్ల ధనాన్ని వృధా చేయడం లాంటి ఆర్థిక విధానాలు పారిశ్రామిక వాణిజ్య వ్యాపార అభివృద్ధిని తీవ్రంగా ఆటంక పరిచినవి. అభివృద్ధి వేగాన్ని కుదించి వేశాయి. ఫలితంగా దేశంలో అనుత్పాదకమైన పెట్టుబడి దారీ విధానం, దళారీ వాణిజ్య వ్యాపారం విశృఖలంగా కొనసాగింది. లంచగొండితనం, అశ్రిత పక్షపాతం, స్వైర విహారం చేస్తున్నవి. అడ్డదారిన డబ్బు సంపాదించడం, వస్తువాహనాలపై మోజు పెరగడం, శ్రమ విలువపట్ల అసహ్యం, వికృత నాగరికతలో గొప్పతనంగా మారినవి. ఈనాడు ప్రపంచంలోని 150 దేశాలలో పేదరికం పెరిగిన క్రమంలో మన దేశం 134వ స్థానాన్ని కలిగి వుండడం, ప్రపంచంలో అవినీతి, లంచగొండితనంలో అగ్రతాంబూలం పొందిన నాలుగు దేశాలలో ఒకటిగా నుండడం మన జాతికి సిగ్గుచేటు. సగటు జాతీయ ఉత్పత్తి 5-6 శాతం మందకొడిగా పెరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వనరులను సమకూర్చుకొనడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయినవి. రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు ప్రతి సంవత్సరం పెరిగిపోవడం సర్వ సాధారణమైపోయినవి. పెట్టుబడి ఖాతా క్రింద అభివృద్ధి కార్యక్రమాలను చూపెట్టడం దాదాపు అసాధ్యమైపోయింది. దేశ, విదేశీ రుణాలు సంపాదించడం, వాటికి

చెల్లించవలసిన వడ్డీ మొత్తాలకు వార్షిక బడ్జెట్‌లో పెద్ద పీట వేయడం నిత్యకృత్యమై పోయింది. రెండ వైపు సగటు జాతీయ ఆదాయంలో 40 శాతంకి తగ్గకుండా నల్లధనం చెలామణి అవుచున్నది. పోటీ మార్కెట్‌ను నిర్వహిస్తున్నది. యిది దేశ అభివృద్ధిని కుంటుపరచడమే కాక ఆర్థిక అరాచకాన్ని పెంచి వేస్తున్నది. ఈ పరిణామం యింకా కొనసాగితే ప్రతికూల ఫలితాలు పెరిగిపోయి దేశం పూర్తిగా పరాధీన స్థితిలోకి నెట్టబడి ఆర్థిక స్వతంత్ర్యాన్ని పూర్తిగా కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుంది.

వెనుకబాటు తనానికి మూల కారణాలు ఆర్థికం మరియు సామాజికం తప్ప మరొకటి కాదని గుర్తించడం సహేతుకం. మత, కుల ప్రాంతీయ విచక్షణలు కూడా తొలగి పోయి నవ నాగరికతలో ప్రజా బాహుళ్యం సంపూర్ణంగా భాగస్వాములు కావాలంటే సత్వర ఆర్థిక అభివృద్ధి, సమత్వంతో కూడిన సామాజిక న్యాయం, సమాంతరంగా, వేగంగా కొనసాగడమే ఏకైక పరిష్కార మార్గం. ఒక్క ఆర్థికాభివృద్ధి జరిగినా దాని ఫలితాలు తమంతట తామే పేద వర్గాలకు నీరు యింకినట్లు చేరుతాయనే పెట్టుబడిదారీ వాదనకు యిప్పుడు కాలం చెల్లింది. శాస్త్ర సాంకేతిక విప్లవానంతరం యిది మరింత అసాధ్యమని, అంతేకాదు పేదరికాన్ని పెంచి పోషిస్తున్నదని కూడా అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. ఆర్థిక, సామాజిక వెనుకబాటు తనాన్ని ప్రత్యేకంగా గురి పెట్టుతూ అవసరమయిన విధానాల రూపకల్పన ద్వారా వాటిని నిర్మూలించడం ముఖ్య లక్ష్యంగా పెట్టుకోవడం ఆధునిక అర్థ శాస్త్రం అందిస్తున్న సుజ్ఞానం. ఆర్థికాభివృద్ధి 6 శాతం నుండి 12 శాతం పెరిగినప్పటికి ఆర్థిక అసమానతలు మరింతగా పెరగక తప్పదు. తలసరి ఆదాయం అను ప్రమాణానికి ఈనాడు కాలదోషం పట్టింది. జాతి సగటు ఆదాయాన్ని దేశ ప్రజలందరికి విభజించి తలసరి ఆదాయం పెరిగిందని చూపించుకోవడం ఆశాస్త్రీయం. అట్టడుగున వున్న దళిత బడుగు బలహీన వర్గాలలో, మహిళలలో, వితంతువులు, వికలాంగులు, వృద్ధుల జీవన ప్రమాణంలో ప్రతిబింబించిన అభివృద్ధి, అభ్యుదయమనిపించుకుంటుంది. భౌతిక అభివృద్ధిని సామాజిక న్యాయంతో కూడిన అభ్యుదయంగా సాధించడం ప్రధాన లక్ష్యం.

పై లక్ష్య సాధన కొరకు నిర్దిష్టమైన వ్యూహ కల్పన అవసరం. గత 8 పంచవర్ష ప్రణాళికలలో ఎన్ని మంచి సిద్ధాంతాలు ప్రకటించినప్పటికి ఆచరణలో రుజువైనది. ఒకే ఒక్క సత్యం. ప్రణాళికలు అనుసరించిన పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార, వ్యవసాయ విద్యా వైద్య తదితర విధానాలు ప్రపంచ దేశాల అభివృద్ధి వేగంతో పోల్చినపుడు మన దేశాభివృద్ధి వెనుకబడి వున్నది. దేశంలో వర్గ విబేధాలు పెరగడానికి ధనవంతులు, పేదల మధ్య అంతరం పెరగడానికి తోడ్పడినవి. మన దేశం వెనకబడిన పేద దేశమని యింకా చెప్పుకోవడానికి సిగ్గుగా నున్నది. పెచ్చుపెరిగిపోతున్న లంచగొండితనం, స్వార్థం, పడిపోతున్న రాజకీయ విలువల నేపథ్యంలో సాధించిన అభివృద్ధి మరుగున పడిపోతున్నది.

నీతి నిజాయితీ కల మేధావుల నుండి శ్రమ జీవుల వరకు ఈ పరిస్థితిని చూస్తూ నైరాశ్యం పొందుతున్నాం.

ఈ విషమ పరిస్థితులలో వెనుకబాటు తనాన్ని తత్ఫలితంగా ఏర్పడే కుల, మత, ప్రాంతీయ తత్వాలను ఓడించడానికి ఒక హేతుబద్ధమైన, శాస్త్రీయమైన వ్యూహరచన అత్యవసరం. ఈ వ్యూహ రచనలో పార్లమెంటరీ మెజారిటీ, మైనారిటీలతో నిమిత్తం లేకుండా అన్ని పక్షాలకు చెందిన అనుభవజ్ఞులు, సాంకేతిక నిపుణులు తమ మధ్య ఏకాభిప్రాయానికి రాక తప్పదు. ఈ అభిప్రాయం మన రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రలకనుగుణ్యంగా వుండి తీరాలి. ఈ విధంగా అందరూ ప్రతిజ్ఞ చేయాలి. అదే తమ అంగీకృత రాజకీయ విధానంగా శపథం చేయాలి. దీని ఆచరణలో సృష్టించబడే ప్రతిబంధకాలను అన్ని పక్షాలు తమదైన పద్ధతులలో ఎదిరించి ఓడించి తమ తమ సంస్థల ప్రాచుర్యాన్ని పలుకుబడిని యినుమడింప చేసుకోవాలి. తమ ప్రత్యక్ష కార్యచరణ ద్వారా ప్రజాస్వామ్యంలో తమ తమ స్థాయిలో రాజకీయ నాయకులుగా గెలిచి పరిపాలించాలి.

యిది ఒక మంచి స్వప్నంగా కనబడవచ్చు. ఆచరణ సాధ్యం కాదనిపించవచ్చు. సత్ సంకల్పం అలాగే అగుపడుతుంది. కానీ సంకల్పశుద్ధితో దానిని ప్రజా బాహుళ్యం యొక్క ఆమోదాన్ని పొందితే ప్రజలే వజ్రాయుధంగా దానిని సాధించి తీరుతారు. యిది సాధ్యపడాలంటే యిప్పటికీ చెలామణిలో నున్న కాలం చెల్లిన కొన్ని సిద్ధాంతాలకు, మూఢనమ్మకాలను సంస్కరించుకోవడం తక్షణ అవసరం. శాస్త్ర, సాంకేతిక యుగం ఆరంభమై దశాబ్దాలు గడిచినవి. సమాచార విప్లవం నలుమూలలు మానవాళిని తట్టి మేల్కొలుపుతున్నది. ఆర్థిక-సామాజిక బడుగు, బలహీన వర్గాలలో తమ జీవితాలను బాగుపరుచుకునే చైతన్యాన్ని ప్రేరేపిస్తున్నవి. యిది వారి సంఘటనా శక్తిని, కార్యదీక్షతను అందుకొరకు వారిలో ఆత్మవిశ్వాసాన్ని ద్విగుణీకృతం చేస్తున్నది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద ప్రజా సంస్థలు ఈ వినూత్న విప్లవాత్మక అవకాశాన్ని జార విడువకూడదు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణల గురించి రెండు పరస్పర విరుద్ధ అవగాహనలు వున్నాయి. మొదటిది - మన దేశం యొక్క ద్వారాలనింటిని ప్రపంచానికై తెరిచి పెట్టాలి. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ద్రవ్య నిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ, అలాగే అత్యంత ఆర్థిక ప్రాభల్యం సంపాదించుకున్న బహుళ జాతి సంస్థలకు స్వేచ్ఛగా మన దేశ అంతరంగిక అభివృద్ధి బాధ్యతలను హస్తగతం చేయాలి. ఆ విధంగా ఆర్థిక వనరులు కనివినీ ఎరుగని మోతాదులో సమకూర్చబడతాయి. అనతి కాలంలోనే మన దేశం అన్ని రంగాలలో సత్వర అభివృద్ధిని సాధిస్తూ అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలను పెంచుతుంది. రెండవది - వివిధంగా నిర్వచించబడే సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యూహం. తర తమ తేడాలు అనేకం వున్నప్పటికి వ్యూహాత్మకంగా,

స్థూలంగా ఒకే సిద్ధాంతం కలిగినది. దాని ప్రకారం మన దేశం యొక్క ద్వారాలన్ని పూర్తిగా మూచిపెట్టబడాలి. కొన్ని ప్రత్యేక అవసరాలు సందర్భాలను మినహాయించి ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ద్రవ్య నిధి, ప్రపంచ వాణిజ్య సంస్థతో సహా మన దేశం పూర్తిగా దూరంగా నుండాలి. దేశంలోని బూర్జువా భూస్వామ్య వర్గాలు వారి నాయకత్వంలో నున్న ప్రభుత్వాలతో సమర శీలంగా పోరాడి వాటిని కూలద్రోసి రాజ్యాధికారాన్ని పారిశ్రామిక, కార్మిక వర్గ నాయకత్వంలోని సంఘటన హస్తగతం చేసుకోవాలి. అప్పుడు విప్లవాత్మక చట్టాలు వాటి ఆచరణ ద్వార దేశంలోని సంపదను బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక వర్గాలకు పంపకం చేయాలి. ఉత్పత్తి పంపకం, మారం వ్యవస్థలన్నీ జాతీయం చేయబడాలి. ప్రపంచ వ్యాపితంగా అధికోత్పత్తి సంక్షోభం ఫలితంగా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సమ్మూలంగా సంక్షోభంలోకి నెట్టబడుతుంది. సరళీకరణ, ప్రయివేటీకరణ, అలాగే ప్రపంచీకరణల నిరోధం వలన దేశంలో పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్ర తరమవుతుంది. ఆర్థికాభివృద్ధి పూర్తిగా అసాధ్యం, దుస్సాధ్యం అయిపోతుంది. అత్యధికులుగా నున్న, ఆస్తులు అధికారం లేని శ్రామిక జనావళి అతి సులభంగా తిరుగుబాటు చైతన్యాన్ని సంతరించుకుంటుంది. విప్లవ పార్టీల నాయకత్వంలో విప్లవోద్యమం అప్రతిహతంగా వురకలు వేస్తుంది. బూర్జువా, భూస్వామ్య పాలన దుర్గాలు ఒకటి తరువాత మరొకటి కుప్పకూలిపోక తప్పదు. జాతీయ ప్రజాస్వామ్యం, జనతంత్ర ప్రజాస్వామ్య పాలన ఏర్పడుతుంది. మొదటి వ్యూహం వెనక దేశంలోని స్వార్థ పర భూస్వామ్య దళారీ వర్గాలు వున్నాయనటంలో సందేహం లేదు. అది ప్రపంచ వ్యాపిత దోపిడీ వర్గాల ఉమ్మడి ఆలోచన. కానీ రెండవ ఆలోచన వెనక ప్రపంచ వ్యాపిత శ్రామిక, విప్లవకారులు ఆయా సందర్భాలలో సృష్టించిన సిద్ధాతం వున్నది. నిరంకుశ రాచరికం, భూస్వామ్య వ్యవస్థల పైశాచిక దమన కాండకు బలి అయిన వేలాది అమర జీవుల ఆకాంక్షలున్నాయి. రెండు పూటలు తిండికి లేక పౌష్ఠిక ఆహారం దిక్కులేక, విద్యా, వైద్య సౌకర్యాలకు నోచుకోక అర్థాయుష్కులుగా అలమటిస్తోన్న పేద ప్రజల ఆశలున్నాయి.

మొదటి ఆలోచన అసమానతలను పెంచడమే కాకుడా స్వతంత్ర దేశాలను విదేశీ గుత్త పెట్టుబడిదారులకు నయావలస దేశాలుగా మార్చడానికి పూర్తిగా ఉపకరిస్తుంది. దీనిని పూర్తిగా క్షాళన చేయడం దేశ ఆర్థిక, సామాజిక అభ్యుదయానికి అనుగుణ్యంగా సంస్కరించడం అవసరం. రెండవ ఆలోచన దోపిడీ వ్యవస్థను నిర్మూలిస్తూ పేదరికాన్ని పూర్తిగా తొలగిస్తూ సమసమాజాన్ని లక్ష్యంగా ఎన్నుకున్నప్పటికి దానిని ఈనాటి శాస్త్ర, సాంకేతిక యుగంలో ఉత్పత్తి పంపిణీ మారకాల ప్రపంచీకరణ నేపద్యంలో సృజనాత్మకంగా అనేక మార్పులు చేర్పులతో సంస్కరించవలసి వున్నది. 70 సం.ల సామ్యవాద పీఠం కుప్పకూలిన తరువాత 20 సం.లుగా విప్లవ చైనా నూతన ప్రయోగాల ద్వారా విజయ పరంపరలు సాధించిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా అతివాద శక్తులు,

తమ పవిత్ర లక్ష్యాల సాధనకు పరిశుభ్రమైన ప్రజా తంత్రయుతమైన మార్గాలను చేపట్టుచున్నారు. భారతదేశంలో 75 సం.ల విప్లవోద్యమాల చరిత్ర కలిగిన అతివాద పార్టీలు, వేలాది త్యాగధనుల కోరికలను, ఆకాంక్షలను సుసాధ్యం చేసే ప్రయత్నాల దిశలో పాత నమ్మకాలను త్యజించడం లేక వదులుకోవడం వ్యూహాలను, ఎత్తుగడలను పూర్తిగా సంస్కరించుకోవడం చరిత్ర నేర్పుతున్న గుణపాఠం. ఈ నూతన శతాబ్దం వ్యక్తి స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛకి, ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రధాన ప్రాముఖ్యతను యిస్తున్నది. లక్ష్యం ఎంత వుత్తమమో లక్ష్య సాధన అంతే వుత్తమమని, గమ్యం ఎంత మంచిదో గమనం అంతే బాగుండాలని కోరుతుంది. అనివార్యమైన ప్రపంచీకరణ ప్రపంచ వాణిజ్యం, వ్యాపారం మన దేశ ఆర్థిక, రాజకీయ స్వతంత్ర్యం సార్వభౌమాధికారానికి ఎలాంటి లోటు లేకుండా సత్వర ఆర్థిక సామాజికాభివృద్ధికి, అభ్యుదయానికి సహకరించాలని కోరుతుంది. ఈ వినూత్న పరిస్థితులలో మన దేశంలో ఈనాటికి వున్న రాచరిక సామ్రాజ్యవాద వ్యవస్థలో సృష్టించబడిన అన్ని రంగాలలోని వ్యవస్థలను సమ్మూలంగా సంస్కరించాలని అనుభవం చాటి చెప్పుచున్నది. 1991 నుండి ప్రారంభించబడిన సరళీకరణ సంస్కరణలు నత్తనడకన నడుస్తూ వక్ర మార్గాన కూడా పోతూ ఆశించిన లక్ష్యాలు సాధించలేకపోతున్నాయి. దేశ భక్తులు, ప్రజా తంత్ర వాదులు, అతివాద పార్టీలు, శక్తులు అందరూ కలిసి తలలు దూర్చి సత్వర దేశాభివృద్ధికి సమత్వం, సామాజిక న్యాయ సిద్ధికి ఈ సంస్కరణల మహాయజ్ఞంలో చిత్తశుద్ధితో భాగస్వాములు కావడం చారిత్రక అవసరం. సాంకేతిక విప్లవ నేపథ్యంలో, ప్రపంచీకరణ వెలుతురులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విచక్షణాయుతంగా తమ పదునైన నియంత్రణా ఆయుధాన్ని ధైర్య సాహసాలతో ఉపయోగిస్తు అంచెలంచెలుగా అభివృద్ధిని సాధించవచ్చు. అభివృద్ధికి అత్యంత మౌళికమైన అక్షరాస్యత, ఆరోగ్య పరిరక్షణ, శుభ్రమైన త్రాగునీరు, సాగునీరు సాధన, రోడ్డు రవాణా సౌకర్యాలు సమకూర్చుట యివన్నీ పర్యావరణ పరిరక్షణకు అనుబంధంగా గ్రామీణాభివృద్ధి దిశలో సుసాధ్యం చేయవచ్చు. ఉమ్మడి వ్యూహాలతో నిర్మాణ కార్యచరణ కర్తవ్యంతో దేశ భక్తులు, ప్రజాతంత్ర అతివాద శక్తులు అనన్య సామాన్యమైన విజయాలు సాధించవచ్చు. దార్శనికులుగా రానున్న ఒకటి, రెండు దశాబ్దాల కాలంలోనే దేశాభ్యుదయాన్ని సాధించి చూపవచ్చు.

శతాబ్దాల ఆర్థిక సామాజిక వెనుకబాటు తనం ప్రధానం కాగా స్వాతంత్ర్యానంతర అయిదు దశాబ్దాల విఫల విధానాల వలన మన దేశంలో యింకా అనేక వెనుకబడిన ప్రాంతాలు మిగిలివున్నాయి. ఈ ప్రాంతాలు సువిశాల భారతదేశంలో కొన్ని ద్వీపాలుగా కొట్టవచ్చినట్లు అగుపిస్తున్నాయి. కాని మరో దృష్టితో పరిశీలిస్తే సువిశాల పేదల భారతదేశంలో అక్కడక్కడ భాగ్యవంతుల ద్వీపాలు కనబడుతున్నాయి. వెనకబాటు తనంలో, పేదరికంలో కూడా తర తమ తేడాలున్నాయి. ఏది ఏమయినా వెనకబాటుతనం నుండి, పేదరికం నుండి బయటపడే పక్రియలో ప్రయత్నిస్తున్నామనే ఆత్మవిశ్వాసంతో

వున్నాం. దానిని వేగిరం చేయడానికి అవసరమైన ఏకైక వ్యూహం గురించి అనగా తీవ్రమైన వ్యవస్థాపూర్వక సంస్కరణల ద్వారా ఆర్థిక రాజకీయ వికేంద్రీకరణ ద్వారా గ్రామ స్థాయిని ప్రథమ సోపానంగా ఎన్నుకొని ముందడుగు వేసే సంస్కరణల యజ్ఞంలో అందరం సమిధులుగా ఉపయోగపడాలి.

అక్షర క్రమంలో మొదటి రాష్ట్రంగా నున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి ప్రమాణంలో తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్రా, కోస్తా ఆంధ్రగా నున్నవి. యిది యిలా వుండడానికి చారిత్రక కారణాలు ప్రధానం. స్వాతంత్ర్యానంతర విఫల విధానాలు ద్వితీయం. వీటి నిర్మూలన కొరకు పైన చర్చించిన జాతీయ వ్యూహం దాని ఆచరణ అత్యవసరం. అంతేకాని సహజ వెనుకబాటు తనానికి పరిష్కారం వేర్పాటు వాదం కాదు. చరిత్రలో మత, కుల, ప్రాంతీయ తత్వాలతో నిర్వహించబడిన వేర్పాటు యుద్ధాలు, పోరాటాలు అందించిన అమూల్య అనుభవాలున్న గుణపాఠాలు నేర్చుకోవడం అవసరం. అక్షరాస్యతలో భారతదేశం 52.21 శాతం వుండగా దక్షిణ రాష్ట్రాలు కేరళ 89.81 శాతం, తమిళనాడు 62.66 శాతం, కర్ణాటక 56.04 శాతం వున్నాయి. అంధ్ర దేశం 44.09 శాతానికి మాత్రమే చేరుకున్నది. అందులో తెలంగాణా, రాయలసీమల స్థాయి చెప్పనక్కరలేదు. విద్యుత్ శక్తి వినియోగంలో కోస్తా ఆంధ్ర 29.9 శాతం, రాయలసీమ 16.4 శాతం వుండగా తెలంగాణా 53.7 శాతం వుండడం తెలంగాణా వెనుకబాటు తనానికి సూచిక మాత్రం కాదు. ప్రభుత్వ వుద్యోగాలలో కార్పోరేట్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు కలిపి ఆంధ్రప్రదేశ్‌లోని 10.28 లక్షలలో కోస్తా ఆంధ్ర వాసులు 3.88 లక్షలు, రాయల సీమ వాసులు 1.55 లక్షలు, తెలంగాణా వాసులు 4.85 లక్షలు వున్నారు. హైద్రాబాద్ నగరాన్ని మినహాయిస్తే కూడా 3.72 లక్షలున్నారు. యిది కూడా తెలంగాణా వెనుకబాటు తనానికి సాక్ష్యం కారాదు. సాగులోకి తేబడిన మొత్తం భూమిలో నీటి సౌకర్యం కలిగించడిన భూవిస్తీర్ణం కోస్తా ఆంధ్ర 52.05 లక్షల హెక్టార్లు. రాయలసీమలో 22.7 లక్షల హెక్టార్లు వుండగా తెలంగాణాలో 38.8 లక్షల హెక్టార్లు వుండడం కూడా గమనార్హం.

పై అంకెలను ప్రాంతీయ అభివృద్ధికి సాక్ష్యాధారాలుగా, సంతృప్తిగా చెప్పకోలేము. అయినా గత దశాబ్దాల కాలంలో జరిగిన కొద్దిపాటి అభివృద్ధి ఫలితాలు తెలంగాణా, రాయలసీమల వెనుకబాటు తనాన్ని తగ్గించినాయని మాత్రమే చెప్పకోవచ్చు. ఏది ఏమయినా స్పష్టంగా నున్న వెనుకబడిన ప్రాంతాల సత్వరాభివృద్ధిని సాధించే లక్ష్యంతో ఈ ప్రాంత ప్రజల అనుమానాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పారదర్శకతతో కూడిన ప్రత్యేక కేటాయింపులు చేయడం వాటిని వెచ్చించడం ప్రజా ప్రతినిదుల ద్వారా పర్యవేక్షింపచేయడం అవసరం.

జాతిపిత మహాత్మగాంధీ, నవ భారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ, రాజ్యాంగ రచయిత, దళిత నాయకుడు డా. బి.ఆర్. అంబేద్కర్ లాంటి ఎందరో మహానుభావులు, స్వాతంత్ర్యనంతర భారతదేశం గురించి స్వతంత్ర భారత ప్రభుత్వాలు నిర్వహించవలసిన రాజకీయ, ఆర్థిక విధానాల గురించి కన్న కలలు కల్లలైనాయని అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అనుసరించబడిన అశాస్త్రీయ విధానాలు, లోపభూయిష్టమైన వ్యవస్థల కారణంగా కొంతవరకు అభివృద్ధిని సాధించినా ప్రజాభ్యుదయాన్ని సాధించలేకపోయినామని విజ్ఞులు విమర్శిస్తున్నారు. నూతన పంథాను అన్వేషిస్తున్నారు. సమగ్ర జాతీయాభివృద్ధికి సమత్వంతో కూడిన సాంఘిక సంక్షేమానికి పైన చర్చించిన విధంగా ఒక జాతీయ విధాన రూపకల్పన అవసరం.

# గాలిలోని దీపం - చేనేత కార్మికులు

మన రాష్ట్రంలో చేనేత కార్మికుల ఆకలి చావుల వార్తలు అత్యంత బాధాకరముగా నుండి సభ్య సమాజానికి తలవంపుగా నున్నవి. ఇది అకస్మిక పరిణామము కాదు. చేనేత పరిశ్రమ పట్ల పూర్తిగా బాధ్యతారహితమైన వైఖరిని అనుసరించే ప్రభుత్వ విధానాల పరాకాష్టనే ఈ పరిస్థితి. అభివృద్ధి చెందుతున్న సమయంలో పురాతన ఉత్పత్తి విధానానికి నూకలు చెల్లక తప్పదనే కుంటిసాకు ప్రబలంగా వినపడుచున్నది. అభివృద్ధి, ప్రగతి మానవుల జీవితంలో ప్రతిబింబించాలి గాని పాత యంత్రాల స్థానే కొత్త ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టడం కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పన చేసే బాధ్యులు, వాటిని ఆచరించే అధికారులు పై సత్యాన్ని గుర్తుంచుకోవడం అత్యవసరం. ఈ ఆకలి చావులు కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పరిమితం కావడం లేదు. ఈ పరిశ్రమ ప్రబలంగా నున్న ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి యిలాంటి వార్తలు వినబడుచున్నవి.

చేనేత పారిశ్రామికులు అత్యంత దయనీయమైన విధముగా దరిద్రముతో పోరాడుతున్న విషయం అందరికి తెలుసు. ఒక్క మాటలో చెప్పాలంటే అన్ని వర్గాల కంటే హీనాతిహీనమైన పేదరిక బాధలతో కృంగి కృశించిపోవుచున్న వర్గం చేనేత కార్మికులు. వారు ప్రతి దినం భార్య బిడ్డలతో సహా 12 గంటలు పరిశ్రమ చేసినప్పటికి వచ్చిన జీతభత్యంతో రెండు పూటలు పొట్టపోసుకోవడం కష్టసాధ్యం అవుచున్నది. ఇల్లు, వాకిలి, గుడ్డలు, విద్య, వైద్యముల సంగతి దేవుడెరుగు. ఇటువంటి కఠిన దరిద్రము వాతపడిన కుటుంబాలు పౌష్టిక అహారం లేకపోవడం వల్ల రోగాలను తట్టుకునే శక్తి పూర్తిగా కోల్పోవడం తప్పని సరిగా జరిగే పరిణామం. అందుకే ఆకలి, అర్థాకలి అనేక రుగ్మతలకు దారితీసి ఆరోగ్యాన్ని త్వరితగతిన క్షీణింపచేసి అకాల మరణాలకు దారితీయక తప్పదు. మన రాష్ట్రంలో జరుగుతున్న మరణాల వెనుకనున్న వివిరాలను పరిశీలిస్తే ఇదే ధృవీకరించబడుచున్నది. కాబట్టి మరణించిన కుటుంబాలకు తక్షణ తోడ్పాటులాంటి చర్యలు అవసరమే అయినా అంతటితో సంతృప్తి చెందడం ఏ మాత్రం క్షంతంవ్యము కాదు. ఇటువంటి పరిస్థితిని ఆమూలాగ్రముగా సంస్కరించాలంటే అసలు చేనేత పరిశ్రమ పట్ల వాస్తవమైన, హేతుబద్ధమైన, శాస్త్రీయమైన అవగాహన అత్యవసరం. ఇటువంటి పరిశ్రమలు ఆధునిక యుగంలో అంతరించక మానవు అను

నిర్ణయానికి రావడం ఏవిధంగా చూచినా సమర్ధనీయం కాదు. చేనేత గుడ్డలు యిప్పటికీ మన దేశంలో, విదేశాలలో కొల్లలుగా అమ్ముడుపోవడానికి అస్కారం వున్నది. ఆధునిక పరిశ్రమల నుండి ఉత్పత్తి చేయబడే నాణ్యత గల గుడ్డలతో పోల్చినపుడు చేనేత గుడ్డ నిలబడలేక పోవచ్చు. అయినా నిజంగా చేతిపనికి విలువను కట్టవలసి వస్తే అత్యంత ఆకర్షణీయమైన చేతిపనితో కూడిన చేనేత వస్త్రాల ముందు ఎంతటి ఆధునిక పరిశ్రమ నుండి ఉత్పత్తి చేయబడిన గుడ్డలైనా నిలువలేవు. ఇది వినిమయదారులు అభిరుచిపై ప్రధానంగా ఆధారపడి యున్నది. మన దేశమే కాక అభివృద్ధి చెందిన దేశాలలో చేనేత గుడ్డలపై అమిత ఆసక్తిని కనబరచుచూ తగు మూల్యం చెల్లించి వాటిని కొనుగోలు చేసే వారెందరో వున్నారు. కాబట్టి చేనేత గుడ్డ కొరకు మార్కెట్ సమస్య అంత ప్రధానమైనది కాదు.

చేనేత గుడ్డలు ధరల సబ్సిడీలపై ఆధారపడే విధంగా వుండక తప్పదు. ఈ పరిశ్రమను సంరక్షించే బాధ్యత మొత్తం సమాజముపై వున్నది. జౌళి పారిశ్రామిక వేత్తలపై ప్రధానంగా వున్నది. కాబట్టి చేనేత పరిశ్రమను రక్షించడం ప్రభుత్వం యొక్క విధి. ఆ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు ఇతర పరిశ్రమలతో పోల్చే విధంగా కనీస వేతనాలు లభ్యమయ్యే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబడాలి. చేనేత రంగానికి కేటాయించబడే గుడ్డలను పరిశ్రమలలో నేయకుండా చూడాలి. చేనేత కార్మికులకు ఇతర బలహీన వర్గాలతో పాటు ప్రత్యేకమైన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు అమలుపరచాలి. ఈనాడు దేశంలో చేనేత కార్మికులలో 36 శాతం కార్మికులకి నెలసరి ఆదాయం 300 రూపాయల కంటే మించడం లేదు. ఒక 1,000 రూపాయల నెలసరి ఆదాయం పొందేవారు 12 శాతం మాత్రమే. మిగతా 52 శాతం చేనేత కార్మికుల నెలసరి ఆదాయం 300 రూపాయలకు పైగా 1,000 రూపాయలకు లోబడి వుండడం గమనర్హం. సగటు రోజుకూలీ 15 రూపాయలకు మించడం లేదు. ఈ పరిమిత ఆదాయంతో పెరుగుతున్న కుటుంబాన్ని పోషించ లేకపోవడం వారి జీవితాలలో అడుగడుగునా కలిగే కష్టాలకు మూలం. వీరంత దారిద్ర్య రేఖకి దిగువగా అందులోనూ అట్టడుగున వుండడం అనివార్య పరిస్థితి. కాబట్టి వీరికి కనీస జీవన ప్రమాణాన్ని కల్పించగల వేతనాలను నిర్ణయించి వాటిని ఖచ్చితంగా అమలుపర్చడం తక్షణ కర్తవ్యం.

నూలు, రంగులు మరియు జరీలాంటి ఉపకరణాల ధరలలో తీవ్రమైన పెరుగుదల చేనేత పరిశ్రమకు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టుచున్నది. ఇవి అసలు దొరకక పోవడం కష్టాలకు కారణభూతమవుచున్నది. 40 నెంబరుగల 10 పౌండ్ల నూలు ధర బడ్జెట్‌కు పూర్వం 250 రూపాయలు వుండగా 3 మాసాల అనతికాలంలోనే 330 రూపాయలకు పెరిగిపోవడం ఆశ్చర్యకరం. ప్రధాన ఉపకరణమైన నూలు ధర ఇంతలోనే అంతగా పెరిగినట్లు చేనేత గుడ్డ ధర అదే దామాషాలో ఎన్నటికీ పెరగలేదు. అందులో

ఆధునిక మిల్లులు, పవర్‌లూంలలో తయారు చేయబడే గుడ్డలతో పోటీపడుతున్న చేనేత గుడ్డల దరలలో ఇంతటి పెరుగుదల అసంభవం. దీని ప్రభావం కార్మికుల ఆదాయంపై పడక తప్పదు. ఆదాయాలు ఖర్చులతో పోల్చినపుడు ఏమాత్రం పెరగక పోవడమంటే పెరుగుతున్న జీవిత ప్రమాణంలో చేనేత కార్మికులు క్రమంగా దిగజారి పోవడం తథ్యం. ఏడవ పంచవర్ష ప్రణాళికలో ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోబడిన చేనేత గుడ్డ లక్ష్యం 460 కోట్ల మీటర్లు. అందుకు 46 కోట్ల కేజీల నూలు అవసరం వుండింది. కాని వాస్తవంగా 20 నుండి 22 కోట్ల కేజీల నూలు మాత్రమే చేనేత పరిశ్రమకు లభ్యమయినది. తత్ఫలితంగా 200ల నుండి 220 కోట్ల మీటర్ల గుడ్డ మాత్రమే చేనేత రంగంలో తయారుచేయబడింది. అంతే నిర్ణయించుకోబడిన లక్ష్యంలో సగం కూడా సాధించలేకపోయాం. అంటే చేనేత కార్మికులు తాము సగం కాలం పనిచేయకుండా నిరుద్యోగులుగా వున్నారని స్పష్టమవుచున్నది. ఇది ఆదాయాలు తగ్గడానికి ఆకలిని పెంచడానికి దారితీస్తుంది.

అసలు చేనేత రంగానికి నూలు కొరత ఎందుకు ఏర్పడుచున్నది. చేనేతకు అవసరమయ్యే హ్యాంక్ నూలును 50 శాతంకు తక్కువ కాకుండా ఉత్పత్తిచేయాలని నూలు మిల్లులకు ఆదేశాలుండగా ఈ కొరతకు కారణం ఏమిటి. అసలు మార్కెటు చేయబడే నూలులో 40 శాతం మాత్రమే చేనేతకు అవసరమైన నూలు ఉత్పత్తి చేయబడుచున్నది. ఈ నూలు నుండి దాదాపు 30 శాతం చేనేత రంగానికి కాకుండా పవర్‌లూం రంగానికి తరలించ బడుచున్నది. ఉదాహరణకి 1989-90 సంవత్సరంలో 86 కోట్ల 70 లక్షల కేజీల నూలు మార్కెట్ చేయబడితే అందులో 42 శాతం మాత్రమే హ్యాంక్ నూలు ఉత్పత్తి చేయబడింది. అంటే 36 కోట్ల 50 లక్షల కేజీల నూలు ఉత్పత్తి చేయబడింది. ఇందునుండి సుమారు 10 కోట్ల కేజీల నూలు చేనేత రంగానికి కాకుండా పవర్‌లూం రంగానికి తరలించబడింది. చేనేత పరిశ్రమకు రక్షణ లేకపోవడానికి మూల కారణం ఆధునికమైన పవర్‌లూం పరిశ్రమ మరియు జౌళి పరిశ్రమల దాడినుండి కాపాడే బాధ్యత నిర్వహించే నాధుడు లేకపోవడమే.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేనేత పరిశ్రమలను రక్షించడానికి తీసుకోవలసిన చర్యలు కూడా ఖచ్చితంగా అనుసరించబడడం లేదు. ఈ రంగానికి ప్రత్యేకించబడిన గుడ్డలు, ఇతర రంగాలలో కూడా నేయబడుచున్నవి. మిల్లులు తయారుచేయవలసిన చేనేతకు అవసరమైన నూలును ఉత్పత్తి చేయడంలో నిర్ణయాలను పాటించడం లేదు. సహకార సంఘాలకు ప్రకటిత ఆర్థిక సౌలభ్యం పన్ను రాయితీలు అందజేయబడుట లేదు. ఈ సౌకర్యాలను అమలు జరిపించవలసిన అధికార వర్గం తన బాధ్యతను నిర్వహించడంలో వైఫల్యం పొందుచున్నది. అనేకులు ప్రత్యక్షంగా మధ్య దళారీల పాత్ర నిర్వహిస్తూ ఈ పరిశ్రమ పట్ల చీడ పురుగులుగా తయారైనారు. చేనేత వస్త్రాల

ఉత్పత్తి 1984-85లో 314 కోట్ల మీటర్లు వుండగా ఇది తీవ్రంగా తగ్గి 1988-89 నాటికి 245 కోట్ల మీటర్లకు చేరడం యాధృశ్చికం కాదు. పైనుదహరించిన అననుకూల పరిస్థితులే దీనికి కారణం.

ఇటీవలి కాలంలో ప్రత్తితో తయారుచేయబడే నూలుకు పోటీగా రసాయనాలతో తయారుచేయబడే నూలు రావడం ఒక ప్రత్యేకమైన విషయం. ఈ కృత్రిమ నూలు అందంగా ఆకర్షణీయంగా వుండడం విశేషం. దీనితో జౌళి పరిశ్రమలు పోటీ పడలేక పోవడంతో పాటు ఈ పోటీలో చేనేత పరిశ్రమ కూడా నిలదొక్కుకోలేక పోవడం ఇటీవల కాలంలోనే గమనించదగిన పరిణామం. ప్రత్తి నూలుతో తయారుచేయబడే ముతక మధ్య తరహా గుడ్డలు 1972లో మనదేశంలో తలసరి 12.5 మీటర్లు ఉపయోగించబడగా 1987 నాటికి ఈ వాడకం తగ్గి 10.75 మీటర్లకు చేరుకున్నది.

చేనేత పరిశ్రమ చుట్టూ ఆవరించిన కారు మబ్బులు కనబడుచున్నవి. ఈనాటి ఆధునిక, యాంత్రిక యుగంలో చేనేత పరిశ్రమ మార్కెట్‌లో పోటిపడి బ్రతికి బట్టకట్టడం దుస్సాధ్యమే. అయితే వ్యవసాయం తరువాత ప్రధానమైన ఉపాధిగా సాగుతూ కోట్ల మందికి ఇంకా ప్రాణాదారమైన చేనేత పరిశ్రమ గురించి సంఘం, సమాజం, ప్రభుత్వం, మానవతా దృష్టితో ఆలోచించవలసియున్నది. క్రమానుగతంగా ఈ పరిశ్రమపై ఆధారపడే వారు ఇతర ఆధునిక పరిశ్రమలలోకి మళ్లించబడేవరకూ ఈ కుటీర పరిశ్రమకి కట్టుదిట్టమైన పరిరక్షణ కవచాన్ని తొడిగించడం సాంఘిక, రాజకీయ బాధ్యతగా, కర్తవ్యంగా గుర్తించబడి తీరాలి. పూర్తిగా నిరుద్యోగులవుతూ ఆకలి చావులకు బలియవుతూపోయే దుష్పరిణామాలను సకాలంలో సక్రమంగా అరికట్టడము విజ్ఞుల కర్తవ్యం. ప్రకటిత విధానాలు స్థూలంగా సవ్యంగా వున్నవి. అయితే వాటిని ఆచరించే విధానం అత్యంత లోపభూయిష్టం బాధ్యతా రాహిత్యంతో నిండివున్నది. చేనేత కార్మికుల ఆకలి చావులు దేశభక్తిని సవాలు చేస్తున్నవి. సుమారు అర్ధ శతాబ్ది స్వాతంత్ర్యానంతరం కాలంలో కూడా ఆకలి చావులు జరగడం ప్రజాస్వామ్యానికి తీరని కళంకం. సభ్యసమాజానికి మాయని మచ్చ. సంకుచిత భావాలకు అతీతంగా నుండి ప్రజాస్వామ్య వాదులంతా ఏక కంఠంతో నినదిస్తూ పాలక వర్గాలు ఈ బృహత్తర కర్తవ్య నిర్వహణలో ఏమాత్రం వెనుకంజ వేయకుండా చూడాలి.

# గ్రామీణ అభివృద్ధి

దేశాభివృద్ధి వ్యూహంలో గ్రామీణ అభివృద్ధి అత్యంత ప్రధానమైన అవిభాజ్యమైన అంశం. కూలినాలీపై పూర్తిగానో, పాక్షికంగానో ఆధారపడే గ్రామీణ ప్రజలు తమ శ్రమ శక్తిని ఇతరులకు అమ్ముకోకుండా ఇతరుల శ్రమ శక్తిని కొనకుండా స్వంత శ్రమతో జీవితం గడిపే శ్రామికులు వీరంతా గ్రామీణ పేదల క్రింద గుర్తించబడతారు. వీరితోపాటు సన్నకారు, చిన్నకారు రైతులు వ్యవసాయము తదితర వృత్తులపై ఆధారపడే వారు, కౌలుదారులు వీరంతా కూడా గ్రామీణ పేదల నిర్వచనము క్రింద వుంటారు. ఈ కుటుంబాలన్ని కలిసి సుమారు 15 నుండి 16 కోట్ల వరకు వున్నట్లు ఇటీవల అంకెలు ఋజువుచేస్తున్నవి. నిరుద్యోగులుగా దారిద్ర్య రేఖకు దిగువుగా నుండే వారిలో వీరు ప్రధానము. దేశాభివృద్ధి వ్యూహం, నిరుద్యోగము మరియు పేదరికమును పూర్తిగానో, పాక్షికంగానో తొలగించే లక్ష్యం కలిగి వుంటుంది. ఈ గ్రామీణ నిరుపేదలు గత స్వాతంత్ర్యానంతర సుదీర్ఘ కాలంలో నిర్లక్ష్యం చేయబడిన వారు. దేశాభివృద్ధికై సర్వస్వం వడ్డి శ్రమించిన కష్టజీవులు. అభివృద్ధి ఫలితాలను దాదాపు నోచుకోలేదు. ఆధునీకరణ ఫలితంగా చేతి వృత్తులపై ఆధారపడే లక్షలాది శ్రామికులు ఉద్యోగాలు లేక దాదాపు నిరుద్యోగానికి నెట్టివేయబడ్డారు. వడ్డీ వ్యాపారస్తుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ పూటకులేని దయనీయ స్థితికి వదిలివేయబడ్డారు. అందులోను ప్రాంతీయ విబేధాలు స్త్రీ, పురుషుల మధ్య ఆదాయ వ్యత్యాసాలు భయానక పరిస్థితిని కల్పిస్తున్నవి. ఉపాధి కొరకు వీరు వలసపోతున్నారు. బాల కార్మికుల శ్రమ సమాజాన్ని వెక్కిరిస్తూనే వున్నది. వారి శారీరక, మానసిక అభివృద్ధిని కుంటుపరుస్తున్నది. తమ భూముల నుండి తొలగించబడిన గిరిజన పేదలు ఇంకా భూస్వాములు, వడ్డీ వ్యాపారస్తుల కబంధహస్తాలలో వున్నారు. గిరిజన, హరిజన తదితర బడుగు వర్గాలుగా నున్న వారిపై సాంఘిక అత్యాచారాలు, అణచివేతలు కొనసాగుచున్నవి. ప్రత్యేకించి స్త్రీలు అమానుషమైన అత్యాచారాలకు గురిచేయబడి బలి అయిపోతున్నారు. వీరిలోని అత్యధికులు నిలువనీడలేక మురికివాడలలో తలదాచుకొంటున్నారు. ఇటువంటి నికృష్ట జీవన పరిస్థితులు వారి బ్రతుకులను చీకటి బ్రతుకులుగా మార్చినవి.

జాతీయ ఆదాయం తలసరి ఆదాయంలో పెరుగుదల కనిపించినప్పటికీ గ్రామీణ పేదల ఆదాయం తగ్గుతూనేవున్నది. దీనికి ముఖ్యకారణం వారి జన సంఖ్య పెరుగుతూ వుండడం మరియు జాతీయాదాయంలో వారి భాగం తగ్గుతూ వుండడం. అందుకే

జాతీయ అభివృద్ధి, గ్రామీణ అభివృద్ధి వ్యూహాన్ని మౌలికంగా సంస్కరించవలసిన అవసరం వుంది. ఇంకా గ్రామాలలో నివసించే ప్రజలలో 55 శాతం దారిద్ర్య రేఖకు దిగువుగా వుంటున్నారు. దారిద్ర్యరేఖకు దిగువుగా నున్న జనసంఖ్యలో వీరు 90 శాతం వరకు వున్నారు. విద్య, వైద్య మంచినీటి సరఫరా మరియు చౌకధాన్యాల సరఫరా సౌకర్యం ఏర్పాటులో పట్టణాలు మరియు గ్రామాల మధ్య వ్యత్యాసం పెరిగిపోతున్న వ్యవస్థా పూర్వకమైన ప్రణాళికా సంబంధమైన అంశాలను నిర్ధుష్ఠంగా పేర్కొనడం అత్యవసరం.

## 1. భూసంస్కరణలు

గ్రామీణ పేదల ఆస్థిత్వాన్ని పెంచాలంటే భూసంస్కరణలు అత్యవసరం. భూమి జీవనాధారం కావడంతో పాటు సాంఘిక భద్రతను సమకూర్చుతుంది. ధనిక వర్గాలపై వారి అవసరాన్ని తగ్గిస్తూ 4 దశాబ్ధాల భూసంస్కరణల ఫలితంగా సాగుదాయక భూమిలో 20 శాతం భూములుగా పంచబడ్డాయి. పాలక వర్గాల అయిష్టత వల్ల మిగులు పంపకం జరగడం లేదు. 2 కోట్ల ఎకరాల భూమి పంపకం చేస్తామన్న ప్రభుత్వ ప్రకటన విఫలమైనది. ఆస్తులు లేని శ్రామికులు తమ వేతనాలు, కూలీ గురించి బేరసారం చేయగలిగే శక్తి కోల్పోతున్నారు. తక్కువ కూలీకే తమ శ్రమ శక్తిని అమ్ముకుంటారు. కాబట్టి గ్రామీణ పేదలకు స్వంత ఆస్తి ఏర్పాట్లు చేయడం వారి బ్రతుకు పోరాటంలో ఎంతగానో తోడ్పడుతుంది.

## 2. జనాభా నియంత్రణ

జనాభాలో 2 శాతం పెరుగుదల ఆదాయాలను మరింత తగ్గిస్తున్నది. జీతభత్యాలు, ఉపాధి అవకాశాలు తక్కువగా నున్న గ్రామీణ పేదలలో ఈ పరిణామం స్పష్టంగా కనబడుచున్నది. జనాభా పెరుగుదల రేటును తగ్గించలేకపోవడానికి ప్రబల కారణం పేదరికం. ఆస్తి అంటూలేని పేదవాడికి వాని పిల్లలే ప్రధానమైన ఆస్తి. వారిపైన ఆధారపడి బ్రతకవచ్చుననే ఆశ ముఖ్యమైనది. అందులో అనారోగ్య కారణాల ఫలితంగా చాలా మరణాలు హెచ్చుగా వుండడం ఈ అవసరాన్ని మరింత పెంచుచున్నది. ప్రభుత్వ డిపార్ట్‌మెంటులు ఈ సందర్భంగా చేసే ప్రయత్నాలు పాక్షిక పరిష్కారాన్ని మాత్రమే చూపగల్గుచున్నవి. నిజమైన పరిష్కారం పేదల ఆస్తులు పెరగడం, విద్య, వైద్య, సాంఘిక చైతన్యం పెరగడం నిజమైన పరిష్కార మార్గం. ఇది జాతీయ కర్తవ్యం. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలన్నింటి ఉమ్మడి కర్తవ్యం. జనాభా పెరుగుదల కారణంగా వున్న కొద్దిపాటి ఆస్తులు విభజించబడి తునకలై చౌకగా అమ్ముకోవడానికి దారితీస్తున్నది. వేతనాల కుదింపుకు కారణం అవుతున్నది. కాబట్టి గ్రామీణ పేదల భౌతిక, ఆధ్యాత్మిక స్థితిగతులను పెంపొందించడం ద్వారా జనాభా పెరుగుదలను అరికట్టడం ఏకైక శాస్త్రీయ మార్గం.

## 3. వ్యవసాయంపై పెట్టుబడి వెచ్చింపు

వ్యవసాయ విస్తరణ ద్వారానే గ్రామీణ కార్మికులకు ఉపాధి అవకాశాలు అందచేయగలుగుతాం. అధికంగా భూములను సాగులోకి తేవడం, నీటి వనరులు సమకూర్చడం అవసరం. అన్ని రకాల నీటి ప్రాజెక్టులను త్వరితంగా నిర్మించి పూర్తిచేయడం ద్వారా అధునిక వ్యవసాయాన్ని సాధించడం ఫలితంగా ఉపాధి సౌకర్యాలు పెంపొందడం, ఉత్పత్తి పెరగడం సాధ్యపడుచున్నది. తద్వారా గ్రామీణ కార్మికులు సాంఘిక చైతన్యం సంతృప్తికరంగా పెరుగుతుంది. గత దశాబ్దం నుండి గ్రామీణ అభివృద్ధి రంగంలో ముఖ్యంగా నీటి వనరులు తదితర ప్రాతిపదిక చట్ర నిర్మాణములు ప్రభుత్వ పెట్టుబడులు చాలావరకు తగ్గినవి. ఫలితంగా ఉత్పాదక శక్తి మరియు ఉత్పత్తి తగ్గుతున్నది. దీని ఫలితంగా గ్రామీణ పేదల ఆదాయం కూడా తగ్గి గ్రామీణ పేదరికం పెరుగుచున్నది. కాబట్టి ప్రభుత్వ రంగంలో వ్యవసాయంపై పెట్టుబడి హెచ్చించడం అత్యవసరం. అప్పుడే వ్యవసాయదారులు సొంతపెట్టుబడిని కూడా వెచ్చించి ఉత్పత్తి క్రమంలో పాల్గొంటారు. కార్మికులకు ఉపాధి లభిస్తుంది.

## 4. అసమాన గ్రామీణ అభివృద్ధి

అసమాన గ్రామీణ అభివృద్ధి కారణంగానే రాజకీయ, సాంఘిక వైరుధ్యాలు అభివృద్ధి చెందుచున్నాయి. ఈ సమస్యలకు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు. వెనుకబడిన ప్రాంతాల పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపడం వల్లనే క్రమానుగతంగా ఈ వ్యతాసాలు పెరిగి సమస్యలుగా రూపొందినవి. ఈ వ్యత్యాసాల కారణంగా పేదల దారిద్ర్యం మరింత పెచ్చుపెరిగింది. కూలీలకు ఉపాధిలేక జీతాలు పూర్తిగా తగ్గి పోవడం వలన వారు వెనకబడిన ప్రాంతాలనుండి అభివృద్ధి చెందిన ప్రాంతాలకు వలస పోవలసి వస్తున్నది. దీని వలన పేదరికం మరింత పెరిగిపోతున్నది. బీహార్ నుండి పెద్ద ఎత్తున పంజాబ్ రాష్ట్రానికి వలసపోతున్న కార్మికుల ఉదాహరణ కనువిప్పుగా పనిచేయాలి. దేశవ్యాప్తంగా కనీసం ఒక కోటి వ్యవసాయ కార్మికులు తమ స్థానాలను వదిలి వలసపోతున్నారు. ఫలితంగా అనేక సాంఘిక, రాజకీయ జటిల సమస్యలలో చిక్కిపోతున్నారు. కాబట్టి కార్మికుల వేతనాలు పెరిగి ఉపాధి అవకాశాలు అభివృద్ధి చెంది పేదరికం తగ్గుతూపోవాలంటే ప్రాంతీయ అసమానతలను త్వరగా తగ్గించాలి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికై ప్రత్యేక కేటాయింపులు శ్రద్ధతో పూనికతో ప్రణాళికావేత్తలు, రాజకీయ నాయకులు కృత నిశ్చయంతో పాటుపడాలి.

## 5. గ్రామీణ పరిశ్రమలు

గ్రామీణ ప్రాంతాల అనువైన సాంకేతిక, శాస్త్రీయ యంత్రాలతో గ్రామీణ పరిశ్రమలను స్థాపించడం చాలా అవసరం. మానవ శ్రమ అధికంగా నుండి పెట్టుబడి కొరతలో నున్న గ్రామీణ పరిస్థితిని దృష్టియందుంచుకుంటూ పరిశ్రమల ఎంపిక

జరగాలి. గత ప్రణాళికా అనుభవాన్ని పరిశీలిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోని బాధ్యతలను వదులుకున్నట్టు, వ్యవసాయధార పరిశ్రమల ప్రాముఖ్యతను నిరాకరించినట్లు రుజువవుచున్నది. కొన్ని ప్రాంతాలలో మాత్రమే గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి జరిగింది. గ్రామీణ పరిశ్రమల ప్రాధాన్యత సర్వత్రా చెప్పబడుచున్నది. కాని ఆచరణలో కనబడడం లేదు. పొరుగు దేశమైన చైనా అనుభవం గ్రామీణ వ్యవసాయాధార పరిశ్రమల ప్రాధాన్యత గురించి నొక్కి వక్కాణిస్తున్నది. కోకొల్లలుగా లభించే మానవ శ్రమ ఆధారంగా నిర్మితమయ్యే పరిశ్రమలను స్థాపించడం తక్షణ కర్తవ్యం. దీని వలన ఉపాధి లభించడం, వలసలను నిరోధించడం, పట్టణాలపై భారాన్ని తగ్గించడం సుసాధ్యం అవుచున్నది. కాబట్టి ఇటువంటి పరిశ్రమలు నిర్మించడానికి ప్రోత్సాహకాలుగా పనిచేసే ప్రాతిపదికలు నిర్మించబడాలి. అంటే విద్యుత్ సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు, కార్మికులకు ట్రైనింగ్ సౌకర్యాలు, పరపతి, మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటుచేయబడాలి. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో ఈ పని ప్రాధాన్యతలతో చేయబడాలి. గ్రామాలలో సంపద బాగానే సృష్టించబడింది. కాని అది తిరిగి మళ్లించడం అదే జరిగివుంటే ప్రాతిపదిక అభివృద్ధి చట్రాన్ని నిర్మించడం గ్రామీణ పరిశ్రమల నిర్మాణం తప్పకుండా సాధ్యపడేది. ఇది జరగడం లేదు. దీనికి భిన్నంగా ఆస్తిపరులు తమ సంపదను అనుత్పాదక పరిశ్రమలపై చట్టా వ్యాపారంపై వెచ్చించడం జరుగుతుంది. అందుకే అసమానతలు పెరగడం దనికులు, పేదల మధ్య అగాధం పెరగడం కొనసాగుచున్నది.

## 6. పెరుగుచున్న అంతరం

ధనికులు, పేదల మధ్య పెరిగిపోతున్న అగాధం ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలలో తీవ్రమైన పరిణామాలకు దారితీస్తున్నవి. అది మరింత ముదరకముందే రాజకీయ వేత్తలు కనులు తెరవవలసి వున్నది. గత ప్రణాళికల అనుభవం వెలుతురులో చూస్తే దేశ తలసరి అదాయంలో సగటున పెరిగిన ఒక శాతం పెరుగుదల గ్రామసీమలలో నామమాత్రమే. పెరిగిన ఆదాయం బీదల బ్రతుకుల్లో కనబడాలంటే బీదలకు ఆదాయాలు సంపాదించుకోవడానికి అవకాశాలు పెరగాలి. తద్వారా జీతభత్యాలు ఎక్కువగా సంపాదించుకోవడానికి అవకాశం వుంటుంది. లేనిచో పెరుగుతున్న దేశ ఆదాయం తానంతట తానే గ్రామీణ పేదలకు అందుబాటులోకి రాదు. అలా జరుగుతుందని ఆశించడం పొరపాటు అవుతుంది. నీటి వనరులను నిర్మిస్తూ వ్యవసాయంపై అధికపెట్టుబడులను ఆకర్షిస్తూ వ్యవసాయాన్ని విస్తృతం చేసినప్పుడే గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి బాగుపడటానికి అవకాశాలు ఏర్పడతాయి. ఈ సత్యాన్ని గుర్తించి కూడా విస్మరించడం క్షంతవ్యం కాదు. కాబట్టి ఇప్పటి పరిస్థితుల్లో వ్యవసాయంలో సంపాదించబడిన ఆదాయాలు కొంతమంది ధనికులకు మాత్రమే పరిమితమైపోయినవి. వారు తమ ఆదాయాలను అనవసర అనుత్పాదక రంగాలలో వెచ్చిస్తూ విలాస జీవితాలు

గడుపుచూ సాంఘిక సమస్యలకు కారణభూతమవుచున్నారు. రెండవ వైపు గ్రామీణ పేదలు మరింతగా పేదలుగా మారుతూ ధనిక వర్గాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చర్యలకు పూనుకుంటున్నారు. కుల, మత ప్రాంతీయ విద్వేషాలు చెలరేగడము, హింసా రాజకీయాలకు దారితీయడం జరుగుచున్నవి. బాధ్యత కలవారు, ప్రభుత్వాలు ఈ పరిణామాలను చూస్తూ వాటి వెనుకగల కారణాన్ని గుర్తించక పోవడం కేవలం మన జాతి దురదృష్టం. కాబట్టి అభివృద్ధి క్రమాన్ని వేగిరం చేయడం అభివృద్ధి ఫలితాలు న్యాయంగా పంచడం తక్షణ కర్తవ్యంగా గుర్తించాలి.

## 7. సేవా రంగం

గ్రామీణ పేదల యొక్క అభివృద్ధికి అత్యవసరమైన సంక్షేమ కార్యక్రమాలు ఏమాత్రం అలక్ష్యం చేయరాదు. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, పరిశుభ్రత, మంచి నీటి సరఫరా మొదలగు కార్యక్రమాలపై పెట్టబడే పెట్టుబడులు ఏమాత్రం అవసరాలను తీర్చేవిగా లేవు. పెరుగుచున్న నాగరికతా నేపథ్యంలో గ్రామీణ పేదలు తమ వెనుకబాటు తనాన్ని బాగా గుర్తించి బాధ పడుచున్నారు. తమను రెండవ శ్రేణి పౌరులుగా మాత్రమే చూస్తున్నారని ఆందోళన చెందుచున్నారు. కేటాయించబడిన కొద్ది మొత్తం కూడా సక్రమంగా సార్థకంగా వెచ్చించబడడం లేదు. అసలు ప్రభుత్వ పెట్టుబడుల విషయమే ఆశ్చర్యకరంగా నున్నది. ప్రభుత్వం తమ వనరులన్నింటిలో 76 శాతం వనరులు కేవలం అనుత్పాదకమైన రంగాలలోనే వెచ్చించడం జరుగుచున్నది. మిగిలిన కొద్ది మొత్తం మానవ వనరుల అభివృద్ధికై వెచ్చించడం ఏమాత్రం సరిపోవడం లేదు. కాబట్టి స్వతంత్ర సావలంబన దిశలో ఆర్థిక పునరుజ్జీవనం సాధ్యపడాలంటే ఈ వనరులను పెంచక తప్పదు. రెండంకెలకు పెరిగిన ద్రవ్యోల్బణం నడుములు విరిగే మోతాదులో నున్న ఋణభారం అభివృద్ధి కార్యక్రమాలకు, మానవ వనరుల నిర్మాణాలకు పెట్టుబడులు పెట్టడం అసాధ్యంచేస్తున్నవి. కాబట్టి అసలు ఆర్థిక విధానం రచనలోనే ఆమూలాగ్రమైన మార్పులు జరగాలి. లేనిదే దేశం ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం దుర్లభం.

## 8. పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణ గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. అడవులను నరికి వేయడం, పశుగ్రాసం దొరికే భూములను సాగులోకి తేవడం, చెరువులు, కుంటలు పూడికలతో నిండిపోవడం లాంటి చర్యలు గ్రామీణ పేదల బ్రతుకులపై తమ ప్రభావాన్ని వేస్తున్నది. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడం, గ్రామీణ పేదరికం పెచ్చుపెరగడం, జనాభా పెరుగుతూ పోవడం కారణంగా అడవులపై పడి చెట్లు నరకడం తదితరంగా అటవి సంపదను దోచుకోవడం అలవాటుగా మారి మాంసం. ఉన్ని అవసరాలు పెరగడంతో పాటు కలప అవసరం కూడా అడవులను

అడవి జంతువులను తగ్గించే దిశలో కార్యక్రమాలకు దారితీస్తున్నది. వ్యవసాయ భూములను విస్తరించలేకపోవడం, అడవులపై ఆధారపడి బతకవలసి రావడం దురదృష్టకరం. చెట్లు నాటకపోవడం, అడవులు పెంచకపోవడంతో పాటు పరిశ్రమల కాలుష్యం పెరగడం, అనార్థాలకు దారితీస్తున్నది. అడవుల అటవీ సంపద తగ్గుదల వలన అందరికంటే ఎక్కువగా గిరిజన ప్రజలు అత్యధిక నష్టాలకు గురికావలసి వస్తుంది.

## 9. నిర్మాణం

గ్రామీణ పేదల సంఘటిత శక్తిని పెంచి బేరసారాల శక్తిని ఇనుమడించాలంటే వారిని సంఘాలలో నిర్మాణం చేయడం తక్షణ కర్తవ్యం. దేశవ్యాప్తంగా 16 కోట్లకు తగ్గకుండా నున్న వారిలో 3 శాతం మాత్రమే సంఘటితంగా నున్నట్లు తెలుస్తున్నది. వారి సంఘాల నిర్మాణాలపై ప్రభుత్వాలకు ఎలాంటి ఆశక్తిలేదు. సరికదా ఈ సంఘాలను అణచివేయడానికి అనేక సందర్భాలలో ప్రభుత్వాలు పూనుకొంటున్నట్లు స్పష్టంగా కనబడుచున్నది. రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పార్టీలు ఈ దిశలో చాలా తక్కువ ఫలితాలు సాధించినవి. దానికి కారణాలు స్పష్టంగా వున్నవి. వారు ఇచ్చే నినాదాలు, అధికంగా రాజకీయ నినాదాలుగా వుండడం గ్రామీణ పేదల నిజజీవిత సమస్యలను ప్రతిబింబించకపోవడం ముఖ్య కారణం. అందుకే ఈ నినాదాలు గ్రామీణ పేదలను ఆకర్షించడం లేదు. రెండవ వైపు వీరిలో వస్తున్న నిరాశ నిస్పృహలను హింసావాదం వైపు మలచడానికి తీవ్రవాదుల కృషి జరుగుచున్నది. దీని వలన కూడా ఫలితం శూన్యంగా వున్నది. అనేక ప్రభుత్వ పథకాలు పేద ప్రజలలో ఆశలను రేకెత్తించు చున్నవి. అయితే ప్రభుత్వ కేటాయింపులు ప్రజల అవసరాలను తీర్చడానికి ఏమాత్రం సరిపోవడం లేదు. కేటాయించబడిన మొత్తాలను లబ్దిదారులకు అందచేసే కర్తవ్యాలను నిర్వహించే అధికారులు మధ్యదళారీలు చిత్తశుద్ధితో పాటుపడడం లేదు. కేవలం లాభార్జన ఉద్ధేశ్యంతో మ్రాత్రమే నిర్వహిస్తున్నారు. పరిశీలనా పత్రాలన్నీ ఈ సత్యాన్ని చాటిచెప్పుచున్నవి. ఇంతగా వెచ్చించిన పెట్టుబడులు గ్రామీణ పేదల కొరకు ఆస్తులను సృష్టించడం లేదు. వారికి నిరంతరం ఉపాధికల్పన సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదు. తాత్కాలిక ఆపత్కాల నినాదాలతో ఈ విలువైన వనరులను వృధా చేయడం జరుగుతుంది. ఏమైనప్పటికీ జరుగుచున్నదంతా చెడ్డ అని చెప్పలేము. గణనీయమైన మోతాదులో మంచి ఫలితాలను సాధించడం జరిగింది. వివిధ నామకరణాలతో పిలువబడే గ్రామీణాభివృద్ధి పథకాలను ఏకీకృతం చేయవలసి వుంది. వివిధ నిబంధనల గందరగోళాన్ని తొలగించవలసి వున్నది. ఈ పథకాలన్నీ ఆయా ప్రాంతాల అభివృద్ధి కొరకు ప్రజల జీవిత అవసరాలుగా గుర్తించబడుతున్న కట్టడాలపై వెచ్చించవలసి వున్నది. తద్వారా ఉపాధి సౌకర్యాలను పెంపోందించవలసి వున్నది. సాంఘిక సంస్థలు, స్వచ్చంద సంస్థలు

ప్రధమంగా ఈ బాధ్యతలను నిర్వహించే విధంగా కృషిచేయవలసియున్నది. వెచ్చించబడే ప్రతిపైసా ఫలప్రదంగా, ఉపయుక్తంగా నుండునట్లు, లబ్దిదారులకు చెందునట్లు ఏర్పాట్లు చేయవలసియున్నది. పథకాల గురించి వనరుల వినిమయం గురించి నిర్ణయాలు చేసే అధికారం ఢిల్లీలో కేంద్రీకరించడం ఏమాత్రం మంచిది కాదు. వికేంద్రీకరణ మాత్రమే పై ప్రాంతాలలోని ప్రజల నిర్ధిష్ట అవసరాలను తీర్చే లక్ష్యంతో శాశ్వత ఉపాధి సౌకర్యాల సృష్టి కొరకు చర్యలు తీసుకోవలసియున్నది. ఆలోచనల్లో, నిర్మాణంలో నిర్ధిష్ట చర్యలలో పై నుదహరించిన ముఖ్యమైన మార్పులు తేవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యపడుతుంది.

# ఆర్థిక విశేషాలు

మన ఆర్థిక వ్యవస్థ అనేక అనార్థలకు గురిచేయబడినది. పట్టుదలతో పరిశ్రమలను వాటి ఉత్పాదక శక్తిని, కార్మిక శక్తిని వినియోగించిన ఎడల ఉత్పత్తిని ఇతోధికంగా పెంచగలిగే చక్కని అవకాశాలు ఎన్నో వున్నవి. అర్థశాస్త్రవేత్తల అంచనా ప్రకారం ఇప్పటికే నిరుపయోగంగా నుంటున్న యంత్రాలను, కార్మిక శక్తిని పూర్తిగా ఉపయోగించిన ఎడల ప్రతి సంవత్సరం అదనంగా ఒక లక్ష కోట్ల రూపాలయ ఆదాయాన్ని సంపాదించవచ్చును. సాధారణ పరిస్థితులలో మన దేశంలో నిర్వహించుచున్న ప్రకారం మరొక నాలుగు లక్షల కోట్ల పెట్టుబడిని వెచ్చించి చేయగలిగే ఉత్పత్తి దాని ద్వారా సాధించబడే ఆదాయం ఎంతగానుండునో అంతమొత్తాన్ని ఇప్పటికే నిద్రాణములో నున్న పరిశ్రమలను పూర్తిగా ఉపయోగించడం వలన సాధించవచ్చును. అనగా 8వ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వరంగంలో వెచ్చించబడే పెట్టుబడి ద్వారా సాధించే లాభం ఇప్పటికే సిద్ధంగా నున్న యంత్ర మరియు మానవ శక్తిని పరిపూర్ణంగా వినియోగించడం ద్వారా సాధించవచ్చు. సత్యము ఈ విధంగా నుంటే మన ప్రభుత్వం, ప్రణాళికావేత్తలు నిర్మితమైన పారిశ్రామిక శక్తిని పూర్తిగా వినియోగించే బాద్యతలను విస్మరిస్తూ, అదనంగా ప్రభుత్వరంగ కార్యక్రమాలను పెంచుకోవడానికై నిదులను కేటాయించబోతున్నారు. ఈ విధానం ఒక అలవాటుగా మారి పెట్టుబడి వృధా కావడం తగు దామాషాలో ఫలితాలు రాకపోవడం జరుగుచున్నది. దేశ ఆర్థిక అరాచకత్వానికి దోహదపడుచున్నది.

## 1. నల్లధనం

దేశంలో నల్లధనం కుప్పలు కుప్పలుగా పోగుచేబడుచున్నది. ఆదాయం పన్నుల ఎగవేత ప్రధానమైన కారణం. ఈ డబ్బు కనీసం మన దేశంలోనైనా ప్రయోజనకర కార్యకలాపాలపై ఖర్చు వెచ్చించబడుటలేదు. నిరుపయోగంగా దాచి పెట్టుకోబడుచున్నది. విదేశాలలోని బ్యాంకులలో కూడబెట్టబడుచున్నవి. ఈ మొత్తం నల్లధనం ప్రతి సంవత్సరం డెబ్బై ఐదు వేల కోట్లకు ఏ మాత్రం తగ్గడం లేదని పరిశోదకుల అంచనా. ఈ డబ్బుతో ఏకంగా పోటీ ఆర్థిక వ్యవస్థనే నిర్వహించబడుచున్నవి. మన కేంద్ర ప్రభుత్వం యొక్క వార్షిక బడ్జెటు రమారమి డెబ్బై అయిదు వేల కోట్లు వుండడం గమనించదగ్గ విషయం. వనరులు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో లోటు ప్రతి సంవత్సరం ఇరవై వేల

కోట్లకు మించుచున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మన్‌మోహన్ సింగ్ గారు సెలవిచ్చారు. నల్లధనాన్ని వెలికి తీయడానికై, పట్టుదలతో కృషిచేసి విజయాన్ని సాధించినట్లయితే మన ప్రభుత్వ ఆర్థిక లోటు తొలగించబడుతుంది. బడ్జెట్ లోటు లేకుండా చేయబడుతుంది. నల్లధనాన్ని పోగుచేసి పోటీ వ్యాపారాన్ని నిర్వహించేవారిని దేశద్రోహులుగా పరిగణించాలి. సమాజం, సాంఘిక రాజకీయ సంస్థలు, నాయకులు దీనిని తమ దేశ భక్తియుత కర్తవ్యంగా గుర్తించాలి. ఇలాంటి సంఘ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలు నిర్వహించాలి.

## 2. సబ్సిడీ

సబ్సిడీ అను పదం అర్ధ శాస్త్ర వేత్తల స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ప్రబలంగా ప్రచారంలో వున్నది. అట్టడుగున గ్రామీణ స్థాయిలో నుండి దారిద్ర్యరేఖకు దిగువగా నుండి, పెరుగుతున్న జీవిత ప్రమాణం సాధించలేక పేదరికంలో కూరుకుపోయే ప్రజలకు తక్కువ ధరపై నిత్యావసర సరుకులను లేక పనిముట్లను లేక ఉపకరణాలను అందచేయవలసిన అవసరం వుంది. తగ్గింపు ధరలకు సరఫరా చేయడం వలన ఏర్పడుచున్న తేడాను ప్రభుత్వం భరించుచున్నది. క్రమక్రమంగా ఈ "సబ్సిడీ" యొక్క అసలు ప్రయోజనం మరుగున పడి రాజకీయ ప్రయోజనాల సాధనకై ఒక పనిముట్టుగా వాడకంలోకి వచ్చింది. శ్రీమతి ఇందిరాగాంధీ హయాంతో ప్రారంభమై దిన దిన ప్రవర్ధమానమై ఆర్థిక వ్యవస్థలో ఒక పెద్ద పద్దుగా పరిణమించింది. అవసరం నున్నవారికి మించి రెండు, మూడు రెట్ల సంఖ్యలో నున్న వారందరూ ఈ సబ్సిడీలకు అర్హులుగా ఎన్నిక చేయబడుచున్నారు. ఈ సబ్సిడీ వ్యవహారం లంచగొండితనానికి, మధ్యదళారీ వ్యాపారానికి పెద్దకారణ భూతమవుచున్నది. ఇంతింతై వటుడింతైనట్లు భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థలో సగటు జాతీయ ఉత్పత్తిలో 15 శాతం ఈ సబ్సిడీ క్రింది ఖర్చు చేయబడుచున్నది. గత సంవత్సరం సగటు జాతీయ ఉత్పత్తి సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు వుండగా సబ్సిడీ భారం సుమారు ముప్పై వేల కోట్లకు పెరిగింది. ఉదాహరణకు 7వ పంచవర్ష ప్రణాళిక అనుభవాన్నే తీసుకోండి. 5 సంవత్సరాలలో ప్రణాళికా ఖర్చుల నిర్వహణకై మన కేంద్ర ప్రభుత్వం ఎనబై ఆరువేల కోట్ల రూపాయల ఋణాన్ని చేయవలసి వచ్చింది. అదే కాలంలో కేవలం సబ్సిడీ పద్దు క్రింద అరవై ఎనిమిది వేల కోట్ల రూపాయలు వెచ్చించవలసి వచ్చింది. ఈనాటి బడ్జెట్‌లో మూడు ముఖ్యమైన పెద్ద కేటాయింపులలో మొదటిది రక్షణ పద్దు, రెండవది ఋణాలపై వడ్డీ చెల్లించే పద్దు, మూడవది సబ్సీడీల పద్దు. ఈ మూడు అనుత్పాదక ఖర్చులే అన్న విషయం చెప్పనక్కరలేదు. త్వరగా సబ్సిడీలను తీవ్రంగా కుదించి అర్హత గల వర్గాలకు మాత్రమే పరిమితం చేయకపోతే మన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలక తప్పదు.

## 3. 8వ పంచవర్ష ప్రణాళిక

మన 8వ పంచవర్ష ప్రణాళిక 1992-97 కాలంలో 7,92,000 కోట్ల రూపాయలతో నిర్వహించబడుతుంది. 3,42,000 కోట్ల రూపాయలు ప్రభుత్వ రంగంపై వెచ్చించబడడం విశేషం. ఉత్పత్తి పెరుగుదల లక్ష్యం 5.6 శాతం వున్నది. ఈ ప్రణాళిక కొరకు వెచ్చించబడే మొత్తం 7వ పంచవర్ష ప్రణాళికలో ఖర్చు చేయబడిన ధనానికి రెట్టింపుగా వున్నది. 8వ ప్రణాళికలో 3 ముఖ్యమైన లక్ష్యాలు సాధించాలని ప్రణాళికా సంఘం యొక్క అభిమతం. అవి:

ఎ. వనరులను పెంచుకోవడం

బి. అనవసర ఖర్చులను తగ్గించుకోవడం

సి. సబ్సిడీలను నియంత్రించడం

## 4. పన్నులు

అభివృద్ధి చెందుచున్న దేశాలలో ప్రభుత్వ ఆదాయంలో పన్నుల ద్వారా ఆదాయానికి సింహభాగం వుంటుంది. అందులో ప్రత్యక్ష పన్నులు, మరియు పరోక్ష పన్నులు అంటూ వుంటాయి. పరోక్ష పన్నులు సేల్స్ టాక్స్ లాంటివి. ఇవి వినిమయ దారులందరిపై విధించబడతాయి. పన్ను చెల్లించే వాడి శక్తి సామర్థ్యలతో నిమిత్తం లేకుండా విధించబడతాయి. ప్రత్యక్ష పన్నులు ఆదాయం పన్నులాంటివి. సంపన్న వర్గాలపై మాత్రమే అవి కూడా క్రమానుగతంగా విధించబడతాయి. వీటి బరువు భారం సామాన్యులపై వుండదు. కాబట్టి ప్రత్యక్ష పన్నులే ప్రభుత్వానికి ప్రధాన ఆదాయవనరుగా వుండాలని పరోక్ష పన్నులను పెంచుతూ పోవడం అభ్యుదయకర విధానం కాదని ఆధునిక ఆర్థ శాస్త్రవేత్తలు నొక్కి వక్కాణించుచున్నారు. ఈ నేపథ్యంలో పరిశీలించి నట్లయితే మన దేశంలో ఇంకా పరోక్షపు పన్నులు ప్రధాన ఆదాయ వనరులుగా నుండడం గమనించదగ్గ విషయం. కేంద్ర ప్రభుత్వం యొక్క మొత్తం పన్నుల ద్వారా ఆదాయం 58,916 కోట్ల రూపాయలు వుండగా అందులో ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయం 12,100 కోట్లు మాత్రమే వుండడం గమనార్హం. దీనిని ఇతోధికంగా పెంచడం, పన్నుల ఎగవేతను అరికట్టడం తక్షణ అవసరం.

పన్నుల ఎగవేత మరియు నల్లధనాన్ని కూడబట్టే పక్రియను అరికట్టకపోవడం వలన మన ప్రభుత్వాల ఆదాయాలు తీవ్రంగా తరిగిపోవుచున్నవి. వనరులు పెంచుకోవడం అసాధ్యం అవుచున్నది. జటిలమైన ఈ సమస్యను ధైర్యంగా గట్టి చర్యల ద్వారా పరిష్కరించలేని ప్రభుత్వాలు తమ వనరుల సంపాదనకై ఋణ సేకరణపై ఆధారపడడం ప్రారంభించాయి. ఋణదాతలు ముఖ్యంగా అంతర్జాతీయ ఋణ వ్యవస్థలు బలహీనమైన దేశాలను తమ వలయంలోకి ఆకర్షించడం సాధారణమైన

విషయం. ఫలితంగా మనదేశం కూడా ఈ వలలో చిక్కుపడే దుస్థితి దాపురించింది. విదేశీ ఋణం 2 లక్షల కోట్ల రూపాయలకు మించిపోవడం వాటిపై వడ్డీలు కూడా చెల్లించలేని దయనీయమైన స్థితికి నెట్టబడడం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఒకవైపు దేశంలో పరిశ్రమలు, వ్యవసాయం ద్వారా వున్న శక్తితో సంపాదించుకోగలిగే సంపదను కోల్పోవడం పన్నుల ఎగవేతను అరికట్టకపోవడం, నల్లధనాన్ని వెలికి తీయలేకపోవడం యధేచ్ఛగా జరుగుతూ వుండడం, రెండవవైపు వనరుల కొరతను తీర్చడానికై అదేపనిగా అప్పులు చేయడం ఏ జాతికైనా అత్యంత హానికరం. కాబట్టి అప్పులు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి, రిజర్వు బాంకుకు వదిలివేయడం హానికరం. రాజ్యాంగంలోని 292వ ఆర్టికల్‌ను వినియోగించి విదేశీ, స్వదేశీ అప్పులకు గరిష్ట పరిమితిని విధించాలి. అప్పుడే అప్పులు చేసే సులభమార్గానికి అడ్డుగోడ నిర్మించడం జరుగుతుంది. గత్యంతరం లేక వున్న వనరులను పూర్తిగా సమకూర్చుకోవడం జరుగుతుంది. ఇది ఆర్థిక విషయమే అయినా రాజకీయ ప్రత్యేకతను సంతరించుకున్నది. దేశ పునర్నిర్మాణం, స్వావలంబన, ఆర్థిక స్వాతంత్ర్యం కోరే వారంతా రాజ్యాంగబద్ధమైన ఈ క్రమశిక్షణను అమలు పరచడానికై పూనుకోవలసియున్నది.

## 5. విదేశీ ఋణం

మన విదేశీ ఋణం ప్రవాస భారతీయుల డిపాజిట్లతో సహా 1980లో 2,000 కోట్ల డాలర్లు వుండగా, దశాబ్ద ఆఖరికి 7,000 కోట్ల డాలర్లు అనగా 1,75,000 కోట్ల రూపాయల వరకు పెరిగింది. 10 సంవత్సరాలలో సుమారు 4 రెట్లు పెరగడం అనివార్యం ఏమాత్రం కాదు. వృధా ఖర్చులు, జనాకర్షణ పథకాలు, సోమరితనం వలన ఈ సులభమార్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ ఋణంపై చెల్లించవలసిన వడ్డీ 1980లో 60 కోట్ల డాలర్లు వుండగా 1989 నాటికి సుమారు 400 కోట్ల డాలర్లుకు చేరుకున్నది. అంటే పది సంవత్సరాలలో వడ్డీ చెల్లింపు భారం పదిరెట్లు పెరిగింది. అసలు మొత్తం ఋణభారం అదే కాలంలో 5 రెట్లు పెరిగితే వడ్డీ భారం అంతకు రెట్టింపుగా పెరగడం గమనార్హం. అనవసర ఖర్చులను తగ్గించుకోవడం, సబ్సిడీల భారాన్ని కుదించుకోవడం, పన్నుల ఎగవేత, నల్లధనాన్ని అరికట్టడం మాత్రమే ఈ ఋణవలయం నుండి విముక్తికి ఏకైక పరిష్కార మార్గం.

## 6. వ్యవసాయరంగంపై చిన్నచూపు

గత 10 సంవత్సరాలలో మన దేశంలో వ్యవసాయ రంగంపై పెట్టుబడి ఖాతా క్రింద ఖర్చు గణనీయంగా తగ్గుతూ వచ్చాయి. అంటే నీటి వనరుల నిర్మాణం, భూసార సంరక్షణ కార్యక్రమాలు మందగించడం జరుగుచున్నది. వ్యవసాయ రంగంలో ప్రాతిపదిక కార్యక్రమాలు ప్రభుత్వంచే నిర్వహించబడినప్పుడే ప్రైవేటు రంగంలో వ్యవసాయం, వ్యవసాయ ఆధార పరిశ్రమలు నిర్మించడం సులభసాధ్యం అవుతుంది.

ఈ కార్యక్రమాలు మందగించడం వలన వ్యవసాయ అభివృద్ధి నిలిచిపోవుచున్నది. వెనకపట్టు పట్టడం కూడా జరుగుచున్నది. నాబార్డ్ వారు వ్యవసాయరంగానికై కేటాయించుకున్న 5,000 కోట్ల రూపాయలను తమ సంక్లిష్ట నిబంధనల ఫలితంగానే వెచ్చించలేక పోవడం ఈ వ్యవసాయ అభివృద్ధిని కుంటుపరచడానికై దోహదం చేసింది. వ్యవసాయరంగం యొక్క పాత్ర జాతీయ ఆదాయాన్ని సమకూర్చడంలో తగ్గుతున్న మాట వాస్తవమే. కాని ఉపాధికల్పన రంగంలో పారిశ్రామిక రంగం కంటే వ్యవసాయ రంగానిదే పై చేయి. 35 శాతం పరపతిని పొందుచున్న పారిశ్రామిక రంగం కేవలం 10 శాతం మాత్రమే ఉపాధికల్పనకు తోడ్పడుచున్నది. రెండవవైపు కేవలం 16 శాతం పరపతిని పొందుచున్న వ్యవసాయ రంగం ఉపాధికల్పనలో 70 శాతం బాధ్యతలను నిర్వహించడం గమనించదగిన విషయం. కాబట్టి మన దేశం యొక్క ప్రత్యేక పరిస్థితులలో వ్యవసాయ రంగం యొక్క ప్రాధాన్యత అత్యంతకీలకమైనది.

# అర్థరహిత సంస్కరణలు కాదు అర్థవంతమైన జాతీయ స్ఫూర్తి, ఏకాభిప్రాయం అవసరం

ప్రధానమంత్రి శ్రీ పి.వి. నరసింహారావు గారి సారథ్యంలో, ఆర్థికమంత్రి మన్‌మోహన్‌సింగ్ గారి మేధో శక్తితో ఆర్భాటంగా ప్రారంభించబడి, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రారంభించబడిన ఆర్థిక సంస్కరణలు మూడు వసంతాల తర్వాత కూడా ఆపత్కాల ఆర్థిక సర్దుబాటుగానే మిగిలిపోయినవి. ఆర్థిక సంస్కరణల పేరిట మూడవ సంవత్సరం పెట్టబడిన బడ్జెటు దీనికి ప్రబల తార్కాణం. అభివృద్ధి చెందుతున్న దేశాల అనుభవాలు, నిర్ద్వంధంగా అందచేస్తున్న వాస్తవం గమనార్హం. దేశ ఆర్థిక ఆరోగ్యానికి ఈ క్రింది పంచశీలాలు అనివార్యం.

1. రెవెన్యూ ఆదాయం నుండి దాని నిర్వహణ ఖర్చులు పోగా రెవెన్యూ మిగులు వుండడం, ఆ మిగులును ఉపయోగించి పెట్టుబడి ఖాతాలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ప్రథమ సూత్రం.

2. దేశం యొక్క దిగుమతి, ఎగుమతిలలో దిగుమతి చేసికోవడానికై వెచ్చించే మొత్తం కంటే ఎగుమతుల ద్వారా సంపాదించే మొత్తం అధికంగా నుండడం రెండవ సూత్రం.

3. ద్రవ్యోల్బణం లేక నోట్లు ముమ్మరం లేకుండానో లేక స్థూల జాతీయోత్పత్తికి నాలుగు, అయిదు శాతానికి మించకుండానో వుండడం మూడవది.

4. దేశంలో విదేశీ మారక ద్రవ్యం మొత్తం తగు మోతాదులో నిలువగా వుండడం అప్పుల భారం పరిమితంగా నుండడం నాల్గవది.

5. దేశం యొక్క సగటు సంపద పెరుగుదల కనీసం అయిదు శాతం కంటే తగ్గకుండా క్రమంగా పెరుగుతూ వుండడం అయిదవది.

ఈ అయిదు రంగాలలో భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దిగజారిపోవడం కారణంగా 1991-92లో ఆర్థిక సర్దుబాటు కొరకు పెద్దగా ప్రపంచ ద్రవ్యనిధి ద్వారా ఋణాలు పొందడం ప్రారంభించారు. ఆర్థిక సంస్కరణలకి నాంది వాచకం పలికారు. మూడు సంవత్సరాలలో మూడు బడ్జెట్లు చూచిన తర్వాత ఆర్థిక సర్దుబాట్లు, సంస్కరణలు

వుద్దేశించిన లక్ష్యాన్ని సాధించలేదని, అంతేకాదు తద్విరుద్ధ పరిణామాలు ప్రారంభమైనాయని స్పష్టమవుతున్నది.

రెవెన్యూ ఆదాయం కంటే రెవెన్యూ ఖర్చులు అనగా ప్రభుత్వ సిబ్బంది, యంత్రాంగంపై వెచ్చించే ఖర్చు పెరిగిపోవడం ఈనాటికి జరుగుతున్నది. ఈ సంవత్సరం అన్ని రకాల పన్నులు, యితరత్రా వచ్చే రెవెన్యూ ఆదాయం 86,084 కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. రెవెన్యూ ఖర్చులు అనగా సిబ్బంది జీతభత్యాలపై చేయబడే ఖర్చులు 1,18,811 కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. ఈ విధంగా ఆదాయం కంటే ఖర్చులు 32,727 కోట్లు హెచ్చుగా నుంటాయి. అనగా 32,727 కోట్ల రెవెన్యూ లోటు అవుతుంది. ఈ పరిస్థితి అత్యంత ప్రమాదకరం. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం సిబ్బంది ఖర్చులకే సరిపడడం లేదు. యితర ఆదాయాలు అనగా ప్రభుత్వ సంపాదనలు చేసే అప్పుల నుండి సిబ్బంది జీత భత్యాలకై సింహభాగం తరలించబడుచున్నది. పన్నులు, ప్రభుత్వ ఆదాయాలు, చేయబడే దేశ విదేశీ రుణాలన్నిటిని కలిపి మొత్తం ఆదాయంగా పరిగణించగా మొత్తం ఖర్చుల కంటే ఈ మొత్తం 6,000 కోట్ల రూపాయలు తక్కువగా నుంటుందని ఈ సంవత్సరానికి అంచనా వేయడం జరిగింది. దీనినే బడ్జెట్ లోటు అంటారు. దేశంలో ప్రణాళిక మరియు ప్రణాళికేతర రంగాలలో మొత్తం ఖర్చులు 1,51,699 కోట్లు కాగా మొత్తం ఆదాయం 96,184 కోట్లు మాత్రమే. అంటే 54,915 కోట్ల ద్రవ్యలోటు అని అంచనా వేశారు. 48,915 కోట్ల రూపాయల క్రొత్త రుణం మరియు 6,000 కోట్ల రూపాయల బడ్జెట్ లోటు కలిపితే ఈ సంవత్సర బడ్జెట్‌కు సరిపోతుంది. ఈ ద్రవ్యలోటు గత సంవత్సరం 58,551 కోట్లు అంచనా వేయబడగా, అంతకు పూర్వపు సంవత్సరం 40,173 కోట్లుగా తేల్చబడ్డది. ఈ విధంగా ప్రతి సంవత్సరం మొత్తం ఖర్చులలో మూడవ వంతుకు తగ్గని మొత్తం దేశ విదేశీ రుణాల ద్వారా మాత్రమే సంపాదింబడుతున్నది. ఇందులో నుండే చెల్లించవలసిన బాకీలు చెల్లిస్తూ మిగతా మొత్తం రెవెన్యూలోటును భర్తీ చేయడానికి వినియోగించడం జరుగుతున్నది. ఎన్నడు కనీ, విని ఎరగని హనుమంతుడి తోకలాగా పెరిగిపోతున్న ఈ ఋణభారం భారత ఆర్థిక వ్యవస్థను కృంగదీస్తున్నది. మొత్తం ఆదాయంలో కేవలం 3 శాతం మాత్రమే విదేశీ రుణభారమని 30 శాతం స్వదేశీయుల నుండి పొందినదని సంతృప్తి పడటానికి ఏలాంటి ఆస్కారం లేదు. పలు అప్పులు, వడ్డీతో కలిపి ప్రతి సంవత్సరం వాయిదాల ప్రకారం చెల్లించవలసిందే. ఈ పరిస్థితిని రాజకీయంగా "విదేశీ రుణ వలయం"గా చిత్రించలేకపోయినా "భరించరాని రుణ భారం"గా వర్ణించక తప్పదు. మన రాజ్యాంగ చట్టం ప్రకారం చేయబడే రుణాలకు పరిమితిని విధించే అధికారం పార్లమెంటుకు వున్నది. రాజకీయ పక్షాలన్నీ ఏకాభిప్రాయంతో ఈ చట్టబద్ధ చర్యకు పూనుకోవడం తత్ఫలితంగా అనుత్పాదక ఖర్చులను తీవ్రంగా తగ్గించుకోవడం, రుణానికి లక్ష్మణ రేఖను ఏర్పాటు చేయడం తక్షణ అవసరం.

దిగుమతి, ఎగుమతుల మధ్య పెరిగి పోయిన అగాధాన్ని తగ్గించడానికి కొంత కృషి జరిగిన మాట వాస్తవమే అయినా యింకా ఈ అంతరాయం పెద్దగానే మిగిలివున్నది. ఈ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు, ఎక్సైజు పన్నులను చాలా వరకు తగ్గించారు. ప్రపంచ మార్కెట్‌లో సంధానం పేరుతో విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ సరళీకరణ చేయడం జరిగింది. దీని ఫలితంగా పన్నుల రాబడి తీవ్రంగా తగ్గిపోవడమే కాక, అనేక విదేశీ సరుకులు స్వదేశంలోనే స్వదేశీ సరుకులతో పోటీ పడడం స్వదేశీ పరిశ్రమలు ఈ పోటీని తట్టుకోలేకపోవడం గమనార్హం. దీనికి వ్యతిరేకంగా మన దేశం లోని పెట్టుబడిదారి వర్గంలో బలమైన వర్గం, బొంబాయి క్లబ్ పేరుతో ముందుకు రావడం కూడా గమనించదగిన పరిణామము. ఎగుమతులలో మన దేశం పారిశ్రామిక వుత్పత్తులను ఎగుమతి చేస్తూ పారిశ్రామికాభివృద్ధిని సాధించిందనుకోవడం వాస్తవం కాదు. మన ఎగుమతులలో 70 శాతం బియ్యం, మాంసం, చేపలు, రొయ్యలు లాంటి వ్యవసాయ వుత్పత్తులు మంచి నీళ్ళు కూడా వున్నవి. అమెరికాలాంటి అభివృద్ధి చెందిన దేశాలు రక్షణ పేరిట విదేశీ సరుకులు తమ దేశంలో చేరకుండా దిగ్బంధనలు నిర్మించుకున్నారు. వారి సరుకులను మాత్రం మనం దిగుమతి చేసికునే సౌకర్యాలు సాధిస్తున్నారు. ఇది ఉభయ తారకం కాకుండా ఏకపక్షంగా నిర్వహించ బడుచున్నది. ప్రస్తుత ఆర్థిక మాంధ్యం కారణంగా ఈ దిగ్బంధనం మరింత కఠినంగా అమలుపర్చబడుచున్నది. ఈ పరిస్థితులలో దిగుమతి, ఎగుమతుల మద్యనున్న పెద్ద అంతరాయాన్ని తాత్కాలికంగా కొద్దిగా తగ్గించుకున్నామే కాని, ఎగుమతుల ద్వారా రాబడి పై చేయి చేసికొనే పరిస్థితి సుదూర భవిష్యత్‌లో కూడా సాధించే అవకాశాలు కనబడడం లేదు. 6000 కోట్ల బడ్జెట్ లోటు, సుమారు 55000 కోట్ల ద్రవ్యలోటు వుండగా, ఈ లోటును పూడ్చే ప్రయత్నం రుణ సేకరణ ద్వారా తప్ప స్వంత వనరుల సమీకరణ కాని ఈ పరిస్థితులలో నోట్లు ముమ్మరం లేక ద్రవ్యోల్బణం ఈనాటి 8.5 శాతం వద్దనే నిలిచి పోతుందని, యింకా తగ్గుతుందని ఏమాత్రం ఊహించలేము. 1980 ఉత్తరార్థభాగంలో కూడా యింతే శాతం ద్రవ్యోల్భణం వుండింది. 91-92లో అమాంతంగా పెరిగి 17 శాతానికి చేరుకున్నది. దేశ సంపద వుత్పత్తిలో పెరుగుదల, స్వంత ఆర్థిక వనరుల సమీకరణ ప్రక్రియ ద్వారానే ఈ కృత్రిమ ద్రవ్యసృష్టిని అరికట్టకల్గుతాము. మరో విధంగా దుస్సాధ్యం. ఇటీవల బడ్జెట్ ప్రవేశానికి ముందే కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యాలు, గ్యాసు, డీజిలు, పెట్రోలు తదితర నిత్యావసర సరుకుల ధరలను గణనీయంగా పెంచడం, దాని ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడడం, బడ్జెట్‌లోటులు, ద్రవ్య లోటులు తత్ఫలితంగా నోట్ల ముమ్మరం పెరగడం అనివార్యం. రానున్న మాసాలలో ఈ పరిణామము కొట్ట వచ్చినట్లు కనపడక తప్పదు. దేశంలో విదేశీ మారక ద్రవ్య నిలువలు యిటీవల కాలంలో గణనీయంగా పెరిగి యుండడం 1991-92లో ఒక వంద కోట్ల డాలర్ల వరకే నున్న ఈ నిలువలు ఈనాడు 1300 కోట్ల డాలర్లకు

చేరుకోవడం హర్షించదగిన పరిణామమే. ఈ నిలువల వలన ప్రపంచ మార్కెట్‌లో మన దేశ పరపతి పెరగడం సత్పరిణామము. అయితే ఈ పరిస్థితి మన సాధారణ ఆర్థిక ఆరోగ్యంపై ఆధారపడి వుంటుంది. ఈ నిలువలను ప్రవాస భారతీయులు, విదేశీ పారిశ్రామిక వేత్తలు ఎప్పుడైనా ఉపసంహరించుకోగల్గుతారు. యిటువంటి చేదు అనుభవాలు మనకు లేకపోలేదు. ఏమయినా, ఈ నిలువలు తగ్గకుండా మరింతగా పెరిగే విధంగా విధానాల రూపకల్పన నిర్వహణ అత్యవసనం. అప్పుల భారం ఆందోళనకరమని తిరిగి చెప్పనవసరంలేదు. ఈనాడు మన బడ్జెట్‌లో అన్నింటికంటే మొత్తం సుమారు 38000 కోట్లు అనగా మొత్తం ఖర్చులో 26 శాతం కేవలం వడ్డీల చెల్లింపునకే వ్యయం చేయబడుచున్నది. ఆ తర్వాతనే 16 శాతం కేంద్ర ప్రణాళికా నిర్వహణ, 14 శాతం పన్నుల రాబడిలో రాష్ట్రాల వాటా 13 శాతం దేశ రక్షణ ఖర్చులున్నవి. యింత పెద్ద మొత్తం వడ్డీలుగా చెల్లించడం అవి గూడా తిరిగి తిరిగి అప్పులు చెల్లించడం ఆర్థిక దివాళాకు ప్రబల నిదర్శనం.

దేశ ఆదాయాల పెరుగుదల నామమాత్రం కంటే మించలేదు. పారిశ్రామిక వుత్పత్తుల ద్వారా 2 శాతం కంటే మించడంలేదు. వ్యవసాయ సంపద పెరుగుదల రేటు కూడా 2.5 శాతం రేఖ దాటుతున్న దాఖలాలు లేవు. సగటు జాతీయ వుత్పత్తి పెరుగుదల రేటు అన్ని కలుపుకుంటే 4 శాతం లేదు. 5, 6 శాతం లెక్కలు ఆలోచనల వరకే పరిమితం కాని ఆచరణ సాధ్యం కావడం లేదు. దీనికి కారణాలు తెలిసికోవడం కష్టసాధ్యం కానే కాదు. పారిశ్రామికంగా వెనకబడియున్న దేశం పారిశ్రామికాభివృద్ధి చెందియున్న దేశాలతో మార్కెట్‌లో పోటీపడటం ముఖ్యంగా వారి రక్షణ వలయాలను చేధించడం అంత సులభం కాదు. ప్రపంచ వ్యాపిత ఈ వ్యాపార పోటీలో అభివృద్ధి చెందుతున్న దేశాలు సుసంఘటితంగా నిలిచి బేరసారాలు చేస్తే తప్ప ఒంటరిగా నిలదొక్కుకోవడం దుర్లభం. ప్రపంచ వ్యాపార సంస్థ వేదికపై ఈ పోరాటమే నిరంతరం, స్వదేశీ ఆర్థికాభివృద్ధి లక్ష్యంతో నిర్వహించవలసి యుంటుంది. దేశీయ పారిశ్రామిక విధానాన్ని స్వదేశీ పరిశ్రమలు వాణిజ్య వ్యాపారాల రక్షణ, విదేశీ పారిశ్రామిక వ్యాపారాలతో అసమాన పోటీ నివారణ దిశలో పకడ్బంధీగా నిర్వహించక తప్పదు. కేవలం అనివార్యం అత్యవసర రంగాలలోనే విదేశీ పెట్టుబడితో కూడిన బహుళ జాతి సంస్థల ప్రవేశాన్ని కోరి తెచ్చుకోవడం అనుమతించదగింది. విదేశీ పెట్టుబడులు విశృంఖలంగా మనదేశంలో చోటు చేసికోవడం మన ఆర్థిక స్వాతంత్రానికే అత్యంత హానికరం. తమ దేశాలలో సహజ వనరుల తీవ్రంగా తరిగిపోయి, మానవ వనరులు అత్యంత ప్రియంగా మారిన పరిస్థితులలో అభివృద్ధి చెందిన దేశాలు, సహజ వనరులు, మానవ వనరులను చౌకగా సంపాదించు కోవడానికి, తద్వారా తాము ఎదుర్కొంటున్న ఆర్థిక స్థంబనను, నిరుద్యోగాన్ని అధిగ మించడానికీ, అభివృద్ధి చెందుతున్న దేశమయిన మన దేశంపై గురిపెట్టుతుండడం యాధృచ్ఛికం కాదు. ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ పరిణామ

క్రమములో యిది సహజమే. సామ్రాజ్యవాద విధానాలతో శతాబ్దాల తరబడి పోరాడి జాతీయ విముక్తి సాధించి, స్వతంత్రం, స్వతంత్ర ఆర్థికాభివృద్ధి ప్రజాస్వామ్యం, సమ సమాజ స్ఫూర్తితో ఎంతో ముందడుగు వేసిన ఏ జాతి కూడా ప్రపంచ పెట్టుబడి దారీ బహుళజాతి సంస్థల ప్రలోభాలకు గురి అవడం, బలికావడం సులభం కాదు. భారత జాతికి ఈ పరిస్థితి ఊహాతీతం. భారతీయ స్వాతంత్ర్యం, స్వావలంబన, స్వతంత్ర ఆర్థికాభివృద్ధి, సాంఘిక న్యాయం, చైతన్యంతో ముందడుగు వేస్తూన్న భారత జాతి, ఎన్ని రాజకీయ భిన్నాభిప్రాయాలున్నా, నయావలస వాదుల నయవంచక చర్యలను, ఒత్తిడులను ఓడించక తప్పదు. చరిత్ర హీనమైన సామ్రాజ్యవాదం, వలస వాదం, యుద్ధం పునారావృత్తం కావడం అసంభవం చేయబడుతుంది. చైతన్య భారతి దీనికి బాసట. ఆర్థిక ఆరోగ్యానికి అనివార్యమైన పంచశీలాల పాలనలో ఈనాడు భారతదేశం ఎదుర్కోంటున్న సమస్యలు, అనుభవాలను స్థూలంగా పరిశీలించిన తర్వాత శాశ్వత పరిష్కార మార్గం గురించి కూడా దృష్టిని సాధించడం సందర్భ శుద్ధి కాకాపోదు. నూతన పారిశ్రామిక, వ్యవసాయక, ఆర్థిక విధానాలు తప్పనిసరిగా జాతీయ ఏకాభిప్రాయంపై ఆధారపడినవిగా వుండాలి. అధికార పార్టీ యొక్క అభిప్రాయాలే తుదివాక్యం కాకూడదు. ఈ మౌళిక విధాన రూపకల్పనలో అభ్యుదయ గామి రాజకీయ సంస్థలు నిస్సంకోచంగా విశాల హృదయంతో, జాతి మనుగడ పరిరక్షణ స్ఫూర్తితో చేయి చేయి కలపడం చారిత్రిక కర్తవ్యం. అందుకు అవసరమైన రాజ్యాంగ పర చర్యలను కూడా చేపట్టక తప్పదు. ఈ దిశలో, పరిపూర్ణ దేశభక్తితో ప్రజాభిప్రాయ సమీకరణ పవిత్ర రాజకీయ కర్తవ్యం అవుతుంది. దేశ మాత పిలుపుకు ప్రతి స్పందన అందించే రాజకీయ శక్తులు నిలుస్తాయి. వ్యతిరేకించే శక్తులు క్రమంగానైనా కాల గర్భంలో కలుస్తాయి.

గత మూడు సంవత్సరాల ఆర్థిక సంస్కరణల ఫలితాల కంటే గుణాత్మకంగా కొత్తవేమి కాదు. నలభై అయిదు సంవత్సరాల సుదీర్ఘ కాలంలో నిత్య నూతన విధాన ప్రకటనలో తప్ప ఆచరణలో సాధించిన కొత్తదనం శూన్యం. కాకపోతే అర్థరహిత విధానాలు పరాకాష్టకు చేరుతున్నాయి. ఈ ఏడు, ఎనిమిది ప్రణాళికా దశలలో పూసలలో దారం లాగా నున్న విధానానికి మూలం దేశ విదేశీ పెట్టుబడి దారి వర్గాల ప్రయోజనం, వాణిజ్య వ్యాపార వర్గాలు, గ్రామీణ ధనిక వర్గం, ఉద్యోగ బృందం మరియు సంఘటిత కార్మిక వర్గ తాత్కాలిక ప్రయోజనాలు. ఈ ప్రయోజనాల పరిరక్షణ ద్వారానే రాజకీయ ప్రయోజనాలు సాధించబడుచున్నాయి. 90 కోట్ల భారతీయులలో 20-25 కోట్ల జనాభా ప్రయోజనాలు మాత్రమే అగ్రభాగాన్ని అలంకరించి సింహభాగాన్ని చేజిక్కించు కుంటున్నాయి. మిగతా 65-70 కోట్ల గ్రామీణ పట్టణ నిరుపేదలు, సన్నకారు, చిన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తుల వారి ప్రయోజనాలు, అవసరాలు పూర్తిగా విస్మరించబడి నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. వారి కాయకష్టం కారుచౌకగా కొల్లగొట్టబడుచున్నది. విలువైన వనరులు గ్రామాంతరం తరలించ బడుతున్నాయి.

ఆర్థిక, సాంఘిక విధానాల రూపకల్పన చేసే వర్గాలు భారత దేశ ప్రత్యేకతను యిక్కడి వాస్తవకతను పూర్తిగా విస్మరిస్తున్నాయి. స్వదేశీ, విదేశీ పెట్టుబడుల ద్వారా మాత్రమే దేశాభివృద్ధిని సాధించగల్గుతామనే భ్రమలోనున్నారు. గ్రామీణ జీవితం, వ్యవసాయం, చేతి వృత్తులు యిక్కడి అత్యధిక ప్రజల జీవిత విధానాన్ని నిర్ణయించేవి. అవిద్య, అజ్ఞానం, సాంఘిక వెనుకబాటుతనం వారి ఆలోచనా సరళిని నిర్ణయిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవం అందిస్తున్న విలువైన గుణపాఠం విస్మరించరానిది. ఏదేశమైనా తన ప్రకృతి సిద్ధమైన సహజవనరులను ప్రబలంగా వినియోగించకుండా అభివృద్ధి పథంలో అడుగుపెట్టలేదు. అతి విశాలమైన భూమిపై అశేష జన సామాన్యం వ్యవసాయంపై ఆధారపడి యుండటం, వ్యవసాయాధార పరిశ్రమలు కలిసి యుండడం గ్రామీణ చేతి వృత్తుల ఆధారంగా బ్రతకడం మన దేశ విశేషం. అపారమైన జల వనరుల, అనన్య సామాన్యమైన సమ శీతోష్ణ వాతావరణం కలిగిన దేశం మనది. ప్రకృతి సిద్ధమైన ఈ వనరులను, మానవ వనరులను పూర్తిగా సమర్థవంతంగా వినియోగించ కుండా అభివృద్ధి సాధించడం దుస్సాధ్యం. అదేవిధంగా అవిద్య, అర్థాకలి, సమస్యల పరిష్కారం లేకుండా, చైతన్యవంతమైన జనసామాన్యం, ప్రత్యేక పాత్ర లేకుండా అభివృద్ధి ఊహించడానికే వీలులేనిది. పారిశ్రామికాభివృద్ది పాత్ర ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక యుగంలో ఏమాత్రం తగ్గించడానికి వీలులేదు. దేవ సంపదలో 70 శాతం వాటాను పోషిస్తున్న పారిశ్రామిక వుత్పత్తి, అత్యధిక ప్రాముఖ్యతను సంతరించుకున్నది. పారిశ్రామిక విస్తరణ ఆధునీకరణ ఆవశ్యం. అయితే మన దేశ అవసరాల నేపథ్యంలో పారిశ్రామికాభివృద్దికి గల పరిమితులు ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక యుగంలో గమనార్హం. ఈనాటి ఆధునిక పారిశ్రామికాభివృద్ధి దాదాపు ఉపాధికల్పనా రహితమైన అభివృద్ధి. దేశ జనాభాలో పదిశాతంకి తక్కువగా నున్న పారిశ్రామికులలే పరిశ్రమ ఆధునికీకరణ వలన ఉపాధి కోల్పోవడం, వారి ఉపాధి రక్షణ జాతీయ సమస్యగా పరిణమించడం మనం చూస్తున్న సత్యం. ఇప్పటికే మూడున్నర కోట్ల యువతీ యువకులు నిరుద్యోగులుగా రిజిష్టర్ అయివున్నారు. గ్రామీణ యువతీ యువకులు సరేసరి. ఈ పూర్వ రంగంలో పారిశ్రామికాభివృది జాతి సంపదను పెంచడానికి ప్రబలంగా తోడ్పడడం వాస్తవమే. కాని, ఉపాధి వుద్యోగ కల్పన అవసరం నుండి విడదీయలేము. కాబట్టి 75 శాతం గ్రామీణ, పట్టణ పేద ప్రజల ప్రయోజనాల కొరకు, వారి పేదరికాన్ని త్వరితంగా పారద్రోలి, వారికి కనీస జీవిత అవసరాలు అందజేస్తూ వుండగలిగే ఆర్థిక విధానాలు కీలకమైన నిర్ణయాత్మకమైన స్థానాన్ని అలంకరించాలి. పారిశ్రామిక విధానం తన స్థానంతో అత్యంత ప్రాధాన్యత గలదే. దానికి వ్యవసాయిక గ్రామీణ అభివృద్ధి విధానాలతో ఏలాంటి పోటి వుండకూడదు. యివి రెండు ఒకటికి మరొకటి అనుబంధం. ప్రగతి రథానికి రెండు చక్రాలు. కేవలం పారిశ్రామిక ప్రగతి అన్ని సమస్యలను పరిష్కరించలేదు. భారత దేశ వ్యవసాయం యింకా సనాతన పరిధిలోనే

వున్నది. ప్రపంచంలో మొత్తం భూమిలో సాగులాయకు భూమి 11 శాతం మాత్రమే. అయితే భారత దేశంలో మొత్తం భూమిలో సాగులాయకు భూమి 51 శాతం. యిక్కడి నీటిపారుదల సౌకర్యం పొందగల భూమి సుమారు 18 కోట్ల హెక్టార్లు. యిది చైనాలో సాగులోకి తేబడిన భూభాగానికి సుమారు రెండు రెట్లు. యింకా దేశంలో సుమారు 10 కోట్ల ఎకరాల సాగులాయకు భూమి నిరుపయోగంగా మిగిలి వున్నది. యింకా 60 శాతం వ్యవసాయ ఉత్పత్తి అవకాశాలు వినియోగంలోకి రాకుండా వున్నది. అపారమైన మానవ వనరులు, భూసంపద జలవనరుల అవకాశం, వాతావరణ సానుకూలత యివన్ని సద్వినియోగం చేయబడి ప్రతి సంవత్సరం రెండు మూడు పంటలు సాధించబడిన నాడు భారత జనావళి సమగ్ర, బహుముఖ ప్రగతి పథంలో పయనిస్తుంది. భారత దేశ మార్గమే యిది. అంతే కాని, ఊహాజనితమైన ఆచరణలో సాధ్యపడని పారిశ్రామిక ప్రగతి సత్ఫలితాలు గ్రామాలలోని పేదలకు చేరుకుంటాయని అంతవరకు తాత్కాలికంగా పేదరిక నిర్మూలన కార్యక్రమాల ద్వారా గ్రామీణాభివృద్ధిని సాధించాలనే వ్యూహం అశాస్త్రీయమైనది. భారతదేశ వాస్తవికతకు గిట్టనిది. ఆర్థిక సంస్కరణలు, గత మూడు సంవత్సరాల అనుభవం దీనినే దృవీకరిస్తున్నది. గత 7 సంచవర్ష ప్రణాళికల కాలములో క్రమంగా యిదే జరిగింది. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో 36.9 శాతం వనరులు కేటాయించబడితే గత మూడు సంవత్సరాల కాలంలో కేటాయించబడింది 19.7 శాతం మాత్రమే. జలవనరుల అభివృద్ధి, భూమి అభివృద్ధి, భూసార సంరక్షణ, గ్రామీణ రవాణ సౌకర్యాల అభివృద్ధి లాంటి ప్రాథమిక సదుపాయాలకు వెచ్చించే వనరులు చాలా వరకు తగ్గిపోయినవి. 1980-81 ధర వరల ప్రకారం 1980-81 నుండి 92-93 మధ్య కాలంలో ప్రభుత్వము చేసే తలసరి ఖర్చులలో వుత్పత్తిదాయకమైన ఖర్చుల కంటే అనుత్పత్తి దాయకమైన ఖర్చులు మూడు రెట్లు అధికం. గ్రామీణ ప్రాంతాలు వాటి వ్యవసాయం నానాటికి తీసికట్టుగా మారిపోవడానికి ప్రధాన కారణం వ్యవసాయ వుత్పత్తుల ధరలు పారిశ్రామిక వుత్పత్తుల ధరతో పోల్చగా తీవ్రంగా తగ్గిపోతూ వుండడమే. గత 17 సంవత్సరాలలో ఈ తేడా 10 నుండి 20 శాతం వరకు పెరిగి పోయింది. గ్రామీణ ప్రాంతాలలో పెట్టుబడుల సమీకరణ 1970లో 18 శాతం వుండగా 1991 నాటికి కేవలం 8 శాతానికి తగ్గిపోయింది. వ్యవసాయదారుల వ్యవసాయాధార ఆదాయాన్ని వ్యవసాయేతరుల తలసరి ఆదాయాలతో పోల్చినపుడు 1970-71లో అది 1:2.88 వుండగా 1990-91లో పెరిగి 1:4.16కి పెరిగింది. వ్యవసాయదారుల తలసరి నిజ ఆదాయంలో పెరుగుదల సగటు రేటు 1970-71, 1990-91 మధ్య కాలంలో 0.25 శాతం వుండగా వ్యవసాయేతర ఆదాయాల వారి తలసరి నిజ ఆదాయం పెరుగుదల రేటు 2.10 శాతం వుండింది వ్యసాయదారుల ఆదాయం రేటు కంటే వ్యవసాయేతర ఆదాయం 8 రెట్లు అధికం. కాబట్టి గ్రామీణ శ్రామికుల సహజ సిద్ధ ఆదాయాలు పెరగకుండా ప్రభుత్వం తమ విధానాల ద్వారా

అడ్డుపడుతున్నది. వ్యసాయరంగానికి వ్యవసాయ వుత్పత్తిలో కేవలం 5 శాతం సబ్సిడీలు అందిస్తూ అతి పెద్ద ఉపకారం చేస్తున్నట్లుగా ప్రచారం చేస్తున్నది. ప్రకృతి సిద్ధంగా సహజ సిద్ధంగా గ్రామీణ పేదలకు సమకూరవలసిన వనరులను అడ్డుకుంటూ చేకూర్చే మార్గాలకు మూతపెడుతూ గ్రామీణ పేదరికాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వ క్రొత్త పాత విధానాలే. వ్యూహాత్మక మార్పుల ద్వారా తప్ప పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు సాధ్యపడదు.

అత్యంత ప్రధానమైన పారిశ్రామిక వ్యవసాయ విధానాలు, ఆర్థిక విధానాలు రూపకల్పనలో దీర్ఘకాలిక దృష్టితో జాతీయ ఏకాభిప్రాయం సాధన ద్వారా మౌళికమైన మూల మలుపు సాధించాలి. కాని, ఆపత్కాలిక సర్దుబాటు, ఆర్థిక ద్రవ్య విధానాల ద్వారా ఏమాత్రం సాధ్యపడదు. గత మూడు సంవత్సరాల అనుభవం దీనినే చాటి చెపుతున్నది. ప్రతి సంవత్సరం పాపంలా పెరిగిపోతున్న రెవెన్యూ లోటు, బడ్జెట్ లోటు, ద్రవ్య లోటు, ప్రాథమిక లోటు వాటి పర్యవసానంగా పుట్టలుగా పెరిగిపోతున్న స్వదేశీ, విదేశీ రుణ భారం యివన్నీ మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా గ్రామీణ పేదలపైననే అత్యధిక భారాన్ని వేస్తున్నవి. గ్రామీణ పేదరికం పెచ్చుపెరగడం, పట్టణ గ్రామాల మధ్య అంతరాయం పెరగడం, పేదలు ధనవంతుల మధ్య అగాధం మరింత పెరగడం, అనేక సాంఘిక, రాజకీయ వైరుధ్యాలకు దారితీస్తున్నది. జాతీయ పునరుజ్జీవనం కోరే వారంతా సకాలంలో మేల్కొని తమకర్తవ్య నిర్వహణ చేయవలసియున్నది. అభివృద్ధి స్థంభన, అధిక ధరల విజృంభణ, ఈనాటి రుగ్మత. జాతీయ స్ఫూర్తి, జాతీయ ఏకాభిప్రాయ సాధన, పోరుబాట పరిష్కార మార్గం.



"చెన్నమనేని" షష్ఠి పూర్తి సందర్భంగా వారి ఇంటిలో కలిసి అభినందిస్తున్న కీ.శే. ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు మరియు అఖిలభారత రైతు నాయకులు శ్రీ వై.వి. కృష్ణారావు



"చెన్నమనేని" షష్ఠి పూర్తి సందర్భంగా వారి ఇంటిలో కలిసి అభినందిస్తున్న సిపిఐ రాష్ట్ర మాజీకార్యదర్శులు కీ.శే.ఎన్. గిరిప్రసాద్ మరియు తమ్మారెడ్డి సత్యనారాయణ గారలు




*ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్వర్ణోత్సవ సందర్భంగా ప్రథమ శాసనసభ్యులుగా
నుండి ఈనాటికీ శాసనసభ్యులుగానున్న 85 సం॥ల వయోవృద్ధులు
శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావు గారిని లోక్‌సభ, శాసనసభ స్పీకర్లయిన
శ్రీ సోమనాథ్ చటర్జి మరియు శ్రీ కె.ఆర్. సురేష్ రెడ్డి గార్లు సన్మానిస్తున్న దృశ్యం.*

# రాజకీయార్థిక వ్యాసావళి

చెన్నమనేని

# రాజకీయార్థిక వ్యాసావళి

## చెన్నమనేని

© : చెన్నమనేని

*ప్రచురణ:* **31 ఆగస్టు 2008**

*ప్రతులు:* **1000**

*వెల:* **150/-**

*ప్రతులకు*

**చెన్నమనేని రాజేశ్వరరావు**

1141, ఎం.ఎల్.ఏ., కాలనీ, రోడ్ నెం.12

బంజారా హిల్స్, హైదరాబాద్-500 034

ఫోన్: 040-23397720

*ముద్రణ*

**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**

(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)

నల్లకుంట, హైదరాబాద్ - 500 044.

ఫోన్: 27676910, 27674003, 27677078

# అంకితం



స్వాతంత్ర్య సమరయోధురాలు, నా ధర్మపత్ని

**శ్రీమతి చెన్నమనేని లలితాదేవి గారికి**

# అనుభవసారం

ఇరవయ్యవ శతాబ్ది ఉత్తరార్ధంలోను కొత్త శతాబ్ది తొలిదశకంలోను చరిత్రను ప్రభావితం చేసిన ఆంధ్రుల అగ్రశ్రేణి నాయకులలో ఒకరు శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావు గారు. నిర్వహించిన పదవులను బట్టి కాక రాజకీయాలలో పోషించిన పాత్రను బట్టి ఆయన అగ్రశ్రేణి నాయకుడు. శ్రీయుతులు పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, దాసరి నాగభూషణరావు మొదలైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలతో భుజం భుజం కలిపి పని చేసిన అతిరథుడాయన. ప్రపంచమంతటా ప్రసిద్ధి పొందిన తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకి చేతపట్టిన సమరయోధుడు. సాయుధపోరాట పంథాను పార్టీ విడిచిపెట్టిన తరువాత ఆరుసార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికై తిరుగులేని ప్రజాభిమానాన్ని పొందుతున్న ప్రజాస్వామ్యవాది. సైద్ధాంతిక విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రజాప్రయోజనాల పరిరక్షణలో ఇతర పార్టీల నాయకులతో కలిసి పని చేయడానికి వెనుకాడని జనశ్రేయోభి లాషి. అంతర్జాతీయ పరిణామాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ స్థితిగతుల వరకు లోతుగా పరిశీలించే నిరంతర అధ్యయనశీలి. సైద్ధాంతిక గ్రంథాలను పట్టువదలక చదివే నిత్యవిద్యార్థి. మాటలలో మృదుత్వం, చేతలలో నిజాయితీ ఆయన మూర్తిమత్వ విశిష్ట లక్షణం.

శాసనసభకు సంబంధించిన ఎన్నో కమిటీలు రాజేశ్వరరావుగారి అనుభవం నుంచి లబ్ధిపొందాయి. పదవ శాసనసభ ఎథిక్స్ కమిటీలో ఆయన సభ్యుడుగా ఉన్నప్పుడు కమిటీ స్టడీ గ్రూపు సభ్యుడుగా నాకు ఆయనను, ఆయన ఆలోచన సరళిని సన్నిహితంగా గమనించే అవకాశం కలిగింది. అంతేగాక అర్ధశతాబ్ది కాలానికి పైగా మన శాసనసభలో వివిధ పార్టీల విధానాలను, సభ్యుల ప్రసంగాలను తరచూ గమనించిన అనుభవం కూడా జర్నలిజం వృత్తిరీత్యా నాకు ఉంది. ఒకప్పుడు శాసనసభలో తీవ్ర వాదోపవాదాల మధ్య, ఉద్రిక్త వాతావరణం మధ్య సుందరయ్యగారు లేచి నించోగానే సభ నిశబ్దమయ్యేది. అధికారపక్షం వారితో సహా అందరూ ఆయన మాటలను శ్రద్ధగా ఆలకించేవారు. శ్రీ రాజేశ్వరరావుకి కూడా మన శాసనసభలో ఇంచుమించు అటువంటి గౌరవమే ఉన్నది. జర్నలిస్టు మిత్రులు పత్రికలలో చెన్నమనేని బదులు చండ్ర రాజేశ్వరరావు అని పొరపాటున వ్రాసిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయాన్ని

రాజేశ్వరరావు కూడా తమ వ్యాసాలలో ప్రస్తావించారు. “సిహెచ్” అంటే చెన్నమనేని కావచ్చు చంద్ర కావచ్చు. ఇద్దరు గొప్ప నాయకులే కనుక జర్నలిస్టు మిత్రులు ఇలా పొరపాటు పడడంలో ఆశ్చర్యం లేదు.

ఇప్పుడు మీ చేతుల్లో నున్న పుస్తకం శ్రీ చెన్నమనేని రాజేశ్వరరావు గారు రచించిన వ్యాసాల, విధానపత్రాల సంకలనం. ఇందులో తాను ఎవరెవరితో కలిసి రాజకీయ రంగంలో పనిచేశారో వారిలో కొందరు ముఖ్యులను గురించి, తాను స్వయంగా పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం మొదలైన విలక్షణ రాజకీయ ఘట్టాలను గురించి, వివిధ ప్రజాహిత వ్యవహారాలపై తన అభిప్రాయాల గురించి ఆయన రచించిన వ్యాసాలు ఉన్నాయి. అవి నేటి తరానికే కాదు ముందు తరాలకు సైతం ఉపయోగ పడతాయి. చరిత్రను అధ్యయనం చేసే వారికి, వ్రాసే వారికి భవిష్యత్తులో చరిత్ర భాగస్వాములు కావలసిన వారికి ఆసక్తి కలిగించే అనేక సంఘటనల ప్రస్తావనే కాదు విశ్లేషణ ఈ వ్యాసాల ప్రత్యేకత.

రాజేశ్వరరావుగారి నిజాయితీ, నిష్పాక్షితల మీద ఆయన ఏ పార్టీలో ఉన్నారో ఆ పార్టీ వారికే కాక ఇతర పార్టీల వారికి కూడా నమ్మకం ఉండడం ఒక అసాధారణమైన (ఆయన) మూర్తిమత్వ లక్షణం. కాసు బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా, రాజేశ్వరరావు గారు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పటి ఒక సంఘటన ఇందుకు ఉదాహరణ. కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడుగా కాంగ్రెస్ సభ్యులలో ఎవరిని ఎన్నుకోవాలో వారిలో వారు తేల్చుకోలేక పోయినప్పుడు ఎంపిక బాధ్యత ముఖ్యమంత్రికి అప్పగించిన సందర్భమిది. బ్రహ్మానందరెడ్డిగారు ఆఖరి క్షణంలో రాజేశ్వరరావుగారిని తమ గదికి పిలిపించుకొని ఎవరిని ఏ పదవిలో నియమిద్దామని సలహా అడిగి ఆయన చెప్పిన పేర్లనే తూ.చ. తప్పకుండా కాగితం మీద వ్రాసి సీల్డు కవర్‌లో పంపారు. వారే ఎన్నికైనారని ప్రత్యేకించి చెప్పవలసిన పని లేదు. అప్పుడు అధ్యక్షులుగా ఎన్నికైనవారు పి.వి. నరసింహారావుగారికి సన్నిహితుడైన శ్రీనివాసరావుగారు! ఈ సంగతిని తరువాత లోకానికి వెల్లడిచేసింది రాజేశ్వరరావుగారు కాదు. బ్రహ్మానందారెడ్డిగారే! ప్రతిపక్షానికి చెందినవారైనా రాజేశ్వరరావుగారి సలహాను రాష్ట్రంలో ముఖ్యమంత్రే కాక జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి సైతం తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. 1968-69 ప్రాంతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మహోద్రిక్తంగా మారిన ఘడియలో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ సంప్రతించిన ఆంధ్ర నాయకులలో ఒకరు రాజేశ్వరరావుగారు. ముఖ్యమంత్రిని మార్చడం ఒక పరిష్కారమని రాజేశ్వరరావు సూచన. మరెవరైనా కూడా ఈ సూచన చేసారేమో తెలియదు గాని రాజేశ్వరరావుగారి సూచనగా శ్రీమతి ఇందిరాగాంధీ దానికి తప్పక విలువ ఇచ్చిఉంటారని అనిపిస్తుంది.

హైదరాబాద్ విముక్తి పోరాటంలో పార్టీలు వేరైనా పి.వి.నరసింహారావుగారు, రాజేశ్వరరావుగారు ఒకే లక్ష్యం కోసం కృషి చేసినవారు. ఇద్దరు ఒక దశలో ఆయుధాలు చేపట్టక తప్పదని నమ్మినవారే. నరసింహారావుగారు కాంగ్రెస్‌లో ఉన్నప్పటికి ఆయన మేధస్సును, నీతినిజాయితీలను రాజేశ్వరరావుగారు అభిమానించారు. బాబ్రీ మసీదు కూల్చివేత సంఘటనలో అప్పటి ప్రధానిగా నరసింహారావుగారు నిందమోసినందుకు రాజేశ్వరరావుగారు బాధపడ్డారు. సహృదయంతో పి.వి. గారిని అర్థం చేసుకున్న కొద్దిమంది కాంగ్రేసేతర నాయకులలో రాజేశ్వరరావు గారొకరు. ప్రత్యేకించి పి.వి.గారి గురించి రాజేశ్వరరావుగారు పలికిన ఒక ప్రశంసాత్మక వాక్యం ఇక్కడ పేర్కొనవలసి ఉంది. "రాజకీయ అభిప్రాయ బేధాలు తీవ్రంగా ఉన్నప్పటికి ప్రజాహిత కార్యక్రమాలలో కలిసి పనిచేయడం కరీంనగర్ జిల్లాలో ఒక ప్రత్యేకత. ఈ చక్కని సంప్రదాయాన్ని ఏర్పాటు చేయడంలో, పోషించడంలో పి.వి.గారి పాత్ర మాకు ఆదర్శవంతమైనది". అన్ని జిల్లాలకు ఆదర్శప్రాయమైన సంప్రదాయంగా దీనిని ఆంధ్రులమైన మనం గుర్తించవలసినది.

తెలంగాణ సాయుధ పోరాటంపై సుందరయ్యగారు, రావినారాయణ రెడ్డి గారు, రాజ్ బహదూర్ గౌర్ గారు, ఇంకా ఎందరో ఎన్నెన్నో విషయాలు వ్రాశారు. అయినా, చెప్పవలసినవి ఇంకా చాలా మిగిలి ఉన్నాయేమో అనిపించే విధంగా రాజేశ్వరరావుగారు ఆసక్తి కరమైన చాలా విశేషాలను తమ వ్యాసాలలో వ్రాశారు. విశ్వనాథసత్యనారాయణగారి సాహిత్యంపై సాధికారికంగా మాట్లాడగలిగిన సాహితీవేత్త శ్రీ జువ్వాడి గౌతమరావు గారు. సాయుధపోరాటకాలంలో స్టెన్‌గన్‌తో కనిపించిన దృశ్యం ఒక వ్యాసంలో కనిపిస్తుంది. జాతీయ స్థాయిలో అహింసకు అంకితమైన కాంగ్రెస్ పార్టీ హైద్రాబాద్ సంస్థానంలో ఆయుధాలను ఆశ్రయించడంపై విశ్లేషణ కనిపిస్తుంది. నైజాం నవాబు సైన్యాలు తెలంగాణ పోరాట యోధులపై వారిని అభిమానించిన ప్రజలపై సాగిన దారుణహింసాకాండ గురించే లోకానికి ఎక్కువ తెలుసు. హైద్రాబాద్ విమోచన అనంతరం కూడా కమ్యూనిస్టులపై, వారి అభిమానులపై పోలీసుల అకృత్యాలు కొనసాగిన పరిస్థితిని రాజేశ్వరరావుగారి వ్యాసం మనకు తెలియజేస్తుంది.

తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరుగా రాజేశ్వరరావుగారు వెల్లడించిన కొన్ని అభిప్రాయాలు మార్క్సిస్టు, లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతాలను అభిమానించేవారు గమనించదగినవి. "విప్లవ సిద్ధాంతం అజరామరం విప్లవమంటే శాశ్విత తీవ్రవాదం గాని, శాశ్వత హింసావాదం కానీ కాదు. వర్తమాన, సామాజిక స్థితిగతులను కాలజ్ఞానంతో ముందుకు, మున్ముందుకు నడిపిస్తూ సువిశాల ప్రజాఉద్యమ చైతన్యంతో సమసమాజ గమ్యానికి చేరుకోవడం." ఎప్పుడైనా మరెప్పుడైనా కమ్యూనిస్టులూ కమ్యూనిజాన్ని అభిమానించేవారూ మననం చేసుకోవాల్సిన మంచి నిర్వచనం ఇది.

చదువుకుంటున్న కాలం నుంచి ఇలాంటి స్వతంత్ర ఆలోచనలు కలిగి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ వచ్చిన రాజేశ్వరరావు గారికి ఆయన తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడే శ్రీమతి అరుణ ఆసఫ్ అలీ నుంచి ప్రతిస్పందన లేఖ వచ్చినదంటే ఆశ్చర్యమేమీ లేదు. స్వతంత్రమైన ఆయన ఆలోచనలను మేధస్సును అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే ఈ విధమైన ఎన్నో భావప్రకటనలు ఈ సంపుటిలో కనిపిస్తాయి.

సుందరయ్యగారు, తాను రాజకీయ గురువుగా భావించిన బద్దం ఎల్లారెడ్డిగారు, పి.వి. నరసింహారావుగారు, ఎన్.టి.రామారావుగారు, పెండ్యాల రాఘవరావుగారు, జువ్వాడి గౌతమరావుగారు మొదలైన ప్రజానాయకుల, నీతిమంతులైన ప్రజాసేవ పరాయణుల మూర్తిమత్వాలను అంచనా వేసేటప్పుడు న్యాయమూర్తులు తీర్పు చెప్పే సమయంలో పాటించే ధర్మబద్ధతను, నిష్పాక్షికతను రాగద్వేషాలకు అతీతంగా రాజేశ్వరరావుగారు పాటించినట్లు కనిపిస్తుంది.

రాజేశ్వరరావుగారు కమ్యూనిస్టు ఉద్యమంతోటి బాల్యం నుంచి పెంచుకున్న అనుబంధాన్ని తెంచుకొని తెలుగుదేశం పార్టీలో చేరినప్పుడు ఆశ్చర్యపడిన చాలా మందిలో నేను ఒకడిని. ఫలానా, ఫలానా కారణాలవల్ల తాను కమ్యూనిస్టు పార్టీతో తెగతెంపులు చేసుకున్నట్లుగానీ, టి.డి.పి.లో చేరుతున్నట్లు గాని ఆయన ఈ వ్యాసాలలో సైద్ధాంతిక ప్రాతిపదికతో చెప్పకపోయినప్పటికి ఈ సంపుటిలోని వ్యాసాలను చదివితే ఆయన నిర్ణయానికి కారణాలు బోధపడతాయి. ఏ పార్టీలో పనిచేసినప్పటికి ప్రజలకు మంచి జరుగుతున్నదా లేదా అనేది ఆయనకు గీటురాయి. అలాగని తన మౌలిక విశ్వాసాలను వదులుకోలేదు. ఆయన సోషలిస్టు దృక్పథంలో మార్పు రాలేదు. మార్క్సిస్టు మూలసూత్రాల ప్రకారం మారుతున్న భౌతిక పరిసరాలలో సిద్ధాంతం కూడా చేర్పులు, మార్పులు పొందవలసి ఉంటుందని ఆయన అభిప్రాయం. స్టాలినిజంగానీ, మావోయిజం గానీ నిజమైన మార్క్సిజం కాదని, ''పట్టు విడుపులు లేని ఒంటెత్తు పోకడలతో కూడిన మూర్ఖత్వం మూర్తీభవించిన అరాచక వాదమని ఇప్పుడు ప్రపంచమంతటా మేధావి వర్గం గుర్తిస్తున్నది'' అని ఆయన పాఠకుల దృష్టికి తెచ్చారు. చైనా, రష్యాలతో సహా ప్రపంచమంతటా వస్తున్న సైద్ధాంతిక పరిణామాలన్నింటిని విశ్లేషించి, ముక్తాయింపుగా ఆయన ''పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సంపూర్ణ సోషలిజం మాత్రమే'' అని నిర్ద్వందంగా ప్రకటించారు. బహుకాలంగా అణచివేతకు, అన్యాయాలకు గురైన దళిత, బహుజన, గిరిజన, శ్రామిక వర్గాలకు న్యాయం జరగడానికి రాజేశ్వరరావుగారు ఈ వ్యాసాలలో చేసిన ఇదమిద్ధమైన ప్రతిపాదనలు బహుశా రానున్న ఒకటి, రెండు తరాలకు సైతం ఆలోచనామృతాలుగా నిలుస్తాయి. ''సోవియట్ యూనియన్ అస్తమయం'' మార్క్సిస్టు, లెనినిస్టులందరిని ఆలోచింపచేసినట్లే రాజేశ్వరరావుగారి

మనసులోనూ మథనం కలిగించింది. ఆయన చేసిన అనేక ప్రతిపాదనలకు, పాఠకులతో పంచుకున్న ఆలోచనలకు బహుశా ఆ మథనమే గంగోత్రి కావచ్చు. "అంతర్జాతీయ అనుభవాల వెలుతురులో సమసమాజ సాధన" స్థూలంగా ఆయన సూచిస్తున్న మార్గం. ప్రపంచీకరణ, ద్రవ్యోల్బణం మొదలైన విషయాల గురించి వ్రాసినా చిన్నతరహా, మధ్యతరహా, కుటీరపరిశ్రమల ఆవశ్యకతను నొక్కి చెప్పినా, హస్తకళలనూ చిన్న చూపు చూడవద్దని హెచ్చరించినా అవన్నీ రాజేశ్వరరావు గారు కోరుతున్న సమసమాజ లక్ష్య సాధన దిశగానే ఉన్నాయి. "సోషలిజం ధ్యేయమైన రాజకీయపక్షాలన్నీ, శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించి మన దేశానికి అవసరమైన మార్గాన్ని నిర్ణయించుకోవలసిన అవసరం ఎంతగానో ఉన్నది" అని ఆయన చేస్తున్న ప్రతిపాదన అవశ్యం శిరోధార్యం.

ఈ వ్యాససంపుటిలో మిగతా వ్యాసాలన్నీ ఒక ఎత్తు. తెలంగాణ సాయుధ పోరాటానికి, తెలంగాణ ప్రజలు బహూకాలంగా కోరుతున్న ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తికి సంబంధించిన వ్యాసాలు మరొక ఎత్తు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వారిలో కొందరి అనుభవాలు, అభిప్రాయాలు గతంలో పుస్తకాలుగా వచ్చాయి. ఇప్పుడు ఈ వ్యాససంపుటిలో రచయిత మరెన్నో విశేషాలనందించారు. అంతేకాక, తెలంగాణ పోరాటం నేర్పిన పాఠాలను తేటమాటలలో తెలియజేశారు. అవి ఎవరికి ఆమోదయోగ్యమైనా ఎవరికి కాకపోయినా ఎవరైనా సరే ఆలోచించదగినవనడంలో సందేహం లేదు. మరీ ముఖ్యంగా 21వ శతాబ్దంలోనూ సాయుధపోరాటం సాగిస్తున్న వారిని దృష్టిలో పెట్టుకొని తనదైన కొన్ని అభిప్రాయాలను ఆయన వ్యక్తం చేసినట్లు తోస్తున్నది. సాయుధపోరాటం చేసిన కమ్యూనిస్టులపై నిజాం నవాబు చేసిన అకృత్యాలనే కాక హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయిన తరువాత కూడా ఉద్యమకారులపైన వారి సానుభూతిపరులైన ప్రజలపైన జరిగిన దౌర్జన్యాల గురించి సైతం రాజేశ్వరరావుగారు వ్రాశారు. సాయుధపోరాటాలు చేస్తున్నవారు ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కోవలసి వస్తుందో ఈ వర్ణనలు హెచ్చరికగా తెలియజేస్తాయి.

2008 సం॥ ద్వితీయార్థంలో ఈ గ్రంథం వెలువడుతున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడుతుందా, ఏర్పడితే ఎప్పుడు అనే ప్రశ్నలు 8 కోట్లమంది తెలుగు ప్రజల మనస్సులలో ఈ సమయాన మెదులుతున్నాయి. రాజేశ్వరరావుగారు తెలుగువారందరి శ్రేయస్సును కాంక్షిస్తున్న వ్యక్తి. ఇటీవలి సంవత్సరాల వరకు కమ్యూనిస్టు పార్టీలో ఉండి సమైక్య రాష్ట్రం కొనసాగాలని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కోరిన వ్యక్తి. ఈ వ్యాస సంపుటికి పీఠికను వ్రాస్తున్న రచయిత 1953-56 మధ్యకాలంలోనూ, అటు తర్వాత 1968 సం॥ వరకు ఆంధ్రప్రదేశ్ సమైక్యాన్ని కోరిన వ్యక్తి. కాని 1968-69 ఉద్యమం తరువాత ప్రత్యేక తెలంగాణ అనివార్యమనే నిర్ణయానికి రావడం జరిగింది. కాని మారిన పరిస్థితులు, ఇంకా మారుతున్న పరిస్థితులు రాజేశ్వరరావుగారిలోనూ ఇప్పుడు

చిన్న రాష్ట్రాల ఏర్పాటు వాంఛనీయమనే అభిప్రాయానికి రావడానికి కారణమైనాయి. అయితే ఇప్పుడు సైతం తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉన్నదనే వాదాన్ని ఆయన అంగీకరించడం లేదు. మూడున్నర దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో "సాధించలేకపోయిన ప్రాంతీయ అసమానతల తొలగింపు" మొదట ఎన్.టి.ఆర్. గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తరువాత ఎనిమిదిన్నర సంవత్సరాలు చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొంతవరకు సాధ్యమైనదని రాజేశ్వరరావుగారు గణాంకాల సహాయంతో విశ్లేషించి నిరూపించారు. "ప్రత్యేక తెలంగాణావాదులారా కళ్లు తెరవండి, వాస్తవాలు తెలుసుకోండి" అని కూడా కొద్ది కాలం క్రిందట పిలుపునిచ్చారు. ఇంతేకాక ఇప్పుడు కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలుగా మనం వ్యవహరించుకుంటున్న ప్రాంతం యావత్తూ ఒకప్పుడు తెలంగాణమేనని ఇంతకు ముందు శతాబ్దులలో నవాబులు ఇప్పుడు కోస్తా ఆంధ్రగా ఉన్న జిల్లాలను, రాయలసీమగా ఉన్న జిల్లాలను బ్రిటిష్ వారికి, ఫ్రెంచి వారికి ధారాదత్తం చేయడం వల్ల వాటికి సర్కారు జిల్లాలుగా, దత్తమండలంగా ముద్రపడిందని చారిత్రిక సత్యాలను ఆయన ఈ వ్యాసాలలో గుర్తు చేస్తున్నారు. తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని కాపాడుకోవల్సిన అవసరాన్నీ, తెలుగు ప్రజల మధ్య పరస్పర ప్రేమాభిమానాలనూ కోరుతున్న రాజేశ్వరరావుగారు ఇప్పుడు పరిపాలనా సౌలభ్యం కోసం, శీఘ్రతరంగా అభివృద్ధిని సాధించడం కోసం, రాష్ట్ర విభజన శ్రేయస్కరమని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేసుకుందామని అది అందరికీ మంచిదని అభిప్రాయపడుతున్నారు. "విశాలాంధ్ర భావోద్రేక పూరిత స్వతంత్రోద్యమ నినాదం - తెలంగాణ వెనుకబడిన ప్రాంత, సత్వర, సమతుల అభివృద్ధి అవసరం" అనే వ్యాసాన్ని 'దశాంశపత్రం'గా ఈ సంపుటిలో ప్రజల ముందుంచు తున్నారు. రాష్ట్ర విభజన జరిగితేనేమి తెలుగు ప్రజలందరి మధ్య సుహృద్భావం, ప్రేమాభిమానాలు ఉండాలని కోరే ప్రతి ఒక్కరు హర్షించవలసిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథం వ్యాససంకలనమైనప్పటికీ ఇందులో ఒక క్రమం ఉంది. ఆర్థిక, సాంఘిక, రాజకీయ, చారిత్రిక విశ్లేషణలున్నాయి. రాజేశ్వరరావుగారి ఆలోచనా స్రవంతికి అద్దం పట్టే గ్రంథమిది. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ గ్రంథం చెన్నమనేని రాజేశ్వరరావుగారి జీవితానుభవసారం.

**- పొత్తూరి వెంకటేశ్వరరావు**

# ఒక అనుభూతి

## (An Inspiration)

స్వాతంత్ర సమరయోధుల యుగం నిజంగా స్వర్ణయుగం. సామ్రాజ్యవాద పాలన, దేశీయ రాచరిక నికృష్ట పాలన క్రింద స్వేచ్ఛా స్వాతంత్రాలను కోల్పోయి బానిసలుగా, అర్ధ బానిసలుగా బ్రతుకు భారాన్ని ఈడ్చిన అశేష ప్రజాబాహుళ్యాన్ని తట్టి మేల్కొల్పి వారిలో ధైర్యసాహసాలను నింపి స్వతంత్రోద్యమంలోకి ఆకర్షించిన మహానుభావులు వీరు. స్వయంగా అనేక నిర్బంధాలను తట్టుకుంటూ దేశభక్తి జ్యోతి ఆరిపోకుండా సాహసంతో మున్ముందుకు సాగిన తరం వారిది. వారి జీవిత విశేషాలు, అనుభవ గాథలు తరతరాలకు వెలుగుబాటలు వేయగలిగినవి. మన దేశం స్వాతంత్రం సాధించిన తర్వాత సుమారు రెండు దశాబ్దాల వరకు స్వాతంత్ర సమరయోధుల రాజకీయ నాయకత్వం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజాస్వామ్య వ్యవస్థను సంపూర్ణంగా ప్రజాహితదిశలో నడిపించింది. రాజకీయాలు ప్రజాసామాన్యం యొక్క హృదయస్పందనల నుండి పుట్టి ప్రజాబాహుళ్యం యొక్క బహుముఖ అభ్యుదయాన్ని సాధించే ప్రక్రియగా కొనసాగింది. మంత్రులు, శాసనకర్తలు తమ తమ నడకను, జీవనశైలిని ఆదర్శవంతంగా నిర్వహించినారు. వారి బుద్ధిబలం, నైతిక విలువలు వారికి పెట్టని కోటగా నిలిచింది.

ఆ తర్వాత పై విలువలకు క్రమంగా క్షీణదశ ఆరంభమైనది. ముఖ్యంగా గత నాలుగు దశాబ్దాల కాలంలో ఈ విలువల పతనం కొండ మీది నుండి రాయి క్రిందికి దొర్లుతున్నట్లుగా అగుపడుచున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రధానంగా శతాబ్దాల వెనుకబాటుతనాన్ని తొలగిస్తూ దేశ ఆర్థిక, సామాజిక పునరుజ్జీవనానికి ఉపకరించే ప్రబలసాధనంగా కాక కొంత మంది ధనాఢ్య వర్గ ధనదాహానికి, పదవీ వ్యామోహానికి ఉపకరణంగా మారిపోతూ ఉండడం అత్యంత బాధాకర పరిణామము. దేశభక్తి, నీతి నిజాయితీ గల పౌరులు దిగ్భ్రాంతి చెందుతూ నిశ్చేష్టులుగా నుండి పోవడం కేవలం దురదృష్టకరం. ఈ తరుణంలో స్వాతంత్ర్య సమరయోధులు సృష్టించిన విలువలు, నడచిన నడకలు నవతరానికి, యువతరానికి అడుగుజాడలుగా నుండితీరుతాయి. సామాజిక, రాజకీయ విలువల పునరుద్ధరణ కొరకు దారిద్ర్యనిర్మూలన, ఆర్థిక పునరుజ్జీవన కొరకు ఉద్యమాల నిర్మాణానికి ప్రోత్సాహంగా నుంటాయి. మరో స్వతంత్ర పోరాటంగా కొనసాగుతాయి.

మా నాన్నగారైన చెన్నమనేని రాజేశ్వరరావు గారి జీవనయానం ఒక ప్రత్యక్ష సాక్ష్యం. 1942, 9వ ఆగస్టు తేదీన వీరనారి, కీ.శే. శ్రీమతి అరుణ ఆసఫ్ అలీ గారి పిలుపు మేరకు క్విట్ఇండియా ఉద్యమంలో 9వ తరగతి విద్యార్థిగా అడుగుపెట్టి, 1947, 15 ఆగస్టు నాటికి అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ నాయకుడిగా ఎదిగినారు. నైజాం నవాబు భారతదేశంలో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేయడానికి నిరాకరించటం వలన సంస్థాన వ్యాపితంగా విలీనోద్యమం విజృంభించింది. అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు ఈ విలీనోద్యమాన్ని అత్యంత సాహసోపేతంగా, విజయవంతంగా నిర్వహించినవి. ఈ మహోద్యమంలో అఖిల హైదరాబాద్ విద్యార్థి సంఘ ప్రధానకార్యదర్శిగా, యువనాయకుడిగా వేలాది త్యాగధనులలో ఒకరుగా విశిష్ఠపాత్రను పోషించినారు. ఆ తరువాత తెలంగాణ రైతాంగసాయుధ పోరాటంలో యువనాయకుడిగా శక్తివంచన లేకుండా కృషిచేశారు. సుమారు మూడు సం॥ల రహస్యజీవితం, ఒక సంవత్సర జైలు జీవితం తర్వాత 1952 నుండి ఈనాటి వరకు ఆదర్శవంతమైన రైతు నాయకుడిగా, ప్రజానాయకుడిగా, 6సార్లు శాసనసభ్యుడిగా తమ ప్రత్యేకతను సంపాదించుకున్నారు. 30 సం॥ల సుదీర్ఘకాలం ఒక ప్రతిపక్షపార్టీ నాయకుడిగా శాసనసభలో వారు చేసిన ప్రశంసనీయమైన ప్రసంగాలు ప్రజాబాహుళ్యంతో పాటు మేధావి వర్గాన్ని ఆకట్టుకున్నవి. అటువంటి ఉపన్యాసాల సంకలనాన్ని త్వరలోనే పుస్తకరూపంలో ప్రచురించాలని మా సంకల్పం. చాలా మంది స్వాతంత్ర సమరయోధులు స్వతంత్ర సాధన తర్వాత అనేక కారణాల ఫలితంగా రాజకీయ రంగం నుండి నిష్క్రమించినారు. అయినా వారి త్యాగాలు మరపురానివే. కొందరు మాత్రమే స్వాతంత్ర్యోద్యమం తర్వాత ఈనాటి వరకు ఉద్యమాల ఆటుపోట్లను తట్టుకుంటూ క్రియాశీల రాజకీయాలలో ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఆ కోవకు చెందిన వారిలో మన రాష్ట్రంలో మా నాన్నగారు ఒకరు కావడం మా కుటుంబానికి, బంధుమిత్ర వర్గానికి గర్వకారణం. వారు సందర్భోచితంగా రచించిన వ్యాసాలు అనేకం. అందులో నుండి కొన్ని వ్యాసాలను సంకలనం చేసి వారి 86వ జన్మదినోత్సవ సందర్భంగా ఒక పుస్తక రూపంలో ఆవిష్కరించాలని మా కుటుంబ నిర్ణయం. ఇందులోని ప్రతి వ్యాసం సందేశాత్మకమైనదని మా అభిప్రాయం. ''రాజకీయార్థిక వ్యాసావళి''గా మీ ముందుంచుతున్నాం. మీ మన్ననలను, ఆశీర్వచనాలను పొందుతామని మా విశ్వాసం.

భవదీయుడు

**డా॥ రమేష్ చెన్నమనేని**
ప్రొఫెసర్, హుంబోల్ట్ యూనివర్శిటి
బెర్లిన్-జర్మని

# విషయసూచిక


1. అమరజీవి భగత్‌సింగ్ సహచరులు, కీ॥శే॥ విజయ్ కుమార్ సిన్హా .................. 1
2. ఆణిముత్యం .................. 4
3. తెలంగాణ విముక్తి ఉద్యమ మహానేత - ఆర్.ఎన్. .................. 9
4. చంద్ర రాజేశ్వరరావు .................. 14
5. నూతన పథికుడు - పి.వి. .................. 21
6. పరిణత ప్రతిభ - పి.వి. .................. 25
7. ప్రజాబంధు - బద్దం .................. 34
8. మఖ్దూమ్ .................. 46
9. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య .................. 54
10. అభినవ సంస్కర్త - ఎన్.టి.ఆర్ .................. 57
11. కరుణామయి కమలాదేవి .................. 61
12. మడమ తిప్పని మరో స్వాతంత్ర సమర సేనాని .................. 66
13. సరిలేని దాసరి .................. 71
14. జువ్వాడి గౌతమరావు .................. 74
15. ప్రపంచీకరణ - పేదరిక నిర్మూలన .................. 79
16. మానవాభివృద్ధి .................. 84
17. దేశాభివృద్ధికి వ్యవసాయం అవశ్యకత - 1 .................. 87
18. దేశాభివృద్ధికి వ్యవసాయం అవశ్యకత - 2 .................. 94
19. చేతి వృత్తులు - కుటీర పరిశ్రమలు - రాజకీయ పరిష్కారం .................. 102
20. వ్యవసాయేతర రంగ ప్రాధాన్యత .................. 106
21. ఆహార భద్రత - వ్యవసాయ ఉత్పాదకత .................. 111
22. ఆందోళన కలిగిస్తున్న ఆహార అభద్రతా భావం .................. 116

23, "పంచవర్ష ప్రణాళిక" - మౌలికమైన మార్పులు అత్యవసరం .................. 122
24. ద్రవ్యోల్బణం .................................................. 128
25. ప్రజల సాధికారత - పరిపాలన వికేంద్రీకరణ .................................. 137
26. తెలంగాణా సాయుధపోరాటం .................................................. 141
27. హైదరాబాద్ సంస్థాన విమోచన సందేశం .................................. 166
28. ఆంధ్రప్రదేశ్ సమైక్యతను సంరక్షించలేని కాంగ్రెస్ .................................. 176
29. దశాంశపత్రం .................................................. 184
30. మార్క్సిజం నవజీవనం, పునరుజ్జీవనం పొందడం అవశ్యం .................. 192
31. సోవియట్ యూనియన్ అస్తమయం .................................................. 205
32. మారుతున్న సమాజం - మానవ సంబంధాలు .................................. 213
33. విన్నూత్న విద్యావిధానం విస్మరించరాని తక్షణ జాతీయ కర్తవ్యం .................. 221
34. భారతదేశ ప్రథమ స్వాతంత్ర సమరం (1857-58) సంస్మరణ .................. 226
35. నవ దార్శనికత ఆవశ్యం .................................................. 229
36. సృజనాత్మకత ఆర్య సమాజ ఆవశ్యకత .................................................. 235
37. రెండవ స్వతంత్ర పోరాటం అవసరం .................................................. 238
38. సత్యమేవ జయతే .................................................. 242
39. సమైక్య ఆంధ్రప్రదేశ్ సమతుల అభివృద్ధి .................................. 246
40. వెనకబాటుతనం - అభివృద్ధి ఒక విశ్లేషణ .................................. 253
41. మన ఉన్నత విద్యా విధానము .................................................. 257
42. తెలుగు నాట వ్యవసాయ రంగంలో నాలుగు దశాబ్ధాల పరిణామాలు ...... 263
43. వెనుకబాటుతనం - సహేతుక అవగాహన .................................. 270
44. గాలిలోని దీపం - చేనేత కార్మికులు .................................................. 278
45. గ్రామీణ అభివృద్ధి .................................................. 282
46. ఆర్థిక విశేషాలు .................................................. 289
47. అర్థరహిత సంస్కరణలు .................................................. 294